

# ముస్లిం ఐడెంటిటీ

## హిందూత్వ రాజకీయాలు

కె. బాలగోపాల్



# ముస్లిం ఐడెంటిటీ

## హిందూత్వ రాజకీయాలు

కె. బాలగోపాల్

# ముస్లిం ఐడెంటిటీ

# హిందుత్వ రాజకీయాలు

**మానవహక్కుల వేదిక ప్రచురణ**

Human Rights Forum Publication

ప్రచురణ సంఖ్య: 30

6 డిసెంబర్ 2013

కవర్: అక్బర్

బుక్ మేకింగ్: కె.వి.ఆర్.

ముద్రణ: నవ్య ప్రింటర్స్

వెల: రూ. 150/-

ప్రతులకు:

**ఎస్. జీవన్ కుమార్**

3-12-117/ఎ-2/బి, పి.ఎస్. కాలనీ,

గణేష్‌నగర్, రామంతపూర్,

హైదరాబాద్ - 500 013

ఫోన్: 040-27039519

**ప్రజాశక్తి, నవోదయ, దిశ బుక్ హౌస్‌లు**

మా వెబ్‌సైట్: www.humanrightsforum.org

బాలగోపాల్ రచనల కోసం: www.balagopal.org



“ వివక్షకు, నిర్లక్ష్యానికి గురవుతున్న మైనారిటీగా ముస్లింలు వ్యక్తం చేసే ఆందోళనను మైనారిటీ హక్కుల కోణం నుండి చూసి సమర్థించాలనడం సబబే. కానీ ఆ నిరసనలో వ్యక్తమయ్యే ఆలోచనలలోని విలువలు సమాజ సాంస్కృతిక సంపదను పెంపొందించగలవని అర్థం చేసుకున్నప్పుడే, ఆ నిరసన తన అవసరాలను తీర్చుకుంటూనే ఇతర పురోగామి ప్రయోజనాలలో ఏ విధంగా భాగం కాగలదో అర్థం అవుతుంది. అప్పుడది ‘వాళ్ల’ అవసరం – సమంజసమైన అవసరం – మాత్రమే కాదనీ, ఒక రకంగా అందరి అవసరం కూడాననీ అర్థం అవుతుంది. నిత్యం శంకించబడే వ్యక్తులకు అర్థమయినంతగా ‘ఆత్మగౌరవం’ అనే భావన ఇతరులకు అర్థం కాగలదా? వాళ్లు నేర్పించినంత గట్టిగా ఆ విలువను వేరెవరు నేర్పించగలరు. ఆత్మగౌరవం అనే భావన సామాజిక సంస్కృతిలో నిండుగా ఎదగకుండా మనమంతా కోరుకునే కొత్త సమాజం సాధ్యమవుతుందా? తన సంస్కృతినీ అలవాట్లనూ ఆచారాలనూ సార్వజనీనమైన సత్యంగా భావిస్తూ ‘బోరవిరుచుకొని’ తిరిగే మెజారిటీ మధ్య ఒక మైనారిటీగా బ్రతికే వాళ్లకు అర్థమయినంతగా భిన్నత్వం, వైవిధ్యాల విలువలు ఇతరులకు అర్థమవుతాయా? భిన్నత్వాన్ని, వైవిధ్యాన్ని కేవలం సహించడమే కాక ఆహ్వానించడం మనమందరం నేర్చుకోకపోతే మనం ఊహించుకునే కొత్త సమాజం సంపూర్ణం అవుతుందా? ”

– బాలగోపాల్

# మా మాట

**ము**స్లింల గురించి బాలగోపాల్‌గారు వివిధ సందర్భాలలో రాసిన వ్యాసాల సంకలనం ఇది. వీటిని ముస్లిం ఐడెంటిటీ, ముస్లిం రిజర్వేషన్లు, ముస్లింలు – సంఘ్‌పరివార్, రిపోర్టులు అని నాలుగు భాగాలుగా విభజించి ప్రచురించాం.

ముంబాయి అల్లర్లపై, గుజరాత్ మారణకాండపై ఆయన రాసిన 'శివమెత్తిన సేన', 'గాంధి గుజరాత్‌లో గాడ్సే రాజ్యం' రిపోర్టులను కూడా ఇందులో చేర్చడం వల్ల ఇది ఇంత పెద్ద పుస్తకం అయింది. అయితే అవి మనం ఎన్నటికీ మరవకూడని, ఎప్పటికీ ఎక్కడా పునరావృతం కాకుండా చూడాల్సిన రెండు దారుణ మారణకాండలు కనుక, ఇవాల్టికీ దేశ రాజకీయాలలో ఆ ఘటనలకున్న ప్రాముఖ్యం రీత్యా కొంచెం పెద్దవే అయినా వాటిని ఇందులో చేర్చాం. ఈ రిపోర్టులలో ఆయన సమాచారం మాత్రమే ఇవ్వలేదు; వాటి పూర్వాపరాలను, వివిధ ప్రభుత్వ శాఖల వైఫల్యాన్ని, హిందూత్వ రాజకీయాల వల్ల దేశ భవిష్యత్తుకు ఏర్పడనున్న ప్రమాదాన్ని, ప్రజలకు కలుగుతున్న నష్టాన్ని వివరించి మనలను ముందుగానే అప్రమత్తం చేశారు. ఆయన హెచ్చరికలు ఎంత సహేతుకమైనవో వర్తమాన చరిత్రలో చూస్తున్నాం.

భారతీయ ముస్లింల ఆత్మగౌరవాన్ని భారత దేశస్తులుగాను, ముస్లింలుగాను కూడా నిలబెట్టే కృషి ఈ వ్యాసాలలో చాలా ఉంది. కులం కారణంగా కరడుగట్టిన హైందవ సామాజిక వ్యవస్థను ప్రజాస్వామీకరించడానికి ఇస్లాం ఎలా తోడ్పడిందో, ముస్లిం సంస్కృతి నుంచి ఏమేం తీసుకుని భారతీయ సంస్కృతి సుసంపన్నం అయిందో, అవన్నీ ఇవాళ భారతీయులందరికీ కూడా ఎలా గర్వకారణంగా ఉన్నాయో గుర్తు చేశారాయన.

ఇంకా ఇందులో –

ముస్లింల సామాజిక స్థితిగతుల గురించి సమగ్ర వివరణ ఉంది. ముస్లింలు ముస్లింలుగా సంఘటితం కావడం తిరోగమనం కాదని ఇచ్చిన భరోసా ఉంది. నవాబు ముస్లింలను చూపి గరీబు ముస్లింలకు సంక్షేమం నిరాకరించడం పట్ల విమర్శ ఉంది. ముస్లిం రిజర్వేషన్లకు సంపూర్ణ మద్దతు ఉంది.

66 ఏళ్ళ స్వాతంత్ర్యానంతరం కూడా ముస్లింలను మైనారిటీగా, పరాయి దేశస్తులుగా, పరాయి మతస్తులుగా, వోటు బ్యాంకులుగా, బుజ్జగింపు రాజకీయాల

లబ్దిదారులుగా, మతఛాందసవాదులుగా, మతోన్మాదులుగా, దేశభక్తిరహితులుగా, దేశద్రోహులుగా, విభజనవాదులుగా, తీవ్రవాదులుగా, జిహాదీలుగా, టెర్రరిస్టులుగా ముద్రలు వేసి ఏదో ఒక రూపంలో వారిని ప్రధాన స్రవంతికి దూరంగా, మెజారిటీ మతస్తుల ద్వేషానికి లక్ష్యంగా ఉంచడంపై తీవ్ర ఆగ్రహం ఉంది. ముస్లింలను నిరంతరం ఒక అభద్రతలో ఉంచుతున్న సంఘ్‌పరివార్ ఆలోచనల పట్ల, వారి రాజకీయాల పట్ల తీవ్ర అభిశంసన ఉంది. తెలిసో తెలియకో ప్రజలు వారి దారిలో నడిచి ఈ దేశ లౌకికవాదానికి, సమగ్రతకు తీసుకురాగల ముప్పు గురించి ఆందోళన ఉంది. పోలీసు, న్యాయ తదితర వ్యవస్థలు తమ మతపక్షపాతంతో రెండు మతాల మధ్య సృష్టించగల శాశ్వత అగాధం గురించి భయం ఉంది.

అందుకే దీనికి 'ముస్లిం ఐడెంటిటీ – హిందూత్వ రాజకీయాలు' అని పేరు పెట్టాం. 'ముస్లింలు – సంఘ్ పరివార్' అధ్యాయంలో రాదగిన అనేక వ్యాసాలు ఇంకా ఉన్నా అవి 'మతతత్వంపై బాలగోపాల్' (హెచ్‌బిటి ప్రచురణ) పుస్తకంలో వచ్చినందువల్ల ఇందులో చేర్చలేదు. ఈ పుస్తకం ముస్లింలకు ఎంత ఉపయోగకరమో అంతకంటే ఎక్కువగా హిందువులకు ఉపయోగకరమవుతుందని భావిస్తున్నాం. ఎందుకంటే ఇది చదివితే ముస్లింలపై ద్వేషాన్ని ఎంత నిరాధరంగా రెచ్చగొడుతున్నారో అర్థమవుతుంది కనక.

చివరగా బాలగోపాల్ మాటల్లోనే ముగిస్తాం.

"హిందూమతోన్మాద ఫాసిజం ఇన్నాళ్లూ కేవలం ఒక సిద్ధాంత భావన కావచ్చు. ఈ రోజు అదొక సామాజిక వాస్తవం. దక్షిణ భారతదేశంలో అది ఇప్పటికి బలహీనంగా ఉంది కాబట్టి, అది బలంగా ఉన్న ప్రాంతాలలో దాని అభీష్టానికి అడ్డం ఉన్నవారు ఎటువంటి భయాందోళనలకు గురవుతున్నారో మనకు అర్థం కావడం కష్టం కావచ్చు. కానీ అర్థం చేసుకోవడం అవసరం. ఈనాడు దేశంలో ఉన్న ముఖ్యమైన మానవహక్కుల సమస్యలలో ఇదొకటి. ఇది కేవలం మైనారిటీ మతస్తులకు మాత్రమే ప్రమాదకారి కాదు. అన్నిరకాల ప్రజాతంత్ర విలువలకూ ప్రజాస్వామ్యానికీ ప్రమాదకారి."

మానవహక్కుల వేదిక

30.11.2013

# ఇదీ వరస

## ముస్లిం ఐడెంటిటీ


'ముస్లిం ఐడెంటిటీ': అభ్యుదయ రాజకీయాలు . . . . . . . . . . . . . . .11

ముస్లింలు ముస్లింలుగా సంఘటితం కావాలి . . . . . . . . . . . . . . .24

దేశ స్వాతంత్ర్య ఉద్యమం – ముస్లింలు . . . . . . . . . . . . . . . . . . .31

'ఉమ్మడి పౌరస్మృతి' కాదు...
ముస్లిం సమాజంలో సంస్కరణలను ఆహ్వానిద్దాం . . . . . . . . . . . . . .48

నిజమైన నష్టం ముస్లింలకే . . . . . . . . . . . . . . . . . . . . . . . .52

'ఎంఐఎం'పై విశ్లేషణ జరగాలి! . . . . . . . . . . . . . . . . . . . . . .56

సచార్ చెప్పిన సత్యాలు . . . . . . . . . . . . . . . . . . . . . . . . . .61

చరిత్ర పాఠాలపై కాషాయం నీడ . . . . . . . . . . . . . . . . . . . . . .95


## ముస్లిం రిజర్వేషన్లు


ముస్లింలకు రిజర్వేషన్లు సబబే . . . . . . . . . . . . . . . . . . . . . .103

ముస్లింలు, బిసిలు, రిజర్వేషన్లు . . . . . . . . . . . . . . . . . . . . .108

ముస్లిం రిజర్వేషన్‌ను అడ్డుకోవడమంటే
సామాజిక న్యాయాన్ని బలహీనపర్చడమే . . . . . . . . . . . . . . . . .113

తిరిగి తిరిగొచ్చిన ముస్లిం రిజర్వేషన్లు ఈసారైనా నిలిచేనా . . . . . . . .119

## ముస్లింలు - సంఘ్‌పరివార్

హిందూ మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడుదాం! . . . . . . . . . . .127

ఒకరి దేశభక్తి ఒకరికి ప్రాణసంకటం . . . . . . . . . . . . . . . . . . .140

బలవంతపు మౌనం . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . .143

హిందూత్వవాదుల ద్వేషం ఎవరి మీద? . . . . . . . . . . . . . . . . . . .148

ఏది పాకిస్తాన్ కుట్ర? . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . .153

ఇంకెక్కడా మరో గుజరాత్ కాకుండ
చూడడం ప్రజాతంత్ర ఉద్యమాల కర్తవ్యం . . . . . . . . . . . . . . . . .156

సకాలంలో నోరు విప్పుదాం . . . . . . . . . . . . . . . . . . . . . . . .161

ప్రజాస్వామ్యానికి నిజమైన సవాలు . . . . . . . . . . . . . . . . . . . .164

ఇది మన వైఫల్యమే, పోలీసుల వైఫల్యం కాదు . . . . . . . . . . . . . . .167

పేలుళ్లపై దర్యాప్తు ప్రహసనం! . . . . . . . . . . . . . . . . . . . . . . .171

ఎన్నాళ్లీ సంకుచితత్వం . . . . . . . . . . . . . . . . . . . . . . . . . .177

హైదరాబాద్ పేలుళ్లు:
కారకులు తెలియదు కాని అరెస్టులకు లోటులేదు . . . . . . . . . . . .182

## రిపోర్టులు

సంఘ్‌పరివార్ ఫాసిజాన్ని ఎన్నాళ్లు సహిద్దాం? . . . . . . . . . . . . .195

శివమెత్తిన సేన . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . .199

ఇంకొక 'గుజరాత్' ఎక్కడా జరగనివ్వొద్దు . . . . . . . . . . . . . . . .245

గాంధీ గుజరాత్‌లో గాడ్సే రాజ్యం . . . . . . . . . . . . . . . . . . . . .248

# ముస్లిం ఐడెంటిటీ

# 'ముస్లిం ఐడెంటిటీ' అభ్యుదయ రాజకీయాలు



ముస్లింలు తమను తాము ముస్లింలుగా భావించుకునే రాజకీయ స్పందనకు భారతదేశంలో తావు ఉందా?

భావించుకోవడం జరుగుతున్నది, భావించుకొని స్పందించడమూ జరుగుతున్నది. ముఖ్యంగా, బాబ్రీమసీదు కూల్చివేత తరువాత.

దానిని ఏ విధంగా స్వీకరించాలన్నదే సమస్య. దానిని అభ్యుదయవాదులు అర్థవంతమైన రాజకీయ భావనగా స్వీకరించాలా (విమర్శనాత్మకంగానయినా సరే) లేక వాస్తవిక పునాది లేని తప్పుడు అవగాహన అని తిరస్కరించాలా లేక మతోన్మాదానికి బీజం వేయగల పెడదృష్టి అని నిందించాలా?

ఒక మైనారిటీగా ముస్లింలు ఎదుర్కుంటున్న వివక్షనూ సాంస్కృతిక అణచివేతనూ భౌతిక దాడులనూ అర్థం చేసుకోలేని అభ్యుదయవాదులెవరూ ఉండరు. దాని నుండి పుట్టే నిరసనను అందరూ తప్పక ఆహ్వానిస్తారు. అంతవరకు అభిప్రాయ భేదాలుండవు. కానీ ఈ నిరసన ఒక నెగటివ్ భావన మాత్రమే. అది ఇచ్చే 'ఐడెంటిటీ' ఒక నెగటివ్ ఐడెంటిటీ మాత్రమే. 'మేము వివక్షకు గురి అవుతున్న మైనారిటీ' అనే భావన మాత్రమే. 'మేము' అనే సంపూర్ణమైన భావన కాదు.

మరి ఆ సంపూర్ణ భావనకు ఏ విధంగా స్పందించాలి? అది ఉనికిలో ఉంది. కేవలం మైనారిటీ భావనకు దానిని పరిమితం కమ్మంటే అది కాదు. మరయితే

ఏం చేయాలి? ముస్లింలు ముస్లింలుగా స్పందించే రాజకీయ చైతన్యాన్ని అభ్యుదయవాదులు ఆమోదించడం, ఆహ్వానించడం సాధ్యమా అసాధ్యమా? అది మతోన్మాదరూపం తీసుకుంటే అసాధ్యమే. సంప్రదాయాన్ని చెక్కు చెదరకుండా కాపాడాలని భావించే ఛాందసవాద రూపం తీసుకుంటేనూ అసాధ్యమే. కానీ మతోన్మాదాన్ని తిరస్కరిస్తూ, సంస్కరణలను ఆహ్వానిస్తూ అదే సమయంలో 'ముస్లిం రాజకీయం'గానే ఉండేది ఆహ్వానించదగినదేనా? మతాతీతమైనది మాత్రమే ఆమోదనీయమా?

ఈ ప్రశ్నకు జవాబు చెప్పేముందు 'ఐడెంటిటీ' అనే దానికి మానవ అస్తిత్వంలో ఉండే పాత్రను గుర్తించడం అవసరం. ఐడెంటిటీని ఎవరో తెలుగులోకి 'గుర్తింపు' అని అనువాదం చేసారు. అది అసంతృప్తికరమైన అనువాదం. కానీ ఇప్పుడు 'గుర్తింపు రాజకీయాలు' అనే ప్రయోగం కూడ అలవాటయిపోయింది. కులం, మతం, భాష, జాతి, ప్రాంతం, లింగం మొదలయిన సాంఘిక వర్గీకరణల ప్రాతిపదికన జరిగే రాజకీయ కృషిని ఈ పేరుతో పిలుస్తున్నారు. మనుషులను అమూర్తమైన 'పౌరులు'గా భావించే లిబరల్ బూర్జువా రాజకీయ దృక్పథానికీ మనుషులను వర్గాలుగా విభజించే మార్క్సిస్ట్ రాజకీయ దృక్పథానికీ ఈ 'గుర్తింపు రాజకీయం' భిన్నమైనదని చెప్పడం దాని ఉద్దేశ్యం. పై రెండు దృక్పథాలలోనూ మనుషులు ('పౌరులుగా'నయినా, 'వర్గం'గానయినా) తమ అవసరాల ప్రాతిపదికన హేతుబద్ధమైన వివేచనతో ప్రవర్తిస్తారనీ, గుర్తింపు రాజకీయాలు అందుకు భిన్నమైనవనీ ఇక్కడ అర్థం. ఇది సరయిన విశ్లేషణేనా అన్న ప్రశ్న అటుంచి, 'గుర్తింపు రాజకీయాలు' అన్న పేరులో ఈ భావం స్ఫురించదు.

దానికన్నా ముందు మానవ అస్తిత్వంలో ఈ 'ఐడెంటిటీ' అనే దానికి ఉండే స్థానాన్ని పరిశీలిద్దాం. ఏ విషయాన్ని గురించి ఆలోచించేటప్పుడయినా దాని సామాజిక పార్శ్వాన్ని, అంటే సామాజిక ఆర్థిక పునాదిని లేక ప్రాతిపదికను లేక ప్రాముఖ్యాన్ని అర్థం చేసుకోవడం రాడికల్ రాజకీయ సిద్ధాంతాలు నేర్పాయి. కానీ దానితోపాటు ఆ విషయానికుండే మానవ పార్శ్వాన్ని – మనిషి ఉనికిలో దానికుండే పాత్రనూ ప్రాముఖ్యాన్నీ – కూడ అర్థం చేసుకోవడం అవసరం. అప్పుడే మన అవగాహన సంపూర్ణం అవుతుంది. 'ఐడెంటిటీ'ల సాంఘిక ఆర్థిక పార్శ్వాన్ని (కులం, మతం, వర్గం, లింగం, ప్రాంతం, భాష వగైరాల ప్రాతిపదికన ఏర్పడే 'నేను', 'మేము' అనే భావనలను) రాజకీయంగా అర్థం చేసుకోవడం, విమర్శించడం నేర్చుకుంటున్నాం. రాజకీయ ఐడెంటిటీలను శాస్త్రీయం, వాస్తవికం, అశాస్త్రీయం, భ్రమాజనితం, తప్పుడు చైతన్యం అని వర్గీకరిస్తున్నాం.

ఆ పని చేసే ముందు ఐడెంటిటీల మానవ పార్శ్వాన్ని కూడ అర్థం చేసుకోవడం అవసరం. 'రాడికల్‌గా ఆలోచించడం అంటే విషయాల మూలాలలోకి పోవడం. మనిషికి సంబంధించినంతవరకు అన్ని విషయాల మూలం మనిషే' నని మార్క్స్ తన తొట్టతొలి రచనలలో ఒక చోట అంటాడు. విలువైన ఈ సూచనను ఆ తరువాతి కాలంలో ఆయనే ఎల్లప్పుడూ జ్ఞాపకం పెట్టుకోలేదు. కానీ దానిని జ్ఞాపకం పెట్టుకోవడం అవసరం.

ఇతర జంతువులకూ మనిషికీ ఉండే ఒక ముఖ్యమైన తేడా ఏమిటంటే ఇతర జంతువుల వ్యక్తిత్వం చాలావరకు పుట్టుకతోనే నిర్ణయించబడుతుంది. దాని 'జీన్స్' చేత నిర్ణయించబడుతుంది. మనిషి అట్లా కాదు. మనిషిలో పుట్టుకతో – అంటే జీన్స్ ద్వారా – నిర్ణయించబడే అంశం కొంచెమే. ఆ పైన నేర్చుకోవడం, తనను తాను రూపొందించుకోవడం, తన పరిసరాలను తాను రూపొందించడం, ఆ క్రమంలో పరిసరాల చేత తాను రూపొందించబడడం జరుగుతుంది. ఈ విధంగా ఎదిగే క్రమంలో మనిషి వ్యక్తిత్వం (పర్సనాలిటీ) ఏర్పడుతుంది. ప్రవర్తనను నిర్ణయించడంలో ఇతర జంతువులలో 'జీన్స్' నిర్వహించే పాత్రను మనిషిలో వ్యక్తిత్వం నిర్వహిస్తుంది.

ఈ వ్యక్తిత్వానికి కేంద్రం 'నేను' అనే వ్యక్తి భావన (ఇంగ్లీషులో సెల్ఫ్ లేక ఐడెంటిటీ). ప్రతీ మనిషిలోనూ వ్యక్తావ్యక్తమైన ఐడెంటిటీ ఉంటుంది. దీనిలో కొన్ని పూర్తిగా వ్యక్తిగతమైన భావనలుంటాయి. 'నేను క్రమశిక్షణ గల మనిషిని', 'నాది దయార్ద్ర హృదయం' మొదలైన భావనలు. అవే కాక, వివిధ సాంఘిక సమూహాలలో భాగంగా తనను తాను గుర్తించుకోవడం కూడా 'నేను' అనే ఐడెంటిటీ ఏర్పడే క్రమంలో భాగమే.

ప్రపంచాన్ని నా వాళ్లు, పరాయివాళ్ళు అని విభజించుకొని తనవారిగా తాను భావించిన వారితో మమేకం కావడం మనిషికి ఉన్న అత్యంత స్వాభావికమైన లక్షణాలలో ఒకటి. ఐడెంటిటీ అనే వ్యక్తి భావన ఏర్పడే క్రమంలో దీనికి ముఖ్యస్థానం ఉంటుంది. మనుషులకు ఒకేసారి పలు సాంఘిక ఐడెంటిటీలు ఉండగలవు. ప్రాంతం, భాష, కులం, మతం మొదలయినవేవయినా దీనికి ప్రాతిపదిక కాగలవు. ఇవికాక, పైన చెప్పినట్టు, వ్యక్తిగతమైన ఐడెంటిటీ భావనలు కూడా ఉంటాయి. వీటన్నిటి సమాహారమే 'నేను' అనే వ్యక్తి. ఈ 'నేను' అనే వ్యక్తి భావనకు స్థిరత్వం ఉండదనీ, అది చంచలం అనీ భావించే 'పోస్టు మోడరన్' దృక్పథంతో ఏకీభవించనవసరం లేదు. అయితే అందులో వివిధ

అంశాలుంటాయనేది సత్యం. వాటి ప్రాధాన్యతలు పరిస్థితులను బట్టి మారగలవనేది కూడ సత్యం. ఒక వ్యక్తి కార్మికుల మధ్య కార్మికునిగా, ముస్లింల మధ్య ముస్లింగా, మగవాళ్ల మధ్య మగవాడిగా ఉండటం సాధ్యమే. అన్ని సందర్భాలలోనూ ఏదో ఒక అంశమే ప్రబలంగా ఉండేవాళ్ళు కొద్దిమందే ఉంటారు. అయినప్పటికీ 'నేను' అనే వ్యక్తి భావన నిర్దిష్టతలేని అస్థిర భావన కానవసరం లేదు. వైవిధ్యంలోనే దానికి (సాపేక్ష) స్థిరత్వం ఉండగలదు. ఉంటుంది.

ఇదంతా మనిషికి స్వాభావికం అంటే అర్థం విమర్శకు అతీతం అని కాదు. మనిషికి ఉండే వ్యక్తి భావనలో ఆధిపత్య స్వభావం కలిగినవి కొన్ని ఉంటాయి. వాటిని అభ్యుదయవాదులు విమర్శించడమే కాక తిరస్కరించాలి కూడా. ఉదాహరణకు తానొక ఆధిపత్య వర్గానికి లేక కులానికి చెందిన వ్యక్తినన్న భావన. లేదా 'నేను అందరినీ దాసోహం చేసుకోగలను' అనే వ్యక్తిగత ఆధిపత్య భావన. కానీ ఆధిపత్య స్వభావం నుండి పుట్టినవి కాని 'ఐడెంటిటీల' పట్ల ఏ వైఖరి ఉండాలి? అవన్నీ అణచివేత నుండి పుట్టినవే కానవసరం లేదు. ఒకవేళ అయినా అన్ని అణచివేత రూపాల స్వభావమూ ఒకటి కాదు. ఈ (సాంఘిక) ఐడెంటిటీలు రాజకీయ ఆచరణకూ సాంఘిక సమీకరణకూ ప్రాతిపదిక కాగలవు. వాటిపట్ల ఏ వైఖరి ఉండడం ఉచితంగా ఉంటుంది?

ఇప్పటికి మూడు వైఖరులు ఉనికిలో ఉన్నాయి. మరీ సంప్రదాయక మార్క్సిస్టులు 'వర్గం' ఒక్కటే శాస్త్రీయమైన వ్యక్తి భావన అనీ, తక్కినవన్నీ తప్పుడు చైతన్యం నుండి పుట్టినవనీ, ప్రజలు వాటిని వదులుకొని వర్గ చైతన్యం పొందాలనీ అంటుంటారు. ఐడెంటిటీని వ్యక్తిత్వం ఎదిగే క్రమంలో రూపొందే 'నేను' అనే స్వీయభావనకు సంబంధించిన విషయంగా కాక, కేవలం చైతన్యానికి (ఆలోచనలకూ అవగాహనకు) సంబంధించిన విషయంగా అర్థం చేసుకోవడం వల్లనే దానిని 'శాస్త్రీయం', 'అశాస్త్రీయం' అనీ, 'సరయిన చైతన్యం', 'తప్పుడు చైతన్యం' అనీ వర్గీకరించడం; అశాస్త్రీయమైన తప్పుడు ఆలోచనలను వదులుకొమ్మనడం సాధ్యం అవుతున్నది. ఇక్కడ మళ్ళీ నా ఉద్దేశ్యం ఐడెంటిటీలు విమర్శకు అతీతం అని కాదు. కానీ అది పదార్థ జ్ఞానానికి సంబంధించిన తప్పొప్పుల విమర్శ కాజాలదు. ఆ ఐడెంటిటీలో వ్యక్తమయ్యే విలువలకు సంబంధించిన తప్పొప్పుల విమర్శ (మాత్రమే) కాగలదు.

రెండవ వైఖరి ఏమిటంటే, వర్గేతర పీడిత భావనలన్నీ వర్గభావనలో భాగం కావాలి (లేక దానికి లోబడి ఉండాలి, లేక దానిలో మిళితం కావాలి) అని

చెప్పడం. ఇది ఈ రోజు కమ్యూనిస్టులు ఎక్కువగా అనుసరిస్తున్న వైఖరి. కానీ స్వభావరీత్యా 'వర్గం' కంటే చాలా భిన్నమైన ఐడెంటిటీలు వర్గ భావనలో 'భాగం' కావడం, లేదా దానికి లోబడి నడవడం ఏ విధంగా సాధ్యం కాగలదు? తన నాయకత్వంలోనే అందరి సమస్యలూ పరిష్కారం అవుతాయనీ, అన్ని న్యాయమైన ఆకాంక్షలూ తీరుతాయనీ కార్మికవర్గం సకల పీడిత ప్రజాశ్రేణులను నమ్మించి వారి విశ్వాసం పొందాలని గ్రాంసీ అన్నాడు. ఆయన ప్రధానంగా రైతాంగాన్ని ఉద్దేశించి ఈ మాట అన్నాడు గానీ దానిని అన్ని రకాల పీడనకూ అన్వయించుకోవచ్చును. వర్గేతర పీడిత భావనలను తప్పుదోవ పట్టిన చైతన్యం అని తిరస్కరించే వైఖరి కంటే ఇది మెరుగయినదే. కానీ కార్మిక వర్గం ఇతర పీడిత ప్రజలలో ఈ విశ్వాసం కలిగించగలదని నమ్మడానికి హేతుబద్ధమైన కారణం ఏమైనా ఉందా? మెజారిటీగా మగవాళ్ళయిన పారిశ్రామిక కార్మిక వర్గం నాయకత్వంలో లైంగిక అణచివేత తొలగిపోతుందని స్త్రీలు ఎందుకు నమ్మాలి? నిజానికి పారిశ్రామిక కార్మికవర్గం మెజారిటీగా మగవాళ్ళయి ఉండడానికి లైంగిక అణచివేత ఒక ముఖ్యకారణం. అటువంటప్పుడు, ఆ కారణంగా 'మగ' స్వభావం సంతరించుకున్న కార్మిక వర్గం నాయకత్వంలో స్త్రీల సమస్యలు పరిష్కారమవుతాయని స్త్రీలెందుకు నమ్మాలి? అటువంటి ప్రశ్నలే దళితులూ ఆదివాసులూ కూడా కార్మిక వర్గం గురించి అడగవచ్చు.

పారిశ్రామిక కార్మికులు మెజారిటీగా మగవాళ్లా, దళితేతరులా అన్న ప్రశ్న అటుంచి, అసలు స్వభావ రీత్యానే చాలా భిన్నమైన అసమానతలన్నీ ఏదో ఒక్క జీవిత అనుభవం నుండి పుట్టిన చైతన్యం ద్వారా, అది ముందుకు తెచ్చే ఆలోచనల ద్వారా తొలగిపోగలవని నమ్మడానికి హేతుబద్ధమైన కారణం ఏముంది? కార్మిక వర్గానిది (తత్పూర్వకాలపు విప్లవ వర్గాల లాగా) ఒక ప్రత్యేకమైన లక్ష్యం కాదనీ, దాని లక్ష్యమే సార్వజనీనమనీ మార్క్స్ భావించాడు. (ఒక్కొక్కసారి కార్మిక వర్గమే ఒక సార్వజనీన వర్గం – యూనివర్సల్ క్లాస్ – అంటాడు). కార్మిక వర్గం తాను ఎదుర్కొంటున్న శ్రమదోపిడీకి పరిష్కారంగా ముందుకు తెచ్చే వర్గరహిత ఉత్పత్తి వ్యవస్థలోనే అన్ని న్యాయమైన ఆకాంక్షలు సాధ్యమవుతాయని దీనిని వివరించుకోవచ్చు. కానీ వర్గరహిత ఉత్పత్తి వ్యవస్థ అభిలషణీయమని అంగీకరిస్తూ కూడా అది అన్ని సమస్యల పరిష్కారానికి పునాది అన్న భావనను ప్రశ్నించవచ్చు. ఆర్థికేతర అణచివేతలకు గురి అవుతున్నవారంతా దీనినే ప్రశ్నిస్తున్నారు. బోల్షెవిక్ ఆచరణ పుణ్యాన కార్మిక వర్గం అన్న మాటకు అసలు అర్థంపోయి కమ్యూనిస్టు పార్టీయే కార్మికవర్గం అన్న అర్థం వచ్చిన తరువాత ఈ సంశయం మరింత

బలపడింది. దానికి సంతృప్తికరమైన జవాబు ఇవ్వకుండా వర్గ ఐడెంటిటీలో ఇతర ఐడెంటిటీలు మిళితం కావాలనడంలో అర్థం లేదు.

ఇప్పుడివి రెండూ కాక మూడవ వైఖరి కూడా ముందుకొచ్చింది. ఐడెండిటీల ప్రాధాన్యతల జోలికి పోకుండ, ఏదో ఒకటే అన్నింటికంటే శాస్త్రీయమైనది అనకుండా, సకల పీడిత ప్రజలు (దళితులు, కార్మికులు, స్త్రీలు, ఆదివాసులు, మైనారిటీలు వగైరా) ఒక్కటై అందరికీ శత్రువైన 'వ్యవస్థ'ను కూలదోయాలనీ లేదా మార్చుకోవాలనీ ఈ వాదన పిలుపునిస్తుంది. ఇప్పుడు చాలామంది అభ్యుదయవాదులు (కొంతమంది మార్క్సిస్టులు కూడ) ఈ విధంగానే వాదిస్తున్నారు. పీడిత ప్రజా పోరాటాల మధ్య పరస్పర సంఘీభావం, సహాయ సహకారాలు, సమన్వయం ఎంత సాధ్యమైతే అంత సంపాదించవలసిందేగానీ అన్నీ 'ఒక్కటి' ఎట్లా కాగలవు, అన్నీ 'ఒక్కటి' అయి ఎవరిపైన పోరాటం చేయగలవు? అందరి శత్రువూ ఒకరు కాదు కదా? స్త్రీలనూ ఆదివాసులనూ పారిశ్రామిక కార్మికులనూ ఒక్కటి చేయగల ప్రాతిపదిక ఏముంటుంది? అందరి ఆకాంక్షలలోనూ సమానత్వం అనే విలువ ఉంటుంది కాబట్టి విలువల సారూప్యత ప్రాతిపదికన సంఘీభావం సాధ్యం అవుతుంది కానీ తమ సమస్యలు వేరువేరయినప్పుడు, తాము పోరాడే శత్రువులు వేరువేరయినప్పుడు, ఈ ప్రజలంతా 'కలిసి' ఎవరిపైన పోరాటం చేయగలరు? ఈ పోరాటాలకు నైతిక ఐక్యతేగానీ భౌతిక ఐక్యత సాధ్యం అవుతుందా?

ఎవరి సమస్యలేవయినా అన్నింటికీ మూలం రాజ్యంలో ఉంది కాబట్టి (లేదా అన్ని ఆధిపత్యాలకూ దన్ను రాజ్యం నుండి లభిస్తుంది కాబట్టి) అందరూ ఒక్కటై రాజ్యంపైన పోరాటం చేయాలని దీనికి సమాధానం చెప్తారు. కానీ నిజానికి రాజ్యంతో అన్ని పీడిత ప్రజాశ్రేణులకు ఒకే రకమైన శత్రుత్వం ఉండదు. రాజ్యంతో తలపడడం అన్ని పోరాటాలకూ ఒకే రకమైన అవసరం కాదు. ఒకే సందర్భంలో అవసరం కాదు. రాజ్యం సార్వభౌమత్వాన్ని సవాలు చేసే కమ్యూనిస్టు పోరాటాలకు మాత్రమే రాజ్యం ప్రత్యక్ష శత్రువు. కమ్యూనిస్టు పోరాటాల లక్ష్యం స్వంత ఆస్తిని రద్దుచేయడం. స్వంత ఆస్తిని కాపాడే చట్టాలు చేసే సార్వభౌమ అధికారం రాజ్యానికి ఉంది కాబట్టి ఆ సార్వభౌమత్వాన్ని స్వాధీనం చేసుకోనిదే స్వంత ఆస్తి రద్దు కాదని కమ్యూనిస్టులు భావిస్తారు. అందువల్ల తమ పోరాటాలను రాజ్యంపైనే ఎక్కుపెడతారు. (శాసనం ద్వారా స్వంత ఆస్తిని రద్దు చేయవచ్చుగాని స్వంత ఆస్తి లేని వ్యవస్థను శాసనం ద్వారా – అంటే సార్వభౌమ రాజ్యాధికారం ద్వారా – నిర్మించలేమని ఇప్పుడు అర్థం అవుతున్నది కాబట్టి కమ్యూనిస్టు

పోరాటాలయినా రాజ్యాధికారానికి అంత కేంద్ర స్థానం ఇవ్వడం సబబా అన్న ప్రశ్న ఇప్పుడు వచ్చింది). అది అట్లా వుంచి చట్టాలతో నిమిత్తంలేని సాంఘిక అణచివేత రూపాలకు వ్యతిరేకంగా సాగే పోరాటాలకు రాజ్యం సార్వభౌమత్వాన్ని నేరుగా ప్రశ్నించవలసిన అవసరం వుండకపోవచ్చు. అవి ఎదుర్కొనే శత్రువులు చట్టంతో (అంటే రాజ్యాధికారంతో) పుట్టినవీ చట్టంతో పోయేవీ కానప్పుడు ఆ పోరాటాలకు రాజ్యం కేంద్ర బిందువు ఎందుకు కావాలి? పోరాట క్రమంలో భద్రతను కాపాడే పేరుమీద రాజ్యం బలవంతుల పక్షాన రంగంలోకి దిగినప్పుడే రాజ్యంతో వారు తలపడవలసి వస్తుంది. అంతే తప్ప రాజ్యమే ఆ ప్రజల ప్రత్యక్ష శత్రువు కాదు.

అంతే కాదు, సాంఘిక అణచివేతను ఎదుర్కొనే ప్రజలు రాజ్యం నుండి సంస్కరణలు కోరుకుంటారు. అణచివేతను అదుపు చేసే చట్టాలు కోరుకుంటారు. అది పూర్తిగా అసాధ్యమైనప్పుడు మాత్రమే వారు రాజ్యం సాధికారతనూ సార్వభౌమత్వాన్నీ ప్రశ్నిస్తారు. అంతవరకు, రాజ్యం భద్రత పేరిట ఆధిపత్య శక్తులకు అండగా నిలబడి తమ ఆందోళనలను అణచివేసిన మేరకే వారు రాజ్యంతో నేరుగా తలపడతారు. ఆ అవసరం వాళ్లకు అన్ని సందర్భాలలోనూ రాదు. ముస్లింలనే ఉదాహరణగా తీసుకుంటే, భారత రాజ్యం తన సెక్యులర్ స్వభావానికి కట్టుబడివుండాలనేది రాజ్యంపైన వారు – (ముస్లింలుగా) పెట్టే ప్రధాన డిమాండు. భారత రాజ్యం ఆ స్వభావాన్ని కోల్పోనంత మేరకు హైందవ ఆధిపత్యాన్ని వ్యతిరేకించడానికి అది వారికి ఉపకరించే సాధనమే. కోల్పోయిన మేరకే వారు రాజ్యంపైన పోరాటం చేయవలసి ఉంటుంది. అప్పుడు కూడా – రాజ్యం పూర్తిగా హైందవ రాజ్యంగా మారితే తప్ప – అదే వారి ప్రధాన పోరాటం కాదు. స్థూలంగా చెప్పాలంటే, రాజ్యం ప్రజాస్వామ్య నియమాలన్నింటినీ తిరస్కరించి ఫాసిస్టు రాజ్యంగా మారినప్పుడు మాత్రమే (లేదా మారిన మేరకు మాత్రమే) అన్ని ప్రజాపోరాటాలకూ రాజ్యంతో తలపడవలసిన అవసరం ఉంటుంది. ఎందుకంటే ఏ పోరాటానికయినా ప్రజాస్వామ్య అవకాశాలు అవసరం కాబట్టి. అయితే అప్పుడు కూడా అందరికీ రాజ్యం సార్వభౌమత్వాన్ని సవాలు చేయవలసిన అవసరం ఉండకపోవచ్చు. దానిని ప్రజాస్వామీకరించడం కోసం పోరాడడంతో సరిపెట్టుకునే ప్రజా శ్రేణులుంటాయి.

కాబట్టి పీడిత ప్రజలంతా భౌతికంగా ఒకటై, ఒక ప్రచండ శక్తిగా మారి 'వ్యవస్థ' ను కూలదోయాలి అనే ఆలోచనకు పెద్దగా అర్థంలేదు. ఆధిపత్య శక్తులకు వ్యతిరేకంగా జరిగే పోరాటాల మధ్య ఎంత ఐక్యత ఉంటే అంత మంచిది కానీ

అది అరుదుగా మాత్రమే భౌతిక ఐక్యత కాగలదు. కావడానికి అందరి అవసరాలూ ఆకాంక్షలూ ప్రయోజనాలూ కోరికలూ ఒకటి కావు. వాటి మధ్య అంతస్సంబంధం ఎంతో కొంత ఉంటుంది కాబట్టి ఆ మేరకు భౌతిక ఐక్యత సాధ్యం కావచ్చు. రాజ్యం నియంతృత్వ రూపం తీసుకుని ప్రజాస్వామ్య అవకాశాలను ధ్వంసం చేసినప్పుడు కూడా భౌతిక ఐక్యత (ప్రజాస్వామ్య పునరుద్ధరణ లేక సాధన కోసం) సాధ్యం అవుతుంది. కానీ సాధారణ పరిస్థితులలో ఉద్యమాల మధ్య ఐక్యత నైతిక సంఘీభావంగానే ఉండగలదు, ఐక్యభౌతిక శక్తిగా కాదు. నైతిక సంఘీభావంగా దానిని అర్థం చేసుకొని పెంపొందించినప్పుడే అత్యవసర పరిస్థితులలో నయినా అది భౌతిక రూపం తీసుకోగలదు.

నైతిక ఐక్యతకు – సంఘీభావానికి – తావు ఎక్కడినుండి వస్తుంది? అది కేవలం అభ్యుదయవాదుల కోరిక మాత్రమేనా? ఎంత గొప్ప కోరిక అయినా దానికి వాస్తవ ప్రాతిపదిక లేకపోతే వదులుకోవడం మంచిది. కానీ ఈ కోరికకు వాస్తవ ప్రాతిపదిక ఉందనుకుంటాను. మనుషుల ప్రయోజనాలన్నీ పాక్షికమైనవేగానీ వాటిని వ్యక్తం చేసే విలువలెప్పుడూ సార్వజనీనమైనవి (అవి ప్రజాతంత్ర విలువలు కావచ్చు, ఆధిపత్య విలువలు కావచ్చు). తమ పాక్షిక ప్రయోజనాలలోనే సార్వజనీన ప్రయోజనాలను ఇముడ్చుకున్నవారు (మార్క్స్ ఊహించిన కార్మికవర్గం) ప్రపంచంలో ఎవరూ లేరు, ఉండబోరు. భౌతిక ప్రయోజనాలలో సార్వజనీనత ఉండగలదనుకోవడం వల్లనేనేమో నైతిక సార్వజనీనతకు మార్క్స్ పెద్దగా విలువ ఇవ్వలేదు. ఇవ్వకపోగా, దానిని గురించి మాట్లాడిన కొద్ది సందర్భాలలో దానిని తృణీకరించాడు. కానీ నిజమైన సార్వజనీనత ఉండేది విలువలలోనే, భౌతిక ప్రయోజనాలలో కాదు. దీనికి మూలం కూడా మనిషిలోనే ఉంది. తన పాక్షికమైన అవసరాలను సార్వజనీనమైన విలువల రూపంలో వ్యక్తం చేసే గుణం మనిషిలో ఎందుకుందో, మానవజాతి ఎదుగుదలలో ఏ దశలో అది మానవనైజంలో భాగం అయిందో తెలీదుగాని అది మనకు తెలిసిన మనిషి నైజంలో విడదీయరాని భాగం. ఈ విలువల సార్వజనీనతే ఉద్యమాల మధ్య, ఆరాటాల మధ్య సంఘీభావానికీ సహానుభూతికీ తావు కల్పిస్తుంది. అందరి ప్రయోజనాల మధ్య ఒక కృత్రిమ భౌతిక ఐక్యతను ఊహించి దాని కోసం భౌతికంగా అందరూ ఐక్యమై ఒక ప్రచండమైన భౌతిక శక్తిగా మారుతారన్న ఆలోచన వదిలిపెట్టి, భౌతిక ఐక్యత ఏ మేరకు సాధ్యమైతే ఆ మేరకు దానిని నిలబెట్టుకుంటూ ఐక్యత ప్రధానంగా నైతికం అనీ, దానిని

ప్రయత్నపూర్వకంగా పెంపొందించడం ద్వారా ఒకరి సంఘీభావం మరొకరికి అందగలుగుతుందనీ అర్థం చేసుకున్నప్పుడు విభిన్నమైన ఐడెంటిటీలను ఏ విధంగా స్వీకరించాలో అర్థం అవుతుంది.

ఉదాహరణకు పదిమంది నిరుద్యోగులు కలిసి ఒక నిరుద్యోగ సంఘం పెట్టుకుంటే 'మా పది మందికి ఉద్యోగాలు ఇవ్వండి' అని మాత్రమే అడగరు. 'ఒక ప్రజాస్వామిక దేశంలో నిరుద్యోగం ఉండటానికి వీలులేదు' అన్న జనరల్ సూత్రాన్ని ప్రతిపాదిస్తారు. 'మనిషయి పుట్టిన ప్రతీ ఒక్కరికీ కాయకష్టం చేసుకొని గౌరవప్రదంగా బ్రతికే అవకాశం ఉండాలి' అన్న సార్వజనీన నైతిక విలువ రూపంలో తమ కోరికను వ్యక్తం చేస్తారు. ఇది మనుషులెప్పుడూ చేసే పనే. అదే ఊరిలో ఇంకొక పదిమంది దళితులు అంటరానితనానికి వ్యతిరేకంగా ఒక సంఘం పెట్టారనుకోండి.  వాళ్లు కూడా 'మా వాడలో చాయ్ హోటల్లో వేరే గ్లాసులు పెట్టడానికి వీలు లేదు' అని మాత్రమే అనరు. సామాజిక గౌరవాన్ని గురించి, మానవత గురించి సార్వజనీన విలువలనూ సూత్రాలనూ ప్రతిపాదిస్తారు. తద్వారా తమ పాక్షిక డిమాండ్లను వ్యక్తం చేస్తారు. ఇప్పుడు ఈ రెండు సంఘాలమధ్య ఐక్యత కోరుకునేవారు, 'మీరిద్దరూ ఒక్కటై మీ ఉమ్మడి శత్రువు అయిన వర్గ - కుల రాజ్యానికి (లేక ఫ్యూడలిజంతో షరీకయిన పెట్టుబడీదారీ రాజ్యానికి) వ్యతిరేకంగా మీ పోరాటం ఎక్కుపెట్టండి అనడంలో అర్థంలేదు. ఇద్దరూ తమ పాక్షికమైన కోరికలను వ్యక్తం చేయడానికి ప్రయోగించే సార్వజనీన విలువలలో సంఘీభావానికి తావు దొరుకుతుంది గానీ వారి భౌతిక ప్రయోజనాలలో కాదు.

నిజమే, నిరుద్యోగానికి కారణమైన రాజకీయార్థిక వ్యవస్థకూ అంటరానితనాన్ని కాపాడే కులవ్యవస్థకూ మధ్య సంబంధం ఉంది. కానీ అవి రెండూ ఒకటి కావు, ఒకే క్రమంలో 'కూలిపోయే'వీ కావు. ఆస్తి, కులం, పితృస్వామ్యం మొదలయిన వ్యవస్థల మధ్య పరస్పర సంబంధాలున్నాయి. దేనికది ఒక సర్వస్వతంత్రమయిన ద్వీపం కాదు. కానీ వాటినన్నిటినీ కలబోస్తే అది అందరికీ ఉమ్మడి శత్రువయిన ఒక వ్యవస్థ 'అవదు'. ఒక్కొక్క అణచివేత రూపానికి వ్యతిరేకంగా ముందుకొచ్చే పోరాటాలు వ్యక్తం చేసే సార్వజనీన నైతిక విలువలలోని సామాన్య అంశాలలో సంఘీభావానికి చోటు వెతకడం సబబుగా వుంటుంది. 'నీ కోసం నువ్వు న్యాయం కోరుకుంటున్నావు కాబట్టి ఇతరుల కోసం కూడా న్యాయం కోరుకోవాలి, ఇతరులకు నువ్వు న్యాయం చేయాలి' అనేది హేతుబద్ధమైన వాదన. ఎందుకంటే న్యాయం అనే భావనే (అన్ని విలువలలాగా) సార్వజనీనమైనది. మన అవసరాలను

మనం మానవత అనే భావన ద్వారా ఎప్పుడైతే వ్యక్తం చేస్తామో అప్పుడు అదే మానవతాభావనను ఇతరులకు కూడా అన్వయించడాన్ని మనం సులభంగా తప్పించుకోలేము. తప్పించుకోవడానికి ప్రయత్నించమని కాదు. కాని తప్పించుకోవటం కష్టం. దానికి అడ్డమొచ్చే సార్వజనీనత ఆ విలువలో (అన్ని విలువల లాగ) ఉంది. భౌతిక ప్రయోజనాలకు (విలువల రూపంలో వ్యక్తం అయ్యేదాకా) అటువంటి సార్వజనీనత లేదు. భౌతిక అవసరాలలో సార్వజనీనత కోసం వెతికే మార్క్సిస్టు సంప్రదాయం స్థానాన్ని మానవ వ్యవహారాలలో ఏ రకమైన సార్వజనీనతా సాధ్యం కాదని నమ్మే 'పోస్ట్–మోడరన్' దృక్పథం ఆక్రమిస్తున్నది కాబట్టి ఈ మాటలు చెప్పడం అవసరం అయింది.

కాబట్టి ఐడెంటిటీల గురించి ఆలోచించేటప్పుడు ప్రధానంగా లెక్కలోకి తీసుకోవలసింది వాటిలో వ్యక్తమయ్యే విలువలను. అవి ఏ రకమైన సంఘీభావాన్ని వ్యక్తం చేస్తాయి? ఏ దిశగా మనల్నీ, మన ఆకాంక్షలనూ నడిపిస్తాయి? ఏ ఆచరణకు ఊతమిస్తాయి?

'ముస్లిం ఐడెంటిటీ' గురించి ఈ కోణం నుండి ఆలోచిద్దాం. వివక్షకు, నిర్లక్ష్యానికీ గురవుతున్న మైనారిటీగా ముస్లింలు వ్యక్తం చేసే ఆందోళనను మైనారిటీ హక్కుల కోణం నుండి చూసి సమర్థించాలనడం సబబే. కానీ ఆ నిరసనలో వ్యక్తమయ్యే ఆలోచనలలోని విలువలు సమాజ సాంస్కృతిక సంపదను పెంపొందించగలవని అర్థం చేసుకున్నప్పుడే, ఆ నిరసన తన అవసరాలను తీర్చుకుంటూనే ఇతర పురోగామి ప్రయోజనాలలో ఏ విధంగా భాగం కాగలదో అర్థం అవుతుంది. అప్పుడది 'వాళ్ల' అవసరం – సమంజసమైన అవసరం – మాత్రమే కాదనీ, ఒక రకంగా అందరి అవసరం కూడాననీ అర్థం అవుతుంది. నిత్యం శంకించబడే వ్యక్తులకు అర్థమయినంతగా 'ఆత్మగౌరవం' అనే భావన ఇతరులకు అర్థం కాగలదా? వాళ్లు నేర్పించినంత గట్టిగా ఆ విలువను వేరెవరు నేర్పించగలరు? ఆత్మగౌరవం అనే భావన సామాజిక సంస్కృతిలో నిండుగా ఎదగకుండా మనమంతా కోరుకునే కొత్త సమాజం సాధ్యమవుతుందా? తన సంస్కృతినీ అలవాట్లనూ ఆచారాలనూ సార్వజనీనమైన సత్యంగా భావిస్తూ 'బోరవిరుచుకొని' తిరిగే మెజారిటీ మధ్య ఒక మైనారిటీగా బ్రతికే వాళ్లకు అర్థమయినంతగా భిన్నత్వం, వైవిధ్యాల విలువలు ఇతరులకు అర్థమవుతాయా? భిన్నత్వాన్ని వైవిధ్యాన్ని కేవలం సహించడమే కాక ఆహ్వానించడం మనమందరం నేర్చుకోక పోతే మనం ఊహించుకునే కొత్త సమాజం సంపూర్ణం అవుతుందా?

ఇటువంటి విలువలనేకం ఈ 'జల్‌జలా' సంకలనంలోని కవితలలో కనిపిస్తాయి. వాటిని 'మైనారిటీల న్యాయమైన సమస్యల కవితాత్మక (లేక తాత్విక) వ్యక్తీకరణగా (మాత్రమే) చూడకుండా, భారతదేశ ముస్లింల భౌతిక పరిస్థితి, దానినుండి పుట్టిన ఆలోచనలు, మొత్తంగా సమాజానికి అది అందించే విలువల దృక్కోణంగా అర్థం చేసుకున్నప్పుడు ఈ కవితలు చదివే ముస్లిమేతరులు సానుభూతినీ సంఘీభావాన్నీ 'ఇచ్చే' వారిగానే కాక తీసుకునే వారిగా కూడ కనబడతారు. 'ఒంటరిపోరాటం ఏమి చేస్తారు, ఇతరులతో కలవండి' అనే ముందు ఇప్పటికే అందరి అవసరాలకూ వాళ్లు అందిస్తున్న విలువలున్నాయని అర్థం చేసుకోగలుగుతాము. భౌతికంగా చేతులు కలపడం అన్ని సందర్భాలలోనూ అవసరంగానీ సాధ్యంగానీ కాకపోవచ్చును గానీ విలువల చేయూత ఎప్పుడూ ఉంటుంది. అయితే దాని గురించి స్పృహ అవసరం. అవగాహన అవసరం. ఒక జీవిత అనుభవం నుండి పుట్టిన విలువలు వాటంతటవి ఇతర జీవన రంగాలలోకి వ్యాపించే క్రమం సంక్లిష్టంగానూ నెమ్మదిగానూ జరుగుతుంది. ఆ పనిని ప్రయత్నపూర్వకంగా చేయటం – విలువల సంఘీభావాన్ని పెంపొందించడం – అవసరం. ఉద్యమాలకు మనం సలహాలు, సానుభూతి 'ఇచ్చే' వారిమే కాక పొందే వారము కూడ అన్న ఎరుక అవసరం.

నిరసన అనే నెగటివ్ భావనలో కూడ ఇన్ని పాజిటివ్ విలువలున్నాయి. అయినప్పటికీ అది పరిమితమైన భావనే. "ముస్లింలను ముస్లింలుగా కదిలించే పాజిటివ్ ఆలోచనలు – 'ముస్లిం ఐడెంటిటీ'లో భాగం కాగలిగినవి – లేవా? ఇస్లాం – అందులో ప్రత్యేకించి భారతదేశంలో అది తీసుకున్న రూపం– మన సమాజానికి చేసిన మేలేమీ లేదా? అందించిన సంస్కృతి ఏమీ లేదా? దానిని తనలో ఇముడ్చుకున్న ముస్లిం ఐడెంటిటీ ఒక పాజిటివ్ రాజకీయ భావనకు బీజం కాజాలదా? బ్రాహ్మణీయ హైందవ సంస్కృతి గుప్పిట్లో ఉన్న మన సమాజంలోకి ఇస్లాం కొన్ని కొత్త ఆలోచనలనూ కొత్త సాంస్కృతిక విలువలనూ ప్రవేశపెట్టింది. అవి హైందవ సంస్కృతిలోని రెండు బలమైన దుర్గుణాలను – సంకుచితత్వం, సాంఘిక అసమానత అనే దుర్గుణాలను – కొంత మేరకు వ్యతిరేకించే విలువలు. ఇస్లాం వాటికి విరుద్ధమైన విలువలను పెంపొందించిన విషయాన్ని గర్వంగా జ్ఞాపకం చేసుకోవడం ఇప్పటిదాకా ముస్లిం ఛాందసవాదుల వంతయింది. అది వాళ్ల వంతుగానే ఉండిపోతే మంచి కంటే చెడుకే ఎక్కువ ఉపయోగపడే ప్రమాదం ఉంటుంది."

బ్రాహ్మణీయ దృక్పథంలో హెచ్చుతగ్గుల సంకుచితత్వమే కాక 'ప్రాదేశిక' సంకుచితత్వం కూడ బలంగా ఉంది. హిందువులుగా పుట్టి పెరిగిన వాళ్లకు తమలో ఈ దృష్టిలోపం ఉందని గ్రహించడం సహితం కష్టం. హిందువుల మానసిక దృష్టి చుట్టూ కొన్ని గోడలుంటాయి. ఆ గోడలను దాటి ఆలోచించడం, సహానుభూతితో స్పందించడం హిందువులకు సహజంగా రాదు. కులం ప్రధానమైన అడ్డుగోడ కాగా అది నేర్పించిన సంస్కృతి ఫలితంగా జాతి, భాష, దేశం మొదలయిన అడ్డుగోడలు కూడ హిందువుల చుట్టూ మొలిచాయి. సహానుభూతికీ స్పందనకూ ఇవి బలమైన పరిమితులు పెడతాయి. ఇస్లామిక్ సంస్కృతి దీనికి పూర్తిగా అతీతమని నా ఉద్దేశ్యం కాదు. ఏ ఎల్లలూ లేకుండా విశ్వజనీనంగా 'మమేకం' కావడం మనుషులెవరికీ సాధ్యం కాదు. కానీ ఆ పరిమితిని వ్యతిరేకించే సాంస్కృతిక విలువలు ఇస్లాంలో ఉన్నాయి. ముస్లింలంతా భౌతికంగా ఒకటేనని నిరూపించడానికి 'ఉమ్మా' అనే భావనను ఛాందసవాదులు వాడుకునే తీరును వ్యతిరేకించవలసిందే; ప్రపంచ ముస్లింలు భిన్నజాతులలోనూ సంస్కృతులలోనూ భాగమై ఉన్నారనీ, ఈ వైవిధ్యాన్ని కాదనడం సంకుచిత దృక్పథమనీ విమర్శించాల్సిందే. కానీ దానిని భౌతిక ఏకతగా అర్థం చేసుకోకుండ, విశాలమైన సహానుభూతికి (కనీసం తమ మతానికి చెందినవారి వరకైనా) తావు కల్పించే సాంస్కృతిక విలువగా అర్థం చేసుకోవడం అవసరం. హైందవ సంస్కృతిలోని సంకుచిత దృష్టిని ఎత్తి చూపడం ద్వారా దానిని బలహీనపరచడానికి అది ఉపయోగపడుతుందనీ, ఉపయోగపడిందనీ అర్థం చేసుకోవడం అవసరం. ప్రపంచ ముస్లింలలో ఎంత సాంస్కృతిక వైవిధ్యమున్నప్పటికీ అరబ్బీ మాట్లాడే పాలస్తీనా ముస్లింలకు ఇక్కట్లు వస్తే తమిళం మాట్లాడే కోయంబత్తూరు ముస్లింలు ఆందోళన చెందగలరు. గుజరాతీ మాట్లాడే పోర్బందర్ ముస్లింలు బాధపడగలరు. ప్రస్తుతానికిది మతం పరిధిలోనే ఉంది. మత ఛాందసవాదుల అదుపులోనే ఉంది. అయినప్పటికీ, మతం ప్రమేయం లేని సార్వజనీనమైన స్పందనకు ఈ వైఖరి దారి చూపగలదు. 'ఎక్కడో చెచెన్యాలో ఏదో జరిగితే వీళ్లు హైదరాబాద్‌లో బస్సుల అద్దాలెందుకు పగలగొడతారు' అని విసుక్కొనే హిందువులకు, గడపదాటి స్పందించలేని తమ సంకుచితత్వాన్ని ఇది ఎత్తి చూపుతుందని అర్థం కాదు.

దేవుడి ముందు అందరూ సమానులేననేది ఇస్లాంలోని మరొక విలువ. పురుషాధిక్యత, ఆర్థిక అసమానత దీనికి బలమైన పరిమితులు పెట్టినప్పటికీ – మతమే సమానత్వ సూత్రాన్ని ప్రతిపాదించే సంస్కృతికీ గుణకర్మలను బట్టి దేవుడే

మనుషులను అసమానులుగా సృష్టించాడని నమ్మే హైందవ సంస్కృతికీ చాలా తేడా ఉంది. హైందవ సమాజంలోని శ్రామిక కులాలకు చెందినవారు ఇస్లాంవైపు ఆకర్షితులు కావడానికి ఈ తేడానే దోహదం చేసింది. ఆ విధంగా మతం మార్చుకున్నవారిలో కనిపించే ఆత్మగౌరవం హిందువులుగా ఉండిపోయిన వారిలో కనిపించదు. ఇస్లాం, క్రైస్తవం భారతదేశంలోకి రాకపోతే ఈ దేశంలో 'క్రిందికులాల' పరిస్థితి ఇంకెంత దుర్భరంగా ఉండేదో!

భారతదేశంలో ఇస్లాంను ఎక్కువగా ప్రచారం చేసింది కత్తి చేతబట్టిన సుల్తాన్లు కాదు. సమానత్వ విలువను ప్రచారం చేసిన 'సూఫీ' ప్రచారకులు. వీళ్లు ప్రచారం చేసిన ఇస్లాంలో దేవుడి ముందు అందరూ సమానమనే భావన, ప్రేమ, దయ, సహనం, సానుభూతి మొదలైన విలువలు ముఖ్యమైనవి. వీళ్లు పేదరికంలో ఉంటూ పేదల మధ్య తిరుగుతూ మతాన్ని ప్రచారం చేశారు. వీరి సమాధులే దేశమంతటా కనిపించే దర్గాలు. మతానికి అతీతంగా ప్రజలందరూ పూజలు చేసే ఏకైక ప్రార్థనా స్థలాలు దర్గాలు. 'హిందూ ముస్లిం భాయి భాయి' అన్న లౌకికవాదుల నినాదం కంటే దర్గాలే ఎక్కువగా హిందూ – ముస్లిం ప్రజలను (ముఖ్యంగా శ్రామిక ప్రజలను) ఒక దగ్గరికి తెచ్చాయనడంలో ఎంతమాత్రం అతిశయోక్తి లేదు.

భారతదేశపు ఇస్లాంకు ఉన్న ఈ చరిత్రను సగర్వంగా స్వీకరించే 'ముస్లిం ఐడెంటిటీ'కి ఒక వాస్తవికమైన రాజకీయ స్థానం ఉండగలదు. అది సనాతన వాదాన్ని తిరస్కరిస్తూ, 'ముస్లిం' గానే ఉంటూ అభ్యుదయ రాజకీయ స్రవంతిలో భాగం కాగలదు. దానిని అభ్యుదయవాదులెందుకు ఆహ్వానించకూడదు? ఆహ్వానించడమే కాదు, దాని కోసం ఎందుకు ప్రయత్నం చేయకూడదు?

**జల్‌జలా ముస్లింవాద కవిత్వం పుస్తకానికి రాసిన వెనకమాట**
**సం: స్కైబాబ, ప్రచురణ: నీలగిరి సాహితి, నల్లగొండ, మార్చి 1998**

# ముస్లింలు ముస్లింలుగా సంఘటితం కావాలి



**భా**రత దేశంలో ముస్లింల రాజకీయ ఆర్థిక హక్కుల కోసం, సామాజిక అవసరాల కోసం ఉద్యమించే సంస్థలు, సంఘాలు చాలా తక్కువ. మత సంస్థలున్నాయి. అందులో పరమత సహనాన్ని పాటించేవీ ఉన్నాయి, పాటించనివీ ఉన్నాయి. ముస్లిం సమాజంలో అంతర్గత సంస్కరణల కోసం, విద్య వంటి ప్రధాన సామాజిక రంగాలలో సేవలు అందించడం కోసం పనిచేస్తున్న సంఘాలూ ఉన్నాయి. కానీ ఏ రంగంలో అయినా ముస్లింలను ముస్లింలుగా సంఘటితపరచి హక్కుల కోసం ఉద్యమించే సంస్థలు చాలా అరుదుగా కనిపిస్తాయి.

సహజ క్రమంలోనే హక్కులు ఒనగూడినట్టయితే అటువంటి ఉద్యమాలూ ఉద్యమ సంస్థలూ లేకపోవడం ఆశ్చర్యం కలిగించే విషయం కాదు. కానీ స్వాతంత్ర్యం తరువాత అభివృద్ధి ఫలితాలను అతి స్వల్పంగా అందుకున్న సామాజిక వర్గాలలో ముస్లింలను ప్రముఖంగా చెప్పుకోవలసి ఉంటుంది. దేశ జనాభాలో ముస్లింల వాటాతో పోల్చుకుంటే విద్య, ఉద్యోగం, రాజకీయ ప్రాతినిధ్యం అనే మూడు రంగాలలోనూ ముస్లింల వాటా చాలా తక్కువ. నిరక్షరాస్యతలోనూ పేదరికంలోనూ చాలా ఎక్కువ. వేరే ఏ సామాజిక వర్గం పరిస్థితయినా ఈ విధంగా ఉండివుంటే వారు ఈపాటికి సంఘటితమయి తమ న్యాయమైన వాటా కోరి ఉందురు. అది న్యాయమేనన్న ఆమోదం పొంది కూడ ఉందురు. కానీ ముస్లింలు అడగడం లేదు. అడగడానికి సంఘటితం కావడం లేదు. అడిగితే హిందూ సమాజం ఆమోదం లభిస్తుందన్న నమ్మకమూ లేదు.

తల్లిదండ్రుల పాపాలకే కాక తల్లిదండ్రులకు ఆపాదించబడ్డ పాపాలకు కూడ పిల్లలను సమాజం బాధ్యుల్ని చేసినట్టు దేశ విభజన ముస్లింల పాపమేనంటూ

అప్పటి తరానికి చెందిన ముస్లింలకు ఆపాదించబడిన పాపానికి తరువాతి తరానికి చెందిన ముస్లింలు భౌతికంగానే కాక మానసికంగానూ పరిహారం చెల్లిస్తున్నారు. ఆ ఆపాదన న్యాయం కాదు. అది న్యాయమే అయినా తరువాతి తరం మీద వేసిన భారం ఎంత మాత్రం న్యాయమైనది కాదు.

బ్రిటిష్ వాళ్లకు విభజించి పాలించే నీతి ఉండిందనీ, హిందువులు – ముస్లింలు, అణగారిన కులాలు – అగ్రకులాలు, ఆదివాసులు – బయటవారు అంటూ భారత సమాజాన్ని ఎక్కడికక్కడ విభజించి తమ ప్రయోజనాలు సాధించుకున్నారనీ ఒక అభియోగం ఉంది. అభ్యుదయవాదులు సహితం 'బ్రిటిష్‌వారి విభజించి పాలించే నీతి' అని తరచుగా అంటుంటారు. దేశ స్వాతంత్ర్యం ప్రస్తావన వచ్చినప్పుడు, స్వాతంత్ర్యమంటే అగ్రవర్ణ హిందువుల పాలనే అవుతుంది కాబట్టి మైనారిటీల, అణగారిన కులాల ప్రయోజనాలకు ఈ డిమాండు నష్టకరమని బ్రిటిష్ వాళ్లు తమ పాలనను సమర్థించుకున్న మాట వాస్తవమే. మైనారిటీల, దళితుల రాజకీయ ప్రతినిధుల సాధికారతను గుర్తించి ఆ ప్రజల ప్రయోజనాల నిమిత్తం వారితో చర్చలు, సంప్రదింపులు పెట్టుకున్న మాటా వాస్తవమే. ఇందులో బ్రిటిష్ వాళ్ల స్వార్థం ఉందనడంలో సందేహమేమీ లేదుగానీ ఈ తేడాలను ఆ స్వార్థం సృష్టించిందా లేక వాటిని వాస్తవికంగా గుర్తిస్తూ పనిలో పనిగా తన ప్రయోజనాలు ఒనగూర్చుకుందా అన్న ప్రశ్న వేసుకోకుండ బ్రిటిష్ వలసవాదుల విభజించి పాలించే నీతి గురించి ఊకదంపుడు ఉపన్యాసాలు ఇవ్వడం భావ్యం కాదు.

బ్రిటిష్‌వారి విభజించి పాలించే నీతి అనేది ముస్లింలకు సంబంధించి ఎక్కువగా ఈ రోజు ప్రస్తావనకు వస్తూ ఉంటుంది గానీ బ్రిటిష్ పాలకులు మూడు ప్రధాన మైనారిటీ వర్గాలను గుర్తించారు – ముస్లింలు, సిక్కులు, అణగారిన వర్గాలు (నేటి భాషలో దళితులు). ఈ మూడు సామాజిక వర్గాలలోనూ స్వాతంత్ర్యం అంటే అగ్రవర్ణ హిందువుల పాలనే అవుతుందన్న సహేతుకమైన సందేహం ఉండింది. ముగ్గురిలోని ఈ భయాన్ని బ్రిటిష్ వాళ్లు ఒక వాస్తవంగా గుర్తించారు. తమ వలస పాలన ప్రయోజనాలకు అనుగుణంగా వాడుకున్నారు. ముగ్గురి విషయంలోనూ 'జాతీయ' పార్టీ అయిన కాంగ్రెస్ సరయిన అవగాహన ప్రదర్శించలేదు. వారి భయాలను సహేతుకమైనవిగా అర్థం చేసుకోలేదు. వాటిని పోగొట్టడానికి గట్టి కృషి ఏమీ చేయలేదు. ఈ సామాజిక వర్గాల భవిష్యత్తు స్వతంత్ర భారతంలో ఏ విధంగా ఉండబోతుందోనన్న భయాన్ని వ్యక్తం చేసిన నాయకులను కాంగ్రెస్ వారు బ్రిటిష్ ఏజెంట్లు అంటూ నిందించారు. అంబేద్కర్

అంతటి వాడికే అది తప్పలేదు. అయినప్పటికీ స్వాతంత్ర్యం తరువాత సిక్కు ప్రజానీకం, దళిత ప్రజానీకం ఏ 'పాప భారాన్నీ' మోయవలసిన అవసరం లేకుండ తమను తాము సామాజిక వర్గాలుగా సంఘటితం చేసుకుంటూ తమ హక్కుల గురించీ అవసరాల గురించీ ఆందోళన చేస్తున్నారు. ఒక్క ముస్లింల కథ మాత్రమే భిన్నంగా ఉంది.

చెప్పుకోదగ్గ విషయం ఏమిటంటే, రెండవ ప్రపంచ యుద్ధం ముగింపు దశలో – భారత్‌కు ఇంగ్లండ్ స్వాతంత్ర్యం ఇవ్వక తప్పదన్న వాతావరణం ఎప్పుడయితే ఏర్పడిందో అప్పటి నుండి 1947 జూలై నెల దాకా కూడ స్వతంత్ర భారతం ఏకీకృత రాజ్యంగా కాక భిన్నత్వాల సమ్మేళనంగా ఉంటుందన్న అభిప్రాయమే బలంగా ఉండింది. ఒక్క ముస్లింల విషయంలోనే కాదు, ముస్లింలు, సిక్కులు, షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగలు, భారతీయ క్రైస్తవులు, ఆంగ్లో ఇండియన్లు – వీరందరికీ రాజకీయ రిజర్వేషన్లు, ఉద్యోగాలలో రిజర్వేషన్లు, బహుశా ప్రత్యేక నియోజకవర్గాలు కూడ ఉండాలనీ, ముస్లింలు, సిక్కులు, ఆదివాసీ జాతులు అధికంగా నివసించే వాయవ్య, ఈశాన్య ప్రాంతాలకు స్వంత రాజ్యాంగాలతో సహా స్వయం ప్రతిపత్తి ఉండాలనీ అయిష్టంగానే కానివ్వండి కాంగ్రెస్ వారు సహితం అంగీకరించారు. అయితే దేశ విభజన నుండి వచ్చిన చీలికల భయాన్ని ఆసరా చేసుకొని ఒక్క ఎస్‌సి ఎస్‌టిలకు తప్ప వేరే ఎవరికీ ప్రత్యేక రక్షణ ఇవ్వని పద్ధతిలో రాజ్యాంగం ముసాయిదాను తిరగరాసి ఏకీకృత రాజ్యాన్ని నెలకొల్పడంలో కాంగ్రెస్ వారు కృతకృత్యులయ్యారు.

బ్రిటిష్‌పాలన కాలంలో 1925 నుండీ మైనారిటీలకు (అప్పట్లో మైనారిటీ అంటే ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులే కాదు, దళితులు, ఆదివాసులు కూడ) ప్రభుత్వ ఉద్యోగాలలో రిజర్వేషన్లు ఉండేవి. 1934లో దానికి ఒక నిబంధన రూపం ఇచ్చి ముస్లింలకు 25% రిజర్వేషను, ఇతర మైనారిటీలకు 8.5% రిజర్వేషను ఖరారు చేసారు. 1932 తరువాత, అప్పటి పరిమిత ప్రాతినిధ్యం ప్రాతిపదికన జరిగిన ఎన్నికలలో అన్ని మైనారిటీ వర్గాలకూ ప్రత్యేక నియోజకవర్గాలనే కేటాయించారు.

1946 డిసెంబర్ 9న మొట్టమొదటిసారి సమావేశమైన రాజ్యాంగ పరిషత్ తాను రూపొందించబోతున్న భారత రాజ్యాంగాన్ని ఏకీకృత నమూనాలో భావించుకోలేదు. వాయవ్య ప్రాంతం ఒక 'సెక్షన్'గా, తక్కిన దేశం ఒక 'సెక్షన్'గా ఉంటాయనీ, ఏ సెక్షన్‌కు దాని ప్రాంతీయ రాజ్యాంగం ఉంటుందనీ, ఒక సెక్షన్‌లో

ఉంచబడ్డ రాష్ట్రానికి ఆ సెక్షన్‌లోనే కొనసాగాలా లేక వేరే సెక్షన్‌లో చేరాలా అని నిర్ణయించుకునే స్వేచ్ఛ ఉంటుందనీ ఆనాడు భావించారు.

మైనారిటీల హక్కుల గురించి సూచనలివ్వడం కోసం ఏర్పాటు చేసిన రాజ్యాంగ పరిషత్ సబ్ కమిటీ 1947 జూలై 27న (అంటే పాకిస్తాన్ ఆవిర్భావానికి కేవలం మూడు వారాల ముందు) సమర్పించిన నివేదికలో, ముస్లింలకు, సిక్కులకు, భారతీయ క్రైస్తవులకు, ఆంగ్లో ఇండియన్లకు, ఈశాన్య ప్రాంత ఆదివాసులకు, ఇతర ప్రాంతాల ఆదివాసులకు, దళితులకు రాజకీయ రిజర్వేషన్లతో సహా అన్ని రకాల రిజర్వేషన్లూ ఇవ్వాలని సూచించింది. కేబినెట్‌లో మైనారిటీలకు రిజర్వేషన్లు ఇవ్వాలన్న సూచన సహితం సబ్ కమిటీలో బలంగా చర్చకు వచ్చిందిగానీ, ఒక్క ఓటుతో వీగిపోయి వారి ప్రతిపాదనలలో భాగం కాలేదు.

దేశ విభజన వల్ల హిందువులలో పెల్లుబికిన ఉద్రేకాన్నీ ముస్లింలలో నెలకొన్న అపరాధ భావననూ ఆసరా చేసుకొని కాంగ్రెస్ నాయకులు తొలుత ప్రతిపాదించిన రూపానికి గుడ్‌బై చెప్పి, ఎస్‌సి ఎస్‌టిలకు తప్ప తక్కిన వర్గాలకు రాజకీయ రిజర్వేషన్లు, ఉద్యోగ రిజర్వేషన్లు నిరాకరించి అందరినీ 'పౌరులు' చేసేసి అధికార కేంద్రీకరణను సహితం బాగా పెంచి ప్రస్తుతం ఉన్న రూపంలో రాజ్యాంగం రచనను ముగించారు. అదే జరగకపోతే మన రాజకీయ వ్యవస్థలోనూ పాలనా వ్యవస్థలోనూ మైనారిటీల ప్రత్యేక ప్రతిపత్తి బలమైన అంశంగా ఉండేది.

రాష్ట్రాలకు స్వంత రాజ్యాంగాలు ఉండే ఫెడరల్ వ్యవస్థనూ, మైనారిటీలకు (ఎస్‌సి, ఎస్‌టిలను కూడ మైనారిటీలుగా గుర్తిస్తూ) ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే ప్రజాతంత్ర విలువనూ తిరస్కరించే తీర్మానాన్ని రూపొందించడంలోనూ రాజ్యాంగ పరిషత్ చేత ఓకే చేయించడంలోనూ నెహ్రూ, పటేల్‌లు ఇద్దరూ పెద్ద పాత్ర పోషించారు. నెహ్రూ ఆదర్శాలు ప్రవచించి ఈ పని చేయగా పటేల్ దేశ సమగ్రత పేరు మీద చేసాడు. 1947 జూలై 27న మైనారిటీల సబ్ కమిటీ చేసిన ప్రతిపాదనను 1949 మే 11న రాజ్యాంగ పరిషత్ సలహా కమిటీ తిరస్కరించింది (ఒక్క ఎస్‌సి, ఎస్‌టిల విషయంలో తప్ప).

దీని ఫలితాన్ని ఈ రోజు ముస్లింలు అనుభవిస్తున్నారు. క్రైస్తవులలో దళిత క్రైస్తవులు తరువాతి కాలంలో వచ్చిన బిసి రిజర్వేషన్ల ప్రయోజనాన్ని పొందగలిగారు. క్రైస్తవులము కామని చెప్పుకోగలిగిన చోట షెడ్యూల్డు కులాల ప్రత్యేక ప్రతిపత్తిని పంచుకోగలిగారు. సిక్కులలో ఒక ధనిక వర్గం, విద్యావంతుల

వర్గం ఉండడం వల్ల ప్రత్యేక రాజ్యాంగ ప్రతిపత్తి ఏదీ లేకున్నా హైందవ సమాజంతో పాటు నడవగలుగుతున్నారు. ముస్లింలలో డబ్బు, చదువు ఉన్న వర్గాలు (ముఖ్యంగా ఉత్తర భారతదేశంలో) పాకిస్తాన్‌కు వెళ్లిపోవడం వల్ల, పోని చోట పెట్టుబడిదారీ ఆధునికతలో భాగం కాలేకపోవడం వల్ల ముస్లిం సమాజం స్థితి వేగంగా దిగజారింది.

వేరే ఎవరయినా అయితే దీనిని ఎదుర్కొనడానికి సంఘటితమవుదురు. ఆత్మస్థైర్యంతో మా హక్కులు మాకిమ్మని అడుగుదురు. ముస్లింలు ఈ మార్గం ఎంచుకోకపోవడానికి ముస్లిం సమాజానికి అంతర్గతమైన కారణాలు లేకపోలేదు గానీ, హైందవ సమాజం ఏ విధంగా స్పందిస్తుందోనన్న భయం ఒక ముఖ్య కారణం. కొన్నాళ్లకింద ముస్లింల పార్టీ పెట్టబోతున్నామని ఉత్తరప్రదేశ్‌కు చెందిన ముస్లిం ప్రముఖులు ప్రకటించగా, ఒకప్పటి జనతాపార్టీ నాయకుడయిన సురేంద్ర మోహన్ వంటి వ్యక్తి (ఈయన మైనారిటీల సమాన హక్కులను మనస్ఫూర్తిగా కాంక్షిస్తాడనడంలో సందేహమక్కరలేదు) 'తొందరపడి అంత పని చేయొద్దు సుమా' అంటూ సుదీర్ఘమైన ఉపదేశ వ్యాసం రాసాడు.

హైందవ సమాజం ఆగ్రహిస్తుందనీ పోలీసులు అనుమానిస్తారనీ ముస్లింలు ఎందుకు ఆగాలి? ఎన్ని రోజులు ఆగాలి? తమకు దక్కాల్సిన వాటాలో నాలుగో వంతు కూడ ఉద్యోగ రంగంలో, విద్యారంగంలో, రాజకీయ వ్యవస్థలో లేని స్థితిని ఎందుకు సహించాలి? ఈ స్థితికి అంతర్గత కారణాలు ఎన్ని ఉన్నా వాటిని గురించి ఏమైనా చేయాలన్నా ముస్లింలు ముస్లింలుగా సంఘటితమయి తాము ఈ దేశంలో బాగా బతకడం ఒక సహజమైన హక్కు అన్న ఆత్మస్థైర్యంతో వ్యవహరించగలగడం అవసరం. సమాజం నుండి, ప్రభుత్వం నుండి హక్కులు పొందాలంటే అటువంటి 'ఐక్య సంఘటన' ఎట్లాగూ అవసరమే.

'మీరు ముస్లిం సంఘాలూ ముస్లిం పార్టీలూ పెట్టుకొని హైందవ సమాజంలో 'ఇది ఇంకొక వేర్పాటుకు దారితీస్తుందేమో'నన్న అనుమానానికి తావు ఇచ్చే బదులు, ప్రగతిశీల రాజకీయాలలో భాగమయి అందరితో పాటు మీ హక్కులు పొందండి' అని ముస్లింలకు హితవు చెప్పే అభ్యుదయవాదులు లేకపోలేదు. అణగారిన సామాజిక వర్గాలు తాముగా సంఘటితం కావడం అవసరమని అంటే – ఎవరికివారు అభేద్యమైన కోటలు కట్టుకొని కూర్చోవాలని కాదు. కలవగల చోట, కలవవలసిన చోట ఒకరితో ఒకరు కలవవలసిందే. కానీ విడిగా సంఘటితం కానిదే హక్కుల సాధన సంగతి అటుంచి, వాటి సమగ్ర వ్యక్తీకరణ

కూడ సాధ్యం కాదన్నది వాస్తవం. ఆ విషయం గుర్తించిన తరువాతే 'కుల సంఘాలు' అంటూ అభ్యుదయవాదులు ఈసడించుకునే పలు దళిత బహుజన సంఘాలు ఏర్పడ్డాయి.

'ముస్లింలు ముస్లింలుగా సంఘటితం కావాలి' అంటున్నామంటే ముస్లిం సమాజంలో అంతర్గత విభజన లేదనీ అది ఒకే మూస పోసినట్టు ఉందనీ కూడ అర్థం కాదు. ముస్లింలు ఏ గొడుగో వెతుక్కోనక్కరలేదనీ తమ పేరు మీద తాము సంఘటితం కావాలనీ మాత్రమే అంటున్నాం. మన దగ్గర కంటే ఉత్తర భారతదేశంలో ముస్లింలలో 'అష్రాఫ్' వర్గానికీ, దళిత బహుజన కులాల నుంచి ముస్లింలుగా మారిన అజ్లాఫ్, అర్జాల్ వర్గాలకూ మధ్య తేడా చాలా ప్రస్ఫుటంగా ఉందని అంటారు. మండల్ కమిషన్ తరువాత ఈ తేడా మరింత కొట్టొచ్చినట్టు వ్యక్తమవుతున్నదని కూడ అంటారు. అలాంటప్పుడు దళిత బహుజన కులాలకు చెందిన ముస్లింలు విడిగా సంఘటితం కావడం భావ్యమనుకుంటే అదీ న్యాయమే.

దేశ విభజనకు కారణమయ్యారనే 'పుట్టుమచ్చే' కాక ఈ మధ్య కాలంలో ఐఎస్ఐ బూచి కూడ ముస్లిం ప్రజల రాజకీయ వ్యక్తీకరణ కొక ప్రతిబంధకంగా తయారయింది. హైదరాబాద్ పాతబస్తీలో ఈ మాట తరచుగా వింటుంటాం. పాతబస్తీలో ముస్లింలనయినా హిందువులనయినా వారి దైనందిన జీవిత అవసరాల కోసం, సామాజిక ఆర్థిక హక్కుల కోసం సంఘటితపరిచే సంస్థలేవీ లేవు. ఇటు ఎంఐఎం అటు బిజెపి పార్టీలు రెండు శ్మశానాలూ, మూడు కబరస్తాన్‌లుగా పాతబస్తీ రాజకీయాలను నడిపిస్తున్నాయి. ఒక రోడ్డు కోసం, ఒక నల్లా కోసం, ఒక బడి కోసం పాతబస్తీలో ఒక్క ఆందోళన జరిగిన ఉదంతం ఎవరి జ్ఞాపకాలలోనూ లేదు. ఈ పరిస్థితి నగర పాలకులకు, రాష్ట్ర పాలకులకు చాలా ఆనందదాయకమని వేరే చెప్పనవసరం లేదు.

పాతబస్తీ ముస్లింలకెవ్వరికీ ఎంఐఎం పట్ల పెద్దగా సదభిప్రాయం లేదు. ఎవ్వరిని కదిలించినా యువతలో నిరుద్యోగాన్ని ప్రధాన సమస్యగా చెప్తారు. పాతబస్తీ హిందువుల పరిస్థితీ అంతే కావచ్చును గానీ మూసీనది దాటి ఈవలికి వచ్చి ఏదో ఉపాధి చూసుకొని సాయంకాలం తిరిగి ఇల్లు చేరుకునే అవకాశం హిందువులకు రవంత ఎక్కువే ఉంటుంది. ప్రభుత్వ ఉద్యోగాలు దొరకకపోవడమే కాదు, ప్రైవేట్ రంగంలోనూ ముస్లింలు చాలా వివక్ష ఎదుర్కుంటున్న సంగతి తెలిసిందే.

అయినప్పటికీ ముస్లిం యువతకు ఉద్యోగహక్కు కోసం, పనిహక్కు కోసం, ఉపాధిహక్కు కోసం సంఘటితం చేసే ప్రయత్నం చేయరాదా అని ఎవ్వరిని

అడిగినా 'మేము చేస్తే ఏవో ముద్రలు వేస్తారు. ఐఎస్ఐ అంటారు, తీవ్రవాదం అంటారు' అని జవాబు ఇస్తారు. ఇది ఒక్కొకసారి తమ అనాసక్తికి వెతుక్కునే సాకే కావచ్చును గానీ నిజమైన తటపటాయింపు కూడ ఉంది. నిజమైన భయాలూ ఉన్నాయి.

ముస్లింలు దీనిని అధిగమించడం అవసరం. దానికి ప్రజాతంత్ర శక్తులు తోడ్పడడం అవసరం. మా పార్టీలోకి రండి, మా సంఘంలోకి రండి అని ఆహ్వానించడం కాక మీ హక్కుల కోసం, మీ ప్రత్యేక సమస్యల పరిష్కారం కోసం మీరు సంఘటితం కండి, మేము తోడు ఉంటామని చెప్పడం అవసరం.

**ముల్కి పత్రిక**
**2004**

# దేశ స్వాతంత్ర్య ఉద్యమం - ముస్లింలు



ఏ ప్రజలయినా తాము సహితం దేశభక్తులేనని రుజువు చేసుకునే స్థితిలో ఉండడం – లేక రుజువు చేసుకోవలసిన స్థితిలోకి నెట్టబడడం – అన్యాయమంటే అందరూ ఒప్పుకుంటారు. 'ఇన్ జనరల్' ఒప్పుకోవడం పెద్దగా కష్టం కూడా కాదు. కానీ ఎందుకు అన్యాయం అన్న ప్రశ్న వేసుకొని కొంచెం లోతుగా విశ్లేషిస్తే అందరికీ కాకున్నా కొందరికి ఇబ్బంది అనిపించే జవాబులు దొరకగలవు.

దేశభక్తి అనేది వివాదానికి అతీతమైన సద్గుణం అనీ, మంచివాళ్లందరూ ఆ అర్థంలో దేశభక్తులు అయ్యే ఉంటారనీ అనుకుంటే 'ఎందుకు అన్యాయం' అన్న ప్రశ్నకు సులభమయిన జవాబు దొరుకుతుంది. మేము సహితం మంచివాళ్లమేనని రుజువు చేసుకోవలసి రావడం అన్యాయమే మరి.

కానీ దేశభక్తి అనేదే సమస్యాత్మకమైన భావన. కొన్ని కోణాలలో, కొన్ని అర్థాలలో అది ప్రజాస్వామిక భావనే కాగలదు కాని కొన్నిటిలో కాదు. తాము సహితం దేశభక్తులేనని రుజువు చేసుకోవలసిన స్థితికి నెట్టబడిన వారికి జరిగే ముఖ్యమైన అన్యాయం ఈ సంగతి చెప్పలేకపోవడం, ఆ మాటలు అనలేకపోవడం. గుడిపాటి వెంకటచలం అనే హిందూ అగ్రకులానికి చెందిన రచయిత (మతాన్ని గురించి, కులాన్ని గురించి ఆయన అభిప్రాయం ఏమయినప్పటికీ) దేశభక్తి కంటే హీనమైన పాపం వేరే ఏదీ లేదని అనగలిగాడు. దానిని జోక్‌గా తీసుకున్నవారు జోక్‌గా తీసుకున్నారు, వ్యంగ్యంగా భావించిన వారు వ్యంగ్యంగా భావించారు, సమకాలీన రాజకీయాలమీద సీరియస్ వ్యాఖ్యగా అర్థం చేసుకున్నవారు ఆ విధంగా అర్థం చేసుకున్నారు. చలం గారికి ఆ వ్యాఖ్య వల్ల ఏ కష్టమూ రాలేదు. అదే ఒక ఇండియన్ ముస్లిం, ఒక ఇండియన్ క్రిస్టియన్ అంత సులభంగా ఆ మాట అనగలరా?

అంబేద్కర్‌కే ఎంత కష్టమయింది! కాంగ్రెస్‌వారి జాతీయోద్యమం ప్రచారం చేసిన అర్థంలో 'దేశభక్తులు' కావడమే రాజకీయ కార్యకర్తలందరి కర్తవ్యం కాదనీ, దానికంటే సాంఘిక సంస్కరణ కోసం, సాంఘిక విప్లవం కోసం పనిచేయడం గొప్ప విషయమనీ అన్నందుకు ఆయన బ్రిటిష్ ఏజెంట్ అన్న నింద ఎన్నేళ్లు మోయవలసి వచ్చింది! ఆ నిందకు కాలం చెల్లిపోయిందని అనుకుంటున్న దశలో అరుణ్‌శౌరి దానికి మళ్లీ ప్రాణం పోయగలిగాడంటే ఆ 'దేశభక్తి' అనేది నిజంగానే అతి హేయమయిన పాపం అనిపిస్తుంది. అంబేద్కర్ గొప్పదనమేమిటంటే, దేశభక్తి అనే మాటకు భయపడి సాంఘిక విప్లవం కోసం పనిచేయడమే నిజమయిన దేశభక్తి అని వాదించే ప్రయత్నం (నాకు తెలిసి) చేయలేదు. చేస్తే తప్పు కాకపోవచ్చును గానీ చేయలేదు. తాను అత్యవసరమని భావించిన రాజకీయ కార్యాచరణలో తన పాటికి తాను నిమగ్నం అయ్యాడు.

ఈ ఉపోద్ఘాతానికి అర్థం, భారత స్వాతంత్ర్య పోరాటంలో ముస్లింల పాత్రను వెలికి తీయడానికి సయ్యద్ నశీర్ అహమ్మద్ చేసిన (ఇంకా చేస్తూనే ఉన్న) ప్రయత్నం వృధా అనిగానీ, గాడితప్పిన ప్రయాస అనిగానీ చెప్పడం కాదు. నశీర్ అహమ్మద్‌ది ప్రశంసనీయమైన కృషి అనడంలో సందేహమేమీ లేదు. ఒక నిందకు జవాబు వివిధ స్థాయిలలో చెప్పవచ్చు. నిందవేసే వారి విలువల పరిధిలోనూ జవాబు చెప్పవచ్చు. ఆ విలువలను విమర్శించడం ద్వారానూ చెప్పవచ్చు. తరచుగా రెండూ అవసరమవుతాయి. ఇప్పటివరకు మొదటి పని చేస్తూ వున్న నశీర్ అహమ్మద్ రెండవది కూడా మొదలుపెట్టగలడన్న ఆశతో ఈ నాలుగు మాటలు అనడం జరిగింది.

బ్రిటిష్ పాలన నుండి భారత్‌కు విముక్తి సాధించిపెట్టేదే దేశభక్తియుతమయిన రాజకీయాచరణ అని ఒప్పుకున్నా, ఆ రకమైన దేశభక్తి ప్రదర్శించిన వారే గొప్పవారనుకున్నా, అటువంటి గొప్పవారిలో ముస్లింల పాలు ఎంతమాత్రం తక్కువ కాదని నశీర్ అహమ్మద్ చాలా వివరంగా నిరూపించారు. అరుణ్‌శౌరీ వంటివారు రేపు ఏం మాట్లాడినా దానికి జవాబు చెప్పడానికి కావలసిన సమాచారం తెలుగు సమాజానికి అందిచ్చారు.

నిజానికి మనిషి ఆలోచనలకు ముఖ్యమైన మూలం – చుట్టూ ఉన్న పరిస్థితులనీ, వాటిలో మతం ఒకానొకటి మాత్రమేననీ, ఎప్పుడో తప్ప అదే ప్రధానం కాదనీ గుర్తించినట్టయితే బ్రిటిష్ వలస పాలనకు తొలినాడు వ్యతిరేకత హిందువుల కంటె ముస్లింలలోనే ఎక్కువ ఉండే అవకాశం ఉందని గ్రహించడానికి

నశీర్ అహమ్మద్ రచనలు చదవనక్కరలేదు – కొంచెం చరిత్ర తెలిస్తే చాలు. బ్రిటిష్‌వాళ్లు భారతదేశంలో రాజ్యాధికారం నెలకొల్పే ప్రయత్నం మొదలుపెట్టేసరికి ఇక్కడ పాలకులు ఎక్కువగా మతం రీత్యా ముస్లింలు. యుద్ధాలలో ఓడిపోయి బ్రిటిష్ వారికి అధికారం అప్పగించిందీ ఎక్కువగా ముస్లిం రాజులే. బ్రిటిష్ విజయాన్ని 'ముస్లింల' ఓటమిగా భావించడం 18, 19 శతాబ్దాలలో సాధారణ విషయంగా ఉండేది. బ్రిటిష్ పాలనను తొలినాడు హిందువుల కంటె ముస్లింలే ఎక్కువ నిరసించారు. హిందూ సమాజానికి చెందిన ఆధిపత్య వర్గాలు – బ్రాహ్మణ, కాయస్త, బనియా, రాజపుత్ర కులాలు – త్వరలోనే బ్రిటిష్ పాలనకు 'అడ్జస్ట్' అయ్యారు. పర్షియన్ మరచిపోయి ఇంగ్లీష్ నేర్చుకున్నారు. కొత్త పాలనలో తమ స్థితిగతులకు ఉచితమైన హోదా వెతుక్కున్నారు. ముస్లిం పాలకవర్గాలు, మధ్యతరగతి అంత సులభంగా అడ్జస్ట్ కాలేదు. బ్రిటిష్ వ్యతిరేకతను చాలా కాలం పోగొట్టుకోలేదు. ఈ కారణంగా వారు పాశ్చాత్యీకరణలో వెనకబడి 20వ శతాబ్దం వచ్చేసరికి అభివృద్ధిలోనూ హిందూ అగ్రకులాల కంటె వెనకబడిపోయారు. అది వేరే చరిత్ర.

అందువల్ల తొలినాటి నుండీ బ్రిటిష్ పాలనను వ్యతిరేకించిన వారిలో ముస్లింలు పెద్దసంఖ్యలో ఉండడం ఆశ్చర్యం కలిగించవలసిన విషయం కాదు. చరిత్రకు సంబంధించిన కనీస జ్ఞానం లేకుండ, తమ సంకుచితమైన నినాదాలే సత్యం అనుకునే వారిది వేరే సంగతి.

ఇక మామూలు జనం విషయానికొస్తే, బ్రిటిష్ వలసవాదం సంప్రదాయ వృత్తులపైన, వ్యవసాయ రంగంపైన వేసిన దుష్ప్రభావం మతంతో నిమిత్తం లేకుండా అందరి మీదా ఒకే విధంగా పడింది. కొందరు మౌనంగా సహించారు, కొందరు సాధారణ స్థాయిలో నిరసించారు, కొందరు తిరగబడ్డారు. అన్ని శ్రేణులలోనూ అన్ని మతాలవారూ ఉన్నారు. అయితే బ్రిటిష్ పాలన తొలుత స్థిరపడింది బెంగాల్‌లో కావడం వల్ల, జమీందారీ వ్యవస్థను తొలుత ప్రవేశపెట్టింది అక్కడే కావడం వల్ల, దానికి బలయిన బెంగాల్ రైతాంగం (ముఖ్యంగా తూర్పు బెంగాల్ రైతాంగం) ఎక్కువగా ముస్లింలు కావడం వల్ల, తొలినాటి గ్రామీణ అలజడులలోనూ ముస్లింల భాగస్వామ్యమే అధికం.

## టిప్పు విశిష్టత

పాలకవర్గ తిరుగుబాటుదార్లను మొదట తీసుకుంటే, బ్రిటిష్ వాళ్లు టిప్పు సుల్తాన్‌కు భయపడినంతగా వేరే ఎవరికీ భయపడలేదు. భయం అంటే కేవలం

సైనిక భయం కాదు. టిప్పుది హేతుబద్ధమైన ఆధునిక ఆలోచనారీతి. తన చుట్టూ ఉన్న ఇతర – హిందూ, ముస్లిం – వైరి రాజుల వల్ల తన రాజ్య సౌభాగ్యానికేం నష్టంలేదు గానీ, బ్రిటిష్ వారి విషయం వేరే అని స్పష్టంగా గ్రహించిన అతికొద్ది మంది ఇండియన్ పాలకులలో టిప్పు ఒకడు. తక్కినవాళ్ళు ఒకసారి కాకపోతే ఒకసారి తమ పొరుగు రాజులను ఓడించడానికి బ్రిటిష్ వారితో చేతులు కలిపారు గానీ టిప్పు ఒక్కడే ఆ పని ఎన్నడూ చేయలేదు. అందుకు భిన్నంగా, బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా దక్కన్‌లోని రాజ్యాలన్నిటినీ ఏకం చేయాలని (ఫ్రెంచి వారి సాయం కూడా తీసుకోవాలని) ప్రయత్నించాడు. తన ప్రయత్నాన్ని అర్థం చేసుకోలేకపోయిన తన ఇరుగు పొరుగు రాజుల తెలివితక్కువతనానికి విసుక్కున్నాడు. కానీ చివరి వరకు బ్రిటిష్ వారిని కేవలం మరొక వైరి రాజుగా చూడడానికి వీలులేదన్న తన అవగాహనను వదులుకోలేదు. చివరి మైసూరు యుద్ధంలో టిప్పుసుల్తాన్ చనిపోయాడని తెలిసి 'ఇక ఇండియా మనదే'నని బ్రిటిష్ సైనిక అధికారి ఒకరు సంతోషం పట్టలేక ప్రకటించాడనీ, టిప్పు సుల్తాన్‌ను ప్రశంసిస్తూ 'ప్రపంచం నిన్నూ నన్నూ మరచిపోయిన తరువాత చాలాకాలం వరకు కూడా టిప్పు సుల్తాన్‌ను జ్ఞాపకం పెట్టుకుంటుంది' అని గవర్నర్ జనరల్ వెల్లెస్లీ అన్నాడనీ చరిత్రకారులు చెప్తారు. నశీర్ అహమ్మద్ ప్రచురించిన పుస్తకాల పరంపరలో టిప్పు సుల్తాన్ మీద ప్రత్యేకంగా ఒక చిన్న రచన ('మైసూర్ పులి టిప్పు సుల్తాన్') ఉండడం ఉచితమే. దానిని విస్తరించి ఇంకా వివరంగా రాయగలిగితే బాగుంటుంది.

ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామం అనీ, సిపాయి తిరుగుబాటు అనీ వివిధ పేర్లతో పిలవబడే 1857 తిరుగుబాటు ఒక మతానికీ, ఒక మతస్తులకూ చెందినది కాదు గానీ, దానిని ఒకరి తిరుగుబాటుగా చూడదలచుకుంటే అది ప్రధానంగా ముస్లింల తిరుగుబాటు. బ్రిటిష్ వాళ్లు దానిని ఆ రకంగానే అర్థం చేసుకున్నారు. ఏక సమయంలో 1857ను మహత్తర స్వాతంత్ర్య పోరాటంగా ప్రస్తుతిస్తూ, ముస్లింలు స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనలేదని నిందించే వారికిది మింగుడుపడక పోవచ్చుగాక. ఆ పోరాటంలో పాల్గొన్న సంస్థానాధీశులంతా తమ సింహాసనాలు, రాచరికాలు కాపాడుకోవడానికే పాల్గొన్నారని వ్యాఖ్యానించేటట్టయితే అది ముస్లింలకెంత వర్తిస్తుందో హిందువులకూ అంతే వర్తిస్తుంది. రాజ్యాధికారం కోల్పోయామన్న దుగ్ధతోనే వారు కదిలినప్పటికీ అది స్వాతంత్ర్య పోరాటమేననుకుంటే అది ఝాన్సీరాణి లక్ష్మీబాయికి ఎంతమేరకు వర్తిస్తుందో, అవధ్ రాణి బేగం హజ్రత్ మహల్‌కూ అంతే వర్తిస్తుంది.

అయినప్పటికీ లక్ష్మీబాయి దేశభక్తికి చిహ్నంగా దేశమంతా పరిచయం కాగా (తెలుగునాట – కనీసం కోస్తాంధ్రలో – ఒక తరంలో ప్రతీ రెండవ ఇంటా ఒక ఝాన్సీ ఉండేది), బేగం హజ్రత్ మహల్ గురించి నశీర్ అహమ్మద్ వంటివారు చెప్తే తప్ప తెలియని దుస్థితి దేశానికి పట్టింది.

1857 మే నెల 10వ తేదీన మీరట్‌లో తిరగబడ్డ సిపాయిలు ఢిల్లీకి వచ్చి తమ తిరుగుబాటుకు నాయకత్వం వహించమని ఆఖరి ముఘల్ 'చక్రవర్తి' బహదూర్ షా జఫర్‌ను కోరగా, తొలుత అంతగా ఆసక్తి చూపని జఫర్ తరువాత అంగీకరిస్తాడు. నాలుగు నెలలపాటు సాగిన పోరాటానికి అతనే కేంద్రమయ్యాడు. తానొక్కడే పోరాడలేనని గ్రహించి దేశంలోని సంస్థానాధీశులందరికీ తనతో కలిసిరమ్మని ఆహ్వానం పంపాడు. ఇది ముఘల్ పాలన పునరుజ్జీవనానికి దారితీస్తుందన్న సందేహంతో కొందరు రాజులు తటపటాయించడాన్ని గమనించి, బ్రిటిష్ వారిని నిలువరించినట్టయితే దేశంలో సమాఖ్య తరహా పాలన నెలకొల్పుదామని కూడా జఫర్ సూచించాడు. దేశంలోని సంస్థానాధీశులంతా టిప్పు సుల్తాన్ లాంటివాళ్లయివుంటే – తమలో తమకు ఎన్ని ఘర్షణలున్నా బ్రిటిష్ వారి వ్యాప్తిని నిలువరించడానికి ఒకటి కావడం అవసరం అని గుర్తించి ఉంటే – జఫర్ సూచన కొంతయినా ఫలితం ఇచ్చేదేమో. అప్పుడు బ్రిటిషిండియా చరిత్ర ఏ విధంగా ఉండేదో! ముఘలుల పట్ల వ్యతిరేకత ఈ ఏకీకరణకు అడ్డం వచ్చిందన్న సూచనను మన 'దేశభక్తులు' ఏ విధంగా అర్థం చేసుకుంటారో, ఏ విధంగా వ్యాఖ్యానిస్తారో! ఆ వ్యతిరేకతే లేకపోయినట్లయితే మొదటి స్వాతంత్ర్య సంగ్రామమే చివరిది అయివుండేదని చెప్పడం నా ఉద్దేశ్యం కాదు గానీ ఆ సంగ్రామాన్ని అధికారం కోల్పోయిన ముస్లిం పాలకుల ప్రతిచర్యగా ఒక్క బ్రిటిష్‌వారే కాదు, చాలామంది సంస్థానాధీశులు చూసారనేది వాస్తవం. అయినప్పటికీ ఈనాటి దేశభక్తి భావనలో ప్రముఖ స్థానం ఉన్న ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామం అనే ఘట్టంలో బహదూర్ షా జఫర్‌కు గానీ, బేగం హజ్రత్ మహల్‌కు గానీ, మన హైదరాబాద్‌కు చెందిన రొహిల్లా యోధుడు తుర్రేబాజ్‌ఖాన్‌కు గానీ, సంఘ్‌పరివార్ ఆధ్యాత్మిక గురువు వినాయకరావు దామోదర్ సావర్కర్ సహితం మెచ్చుకున్న కాన్పూరు పాలకుడు నానాసాహెబ్ మిత్రుడు అజీముల్లాఖాన్‌కు గానీ, మద్రాసులో పుట్టి ప్రపంచమంతా తిరిగి లక్నోలో పోరాటంలో భాగమయిన మౌల్వీ అహ్మదుల్లా ఖాన్‌కు గానీ చోటులేకపోవడం ఏ రకంగానూ న్యాయం కాదు. ఈ పోరాటకారులొక్కక్కరి జీవితాన్నీ పాత్రనూ క్లుప్తంగానే అయినా చరిత్రకెక్కించడం నశీర్ అహమ్మద్ చేసిన మంచిపని.

రాజులు, రాణులు, సంస్థానాధీశులూ చేసిన పోరాటాలు ఒకెత్తయితే, ప్రజల నుండి గెరిల్లా పద్ధతిలో జరిగిన బ్రిటిష్ వ్యతిరేక తిరుగుబాట్లు ఇంకొకెత్తు. 19వ శతాబ్దం ఆద్యంతం ఆదివాసులు మధ్యభారతదేశంలో చేసిన తిరుగుబాట్లను దేశ స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా చూడడం మన దేశభక్తులింకా నేర్చుకోలేదు. అదే కోవకు చెందినవి పరిశుద్ధ ఇస్లాంను సిద్ధాంతంగా కలిగిన తిరుగుబాట్లు కూడ.

## ఇవీ స్వాతంత్ర్య పోరాటాలే

వహాబీ, ఫరాజీ, మోప్లా తిరుగుబాట్లు ఈ కోవకు చెందినవే. శుద్ధ ఇస్లాం అనే తాత్విక ధోరణి వీటిలో బలంగా ఉన్న కారణంగా వీటిని మతపరమయిన ఉద్యమాలుగా వర్గీకరించే అవకాశం ఉంది. బ్రిటిష్ పాలనా యంత్రాంగం ఆ పనే చేసింది. అయితే ఈ గెరిల్లా పోరాటాల విశేషం ఏమిటంటే ఇవి పుట్టింది ముస్లిం జమీందారులు, భూస్వాములు ఉన్న ఉత్తరప్రదేశ్ వంటి ప్రాంతాలలో కాదు. ముస్లింలు కాయకష్టం చేసుకుని బతికే రైతులుగా, కూలీలుగా – హిందువులు జమీందార్లు, భూస్వాములు, సంప్రదాయక పెత్తందార్లుగా ఉన్న తూర్పు బెంగాల్ (ఇవ్వాల్టి బంగ్లాదేశ్), మలబార్ (కేరళ రాష్ట్రం ఉత్తర భాగం) ప్రాంతాలలో. ఈ కారణంగా ఈ ఉద్యమాలు సారాంశంలో భూస్వామ్య వ్యతిరేక రైతాంగ పోరాటాలేనని విశ్లేషించిన వారున్నారు.

నశీర్ అహమ్మద్ ఈ పోరాటాలను స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా చూసి వీటి గురించి విస్తృతంగా రాశారు. ఇది చాలామంచి కృషి. 19వ శతాబ్దం ఆద్యంతం ఈ పోరాటాలు, వాటి పాయలు బ్రిటిష్ వారిని చాలా ఇబ్బంది పెట్టాయి. ఎక్కడ ఏ అలజడి జరిగినా దాని వెనక వహాబీ లేక ఫరాజీ ఆందోళనకారులున్నారేమో అని బ్రిటిష్ ఇండియా పాలకులు అనుమానించేవారు. 20వ శతాబ్దంలో పట్టణ ప్రాంతాల మధ్యతరగతికి చెందిన యువకులు హైందవ దృక్పథంతోనూ, సెక్యులర్ దృక్పథంతోనూ బ్రిటిష్ పాలనపై చేపట్టిన మిలిటెంట్ పోరాటాల గురించి మనకు బాగానే తెలుసును. బెంగాల్ విప్లవకారులకు, హిందుస్తాన్ రిపబ్లికన్ ఆర్మీకీ, గదర్ పార్టీకీ న్యాయమైన గుర్తింపు, గౌరవం లభించాయి. కానీ 19వ శతాబ్దంలో గ్రామీణ ప్రాంతాలలో ఆదివాసులు, బక్కచిక్కిన ముస్లిం రైతులూ అంతే పట్టుదలతో చేసిన మిలిటెంట్ పోరాటాలకు ఇప్పటికీ ఆ గుర్తింపు లేదు. నిజానికి 20వ శతాబ్దపు 'టెర్రరిస్టుల' కంటె వారే ఎక్కువ కాలం, ఎక్కువ పట్టుదలతో, ఎక్కువగా ప్రజలను సమీకరించి బ్రిటిష్ ఇండియా పాలకులపైన పోరాటం చేశారు.

18వ శతాబ్దపు ద్వితీయార్థంలో బెంగాల్ ప్రాంతంలో వచ్చిన తీవ్రమైన కరువుకు ప్రజలు పిట్టలవలె చనిపోతున్నప్పుడు కూడా తూర్పు ఇండియా కంపెనీ పాలనా యంత్రాంగం రెవెన్యూ వసూలును నిర్దయగా కొనసాగించింది. జనాభాలో దాదాపు మూడవ వంతు కరువు వాతపడి చనిపోయినప్పటికీ, రెవెన్యూ వసూలు పదిశాతం పెరిగిందని 1770–71 సంవత్సరపు రిపోర్టులో ఒక ఇంగ్లీష్ విశ్లేషకుడే అంచనా వేశాడంటే కంపెనీ క్రూరత్వం ఎంతటిదో అర్థం చేసుకోవచ్చు. అప్పటికే పది సంవత్సరాలుగా పరాయి పాలనకు వ్యతిరేకంగా ప్రజలకు ఉద్బోధిస్తున్న ముస్లిం ఫకీర్లు ఈ ఘోర క్షామ కాలంలో విజృంభించారు. వీరి నాయకుడు మజ్నూషా ఫకీర్. నాగాలుగా పిలవబడే హిందూ సన్యాసులు కూడా వారికి తోడయ్యారు. 1771 లో ఫకీర్ల సమావేశంపైన ఇంగ్లీష్ సైనికులు కాల్పులు జరిపి 150 మందిని చంపారు.

ఆ తరువాత ఫకీర్ల గెరిల్లా పోరాటం విస్తృతమై ప్రస్తుత బంగ్లాదేశ్, పశ్చిమ బెంగాల్, అస్సాం ప్రాంతాలకేకాక బీహార్, అస్సాం, భూటాన్, నేపాల్ ప్రాంతాలకు కూడా వ్యాపించింది. వాళ్లు ధాన్యం గిడ్డంగుల మీద దాడిచేసి ధాన్యాన్ని కరువు పీడిత ప్రజలకు పంచేవారు, వడ్డీ వ్యాపారుల వద్దనున్న రుణపత్రాలు తగలబెట్టారు, తూర్పు ఇండియా కంపెనీ ఏజెంట్లను కఠినంగా శిక్షించేవారు. ప్రజలను పీడించవద్దనీ, స్వచ్ఛందంగా ఇచ్చే చందాలు తీసుకోవాలే తప్ప బలవంతంగా డబ్బులు వసూలు చేపట్టకూడదనీ మజ్నూషా తన అనుచరులను ఆదేశించేవాడని బ్రిటిష్ అధికారులే చెప్పుకున్నారు. ఫకీర్లు, నాగా సన్యాసులు కలిసి పోరాటం చేయడం వల్ల ఏ హిందూ ముస్లిం ఐక్యత అసాధ్యం అని బ్రిటిష్‌వారు తమకు తాము నచ్చజెప్పుకున్నారో అది సాధ్యమేనని రుజువు చేశారు కూడా. అయితే కంపెనీ అధికారులు విపరీతమైన హింస ప్రయోగించి క్రీ.శ. 1800 నాటికి ఫకీర్ల తిరుగుబాటును అణచివేశారు.

బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా రాజులు, నవాబులు, వివిధ సంస్థానాధీశులు అప్పటికే తిరుగుబాట్లు చేస్తున్నారు. అందులో సూత్రబద్ధమైన వలసవాద వ్యతిరేకత పాలు ఎంత, కేవలం తమ ప్రశాసనాన్ని కాపాడుకోవాలన్న ఆరాటం ఎంత అంటే అందరికీ వర్తించే సూత్రీకరణ చేయడం కష్టం. అయినప్పటికీ వారి ప్రతిఘటన మొత్తం స్వాతంత్ర పోరాటంలో భాగంగానే గుర్తించబడుతున్నది. కాగా, ప్రజల వైపు నుండి జరిగిన మొట్టమొదటి విస్తృత సమీకరణ, పోరాటం ఫకీర్లు నాయకత్వం వహించినదే. వీరికి హిందూ సన్యాసులూ తోడయ్యారు. దీనిని

ఏ విధంగా అర్థం చేసుకోవాలి? హైందవ సమాజంలో సన్యాసులు, భారతీయ ముస్లిం సమాజంలో ఫకీర్లు, సమాజం కట్టుబాట్లకు ఎడంగా ఉండి ప్రజల మీద జరిగే అణచివేతకూ అన్యాయానికీ వ్యతిరేకంగా గొంతు విప్పేవారనీ, నిరసనకు గళం ఇచ్చేవారనీ రొమిల్లా థాపర్ వంటి విశ్లేషకులు గుర్తించారు. ఈ ఫకీర్ల–సన్యాసుల తిరుగుబాటు ఆ సంప్రదాయక పాత్రనే బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా నిర్వహించిందనుకోవాలా? లేకపోతే మతభావాల ప్రేరణతో జీవించే ఫకీర్లు క్రైస్తవ పాలనను సహించలేక 'ఫిరంగీ'లను పారద్రోలమన్న నినాదంతో తిరగబడ్డారనుకోవాలా? 'ఆధునికత'కు వ్యతిరేకంగా 'సంప్రదాయకత' చేసిన తిరుగుబాటు అనుకోవాలా? లేక కోల్పోయిన ముస్లిం రాజవంశాల, సంస్థానాధీశుల వైభవాన్ని తిరిగి సాధించడం కోసం పోరాడారనుకోవాలా? లేక అది కరువు పీడిత రైతాంగాన్ని వలస పాలకులకూ, వారి ఏజెంట్లయిన జమీందార్లకూ వ్యతిరేకంగా సమీకరించిన వర్గపోరాటం అనుకోవాలా? బెంగాల్ ప్రాంతంలో జమీందార్లు ఎక్కువగా హిందువులు, రైతులు ఎక్కువగా ముస్లింలు అన్న విషయాన్ని దృష్టిలో పెట్టుకొని ఇది హిందువుల సంపదను దోచుకున్న ముస్లిం తిరుగుబాటు అనుకోవాలా?

ఈ ప్రశ్నలకు వివరంగా జవాబు చెప్పుకోవడానికి కావలసిన సమాచారం చరిత్రకారులకు అందుబాట్లో ఉందో లేదో! అది మన చేతిలో లేని పరిమితి కాగా, బ్రిటిష్ పాలనను మొత్తంగా అంతమొందించి దాని స్థానంలో ఏకీకృత స్వదేశీ రాజ్యాన్ని నెలకొల్పే ప్రయత్నాన్ని మాత్రమే స్వాతంత్ర పోరాటంగా అర్థం చేసుకునే వైఖరి భావజాల సంబంధమైన పరిమితి. దీనిని వదులుకొని, బ్రిటిష్ వలస పాలన ఫలితాలను నిరసించి దానిని తొలగించాలన్న సంకల్పంతో ఏ ప్రత్యామ్నాయాన్ని దృష్టిలో పెట్టుకొని పనిచేసినా, అసలు ఏ ప్రత్యామ్నాయమూ స్పష్టంగా లేకున్నా – అది స్వాతంత్ర పోరాటంలో భాగమేననుకుంటే ఫకీర్ల తిరుగుబాటు స్వాతంత్ర పోరాటాలలో భాగమే. ఒక ముఖ్యమైన భాగమే.

## వహాబీ ఉద్యమం

ఫకీర్ల తిరుగుబాటు అంతమైన తరువాత బెంగాల్ నుండే మళ్లీ మొదలయిన వహాబీ–ఫరాజీ ఉద్యమాలకు కూడా ఇది వర్తిస్తుంది. వీటిలో మత ప్రేరణ ఇంకా ఎక్కువ. ముస్లింలు పరాయి ప్రభావానికి లోనయి తమ తమ ఆచారాలను మరచి ప్రవర్తిస్తున్నారన్న ఆవేదనతో, శుద్ధమైన ఇస్లామిక్ ఆచరణను తిరిగి ప్రవేశపెట్టే

లక్ష్యంతో అరేబియాకు చెందిన అబ్దుల్ వహాబ్ మొదలుపెట్టిన కఠినమైన సంస్కరణను వహాబీ ఉద్యమం అంటారు. ఇది అరేబియాకు పరిమితిమై ఉండలేదు. ముస్లిం ప్రపంచమంతటా వ్యాపించింది. ఈ ఉద్యమాన్ని ఆధునికతకు వ్యతిరేకంగా సంప్రదాయకత చేసిన తిరుగుబాటుగా అర్థం చేసుకున్న వారున్నారు. ఇస్లాం అరేబియా నుండి బయటకు వ్యాపించిన క్రమంలో ముస్లిం సమాజంలో అనివార్యంగా వచ్చి చేరిన భిన్నత్వాన్ని నిరసించిన మూర్ఖవాదంగా విశ్లేషించినవారూ ఉన్నారు. ఇవి రెండూ కొంతమేరకు నిజమే కావచ్చు. వారి కఠోరమైన వ్యవహారశైలి వల్ల వహాబీలు పనిచేసిన ప్రాంతాలలో పరమతస్తులతో ఘర్షణలు రావడమే కాదు, ముస్లింలలోనే వ్యతిరేకత చాలా వచ్చింది. ఈ 'శాంతి భద్రతల' కోణం వహాబీలను అణచివేయడానికి బ్రిటిష్ వారికి బాగా తోడ్పడింది కూడా.

అయితే ముస్లిం సమాజంలో ఒక కఠినమైన అంతర్గత సంస్కరణ ఉద్యమంగా ప్రారంభమైనది– ఇండియాకొచ్చేసరికి క్రైస్తవ పాలనను తొలగించి ఇస్లామిక్ రాజ్యాన్ని నెలకొల్పాలన్న రాజకీయ నినాదంగానూ మారింది; అత్యధికంగా బక్కచిక్కిన వ్యవసాయదారులు, చేతివృత్తుల వారు అయిన ముస్లిం ప్రజల మీద ప్రభుత్వము, జమీందార్లు, వడ్డీ వ్యాపారులు అమలు చేస్తున్న అణచివేతను బలంగా వ్యతిరేకించిన మిలిటెంట్ పోరాటంగానూ మారింది. కరువు పీడిత బెంగాల్‌లో టిటూమీర్ (మీర్ నిస్సార్ అలీ) నాయకత్వంలో నడిచిన వహాబీ ఉద్యమానికి ఈ చివరి లక్షణం దండిగా ఉండింది. వహాబీ ఉద్యమంలోని ఈ భిన్న కోణాలలో ఈనాటి రాజకీయ సందర్భంలో ఒక్కొక్కరికీ కొన్ని కొన్ని నచ్చుతాయి, కొన్ని నచ్చవు కాబట్టి వీటిలో ఏదో ఒక దానిని ఎంపిక చేసుకొని ఇదే వహాబీ ఉద్యమం అసలు గుణం అని విశ్లేషించడం జరుగుతుంటుంది. విశ్లేషకులకు 'అసలు విషయం'గా కనిపించేది లౌకిక ప్రజాతంత్ర వర్గపోరాటం కావచ్చు, కరడుగట్టిన మతవాదం కావచ్చు. కానీ ఈ విశ్లేషకులు ఊహించుకునే తేడాలు, విభజన రేఖలు వహాబీ ఉద్యమంలో నిజంగా ఉన్నాయని రుజువు చేయడం కష్టం. ఒక కాలానికి, ఒక దృష్టి కోణానికి పరస్పరం అసంబద్ధంగా తోచే విషయాలు మరొక కాలానికీ మరొక దృష్టి కోణానికీ ఆ విధంగా తోచకపోవచ్చు.

అదెట్లాగున్నా ఒకటి మాత్రం సత్యం. బ్రిటిష్ పాలకులు 19వ శతాబ్దం యావత్తూ చాలా ఆందోళన చెందిన మిలిటెంట్ పోరాటం వహాబీ ఉద్యమం. పంతొమ్మిదవ శతాబ్దం తొలి దశాబ్దాల నాటికే ఆచార వ్యవహారాల సంస్కరణ

ఉద్యమంగానూ, సామాజిక స్థితిగతుల పట్ల నిరసన ఉద్యమంగానూ ముస్లిం సమాజంలో వహాబీ ఆలోచనారీతి బాగా వ్యాపించింది. గ్రామీణ రైతాంగం, పట్టణ ప్రాంత దిగువ మధ్యతరగతి, నిరుద్యోగ యువత దాని పట్ల బాగా ఆకర్షితులయ్యారు. 1831లో బెంగాల్‌లోని పూర్వా అనే గ్రామం జమీందారు కృష్ణదేవరాయ్ గడ్డంపెట్టుకునే ముస్లింలపైన పన్ను విధించడంతో వహాబీల తిరుగుబాటు మిలిటెంట్ రూపం తీసుకుంది. తన మాట విననందుకు గుంపును పోగుచేసి ముస్లింలపైన దాడిచేసి వారి మసీదును ధ్వంసం చేసిన జమీందారు చర్యకు నిరసనగా టిటూమీర్ నాయకత్వంలో మొదటి పెద్దదాడి జరిగింది. ఆ తరువాత జమీందార్లపైన, 'ఫిరంగీల'పైన దాడులు కొనసాగాయి. మతపరమైన అవమానానికి నిరసనగా మొదలైన తిరుగుబాటు మొదట్లో మత అసహనాన్ని ప్రదర్శించినా ఆ తరువాత జమీందార్లు, నీలిమందు ప్లాంటర్లు, తూర్పు ఇండియా కంపెనీ పాలకుల దోపిడీ దౌర్జన్యాలను ఎదుర్కొన్న మిలిటెంట్ పోరాటంగా వహాబీ ఉద్యమం బెంగాల్ అంతటా వ్యాపించింది. ఉద్యమం ముస్లింలకే పరిమితం అయినప్పటికీ తూర్పు బెంగాల్ ప్రాంతంలో ముస్లింలు మెజారిటీగా ఉన్న రైతాంగంపైన హిందువులు మెజారిటీగా ఉన్న జమీందార్ల దోపిడీ దౌర్జన్యాలు ఒక సామాజిక వాస్తవం కాబట్టి ఇది రైతాంగ తిరుగుబాటు స్వభావాన్ని కలిగి ఉంది. హిందువులయినా తమకు అడ్డం రాకపోతే ఏమీ చేయవద్దనీ, ముస్లింలయినా తమకు అడ్డం వస్తే క్షమించవద్దనీ టిటూమీర్ తన అనుచరులను ఆదేశించిన విషయం విశ్లేషకులు చెప్తారు. హిందూ సమాజానికి చెందిన పేద రైతాంగమూ వహాబీలకు సహకరించిన సందర్భాలున్నాయి.

పూర్వా గ్రామంలో జమీందారు అనాగరిక వైఖరికి వ్యతిరేకంగా మొదలయిన వహాబీల పోరాటం త్వరలోనే కంపెనీ సేనలతో యుద్ధంగా మారి ఒక సంవత్సరం పాటు సాగింది. చివరి ఘట్టంలో టిటూమీర్‌తో సహా 50 మంది చనిపోగా, మరొక ముఖ్యుడు గులాం మాసుంను కంపెనీ పాలకులు బహిరంగంగా ఉరి తీశారు. ఇంకొక 197 మందికి కఠిన శిక్షలు వేశారు. అయితే వహాబీ తత్వం, ఉద్యమం దేశమంతటా వ్యాపించి 19వ శతాబ్దం చివరి దాకా బ్రిటిష్ పాలకులను ఇబ్బంది పెడుతూనే ఉంది. ఈ కథను అహమ్మద్ 'భారత స్వాతంత్ర్యోద్యమం – ముస్లిం ప్రజా పోరాటాలు' అనే ప్రచురణలో వివరంగా చెప్పారు. వహాబీలు వలస పాలనకు వ్యతిరేకంగా చేసిన పోరాటాలను ప్రశంసిస్తూ, వారి మతపరమైన అసహనం వల్ల జరిగిన నష్టాన్ని వివరించారు.

## ఫరాజీ ఉద్యమం

వహాబీ ఉద్యమం తరువాత వచ్చిన ఫరాజీ ఉద్యమం కూడా స్థూలంగా అదే స్వభావాన్ని కలిగినది. 'ఫర్జ్' అనే మాట నుండి 'ఫరాజీ' పుట్టింది. ఫర్జ్ అనేది సాధారణ సంభాషణలో అనుల్లంఘనీయమైన విధి లేక కర్తవ్యం అన్న అర్థాన్ని ఇస్తుంది. అది ధార్మిక కర్తవ్యం కానవసరం లేదు. కానీ ఫరాజీ ఉద్యమకారులు ప్రయోగించిన అర్థంలో అది ధార్మికమే. ముస్లింల జీవిత ఆచారాలలోకి వచ్చి చేరిన అన్య ప్రభావాలను తొలగించడం, శత్రువు పాలనలో ఉన్న దేశాన్ని విముక్తిచేసి ఇస్లామిక్ రాజ్యాన్ని నెలకొల్పడం వారు ఎంచుకున్న కర్తవ్యాలు. ఫరాజీ ఉద్యమ వ్యవస్థాపకుడు తూర్పు బెంగాల్‌లోని ఒక చేనేత కార్మిక కుటుంబంలో పుట్టిన హాజీ షరియతుల్లా. ఇతను హజ్‌కు మక్కాకు పోయి వహాబీ ఉద్యమాన్ని గురించి తెలుసుకొని ఇండియాకు తిరిగి వచ్చిన తరువాత అదే నమూనా గల కర్తవ్యాన్ని తనకు తాను నిర్దేశించుకున్నాడు.

శుద్ధ ఇస్లాం ప్రబోధం కారణంగా ఫరాజీలకు ముస్లింలతోనే ఘర్షణ ఏర్పడగా, ఫిరంగీ రాజ్యాన్ని పారదోలాలన్న లక్ష్యంతో జమీందార్లకు శిస్తు చెల్లించవద్దన్న పిలుపు ఇవ్వడం వల్ల జమీందార్లతోనూ పాలనా యంత్రాంగంతోనూ ఘర్షణ ఏర్పడింది. పాలనా యంత్రాంగం షరియతుల్లానూ, అతని అనుచరులనూ అణచివేసే కొద్దీ జమీందార్ల దోపిడీకీ, ఇండిగో ప్లాంటర్ల దోపిడీకీ గురైన రైతాంగానికి అతను విముక్తి సంకేతం అయ్యాడని సమకాలీన బ్రిటిష్ వ్యాఖ్యాతలే అన్నారు. అతని కొడుకు దూదుమియా (మహమ్మద్ మోసిన్) నాయకత్వంలో ఫరాజీ ఉద్యమంలో ధార్మిక కోణం తగ్గి రాజకీయార్థిక కోణం పెరిగిన కారణంగా అది ప్రధానంగా జమీందార్లు, కంపెనీ పాలకులు, ఇండిగో ప్లాంటర్ల వ్యతిరేక పోరాటంగా సాగింది. తన ముస్లిం స్వభావాన్ని వదులుకోకపోయినా, వైరుధ్యం రాకపోవడానికి కారణం తూర్పు బెంగాల్‌లో రైతాంగం, నేత కార్మికులు ఎక్కువగా ముస్లింలు కావడం, ధనిక వర్గాలకు చెందిన ముస్లింలకు ఫరాజీల ధార్మిక ప్రచారమూ రాజకీయార్థిక ప్రణాళికా నచ్చకపోవడం వల్ల వారు (కొన్ని మినహాయింపులతో) జమీందార్లతో ప్లాంటర్లతో ఒకటి కావడం. పేద హిందువులు ఎంత మేరకు ఫరాజీ ఉద్యమంలో భాగం అయ్యారన్న విషయంలో సమాచారం అంతగా లేదుగానీ బ్రిటిష్ నివేదికలలో తరచుగా పేదలంతా దూదుమియా వెంట పోయారన్న భావం వ్యక్తమయిన మాట వాస్తవం.

1847 నాటికే తూర్పు బెంగాలులో ఫరాజీల వెనక 50 వేల జనం ఉన్నారని తూర్పు ఇండియా కంపెనీ నివేదికలు తెలియజేస్తాయి. వారు గ్రామాలలో సమాంతర పాలనా యంత్రాంగాన్ని సైతం నెలకొల్పారు. ఈ ఫరాజీ ఖలీఫత్ (పాలనా వ్యవస్థ) ధార్మిక వ్యవహారాలనూ లౌకిక వ్యవహారాలనూ కూడ చూసుకునేది. అందులో ముస్లిమేతరులు ఉండడమే కాక మైనారిటీలయిన హిందువుల, క్రైస్తవుల మత విశ్వాసాలు దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకున్నారని కూడ సమకాలీన బ్రిటిష్ వ్యాఖ్యాతలన్నారు.

ప్రజలను పెద్దఎత్తున సమీకరించి మిలిటెంట్‌గా దాడులు చేయడానికి వెనకాడని దూదుమియాకు వ్యతిరేకంగా డన్‌లప్ అనే నీలిమందు ప్లాంటర్ కంపెనీ అధికారులను, జమీందారులను సమీకరించాడు. ఇది దాడులు, ఎదురుదాడులు, క్రిమినల్ కేసులకు దారితీసిన వైనం నశీర్ అహమ్మద్ తన 'ముస్లిం ప్రజా పోరాటాలు' పుస్తకంలో చక్కగా వివరించారు. పోలీసు యంత్రాంగం ఈ ప్లాంటర్ తొత్తులుగా మారి దూదుమియాపైన తప్పుడు కేసులు పెట్టి సతాయించిన విషయాన్ని ఈ ఘర్షణపైన విచారణ జరిపిన బ్రిటిష్ అధికారులు సహితం గుర్తించారు.

1857 సంగ్రామం గురించి చాలా తెలిసిన వారికి సహితం తెలియనిది ఏమిటంటే ఆ పోరాటంలో ఫరాజీలు చురుగ్గా పాల్గొన్నారని. అప్పటికి పది సంవత్సరాల ముందే 50 వేల అనుచరగణం ఉన్నట్టు కంపెనీ పాలకులే గుర్తించిన ఫరాజీ ఉద్యమమే 1857 సంగ్రామంలో ప్రధాన ప్రజా ఉద్యమం. తక్కిన పాయలెక్కువగా అప్పటికప్పుడు ఏర్పడిన చిన్న చిన్న బృందాలు, లేక సంస్థానాధీశుల సైనిక బృందాలు. అప్పటికే సంఘటితంగా ఉండి కంపెనీ పాలన మీదా, జమీందార్ల మీదా అనేక పోరాటాలు చేసిన ఫరాజీలు ఆ తిరుగుబాటులో పాల్గొనడం బ్రిటిష్‌వారిని చాలా కలవరపెట్టిందనడానికి గల నిదర్శనాలు నశీర్ అహమ్మద్ అనేకం ఉటంకించారు. అందులో ప్రధానమైనది దూదుమియాను ఒక సంవత్సరన్నర కాలం నిర్బంధించి 1857 తిరుగుబాటును మొత్తంగా అణచివేసే దాకా విడిచి పెట్టకపోవడం.

1857 తిరుగుబాటు చల్లారిన తరువాత కూడా ఫరాజీల పోరాటం కొనసాగింది. దాదాపు 19వ శతాబ్దం చివరి భాగం దాకా అది సజీవంగానే కాక చురుకుగానూ ఉంది. అయితే వహాబీల లాగ వీరు కూడా 'పరిశుద్ధ ఇస్లాం'కు

తమను తాము ప్రతినిధులుగా భావించుకోవడం వల్ల, పరిశుద్ధ ఇస్లాంను ఈ గడ్డ మీద అప్రతిహతంగా నిలబెట్టాలనుకోవడం వల్ల, ఇతర మతస్తులనే కాదు, ముస్లింలను సహితం చాలావరకు దూరం చేసుకున్నారు. తమతో ఏకీభవించని ముస్లిం ప్రజలనే కాదు, మౌల్వీలను సహితం కించపరచడం వల్ల తమ మతంలోనే ధార్మిక విషయంలో ఒంటరివారయ్యారు. ఈ బలహీనత ఫరాజీ ఉద్యమానికి నష్టదాయకమయింది.

## మోప్లా పోరాటం

వహాబీ, ఫరాజీ ఉద్యమాలతో సమాంతరంగా సాగి వాటి కంటె ఎక్కువ కాలం మనగలిగిన 'ముస్లిం' రైతాంగ పోరాటం మోప్లా పోరాటం. కేరళ రాష్ట్రం ఉత్తర భాగాన ఉన్న మలబారులో ముస్లింలు అధిక సంఖ్యలో నివసిస్తారు. మోప్లా అనేది మలబారుకు చెందిన ముస్లింలను మలయాళ భాషలో పిలిచే పేరు. మలబారులోని భూ సంబంధాలలో మోప్లాలు అడుగున ఉన్న రైతులు, కూలీలు కాగా భూమి ముఖం ఎన్నడూ చూడకుండా రైతు కష్టం మీద బతికే 'జెన్మి' (భూస్వామి) హిందూ అగ్రకులాలకు చెందినవాడు. రైతులలో 70 శాతం మోప్లాలు కాగా, భూమిలో 40 శాతం జెన్మిలది. మైసూరు రాజు టిప్పు సుల్తాన్ మలబారును జయించినప్పుడు ఈ 'జెన్మి'ల హక్కులు తొలగించి రైతులకే భూమిమీద హక్కు కల్పించాడు. 1799లో నాల్గవ మైసూరు యుద్ధంలో టిప్పు ఓడిపోయి మలబారు తూర్పు ఇండియా కంపెనీ హస్తగతం అయిన తరువాత జెన్మిల అధికారాన్ని కొత్త రూపంలో తిరిగి ప్రవేశపెట్టడం జరిగింది. కొంతకాలం స్వేచ్ఛ, హక్కులు రుచిచూసిన మోప్లా రైతాంగం జెన్మిల మీద, వారి అధికారాన్ని నిలబెట్టిన బ్రిటిష్ వారి మీద తిరుగుబాటు చేశారు. 1800లో మొదలయిన ఈ తిరుగుబాటు 1922 దాకా సాగింది. 'భూస్వాముల మీద ప్రారంభమైన ఈ తిరుగుబాటు భూస్వాముల మద్దతుదారులు, బ్రిటిష్ పోలీసులు, న్యాయస్థానాలు, ఈస్ట్ ఇండియా కంపెనీ పాలకులు, చివరికి బ్రిటిష్ సైనికులు, అధికార్ల మీద' ఎక్కుపెట్టబడింది అని చారిత్రక పరిశోధనల ఆధారంగా నశీర్ అహమ్మద్ అంటారు.

మోప్లాలు తమ మొట్టమొదటి చర్యగానే జార్జి వాడెల్ అనే తూర్పు ఇండియా కంపెనీ అధికారిని హతమార్చారు. దానికి ప్రతీకారంగా కంపెనీ బలగాలు ముగ్గురు మోప్లా నాయకులను కాల్చి చంపాయి. దానితో కొంతకాలం స్తబ్దం

అయిన మోప్లా తిరుగుబాటు 1821 నుండి మళ్లీ విజృంభించింది. 1921 లోపు 51 పోరాటాలు జరిగాయని బ్రిటిష్ పరిశోధకులు లెక్కపెట్టారు.

ఉర్దూలో మౌల్వీ లేక ముల్లా అనే మతగురువును మోప్లాలు మాట్లాడే మలయాళంలో తంగల్ అంటారు. తంగల్‌ల నాయకత్వంలో భూస్వాములయిన జెన్మిలపైన, వారిని కాపాడుతున్న తూర్పు ఇండియా కంపెనీ పైన పోరాటం చేయడం తమ ధార్మిక విధి అని మోప్లాలు భావించారు. ఖురాన్ అటువంటి పోరాటాన్ని బోధిస్తుందని నమ్మారు. ఈ విధంగా జెన్మిలకూ, వారి సంరక్షకులకూ వ్యతిరేకంగా మోప్లా రైతాంగం చేసిన పోరాటానికి ధార్మిక స్వభావం వచ్చింది.

పోరాటంలోకి దిగిన మోప్లాలు కర్మకాండను పోలిన తంతు నిర్వహించేవారని నశీర్ అహమ్మద్ సవివరంగా చెప్తారు. శత్రువుకు సజీవంగా చిక్కకూడదన్న నిర్ణయం కారణంగా మరణమే వారి అంతిమ మజిలీ. అందుకే పోరాటంలోకి పోయేముందే ఆస్తిని భార్య, పిల్లలకు పంచేసి, భార్యకు విడాకులిచ్చేవారు. ఒకరికంటె ఒకరు బలవంతులయిన శత్రువులనెంచుకొని ద్వంద్వ యుద్ధానికి సవాలు చేసి తాము చచ్చేదాకా శత్రు సంహారం చేసేవారు. 1821–1921 మధ్య జరిగిన ఈ 51 పోరాటాలలో ఒక్కదాని వివరాలైనా ఇక్కడ ఇవ్వడం ఉచితంగా ఉంటుంది.

ఈ తిరుగుబాటు 1849 ఆగస్టు 25న మొదలయింది. అతన్ గురుక్కల్ అనే తంగల్ నాయకత్వంలో జరిగింది. రైతాంగాన్ని పీడిస్తున్న పండిక్కడ్ నంబూద్రి అనే జెన్మి కచ్చేరి మీదికి అతను 15 మందితో వెళ్లి అక్రమ వసూళ్లను ప్రశ్నించాడు. జెన్మి జారుకున్నాడు. మోప్లాలు అక్కడినుండి ఆ జెన్మికి అధిపతి అయిన మంజేరి రాజా భవనం మీదికి పోయారు. వారి రాక గురించి తెలుసుకున్న బ్రిటిష్ సైనికులు, పోలీసులు రాజాకు అండగా మంజేరికి బయలుదేరారు. కానీ మోప్లాల దాడికి సైనికులు తట్టుకోలేక పరారయ్యారు.

ఆ తరువాత మోప్లాలు తమ మార్చ్ కొనసాగించారు. వేరే ఊర్ల నుండి వచ్చిన మోప్లాలు వారితో చేరడంతో వారి సంఖ్య పెరిగింది. దారిలో ముస్లింలే కాక ముస్లిమేతర రైతాంగం సహితం వారికి తిండి, నీళ్ళు, వసతి ఏర్పాటు చేశారు. వారిని అట్లాగే సాగనిస్తే పెద్ద తిరుగుబాటు జరగగలదని గ్రహించిన కంపెనీ సైనికులు పెద్దఎత్తున సమీకృతమై మోప్లాల పైన దాడిచేశారు. భీకరంగా సాగిన ఈ పోరులో 64 మంది మోప్లాలు చనిపోయారు. బ్రిటిష్ సైనికులు అయిదుగురు మాత్రమే చనిపోయారు.

అయితే మోప్లాలది కేవలం తమను పీడిస్తున్న జెన్మిల మీద పోరాటం కాదనీ, తూర్పు ఇండియా కంపెనీ పాలనను అంతం చేసే ఆలోచనా వారిలో ఉండిందనీ గుర్తించడానికి నిదర్శనం ఏమిటంటే 1857 తిరుగుబాటు ప్రారంభం అయిందని తెలియగానే వారు కనబరచిన స్పందన. ఉత్తర హిందుస్థానంలో తిరుగుబాటు మొదలయింది, ఇక మనం కూడా కదలాలి అని మలబారు ప్రాంతంలో వారు ప్రచారం మొదలుపెట్టారు. అయితే ఆదిలోనే ఈ విషయాన్ని బ్రిటిష్ పాలకులు పసిగట్టి ఈ ప్రయత్నానికి పూనుకున్న నాయకులను అరెస్టుచేసి జైలులో పడేశారు.

1920ల నాటికి మోప్లా తిరుగుబాటు కాంగ్రెస్ వారు చేపట్టిన ఖిలాఫత్ ఉద్యమంలో భాగమైన వైనం, సహాయ నిరాకరణోద్యమం ద్వారా గాంధేయ రాజకీయాలలో భాగమైన వైనం, అయితే తమ పద్ధతిలో దానికి మిలిటెంట్ రూపం ఇచ్చి పెద్దఎత్తున తిరగబడి బ్రిటిష్ పాలనా యంత్రాంగాన్ని తరిమేసి 'ఖిలాఫత్' రాజ్యాన్ని ఒక ప్రాంతంలో ఏర్పాటు చేసిన వైనం, తరువాత బ్రిటిష్ పాలకులు వారిపైన విరుచుకుపడి అతి క్రూరంగా వేల మందిని చంపి ఆ పోరాటాన్ని అణిచిన వైనం, నశీర్ అహమ్మద్ మాటలలోనే 'ముస్లిం ప్రజా పోరాటాలు' పుస్తకంలో చదివితే బాగుంటుంది.

ఇది స్వాతంత్ర్య పోరాటాలుగా గుర్తింపు పొందని ముస్లిం ప్రజల విషయం కాగా, గుర్తింపు పొందిన పోరాటాలలో ముస్లింల పాత్రను తక్కువచేసి చెప్పడం లేదా అసలే కనుమరుగు చేయడం జరిగిందని నశీర్ అహమ్మద్ అభియోగం. మొదటి స్వాతంత్ర్య సంగ్రామంగా గుర్తింపు పొందిన 1857 తిరుగుబాటులో లోతుగా పాల్గొన్నప్పటికీ లక్ష్మీబాయి, తాంతియాతోపేలతో సమానంగా గుర్తింపు పొందని ముస్లింల గురించి పైన చూశాం.

## అష్ఫాఖుల్లాను ఎందుకు తక్కువచేశారు?

హిందుస్థాన్ రిపబ్లికన్ అసోసియేషన్ సభ్యుడు, కాకోరి కుట్ర కేసులోని ఏకైక ముస్లిం ముద్దాయి అయిన అష్ఫాఖుల్లా ఖాన్ గురించి నశీర్ అహమ్మద్ రాసిన చిన్న పుస్తకం చదివిన వారెవరినైనా, అష్ఫాఖుల్లా ఖాన్ వేరే ఏ రకంగానూ భగత్‌సింగ్‌కూ, చంద్రశేఖర్ ఆజాద్‌కూ తీసిపోకున్నా కేవలం ముస్లిం అయినందుకు ఎదుర్కొన్న అవమానాలూ, సందేహాలూ బాధించక మానవు. అప్పటికే విప్లవకారుడిగా పేరుప్రతిష్ఠలు సంపాదించుకున్న రాంప్రసాద్ బిస్మిల్ తన ఊరివాడే అయినా అతనికి తనపైన నమ్మకం కలిగించి హిందుస్థాన్ రిపబ్లికన్ అసోసియేషన్‌లో సభ్యత్వం పొందడానికి అష్ఫాఖుల్లా ఖాన్ చాలా అవమానాన్ని

భరించవలసి వచ్చింది. ఆ 'విప్లవకారుడు' ముస్లింలను అనుమానించడం తన హక్కయినట్లు ప్రవర్తించగా, అతనిని మంచి చేసుకొని, అతని మనసు గెలుచుకొని, ఆ సంస్థలో తానూ సభ్యత్వం పొందడానికి అష్ఫాఖుల్లా చాలా కష్టపడవలసి వచ్చింది. గాంధీ మార్గాన్ని తిరస్కరించిన పోరాటకారులందరిలోకీ భగత్‌సింగ్ ఎక్కువ గౌరవం పొందడానికి కారణం అతను లౌకికవాది, ప్రజాతంత్రవాది, సమసమాజవాది కావడం; తన లక్ష్యాల కోసం చిరునవ్వుతో ఉరికంబం ఎక్కడం. కాని భగత్‌సింగ్ కంటే నాలుగేళ్ళు సీనియర్ అయిన అష్ఫాఖుల్లాఖాన్ ఆలోచనలలోనూ ఆ లక్షణాలన్నీ ఉన్నాయి. అతనూ 27వ ఏట నిశ్చల చిత్తంతో ఉరికంబం ఎక్కాడు. అయినప్పటికీ 'ముస్లిం' అన్న ముద్రను జయించనిదే అతనికి విప్లవకారుల బృందంలో చోటు లభించలేదు. 'ఈ పరిస్థితి ఆనాడు ఒక్క అష్ఫాఖాన్‌కు మాత్రమే పరిమితం కాలేదు. మాతృదేశం కోసం ప్రాణాలు తృణప్రాయంగా భావించిన ముస్లిం విప్లవకారులలో పలువురికి ఈ చేదు అనుభవాలు తప్పలేదు' అన్న నశీర్ అహమ్మద్ వ్యాఖ్య సగటు పాఠకులకు సిగ్గు కలిగించక మానదు.

సమీక్ష ఎక్కడో ఒకచోట ఆపాలి కాబట్టి ఇక్కడ ఆపుతాను. నశీర్ అహమ్మద్ జాతీయోద్యమ రాజకీయాలలో ముస్లింల పాత్ర గురించి, స్థానం గురించి జరిగిన పరిశోధనను లోతుగానే అధ్యయనం చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించినంతవరకు స్వయంగా కొంత విషయ సేకరణ కూడా చేశారు. చరిత్ర చీకటి కోణాలలో ఉండిపోయిన అనేకుల గురించి సమాచారం అందించారు. ముస్లిం స్త్రీల పాత్ర గురించి, ఆంధ్రప్రదేశ్ భూభాగానికి చెందిన ముస్లింల గురించి విడిగా సమాచారం ఇచ్చారు. 2005లో ప్రచురించిన భారత స్వాతంత్ర్య సమరం – ముస్లిం యోధులు (ప్రథమ భాగంలో)లో ఇచ్చిన సమాచారాన్ని బట్టి, ఆయన ఇప్పుడు స్వాతంత్ర్య పోరాటంలో ముస్లింల పాత్ర గురించే కాక స్వాతంత్ర్యానంతర సమాజంలో ముస్లింల స్థితిగతుల గురించి, స్వాతంత్ర్యానికి పూర్వమూ, అనంతరమూ కూడా ముస్లింల పట్ల హిందువులలో నెలకొని ఉన్న అపోహల గురించి రచనలు చేపడుతున్నట్టు తెలుస్తున్నది. ఇది ఆహ్వానించదగ్గ ప్రయత్నం.

దానితోబాటు దేశభక్తి, స్వాతంత్ర్య ఉద్యమం మొదలయిన మాటలనే మైనారిటీల దృక్కోణం నుండి విమర్శనాత్మకంగా పరిశీలించే ప్రయత్నం కూడా నశీర్ అహమ్మద్ ఏదో ఒకరోజు మొదలుపెడతారని ఆశిద్దాం. ఇప్పటివరకు చేసిన రచనలలో ఆయన ఈ మాటలకు 'ప్రధాన రాజకీయ స్రవంతి'లో ఉన్న అర్థాన్నే స్వీకరించారు. ఉదాహరణకు బ్రిటిష్ పాలన అంతం కావాలని కోరుకుంటూనే

బ్రిటిష్ వారి నిష్క్రమణ తరువాత ముస్లింలకు వేరే భూభాగం కావాలని కోరుకున్న వారెవ్వరి ప్రస్తావనా ఈ రచనలలో లేదు. వారిది స్వాతంత్ర్య పిపాస ఎందుకు కాకుండా పోయింది? ఇండియా ఆనాడు విడిపోకుండా ఉండడం అసాధ్యమా, విడిపోవడం వల్ల నష్టమే ఎక్కువ జరిగిందా అన్న ప్రశ్నలను నేనిక్కడ చర్చించడం లేదు. అదెట్లాగున్నా, అల్లమా ఇక్బాల్ వంటివారూ మహమ్మద్ అలీ జిన్నా వంటివారూ దేశభక్తులు కారనీ, వారిది స్వాతంత్ర్య పిపాస కాదనీ అనగలమా?

**సయ్యద్ నశీర్ అహమ్మద్ రచనలపైన సమీక్షా వ్యాసం**
**మానవహక్కుల వేదిక 7వ బులెటిన్, మే 2005**

# 'ఉమ్మడి పౌరస్మృతి' కాదు... ముస్లిం సమాజంలో సంస్కరణలను ఆహ్వానిద్దాం



**ము**స్లిం స్త్రీల హక్కుల గురించి చర్చ ఎప్పుడు జరిగినా అది స్త్రీల హక్కుల చర్చగా కాక ఉమ్మడి పౌరస్మృతి, లౌకిక (లేక కుహనా లౌకిక) వాదం, ముస్లిం మతతత్వం మొదలయిన విషయాలపై చర్చగా మారిపోతుందని మహిళా ఉద్యమకారులు ఆందోళన వ్యక్తం చేస్తుంటారు.

ముజఫర్‌నగర్ నివాసి ఇమ్రానా పైన ఆమె మామగారు అత్యాచారం చేయగా, దేవ్‌బంద్‌కు చెందిన ముల్లాలు ఆమె ఇక తన భర్తతో కాపురం చేయడానికి వీలు లేదని ఫత్వా జారీ చేసిన వైనం దీనికి తాజా ఉదాహరణగా భావించవచ్చును. ఆ ముల్లాలు బాగా చదువుకున్న వాళ్ళు, ముస్లిం సమాజం భావాలు ఎరిగిన వాళ్లు కాబట్టి ఆలోచించే ఫత్వా జారీ చేసి ఉంటారు అని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి ములాయంసింగ్ యాదవ్ ఆ ఫత్వాను వెంటనే సమర్థించాడు. అతగాడికి స్త్రీల హక్కుల విషయంలో పెద్దగా పట్టింపు లేదనేది కొత్త సంగతి కాదు. చట్టసభలలో స్త్రీలకు మూడవవంతు రిజర్వేషన్ లేకుండ అడ్డుపడడంలో అతని ఘనమైన పాత్ర అందరం ఎరిగినదే.

సంఘ్‌పరివార్ ప్రతినిధులు కూడ వెంటనే రంగంలోకి దిగి 'ఉమ్మడి పౌరస్మృతి లేకపోవడం వల్లనే ఇది జరిగింది' అంటూ తమ వంతు ప్రకటనలు ఇచ్చారు. పౌరస్మృతి 'ఉమ్మడి'గా ఉండి, 'ఉమ్మడి'గానే స్త్రీల హక్కులను హరించినట్టయితే ఇమ్రానాకు ఏం ప్రయోజనం ఒనగూడేదో వారే చెప్పాలి. ఒక తప్పును సమర్థించడానికి ఇంకొక తప్పును ఉటంకించడంకాదు గానీ, ఇటువంటి

అనాగరికమైన ఆదేశాలు కుల పంచాయితీల నుండి వెలువడిన ఉదంతాలు హైందవ సమాజంలోనూ ఉన్నాయి. వాటిని సంస్కరించే ప్రయత్నం చేసిన చరిత్ర సంఘ్‌పరివార్‌కు లేదు.

ఇది దేవ్‌బంద్ పండితులను సమర్థించే ప్రయత్నం కాదు. మతం పేరిట అనాగరికమైన వైఖరులు ప్రదర్శించే వారిని సమర్థించవలసిన అవసరం లేదు. అయినా వారి అభిప్రాయం ఎవరడిగారు? ఇమ్రానా అడగలేదే. వారు చేయమన్నా ఆమె తన భర్తతో కాపురం చేయడానికి పెద్దగా ఉత్సాహం చూపకపోవచ్చు. మామగారు తనపైన అత్యాచారం చేసి తనను 'కళంకిత'ను చేసినందుకు కాదు, మామగారి నడవడిక గురించి భర్తకు పలుమార్లు ఫిర్యాదు చేసినా అతను పట్టించుకోకపోగా తన తండ్రినే వెనకేసుకొచ్చినందుకు. మరి ఉలేమాల సలహాలెవరడిగారు? ఫత్వా అంటే సలహా, లేక అభిప్రాయమే తప్ప ఆదేశం కాదని తెలిసీ అదొక ఆదేశమయినట్టు ఎందుకు జారీ చేసారు? ఇమ్రానా ఎక్కడ కట్టడి తప్పి భర్తతోనే కాపురం కొనసాగించి మతానికి కళంకం తెస్తుందో అన్న ఆరాటమే వారిచేత పలికించి వుంటే వారే సిగ్గుపడాలి. ఇమ్రానా మామగారినుద్దేశించి వారు ఏ ఫత్వా జారీ చేయలేదంటేనే వారు నమ్మే ఇస్లాం ఎటువంటి మతమో అర్థం అవుతుంది.

కానీ ఇస్లాం అటువంటిది కాదనీ, ఆ మతం పురుష మతాచారుల చేతిలోపడి అట్లాగయింది గానీ నిజానికి అది స్త్రీల హక్కులకు వ్యతిరేకి కాదనీ నమ్మే ముస్లిం స్త్రీలు చాలామందే ఉన్నారు. పాకిస్తాన్‌లోనయితే ఈ వాదన బలంగా చేసే ప్రతిభావంతులయిన పండితురాళ్లే ఉన్నారు.

అన్ని మతాలలాగే ఇస్లాంలో కూడ వ్యాఖ్యానానికి చాలా తావు ఉంది అంటే అది మరీ జనరల్ వ్యాఖ్య అవుతుంది. ఏ మతం చేతనయినా ఏమైనా పలికించవచ్చుననడం సరియైనది కూడ కాదు. అయితే ఒక ముస్లిం నమ్మవలసిన, ఆచరించవలసిన నీతినియమాలు, కట్టడి, 'చట్టం' ఏమిటి అన్న విషయంలో లోతయిన భేదాలున్న మాట సత్యం. అదే ఇస్లాంను సున్నీ, షియా శాఖలుగాను, మళ్లీ రెండింటినీ భిన్న సంప్రదాయాలుగానూ విడగొట్టింది. ఖురాన్‌లోని వాక్యాలు ముస్లింలందరికీ శిరోధార్యం. అయితే ఆ సూక్తులు తరచుగా చాలా క్లుప్తంగా ఉండడం వల్ల వాటి భావం విషయంలోనే భిన్న వ్యాఖ్యలకు తావు ఉంది. ఇస్లాం అంటే ఏమిటి అనేది ఖురాన్ దగ్గర ఆగిపోదు. ప్రవక్త మహమ్మదు చెప్పిన మాటలు, చేసిన చేతలు, ఆమోదించిన విషయాలు 'ఇస్లాం'కు రెండవ మూలం.

దీనిని సున్నా అంటారు. ఖురాన్ అనేది దేవుడే మహమ్మద్‌కు ప్రత్యక్షంగా చెప్పినది కాగా సున్నా పరోక్షంగా చెప్పినది అని ముస్లింలు నమ్ముతారు.

ఈ సున్నాను ఉదంతాలుగా క్రోడీకరిస్తారు. 80 వేల ఉదంతాలు ఉన్నాయని నమ్మే ముస్లింల నుండి చాలా కొద్ది ఉదంతాలను మాత్రమే నమ్మేవారి దాకా ఈ విషయంలో చాలా తేడా ఉంది. ఈ ఉదంతాలు ఒక్కొక్కటీ ఒక్కొక్క నియమాన్నీ, నీతినీ చెప్తాయి.

ఇక మూడవది మహమ్మదు అనుయాయుల, అనుచరుల అభిప్రాయాలు, వారు ఆమోదించిన నియమాలు. 'ఇజ్మా' అని పిలవబడే ధార్మిక మూలాన్ని మహమ్మదు జీవితకాలంలోని అతని పరివారానికి పరిమితం చేయాలని నమ్మేవారి నుండి, ప్రతీ తరంలోనూ విజ్ఞులయిన ముస్లిం పెద్దలుంటారు కాబట్టి వారి అభిప్రాయాలకు కూడా వర్తింపజేయాలని నమ్మే వారిదాకా భిన్న శాఖలు ఇస్లాంలో ఉన్నాయి. ఖురాన్‌ను, సున్నాను ప్రతీ తరమూ కొత్తగా ఎదుర్కొనే సమస్యలకు అప్పటి విజ్ఞులు (ముజ్తాహిద్‌లు) అన్వయించి చేసే వ్యాఖ్యలు ధార్మిక నియమాలలో భాగమేననే విశ్వాసం ఇస్లాం పుట్టిన తొలి నాలుగు శతాబ్దాలలో ఉండింది. ఇది సంస్కరణలకూ మార్పుకూ తలుపులు తెరిచి ఉంచింది. 12వ శతాబ్దంలో మూసేసిన ఈ తలుపులను ఇప్పుడు మళ్లీ తెరవాలనేది ముస్లింలలోని ఆధునిక సంస్కర్తల కోరిక. అది ఆ మతాన్ని పూర్తిస్థాయిలో కాలానుగుణంగా సంస్కరించగలదని వారి నమ్మకం.

చెప్పొచ్చిందేమిటంటే (ఇంకా చెప్పగలిగింది చాలా ఉంది) తరచుగా చాలా కరుడుగట్టినట్టు కనిపించే ముస్లిం సంప్రదాయాలలోనూ ఆచారాలలోనూ మార్పు సాధ్యమా లేక ఎంత మేరకు సాధ్యం అనేది ఆ మతంలోని మౌలిక సూత్రాల మీద ఎంత ఆధారపడి ఉంటుందో సామాజిక పరిస్థితుల మీద అంత ఆధారపడి ఉంటుంది. ఎవరు వ్యాఖ్యానిస్తున్నారు, వారిని ఎవరు సవాలు చేస్తున్నారు అనే దాని మీద ఆధారపడి ఉంటుంది. మొదటినుండి అన్ని మతాలలాగ ఇస్లాంను కూడ మగవాళ్లే వ్యాఖ్యానిస్తుండడం వల్లనే స్త్రీల హక్కులను కుదించివేసే అంశాలకే ప్రాధాన్యం ఇచ్చారు తప్ప అందుకు భిన్నమయిన అంశాలను పెంపొందించలేదని వాదించే ముస్లిం స్త్రీలు, ప్రజాతంత్రవాదులు ఉన్నారు. ఇది సాధారణ విషయం కాగా, స్వతంత్ర భారతంలో ముస్లిం సమాజం ఎదుర్కొన్న ప్రత్యేక పరిస్థితుల కారణంగా మన దేశంలో ఇస్లాం అంటే ఏమిటి అని చెప్పే అధికారం పూర్తిగా సనాతనవాదుల చేతిలో చిక్కుకుని ఉంది. మార్పుకు అతి తక్కువ అవకాశం

ఉండేది షియా శాఖలో అయినప్పటికీ షియాలు మెజారిటీగా ఉండే ఇరాన్‌లో సంస్కరణవాదులకు సనాతన వాదులకూ మధ్య పెద్ద పోరాటమే నడుస్తూ ఉంది. మార్పుకు అతి ఎక్కువ అవకాశం ఉండేది సున్నీ శాఖలోని హనాఫీ సంప్రదాయంలో. భారతదేశంలోని ముస్లింలలో అతిపెద్ద సంఖ్య ఈ సంప్రదాయానికి చెందినవారే. అయినప్పటికీ ఇస్లామిక్ ధార్మిక నియమాలలో అతి తక్కువ మార్పు వచ్చింది ఇండియాలోనే. దీనికి కారణం మతంలో కాక సామాజిక రాజకీయ పరిస్థితులలో చూడవలసి ఉంటుంది.

ఇస్లాం అధికార మతంగా లేక మెజారిటీ మతంగా ఉన్న అనేక దేశాలలో చాలా సంస్కరణలు, మార్పులు ప్రవేశ పెట్టారు. కొన్ని చోట్ల బాహాటంగాను కొన్ని చోట్ల గుట్టుచప్పుడు కాకుండా చేసారు. 19వ శతాబ్దంలోనే ఇది మొదలయింది. ఈజిప్ట్‌లో మహమ్మద్ అలీ, టర్కీలో కమల్‌పాషా ఈ వరవడికి ఆద్యులుగా గుర్తింపు పొందారు.

ధార్మిక నియమాల విషయంలో సనాతన వాదులదే పైచేయిగా ఉండిపోయిన ముస్లిం సమాజాలలో ఇండియన్ ముస్లింలు ఒకరు. అవాంఛనీయమైన ఈ స్థితికి కారణం ఏదయినప్పటికీ 'ఉమ్మడి' పౌరస్మృతి దీనికి జవాబు కాకపోగా ఆ కారణాలను మరింత బలోపేతం చేసే ప్రతిపాదన. హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు తదితర మత సంప్రదాయాల మధ్య నిరపాయకరమైన తేడాలు చాలా ఉన్నాయి. ఎవరి సంప్రదాయాలు వారు పాటించుకోవడం వల్ల ఎవరికీ నష్టంలేదు. అన్ని సంప్రదాయాలలోనూ ముఖ్యంగా స్త్రీల విషయంలో ఉన్న అప్రజాస్వామిక గుణాలు పోవాలన్నది కోరిక కావాలిగానీ వైవిధ్యం నశించాలన్నది కాదు. వైవిధ్యం దేశ సమగ్రతకు ముప్పు అనేది ఫాసిస్టు భావన. షాబానో నుండి ఇమ్రానా దాకా సనాతన ముస్లిం సంప్రదాయం స్త్రీల హక్కులను నిరాకరించే ఉదంతాలు జరిగినప్పుడల్లా ఈ ఫాసిస్టు నినాదం ముందుకు రావడం ముస్లిం సమాజంపైన సనాతన వాదం పట్టు బిగియడానికే ఉపయోగపడుతున్నది. అసలే బలహీనంగా ఉన్న సంస్కరణ వాదపు గొంతు దీని వల్ల మరింత బలహీనపడుతున్నది.

**ప్రజాతంత్ర**

**24 జూలై 2005**

# నిజమైన నష్టం ముస్లింలకే

**1970**-80లలో భారతదేశంలో భౌతికశాస్త్రం (ఫిజిక్స్) ఉన్నత స్థాయిలో అభ్యసించిన వారందరికీ ప్రొఫెసర్ అబ్దుస్ సలాం పేరు బాగా పరిచయం. ఆయన పాకిస్తానీ. థియరెటికల్ ఫిజిక్స్‌లో అగ్రశ్రేణి పరిశోధకుడు. చాలా కాలం ఇంగ్లండ్‌లో ఉండి, తరువాత ఇటలీలోని ట్రియెస్టె నగరంలో థియరెటికల్ ఫిజిక్స్ పరిశోధనా సంస్థ నెలకొల్పాడు. ఆ రంగంలో ఉన్నత ప్రమాణాలందుకున్న పరిశోధనకు అది పేరు పొందింది.

ఆ సంస్థలో దక్షిణాసియావాసులకు ప్రత్యేకమైన ఆదరణ లభించేది. పాకిస్తాన్, ఇండియా, బంగ్లాదేశ్‌లకు చెందిన భౌతికశాస్త్ర పరిశోధకులలో ప్రయోగ అంశాల మీద కాక సిద్ధాంత పరిశోధన మీద ఆసక్తి ఉన్న వారికది ఒక కూడలిగా ఉండేది. యోగ్యులయిన యువకులు చాలామంది నేరుగా ట్రియెస్టెకు పోయి ప్రొఫెసర్ అబ్దుస్ సలాంను కలిసి అక్కడొక ఫెలోషిప్‌గానీ బోధనా రంగంలో ఉద్యోగంగానీ పొందేవారు. అందులో – మతంతో నిమిత్తం లేకుండ అని వేరే చెప్పనవసరం లేదు – ఇండియన్లు చాలామంది ఉన్నారు.

అయినప్పటికీ పాకిస్తాన్ అధికారికంగా ప్రొఫెసర్ అబ్దుస్ సలాంను తన గడ్డ మీద పుట్టిన గొప్ప పరిశోధకుడిగా గుర్తించదు. అధికారికంగా ఆయన యోగ్యతకు గర్వించదు. ఇండియాలాగే పాకిస్తాన్‌లోనూ ఆయన వల్ల ప్రయోజనం పొందిన భౌతికశాస్త్ర పరిశోధకులు చాలామందే ఉన్నారు. వారికి ఆయన మీద అభిమానం, గౌరవం ఉండే ఉంటాయి. పాకిస్తాన్ విశ్వవిద్యాలయాలలోని భౌతికశాస్త్ర పరిశోధకులు ఆయన యోగ్యతకు గౌరవం ఇచ్చే ఉంటారు. అయితే అధికారికంగా పాకిస్తాన్ పాలకవర్గం ఆయనను కీర్తించదు. ఆయన జ్ఞాపకాలను ఆదరించదు.

కారణం, ఆయన అహమ్మదీయ శాఖకు చెందినవాడు. అహమ్మదీయులు ముస్లింలు కారనీ, అయినప్పటికీ తమకు తాము ముస్లింలుగా చెప్పుకుంటారని అభియోగం. ఇస్లామిక్ రాజ్యమైన పాకిస్తాన్‌లో వారిని హిందువులు, క్రైస్తవులకంటె కూడ ఎక్కువ వేధిస్తారు. అహమ్మదీయుల మత భావన ఇస్లాం కాదని నమ్మదలచుకున్నవారి హక్కునెవరూ కాదనరు. కానీ అది కూడ ఇస్లామేనని నమ్మేవారి ఉనికినే సహించలేనితనాన్ని నాగరిక వైఖరిగా గుర్తించడం కష్టం. ప్రొఫెసర్ అబ్దుస్ సలాం విషయానికొస్తే, పాకిస్తాన్ అణుబాంబు నిర్మించిన వాడిగా ప్రొఫెసర్ ఖాన్‌కిచ్చిన గౌరవంలో పదవ వంతు కూడ ఈయనకియ్యకపోవడం వల్ల ఈయనకొచ్చిన నష్టమేమీ లేకపోవచ్చును గానీ పాకిస్తానీ పాలకవర్గం ప్రపంచం కళ్లలో గౌరవాన్ని కోల్పోయింది. సంకుచిత వైఖరులు క్షణికంగా ఇతరులకు నష్టం చేసినట్టు కనిపిస్తాయి గానీ నిజానికి మనకే ఎక్కువ నష్టం చేస్తాయి.

హైద్రాబాద్‌లో మొన్నటి దినం అహమ్మదీయులు నిర్వహించదలచిన సభను ఎంఐఎం, ఎంబిటిలు సాగనివ్వమని బెదిరించడం, ఆ బెదిరింపుకు లొంగి వారు కిరాయి కట్టిన లలితకళాతోరణంలో వారికిచ్చిన అనుమతిని అధికారులు రద్దు చేయడం, దానికి నిరసనగా అహమ్మదీయులు ఒక హొటల్‌లో ప్రెస్ కాన్ఫరెన్స్ పెట్టాలని ప్రయత్నం చేస్తే దానిని కూడ అవే పార్టీలు సాగనివ్వకపోవడం, పోలీసులు శాంతి భద్రతల పరిరక్షణ పేరిట పక్కనుండి ఈ దాదాగిరికి సహకరించడం చూసాం. కొద్దికాలం క్రితం తస్లీమా నస్రీన్ మాట్లాడుతున్న సభపైన ఎంఐఎం వారు దాడిచేసి కనిపించిన వారినందరిని కొట్టి సభను భగ్నం చేయగా 'కొట్టి వచ్చేస్తారా? చంపేయలేదా?' అని ఎంబిటి నాయకులు ఎద్దేవా చేయడం మనకు జ్ఞాపకం ఉంది. ఎంబిటి వ్యవస్థాపకుడయిన అమానుల్లాఖాన్, ఒవైసీ తండ్రీ తనయులకంటే మెరుగయిన రాజకీయ ఆచరణ గల నాయకుడు. పాతబస్తీ రాజకీయాలను గుళ్లు – మసీదులు, శ్మశానాలు – కబరస్థాన్‌లకే పరిమితం చేసిన బిజెపి – ఎంఐఎంల మూస నుండి కొంత మేరకయినా బయటపడేసి, నల్లాల గురించి, స్కూళ్ల గురించి ఆందోళన చేసేవారు. అయితే ఆయన వారసులు మాత్రం ఎంఐఎంతో అనాగరిక రాజకీయాలలో పోటీపడడమే తమ కర్తవ్యంగా ఎంచుకున్నారు.

ఈ రాజకీయాలకు వెరచి నోరునొక్కుకుని బతకడం హైదరాబాద్‌లోని ముస్లింలూ నేర్చుకున్నారు. లేకపోతే ఏం జరగగలదో సియాసత్ సంపాదకుడు జాహిద్ అలీఖాన్‌కు వారు రుచి చూపించారు. ఇప్పుడు ఆ వెరపు

హైదరాబాదీలందరినీ పట్టుకున్నట్టుంది – అధికార యంత్రాంగంతో సహా. రేపు హైదరాబాద్ భావ ప్రకటనా స్వేచ్ఛ లేని అనాగరికమైన నగరంగా గుర్తింపు పొందితే హైదరాబాదీలందరమూ దానికి బాధ్యులవుతాము.

ఇస్లాం పేరు మీద జరుపుతున్న హింసాకాండ వల్ల వేరే వాళ్లలో భయం కలగవచ్చు. బాంబు పేలుళ్లలో ప్రాణాలు పోవచ్చు. కానీ దానివల్ల నిజమైన నష్టం ముస్లింలకేనన్న విషయం చాలాకాలంగా చాలామంది అంటున్నారు. దానిని మొదట బ్రిటన్‌లోని ముస్లిం మతపెద్దలు, ఈ మధ్య ఉత్తర భారతదేశంలోని ముస్లిం మతపెద్దలు కూడా గుర్తించారు. ఎంఐఎం, ఎంబిటి నాయకులకు అది ఎప్పుడర్థం అవుతుందో తెలీదు. విచ్చలవిడి హింసాకాండ ఇస్లాం స్ఫూర్తికి విరుద్ధం అని బ్రిటన్‌లోని మెజారిటీ మసీదుల ఇమాంలు సైతం ప్రకటించడమే కాదు, సంఘటితంగా నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. ఇండియాలోనే కాదు, మొత్తంగా దక్షిణాసియాలోనే సనాతన ఇస్లాంకు కేంద్రంగా గుర్తింపు పొందిన దేవ్‌బంద్ ఉలేమాలు ఈ విషయం మీద బహిరంగ చర్చ నిర్వహించి అదే అభిప్రాయాన్ని ప్రకటించారు. జైపూర్‌లో బాంబులు పెట్టిన మహానుభావులు ఈ ప్రకటనను ఇస్లాంకు ద్రోహం అని వ్యాఖ్యానించగా, భయపడకుండా తిరిగి అదే తీర్మానాన్ని దేవ్‌బంద్ పెద్దలు ఫత్వా (విజ్ఞుల అభిప్రాయం) రూపంలో ప్రకటించారు. ఇది బాధ్యత ఎరిగిన వైఖరి. హైదరాబాద్‌లో ముస్లిం నాయకులుగా చలామణి అవుతున్న వారికి ఈ వైఖరి ఎప్పుడు అలవడుతుంది.? వాళ్లంతట వాళ్లకు అలవడే సూచనలు లేవు. వాళ్లకి దాదాగిరీ ఒక రాజకీయ సాధనం. ముస్లింల జీవితాలు బాగు చేయడానికి ఏం చేసినా చేయకున్నా ఇస్లాంను కాపాడేది తామేనన్న సంకేతాన్ని ప్రజలకు పదే పదే పంపుతుండడం దీనికి వారెంచుకున్న మార్గం. అందుకే వారు అన్ని సందర్భాలలోనూ ఆవేశపడరు. రాజకీయంగా ఆచితూచి ఆవేశపడతారు. ఇదే లలితకళాతోరణంలో రేపు నరేంద్ర మోడీ, ప్రవీణ్ తొగాడియా వచ్చి మీటింగ్ పెడితే ఎంఐఎం, ఎంబిటి నాయకులు అడ్డుపడతారా? కనీసం వారికి అనుమతి ఇచ్చినందుకు నిరసనగా లలితకళాతోరణం నిర్వాహక కార్యాలయం బయట ధర్నా చేస్తారా? అవేమీ చేయరు. నోరు తప్ప బలం లేని తస్లీమా నస్రీన్‌నూ, అహమ్మదీయులనూ ఎంచుకుంటారు.

ఎంఐఎం తరహా రాజకీయాలు ప్రజామోదంలో బలహీన పడుతున్నందువల్లనే వారు ఈ రకంగా అప్పుడప్పుడు రెచ్చిపోతున్నారని వ్యాఖ్యానించేవారు ఉన్నారు. అది నిజమే కావచ్చు. దైనందిన జీవిత సమస్యలపైన

ప్రజలను వివిధ రూపాలలో కదిలించే ప్రయత్నం ఈ మధ్య హైదరాబాద్ పాత బస్తీలో ప్రారంభం అయింది. ముస్లిం సమాజంలో ఎంఐఎం తరహా రాజకీయాల పట్ల విసుగుచెందిన వారు ఆ పని చేస్తున్నారు. సిపిఐ(ఎం) కూడ చేస్తున్నది. ఈ ప్రయత్నాల పట్ల ఎంఐఎం నాయకులు తమ అసహనాన్ని ఇప్పటికే బహిరంగంగా వ్యక్తం చేసి ఉన్నారు. తగ్గుతున్న ప్రజాదరణను తిరిగి పొందేందుకు తమ పద్ధతులను మార్చుకునే పద్ధతిని ఎంచుకోకుండా పాత మార్గాన్నే మరింత దూకుడుగా అనుసరిస్తున్నారు.

'ఇదంతా రాజకీయమే'నని ప్రకటించినంత మాత్రాన హైదరాబాద్ నగరం కోల్పోతున్న ప్రజాస్వామ్య వాతావరణం తిరిగిరాదు. పోతున్న పరువూ తిరిగి రాదు. భావస్వేచ్ఛను కాపాడుకోవడానికి దానిని గౌరవించే వారంతా ఒకటై ముందుకు రావాలి.

**ప్రజాతంత్ర**
**15 జూన్ 2008**
**('వైరుధ్యాలపుట్ట భారతం' అనే శీర్షికతో వచ్చింది. శీర్షిక మార్చాం)**

# 'ఎంఐఎం'పై విశ్లేషణ జరగాలి!

శ్మశాన వాటికలో మర్యాద పాటించడం సబబే. మృతుని శవాన్ని ముందు పెట్టుకొని అతని నడవడికను విమర్శించము. అయితే కొంత కాలం తరువాతయినా మర్యాదల కంటె సామాజిక ప్రయోజనం ముఖ్యం అన్న స్పృహ కలగడం అవసరం.

సుల్తాన్ సలావుద్దీన్ ఒవైసీ చనిపోయిన తరువాత రెండు మూడు రోజులు పాతబస్తీలో అతనికి ఉన్న ప్రజాదరణ గురించి, 'సాలార్' అని పిలిపించుకున్న అతని నేతృత్వ లక్షణాల గురించి, అతని అంత్యక్రియలకు హాజరయిన వేలాది ప్రజల గురించి రాయడం సహజమే. అయితే ఆ తరువాతయినా ఆయన నిర్మించిన 'మజ్లీస్' పార్టీ గురించి, పాతబస్తీ జీవితంలో దాని స్థానం గురించి ప్రశంసకూ విమర్శకూ తగు స్థానం ఇచ్చే విశ్లేషణ పత్రికలు చేపట్టవలసి ఉండింది. అది జరగక పోవడం కొంచెం ఆశ్చర్యమే.

కుల్ హింద్ మజ్లీస్-ఇ-ఇత్తెహాదుల్ ముస్లిమీన్ అన్న పొడవు పేరుగల మజ్లీస్ పార్టీకి సామాజిక సందర్భమే కాక చారిత్రక సందర్భమూ ఉంది. 1927లో ఆ సంస్థ ఆవిర్భవించినప్పుడు 'నిజాం పాలన ముస్లింల హక్కు' అన్న సూత్రాన్ని పట్టుకొని పుట్టింది. అప్పట్లో అది ప్రధానంగా విద్యారంగంలో కృషి చేసినప్పటికీ రాజభక్తి దాని ప్రముఖ లక్షణంగా ఉండింది. ఆర్య సమాజాన్నేకాక ఆంధ్రమహాసభను కూడా అది వ్యతిరేకించింది.

అందుకే హైదరాబాద్‌ను నిజాం ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండ భారత్‌లో కలిపేసుకోవడానికి నెహ్రూ-పటేల్ ప్రభుత్వం పూనుకున్నప్పుడు నిజాంకు మజ్లీస్

నాయకులే అక్కరకొచ్చారు. ఆ సంస్థ 6వ అధ్యక్షుడయిన మౌలానా ఖాసిం రజ్వీ సాహెబ్ రజాకార్లు అని పిలవబడే 'స్వచ్ఛంద' సైనికులను లక్షాయాభైవేల మందిని తయారు చేసి హైదరాబాద్ రాష్ట్రంపైన వదిలాడు.

భారత సైన్యం తాకిడికి రజాకార్లు నిలవలేకపోయారు. అయితే రజాకార్ల చేతిలో చనిపోయిన వారి గురించి, రజాకార్ల దౌర్జన్యాల గురించి మనకు ఎంతో కొంత తెలుసును కానీ, రజాకార్లను అణచడానికి భారత సైన్యం పాల్పడిన హింస హైదరాబాద్ ముస్లింలలో ఎందరిని పొట్టనపెట్టుకున్నదీ, ఎంత భయోత్పాతం కలిగించినదీ తెలుసుకోవడం మన చరిత్ర జ్ఞానంలో భాగం కాలేదు.

ఆ జ్ఞాపకాలు మజ్లీస్ పార్టీ పునరావిర్భావంపైన ముద్ర వేసాయి. 1948లో దానిని నిషేధించి ఖాసిం రజ్వీని ఖైదు చేసారు. అయితే 1957లో పాకిస్తాన్‌కు వెళ్లిపోవాలన్న షరతు మీద అతనిని విడుదల చేయడం, మజ్లీస్‌పైన నిషేధం ఎత్తివేయడం జరిగింది. అప్పటినుండి మజ్లీస్ పార్టీ ఒవైసీ కుటుంబీకుల పార్టీగా ఉంది. నిజాం రాజ్యం పట్ల విశ్వాసాన్ని విసర్జించి భారత రాజ్యాంగాన్ని స్వీకరించిన పేరు ముందు కుల్ హింద్ (ఆల్ ఇండియా) అన్న మాటలు తగిలించుకొని దారుస్‌సలాం (శాంతి నివాసం)లో కార్యాలయం స్థిరపరచుకున్నప్పటికీ పునరుత్థానం నుండి పుట్టిన కరుకుదనం ఆ పార్టీని, దాని 'సాలార్' ఒవైసీని వీడలేదు. భారతదేశం ముస్లింలను అయిష్టంగా తనలో ఇముడ్చుకుందనీ, అల్లరి చేసి తమ ప్రయోజనాలు కాపాడుకోవడానికీ, అవసరమయితే దౌర్జన్యం చేయడానికీ సిద్ధపడకపోతే ముస్లింలకిక్కడ మనుగడ లేదనీ ఒవైసీ నమ్మాడు. 1950ల కంటే ఇది ఇవ్వాళ ఎక్కువ నిజం కాబట్టి ఆనాటి సంగతి ఎట్లాగున్నా ఇవ్వాళ పెద్దగా అభ్యంతరం చెప్పే పరిస్థితి లేదు. అయితే ఈ వైఖరితో ఒవైసీ పార్టీ ముస్లింల సామాజిక ఆర్థిక హక్కుల సాధన కోసం కృషిచేసి ఉంటే హింసనూ దౌర్జన్యాన్నీ అసహ్యించుకునేవారు సహితం ఒవైసీని ఆ మేరకు ప్రశంసించి ఉందురు. అయితే మజ్లీస్ పార్టీ సామాజిక ఆర్థిక అజెండాలో ఒవైసీ కుటుంబం ఆస్తుల పెంపుదల ఒక్కటే ఉండింది, ఒక్కటే ఉంది. వారి రాజకీయ కార్యక్షేత్రమంతా మసీదులు, దర్గాలు, కబర్‌స్థాన్‌ల రక్షణకు, ఇస్లాం పవిత్రతగా వారు భావించే దాని రక్షణకు పరిమితం అయింది.

అవతలవైపు గుళ్లు, విగ్రహాలు, శ్మశానాల రక్షణే ఏకైక అజెండాగా గల భారతీయ జనతాపార్టీ పాతబస్తీలోనే కాక తెలంగాణ అంతటా మజ్లీస్‌కు పోటీగా ఎదగడంతో రెండు తప్పుడు పోకడలూ బలపడ్డాయి. మతం పేరు మీద

రౌడీయిజం చేయడం ఈ రాజకీయాలలో అతిగొప్ప విషయం. నిరుడు ఆగస్ట్ 9వ తేదీన తస్లీమా నస్రీన్ పైన మజ్లీస్ శాసనసభ్యులు ముగ్గురు దాడిచేసి కొట్టినప్పుడు అవకాశం దొరకని ప్రత్యర్థులు 'కొట్టి వచ్చేస్తారా – చంపే దమ్ములు లేవా' అని ఎద్దేవా చేయడం హైదరాబాద్ వాసులందరికీ జ్ఞాపకం ఉండే ఉంటుంది. మతవాద రాజకీయాలలో ఇదే 'మగతనం' అనిపించుకుంటుంది. ఆలె నరేంద్ర తెరాస ప్రతినిధిగా ఉన్న రోజులలో ఈ మాటతీరును రాష్ట్రమంతటా ఆలకించింది, టీవీలో తిలకించింది.

ఈ రాజకీయాలకు ప్రత్యామ్నాయం గురించి ఆలోచించడానికే పాతబస్తీలో విపరీతమైన భయం ఉంది. మజ్లీస్ పార్టీ రౌడీలు కొడతారన్న భయం మాత్రమే కాదు, ముస్లిం వోటును లేక ముస్లిం రాజకీయ వ్యక్తిత్వాన్ని చీలుస్తున్నావన్న నింద భరించవలసి వస్తుందన్న భయం. హిందువుల పేరు మీద భారతీయ జనతాపార్టీ అదే రకమైన రాజకీయం చేస్తున్నప్పటికీ ఒక మైనారిటీలో ఉండే అభద్రత – లేక కల్పించగల అభద్రత – మెజారిటీలో ఉండదు కాబట్టి హిందువుల వోటు చీలుతుంటుంది. మైనారిటీ విషయంలో అది క్షమించరాని పాపం అవుతుంది. ఆ నిందను తట్టుకోవడం ఇష్టంలేక మజ్లీస్ అంటే సదభిప్రాయం లేనివారు సైతం తమ విమర్శకు రాజకీయ రూపం ఇవ్వకుండ జాగ్రత్త పడుతూ వచ్చారు. వీరంతా సెక్యులర్ భావాలు గలవారే కాదు. సనాతన వాదులయిన ముస్లింలలో కూడ ఒవైసీ రాజకీయాలలోని రౌడీయిజం పట్ల వ్యతిరేకత చాలా ఉంది. ఇస్లాం పేరు మీద ఈ రకమైన రౌడీయిజం అమలు కావడం మతానికే మచ్చ అన్న అభిప్రాయం వారిలో ఉంది. అయితే రెండు రకాల విమర్శకులలోనూ ఒకే జంకు ఉంది. మతానికి నష్టం చేస్తున్నావని తిడతారన్న జంకు, వీధి రౌడీల దాడి ఎదుర్కోవలసి వస్తుందన్న జంకు. అందువల్ల అసంతృప్తులయిన సనాతనవాదులు ఇంటి పట్టున ఉండిపోగా ఆధునిక భావాలు గలవారు రాతకు పరిమితం అవుతున్నారు. లేదా మజ్లీస్ తరహా రాజకీయాల వల్ల పాతబస్తీ ముస్లింల సామాజిక ఆర్థిక జీవితం ఎదుగూ బొదుగూ లేకుండా ఉండిపోయిందన్న ఆందోళనతో పాటు ఏదైనా చేయక తప్పదన్న ఆరాటం ఉన్నట్టయితే ఎన్జీవోలను పెట్టుకొని చేతనయింది చేస్తున్నారు.

రాజకీయంగా మజ్లీస్‌కు పోటీ పార్టీ పెట్టిన ఏకైక ముస్లిం వ్యక్తి ఆ పార్టీ నుండి బయటికొచ్చి మజ్లీస్ బచావో తెహ్రీక్ (ఎంబిటి) స్థాపించిన అమానుల్లాఖాన్. ఒవైసీ పార్టీలో ఉన్న రోజులలో కూడ సామాజిక ఆర్థిక సమస్యల

మీద కొంత ఎక్కువ దృష్టి పెట్టేవాడు, ముస్లింలకే కాక స్థానిక హిందువులకు కూడ ప్రతినిధిగా వ్యవహరించేవాడు. ఎంబిటి ఒవైసీకి పోటీగా నిలదొక్కుకొని ఉంటే, నిజంగా భిన్నంగా వ్యవహరించి వుంటే, ఏమయ్యేదో చెప్పలేముగానీ రెండూ జరగలేదు. ఎంబిటి పాతబస్తీలో కొన్ని ప్రాంతాలకే పరిమితం అయింది. ముస్లింల ప్రయోజనాలను మతప్రయోజనాలుగా మతవాదులు భావించే వాటికే పరిమితం చేసి చూసే ఆలోచనారీతి నుండి బయటపడనూ లేదు. తస్లీమా నస్రీన్‌పైన దాడి చేసిన మజ్లీస్ వారు ఆమెను చంపకుండా కేవలం కొట్టి వచ్చినందుకు అందరికంటె ఘాటుగా ఎద్దేవా చేసింది ఎంబిటి వారే.

ఒవైసీ రాజకీయాలకు ప్రత్యామ్నాయాన్ని ప్రతిపాదించడానికీ, ఆచరణను ఆహ్వానించడానికీ సియాసత్ పత్రిక సంపాదకవర్గం, మొదటి నుండి ఉదారవాద వైఖరికి సన్నిహితంగా ఉన్న ఆ పత్రిక యాజమాన్యం ఎంతసేపూ మతచిహ్నాల గురించి కొట్లాటలేనా అన్న విమర్శను ప్రచారం చేసింది. ముస్లిం స్త్రీలకు వృత్తి శిక్షణ ఇచ్చే ఎన్‌జివోను స్థాపించి విస్తృతంగా కృషి చేసింది. అక్కడితో ఆగిపోకుండ రాజకీయ ప్రత్యామ్నాయాన్ని బహిరంగంగా ఆహ్వానించడంతో మజ్లీస్ వారి రౌడీయిజాన్ని రుచి చూడవలసి వచ్చింది. గత సంవత్సరం మార్చి నెలలో సియాసత్ సంపాదకుడు జాహిద్ అలీఖాన్ కారును ఆపి బయటకులాగి కొట్టి రోడ్లో పడేసారు.

పాతబస్తీలో ప్రజల సమస్యల మీద పనిచేయాలని సిపిఐ(ఎం) నిర్ణయించడం ఈ ప్రత్యామ్నాయ ప్రయత్నాలకు ఊతం ఇచ్చింది. సిపిఐ(ఎం) రాజకీయ పాపాలు చాలానే ఉన్నాయిగానీ పాతబస్తీ రాజకీయాలలో మతచిహ్నాల బదులు నిత్యజీవిత సమస్యల అజెండాను ప్రవేశపెట్టాలని ఆ పార్టీ ఆచరణాత్మకంగా నిర్ణయం తీసుకోవడం అభినందనీయం. ఉర్దూరాని గుంటూరు తెలుగు మాట్లాడే నాయకుడినే దీనికి వారు కేటాయించినప్పటికీ పాతబస్తీలో మంచి కదలిక తీసుకురాగలిగారు. ఇళ్ల స్థలాల కోసం సిపిఐ(ఎం) నిర్వహించిన ఆందోళనలలో ఆలియాబాద్ నుండి కార్వాన్ దాకా ఒంటినిండా బురఖా వేసుకున్న ముస్లిం స్త్రీలు పెద్ద సంఖ్యలో పాల్గొనడం ప్రత్యామ్నాయ రాజకీయాల ఆవశ్యకత ఎంత వుందో, ఆరాటం ఎంత వుందో సూచిస్తుంది. సిపిఐ(ఎం) ప్రయత్నాన్ని సియాసత్ యాజమాన్యమే కాక ఆధునిక భావాలుగల పాతబస్తీ ముస్లింలు చాలామంది ఆహ్వానించడమేకాక ప్రత్యామ్నాయ రాజకీయాలకు దానిని పునాదిగా మలచాలన్న సంకల్పాన్ని ప్రకటించారు.

అయినప్పటికీ ఒవైసీ వారసత్వం పూర్తిగా రూపు మాసిపోవడం కాంక్షనీయం కాదేమో. తాత్వికంగా సైద్ధాంతికంగా ఏ విధంగా కనిపించినా, మైనారిటీలు సామాజిక ఆర్థిక వర్గాలలో భాగంగానే కాక మత వర్గాలుగా కూడ సంఘటితం కావడం ప్రస్తుత దేశ పరిస్థితులలో అవసరమేనేమో. మైనారిటీల ప్రత్యేక అస్తిత్వాన్నే సహించని హిందుత్వవాద గుండాయిజం ప్రబలిపోయి అధికార యంత్రాంగాన్ని లోబరుచుకొని విచ్చలవిడి దాడులకు పాల్పడుతున్న ఈ దశలో ముస్లింలూ క్రైస్తవులూ తమ ఉనికిని కేవలం సామాజిక ఆర్థిక వర్గాలలో వెతుక్కుంటే సరిపోదు. గుజరాత్‌లో మజ్లీస్ వంటి పార్టీ ఉండి ఉంటే నరేంద్ర మోడి, ప్రవీణ్ తొగాడియాలు 2002లో చేపట్టిన మారణకాండ అంత సులభంగా జరిగి ఉండేదా?

ప్రజాతంత్ర
**14 అక్టోబరు 2008**

# సచార్ చెప్పిన సత్యాలు

**చా**లాకాలం పాటు చర్చలో ఉండబోయే నివేదిక ముస్లింల సామాజిక ఆర్థిక స్థితిగతులపైన రాజిందర్ సచార్ కమిటీ సమర్పించిన రిపోర్టు. ముస్లింల స్థితిగతుల గురించే కాక మన సమాజంలో విభిన్న సామాజిక వర్గాల సాపేక్ష స్థితి గురించి కూడా ఈ నివేదికలో చాలా సమాచారం ఉంది.

భారతదేశంలో ముస్లింల స్థితి సవర్ణ హిందూ కులాలకూ ఎస్‌సి, ఎస్‌టిలకూ మధ్యస్తంగా ఉందనీ, కొన్ని విషయాలలో ముస్లింలు ఎస్‌సి, ఎస్‌టిలతో సమానంగా వెనుకబడి ఉన్నారనీ ఈ నివేదిక సారాంశం. ఎస్‌సి, ఎస్‌టిలను కలిపేయకుండా వేరువేరుగా లెక్కించి ఉంటే చాలా విషయాలలో ముస్లింల స్థితిగతులు ఎస్‌సిల స్థితిగతులకు సమానం అని తేలేది. అట్లాగే 'ఇతర హిందువులు' అనే శీర్షికన అగ్రకులాలనూ బిసిలనూ కలిపేయకుండా వేరుగా చూపించి ఉంటే సామాజిక విషయాలలో హిందూ అగ్రకులాల ఆధిపత్యం ఎంతగా ఉందో స్పష్టం అయి ఉండేది.

రిజర్వేషన్లు ఉండడం వల్ల ఎస్‌సి, ఎస్‌టిలు ఎక్కడ లాభపడ్డారో, రిజర్వేషన్లు లేక ముస్లింలు ఎక్కడ నష్టపోయారో ఈ నివేదిక స్పష్టంగా చూపిస్తుంది. 'సచార్ కమిటీ సిఫారసులను అమలు చేయాలి' అన్న నినాదం వింటున్నాంగానీ, సిఫారసులే ఈ నివేదికలోని అత్యంత బలహీనమైన అంశం. నివేదికలో స్పష్టంగా చూపించిన పరిస్థితిని సవరించాలంటే కమిటీ చేసిన వాటికంటే ఇంకా బలమైన సిఫారసులు కావాలి.

'భారతదేశంలోని ముస్లింల సామాజిక, ఆర్థిక, విద్యాసంబంధమైన స్థితిగతుల గురించి నిర్దుష్టమైన సమాచారం లేకపోవడం వల్ల ఆ వర్గం యొక్క సామాజిక ఆర్థిక వెనుకబాటుతనాన్ని తొలగించడానికి అవసరమైన విధానాలు, పథకాలు రూపొందించడం కష్టంగా ఉంది' అని కేంద్ర ప్రభుత్వం గుర్తించి, ఆ సమాచారం సేకరించి సమగ్రమైన నివేదిక ఇచ్చే నిమిత్తం 2005 మార్చి 9వ తేదీన ఒక ఉన్నతస్థాయి కమిటీని నియమించింది. ఆ కమిటీ అధ్యక్షులు రిటైర్డ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, పియుసిఎల్ మాజీ జాతీయ అధ్యక్షుడు అయిన రాజిందర్ సచార్ కాగా సభ్యులు శ్రీ సయ్యద్ హమీద్, డా. టి.కె. ఊమెన్, శ్రీ ఎం.ఏ.బాసిత్, డా. రాకేశ్ బసంత్, డా. అఖ్తర్ మజీద్, డా. అబుసలే షరీఫ్‌లు. వీరిలో ఒక్క ఎం.ఏ బాసిత్ తప్ప అందరూ విద్యారంగంలో ఉన్నత పదవులు నిర్వహిస్తున్నవారే. బాసిత్ కర్నాటక రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళికా విభాగం డైరెక్టర్.

వీరు అందుబాట్లో ఉన్న అన్ని మూలాల నుంచి సమాచారం సేకరించి నవంబర్ 2006 కల్లా నివేదికను కేంద్ర ప్రభుత్వం ముందుంచారు. ముస్లింల స్థితిగతుల తులనాత్మక పరిశీలన ఈ నివేదిక లక్ష్యాలలో ముఖ్యమైనది కాబట్టి ఇతర సామాజిక వర్గాలతో పోలిక కోసం ఎస్‌సి, ఎస్‌టిలను ఒక వర్గంగా, ముస్లింలను ఒక వర్గంగా, 'ఇతరులను' ఒక వర్గంగా తీసుకున్నారు. కొన్ని విషయాలలో 'ఇతరుల'లో హిందూ వెనుకబడిన కులాలను వేరు చేసి ఒక వర్గంగా చూపించారు. కొన్ని విషయాలలో 'ఇతర మైనారిటీ'లను (అంటే సిక్కు, బౌద్ధ, క్రైస్తవ, యూదు, పార్సీలను) వేరు చేసి ఒక వర్గంగా చూపించారు. అన్ని విషయాలలోనూ ఆ అయిదు వర్గాలనూ విడివిడిగా లెక్కించి ఉంటే బాగుండేది. అట్లా చేయకపోవడానికి సమాచారపు లభ్యతలోని అసమగ్రత ముఖ్యకారణం అనిపిస్తుంది. మంచికైనా చెడుకైనా దేశ రాజకీయ సామాజిక సంవాదం నిర్మొహమాటంగా కులాల, మతాల ప్రాతిపదికన జరుగుతున్నప్పటికీ, పది సంవత్సరాలకొకసారి జరిగే జనాభా లెక్కలలో మాత్రం కులాలలో ఎస్‌సి, ఎస్‌టిలను మాత్రమే గుర్తించడం జరుగుతున్నది. అయితే నేషనల్ సాంపిల్ సర్వే సంస్థ (ఎన్ఎస్ఎస్ఓ) కులాన్ని ఒక సామాజిక వాస్తవికతగా గుర్తించడం వల్ల హిందూ కులాల స్థితిగతుల గురించి సమాచారం ఇప్పుడు కొంత లభ్యమవుతున్నది. సచార్ కమిటీ నివేదిక 2001 జనాభా లెక్కలపైననే కాక, ఎన్ఎస్ఎస్ఓ 61వ రౌండు (2004-2005) గణాంకాలపైన, పోలిక కోసం 55వ రౌండు (1999-2000) గణాంకాలపైన ప్రధానంగా ఆధారపడింది. ఇవి కాక అవసరాన్ని బట్టి వివిధ రాష్ట్ర ప్రభుత్వాల నుంచి, కేంద్ర ప్రభుత్వ శాఖల నుంచి సమాచారం సేకరించి ఉపయోగించుకున్నారు.

ముస్లింల పట్ల వ్యతిరేక భావాన్ని రెచ్చగొట్టడానికి వాడుకునే అనేక విషయాలను గణాంకాల ఆధారంగా విశ్లేషించి జవాబు చెప్పడం సచార్ కమిటీ నివేదిక చేసిన సేవలలో ఒకటి.

**జనాభా**

వీటిలో మొదటిది జనాభా. ముస్లింలు కుటుంబ నియంత్రణ పాటించరనీ ఒక్కొక్క మగవాడూ నలుగురు స్త్రీలను పెళ్లి చేసుకుంటాడనీ, అందువల్ల వారి జనాభా వేగంగా పెరిగి చివరికి భారతదేశంలో హిందువులు మైనారిటీ అయిపోయే ప్రమాదం ఉందనీ ఒక ప్రచారం సంఘ్‌పరివార్ చాలాకాలంగా చేస్తూ ఉంది. ముస్లింల పట్ల ద్వేషం అత్యధికంగా రెచ్చగొట్టబడ్డ గుజరాత్‌లో 'మేము అయిదుగురం, మా వాళ్లు ఇరవై నాలుగు' అన్న అసహ్యకరమైన నినాదం ముస్లింల గురించి నరేంద్రమోడి, ప్రవీణ్ తొగాడియా వంటి వారు ప్రచారం చేయడం జరిగింది. (ప్రతీ ముస్లిం పురుషుడూ నలుగురు భార్యలను చేసుకుంటాడనీ, ఒక్కొక్క భార్య ఆరుగురిని కంటుందనీ దీని భావం. అన్ని సామాజిక వర్గాలలాగే ముస్లింలలో కూడా పురుషుల కంటే స్త్రీల సంఖ్య కొంచెం తక్కువనీ, కాబట్టి ఒక్కొక్కడూ నలుగురిని చేసుకోవడం సాధ్యం కాదనీ గుర్తించగల సాధారణ లోకజ్ఞానానికి సహితం ఈ ప్రచారం అతీతం.)

సచార్ కమిటీ జనాభా లెక్కలన్నిటినీ పరిశీలించింది. ప్రాంతాల వారీగా, మత వర్గాల వారీగా విశ్లేషించింది. భారతదేశ జనాభా పెరుగుదల రేటు క్రమంగా తగ్గుతున్నదనీ అన్ని ప్రాంతాలలో అన్ని మతవర్గాలలో ఈ పోకడ కనిపిస్తుందనీ అయితే ముస్లింలలో ఈ మార్పు కొంచెం ఆలస్యంగా మొదలయిందనీ నిర్ధారించింది. 1961లో దేశ జనాభాలో ముస్లింలు 10.7 శాతం ఉన్నారనీ, 2001లో ముస్లిం జనాభా 13.4 శాతానికి చేరుకుందనీ, అయితే అన్ని వర్గాలలాగే ముస్లింలలో కూడా పెరుగుదల రేటు తగ్గుతూ ఉందనీ, ప్రస్తుత పోకడలు ఇట్లాగే కొనసాగితే ముస్లింల జనాభా దేశ జనాభాలో 18 లేక 19 శాతం దగ్గర స్థిరపడుతుందనీ సవివరంగా చూపించింది. ఇకనైనా ముస్లింలు దేశంలో మెజారిటీ అయిపోబోతున్నారన్న ప్రచారం సంఘ్‌పరివార్ ఆపుతుందేమో చూద్దాం.

మెజారిటీ అయిపోతారన్న ప్రచారం అవాస్తవమే అయినా, ముస్లింల నిష్పత్తి పెరుగుతున్న విషయం వాస్తవమే కదా అని సంఘ్‌పరివార్ అనవచ్చు. కానీ దీనికి కారణం వారు ప్రచారం చేసే మత సంబంధమైన విషయాలు కావు.

దేశ జనాభా పెరుగుదల రేటులో ప్రాంతాల వారీగా చాలా తేడాలున్నాయి. దక్షిణ భారతదేశంలోని నాలుగు రాష్ట్రాలలో అది వేగంగా పడిపోతున్నది. ముస్లింల జనాభా పెరుగుదల రేటు కూడా ఈ రాష్ట్రాలలోనే బాగా తగ్గిపోయింది. దక్షిణ భారతదేశంలోని ముస్లిం జనాభా పెరుగుదల రేటు ఉత్తర భారతదేశంలోని మొత్తం జనాభా పెరుగుదల రేటుకంటే తక్కువ. ఏ సామాజిక ఆర్థిక ప్రత్యేకతలైతే దక్షిణ భారతదేశంలో జనాభా నియంత్రణను వేగవంతం చేశాయో అవి దక్షిణ భారతదేశంలోని ముస్లింలమీదా పనిచేశాయి. అదే విధంగా ఏ కారణాలైతే ఉత్తర భారతదేశంలో జనాభా నియంత్రణ మందకొడిగా ఉండడానికి దోహదం చేశాయో ఆ కారణాలే అక్కడి ముస్లింలపైనా పని చేశాయి. మన దేశ జనాభాలోని ముస్లింలలో 22 శాతం ఉత్తరప్రదేశ్‌లోనే నివసిస్తున్నారని దృష్టిలో ఉంచుకుంటే ముస్లిం జనాభా పెరుగుదల రేటు సగటు జనాభా పెరుగుదల రేటు కంటే ఆలస్యంగా, మందకొడిగా తగ్గడానికి మామూలుగా ప్రచారమయ్యే కారణాల కంటే ఉత్తరప్రదేశ్ వెనుకబాటుతనం ముఖ్య కారణమని చెప్పుకోవచ్చునేమో! ముస్లింలు పెద్ద సంఖ్యలో నివసించే జమ్మూకాశ్మీర్ జనాభా పెరుగుదల రేటు కంటే ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, బీహార్, రాజస్థాన్‌ల జనాభా పెరుగుదల రేటు ఎక్కువ. ముస్లింల జనాభా పెరుగుదల గురించి పనిగట్టుకుని దుష్ప్రచారం చేసే సంఘ్ పరివార్‌కు సామాజికంగా, రాజకీయంగా బలం ఉండేది ఈ రాష్ట్రాలలోనే కావడం వల్ల ఎవరు ఎవరిని నిందించాలో తెలియని పరిస్థితి ఉందనుకోవాలి.

## స్త్రీల నిష్పత్తి ముస్లింలలో ఎక్కువ

2001 జనాభా లెక్కల ప్రకారం భారత జనాభాలో 1000 మంది మగవాళ్ళకు గాను 933 మంది మాత్రమే స్త్రీలు ఉన్నారన్న సమాచారం చాలా ఆందోళన కలిగించింది. 1961లో ఆ నిష్పత్తి 960 ఉండింది. ప్రకృతి సిద్ధంగా మగవాళ్ళే కొంచెం విరివిగా పుడతారు (105 మంది మగపిల్లలకు గాను 100 మంది ఆడపిల్లలు) గానీ మగవాళ్ళ ఆయుష్షు సగటున కొంచెం తక్కువ కాబట్టి ఎక్కువ సమాజాలలో స్త్రీలే మగవాళ్ళ కంటే ఎక్కువ ఉంటారు. దక్షిణ, తూర్పు ఆసియా దేశాలు దీనికి మినహాయింపు. ఆడపిల్లల పట్ల గర్భంలో ఉన్నప్పుడు మొదలుపెట్టి అమలయ్యే వివక్షే దీనికి కారణం.

> అయితే ఈ విషయంలో ముస్లింల స్థితి చాలా మెరుగు. ముఖ్యంగా పిల్లలలో అమ్మాయిల సంఖ్య ముస్లింలలో బాగా ఎక్కువ. 2001 లెక్కల ప్రకారం 5 సంవత్సరాల లోపు వయసున్న పిల్లలలో ప్రతి 1000 మంది మగపిల్లలకు గాను అమ్మాయిలు 928 కాగా ముస్లింలలో ఆ నిష్పత్తి 985. అంతేకాక శిశు మరణాల విషయంలో సాపేక్షంగా బాగా పేదలైన ముస్లింల స్థితే చాలా మెరుగ్గా ఉంది. దేశంలో పుట్టిన పిల్లలలో 1000కి 68 మంది 1 సంవత్సరం లోపల చనిపోతుండగా ముస్లింలలో ఆ సంఖ్య 55. 1000లో 95 మంది పిల్లలు 5 సంవత్సరాల లోపల చనిపోతుండగా ముస్లింలలో ఆ సంఖ్య 80. ఎంత పేదరికంలో ఉన్నా ముస్లింలే పిల్లలను, అందులో అమ్మాయిలను బాగా కాపాడుకుంటారని దీని భావం.

కారణాలు ఏవైతేనేం, దేశం మొత్తం మీద తీసుకున్నప్పుడు జనాభా పెరుగుదల రేటు 1970 తరువాత తగ్గుముఖం పట్టగా, ముస్లిం ప్రజానీకంలో ఈ తగ్గుదల దశాబ్దం ఆలస్యంగా మొదలైంది. దేశంలోని కొన్ని ప్రాంతాలలోనూ ఆలస్యంగానే మొదలైంది. కానీ తగ్గుదల మొదలైన తరువాత వేగంగా జరుగుతున్నది. 1991-2001ల మధ్య హిందువుల జనాభా పెరుగుదల రేటు 2.8 పాయింట్లు పడిపోగా, ముస్లింల జనాభా పెరుగుదల రేటు 3.4 పాయింట్లు పడిపోయింది. వాసెక్టమీ లేక ట్యూబెక్టమీ ఆపరేషన్ చేయించుకునే విషయంలో సంసిద్ధత ముస్లింలలో తక్కువే అయినప్పటికీ మిగతా గర్భనిరోధక చర్యలపట్ల అనుకూలత ఇతర ప్రజా సమూహాల కంటే ముస్లింలలో తక్కువ లేదని పరిశోధనలు తెలుపుతున్నాయి. ఈ శతాబ్దం చివరి నాటికి అన్ని సామాజిక వర్గాల జనాభా పెరుగుదల రేటు ఒకటవుతుందనీ, అప్పటికి ముస్లింల జనాభా దేశ జనాభాలో 18 లేక 19 శాతానికి చేరి అక్కడితో ఆగిపోతుందనీ సచార్ కమిటీ అంచనా వేసింది. ఏ రాష్ట్రాలలోనైతే దేశ ముస్లిం జనాభా సాపేక్షంగా ఎక్కువ ఉన్నారో ఆ రాష్ట్రాలలో వైద్య, ఆరోగ్య సేవలు, స్త్రీలలో విద్యాభివృద్ధి, పేదరికం తగ్గుదల మొదలైన లక్ష్యాలపైన ఇతర రాష్ట్రాలతో సమానంగా దృష్టిపెట్టి ఉంటే ఇంతటి తేడా కూడా బహుశా ఉండేది కాదని సచార్ కమిటీ అంటుంది. ఎందుకంటే స్వచ్ఛందంగా జనాభాను అదుపు చేసుకోవడానికి స్త్రీలలో మెరుగైన విద్యావ్యాప్తి, పిల్లల ఆరోగ్యానికి భరోసా, కనీస జీవన ప్రమాణాల భద్రత ఎక్కువగా దోహదం చేస్తాయని అన్ని పరిశోధనలూ తెలుపుతున్నాయి.

## విద్య: స్కూలు దశ

విద్య అంటే అక్షరాస్యత మాత్రమే కాదుగానీ అక్షరాస్యత సులభంగా అర్థమయ్యే ప్రమాణం. 2001 జనాభా లెక్కల ప్రకారం ఎస్‌సి, ఎస్‌టిలలో అక్షరాస్యత 52.2 శాతం, ముస్లింలలో 59.1 శాతం, ఇతరులలో 70.8 శాతం. మొదట్లో చెప్పినట్లు ఎస్‌సి, ఎస్‌టిల గణాంకాలు కలిపేయకుండా వేరుగా చూపించి ఉంటే ముస్లింలలో అక్షరాస్యత ఎస్‌సిలలో అక్షరాస్యతకు బాగా దగ్గర అన్న విషయం స్పష్టమయ్యేది.

అక్షరాస్యత తరువాత లెక్కించవలసింది స్కూలుకు పోతున్న పిల్లల నిష్పత్తి. దీనికి 1999–2000కు సంబంధించిన గణాంకాలనూ, 2004–2005కు సంబంధించిన గణాంకాలనూ సచార్ కమిటీ పరిశీలించింది. 1999–2000లో ముస్లిం పిల్లలలో స్కూలుకు పోయేవారి నిష్పత్తి హిందూ అగ్రకులాల కంటే, బిసిల కంటే బాగా తక్కువ ఉండింది గానీ ఎస్‌సి, ఎస్‌టిల కంటే మెరుగుగా ఉండింది. 2004–2005 నాటికి ఎస్‌సి, ఎస్‌టిలలో బడికి పోయే పిల్లల నిష్పత్తి ముస్లింలను దాటిపోయింది. ముస్లింలలో 6 నుంచి 14 సంవత్సరాల వయసున్న పిల్లలలో 25 శాతం అసలు బడి ముఖమే చూడనివారు – ఎస్‌సి, ఎస్‌టిలతో సహా వేరే ఏ సామాజిక వర్గం స్థితీ ఇంత అధ్వాన్నంగా లేదు. ఇతర వెనుకబడిన వర్గాల చదువుపట్ల ప్రభుత్వం పెడుతున్న శ్రద్ధతో పోలిస్తే ముస్లింల చదువుపట్ల పెడుతున్న శ్రద్ధ చాలా తక్కువ కావడం దీనికి ఒక ముఖ్య కారణం. ఒకవేళ ఏమైనా చేయాలని ప్రభుత్వానికి తోచినా 'ఓటు బ్యాంకు రాజకీయాలు' అంటూ గగ్గోలు పెట్టేవారు చాలామంది ఉండనే ఉన్నారు.

బడికి ఎందరు పోతున్నారన్న ప్రశ్న తరువాత, బడికి పోయిన వారు సగటున ఎన్ని సంవత్సరాలు చదువుతున్నారన్న ప్రశ్న వేసుకోవాలి. అన్ని వర్గాల సగటు 4 సంవత్సరాలు కాగా (అంటే బడికిపోయే పిల్లలు సగటున 4వ తరగతితో చదువు ఆపేస్తారని అర్థం) ముస్లింలలో 3 సంవత్సరాల 4 నెలలే. ఇది ఎస్‌సి, ఎస్‌టిలతో సహా అన్ని సామాజిక వర్గాల కంటే తక్కువ.

అయితే జనాభా పెరుగుదలలాగే బడికిపోయే పిల్లల నిష్పత్తి, సగటు విద్యా కాలాల విషయంలో కూడా ప్రాంతాలవారీగా తేడాలున్నాయి. దక్షిణ భారత రాష్ట్రాలు, గుజరాత్, మహారాష్ట్రలలో ముస్లింల స్థితి ఈ విషయంలో మెరుగుగానే ఉంది. మళ్లీ ప్రధాన లోపం హిందీ రాష్ట్రాలలోనే.

5వ తరగతి పూర్తి చేసిన వారెంత మంది, 7వ తరగతి పూర్తి చేసిన వారెంత మంది, 10వ తరగతి పూర్తిచేసిన వారెంత మంది, ఇంటర్ పూర్తి చేసిన వారెంత

మంది అన్న లెక్కలు తీస్తే, గ్రామీణ ప్రాంతాలలో ముస్లింల స్థితి సరిగ్గా ఎస్సి, ఎస్టిలతో సమానంగా ఉంది. ఎస్టిల కంటే ఎస్సిల స్థితి కొంత మెరుగ్గా ఉంటుంది కాబట్టి ఎస్సి, ఎస్టిలను కలిపేయకుండా వేరువేరుగా ముస్లింలతో పోల్చినట్టయితే గ్రామీణ ప్రాంతాలలో ముస్లింల విద్యా ప్రమాణాలు ఎస్సిల కంటే అధ్వాన్నంగా ఉన్నాయని కనిపించి ఉండేది. పట్టణ ప్రాంతాలలో మాత్రం ముస్లింలలో విద్యా ప్రమాణాలు పైస్థాయికి పోయే కొద్దీ దేశ సగటులో సగానికంటే ఎక్కువ లేకపోయినప్పటికీ ఎస్సి, ఎస్టిల కంటే మెరుగే.

గ్రామీణ ప్రాంతాల పిల్లలను పట్టణ ప్రాంతాల పిల్లలతో సమానం చేయగల ఉన్నత ప్రమాణాలు గల విద్యను అందించే లక్ష్యంతో జవహర్ నవోదయ విద్యాలయాలు ఏర్పడ్డాయి. దేశంలో అవి 551 ఉన్నాయి. వాటిలో ఒకటిన్నర లక్షల మంది పిల్లలు చదువుకుంటున్నారు. అయితే ఈ స్కూళ్ళలో ముస్లిం విద్యార్థుల నిష్పత్తి 4 శాతం మాత్రమే. దేశ జనాభాలో ముస్లింలు 13.4 శాతం అని (పోనీ గ్రామీణ జనాభానే తీసుకుంటే గ్రామీణ భారతంలో ముస్లింలు 12 శాతం అని) దృష్టిలో పెట్టుకుంటే ఇది వారి జనాభా వాటాతో పోలిస్తే చాలా తక్కువ.

స్కూలులో చేరడమేకాదు, చదువు పూర్తి చేయడమూ ముఖ్యమే అని చెప్పుకున్నాం. స్కూలులో చేరిన ముస్లిం పిల్లలలో 44 శాతం మంది మాత్రమే 5వ తరగతి పూర్తి చేస్తున్నారు. ఎస్సిలలో ఇది 39 శాతం, ఎస్టిలలో (ఇక్కడ ఈ రెండు గణాంకాలు వేరు వేరుగా చూపారు) 32 శాతం. అయితే 5వ తరగతి పాసైన వారిలో ఎంత మంది 7వ తరగతి పూర్తి చేస్తారు, 7వ తరగతి పాసైన వారిలో ఎంత మంది హైస్కూలు పూర్తిచేస్తారు అన్న లెక్కలలో ముస్లింలు ఎస్సి, ఎస్టిలతో సమానం (మొదటిది 65 శాతం, రెండవది 50 శాతం). హైస్కూలు పాసైన వారిలో ఎంతమంది కాలేజీ చదువు పూర్తి చేస్తారన్న లెక్క తీసుకుంటే, ముస్లింలలో అది 26 శాతం, ఎస్సి, ఎస్టిలలో 23 శాతం. ఈ అన్ని విషయాలలోనూ 'ఇతరులు' – అంటే హిందూ సవర్ణకులాలు – సాపేక్షంగా బాగా మెరుగైన స్థితిలో ఉన్నారని వేరే చెప్పనవసరం లేదు. స్కూలులో చేరే వారిలో 5వ తరగతి పాసయ్యే వారిలో 7 పూర్తి చేసేవారు 75 శాతం, 7వ తరగతి పాసయ్యే వారిలో హైస్కూలు పూర్తిచేసేవారు 62 శాతం, హైస్కూలు పూర్తిచేసే వారిలో కాలేజీ పూర్తి చేసే వారు 34 శాతం ఉన్నారు. ఇందులో అగ్ర కులాలను, బిసిలను వేరు చేస్తే – హిందూ అగ్ర కులాలతో పోల్చినప్పుడు ముస్లింల స్థితి ఎంత అధ్వాన్నంగా ఉందో ఇంకా స్పష్టం అవుతుంది.

## విద్య : కాలేజీ దశ

ఉద్యోగాలకు కాలేజీ డిగ్రీ, అందులోనూ ఏదైనా సాంకేతిక విద్యకు సంబంధించిన డిగ్రీ లేక డిప్లొమా చాలా ముఖ్యం. ఈ విషయంలో ముస్లిం ప్రజానీకం చాలా వెనుకబడి ఉన్నారని సచార్ కమిటీ నివేదిక తెలుపుతుంది. దేశ జనాభాలో 20 సంవత్సరాల వయసు పైబడిన వారిలో 3.8 కోట్ల మందికి ఏదైనా డిగ్రీ లేక డిప్లొమా ఉంది. ఇది ఆ వయసుగల జనాభాలో 6 శాతం. అందులో సాంకేతిక విద్యలో క్వాలిఫికేషన్ పొందిన వారు వెయ్యిలో 70 మంది. ముస్లింలలో 20 సంవత్సరాల వయసు పైబడిన వారిలో డిగ్రీ లేక డిప్లొమా గల వారు వెయ్యిలో 10 మంది మాత్రమే. వారి స్థితి ఎస్‌సి ఎస్‌టిల కంటే కొంచెం మెరుగే అయినా 'ఇతరుల'తో పోలిస్తే సగం కంటే తక్కువ.

ఉన్నత విద్య విషయంలో సచార్ కమిటీ బిసిల గణాంకాలు విడిగా సేకరించింది కాబట్టి బిసిల స్థితినీ ముస్లింల స్థితినీ పోల్చవచ్చు. ఒక సామాజిక వర్గానికి ఉన్నంతలో న్యాయం జరుగుతున్నదని చెప్పాలంటే దేశ జనాభాలో వారి నిష్పత్తి ఎంత ఉందో డిగ్రీ లేక డిప్లొమా పొందిన విద్యావంతులలో వారి నిష్పత్తి అంత ఉండాలి. బిసిల విషయంలో డిగ్రీ లేక డిప్లొమా పొందిన వారి నిష్పత్తి దేశ జనాభాలో బిసిల నిష్పత్తిలో 2/3వ వంతు ఉండగా, ముస్లింలలో ఇది 1/2 మాత్రమే. (ముస్లింలకు విద్యా ఉద్యోగ రంగాలలో రిజర్వేషన్లు ఇవ్వడాన్ని కొన్ని బిసి సంఘాలు కూడా వ్యతిరేకిస్తున్నాయి కాబట్టి వారి స్థితి వీరి కంటే అన్యాయం అని గుర్తించడం అవసరం). హిందూ అగ్రకులాల విషయానికొస్తే, జనాభాలో వారి వాటా కంటే డిగ్రీ లేక డిప్లొమా గల వారిలో వారి వాటా రెండున్నర రెట్లను మించి ఉంది. అయినా ముస్లింల మేలుకోసం ప్రభుత్వం ఏం చేయజూసినా 'ఓటు బ్యాంకు రాజకీయాలు' అంటూ రోడ్డెక్కి అరిచేది ఎక్కువగా వీళ్ళే.

ఉద్యోగ అర్హతలలో సాంకేతిక విద్యకుండే ప్రాముఖ్యం తెలిసిందే. 2001 సెన్సెస్ ప్రకారం 20 సంవత్సరాలు పైబడిన దేశ జనాభాలో 1000లో 70 మందికి సాంకేతిక విద్యలో డిగ్రీ లేక డిప్లొమా ఉండగా, ముస్లింలలో 1000లో 10 మందికే ఉన్నాయన్న సమాచారాన్ని పైన ప్రస్తావించాము. 2004-2005 ఎన్ఎస్ఎస్ రౌండ్ సేకరించిన సమాచారాన్ని ఆధారం చేసుకుని ఈ విషయాన్ని సచార్ కమిటీ మరింత వివరంగా విశ్లేషించింది. వెనుకబడిన వర్గాల వారు డిగ్రీల విషయంలో పోటీపడలేకపోయినా డిప్లొమాల విషయంలో పడగలరన్న

అభిప్రాయం ఉంటుంది. కాబట్టి సచార్ కమిటీ రెండిటి గణాంకాలనూ వేరువేరుగా విశ్లేషించింది. డిగ్రీల విషయం చూస్తే, అగ్రకులాలలో 20 సంవత్సరాలు పైబడిన వారిలో వెయ్యిలో 80 మందికి పైగా సాంకేతిక విద్యలో డిగ్రీలు కలిగి ఉండగా బిసిలలో 20 మంది, ఎస్‌సి ఎస్‌టిలలో 10 మంది, ముస్లింలలో 17 మంది కలిగి ఉన్నారు. డిప్లొమాల విషయమే చూసినా హిందూ అగ్రకులాలలో 20 సంవత్సరాల వయసు పైబడిన జనాభాలో వెయ్యిలో 40 మంది డిప్లొమాలు కలిగి ఉన్నారు. బిసిలలో 20 మంది, ఎస్‌సి ఎస్‌టిలలో 10 మంది, ముస్లింలలో 15 మంది డిప్లొమా పాసైనవారు ఉన్నారు.

రిజర్వేషన్ల రూపంలో గానీ, ఇతర రూపాలలో గానీ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టడంవల్ల హైందవ సమాజానికి చెందిన బిసిలు, ఎస్‌సి ఎస్‌టిలు కాలక్రమంలో ఉన్నత విద్య విషయంలో తమ స్థితిని కొద్దిగా మెరుగు పరుచుకోగలుగుతుండగా చదువు విషయంలో ప్రభుత్వం ఏ ప్రత్యేక చర్యలు చేపట్టని ముస్లింలలో ఇది సాపేక్షంగా స్వల్పంగా ఉంది. పాత గణాంకాలు దొరకడం కష్టం కాబట్టి కాలానుగతమైన మార్పును అంచనా వేయడానికి సచార్ కమిటీ ఇప్పుడున్న జనాభాలోనే తరాల మధ్యనున్న తేడాను విశ్లేషించే మార్గం ఎంచుకుంది. 51 సంవత్సరాలు పైబడిన వివిధ సామాజిక వర్గాలలో కాలేజీ చదువు పూర్తిచేసిన వారి నిష్పత్తిని తీసుకొని, 40–50 సంవత్సరాలు, 30–40 సంవత్సరాలు, 20–30 సంవత్సరాలు మధ్యనున్న వారిలో అదే నిష్పత్తితో పోల్చారు. మొదటి వర్గం స్వాతంత్ర్యం వచ్చిన తరువాత విద్యావంతులైన తొలితరం స్థితిని సూచిస్తుందని భావించినట్టయితే, అప్పట్లో అగ్రకులాలలో డిగ్రీ చదువుకున్నవారి నిష్పత్తితో పోలిస్తే ముస్లింలలో ఆ నిష్పత్తి అయిదవవంతే ఉన్నప్పటికీ, బిసిలు, ఎస్‌సి ఎస్‌టిల కంటే ముస్లింలే మెరుగు. కానీ, ఆ తరువాత బిసి, ఎస్‌సి, ఎస్‌టిలు సాపేక్షంగా కొంత వేగంగానే తమ స్థితిని మెరుగుపరుచుకోగా ముస్లింలు వెనుకబడ్డారు. అప్పటికీ ఇప్పటికీ అగ్రకులాలలో అది మూడున్నర రెట్లయింది. ముస్లింలలో రెండుంబావు రెట్లయింది. ఇప్పుడు బిసి జనాభాలో డిగ్రీ చదువుకున్న వారి నిష్పత్తి ముస్లింలలో అదే నిష్పత్తి కంటే 50 శాతం ఎక్కువ. ఎస్‌సి ఎస్‌టిలలో ఆ నిష్పత్తి ఇప్పటికింకా ముస్లింల కంటే తక్కువే ఉన్నప్పటికీ ఇవే పాలనా విధానాలు కొనసాగితే ఇంకొక్క తరంలో ఎస్‌సి ఎస్‌టిలు ఈ విషయంలో ముస్లింలను దాటిపోగలరు. (అయితే ఇక్కడ ఎస్‌సి, ఎస్‌టిలను కలిపేసిన విషయం గుర్తుంచుకోవాలి. విడదీసినట్టయితే ఎస్‌సిలలో డిగ్రీ ఉన్న వారి నిష్పత్తి ఇప్పటికే ముస్లింలలో అదే నిష్పత్తికి చేరువై ఉండవచ్చు. ఎస్‌టిలలో ఇంకొక రెండు

తరాలకు కూడా కాకపోవచ్చు.) పట్టణ ప్రాంతాలను విడిగా తీసుకుంటే చాలా రాష్ట్రాలలో ఇప్పటికే ముస్లింలు ఎస్‌సి ఎస్‌టిల కంటే ఈ విషయంలో వెనుకబడి ఉన్నారని సచార్ కమిటీ అంటుంది. ముస్లింలకు కూడా విద్యారంగంలో రిజర్వేషన్లు, స్కాలర్‌షిప్పులు, ఆశ్రమ పాఠశాలలు వగైరా నెలకొల్పవలసిన అవసరానికి ఇంత కంటే బలమైన వాదన అక్కరలేదు.

## విద్య: ఉన్నత స్థాయి

పేరుగాంచిన ఉన్నత విద్యా సంస్థలలో ముస్లింల స్థానం ఏమిటి అన్న ప్రశ్నకు జవాబు ఇంకా నిరాశాజనకంగా ఉండబోతుందని ఊహించడం కష్టం కాదు. బిసిలకు రిజర్వేషన్ ఇస్తామంటేనే అగ్రకులాల వారు నానా రచ్చ చేసి సుప్రీంకోర్టుకు పోయి స్టే తెచ్చుకున్న ఐఐఎం, ఐఐటిల గురించి సచార్ కమిటీ సమాచారం సేకరించింది. ఐఐఎంలలోని 4,743 మంది విద్యార్థులలో కేవలం 63 మంది ముస్లింలు (1.3 శాతం) ఐఐటిలలోని 27,161 మంది విద్యార్థులలో 894 మంది ముస్లింలు (3.3 శాతం) ఉన్నారు. దేశ జనాభాలో ముస్లింలు (2001 జనాభా లెక్కల ప్రకారం) 13.4 శాతం అన్న విషయం దృష్టిలో ఉంచుకోవాలి. ప్రతిష్టాత్మకమైన వైద్య విద్యాసంస్థలలో కూడా ఇదే పరిస్థితి. ముస్లిం విద్యార్థులు కేవలం 4 శాతం ఉన్నారు.

2004-2005 సంవత్సరానికి సంబంధించి 129 విశ్వవిద్యాలయాల సమాచారం సేకరించిన సచార్ కమిటీ పోస్ట్‌గ్రాడ్యుయేట్ కోర్సులలో ముస్లింలు అతి తక్కువగా ఉన్న విషయాన్ని చూపించింది. మొత్తం పిజి విద్యార్థులలో 50 శాతం కంటే కొంచెం ఎక్కువ హిందూ అగ్రకులాలు, 24 శాతం బిసిలు, 14 శాతం దాకా ఎస్‌సి ఎస్‌టిలు ఉండగా 5 శాతం మాత్రమే ముస్లింలు ఉన్నారు. (మిగిలిన వారు సిక్కులు, బిసి జాబితాలో లేని క్రైస్తవులు వగైరా.) విద్యా వ్యవస్థలో రిజర్వేషన్లు లేకపోవడం వల్ల ముస్లింలు ఎంతగా వెనుకబడి పోయారో ఈ గణాంకాలు స్పష్టంగా చూపిస్తాయి.

## మదరసాలు, మాధ్యమం

ముస్లింలు పిల్లలను బడికి పంపే బదులు మదరసాలకు పంపుతారు కాబట్టి వారిలో విద్యా ప్రమాణాలు తక్కువగా ఉండవచ్చుననీ, అది వారి తప్పే కనుక ప్రభుత్వాన్ని గానీ హిందూ సమాజాన్ని గానీ నిందించడంలో అర్థం లేదని వాదించేవారు ఉంటారు. దీనిని దృష్టిలో ఉంచుకుని సచార్ కమిటీ ఎంతమంది ముస్లిం పిల్లలు మదరసాలకు పోతున్నారన్న సమాచారం కూడా సేకరించింది. ఈ

సమాచారం సారాంశం ఏమిటంటే బడికిపోయే ముస్లిం పిల్లలలో 66 శాతం ప్రభుత్వ పాఠశాలలకు పోతారు. 30 శాతం ప్రైవేట్ పాఠశాలలకు పోతారు. 4 శాతం మాత్రమే మదరసాలలో చదువుకుంటారు. ఉత్తర భారతదేశంలో ఈ నిష్పత్తి 7 శాతం దాకా ఉండగా దక్షిణ భారతదేశంలో 1.7 శాతం మాత్రమే. ఏదైనా, విద్యా విషయంలో ముస్లింలు వెనుకబడి ఉండడానికి మదరసాలకు పోవడం కారణం ఎంతమాత్రం కాదు.

ఇక్కడ అవగాహనా లోపం వల్ల తలెత్తే గందరగోళం కొంత ఉందని సచార్ కమిటీ గుర్తించి దానిని కూడా వ్యాఖ్యానించింది. మదరసా అనేది పాఠశాల. అది లౌకిక పాఠశాలకు ప్రత్యామ్నాయం. మదరసాకు పోయే పిల్లలు లౌకిక పాఠశాలలకు పోరు. కానీ కేవలం మత బోధ చేయడానికి మసీదులకు అనుబంధంగా మక్తాబ్ అనే ధార్మిక విద్యాసంస్థ ఉంటుంది. అందులో అరబ్బీ నేర్పిస్తారు, ఖురాన్ చదివిస్తారు. ఇది లౌకిక పాఠశాలకు ప్రత్యామ్నాయం కాదు. లౌకిక పాఠశాలకు పోయే పిల్లలు అదనంగా మక్తాబ్‌లకు కూడా మతబోధ కోసం పోతారు. ఈ రెండింటికీ తేడా తెలియక అన్నిటినీ మదరసాలుగా భావించడం వల్ల మదరసాలలో చదువుకునే ముస్లిం పిల్లల సంఖ్య చాలా ఎక్కువ అనే అభిప్రాయం ప్రచారం అయిందని సచార్ కమిటీ వ్యాఖ్యానించింది. అయితే రెండింటినీ కూడినా కూడా వచ్చే సంఖ్య తక్కువే. ఎందుకంటే స్కూలుకు పోయే పిల్లలలో మతబోధ కోసం ఊరి మసీదుకు అనుబంధంగా ఉండే మక్తాబ్‌కు పోయే పిల్లలు 4 శాతమే. అంటే మదరసాలు, మక్తాబ్‌లూ కలిపినా వాటికి హాజరయ్యే పిల్లలు 8 శాతమే కాబట్టి ధార్మిక పాఠశాలలకు పిల్లలను పంపడం పట్ల ముస్లిం పెద్దలకున్న మోజువల్ల వారిలో అవిద్య ప్రబలిందన్న నిందకు ఆధారం లేదు.

మరైతే కారణాలేమిటి అన్న ప్రశ్న వేసుకున్నప్పుడు పేదరికం అధికంగా ఉండే అన్ని సామాజిక వర్గాలకూ సామాన్యంగా ఉండే కారణాలతో బాటు కొన్ని ప్రత్యేకమైన కారణాలు కూడా కనిపిస్తాయి. నిజానికి పేదరికం ఒక్కటే వెనుకబాటుతనానికి కారణం కాదని రుజువు చేసే గణాంకాలు కూడా సచార్ కమిటీ ఇచ్చింది. ముస్లింలలో పేదలను, ఇతరులను వేరుచేసి ఈ రెండు ఉపవర్గాలూ సమాజంలోని విద్యావంతులలో ఏ నిష్పత్తిలో ఉన్నారో తెలిపే గణాంకాలు ఇచ్చింది (పేదలు అనే మాటను ఏ విధంగా నిర్వచించారనేది ప్రస్తుతానికి అనవసరం – నిర్వచనం ఇటూ అటూ మార్చినా గణాంకాలలో తేడా ఏమీ రాబోదు). దేశ జనాభాలో ముస్లింలు 2001 జనాభా లెక్కల ప్రకారం 13.4

శాతం అని చెప్పుకున్నాం. 2004–2005 ఎన్ఎస్ఎస్ లెక్కల ప్రకారం పేద వర్గాలకు చెందిన గ్రాడ్యుయేట్లలో ముస్లింలు 10.5 శాతం, ఇతర వర్గాలకు చెందిన గ్రాడ్యుయేట్లలో 6.8 శాతం. పేద వర్గాలలోని పోస్ట్‌గ్రాడ్యుయేట్లలో ముస్లింలు 7 శాతం, ఇతర వర్గాలలోని పోస్ట్‌గ్రాడ్యుయేట్లలో 6.4 శాతం. గ్రాడ్యుయేట్లలో పేదవర్గాలలోనే ముస్లింల నిష్పత్తి ఎక్కువ ఉండడం ఆశ్చర్యం కలిగించవచ్చును గానీ, అందులో ఆశ్చర్యపడడానికేమీ లేదు. అన్ని అవకాశాలలోనూ సింహభాగం తీసుకునేది హిందూ అగ్రకులాలు. పేదలలో వారి సంఖ్య తక్కువ కాబట్టి వారి తాకిడి తక్కువ. కాబట్టి పేద వర్గాలలో ఎస్‌సి, ఎస్‌టి, బిసిలు, ముస్లింలు వాటా కోసం ఎక్కువ పోటీపడతారు. అయితే ఇక్కడ ప్రస్తుతం ఏమిటంటే పేదలు కాని ముస్లింలు సహితం గ్రాడ్యుయేట్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్లలో తమ జనాభా దామాషాలో సగం కూడా లేరు.

ప్రత్యేక కారణాలలో మాధ్యమాన్ని సచార్ కమిటీ వివరంగా ప్రస్తావించింది. ముస్లింలందరి మాతృభాష ఉర్దూ కాకపోయినప్పటికీ ఉర్దూ మాతృభాష అయిన వారికి తమ మాతృభాషలో చదువుకునే అవకాశం సరిగ్గా లభ్యం కావడం లేదని గణాంకాలతో సహా చూపించింది. ఒక్క మహారాష్ట్రలో మాత్రమే ముస్లింలలో ఎంత నిష్పత్తి ఉర్దూను తమ మాతృభాషగా భావిస్తారో ముస్లిం పిల్లలలో అంత నిష్పత్తి ఉర్దూ మాధ్యమంలో చదువుకుంటున్నారు. కర్నాటక ముస్లింలలో దాదాపు 70 శాతం ఉర్దూను మాతృభాషగా భావిస్తుండగా ముస్లిం పిల్లలలో 45 శాతం మంది మాత్రమే ఉర్దూ మాధ్యమంలో చదువుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ముస్లింలలో 80 శాతం ఉర్దూ తమ మాతృ భాషగా భావిస్తుండగా (ఈ నిష్పత్తి దేశంలోని అన్ని రాష్ట్రాల కంటే ఆంధ్రప్రదేశ్‌లోనే ఎక్కువ) 20 శాతం మంది మాత్రమే ఉర్దూ మాధ్యమంలో చదువుకుంటున్నారు. బీహార్‌లో 60 శాతం ముస్లింలు ఉర్దూ మాతృభాష కలవారు కాగా వారి పిల్లలలో 30 శాతం మాత్రమే ఉర్దూ మాధ్యమంలో చదువుకుంటున్నారు. అయితే అన్నిటికంటే అధ్వాన్నమైన స్థితి ఉర్దూకు పుట్టినిల్లయిన ఉత్తరప్రదేశ్‌ది. అక్కడ ముస్లింలలో 45 శాతానికి మాతృభాష ఉర్దూ కాగా ఉర్దూ మాధ్యమంలో చదువుకుంటున్న ముస్లింల పిల్లలు 2 శాతం మాత్రమే! దేశంలోని ముస్లింలలో 22 శాతం ఉత్తరప్రదేశ్ వాసులేనని గుర్తుంచుకుంటే మాతృభాషలో విద్యాబోధన ముస్లిం పిల్లలకు ఎంతగా నిరాకరించబడుతున్నదో అర్థం అవుతుంది. ఉన్నంతలో ఉర్దూ మాధ్యమానికి మహారాష్ట్ర, కర్నాటక, ఆంధ్రప్రదేశ్‌లలో ప్రోత్సాహం లభిస్తున్నదనీ, ఉత్తర భారతదేశంలోని ప్రభుత్వాలు తమకు సమాచారం ఇచ్చే విషయంలో సహితం

నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించాయనీ సచార్ కమిటీ అనింది. ముస్లింల వెనుకబాటుతనంలో 'హిందీ రాష్ట్రాల' పాపం చాలా ఉందని మొదట్లోనే చెప్పుకున్నాం కదా.

## ఉపాధి

సచార్ కమిటీ అవకాశాలను మూడుగా వర్గీకరించి ముస్లింల ఉపాధి పరిస్థితిని విశ్లేషించింది. స్వయం ఉపాధి, దిన కూలీ (క్యాజువల్), స్థిరమైన ఉద్యోగాలు (రెగ్యులర్) అనే మూడు విభాగాలను సచార్ కమిటీ గుర్తించింది. ముస్లింలలో అధికభాగం స్వయం ఉపాధిపైన, ఆ తరువాత దినకూలిపైన, ఆ తరువాత స్థిరమైన ఉద్యోగాలపైన ఆధారపడతారని సమాచారాన్ని విశ్లేషించి తెలిపింది. హిందూ అగ్రకులాలకు స్వయం ఉపాధి ప్రథమం (ఇందులో వ్యవసాయం కూడా ఉందని గుర్తుంచుకోవాలి), స్థిరమైన ఉద్యోగాలు ద్వితీయం, దినకూలి తృతీయం. ఎస్‌సి ఎస్‌టిలకు దినకూలి ప్రథమం, స్వయం ఉపాధి ద్వితీయం, స్థిరమైన ఉద్యోగాలు తృతీయం. హిందూ బిసి కులాలకు కూడా స్వయం ఉపాధి ప్రథమం, కానీ మిగిలిన రెండూ దాదాపు ఒకే మోతాదులో జీవనాధారం కల్పిస్తాయి.

స్థిరమైన ఉద్యోగాల విషయంలో ముస్లింలది అన్ని ఇతర సామాజిక వర్గాల కంటే దయనీయమైన స్థితి. స్థిరమైన ఉద్యోగాలు ఎక్కువగా లభించేది పట్టణ ప్రాంతాలలోనే కాబట్టి ఈ విషయం చూడడానికి పట్టణ ప్రాంత జనాభాను విడిగా తీసుకోవచ్చు. పట్టణ ప్రాంత అగ్రకులాలలోని ఉద్యోగులు, కార్మికులలో 49 శాతానికి స్థిరమైన ఉద్యోగాలుండగా, ఎస్‌సి ఎస్‌టిలలో ఈ నిష్పత్తి 40 శాతం, బిసిలలో 36 శాతం, ముస్లింలలో కేవలం 27 శాతం. అదే పట్టణ ప్రాంతాలలో ముస్లింలలో 64 శాతం మంది స్వయం ఉపాధిపైన ఆధారపడుతుండగా, బిసిలలో ఆ నిష్పత్తి 51 శాతం, హిందూ అగ్రకులాలలో 55 శాతం, ఎస్‌సి ఎస్‌టిలలో 43 శాతం. అయితే 'స్వయం ఉపాధి' అనే దాంట్లో కడుపు నిండా కూడు పెట్టని నికృష్టమైన పనుల నుంచి మంచి ఆదాయమిచ్చే వాటిదాకా చాలా ఉంటాయి. కాబట్టి ప్రధానంగా స్వయం ఉపాధి పైన ఆధారపడే ముస్లింలు ఏ రకమైన వృత్తులలో లేక వ్యాపకాలలో ఎక్కువగా ఉన్నారో తెలుసుకుంటే తప్ప చిత్రం పూర్తికాదు. ముస్లింలు అధికంగా పనిచేసే రంగాలు పొగాకు ఉత్పత్తులు (ఈ రంగంలో పనిచేసే కార్మికులలో మగవాళ్ళలో 41 శాతం, ఆడవాళ్ళలో 35 శాతం ముస్లింలు), దుస్తుల తయారీ (మగవాళ్ళలో 30 శాతం, ఆడవాళ్ళలో 17 శాతం

ముస్లింలు), మోటార్ వాహనాల అమ్మకం, రిపేరు (26 శాతం ముస్లింలు) ఎలక్ట్రికల్ ఉత్పత్తులు (23 శాతం ముస్లింలు), వర్తక రంగంలో పనిచేసే ఉద్యోగులు (27 శాతం ముస్లింలు).

స్వయం ఉపాధిపైన ఆధారపడే వారిలో వీధివీధీ తిరుగుతూ వస్తువులు అమ్మేవారు 8 శాతం కాగా ముస్లింలలో ఆ నిష్పత్తి 12 శాతం. స్వయం ఉపాధిపైన ఆధారపడే స్త్రీలలో స్వంత ఇంట్లోనే పనిచేసేవారు 51 శాతం కాగా, ముస్లింలలో అది 70 శాతం. ముస్లిం స్త్రీలు బయటికి పోయి పని చేయడం సాంప్రదాయక కట్టడి కారణంగా కష్టం కావడం వల్ల చిన్నాచితక ఉత్పత్తి కేంద్రాలు, షాపులు ఇంట్లో నుండే నడుపుతారు. స్వంత శ్రమతో ఇంట్లోనే ఉండి ఉపాధి పొందే మహిళల నిష్పత్తి ముస్లింలలో ఇతర సామాజిక వర్గాలలో కంటే ఎక్కువ. శ్రామికులుగా నమోదైన ముస్లిం మహిళలలో దాదాపు 80 శాతం ఈ కోవకు చెందినవారు. వేరే ఏ సామాజిక వర్గంలోనూ ఈ నిష్పత్తి 65 దాటదు. ఈ రకమైన పని ఎక్కువగా సబ్ కాంట్రాక్టు రూపంలో ఉంటుందనీ, ఆరోగ్యమూ, ఆదాయమూ రెండూ కూడా హీనంగా ఉంటాయనీ సచార్ కమిటీ వ్యాఖ్యానించింది.

స్వయం ఉపాధి అనేది అసంఘటిత రంగంలో భాగం. ఇంగ్లీషులో ఇన్‌ఫార్మల్ సెక్టర్ అంటారు. అయితే అసంఘటిత రంగంలో వేరే ఉపాధి ప్రక్రియలు కూడా ఉన్నాయి. సంఘటిత రంగంతో పోలిస్తే ఇక్కడ ఆదాయాలు తక్కువ. అభద్రత ఎక్కువ. ముస్లింలలో వేరే అన్ని సామాజిక వర్గాల కంటే ఎక్కువ మంది అసంఘటిత రంగంలో ఉన్నారు. పట్టణ ప్రాంత కార్మికులలో సంఘటిత రంగంలో ఉండేవారి నిష్పత్తి బిసిలలో 22 శాతం, ఎస్‌సి ఎస్‌టిలలో 18 శాతం ఉండగా ముస్లింలలో 8 శాతం మాత్రమే.

పోలీసులలోనూ, సైన్యంలోనూ ముస్లింలు ఎందరున్నారన్న సమాచారం సచార్ కమిటీ సంబంధిత ప్రభుత్వ శాఖల నుంచి కోరినప్పుడు భారతీయ జనతాపార్టీ నేతలు చాలా రచ్చచేసిన విషయం పత్రికలలో చదివాము. అయినప్పటికీ సచార్ కమిటీ ఆ సమాచారం సేకరించగలిగింది. రక్షణ రంగంలోని వివిధ హోదాలలో హిందూ అగ్రకులాలు 52 శాతం, బిసిలు 23 శాతం, ఎస్‌సి ఎస్‌టిలు 12 శాతం ఉండగా ముస్లింలు కేవలం 4 శాతం ఉన్నారు. కేంద్ర పోలీసు సంస్థలలో హిందూ అగ్రకులాలు 42 శాతం, బిసిలు, ఎస్‌సి ఎస్‌టిలు చెరి 23 శాతం ఉండగా ముస్లింలు 6 శాతం ఉన్నారు. రాష్ట్ర పోలీసు

సంస్థలలో అగ్రకులాలు 37 శాతం, బిసిలు 21 శాతం, ఎస్‌సి ఎస్‌టిలు 26 శాతం ఉండగా ముస్లింలు 7 శాతం ఉన్నారు. ఇవి 2004–2005 గణాంకాలు కాగా, 2001 జనాభా లెక్కల ప్రకారమే దేశ జనాభాలో ముస్లింలు 13.4 శాతం అని పైన చూశాము. 'మత ఘర్షణల'లో పోలీసులు, ఇతర భద్రతా సిబ్బంది హిందువుల పట్ల పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని తరచుగా వినవచ్చే ఆరోపణల వెనుక ఈ వాస్తవం కూడా ఉందని గుర్తుంచుకోవాలి.

కార్మికులలో ఏరోజుకారోజు పని వెతుక్కునే వారిని క్యాజువల్ అనీ, కొంత స్థిరత్వం ఉండే ఉద్యోగులను రెగ్యులర్ అనీ అనడం రివాజు. క్యాజువల్ కార్మికులెవరికీ పని భద్రత ఉండదు. రెగ్యులర్ అని పిలవబడే వారందరికీ కూడా ఒకే రకమైన భద్రత ఉండదు. లిఖితపూర్వకమైన అపాయింట్‌మెంట్ ఆర్డర్ ఉండటం కొంత ఎక్కువ భద్రత ఇస్తుంది. సామాజిక వర్గాల వారీగా రెగ్యులర్ కార్మికులలో ఎంత మందికి ఈ మేరకు భద్రత ఉందని లెక్కలు వేస్తే ముస్లింలది అందరి కంటే అధ్వాన్నమైన స్థితి. రెగ్యులర్ ఉద్యోగాలు చేస్తున్నారు అనుకునే ముస్లింలలో 72 శాతానికి అపాయింట్‌మెంట్ లెటర్ లేదు. హిందూ అగ్రకులాలలో ఈ నిష్పత్తి 50 శాతం కాగా, బిసిలలో, ఎస్‌సి ఎస్‌టిలలో 62 శాతం. లిఖిత పూర్వకమైన ఉద్యోగ ఒప్పందం ఉన్న వారిలో మూడేళ్ళు మించిన ఉద్యోగకాలం (టెన్యూర్) ఉన్నవారు అగ్రకులాలలో 42 శాతం కాగా, బిసిలలో 32 శాతం, ఎస్‌సి ఎస్‌టిలలో 34 శాతం, ముస్లింలలో 23 శాతం. ప్రావిడెంట్ ఫండ్ వంటి హక్కులు కలిగి ఉండేవారు హిందూ అగ్రకులాలకు చెందిన ఉద్యోగులలో 55 శాతం మంది ఉండగా అది బిసిలలో 42 శాతం, ఎస్‌సి ఎస్‌టిలలో 43 శాతం, ముస్లింలలో 29 శాతం. నికరమైన నెల జీతం ఉండేవారు అగ్రకులాలకు చెందిన రెగ్యులర్ ఉద్యోగులలో 95 శాతం, బిసిలలోనూ ఎస్‌సి ఎస్‌టిలలోనూ 89 శాతం, ముస్లింలలో 82 శాతం మంది ఉన్నారు.

ఒక పద్ధతి ప్రకారం కనిపించే పై వ్యత్యాసాలకు వివక్షే కారణం కాకపోవచ్చు. ముస్లింలు ఎక్కువగా పనిచేసే ఆర్థిక రంగాల స్వభావమే అది కావచ్చు. అయితే ఆ ఆర్థిక రంగాలకు ఆ స్వభావం ఉండడానికి కారణం వాటిలో ఎక్కువగా ముస్లింలు పని చేయడమేనేమో అని కూడా చూడవలసి ఉంటుంది.

## బ్యాంకు రుణాలు

ఒక సామాజిక వర్గం బ్యాంకు రుణాలు ఏ మేరకు పొందగలుగుతున్నదనేది ఆర్థిక అభివృద్ధిలో వారు ఏ మేరకు పాల్గొంటున్నారనే దానికి ఒక సూచిక. ఈ

విషయంలో కులాల వారీ గణాంకాలు దొరకనట్టున్నాయి. అయితే మైనారిటీలకు బ్యాంకు రుణాలు అందించడం అనే లక్ష్యం ప్రభుత్వ విధానాలలో భాగంగా బ్యాంకులకు ఉంది కాబట్టి ముస్లింలకు సంబంధించిన గణాంకాలను రిజర్వ్ బ్యాంకు సచార్ కమిటీకి ఇవ్వగలిగింది.

ప్రభుత్వ బ్యాంకులలోనూ, ప్రైవేట్ బ్యాంకులలోనూ కూడా ముస్లింల అకౌంట్ల నిష్పత్తి వారి జనాభా నిష్పత్తి కంటే కొంచెం మాత్రమే తక్కువ. ప్రభుత్వ బ్యాంకులలో ముస్లింల సేవింగ్స్ తదితర ఖాతాలు 12.2 శాతం, ప్రైవేట్ బ్యాంకులలో 11.3 శాతం ఉన్నాయి. అయితే రుణాల మొత్తంలో ముస్లింల వాటా (సచార్ కమిటీ వేసిన అంచనా ప్రకారం) ప్రభుత్వ బ్యాంకులలో కేవలం 4.6 శాతం కాగా ప్రైవేట్ బ్యాంకులలోనూ అది 6.6 శాతం మాత్రమే. తలసరి రుణం హిందువులతో పోలిస్తే ముస్లింలు పొందుతున్నది ప్రభుత్వ బ్యాంకులలో మూడవ వంతు మాత్రమే (33 శాతం) కాగా ప్రైవేట్ బ్యాంకులలో 40 శాతం మాత్రమే. ఉద్యోగాల కంటే స్వయం ఉపాధి, వర్తక రంగాలలో ముస్లింలు అధికంగా ఉన్న కారణంగా బ్యాంకు రుణాల లభ్యత ఎంత ఉన్నది వారి ఆర్థిక స్థితిగతులకొక ముఖ్య సూచిక. అదేమంత ఆశాజనకంగా లేదని ఈ గణాంకాలు తెలుపుతాయి.

రాష్ట్రాలవారీ గణాంకాలు తీసుకున్నా కూడా దాదాపు అన్ని రాష్ట్రాలలోనూ బ్యాంకు రుణాల మొత్తంలో ముస్లింల వాటా జనాభాలో వారి వాటాకు సమానంగా లేకపోగా అందులో సగం, మూడవవంతు, నాలుగవ వంతు, అయిదవ వంతు, దేశ రాజధాని అయిన ఢిల్లీలోనైతే 24వ వంతు (జనాభాలో ముస్లింలు 100కి 12 మంది కాగా బ్యాంకు రుణాలలో 100 రూపాయలకు 50 పైసలే వారికిచ్చినవి) ఉంది. ఇందుకు రెండే మినహాయింపులు. ఒరిస్సా జనాభాలో ముస్లింల నిష్పత్తి ఎంతో బ్యాంకు రుణాలలో వారి వాటా కూడా అంతే. తమిళనాడు జనాభాలో ముస్లింలు 5.6 శాతం కాగా బ్యాంకు రుణాలలో వారి వాటా అంత కంటే కొంచెం ఎక్కువ – 6.6 శాతం. చివరికి జనాభాలో ముస్లింలు 67 శాతం ఉన్న జమ్ము కాశ్మీర్‌లోనూ బ్యాంకు రుణాలలో ముస్లింల వాటా 54.4 శాతం మాత్రమే. జనాభాలో 24 శాతం అయిన హిందువుల వాటా బ్యాంకు రుణాలలో 40 శాతం.

ముస్లింలు ఎక్కువ సంఖ్యలో నివసిస్తున్న జిల్లాలను తీసుకుని చూస్తే ఈ స్థితి మరింత కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. దేశంలో ముస్లింల జనాభా 40 శాతం మించిన జిల్లాలు 11 ఉన్నాయి. ఈ జిల్లాల సగటు ముస్లిం జనాభా 51.4 శాతం. కానీ అక్కడున్న బ్యాంకుల (ప్రభుత్వ, ప్రైవేటు కలుపుకుని) రుణాలలో ముస్లింల

వాటా 11.6 శాతం మాత్రమే. ఈ జిల్లాలలో ఒకటైన మన హైదరాబాద్‌లో ముస్లింలు జనాభాలో 41.2 శాతం కాగా బ్యాంకు రుణాలలో వారి వాటా 3.2 శాతం. జనాభాలో 26 నుంచి 40 శాతం దాకా ముస్లింలు ఉన్న 12 జిల్లాలలో ముస్లిం జనాభా వాటా 34.2 శాతం కాగా బ్యాంకు రుణాలలో వారి వాటా 19.3 శాతం. జనాభాలో ముస్లింల నిష్పత్తి 22 నుంచి 26 శాతం దాకా ఉన్న 10 జిల్లాలలో ముస్లిం జనాభా వాటా 24.1 శాతం కాగా బ్యాంకు రుణాలలో వారి వాటా 6.3 శాతం.

మైనారిటీలు అధికంగా నివసించే జిల్లాలలో వారికి బ్యాంకు రుణాలు విరివిగా అందేటట్టు చూడమని బ్యాంకులకు రిజర్వ్ బ్యాంకు ఆదేశాలు ఉన్నప్పటికీ ఇదీ పరిస్థితి!

## లఘు పరిశ్రమల రుణాలు, నాబార్డ్ రుణాలు

ముస్లింలు ఉద్యోగాల కంటే స్వయం ఉపాధి రంగంలోనూ చిన్న వర్తక రంగంలోనూ అధికంగా ఉన్నారు కాబట్టి వారు తమ అభివృద్ధికి చిన్నతరహా పరిశ్రమలలోకి ప్రవేశించడం ఒక మార్గం. దీనికి ప్రత్యేకంగా రుణాలు ఇచ్చే సంస్థ భారత లఘుపరిశ్రమల అభివృద్ధి బ్యాంకు (సిడ్బి SIDBI), సిడ్బి 2000–2006 మధ్య ఇచ్చిన రుణాలలో కేవలం 1.5 శాతం ముస్లింలకు అందింది. అందిన మేరకు కూడా తక్కువ మొత్తాలు అందాయి. సిడ్బి ఇచ్చిన సగటు రుణం 1.66 కోట్ల రూపాయలు కాగా, ముస్లిం వ్యక్తులకిచ్చిన సగటు రుణం 63 లక్షల రూపాయలు మాత్రమే.

నాబార్డ్ గ్రామీణ అభివృద్ధి కోసం రుణాలు ఇవ్వడం ఒక ముఖ్య లక్ష్యంగా గల సంస్థ. 2004–2005, 2005–2006 సంవత్సరాలలో నాబార్డ్ ఇచ్చిన ఉత్పత్తి రుణాలలో 3.2 శాతం మాత్రమే ముస్లింలకు అందింది. అలాగే పెట్టుబడి రుణాలలో 3.9 శాతం మాత్రమే ముస్లింలకు అందింది. అన్ని వసతులలాగా ఈ విషయంలోనూ ముస్లింలకు అందుతున్న వాటా వారి జనాభా దామాషా కంటే బాగా తక్కువ.

## సామాజిక, భౌతిక వసతులు

ఈ శీర్షిక కింద సచార్ కమిటీ ముస్లింలకు స్కూళ్ళు, ఆస్పత్రులు తదితర సామాజిక వసతులు; రోడ్లు, కరెంటు, తాగునీరు, రవాణా సదుపాయాలు వగైరా భౌతిక వసతులు ఇతరులతో సమానంగా అందుతున్నాయా లేదా అన్న చర్చ

చేసింది. గణాంకాల లభ్యతలోని సమస్యల కారణంగా పల్లెల గురించి మాత్రమే ఒక నిర్ధారణకు రాగలిగింది. ముస్లింలు అధికంగా నివసించే గ్రామీణ ప్రాంతాలలో సామాజిక భౌతిక వసతుల స్థితి సగటు కంటే హీనంగా ఉందని నిర్ధారించింది. పెద్ద గ్రామాలలో సాధారణంగా వసతులు చిన్న గ్రామాల కంటే మెరుగ్గా ఉంటాయి కాబట్టి సచార్ కమిటీ సైజుల వారీగా గ్రామాలను తీసుకుని పరిశీలించింది. 1000 మంది కంటే తక్కువ జనాభా ఉన్న గ్రామాన్ని చిన్న గ్రామం అని, 1000–2000 లోపు జనాభా ఉన్న గ్రామాలను ఒక మోస్తరు పరిమాణం గల గ్రామం (మోడరేట్) అని, 2000 పైబడిన జనాభా గల గ్రామాన్ని పెద్ద గ్రామం అని మూడు వర్గాలుగా విభజించింది. గ్రామ జనాభాలో ముస్లింల నిష్పత్తిని బట్టి మళ్ళీ మూడుగా విభజించింది – ముస్లింలు 10 శాతంలోపు ఉన్న గ్రామాలు, 10 నుంచి 40 శాతం దాకా ఉన్న గ్రామాలు, 40 శాతం మించి ఉన్న గ్రామాలు.

ఈ విశ్లేషణ ఫలితాలు ఆశ్చర్యం కలిగిస్తాయి. గ్రామంలో స్కూలు ఉండడం, వైద్య సదుపాయం అందుబాట్లో ఉండడం, పోస్టాఫీసు అందుబాట్లో ఉండడం, బస్‌స్టాప్ ఉండడం, పక్కారోడ్డు ఉండడం అనే అయిదు వసతులూ ముస్లింలు తక్కువగా ఉన్న గ్రామాలలో మెరుగుగాను, ముస్లింలు ఎక్కువగా ఉన్న గ్రామాలలో హీనంగానూ ఉన్నాయి. బడి విషయంలో పెద్ద గ్రామాలలో ఈ తేడా అంతగా కనబడదు గానీ చిన్న గ్రామాలలో కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. 1000 లోపు జనాభా ఉన్న గ్రామాలను తీసుకుంటే వాటిలో ముస్లింలు 10 శాతంలోపు ఉన్న గ్రామాలలో 80 శాతం బడి కలిగి ఉన్నాయి. ముస్లింలు 40 శాతం మించి ఉన్న గ్రామాలలో 69 శాతం మాత్రమే బడి కలిగి ఉన్నాయి. బస్ వసతి సగటున దాదాపు 40 శాతం గ్రామాలకు ఉండగా, ముస్లింలు 40 శాతం మించి ఉన్న గ్రామాలలో 32 శాతానికి మాత్రమే ఉంది. పెద్ద గ్రామాలలో 67 శాతానికి బస్ వసతి ఉండగా ముస్లింలు 40 శాతం మించి ఉండే గ్రామాలలో 45 శాతానికి మాత్రమే ఉంది. పక్కారోడ్డు పెద్ద గ్రామాలలో సగటున 82 శాతానికి ఉండగా, ముస్లింలు 40 శాతం మించి ఉండే గ్రామాలలో 72 శాతానికి మాత్రమే ఉంది. వైద్య వసతి పెద్ద గ్రామాలలో 10 శాతంలోపు ముస్లింలు ఉన్న వాటిలో 75 శాతానికి ఉండగా, ముస్లింలు 40 శాతం మించి ఉన్న గ్రామాలలో 64 శాతానికి మాత్రమే ఉంది. పోస్టు, టెలిగ్రాఫ్ సేవలు పెద్ద గ్రామాలలో ముస్లింల సంఖ్య 10 శాతంలోపు ఉన్న వాటిలో 84 శాతానికి అందుబాట్లో ఉండగా ముస్లింలు 40 శాతం మించి ఉన్న ఊర్లలో 63 శాతానికి మాత్రమే అందుబాట్లో ఉన్నాయి. పెద్ద

గ్రామాల విషయంలో కనిపించిన ఈ తేడాలన్నీ ఒక మోస్తరు గ్రామాలలోనూ కనిపిస్తాయి. చిన్న ఊర్లలో ఎట్లాగూ ఈ వసతులు ఎక్కువ ఉండవు కాబట్టి ఈ తేడా అంతగా కనిపించదు.

రాష్ట్రాల వారీగా తీసుకుంటే ముస్లింలు అధికంగా నివసించే గ్రామీణ ప్రాంతాలలో విద్యావ్యవస్థ హీనంగా ఉన్న ఘనత పశ్చిమబెంగాల్, బీహార్‌లకు దక్కుతుంది. వైద్య వ్యవస్థ విషయంలో ఈ ఘనత అస్సాం, జమ్మూకాశ్మీర్, పశ్చిమబెంగాల్, బీహార్, ఉత్తరప్రదేశ్‌లకు దక్కుతుంది. పోస్టు, టెలిగ్రాఫ్ సదుపాయాల విషయంలో ఇవే రాష్ట్రాలలో ముస్లింల జనాభా అధికంగా ఉన్న ప్రాంతాలలో వసతులు కడుహీనంగా ఉన్నాయి. పక్కారోడ్ల విషయంలోనూ ఈ రాష్ట్రాలే ప్రధాన దోషులుగా నిలబడతాయి – జార్ఖండ్‌తోపాటు. అన్ని విషయాలలోనూ దక్షిణ భారత రాష్ట్రాలు, మహారాష్ట్రల పరిస్థితి సాపేక్షంగా నయం.

కరెంటు వాడకం విషయమూ అంతే. కరెంటు వాడకాన్ని బట్టి గ్రామాలను సచార్ కమిటీ ఆరు వర్గాలుగా విభజించింది. అసలే కరెంటు లేని గ్రామాలు ఒక చివర, 90 శాతం పైగా నివాసాలకు కరెంటు ఉన్న గ్రామాలు ఆ చివర పెట్టి మధ్యలో నాలుగు వర్గాలు చేశారు. అసలే కరంటు లేని గ్రామాలలో ముస్లింల జనాభా గ్రామ జనాభాలో దాదాపు 10 శాతం ఉంది. 90 శాతం పైగా నివాసాలకు కరెంటు ఉన్న గ్రామాలలో ముస్లింల జనాభా 5 శాతం ఉంది. ముస్లిం జనాభా నిష్పత్తి తగ్గే కొద్దీ అదే వరసలో విద్యుదీకరణ పెరగడం కనిపిస్తుంది. ఇదే విషయాన్ని ఇంకొక రకంగా చూడవచ్చు. దేశంలో చిన్న గ్రామాలలో (1000 లోపు జనాభా కలిగినవి) అసలే కరెంటు లేనివి 29 శాతం దాకా ఉండగా, ముస్లిం జనాభా 40 శాతం మించి ఉన్న చిన్న గ్రామాలలో దాదాపు 40 శాతం కరెంటు లేనివే. ఒక మోస్తరు (1000 నుంచి 2000 వేల జనాభా కలిగిన) గ్రామాలలో కరెంటు లేనివి 14 శాతం కాగా, ముస్లింల జనాభా 40 శాతం మించి ఉన్న ఒక మోస్తరు గ్రామాలలో కరెంటు లేనివి 23 శాతం. పెద్ద గ్రామాలలో (2000 పైబడిన జనాభా కలిగినవి) అసలే కరెంటు లేనివి 5 శాతం కాగా, ముస్లిం జనాభా 40 శాతం మించి ఉన్న పెద్ద గ్రామాలలో అసలే కరెంటు లేనివి 10 శాతం.

రక్షిత మంచినీటి లభ్యతలో పట్టణ ప్రాంతాలలో ముస్లింలు సగటు కంటే కొంచెం మాత్రమే వెనుకబడి ఉన్నారు కానీ గ్రామీణ భారతంలో 25 శాతం జనాభాకు రక్షిత మంచినీరు అందుబాట్లో ఉండగా, ముస్లింలలో 15 శాతానికి మాత్రమే ఉంది.

ఇళ్ళు, టాయిలెట్ల విషయంలో మాత్రమే ముస్లింల స్థితి అంత హీనంగా లేదు. పక్కా ఇళ్ళు కలిగి ఉండేవిషయంలో ముస్లింల స్థితి దేశ సగటు కుటుంబం స్థితితో సమానం. ఒక్క హిందూ అగ్రకులాలు మాత్రమే వారి కంటే మెరుగైన స్థితిలో ఉన్నారు. టాయిలెట్లు కలిగి ఉండే విషయంలో హిందూ అగ్రకులాల కంటే కూడా ముస్లిం గృహాలది మెరుగైన స్థితి. ప్రైవసీకి, ముఖ్యంగా స్త్రీల విషయంలో, ముస్లింలు సాంస్కృతికంగా ఇచ్చే విలువ దీనికి కారణం అయి ఉంటుందని సచార్ కమిటీ వ్యాఖ్యానించింది. అయితే పేదరికం అధికంగా ఉన్న సామాజిక వర్గం ఒకే వసతి మీద ఇంత ఖర్చు పెడితే వేరే ఎక్కడో చాలా కోల్పోతూ ఉంటుందనేది విదితమే.

మొత్తానికి భారతదేశంలో ముస్లింలు సామాజిక భౌతిక వసతులు హీనంగా ఉన్న ఒక ఉపప్రదేశంలోకి నెట్టబడ్డారని వ్యాఖ్యానించడం అతిశయోక్తి కాబోదు.

## పేదరికం

ఆర్థిక స్థోమతను ఆదాయంతో కొలవవచ్చు, ఖర్చుతోనూ కొలవవచ్చు. పేదల ఆదాయమూ తక్కువ ఉంటుంది, వారు చేసే ఖర్చూ తక్కువ ఉంటుంది. సచార్ కమిటీ వివిధ సామాజిక వర్గాలలో పేదరికాన్ని పోల్చడానికి నెలవారీ తలసరి సగటు ఖర్చును ప్రమాణంగా తీసుకుంది. 2004-2005 లెక్కల ప్రకారం హిందూ అగ్రకులాలలో తలసరి నెలరోజుల ఖర్చు 1023 రూపాయలు ఉండగా, బిసిలలో 646 రూపాయలు, ముస్లింలలో 635 రూపాయలు, ఎస్‌సి ఎస్‌టిలలో 520 రూపాయలు ఉంది. పట్టణ ప్రాంతాలను విడిగా తీసుకుంటే ముస్లింలు ఎస్‌సి ఎస్‌టిలతో సమానం. ఇద్దరి తలసరి నెల రోజుల ఖర్చు 800 రూపాయలు. బిసిలలో అది 950 రూపాయలు, అగ్రకులాలలో 1470 రూపాయలు ఉంది. పట్టణం చిన్నదైన కొద్దీ ముస్లింల స్థితి మరింత దిగజారడం కనిపిస్తుంది. జనాభా 50 వేలకు తక్కువ ఉన్న ఊర్లలో ముస్లింలలో నెలరోజుల తలసరి ఖర్చు ఎస్‌సి ఎస్‌టిల కంటే తక్కువ.

పట్టణ ప్రాంతాలలో ముస్లింలలో అంతర్గత అసమానత కూడా ఎక్కువే. పట్టణ ప్రాంత పేదరికం ముస్లింలలో ఎస్‌సి ఎస్‌టిలతో సమానంగా ఉందని చెప్పుకున్నాం. అయితే బాగా పేద వర్గాలలో ముస్లింల నిష్పత్తి ఎక్కువ. నెలకు తలసరి 350 రూపాయల ఖర్చుతో బతికే ముస్లింలు పట్టణ ప్రాంత జనాభాలో 17 శాతం. అదే నిష్పత్తి ఎస్‌సి ఎస్‌టిలలో 15.7 శాతం. ధనిక వర్గాలలో ఇద్దరి

స్థానమూ ఒకటే. మధ్యస్తంగా ఉండేవారు ముస్లింలలో కొంచెం తక్కువ, ఎస్‌సి ఎస్‌టిలలో కొంచెం ఎక్కువ.

రాష్ట్రాల వారీ గణాంకాలూ ఇదే వాస్తవాన్ని చూపిస్తున్నాయి. అయితే పశ్చిమ బెంగాల్, బీహార్, ఆంధ్రప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌ల పట్టణ ప్రాంతాలలో ముస్లింలలో తలసరి ఆదాయం ఎస్‌సి ఎస్‌టిల కంటే తక్కువ. అయితే అన్ని చోట్లా గ్రామీణ ప్రాంతాలలో ముస్లింల స్థితి ఎస్‌సి ఎస్‌టిల కంటే సాపేక్షంగా మెరుగైనదే.

దరిద్రరేఖకు దిగువన ఉన్న జనాభా నిష్పత్తి కూడా ఇదే చిత్రాన్ని ఇస్తుంది. 2004-2005 లెక్కలలో భారతదేశంలో దరిద్రరేఖకు దిగువన ఉన్న జనాభా నిష్పత్తి 22.7 శాతం. అగ్రకులాలలో ఇది 8.7 శాతం, బిసిలలో 21 శాతం, ముస్లింలలో 31 శాతం, ఎస్‌సి ఎస్‌టిలలో 35 శాతం. మళ్ళీ పట్టణ ప్రాంతాలలో ఎస్‌సి ఎస్‌టిల కంటే కూడా ముస్లింలలోనే నిరుపేదలు ఎక్కువ. దరిద్రరేఖకు దిగువన ఉండే పట్టణ ప్రాంత జనాభా నిష్పత్తి ఎస్‌సి ఎస్‌టిలలో 36.4 శాతం కాగా, ముస్లింలలో 38.4 శాతం. అయితే దరిద్రరేఖ అనేది పేదలెందరు అనే విషయం చెప్తుంది తప్ప వాళ్ళు ఎంత పేదగా ఉన్నారని చెప్పదు. దరిద్రరేఖకు దిగువన ఉన్నవారు ఎంత దిగువన ఉన్నారో చూడడం కూడా సమగ్ర పరిశీలనకు అవసరం. దీనికొక మార్గం - దరిద్రరేఖకు దిగువన ఉన్నవారు సగటున ఆ రేఖను సూచించే ఆదాయంలో ఎంత శాతం (సగం, ముప్పావు వగైరా) ఆదాయం కలిగి ఉన్నారో లెక్కించడం. ఈ లెక్క తీస్తే, పట్టణ ప్రాంతాలలో దరిద్రరేఖకు దిగువన ఉన్న ముస్లింలు సగటున దరిద్రరేఖను సూచించే ఆదాయంలో 77 శాతం ఆదాయం కలిగి ఉండగా, ఎస్‌సి ఎస్‌టిలలో ఆ నిష్పత్తి 76 శాతం.

అన్ని సామాజిక వర్గాలలాగా ముస్లింలలో కూడా కాలక్రమంలో దరిద్రరేఖకు దిగువన ఉన్నవారి సంఖ్య తగ్గుతున్నది. అయితే ముస్లింలలో ఈ తగ్గుదల గ్రామీణ ప్రాంతాలలో ఉన్నంత పట్టణాలలో లేకపోవడం వల్ల ముస్లింలలో పేదరికం పట్టణాలలో కేంద్రీకృతమై ఉందని సచార్ కమిటీ విశ్లేషించింది.

## ప్రభుత్వ ఉద్యోగాలు

మంచి జీతాలు, భద్రత, హోదాల కారణంగా చాలామంది ఇప్పటికీ ప్రభుత్వ ఉద్యోగాలను కాంక్షిస్తారని చెప్తూ ముస్లింలు ఈ రంగంలో ఎంతమేరకు ఉన్నారన్న విశ్లేషణ సచార్ కమిటీ చేపట్టింది. ఇక్కడ ప్రభుత్వ ఉద్యోగాలు అంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల శాఖలలోని ఉద్యోగాలే కాక ప్రభుత్వరంగ సంస్థలలోని

ఉద్యోగాలు కూడా. అన్నిచోట్లా ముస్లింలు తమ జనాభా నిష్పత్తి కంటే చాలా తక్కువ ఉన్న విషయం సచార్ కమిటీ బయటపెట్టింది.

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలలో ముస్లింలు 6.3 శాతం ఉన్నారు. రైల్వేలో 4.5 శాతం, బ్యాంకులలో 2.2 శాతం, పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో 5 శాతం, భద్రతా సంస్థలలో 3.2 శాతం, విశ్వవిద్యాలయాలలో 4.7 శాతం ఉన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ శాఖలలో మొత్తం 4.9 శాతం ఉన్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థలలో 3.3 శాతం, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలలో 10.8 శాతం ఉన్నారు. ఇందులో ఈ చివరి సంఖ్య ఒక్కటే జనాభాలో ముస్లింల దామాషా అయిన 13.4 శాతానికి కొంచెమైనా దగ్గరకొస్తుంది.

ఐఎఎస్‌లలో ముస్లింలు 3 శాతం, ఐపిఎస్‌లో 4 శాతం ఉన్నారు. అందులో అనివార్యమైన ప్రమోషన్ మీద ఐఎయస్, ఐపియస్ హోదా పొందిన వారిని మినహాయించి సివిల్ సర్వీసెస్ పరీక్ష రాసి ఐఎయస్, ఐపియస్ హోదా పొందిన వారిని మాత్రమే లెక్కిస్తే ముస్లింలలో వారు 2.4 శాతం, 2.3 శాతం మాత్రమే. ఒక్క ఐఎయస్, ఐపియస్‌లే కాక యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే పరీక్షల ద్వారా ఎంపికచేసే అన్ని సర్వీసుల స్థితీ ఇదే. 2003, 2004లలో ఈ పరీక్షలు రాసిన వారిలో 4.9 శాతం మాత్రమే ముస్లింలు. చెప్పుకోదగ్గ విషయం ఏమిటంటే పరీక్షలు రాసిన వారిలో ఉత్తీర్ణులైన వారి నిష్పత్తి అగ్రకులాలతో సమానంగా ఉంది. అంటే ఉన్నతస్థాయి పరీక్షలు, పదవులు అందుకోగలిగితే ముస్లింలు అందరిలాగా రాణించగలరు. అందుకోలేకపోవడమే సమస్య.

వివిధ ప్రభుత్వ శాఖలలో ముస్లింలు ఉన్నదే తక్కువంటే ఆ ఇంత కూడా కిందిస్థాయి ఉద్యోగాలలోనే తప్ప పైస్థాయి ఉద్యోగాలలో కాదు. 14 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించే రైల్వేలో ముస్లింలు 4.5 శాతం మాత్రమే కాగా అందులో 98.7 శాతం గ్రూప్ సి, గ్రూప్ డి పోస్టులలో ఉన్నారు. 1.3 శాతం మాత్రమే గ్రూప్ ఎ, గ్రూప్ బి (అంటే ఆఫీసర్) పోస్టులలో ఉన్నారు.

ఈ విషయాన్ని ఇంకొక కోణం నుంచి కూడా చూడవచ్చు. రైల్వేలోని గ్రూప్ ఎ పోస్టులలో 72 శాతం సవర్ణ హిందువులు, 18 శాతం ఎస్‌సి ఎస్‌టిలు ఉండగా కేవలం 3 శాతం ముస్లింలున్నారు. కింది స్థాయి ఉద్యోగాల కొచ్చేసరికి వాటి సంఖ్య చాలా ఎక్కువ కాబట్టి ముస్లింల సంఖ్య ఎక్కువే ఉంది గానీ ఆ స్థాయిలోనూ ముస్లింల వాటా 5 శాతమే. అంటే ఏ స్థాయిలోనూ వారి వాటా జనాభాలో వారి వాటాతో పోల్చదగ్గది కాదు. ఆ ఉన్న కొద్దిమంది కూడా నూటికి 98.7 శాతం మంది కింది స్థాయి పోస్టులలోనే ఉన్నారు.

అన్ని సర్వీసుల విషయమూ అంతే. కేంద్ర పారామిలటరీ బలగాలైన బి.ఎస్.ఎఫ్, సి.ఆర్.పి.ఎఫ్, సి.ఐ.ఎస్.ఎఫ్, సశస్త్ర సీమాబల్‌లలో ముస్లింల వాటా పైస్థాయి ఉద్యోగాలలో 3.6 శాతం, కిందిస్థాయి ఉద్యోగాలలో 4.6 శాతం ఉంది. రెండు స్థాయిలలోనూ వారి వాటా వారి జనాభా నిష్పత్తి కంటే బాగా తక్కువే. ఆ ఉన్న వారిలో కూడా 96 శాతం కిందిస్థాయి ఉద్యోగాలలోనే ఉన్నారు.

విశ్వవిద్యాలయాలలోని బోధన, బోధనేతర సిబ్బంది గణాంకాలను కూడా సచార్ కమిటీ సేకరించింది. బోధన సిబ్బందిలో అగ్రకులాలు 45 శాతం ఉండగా బోధనేతర సిబ్బందిలో 47 శాతం ఉన్నారు. బిసిలు బోధన సిబ్బందిలో 35 శాతం దాకా ఉండగా బోధనేతర సిబ్బందిలో 18 శాతం ఉన్నారు. ఎస్‌సి ఎస్‌టిలలో బోధన సిబ్బందిలో 7.4 శాతం, బోధనేతర సిబ్బందిలో 16.9 శాతం ఉన్నారు. ముస్లింలు బోధన సిబ్బందిలో 3.7 శాతం, బోధనేతర సిబ్బందిలో 5.4 శాతం ఉన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు

కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలలోని ఉన్నత స్థాయి మేనేజర్ హోదాలో హిందూ అగ్రకులాలు 70 శాతం దాకా ఉండగా రిజర్వేషన్ పుణ్యాన ఎస్‌సి ఎస్‌టిలు 20 శాతం ఉన్నారు. రిజర్వేషన్లు లేని బిసిలు, ముస్లింలు చెరి 3 శాతం ఉన్నారు. హోదాలో కింది కొచ్చే కొద్దీ బిసిల సంఖ్య కొద్దిగాను, ఎస్‌సి ఎస్‌టిల సంఖ్య గణనీయంగానూ పెరగడం కనిపిస్తుందిగానీ అతి తక్కువ హోదాలో సహితం ముస్లింలు 5 శాతం మించి లేరు.

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలలోనూ ఇదే చిత్రం. ఏ రాష్ట్రంలోను (జమ్ము-కాశ్మీర్‌తో సహా) ముస్లింల భాగస్వామ్యం వారి జనాభా దామాషాతో సమానం కాదు. నాలుగు రాష్ట్రాలలో తప్ప (పశ్చిమబెంగాల్, ఉత్తరప్రదేశ్, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్) వేరే ఎక్కడా అందులో సగం కూడా లేదు. అన్ని రాష్ట్రాల కంటే మెరుగైన ఆంధ్రప్రదేశ్‌లో సైతం జనాభాలో ముస్లింలు 9.2 శాతం కాగా ప్రభుత్వ ఉద్యోగులలో వారి నిష్పత్తి 5.6 శాతం! బహుశా అన్నిటి కంటే ఆశ్చర్యం కలిగించేది జమ్ముకాశ్మీర్ పరిస్థితి. ఆ రాష్ట్ర జనాభాలో ముస్లింలు 68 శాతం కాగా, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులలో ముస్లింలు కేవలం 18.1 శాతం. (ఇవి కాశ్మీర్ లోయకు సంబంధించిన గణాంకాలు కావు, మొత్తం రాష్ట్రానికి సంబంధించినవి).

రాష్ట్ర ప్రభుత్వ శాఖలలో ఉద్యోగాలు కాక రాష్ట్ర ప్రభుత్వ సంస్థలలో ఉద్యోగాలను తీసుకుంటే పరిస్థితి కొంచెం మెరుగుగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వ సంస్థలలో ముస్లిం సిబ్బంది 10.7 శాతం. ఇది సైతం జనాభాలో వారి వాటా కంటే తక్కువే అయినా ఇతర రంగాలకు సంబంధించిన గణాంకాలంత హీనంగా లేదు. గుజరాత్, ఆంధ్రప్రదేశ్‌లలో మాత్రం రాష్ట్ర ప్రభుత్వ సంస్థలలో ముస్లింల వాటా జనాభాలో వారి వాటా కంటే కొంచెం ఎక్కువ.

## సంక్షేమ పథకాలు

వివిధ సామాజిక వర్గాల అభ్యున్నతి కోసం ప్రభుత్వాలు సంక్షేమ పథకాలు అమలు చేసే విషయం తెలిసిందే. పేదలు, చిన్న పిల్లలు, మహిళలు, రైతులు మొదలైన వర్గాల కోసం చేపట్టే ఈ పథకాలు ఆయా వర్గాలలోని ముస్లింల ప్రజానీకానికి ఎంతమేరకు అందుతున్నాయన్న సమాచారం సేకరించడానికి సచార్ కమిటీ ప్రయత్నించింది. అయితే లబ్ధిదారుల మతాన్ని నమోదు చేయని కారణంగా ఈ సమాచారం అన్ని రాష్ట్రాల నుంచి లభ్యం కాకపోవడం వల్ల పాక్షికమైన చిత్రం మాత్రమే ఇవ్వగలిగారు.

కేరళలో దరిద్రరేఖకు దిగువన ఉన్న పేదలలో ముస్లింలు 30.7 శాతం ఉన్నారు. కానీ పేదలకోసం ఉద్దేశించిన ఏ పథకంలోనూ ముస్లిం లబ్ధిదారులు 30 శాతం కూడా లేరు. గ్రామీణ అభివృద్ధిశాఖ చేపట్టే స్కీంలలో 12 శాతం ముస్లింలకు లభిస్తుండగా తక్కిన పథకాల లబ్ధిదారులలో ముస్లింలు 5 నుంచి 18 శాతం దాకా ఉన్నారు. సహకార సంస్థల రుణాల లబ్ధిదారులలో మాత్రం 25 శాతం ఉన్నారు.

ఉత్తరప్రదేశ్ పేదలలో 23.6 శాతం ముస్లింలు కాగా పేదలకోసం ఉద్దేశించిన వివిధ పథకాలలో ముస్లిం లబ్ధిదారుల వాటా 3 నుంచి 14 శాతం దాకానే ఉంది. స్వర్ణ జయంతి ఉపాధి పథకంలో అత్యధికంగా 16 శాతం ఉంది.

అంగన్‌వాడీల స్థాపన బడికిపోయే వయసు లేని పిల్లలకు ఆటపాటలు నేర్పడానికి ఉద్దేశించబడింది. ఆ వయసు పిల్లలకు పౌష్టికాహారం అందించడం కూడా ఆ వ్యవస్థ లక్ష్యాలలో ఒకటి. ఇది సమగ్ర శిశు అభివృద్ధి సేవ (ఐసిడిఎస్) అనే ప్రోగ్రాం ద్వారా అమలవుతుంది. పేదరికం అధికంగా ఉన్న సామాజిక వర్గాల పిల్లలకు ఇది చాలా ఉపయోగకరంగా ఉండగల పథకం. ఈ పథకం 11 శాతం మేరకే అమలవుతున్నదని (అంటే అందవలసిన పిల్లలలో 11 శాతానికి మాత్రమే అందుతున్నదని) సచార్ కమిటీ వ్యాఖ్యానిస్తూ, అందులోనూ ముస్లింల వాటా

ఇతర వెనుకబడిన సామాజిక వర్గాలతో పోలిస్తే హీనంగా ఉందని అనింది. బిసిలలో అర్హులైన పిల్లలలో 13 శాతానికి ఐసిడిఎస్ సేవలు అందుతుండగా ఎస్‌సి ఎస్‌టిలలో 10 శాతానికి, ముస్లింలలో 8 శాతానికి మాత్రమే అందుతున్నదని 2004-2005 గణాంకాలు తెలుపుతున్నాయి. ఇక్కడ కూడా 'హిందీ రాష్ట్రాల' పరిస్థితి మరీ హీనం. ఆ రాష్ట్రాలలో అంగన్‌వాడి సేవలు అర్హులైన పిల్లలలో 3 శాతానికి మాత్రమే అందుతున్నాయి.

పౌష్టికాహారానికి మరొక ఆధారమైన మధ్యాహ్న భోజన పథకం స్థితీ ఇంతే. ఆ పథకం ప్రభుత్వ స్కూళ్ళకే తప్ప ప్రైవేటు విద్యాసంస్థలకు వర్తించదు. మొత్తం స్కూలుకు పోగల వయసున్న పిల్లలలో (అంటే 6 నుంచి 16 సంవత్సరాలలోపు వయసున్న పిల్లలలో) 27 శాతం మధ్యాహ్న భోజన పథకం నుంచి ప్రయోజనం పొందుతున్నారు. అయితే ఎస్‌సి ఎస్‌టిలలో ఈ నిష్పత్తి 35 శాతం ఉండగా, బిసిలలో 28 శాతం, ముస్లింలలో 23 శాతం ఉంది.

మైనారిటీల అభ్యున్నతి కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నెలకొల్పిన వివిధ సంస్థలున్నాయి. వాటి గురించి కూడా సచార్ కమిటీ కొంత చర్చ చేసింది. వాటి వలన కొంత ఉపయోగం ఉన్నప్పటికీ వాటికి కేటాయిస్తున్న నిధులు నామమాత్రం కావడం వల్ల అవి తమ లక్ష్యాన్ని సాధించలేకపోతున్నాయని సచార్ కమిటీ నిర్ధారించింది.

## రిజర్వేషన్లు, ఇతర ప్రత్యేక హక్కులు

భారతదేశంలో ముస్లింల సామాజిక ఆర్థిక స్థితిగతుల గురించి వివరమైన చిత్రాన్ని ఇచ్చిన పిదప, ఈ వెనుకబాటుతనాన్ని అధిగమించడానికి ప్రత్యేకమైన చర్యలేవైనా ప్రభుత్వాలు చేపట్టాయా అన్న ప్రశ్న సచార్ కమిటీ వేసుకుంది. అన్ని రంగాలలోనూ ముస్లిం ప్రజానీకం హిందూ అగ్రకులాల కంటే బాగా వెనుకబడి ఉన్నారనీ, బిసిలకు సంబంధించి విడిగా సమాచారం ఉన్న రంగాలలో బిసిల కంటే కూడా వెనుకబడి ఉన్నారనీ, ఎస్‌సి ఎస్‌టిలకు సన్నిహితంగా ఉన్నారనీ ఈ చిత్రం చెబుతుంది. మొదట్లో చెప్పినట్టు, ఎస్‌సి ఎస్‌టిలను కలగలపకుండా వేరుచేసి పరిశీలించి ఉంటే, ఎస్‌సిలు చాలా విషయాలలో ఎస్‌టిల కంటే సాపేక్షంగా మెరుగుగా ఉంటారు కాబట్టి ముస్లింల స్థితి ఎస్‌సిల స్థితికి మరింత సన్నిహితం అనే విషయం స్పష్టం అయి ఉండేది.

అయితే బిసిలకూ ఎస్‌సి ఎస్‌టిలకూ సమాన అవకాశాలు కల్పించే దిశగా రిజర్వేషన్లు, స్కాలర్‌షిప్పులు, ప్రత్యేక హాస్టళ్ళు, ఆశ్రమ పాఠశాలలు మొదలైన

హక్కులూ వసతులూ కల్పించిన ప్రభుత్వాలు ముస్లింల విషయంలో ఇటువంటి చొరవ తగురీతిలో తీసుకోలేదు. అందువల్ల తమ స్థితి నుంచి బయటపడడానికి స్వశక్తి తప్ప ముస్లింలకు వేరే ఆసరా లేకుండా ఉంది. వారి స్వంత శక్తి చాలని కారణంగా వారి స్థితి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్టు ఉంది.

విద్యా ఉద్యోగ రిజర్వేషన్లు అసమాన అవకాశాలను అధిగమించడానికొక ముఖ్యసాధనం కాబట్టి ఈ ప్రయత్నం వివిధ రాష్ట్రాలలో ఏ మేరకు జరిగిందన్న విశ్లేషణ సచార్ కమిటీ చేపట్టింది. భారతదేశంలోని ముస్లింలలో నాలుగు చారిత్రక స్రవంతులకు చెందినవారున్నారు. కొందరు విదేశాల నుంచి వచ్చిన ముస్లింల సంతతిగా తమను తాము భావిస్తారు. కొందరు మతం మార్చుకున్న హిందూ అగ్రకులాల వారి సంతతి. కొందరు వివిధ ఉత్పాదక వృత్తులకు చెందిన వారు. ఇందులో చాలావరకూ హిందూ బిసి కులాల నుంచి మత మార్పిడి ద్వారా ముస్లింలైన వారే. చివరివర్గం అంటరాని కులాల నుంచి, ఆదివాసుల నుంచి ముస్లింలైనవారు. ఉత్తర భారతదేశంలో ఇందులో మొదటి రెండు వర్గాలకు చెందిన వారిని అష్రాఫ్ అనీ, మూడవ వర్గానికి చెందిన వారిని అజ్లాఫ్ అనీ, నాలుగవ వర్గానికి చెందిన వారిని అర్జాల్ అనీ వ్యవహరిస్తున్నారని సచార్ కమిటీ తెలిపింది. దేశంలోని అన్ని ప్రాంతాలలోనూ ఈ రకమైన వర్గీకరణ వ్యవహారంలో లేకపోవచ్చును గానీ సమకాలీన ముస్లిం ప్రజానీకం పై నాలుగు స్రవంతుల నుంచి రూపొందిన వారేనని చెప్పుకోవచ్చు.

ఇందులో చివరి వారికి ఎస్‌సిలుగా గుర్తింపు ఇవ్వడం ఉచితంగా ఉంటుందనీ, అట్లా జరగకపోవడం వారికి అన్యాయం చేసిందనీ సచార్ కమిటీ భావించింది. అయితే ఇవ్వాళ ఎస్‌సిగా ఉండి ముస్లింగా మతం మార్పిడి చేసుకున్న వ్యక్తి సహితం ఎస్‌సి గుర్తింపు కోల్పోతున్న పరిస్థితిలో, చారిత్రకంగా అంటరాని ప్రజానీకంలో భాగంగా ఉండి ఇస్లాం స్వీకరించిన వారిని ఎస్‌సిలుగా గుర్తించాలన్న కోరిక తీరడం రాజకీయంగా కష్టం కావచ్చు. ఆ కారణంగా, ముస్లింలలో సామాజిక ఆర్థిక వెనుకబాటుతనాన్ని గుర్తించటం అంటూ జరిగిన రాష్ట్రాలలో సైతం ఎస్‌సిలుగా ఉండవలసిన ముస్లిం వర్గాలు బిసి జాబితాలో ఉన్నారు. ఎస్‌సిలలో కాకపోతే కనీసం 'అత్యంత వెనుకబడిన వర్గాల' (ఎంబిసి) జాబితాను సృష్టించి దాని కోటా విడిగా కల్పించి వీరిని అందులో చేర్చాలని సచార్ కమిటీ అభిప్రాయపడింది.

ఇక రిజర్వేషన్ల విషయంలో ఉనికిలో ఉన్న పరిస్థితి ఏమిటో చూద్దాం. కేరళ, కర్నాటక రాష్ట్రాలు ముస్లింలను మొత్తంగానే బిసిలుగా గుర్తించి ఇతర బిసి

వర్గాలతోబాటు రిజర్వేషన్లు ఇస్తున్నాయి. తమిళనాడు రాష్ట్రం ముస్లింలలో దాదాపు 95 శాతాన్ని బిసిలుగా గుర్తించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కొంతకాలం ముస్లింలలో కొద్దిమందిని మాత్రం బిసిలుగా గుర్తించింది. ఈ మధ్య ముస్లింలందరినీ బిసి జాబితాలో చేర్చాలని ప్రయత్నించి రెండుసార్లు కోర్టులో ఓడిపోయింది. ప్రస్తుతం ముస్లింలలో అందరినీ కాక అధికభాగాన్ని బిసిలుగా గుర్తించే చట్టాన్ని జారీచేసింది. అది కూడా కోర్టు లిటిగేషన్‌లో నలుగుతూ ఉంది.

ఇతర రాష్ట్రాల విషయానికొస్తే ముస్లింలలో కొన్ని వర్గాలను బిసిలుగా గుర్తించి రాష్ట్ర బిసి జాబితాలో చేర్చిన రాష్ట్రాలు చాలా ఉన్నాయి. అయితే ఉత్తరాంచల్, ఒరిస్సా, పశ్చిమ బెంగాల్, అస్సాం, హిమాచల్‌ప్రదేశ్‌లలో అతి కొద్ది ముస్లిం వర్గాలు మాత్రమే బిసిలుగా గుర్తింపు పొందారు. పంజాబ్‌లో, ఛత్తీస్‌గఢ్‌లో ముస్లింలెవ్వరూ బిసిలు కారు. బీహార్, మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లలో చెప్పుకోదగ్గ సంఖ్యలో ముస్లిం ఉపవర్గాలు బిసి జాబితాలో చేర్చబడ్డాయి. మొత్తంగా భారతదేశ ముస్లింలలో 40.7 శాతం బిసిలుగా గుర్తించబడ్డ వర్గాలలో ఉన్నారనీ, దేశంలోని బిసి జనాభాలో వారు 15.7 శాతం అనీ సచార్ కమిటీ తెలిపింది.

నిజానికి ముస్లింల స్థితిగతుల గురించి సచార్ కమిటీ వెలువరించిన వాస్తవాలను దృష్టిలో ఉంచుకున్నట్టయితే ముస్లింలు మొత్తంగానే - పిడికెడు నవాబీ కుటుంబాలను మినహాయించి - రిజర్వేషన్లకు అర్హులై ఉండాలి. అన్ని విషయాలలోనూ ముస్లింలు హిందూ బిసిల కంటే వెనుకబడి ఉండగా, వీరిలో వంద శాతం రిజర్వేషన్లు పొందుతుండగా, వారిలో కేవలం 40.7 శాతం మాత్రమే అర్హులెట్లా అవుతారు?

ఈ సందర్భంగా సచార్ కమిటీ వ్యక్తపరచిన అభిప్రాయాన్ని మొత్తంగా ఉటంకించడం ఉచితంగా ఉంటుంది. వారు ముస్లిం సమాజంలో అష్రాఫ్, అజ్లాఫ్, అర్జాల్ అన్న మూడు వర్గాలను - చారిత్రక మూలాల ఆధారంగా గుర్తించిన సంగతి చూశాము. ఆ ప్రాతిపదిక మీదనే ముస్లింలకు రిజర్వేషన్లు, ఇతర ప్రత్యేక హక్కులు కల్పించాలని సచార్ కమిటీ అభిప్రాయపడింది.

*సామాజిక నిర్మాణం ప్రాతిపదికన ముస్లింలలో మూడు వర్గాలను గుర్తించవచ్చును - అష్రాఫ్, అజ్లాఫ్, అర్జాల్ అనేవి ఈ మూడు. ఈ మూడు వర్గాలకు భిన్నమైన చర్యలు అవసరం. రెండవ వర్గమైన అజ్లాఫ్ బిసిలకు ప్రత్యేక హక్కులు అవసరం. అవి హిందూ బిసిల హక్కులను పోలి ఉండాలి. ఎస్‌సిలతో*

*పోల్చదగ్గ సంప్రదాయ వృత్తులు కలిగిన మూడవ వర్గం అణచివేత దొంతర కింద నలుగుతున్నారు కాబట్టి వారి అభ్యున్నతికి బహుముఖమైన చర్యలు అవసరం. రిజర్వేషన్లు వాటిలో ఒకటి. వీరిని అత్యంత వెనుకబడిన వర్గం (ఎంబిసి)గా గుర్తించాలి.*

## ప్రభుత్వం ఏం చేయాలి?

మైనారిటీ వర్గాలకు సామాజిక ఆర్థిక న్యాయం అన్నదొక్కటేకాక సాంస్కృతిక గుర్తింపు, భద్రత అనేవి కూడా సమస్యలుగానే ఉంటాయని చెప్తూ, అయితే తమ కమిటీని పరిశీలించమన్నది సామాజిక ఆర్థిక అసమానతలను మాత్రమే కాబట్టి వాటికే పరిమితం అయ్యామని సచార్ కమిటీ ముగింపు అధ్యాయంలో అనింది.

ఈ అసమానతకు కారణం ఉద్దేశ్యపూర్వకమైన వివక్ష అని ముస్లింలు భావిస్తున్నారనీ, ఆ నిరసన వల్ల సమస్య మరింత జటిలం అయిందనీ కూడా అనింది. అయితే ఉద్దేశ్యపూర్వకమైన వివక్ష నిజంగా ఉందా లేదా అన్న ప్రశ్న వేసుకోలేదు, జవాబు వెతకలేదు. ముస్లింల స్థితి చాలా దయనీయంగా ఉందని తెలిపే సమాచారాన్ని విశ్లేషణాత్మకంగా వెలికితీసి బయటపెట్టిన సందర్భాలలో కూడా వారిని ఉద్దేశ్యపూర్వకంగా భారత సమాజం, పాలకులు ఆ స్థితిలోకి నెట్టారా లేక ఎవరి దురుద్దేశాలతో నిమిత్తం లేకుండా చారిత్రక కారణాల వల్ల అట్లా జరిగిపోయిందా అన్న చర్చకు సచార్ కమిటీ కావాలనే దూరం ఉండిపోయింది. ఆ చర్చ పెట్టుకోవడం ముస్లిం ప్రజానీకం స్థితిగతులను వాస్తవికంగా గుర్తించి మెరుగుపరచగల చర్యలను సూచించే తక్షణ కర్తవ్యానికి నష్టకరం అని భావించారేమో.

వైవిధ్యాన్ని గౌరవిస్తూ, ముస్లింలను అభివృద్ధి స్రవంతిలోకి తీసుకొచ్చే విధానాలు రచించే ఆవశ్యకతను సచార్ కమిటీ నొక్కి చెప్పింది. దీనికోసం అనేక సూచనలు చేసింది.

## 1. జాతీయ సమాచార బ్యాంకు

ప్రజా జీవితానికీ, పరిపాలనకూ సంబంధించిన సమాచారం సామాజిక వర్గాల వారీగా లభ్యంకాకపోవడం వల్ల వివిధ సామాజిక వర్గాల స్థితిగతులు, వారికి ప్రభుత్వం ఎంత చేస్తున్నది మొదలైన విషయాలు తెలియడం కష్టంగా ఉంది. ఎస్‌సి ఎస్‌టిల విషయంలో కొంత మేరకు సమాచారం దొరుకుతున్నది గానీ బిసిలు, ముస్లింల విషయంలో సమాచారం దొరకడం లేదు. వివిధ

సామాజిక వర్గాలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించి ఒక జాతీయ సమాచార బ్యాంకులో పొందుపరచాలని సచార్ కమిటీ సూచించింది. ఇందులో వారి స్థితిగతుల గురించే కాక ప్రభుత్వ పథకాలు వారికి ఏ మేరకు అందుతున్నాయి, ఎంతమంది ప్రయోజనం పొందుతున్నారు ఇత్యాది విషయాలు కూడా పొందుపరచాలి.

## 2. పర్యవేక్షక కమిటీ

ఈ సమాచారం అందుబాట్లోకి వచ్చినట్టయితే ప్రభుత్వ పథకాల పర్యవేక్షణ సులభతరం అవుతుంది. దానికోసం కేవలం ప్రభుత్వ అధికారులే కాక విద్యావంతులు, పౌరసంస్థల బాధ్యులు కూడా సభ్యులుగా ఉన్న పర్యవేక్షక కమిటీలను నెలకొల్పి వ్యవస్థీకరించాలి. ఎప్పటికప్పుడు ప్రభుత్వ పథకాలు ఏ సామాజిక వర్గానికెంత అందుతున్నాయో పరిశీలించి సలహాలూ, సూచనలూ ప్రభుత్వానికి ఇవ్వడం ఈ పర్యవేక్షక కమిటీ కర్తవ్యం.

## 3. సమాన అవకాశాల కమిషన్

మైనారిటీ అయినందుకు తాము వివక్షకు గురి అవుతున్నామని ముస్లింలు భావిస్తున్న విషయం తమ విచారణలో పదేపదే ముందుకొచ్చిందని సచార్ కమిటీ అనింది. ఏ రకమైన వర్గ వివక్షయినా భారత రాజ్యాంగానికి విరుద్ధం. అటువంటి ఫిర్యాదులను పరిశీలించడానికి న్యాయస్థానాలేకాక జాతీయ మానవ హక్కుల కమిషన్, మైనారిటీ కమిషన్ వగైరా సంస్థలున్నప్పటికీ న్యాయస్థానాలలో వ్యాజ్యాలు నడపడంలో ఉన్న సమస్యలు ఒకెత్తు కాగా, మిగిలిన కమిషన్‌ల అధికారాలు, పరిధి పరిమితమైనవని సచార్ కమిటీ గుర్తించింది. మైనారిటీలు వివక్షకు సంబంధించి ఫిర్యాదు చేసుకుని న్యాయం పొందగల వేదిక ఉండడం, దానికి ఈ విషయంలో స్పష్టమైన అధికారాలుండడం అవసరం అని భావించింది. ఈ సందర్భంగా బ్రిటన్‌లోని జాతి సంబంధాల చట్టాన్ని (రేస్ రిలేషన్స్ యాక్ట్‌ను) ఒక నమూనాగా ప్రస్తావించింది. తాను సూచించిన న్యాయ వేదికకు సమాన అవకాశాల కమిషన్ అనే పేరును కూడా సచార్ కమిటీ ప్రతిపాదించింది.

## 4. పాలనలో భాగస్వామ్యం

పాలనలో తగు భాగస్వామ్యం లేకపోవడం అభివృద్ధి ఫలాలను అందుకోలేకపోవడానికొక కారణం కాగలదని సచార్ కమిటీ గుర్తించింది. అన్ని స్థాయిలలోనూ ప్రాతినిధ్య వ్యవస్థలలో అగ్రకులాలది పెద్ద వాటా కాగా ఎస్‌సి ఎస్‌టిలకు గ్రామ పంచాయితీ నుంచి పార్లమెంటు దాకా జనాభా దామాషాలో

ప్రాతినిధ్యం రాజ్యాంగమే కల్పించింది. ఆ తర్వాత బిసిలకూ, స్త్రీలకూ గ్రామ పంచాయితీ నుండి జిల్లా పరిషత్ వరకు రిజర్వేషన్ కల్పించబడింది. ముస్లింలకు మాత్రం ఏ స్థాయిలోనూ ఇది లేదు. ఒక్క ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే పంచాయితీలలో (అన్ని స్థాయిలలోనూ), మునిసిపాలిటీలలో, సహకార సంస్థలలో మైనారిటీల నుండి కోఆప్ట్ చేసుకునే ఏర్పాటు ఉంది. ఈ మార్గం ద్వారా సభ్యులైన వారికి ఓటువేసే హక్కు లేకున్నా కనీసం తమ వర్గానికి చెందిన సమస్యలను చర్చకు పెట్టే హక్కు, అవకాశం ఉన్నాయి. సచార్ కమిటీ ఈ ఏర్పాటును అభినందిస్తూ, ముస్లింలకు పరిపాలనలో భాగస్వామ్యం కల్పించవలసిన అవసరాన్ని నొక్కి చెప్పింది. ఏ కారణంగానో రిజర్వేషన్ కల్పించాలని సూచించే బదులు నామినేషన్ పద్ధతి పెంచాలనింది. అయితే ఓటు హక్కులేని నామినేటెడ్ ప్రతినిధులు ఉండడం వల్ల లభించే ప్రయోజనం స్వల్పమే.

ఈ సందర్భంగా ఉత్తరప్రదేశ్, బీహార్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలలో ఎస్‌సిలకు రిజర్వ్ చేసిన అసెంబ్లీ, పార్లమెంటు స్థానాలన్నీ ముస్లింలు అత్యధికంగా నివసించే ప్రాంతాలనే విషయాన్ని గణాంకాలతో సహా సచార్ కమిటీ చూపించింది. దీనివల్ల, కనీసం తాము అధిక సంఖ్యలో నివసించే ప్రాంతాలలోనైనా తమ వారిని ఎన్నుకునే అవకాశం లేకుండా పోయిందని కమిటీ ముందు హాజరైనవారు అన్నారని చెప్పింది. సవర్ణ హిందువులు తమ రాజకీయ ఆధిపత్యాన్ని చేజారనియ్యకుండా ఉండడానికి ముస్లింలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలకే ఎస్‌సి రిజర్వేషన్‌ను పరిమితం చేయడం దీనికి కారణం అనేది స్పష్టమే. నియోజకవర్గాల డీలిమిటేషన్ చేపట్టినప్పుడు ఈ స్థితిని సవరించాలని సచార్ కమిటీ సూచించింది. ఈ మధ్యనే దేశవ్యాప్తంగా పూర్తయిన డీలిమిటేషన్ ఈ సూచనను లెక్కలోకి తీసుకుందో లేదో తెలీదు.

## 5. వైవిధ్యం పెంపుదల

మైనారిటీలు తమ వాడలకు, మొహల్లాలకు పరిమితం కావడం మంచిది కాదని గుర్తించి, నివాస స్థలాలలో, విద్యాలయాలలో, ఆటస్థలాలలో వైవిధ్యాన్నీ సహజీవనాన్నీ ప్రోత్సహించే సూచనలు సచార్ కమిటీ ఇచ్చింది. విద్యాసంస్థలకూ, నివాస కాలనీల బిల్డర్లకూ తగిన ప్రోత్సాహకాలు ఇవ్వడం ఒక ముఖ్యసూచన. నగరంలో ప్రభుత్వ స్థలాల వినియోగాన్ని గురించి నిర్ణయం తీసుకునేటప్పుడు భిన్నమతాల వారు కలిసి ఉండే ప్రాంతాలలో పార్కులకు, ఆటస్థలాలకు, లైబ్రరీలకు భూములు ఎక్కువ కేటాయించాలనేది మరొక సూచన. సామాజిక

రంగాలలో పనిచేసే ప్రభుత్వ ఉద్యోగులకు సాంస్కృతిక, సామాజిక వైవిధ్యాన్ని గురించి అవగాహన కల్పించే శిక్షణా కార్యక్రమాలు చేపట్టాలనేది చాలా ముఖ్యమైన సూచన.

## 6. విద్యారంగం

ఒక సామాజిక వర్గం పురోగమనంలో విద్యకుండే ప్రాముఖ్యం దృష్ట్యా దీనిమీద సచార్ కమిటీ చాలా దృష్టి పెట్టింది. ప్రాథమిక విద్య దశలోనే ముస్లింల స్థితి మరీ హీనంగా ఉందని సచార్ కమిటీ గుర్తించింది. స్కూలుకు పోయేవారి నిష్పత్తి, వారిలో అయిదవ తరగతి పూర్తి చేసేవారి నిష్పత్తి, ఈ రెండూ చాలా తక్కువగా ఉన్నాయి. అయితే ఆ దశ దాటిన వారిలో చదువు కొనసాగించే వారి నిష్పత్తి మరీ అంత హీనంగా లేదు. కాబట్టి 14 సంవత్సరాల వరకు ఉచితంగా నిర్బంధంగా చదువు నేర్పించాలని రాజ్యాంగం ప్రభుత్వం పైన పెట్టిన బాధ్యత ముస్లింల విషయంలో చాలా కీలకమైనదని సచార్ కమిటీ భావించింది. ప్రైవేట్ స్కూళ్ళు ముస్లింలకెక్కువగా అందుబాట్లో ఉండవు. కాబట్టి ఉన్నత ప్రమాణాలు గల ప్రభుత్వ పాఠశాలలను ముస్లింలు అధికంగా నివసించే ప్రాంతాలలో నెలకొల్పాలనింది. ముస్లిం కుటుంబాలు – ముఖ్యంగా పట్టణ ప్రాంతాలలో – ఇరుకైన చిన్న ఇళ్ళలో నివసిస్తున్నారు కాబట్టి ప్రాంతీయంగా స్టడీసెంటర్లు నెలకొల్పాలని, అక్కడ కూర్చొని చదువుకునే వాతావరణం కల్పించాలనీ అనింది. ఆడపిల్లలకు ప్రత్యేక పాఠశాలలు అన్నిచోట్లా లేకపోవడం ముస్లిం అమ్మాయిలు చదువు మానుకోవడానికొక కారణం కాబట్టి హైస్కూలు స్థాయిలో అటువంటి ప్రత్యేక పాఠశాలలు నెలకొల్పాలనింది. ఎస్‌సి, ఎస్‌టి, బిసిలలాగే ముస్లింలకు – ముఖ్యంగా అమ్మాయిలకు హాస్టళ్ళు నెలకొల్పాలనింది. మాతృభాషలో విద్యాబోధన విద్యాభివృద్ధికి చాలా కీలకం కాబట్టి ఉర్దూను మాతృభాషగా గల ముస్లిం వర్గాలున్న చోట ఉర్దూ మాధ్యమంలో స్కూళ్ళు నెలకొల్పాలనింది. ఉర్దూలో పాఠ్యపుస్తకాలు విరివిగా లభ్యం అయ్యేలాగ చూడాలనింది. మాధ్యమం సంగతి అటుంచి, ఉత్తర భారతదేశంలో త్రిభాషా సూత్రం కింద ఇంగ్లీష్ – హిందీ – సంస్కృతం నేర్పడం ఆనవాయితీ అయిపోయిన కారణంగా ఉర్దూభాషను స్కూల్లో చదువుకునే అవకాశం సైతం లేకుండా పోయిందని వాపోయింది.

పాఠ్యాంశాలలోని విషయాలపైన కూడా సచార్ కమిటీ దృష్టి పెట్టింది. మన సమాజంలోని వైవిధ్యం పాఠ్యాంశాలలో కూడా ఉండాలనీ లేకపోతే మైనారిటీ

వర్గాలకు చెందిన పిల్లలు పాఠాల నుండి మానసికంగా దూరమయ్యే ప్రమాదం ఉందనీ అనింది. మైనారిటీలను కించపరిచే వ్యాఖ్యలు పాఠ్యాంశాలలో లేకుండా చూసుకోవడం అవసరం అనింది. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం విద్యారంగంలో కృషి చేసే ఎన్‌జివోల సహకారంతో పాఠ్యపుస్తకాలను ప్రక్షాళన చేసిన వైనాన్ని ఈ సందర్భంగా ప్రశంసించింది. అధ్యాపకులకిచ్చే తర్ఫీదు (టీచర్ ట్రైనింగ్) కూడా వైవిధ్యాన్ని గౌరవించే విశాల దృక్పథాన్ని నేర్పేదిగా ఉండాలనింది.

ఉన్నత విద్యలో ముస్లింల భాగస్వామ్యం చాలా తక్కువ అని గుర్తించిన సచార్ కమిటీ దానిని మెరుగుపరచడానికి కొన్ని సూచనలు చేసింది. అన్నిటికంటే సరళమైనది, సులభంగా అమలయ్యేది రిజర్వేషన్. అయితే ఏ కారణంగానో సచార్ కమిటీ విద్యాసంస్థలకు ప్రోత్సాహకాలు కల్పించే ప్రత్యామ్నాయాన్ని ఎంచుకుంది. విద్యాలయాలకూ యూనివర్శిటీలకూ నిధులు సమకూర్చే యు.జి.సి వాటిలోని సామాజిక వైవిధ్యాన్ని బట్టి ఎక్కువ నిధులు ఇవ్వాలని అనింది. ఆంధ్రప్రదేశ్, కర్నాటక, తమిళనాడులలో అనేక ముస్లిం సంస్థలు మైనారిటీ విద్యాసంస్థల్ని నెలకొల్పి ముస్లింలలో విద్యా వ్యాప్తికి కృషి చేస్తున్న వైనాన్ని ప్రస్తావించి, అయితే ఆ సంస్థలు ముస్లింలలోని పేదలకు అందుబాట్లో లేవని సచార్ కమిటీ వ్యాఖ్యానించింది. ఆ సంస్థలు పేదలకిచ్చే సీట్లను బట్టి ప్రభుత్వం వాటికిచ్చే వసతులు, ఆర్థిక సహాయం ఉండాలని సూచించింది.

మదరసాలలో చదువుకునే ముస్లిం పిల్లల శాతం చాలా తక్కువే అయినప్పటికీ ఆయా ప్రాంతాలలో అవే వారికి పాఠశాలలుగా ఉన్నాయి కాబట్టి వాటిని హైస్కూళ్ళతో ముడిపెట్టి మదరసాలో చదువు ముగించిన పిల్లలు నేరుగా హైస్కూలులో లేక కాలేజీలో చేరే అవకాశం కల్పించాలని సచార్ కమిటీ సూచించింది.

## 7. ఉపాధి

విద్య విషయంలో లాగే ఉపాధి విషయంలో కూడా సచార్ కమిటీ కచ్చితమైన హక్కులు కల్పించే సూచనలు కాక, సమాచార పారదర్శకత, ప్రోత్సాహకాలు మొదలైన మార్గాలను వెనుకబాటుతనానికీ వివక్షకూ విరుగుడుగా సూచించింది. అధికంగా స్వయం ఉపాధి రంగంలో చిక్కుకున్న ముస్లిం ప్రజానీకానికి బ్యాంకు రుణాలు అందుతున్నది చాలా తక్కువ కావడం వారి ఉపాధి అవకాశాలలోని స్తబ్ధతను సూచిస్తుంది. బ్యాంకును అప్పు అడిగిన వారు ఏ సామాజిక వర్గానికి చెందిన వారు, వారికి అప్పు ఇచ్చిందీ లేనిదీ తెలిపే సమాచారాన్ని బ్యాంకులు

పారదర్శకంగా నమోదుచేసి ఉంచాలనీ, అమెరికాలో ఇటువంటి నియమం వివక్షను అరికట్టడానికి పనికొచ్చిందనీ సచార్ కమిటీ అంటుంది. 2001 జనాభా లెక్కలను బట్టి చూస్తే ముస్లింలు అధికంగా నివసించే ప్రాంతాలలో బ్యాంకు శాఖలు తక్కువ ఉన్నాయని తెలుస్తున్నది కాబట్టి ముస్లింలు అధికంగా నివసించే ప్రాంతాలలో శాఖలు తెరిచే బ్యాంకులకు ప్రోత్సాహకం కల్పించాలని సచార్ కమిటీ అంటుంది. నాబార్డ్ వంటి సంస్థలు మైనారిటీలకు ప్రయోజనకరమైన పథకాలపైన ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని అంటుంది. ముస్లింల జనాభా 25 శాతం మించి ఉన్న జిల్లాల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధుల కేటాయింపు జరగాలని అంటుంది. ఎస్‌సి ఎస్‌టి బిసిలకు ఉన్నట్టు ముస్లింలకు కూడా ప్రత్యేక కేంద్ర ప్రభుత్వ పథకాలు ఉండాలని అంటుంది.

సామర్థ్యాన్ని పెంచడం కోసం ముస్లింలు అధికంగా నివసించే ప్రాంతాలలో ఐటిఐలు, పాలిటెక్నిక్‌లు విరివిగా నెలకొల్పాలని సచార్ కమిటీ సూచించింది. స్వయం ఉపాధి మీదనూ, దినకూలి మీదనూ ముస్లింలు ఎక్కువగా ఆధారపడుతున్నారు కాబట్టి రెండవ లేబర్ కమిషన్ సిఫారసులు త్వరగా అమలుచేయడం ముస్లిం ప్రజానీకానికి చాలా ఉపయోగకరం అనింది. ముస్లింలకు ఎక్కువగా ఉద్యోగాలిచ్చే సంస్థలకు ప్రోత్సాహం ఇవ్వడం, ఉద్యోగ ప్రకటనలు ఉర్దూలో కూడా ఇవ్వడం, సంస్థలు తమవి 'సమాన అవకాశాల సంస్థలు' అని ప్రకటించుకోవడం ద్వారా వెనుకబడిన వర్గాల వారు కూడా అప్లై చేసుకోవడాన్ని ప్రోత్సహించడం, వగైరా చర్యలను సచార్ కమిటీ సూచించింది. ముస్లింలు అధికంగా నివసించే ప్రాంతాలలోని పోలీస్‌స్టేషన్లు, ఆస్పత్రులు వగైరా సంస్థలలో కనీసం ఒక్కో అధికారి అయినా ముస్లిం ఉండేటట్టు చూడాలన్నదొక్కటే నిర్దిష్టమైన ప్రతిపాదన.

## సిఫార్సుల దగ్గరే అసంతృప్తి

సచార్ కమిటీ సూచనల స్వరూపం ఈ పాటికి అర్థమై ఉంటుంది. కచ్చితమైన హక్కులు కల్పించమని చెప్పకుండా హక్కులు లభించే దిశగా ప్రోత్సాహకాలు ఇవ్వడం, పారదర్శకత నెలకొల్పడం, వ్యవస్థ తమకు కూడా చోటు కల్పిస్తుందన్న విశ్వాసం కలిగించడం మాత్రమే ఈ కమిటీ సిఫార్సుల లక్ష్యం. ఈ చర్యలు సూచించడం సదుద్దేశంతో అనుసరించిన వ్యూహమే అయి ఉండవచ్చు. ఎందుకంటే రిజర్వేషన్లు, కోటాలు కలిగించినంత వ్యతిరేకత ఇవి కలిగించవు. అందువల్ల వీటికి రాజకీయ ఆమోదం సులభతరం కావచ్చు. అయితే మన దేశ

పాలనా యంత్రాంగంతో మనకున్న అనుభవం ఏమిటంటే కచ్చితమైన హక్కులకే భరోసా లేదు. అనిర్దిష్టమైన సూచనలు ఆమోదం పొందేయవచ్చు కాని ఆ తర్వాత ఏమీ జరగకపోవచ్చు. అందుకే మొదట్లోనే అన్నాము – సచార్ కమిటీ సిఫారసుల కంటే వారి నివేదిక విలువైనదని.

కాగా, తాను సూచించిన చర్యలకు అవసరమైన నిధులను నిరుపయోగంగా ఉన్న ముస్లిం ప్రజల ధార్మిక ఆస్తులను అమ్మి, లేక వ్యాపార సంస్థలకు లీజుకిచ్చి సేకరించడం సబబుగా ఉంటుందన్న సచార్ కమిటీ సూచన ఎంతవరకు ఆమోదించదగ్గదన్నది చర్చించాల్సిన విషయమే. ఎక్కువగా పట్టణ ప్రాంతాలలో ఉన్న వక్ఫ్ ఆస్తులు ఇప్పుడు చాలా విలువైనవనడంలో సందేహం లేదు. వాటి నుంచి ముస్లిం ప్రజలు పెద్దగా ప్రయోజనం పొందుతుండకపోవచ్చు. అయితే నిరుపయోగంగా ఉన్న వాటిని వ్యాపార వస్తువులుగా మార్చడం ద్వారా డబ్బు సంపాదించి దానిని ముస్లిం ప్రజల లౌకిక అభ్యున్నతి కోసం ఖర్చుపెట్టాలన్నది అనేక సమస్యలకు దారితీయగల సూచన. దీని మీద ఇంకా చాలా చర్చ జరగవలసి ఉంది.

**మానవహక్కుల వేదిక బులెటిన్ – 9**
**డిసెంబర్ 2008**

# చరిత్ర పాఠాలపై కాషాయం నీడ



మెడమీద కత్తిపెట్టి మతమార్పిడులు చేయాలని ప్రయత్నించిన ముస్లిం పాలకులూ, ప్రముఖులూ మన దేశంలో లేకపోలేదు. అలాగే పాలకుల మతంలోకి మారితే ఏవో ప్రయోజనాలు వస్తాయన్న ప్రలోభం వల్ల జరిగిన మతమార్పిడులు సహితం లేకపోలేదు. కానీ ఈ విషయాన్ని పరిశోధన చేసిన చరిత్రకారులందరూ చెప్పేదేమిటంటే బలప్రయోగం కన్నా, ప్రలోభాలకన్నా ఇస్లాం వ్యాప్తికి ఎక్కువ దోహదం చేసింది సూఫీ ప్రచారకుల బోధనలు. మంత్రతంత్రాలతో రోగాలు నయంచేస్తూ హితబోధ చేస్తూ పేదరికంలో బతుకుతూ దైవ భావనను ప్రజలలో ప్రచారం చేసిన ఈ 'పీర్'ల దర్గాలు దేశంలో ఎక్కడబెడితే అక్కడ కనిపిస్తాయి. ఎవరైనా లెక్క పెట్టారో లేదో తెలీదుగానీ మన దేశంలో మసీదుల కంటే దర్గాలే ఎక్కువనుకుంటాను. ఏ కట్టడం లేని 'దర్గా చెట్లు' బహుశా ఇంకా ఎక్కువేమో. ఇస్లాంను ప్రధానంగా ప్రచారం చేసిన పేద ఫకీర్ల హితబోధలకివి చిహ్నాలు. ఈ దర్గాలు, వాటిలో జరిగే పూజలు సనాతన ఇస్లాంకు నచ్చవు. వాటికి హిందువులు సహితం హాజరుకావడం బ్రాహ్మణీయ హైందవానికి అసలే నచ్చదు. అయినా అవి జరుగుతూనే ఉంటాయి. హిందువులు సహితం పెద్దసంఖ్యలో వాటికి హాజరవుతూనే ఉంటారు. ఈ దేశంలో బ్రాహ్మణ పండితులు, ముస్లిం ఇమాంలు మాత్రమే ఉంటే ఈ రెండు మతాల మధ్య ద్వేషం మాత్రమే ఉండేదేమో. పాకిస్తాన్‌లో చరిత్రను ఆ విధంగానే చెప్తున్నారు. సంఘ్‌పరివార్ రేపు తిరగరాయబోయే చరిత్రలో కూడా ఆ విధంగానే చెప్తారు. సామాన్య ప్రజలలో మతద్వేషం లేదని కాదు గానీ వారిలో ఉన్నది ద్వేషం మాత్రమే కాదు. చరిత్రలో

ఈ రెండు మతాల మధ్య ద్వేషం మాత్రమే ఉండిందంటూ చరిత్రను తిరగరాసే ప్రయత్నం అబద్ధపు ప్రయత్నమే కాగలదు. కష్టాలలో సేదదీర్చే రక్షకునిగా దేవుడిని చూపించే భావనే చరిత్రలో ఎప్పుడయినా వేగంగా ప్రచారం అయింది. అన్ని మతాలూ సామాన్య ప్రజలలో ఈ రకమైన దైవభావన ద్వారానే ఎక్కువ ప్రచారం పొందాయి. ఈ భావనలో ద్వేషానికి చోటు తక్కువ. అయినప్పటికీ సామాన్య ప్రజలలో పరమత ద్వేషభావం లేకపోలేదు. దానికి గల కారణాలను విశ్లేషించడానికి ఇది సందర్భం కాదు కానీ ద్వేషమే ఏకైక భావన కాదని గుర్తించడం అవసరం. ఈ విషయం గుర్తించడమే సంఘ్‌పరివార్ చరిత్రకారులకు ఇష్టం లేదు.

మరీ మొరటుగా రాసిన సంఘ్‌పరివార్ ప్రచురణలే కాదు, విషయ పాండిత్యానికి లోటులేని భారతీయ విద్యాభవన్ ప్రచురించిన 'భారత ప్రజల చరిత్ర, సంస్కృతి' అనే బహుళ సంపుటాల ఉద్గ్రంథం ఇచ్చే చారిత్రక అవగాహన కూడా ఇదే. ఇస్లాం, హైందవం ఎటువంటి సహజీవనం సాధ్యం కాని ఉత్తర దక్షిణ ధృవాలనే అభిప్రాయాన్ని చదువుకున్న వారిలో ప్రచారం చేయడంలో ఆ ప్రచురణ, దాని సంపాదకుడయిన ప్రముఖ చరిత్రకారుడు ఆర్.సి. మజుందార్ విడిగా రాసిన రచనలు విశేషమైన పాత్ర నిర్వహించాయి. ముస్లిం రాజుల పాలన భారత చరిత్రలో చీకటియుగమన్న అభిప్రాయం కూడా ఈ ప్రచురణల ద్వారా ప్రాచుర్యం పొందింది. ఇప్పటి పాఠ్యపుస్తకాలు ఈ దృక్పథాన్ని బోధించడం లేదని సంఘ్‌పరివార్ అసంతృప్తి. దానిని సవరించాలన్నది వారి ఆరాటం. ఆ ఆరాటం ఫలితం ఏ విధంగా ఉంటుందో చూడాలంటే పాకిస్తాన్‌లో స్కూలు, కాలేజి పిల్లలకు చరిత్ర పాఠాలు ఏ విధంగా చెప్తున్నారో చూస్తే చాలునని ఒక చరిత్రకారుడు వ్యంగ్యంగా అన్నమాట అక్షర సత్యం. అక్కడ ఇదే అభిప్రాయాన్ని (రివర్స్‌లోనని వేరే చెప్పనవసరం లేదు) ఇప్పటికే అమలు చేస్తున్నారు.

కానీ నిజానికి బ్రాహ్మణ, ఇతర పెత్తందారీ కులాల సంగతేమో గానీ శ్రామిక కులాల వారికి ఇస్లాం పట్ల వ్యతిరేకత ఉండవలసిన అవసరమేమీ లేదు. లేకపోగా, ఇస్లాం వారిని బలంగా ఆకర్షించిన దాఖలాలున్నాయి. మగవాళ్ళ వరకు ఇస్లాం దేవుడి ముందు సమాన ప్రతిపత్తి కల్పిస్తుంది. హైందవ నిచ్చెనమెట్ల సమాజంలో దేవుడి ముందే (అంటే ధర్మం ముందే) మనుషులు అసమానులు. నిచ్చెన కిందమెట్ల మీద ఉన్నవారిని ఇస్లాం ఆకర్షించిందనడంలో సందేహం లేదు. ఎక్కువ భాగం ఆ ప్రజలే ముస్లింలయ్యారు. హైందవ చరిత్రకారులు ఇస్లాం ఆగమనం

తదుపరి కాలాన్ని 'చీకటి యుగం' అంటే అనవచ్చును గానీ, ఈ ప్రజల జీవితాలకు మాత్రం అది వచ్చాకే కొంచెం వెలుగు వచ్చింది. మొదట ఇస్లాం, తరువాత క్రైస్తవం కులం కారణంగా కరుడుగట్టిన హైందవ సామాజిక వ్యవస్థను కొంతమేరకైనా ప్రజాస్వామీకరించడానికి తోడ్పడ్డాయి. అది చీకటి యుగం ఎట్లా అవుతుందో ఆ మాట ప్రయోగించేవారే చెప్పాలి.

హైందవ కులవ్యవస్థ ప్రయోగించిన అణచివేతను కొంతమేరకైనా సడలించే పాత్ర ఇస్లాం నిర్వహించిందని ఈనాటి 'సెక్యులర్' పాఠ్యపుస్తకాలు సహితం అనలేకపోతున్నాయి. ఆ అభిప్రాయం ఇప్పటికీ చరిత్ర పరిశోధకులు మాత్రమే చదువుకునే పుస్తకాలకు పరిమితం అయి వుంది. ఈ ఒక్క విషయంలోనే కాదు, హిందూత్వవాదుల దృక్పథంతో పోలిస్తే సెక్యులర్‌గానే కనిపించే ప్రస్తుత విద్యావ్యవస్థ ప్రాపంచిక అవగాహన ఏ విషయంలోనూ బ్రాహ్మణీయాన్ని బాహాటంగా విమర్శించదు, వ్యతిరేకించదు. అంటరానితనం వంటి మరీ తీవ్రమైన దురాచారాలను విమర్శించేవరకే అది పరిమితం అయింది. 'లౌకికత' పరిమితులే ఈ విధంగా ఉంటే ఇంక సంఘ్‌పరివార్ దృక్పథం పాఠ్యపుస్తకాలను లోబరచుకుంటే ఏం జరుగుతుందో ఊహించడం కష్టం కాదు.

శ్రామిక కులాలలో కూడా వ్యవసాయదారుల కంటే చేతివృత్తులవారు ఎక్కువగా ఇస్లాం వైపు ఆకర్షితులయ్యారు. దీనికి గల కారణమేమిటో పరిశోధించిన వారెవరైనా ఉన్నారేమో తెలీదు. అయితే 'ముస్లిం యుగం' అని దేన్నయితే హిందూత్వవాద చరిత్రకారులు పిలుస్తారో ఆ కాలంలో పట్టణ ప్రాంత వ్యవసాయేతర ఉత్పత్తిరంగంలో వచ్చిన అభివృద్ధితో దీనికేమైనా సంబంధం ఉండవచ్చు. బట్టలు, తివాచీలు, ఇతర నేత సంబంధమైన ఉత్పత్తులు, అద్దకాలు, గృహనిర్మాణం, గృహోపకరణాల ఉత్పత్తిలో ఢిల్లీ సుల్తాన్ల కాలం నుండి గణనీయమైన అభివృద్ధి వచ్చింది. పశ్చిమాసియా నుండి, ఇరాన్ నుండి కొత్త సాంకేతిక ప్రక్రియలు, ప్రయోగాలు దిగుమతి ఆయ్యాయి. పాలకులు ముస్లింలు కావడం వల్ల, వారికి ఆ ప్రాంతాలతో సంబంధాలుండడం వల్ల మన ఆర్థిక జీవితానికి ఈ మేలు జరిగింది. గృహనిర్మాణకళ నుండి సంగీతం, చిత్రలేఖనం దాకా అనేక రంగాలలో భిన్న సంప్రదాయాల కలయిక కొత్తదనాన్ని తీసుకొచ్చింది. ద్వేషభావం వదలిపెట్టి చూడగలిగితే భిన్న సంప్రదాయాల కలయిక నాగరికతకు – కేవలం భౌతికంగానే కాదు, కళా సాంస్కృతిక రంగాలలోనూ, ఆలోచనలలోనూ చేయగల మేలు కనిపిస్తుంది. మత, తాత్విక సంప్రదాయాలపైన కూడ ఈ ప్రభావం ఉంది. 12వ శతాబ్దం తరువాత వచ్చిన భక్తి ఉద్యమాలలో బ్రాహ్మణీయ

ఆలోచనా రీతులపట్ల వ్యక్తమైన నిరసనపైన ఇస్లాం ప్రభావం ఉంది. సిక్కుమతం కొన్ని విషయాలలో హైందవానికి సన్నిహితమైనా దానిపైన ఇస్లాం ప్రభావం కూడా బలంగా ఉంది. ఆ రకంగా మనది అనేక సంప్రదాయాలు కలిసిన ప్రాంతం కావడం మన నాగరికతను సుసంపన్నం చేసింది. ఇదంతా 'చీకటి'గా కనిపించేవారి మానసిక వికారానికి సానుభూతి చూపగల ఔదార్యం మనలో కొరవడకూడదు గానీ ఆ వికారాన్ని పాఠ్యాంశాలలో చేర్చి పిల్లల మనసులు, మెదళ్ళు పాడుచేస్తామంటే చూస్తూ ఊరుకోకూడదు.

పరిపాలనా వ్యవహారాలలో ఈనాటికీ కనిపించే కొన్ని మార్పులు ఢిల్లీ సుల్తాన్ల కాలంలోనూ, మొగలాయిల పాలనలోనూ వచ్చాయి. అది వట్టి 'చీకటి యుగం' కాదనడానికి ఇది కూడా ఒక నిదర్శనం. ఆధునిక 'సంక్షేమరాజ్యం' భావన ఉనికిలోకి వచ్చేదాకా రాజ్యానికి ప్రజలతో ప్రధానంగా రెండే సంబంధాలుండేవి. ఒకటి పన్నులు వసూలు చేయడం, రెండు శాంతిభద్రతలు నెలకొల్పడం. ఈ రెండు పనులూ, కొంత క్రమబద్ధంగా చేసిన రాజ్యం మంచిది, విచ్చలవిడిగా చేసిన రాజ్యం చెడ్డది. (అప్పుడప్పుడు చెరువులు తవ్వించిన, చెట్లు నాటించిన, రోడ్లు వేయించిన, సరాయిలు నిర్మించిన రాజ్యాలు లేకపోలేదుగానీ అవి అరుదయినవే).

పన్నుల వసూలుకూ శాంతి భద్రతల నిర్వహణకూ ఒక క్రమబద్ధమైన యంత్రాంగం, నియమాలు ఏవీ లేకుండా ఆ అధికారాన్ని రాజు తన సామంతులకు, జాగీర్దార్లకు, నాయకులకు అప్పగించడం, వాళ్ళు విచ్చలవిడిగా దానిని వినియోగించడం ఒక నమూనా కాగా, దాన్ని మొత్తం క్రమబద్ధం చేసి కొన్ని నియమాలననుసరించి ఆ అధికారాన్ని నిర్వహించడం రెండవ నమూనా. దీనికోసమే ఇంగ్లండ్‌లో 'మాగ్నాకార్టా' ప్రకటన జరిగింది. మన దేశంలో అటువంటి హక్కుల ప్రకటన జరగలేదుగానీ రాజ్యమే తనకుతాను ఒక క్రమబద్ధమైన నిర్మాణాన్ని రూపొందించుకుంది. మౌర్యులు ప్రాచీన కాలంలో ఈ ప్రయత్నం కొంత చేశారు గానీ అది తరువాత అంతరించిపోయింది. తిరిగి ఢిల్లీ సుల్తాన్లలో ఒకడయిన ఫిరోజ్ తుగ్లక్ హయాంలో నిర్మాణయుతమైన పరిపాలనా వ్యవస్థ ఏర్పడి, షేర్‌షా, అక్బర్‌ల కాలంలో స్థిరమైన రూపం తీసుకుంది. బ్రిటిష్ వాళ్ళు దానిని పెద్దగా మార్పులు లేకుండా కొనసాగించి స్వతంత్ర భారతానికి అందించారు. ఈ పరిపాలనా వ్యవస్థ (ప్రధానంగా రెవెన్యూ, పోలీసు, న్యాయ యంత్రాంగాలు) ఎంతగా మన జీవితంలో భాగమయిపోయిందంటే దానికి సంబంధించి మనం తెలుగులో (తెలంగాణలోనే కాదు, ఆంధ్రలో కూడా)

ఉపయోగించే మాటలన్నీ పర్షియన్ మూలంగల మాటలే. తాసీల్దారు, గుమాస్తా, శిస్తు, అమీన్, ఖర్చు, కిస్తు, తక్కావీ, ఖరీఫ్, రబీ, ఫసల్, మాఫీ ఇందుకు కొన్ని ఉదాహరణలు. చివరికి అచ్చ తెలుగు మాట అని చాలామంది అనుకునే 'రైతు' అనేది కూడా పర్షియన్ నుండి రెవెన్యూ యంత్రాంగం వ్యవహారభాష ద్వారా తెలుగులోకి దిగుమతి అయిన మాటే (వ్యవసాయదారుడికి అచ్చ తెలుగు మాట కాపు. అదిప్పుడు ఒక కులాన్ని సూచించే మాట అయింది). చెప్పవచ్చిందేమిటంటే హిందూస్తానీ సంగీతం నుండి తహశీలు ఆఫీసుదాకా, ఉర్దూభాష నుండి తివాచీ పరిశ్రమ దాకా 'చీకటి యుగం' అని పిలువబడే కాలంలో ఒక సంపన్నమైన మిశ్రమ సంస్కృతి రూపం తీసుకుంది. దానిని చూడలేక, ఒకదానితో ఒకటి కలువలేని – ఎడముఖం పెడముఖంగా మాత్రమే ఉండగల – భిన్న సంస్కృతులు పరస్పరం సంఘర్షించుకున్న చీకటి కాలంగా మాత్రమే ఆ కాలాన్ని ఆర్.సి.మజుందార్ వంటి విద్యావంతులయిన చరిత్రకారులే హిందూత్వవాద భావజాలం ప్రభావంలో భావించగలిగారంటే, ఇంక అర్ధ నిరక్షరాస్యులయిన ఖాకీ నిక్కరు మేధావుల చేతిలో పాఠ్యాంశాల భవితవ్యాన్ని పెడితే ఏం జరుగుతుందో ఊహించడానికే భయమవుతుంది.

వీర దేశభక్తిని సాధనంగా ఎంచుకున్న హిందూత్వ వాదానికి వీరుల చరిత్రలు అవసరం. చరిత్రలో వీరుల అన్వేషణ అవసరం. 'మన' వీరులను మరచిపోయి యువతను శక్తిహీనుల్ని చేస్తున్నదని ప్రస్తుత విద్యావ్యవస్థపైన వారి అభియోగం. చరిత్ర నుండి ఆదర్శాలు ఎంచుకోవడంలో తప్పులేదు. యువతకు సరయిన విలువలు నేర్పడానికి అది అవసరం కూడా కావచ్చు. కానీ 'వీరులు' ఎందుకు కావాలి? ఒక భౌతిక శక్తిగా భారతదేశాన్ని తీర్చిదిద్దే లక్ష్యముంటేనే కావాలి. మనది ఆధ్యాత్మిక సంస్కృతి అని చెప్పుకునే వారే చరిత్ర దగ్గరకొచ్చే సరికి 'వీరుల' అన్వేషణ చేయడం ఎందుకు?

ఆధ్యాత్మికత సంగతేమోగానీ మానవీయ విలువలు ప్రధానమనుకుంటే బుద్ధుడినీ, అశోకుడినీ, కబీర్‌నూ, ఒక మేరకు గాంధీని కూడా ఆదర్శంగా తీసుకోవచ్చు. పీడనను వ్యతిరేకించే పోరాట స్ఫూర్తి ప్రధానమనుకుంటే అల్లూరి సీతారామరాజునూ, బిర్సా ముండానూ, భగత్‌సింగ్‌నూ తీసుకోవచ్చు. కానీ హిందూత్వవాదుల ఆదర్శ చారిత్రక వ్యక్తులు వీరెవ్వరూ కారు. వారికి 'వీరులు' కావాలి. అది కూడా ఒక పెడ అర్థంలో మాత్రమే. ముస్లిం రాజులపైన యుద్ధం చేసిన హిందూరాజులే ఆ 'వీరులు'. వెయ్యేళ్ళ చరిత్రను ముస్లింలపైన హిందువులు

చేసిన విముక్తి పోరాటంగా వారు చిత్రీకరించదలచుకున్నారు. కాబట్టి శివాజీ, రాణాప్రతాప్, శ్రీకృష్ణదేవరాయలు వగైరాలు వీరి 'వీరులు'. వీరంతా 'భారతదేశం' అనే దేశాన్ని భావించుకొని దానిని ముస్లిం పాలకుల నుండి 'విముక్తి' చేసే లక్ష్యాన్ని కలిగి ఉన్నారని నమ్మడం కష్టం. తాము హిందువులు, ఎదుటివారు ముస్లింలు అన్న స్పృహ వీరిలో లేదని కాదు. దానిని వారి రాజ్యాధికార పోరాటంలో వాడుకోలేదని కూడా కాదు. కానీ ఈనాటి హిందుత్వవాదుల దృక్కోణాన్ని వారికి అంటగట్టి, తమ రాజ్య విస్తరణ కోసమో రక్షణ కోసమో వారు చేసిన యుద్ధాలలో 'దేశ విముక్తి' లక్ష్యాన్ని చూడడం అచారిత్రకం. నిజానికి హిందూ రాజులూ ముస్లిం రాజులూ ఒకరితో ఒకరు చేతులు కలిపి ఇతర హిందూ రాజులపైన, ముస్లిం రాజులపైన యుద్ధాలు చేసిన సంఘటనలనేకం ఉన్నాయి.

మన–తన భావనకు హిందూ–ముస్లిం ప్రాతిపదిక ఆనాడు ఉండిన మాట వాస్తవమే. కానీ అదొక్కటే లేదు. ఈనాటికీ మన గ్రామాలలో ముస్లింలను అన్ని కులాలతో పాటు ఒక కులంగా చూస్తారు. మన–తన భావనలో కులానికి స్థానం వున్నట్టే హిందూ–ముస్లిం భావనకు కూడా ఉంది, ఉండింది. అంతకుమించి దానినే సాంఘిక వర్గీకరణకు కేంద్రం చేసి హైందవ వీరులను సృష్టించడం చరిత్రను సహేతుకంగా అర్థం చేసుకోవడానికీ పనికిరాదు, రేపటి జీవితాన్ని సరిగ్గా తీర్చిదిద్దుకోవడానికీ పనికిరాదు. హిందూత్వవాదుల ఆధిపత్యవాద అజెండాకేమైనా పనికొస్తుందేమో. అసలు భారతదేశ చరిత్రను హిందూ యుగం (క్రీ.శ. 11వ శతాబ్దం దాకా), ముస్లిం యుగం (అప్పటి నుండి బ్రిటిష్ పాలన నెలకొనేదాకా), బ్రిటిష్ యుగం అని వర్గీకరించడమే అశాస్త్రీయమనీ, ముస్లిం రాజుల ఆగమనం అంతటి పునాది ప్రాయమైన మార్పేమీ తీసుకురాలేదనీ రొమిలా థాపర్ వంటి చరిత్రకారులు సవివరంగా వాదించి ఉన్నారు. ఆ వచ్చిన మార్పు కూడా పూర్తిగా చెడ్డది కాదు, విధ్వంసకరమైనది కాదని పైన చూశాం.

**'చరిత్ర పాఠాలపై కాషాయం నీడ' వ్యాసం నుంచి కొంత భాగం.**
**పూర్తి వ్యాసం 'మతతత్వంపై బాలగోపాల్' పుస్తకంలో ఉంది.**
**1999**

# ముస్లిం రిజర్వేషన్లు

# ముస్లింలకు రిజర్వేషన్లు సబబే

ముస్లింలకు విద్యా ఉద్యోగ రంగాలలో 5 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన జీవో 33ను వెనక్కి తీసుకోవాలంటూ కొన్ని వర్గాల వారు ఆందోళన చేస్తున్నారు. బిజెపివారు బహిరంగంగా అల్లరిచేయగా, ఇతరులు తగు స్థాయిలో అదే డిమాండ్ చేస్తున్నారు.

ఈ వ్యతిరేకత ఎంతవరకు సబబు అనేది చర్చించుకోవలసిన విషయం. సామాజిక వాస్తవాలేమిటి, రాజ్యాంగమేమంటుంది, న్యాయస్థానాలు ఏమన్నాయి మొదలయిన విషయాలు అందరం తెలుసుకోవాలి. విషయాలు తెలుసుకోకపోతే ఆవేశానికి కొట్టుకుపోయే ప్రమాదం ఉంది.

సామాజిక వాస్తవాల గురించి పెద్దగా వివాదం లేదు. జీవో 33ను వ్యతిరేకిస్తున్నవారెవ్వరూ ముస్లింలలో వెనుకబాటుతనం లేదని అనడం లేదు. హైకోర్టులో వేసిన కేసులలో సహితం ముస్లింలు అభివృద్ధి చెందిపోయారు కదా, వారికి రిజర్వేషన్లు ఎందుకు అని ఏ ఒక్కరూ అనలేదు. ముస్లింలలో ఉందని ప్రభుత్వం చెప్తున్న వెనుకబాటుతనం నిజంగానే ఉందని అందరూ ఒప్పుకుంటున్నారు. అయినప్పటికీ వారికి రిజర్వేషన్లు ఇయ్యొద్దని వారి వాదన.

జీవో 33కు వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళన గురించి తెలుసుకోవలసిన మొట్టమొదటి విషయం ఇది.

మరయితే ఎందుకు వ్యతిరేకిస్తున్నారు? మతం ప్రాతిపదికన రిజర్వేషన్లు ఇవ్వడాన్ని రాజ్యాంగం ఒప్పుకోదనీ, అది సామాజికంగా హానికరమనీ, సమాజాన్ని నిలువునా చీలుస్తుందనీ అంటున్నారు.

రాజ్యాంగం సంగతి మొదట చెప్పుకుందాం. సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాల అభివృద్ధి కోసం వారికి ప్రత్యేక సదుపాయాలు కల్పించవచ్చుననీ, ప్రభుత్వ ఉద్యోగాలలో తగిన ప్రాతినిధ్యం లేని వెనుకబడిన వర్గాలకు ఆ ఉద్యోగాలలో రిజర్వేషన్ ఇయ్యవచ్చుననీ రాజ్యాంగం అంటుంది.

ఒక కులం సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడి ఉన్నట్టయితే ఆ కులాన్ని వెనుకబడిన వర్గంగా గుర్తించి రిజర్వేషన్లు ఇయ్యడంలో తప్పేమీ లేదని సుప్రీంకోర్టు నలభై ఏళ్లుగా అనేక తీర్పులలో అనింది. ఈ కేసులన్నీ బిసిలకు రిజర్వేషన్లు ఇవ్వడాన్ని సవాలుచేస్తూ అగ్రకులాలు వేసినవే. అప్పుడూ వారు ఇదే వాదన చేశారు. ఈ రోజు మతం పేరుమీద చేస్తున్న వాదన ఆ రోజు కులం పేరుమీద చేశారు. కులం ప్రాతిపదికన రిజర్వేషన్లు ఇవ్వడాన్ని రాజ్యాంగం ఒప్పుకోదన్నారు. దానికి సుప్రీంకోర్టు ఏం సమాధానం చెప్పిందంటే సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడి ఉన్న కులానికి రిజర్వేషన్లు కల్పించడం 'కులం' ప్రాతిపదికన రిజర్వేషన్లు ఇచ్చినట్టు కాదనింది. ఆ కులాన్ని వెనుకబడిన వర్గంగా పరిగణించి దానికి రిజర్వేషన్ ఇస్తున్నారే తప్ప కులానికి రిజర్వేషన్ ఇవ్వడంలేదనింది.

ఏదయినా ఒక ప్రజాసమూహం వెనుకబడి ఉన్నట్టయితే వారికి రిజర్వేషన్ కల్పించవచ్చు. ఆ సమూహం ఒక కులం కావచ్చు, ఒక ప్రాంతవాసులు కావచ్చు, ఒక భాష మాట్లాడేవారు కావచ్చు. దీని అర్థం కులానికో, ప్రాంతానికో, భాషకో రిజర్వేషన్ ఇచ్చినట్టు కాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ మాట అంటూ, 'ఒకవేళ ముస్లింలు వెనుకబడి ఉన్నారని ఒక రాష్ట్ర ప్రభుత్వం గుర్తించినట్టయితే ముస్లింలకు రిజర్వేషన్ ఇయ్యవచ్చు' అని కూడా మండల్ కమిషన్ కేసులో రాజ్యాంగ ధర్మాసనం అనింది. మన రాష్ట్రంలో ముస్లింలు వెనుకబడి ఉన్నారన్న వాస్తవాన్ని ఎవరూ కాదననప్పుడు 'రాజ్యాంగం ఒప్పుకోదు' అన్న వాదన చెల్లదని దీనినిబట్టి స్పష్టం అవుతున్నది.

ముస్లింలకు రిజర్వేషన్ ఇవ్వడం సమాజాన్ని నిలువునా చీల్చడమేనన్న వాదనను ఏ విధంగా అర్థం చేసుకోవాలి? హిందువులు, ముస్లింలు అన్న చీలిక మన సమాజంలో చాలాకాలంగా ఉంది. దానికి చారిత్రక, రాజకీయ కారణాలున్నాయి. ముస్లింలకు ఇచ్చే రిజర్వేషన్ల పట్ల హిందువులు కోపగించుకున్నట్లయితే ఈ ఎడం మరింత పెరుగుతుంది గానీ, సహృదయంగా అర్థం చేసుకుంటే ఎందుకు పెరుగుతుంది?

సహృదయంగా ఎందుకు స్పందించాలి అని అడుగుతారేమో. దీనికి జవాబు క్లుప్తంగానే అయినా జీవో 33లో ప్రభుత్వమే చెప్పింది. రాష్ట్రంలో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారి సంఖ్య 30 శాతం కాగా ముస్లింలలో 65 శాతం. రాష్ట్రంలో నిరక్షరాస్యత 56 శాతం కాగా ముస్లింలలో 82 శాతం. ముస్లిం స్త్రీలలోనయితే 96 శాతం. రాష్ట్ర జనాభాలో ముస్లింలు 8.5 శాతం ఉన్నారుగానీ ప్రభుత్వ ఉద్యోగాలలో అందులో సగం కూడా లేరు. అత్యధికులు అసంఘటిత రంగంలోని చిన్న వృత్తులలో మగ్గుతున్నారు. పాన్‌షాపులు, చాయ్ దుకాణాలు, పూలు, పళ్ళ దుకాణాలు, రేడియో రిపేర్, వాచ్ రిపేర్ షాపులు పెట్టుకొని బతుకుతున్నారు. మెకానిక్ షెడ్‌లలో హోటళ్ళలో పనిచేస్తున్నారు. గ్రామీణ చేతివృత్తుల రంగంలో ఉన్నారు.

ఇటువంటి ప్రజా సమూహానికి రిజర్వేషన్లు ఇస్తే ఇతర ప్రజలు సానుభూతితో ఎందుకు అర్థం చేసుకోకూడదు? చేసుకున్నట్టయితే సమాజంలో చీలిక ఎందుకు పెరుగుతుంది? అయినా ముస్లిమేతరులు సానుభూతితో అర్థం చేసుకోరని ప్రకటించడానికి ఈ పిడికెడు మంది ఆందోళనకారులకు ఎవరు అధికారం ఇచ్చారు?

ముస్లింలకు 5 శాతం రిజర్వేషన్ ఇచ్చినట్టయితే మొత్తం రిజర్వేషన్ 50 శాతం దాటిపోతుందనేది దానిని వ్యతిరేకిస్తున్నవారు చెప్తున్న మరొక కారణం. మొత్తం రిజర్వేషన్ 50 శాతం దాటడానికి వీలులేదని సుప్రీంకోర్టు చెప్పిందని వారు అంటున్నారు.

## ఇదెంతవరకు నిజం?

మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించవచ్చునా లేదా అన్న విషయంలో సుప్రీంకోర్టు జడ్జిలు గడచిన 50 ఏళ్లలో తలా ఒక అభిప్రాయం వ్యక్తం చేశారు. వెనుకబాటుతనం ఎంత ఉంటే రిజర్వేషన్ అంత ఉంటుంది – దానికి సీలింగ్ ఏమిటి అన్నవారూ ఉన్నారు. మొత్తం రిజర్వేషన్ ఎట్టి పరిస్థితిలోనూ 50 శాతం మించడానికి వీలులేదన్నవారూ ఉన్నారు. ప్రస్తుతం శిరోధార్యంగా ఉన్నది మండల్ కమిషన్ కేసులో మెజారిటీ తరఫున తీర్పు ప్రకటించిన జస్టిస్ జీవన్‌రెడ్డి అభిప్రాయం. అదేమిటంటే, వెనుకబడిన వర్గాలకు ఇచ్చే రిజర్వేషన్ మొత్తం 50 శాతం మించకూడదన్నది ఒక స్థూలమయిన నియమం. దానికి ప్రత్యేక పరిస్థితులలో మినహాయింపులుండగలవు. అంతేకాక, వెనుకబడిన వర్గమన్న కారణంగా కాక వేరే కారణాల వల్ల ఇచ్చే రిజర్వేషన్‌కు ఈ '50 శాతం సీలింగ్'

వర్తించదు. ముల్కీ తరహా లోకల్ రిజర్వేషన్లు, స్త్రీలకు ఇచ్చే 33.3 శాతం రిజర్వేషను, వికలాంగులకిచ్చే 3 శాతం రిజర్వేషను, ఎన్‌సిసి కోటా, స్పోర్ట్స్ కోటా మొదలైనవి ఈ సీలింగ్‌కు వెలుపల ఉంటాయి.

'50 శాతం సీలింగ్' వర్తించేది ఎస్‌సి, ఎస్‌టి, బిసి రిజర్వేషన్లకే. అవి మూడూ కలిపి ప్రస్తుతం 46 శాతం ఉన్నాయి. ముస్లింలను బిసిలలో చేర్చి 5 శాతం రిజర్వేషన్ ఇస్తే ఇది 51 శాతం అవుతుంది. అంటే 'స్థూలమైన' పరిమితిని మించి ఒక శాతం మాత్రమే అవుతుంది. ఆ ఇంత కూడా మించకూడదనుకుంటే 5 శాతాన్ని 4 శాతానికి తగ్గిస్తూ జీవో 33ను సవరించవచ్చును. అప్పుడు దానిని వ్యతిరేకిస్తున్నవారు తమ వ్యతిరేకతను మానుకుంటారా? ముస్లింలలో (ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో) ధనికవర్గం కూడా ఒకటి ఉన్నదనీ, ముస్లింల పేరుమీద ఇచ్చే రిజర్వేషన్ యావత్తూ వారే తన్నుకు పోతారనీ కూడ వాదిస్తున్నారు. బిసి రిజర్వేషన్ విషయంలో అగ్రకులాలవారు ఇదే అభ్యంతరం వ్యక్తం చేయగా, మండల్ కమిషన్ కేసులో సుప్రీంకోర్టు ఏమనిందంటే ప్రతీ బిసి కులంలోనూ 'క్రీమీ లేయర్'ను గుర్తించి రిజర్వేషన్ల పరిధి నుంచి వారిని తొలగించాలని. ముస్లింలను ఇప్పుడు ఒక బిసి వర్గంగా గుర్తించి రిజర్వేషన్ ఇస్తున్నారు కాబట్టి అది జీవో 33కు కూడా వర్తిస్తుంది. మన రాష్ట్రంలో 'క్రీమీ లేయర్' గుర్తింపుకు ప్రమాణాలింకా ప్రభుత్వం రూపొందించలేదు. ఏ ప్రమాణాలు రూపొందించినా అవి ముస్లింలకు కూడా వర్తిస్తాయి. కాబట్టి నిజాం మనవలే రిజర్వేషన్ మొత్తం కొట్టేస్తారని ఆందోళన చెందనక్కరలేదు.

ఇవికాక వేరే సాంకేతిక కారణాలు కూడా చెప్తున్నారు. వాటికి సామాజిక ప్రాముఖ్యం గానీ, రాజ్యాంగపరమైన ప్రాముఖ్యంగానీ ఏమీలేదు కాబట్టి వాటినిక్కడ చర్చించనక్కరలేదు. ఒకవేళ ఏదో ఒక సాంకేతిక కారణం వల్ల జీవో 33 చెల్లదని రేపు హైకోర్టు తప్పుపట్టినా దానిని సవరించి మళ్లీ జారీచేయవచ్చు. అంతే తప్ప జీవో 33 చెల్లదనడానికి సామాజిక కారణంగానీ, రాజ్యాంగపరమైన అవరోధంగానీ ఏమీ లేదు.

దురదృష్టకరమైన విషయం ఏమిటంటే ముస్లింలకూ ఇస్లాంకూ సంబంధించిన విషయాలను హేతుబద్ధంగా, స్థిమితమైన మనస్సుతో చర్చించడం సాధ్యంకాని కలుషిత వాతావరణం దేశంలో నెలకొని ఉంది. దీనికి బాధ్యులెవరు అన్న చర్చ ఇక్కడ అప్రస్తుతంగానీ దీనిని తమ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నవారెవరో స్పష్టంగానే చూస్తున్నాం.

ఈ వాతావరణం కారణంగా ముస్లింల ప్రస్తావన వచ్చినప్పుడు మన సైకిల్‌కు గాలికొట్టే అహమ్మదు, మన వీధి చివర చాయ్ అమ్మే బాషా, మన పక్కింట్లో కసువు ఊడ్చే సుల్తాన్‌బీ జ్ఞాపకం రారు. ఒసామాబిన్ లాడెన్‌ను తలచుకుంటాం, జైష్–ఇ–మహమ్మద్‌ను, లష్కర్–ఇ–తయ్యబాను తలచుకుంటాం. దీనికి తగ్గట్టు స్పందిస్తాం. అప్పుడు ముస్లింలకు ప్రభుత్వం ఏ మేలు చేయజూసినా అది భయంకరమైన తప్పిదంగా కనిపిస్తుంది.

అమానవీయమైన ఈ మానసిక స్థితిని అధిగమించాలేగానీ జీవో 33లో తప్పేమీ లేదనీ, అది నిజానికి సామాజిక న్యాయానికి చాలా అవసరమైన చర్య అనీ గుర్తించడానికి ఎంతోసేపు పట్టదు.

**మానవహక్కుల వేదిక కరపత్రంగా వచ్చింది**
**5 ఆగస్టు 2004**

# ముస్లింలు, బిసిలు, రిజర్వేషన్లు

ఈ వారంలో బిసి సంఘం నాయకులు ఆర్. కృష్ణయ్యగారి పేరు మీద రెండు పరస్పర భిన్నమైన ప్రకటనలు పత్రికలలో ప్రచురితమయ్యాయి. (ఆయన చెప్పిందే పత్రికలు రాసాయో లేదో తెలీదు కాబట్టి పత్రికలలో ప్రచురితమయ్యాయని అంటున్నాను.)

ముస్లింలను బిసి జాబితాలో 'ఇ' గ్రూపుగా చేర్చి 5 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఆర్డినెన్స్‌ను హైకోర్టు కొట్టివేయడాన్ని ప్రస్తావిస్తూ 'ఒక్క రూపాయ విలువలేని రిజర్వేషన్లు ఇచ్చి రెండు వర్గాల మధ్య ప్రభుత్వం చిచ్చుపెట్టింది' అని ఆర్. కృష్ణయ్యగారు అన్నట్టు పత్రికలు రాసాయి. మరుసటి రోజు, కొన్ని బిసి కులాలను బిసి జాబితా నుండి తొలగించే ప్రయత్నం రాష్ట్ర ప్రభుత్వం మొదలుపెట్టిందన్న వార్తకు స్పందిస్తూ ఆర్. కృష్ణయ్యగారే 'ఇటువంటి పనులు చేస్తే కాంగ్రెస్ పార్టీ అడ్రసు గల్లంతవుతుంది' అని హెచ్చరించినట్టు పత్రికలు ప్రచురించాయి.

ఇవి రెండూ వారిచ్చిన ప్రకటనలే అయితే, ముస్లింలకిచ్చినప్పుడు రూపాయ విలువలేని రిజర్వేషన్లు బిసిలకు ఇస్తేనేం, ఇయ్యకపోతేనేం కృష్ణయ్యగారూ అని వారిని అడగవద్దా?

ఒక ప్రహసనంగా అందరూ కలసి మార్చేసిన ముస్లిం రిజర్వేషన్ల ఉదంతంలో బాధాకరమైన విషయాలు చాలా ఉన్నాయి. అన్నిటి కంటే ఆందోళనకరమైన విషయం, రాష్ట్రంలోని బిసి కులాల సంఘాలు చాలా వరకు ముస్లింలకు ప్రభుత్వం అందించిన చేయూతను సంఘటితంగా వ్యతిరేకించడం.

హైకోర్టులో కేసు వేసిన వారిలో అగ్రకుల హిందువులు కొందరు కాగా, కనీసం మూడు బిసి సంఘాలూ ఉన్నాయి. కోర్టులో కేసు వేయడమేకాక, బయట మీటింగ్‌లు పెట్టారు, ప్రకటనలు చేసారు, పత్రికలలో రాసారు.

దీనికి అపోహలు కొంత కారణం కాగా, సంఘ్‌పరివార్ ప్రేరణ కూడ కొంతవరకు కారణం. సంఘ్‌పరివార్ వాళ్ళు కార్మిక సంఘాలు నడిపినా, దళిత సంఘాలు నడిపినా పైకి ఆ వర్గాల ప్రయోజనాల కోసం ఒక మేరకు పనిచేస్తూ కూడ తమ దీర్ఘకాలిక అజెండాను లోలోపల సాగిస్తారనేది వారి వ్యవహారశైలిని అర్థం చేసుకున్న వారందరూ ఎరిగిన విషయమే. గుజరాత్‌లో ఆదివాసీ గూడెంలలో పనిచేస్తున్న విశ్వహిందూ పరిషత్, ఆ ప్రజల మెదళ్ళలోకి ఎంతటి విషం ఎక్కించిందో 2002లో జరిగిన మారణకాండ చూపించింది. ముస్లింలకు రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్లు ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ బిసిల పేరిట రాష్ట్రంలో జరిగిన ప్రచార ఆందోళనలలో సంఘ్‌పరివార్ పాత్ర చాలానే ఉంది. మన దగ్గర ప్రజాతంత్ర ఉద్యమాలలో సహితం సంఘ్‌పరివార్ గురించి సరయిన అంచనా ఏనాడూ లేకపోవడం వల్ల బిసి సంఘాలలోను, ఉద్యమాలలోను ఉన్న ప్రజాతంత్రవాదులు ఈ విషయాన్ని గుర్తించనూ లేదు, గొంతెత్తి మాట్లాడనూ లేదు. లేకపోగా, కొందరు ప్రజాతంత్రవాదులుగా గుర్తింపు ఉన్న బిసి మేధావులు తమవంతుగా గొంతు కలిపారు కూడ.

కాగా, నిజమైన అపోహలు, వాటి నుండి పుట్టిన తప్పుడు వాదనలూ కూడ పనిచేశాయి. ఒక మైనారిటీగా ముస్లింలకు మైనారిటీ విద్యాసంస్థలు నడుపుకొనే హక్కు ఉన్నప్పుడు 'అదనంగా' రిజర్వేషన్లు ఎట్లా అడుగుతారన్న వాదన ఒకటి చేసారు. మైనారిటీ విద్యాసంస్థలు ప్రభుత్వ ఉద్యోగాలలో రిజర్వేషన్‌కు ప్రత్యామ్నాయం ఎట్లా అవుతాయి? మహా అయితే మైనారిటీ విద్యాసంస్థలు మైనారిటీలకు ప్రత్యేక విద్యావకాశాలు కల్పిస్తాయని చెప్పవచ్చు. అంతమేరకు విద్యారంగంలో రిజర్వేషన్లు అడగడం సరయింది కాదనవచ్చు. కానీ ఆ వాదన కూడ సబబు కాదు. మైనారిటీ విద్యాసంస్థలన్నీ ప్రైవేట్‌రంగ సంస్థలు. అక్కడ విద్య ఖరీదయినది. పేద మైనారిటీలకు అది అందుబాట్లో ఉండదు. డబ్బున్న మైనారిటీలను 'క్రీమీ లేయర్' పేరిట ప్రభుత్వ రిజర్వేషన్లకు దూరం ఉంచారు కాబట్టి అదీ ఇదీ పొందేవారెవరూ ఉండరు.

ఇంకా రిజర్వేషన్లు పొందవలసిన బిసి కులాలు ఉన్నాయి కాబట్టి ముస్లింలకు ఇచ్చేస్తే వారికి నష్టం జరుగుతుందన్న వాదన కొందరు తీసుకొచ్చారు. మరి వారికి

ఇచ్చేస్తే ముస్లింలకు నష్టం జరగదా? రిజర్వేషన్ల జాబితాలోని 'బిసి' అనే పదాన్ని 'వెనుకబడిన కులం' అని అర్థం చేసుకొని బిసిలలో ముస్లింలను ఎట్లా చేరుస్తారు, వారికి ఇవ్వదలచుకుంటే వేరుగా ఇవ్వండి, మా కోటాలో ఇవ్వొద్దు అన్నవారున్నారు.

'బిసి' అంటే వెనుకబడిన వర్గం అని అర్థం. కుల వ్యవస్థలో వెనుకబడిన కులాలుగా గుర్తించబడ్డవన్నీ వెనుకబడిన వర్గాలే. కానీ వెనుకబడిన కులాలు కాని వెనుకబడిన వర్గాలూ ఉండగలవు. అనేక రాష్ట్రాల జాబితాలలో ఉన్నాయి. కొన్ని రాష్ట్రాలలో కొండ ప్రాంతాలలో నివసించే వారందరినీ (ఆదివాసులయినా కాకపోయినా) ఒక 'వెనుకబడిన వర్గం'గా గుర్తించి రిజర్వేషన్ ఇచ్చారు. జమ్ము కాశ్మీర్‌లో వాస్తవాధీనరేఖ (ఎల్‌ఒసి)కి సమీపంలో నివసించేవారందరినీ వెనుకబడిన వర్గంగా గుర్తించి రిజర్వేషన్ ఇచ్చారు. సాంకేతిక అభివృద్ధికి అవకాశం లేని వృత్తులలో ఉన్నవారిని అప్పటి మైసూర్ రాష్ట్ర ప్రభుత్వం కులంతో నిమిత్తం లేకుండ ఒక వెనుకబడిన వర్గంగా గుర్తించి రిజర్వేషన్ ఇచ్చింది. ఇవన్నీ సుప్రీంకోర్టు ఆమోదం పొందాయి. 'వెనుకబాటుతనం' అనే దానికి కొన్ని సూచికలుంటాయి. ఏవి ఆ సూచికలు అనేది శాశ్వతంగా నిర్ణయించలేము అనీ, అది పరిస్థితులనుబట్టి ఉంటుందనీ సుప్రీంకోర్టు అనింది. మండల్ కమిషన్ తయారుచేసిన 12 సూచికలను, కర్ణాటక రాష్ట్ర వెనుకబడిన వర్గాల కమిషన్ (చిన్నపరెడ్డి కమిషన్ అంటారు దీనిని) రూపొందించిన ప్రమాణాలను సుప్రీంకోర్టు ఆమోదించింది. ఈ సూచికలు, ప్రమాణాల ప్రకారం ఏయే సామాజిక వర్గాలు వెనుకబడిన వర్గాలుగా గుర్తింపు పొందుతాయో అవి బిసి కోటాలో రిజర్వేషన్ పొందగలవు. అంతే తప్ప 'బిసి' రిజర్వేషన్ అనేది 'బిసి' కులాలకే చెందిందని భావించి దానిలోకి వేరే సామాజిక వర్గాలను రానియ్యవద్దనడం సరయిన వాదన కాదు. దీనిలో ముందు, వెనుక అని వాదించేటట్టయితే ఎవరికి ముందు ఇచ్చినా మరొకరు అవకాశం కోల్పోగలరు కాబట్టి ఇది కేవలం ఒకరి విషయంలో ప్రయోగించగల వాదన కాదు.

ఇక హైకోర్టు వైఖరి విషయానికొద్దాం. తీర్పు ఇంకా చూడకపోయినప్పటికీ వాదన సమయంలో వారు వేసిన ప్రశ్నలను, పత్రికలలో తీర్పు గురించి వచ్చిన వార్తలను జోడించినట్టయితే, ముస్లింలను వెనుకబడిన వర్గంగా గుర్తించిన బిసి కమిషన్ రిపోర్టు అసమగ్రంగా, అశాస్త్రీయంగా ఉందని హైకోర్టు ప్రధానంగా అభ్యంతరం చెప్పినట్టు అర్థమవుతుంది.

ప్రభుత్వాలు పాలనాక్రమంలో అనేక విధానపరమైన నిర్ణయాలు తీసుకుంటాయి. సమగ్రమైన, శాస్త్రీయమైన అధ్యయనం తరువాతనే పాలనా నిర్ణయాలు తీసుకోవాలని ఏ రాజ్యాంగమూ చెప్పదు. అట్లాగయితే పరిపాలన అసాధ్యం అవుతుంది. ఒక నిర్ణయం తీసుకునే ముందు దానికి సంబంధించిన సమాచారం సేకరించాలి, ఆ సమాచారాన్ని హేతుబద్ధంగా మదింపు వేయాలి. అంతే తప్ప 'సమగ్రమైన, శాస్త్రీయమైన' సమాచారం సేకరించాలనడానికి ప్రభుత్వం రీసర్చ్ స్కాలర్ కాదు, ప్రభుత్వం చేసేది సామాజిక శాస్త్ర పరిశోధనా కాదు.

సంబంధిత సమాచారాన్ని సేకరించి, దానిని హేతుబద్ధంగా మదింపు వేయడానికి బిసి కమిషన్ నెలకొల్పబడింది. అది తన పనిచేసింది. ముస్లింలు మొత్తం మీద వెనుకబడిన వర్గమనీ, రిజర్వేషన్‌కు అర్హులనీ సూచించడానికి కావలసిన సమాచారం బిసి కమిషన్ నివేదికలో ఉంది. వారిలో డబ్బున్న వర్గాలు 'క్రీమీ లేయర్' కింద ఎట్లాగూ మినహాయించబడతారు.

ఈ నివేదిక ఆధారంగా బిసి కమిషన్ ఛైర్మన్ దాళవా సుబ్రమణ్యం గారికి పి.హెచ్.డి పట్టా ఇయ్యలేకపోవచ్చును గానీ ముస్లింలకు రిజర్వేషన్ ఇయ్యవచ్చు. అయినా ఈ విషయంలో మన హైకోర్టు ప్రదర్శించిన వైఖరి కొత్తది కాదు. రిజర్వేషన్లు ఇచ్చే అధికారాన్ని ప్రభుత్వం నుండి తన చేతిలోకి తీసుకోవడానికి న్యాయవ్యవస్థ చాలా కాలంగా ప్రయత్నం చేస్తున్నది. దానిలో భాగంగానే ఒక సామాజిక వర్గానికి రిజర్వేషన్ ఈయదగునా అని నిర్ణయించడానికి ప్రభుత్వం శాస్త్రీయమైన పరిశోధన జరపాలనీ, ఆ పరిశోధన ఎంత శాస్త్రీయంగా ఉందో తాము చూస్తామనీ అనసాగాయి. దాని పర్యవసానమే బిసి కమిషన్ ఏర్పాటు, దాని నివేదిక హేతుబద్ధంగానే కాదు, 'శాస్త్రీయంగా' ఉండాలన్న వక్కాణింపు. న్యాయవ్యవస్థలో రిజర్వేషన్ల పట్ల తొలినాటి నుండి ఉన్న వ్యతిరేక వైఖరే ఈ పరిణామానికి మూలం. దాని వల్ల ఈ రోజు ముస్లింలకు అన్యాయం జరిగింది. రేపు ఇంకెవరికయినా జరగగలదని గుర్తించినట్టయితే ఈ తీర్పును బిసి సంఘాలు తమ విజయంగా భావించవు.

చివరగా, 'ఇది ముస్లింలకు ఒక మతవర్గంగా రిజర్వేషన్లు కల్పించడానికి చట్టం అనే ఆచ్ఛాదన తగిలించుకున్న అనుచిత ప్రయత్నం' అన్న హైకోర్టు వ్యాఖ్య గురించి ఒక మాట. అది రాజకీయంగా సరైన వ్యాఖ్యా కాదా అన్నది పక్కనపెట్టండి. కోర్టు చేయదగ్గ వ్యాఖ్యేనా? ఆ ఆర్డినెన్స్ రాజ్యాంగబద్ధమా కాదా

అని నిర్ణయించడం వేరు, దానిని జారీచేయడం వెనుక దురుద్దేశ్యం ఉందనడం వేరు. హైకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగపరంగా తప్పన్న విమర్శతో ఆగిపోకుండ, 'ఇది మైనారిటీల హక్కులను అణగదొక్కడానికి కోర్టు ధరించిన ముసుగు మాత్రమే'నంటే దానిని ఏమంటారు? కోర్టు ధిక్కారమంటారు. క్షమాపణ కోరుకోకపోతే ఆరు నెలలు జైలుకు పంపుతామంటారు. మరి కోర్టు చేసిన వ్యాఖ్యకు ఏ పేరు పెట్టాలి?

ప్రజాతంత్ర

**13 నవంబర్ 2005**

# ముస్లిం రిజర్వేషన్‌ను అడ్డుకోవడమంటే సామాజిక న్యాయాన్ని బలహీనపర్చడమే



ఇద్దరు హిందువులు కలుసుకుని ముస్లింల గురించి ఎప్పుడయినా మాట్లాడుకుంటే వాళ్ల వెనుకబాటుతనాన్ని గురించి అవహేళనగా ముచ్చటించుకుంటారు. ముస్లింలు ఉద్దేశ్యపూర్వకంగా వెనుకబడి ఉన్నారనీ నాగరికతలో అభివృద్ధి చెందడం వారికి రుచించదనీ ఏవగించుకుంటారు. స్త్రీలను బురఖాలలో బంధించి ఉంచుతారు, అన్నిటికీ షరియత్ వైపు చూస్తారు, పిల్లలను చదువు కోసం మదరసాలకే పంపిస్తారు, సైన్స్ కంటే ముల్లాల మాటలే ఎక్కువ విశ్వసిస్తారు... ఈ రకమైన సంభాషణ ఎన్నిసార్లు వినలేదు?

అయితే ముస్లింలు సాంఘికంగా, ఆర్థికంగా వెనుకబడి ఉన్నారని ప్రభుత్వం విద్య, ఉద్యోగ రంగాలలో వారికి రిజర్వేషన్లు ఇవ్వడానికి సంకల్పించగానే ముస్లింలు వెనుకబడిన వర్గం కానేకాదు అంటూ అదే హిందువులు ఆగ్రహించారు. రాజశేఖరరెడ్డి వోట్ల కోసం మైనారిటీలను బుజ్జగిస్తున్నాడని నిందించారు. హైకోర్టులో కేసు వేసి గెలిచారు. రిజర్వేషన్ల చట్టాన్ని కొట్టేసిన బెంచీలోని అయిదుగురు జడ్జిలలో ఇద్దరు దాదాపు ఇదే అభిప్రాయం వ్యక్తం చేసారు. ముస్లింలకు ఒక మతవర్గంగానే రిజర్వేషన్లు కల్పించడానికి చట్టం అనే ఆచ్ఛాదన తగిలించుకున్న అనుచిత ప్రయత్నం అది అని వ్యాఖ్యానించారు.

పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థను విశ్వసిస్తున్నామని చెప్పుకునేవారు ప్రభుత్వం ఫలానా పని వోట్ల కోసం చేసింది అని నిందించడంలో అర్థమేమిటో తెలీదు. వోట్ల కోసం రాజకీయ పార్టీలు ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కరించే

ప్రయత్నం చేస్తాయనే కదా పార్లమెంటరీ వ్యవస్థను ప్రజాస్వామ్య వ్యవస్థగా గుర్తించేది?

ముస్లింలకు ఒక సామాజిక వర్గంగా రిజర్వేషన్లు కల్పించడం సబబా కాదా అన్న చర్చకు అర్థం ఉంది గానీ ఆ పని వోట్లకోసం చేసారన్న వ్యాఖ్యలకు అర్థం లేదు.

మరి అది సబబు కాదనడానికి కోర్టులో ఏ వాదనలు చేసారు? కోర్టు వాటిని ఎందుకు అమోదించింది? చాలా విచిత్రమైన వాదనలు చేసారు. ఒక సామాజిక వర్గానికి రిజర్వేషన్లు ఇచ్చేటప్పుడు ఆ వర్గాన్ని నిర్వచించవలసి ఉంటుంది. నిర్వచనం రిజర్వేషన్ ఇవ్వడానికి గల కారణాన్ని సూచించదు, రిజర్వేషన్ ఇస్తున్నదెవరికో వివరిస్తుందంతే. ముస్లింలకు రిజర్వేషన్ ఇచ్చే ఈ చట్టం 'ముస్లిం' అంటే ఎవరంటే ఇస్లాంను ఆచరించేవారు అని నిర్వచించింది. ఇస్లాంను ఆచరిస్తున్నందువల్ల వారికి రిజర్వేషన్ ఇస్తామనలేదు. రిజర్వేషన్ పొందుతున్న వర్గాన్ని వర్ణించడానికి మాత్రమే ఈ నిర్వచనం ఇవ్వడం జరిగింది. అయితే దీనిని పట్టుకొని 'ఇస్లాంను ఆచరించడానికీ వెనుకబాటుతనానికీ సంబంధం ఏమిటి? లక్ష్యంతో సంబంధంలేని నిర్ణయం సహేతుకం ఎట్లా అవుతుంది?' అని వాదించడం జరిగింది. హైకోర్టు ఆ వాదనకు అనుకూలంగా స్పందించడమూ జరిగింది.

'ముస్లింలందరికీ రిజర్వేషన్ ఇస్తున్నారు. ఇస్లాంను ఆచరించే వారంతా ముస్లింలేనంటున్నారు. మరి రేపు ఒక హిందూ అగ్ర కులస్తుడు రిజర్వేషన్ పొందడం కోసం ఇస్లాం పుచ్చుకుంటే అతను కూడా వెనుకబడినవాడు అయిపోతాడా? అని వాదించారు. దీనికి సహితం హైకోర్టు సానుకూలంగానే స్పందించింది. ఈ రకమైన వాదనలను గతంలో సుప్రీంకోర్టు తిరస్కరించిన విషయాన్ని వివరించి చెప్పినప్పటికీ ఆ ఉదాహరణలను విస్మరించి ఈ వాదనను ఆమోదించింది.

జమ్మూ కాశ్మీర్ రాష్ట్రంలో వాస్తవాధీన రేఖ సమీపంలో అభివృద్ధి ఏదీ జరిగే అవకాశం లేదు కాబట్టి అక్కడ నివసించే ప్రజలను ఆ రాష్ట్ర ప్రభుత్వం ఒక వెనుకబడిన వర్గంగా గుర్తించి వారిని బిసి జాబితాలో చేర్చింది. ఇది అహేతుకం అంటూ జానకీ ప్రసాద్ పరిమూ అనే కాశ్మీర్ పండిట్ కోర్టుకు ఎక్కాడు. అక్కడ నివసించేవారందరూ ఒక వెనుకబడిన వర్గమని మీరంటే, రేపు ఒక శ్రీనగర్ వాసి

కేవలం రిజర్వేషన్ పొందడం కోసం అక్కడకు పోయి ఇల్లు కట్టుకుంటాడు. 'కేవలం ఇల్లు మార్చితే వెనుకబడినవాడయిపోతాడా?' అని ఆయన ప్రశ్నించాడు.

సుప్రీంకోర్టు ఈ వాదనను తిరస్కరించింది. ఒక చట్టం, లేక ప్రభుత్వ చర్య సమర్థనీయమా కాదా అని చూసేటప్పుడు దానిని దుర్వినియోగం చేసే అవకాశం ఉందనేది ప్రమాణం కావడానికి వీలు లేదు. అది దానంతటది సమర్థనీయమా కాదా అని చూడాలి. దుర్వినియోగం చేసే అవకాశం ఉంటే దానిని అరికట్టే సహేతుకమైన మార్గాలు అన్వేషించాలే తప్ప ఆ చట్టాన్ని కొట్టేసే యత్నం తగదు. ఆ దుర్వినియోగం ఎప్పుడో అరుదుగా తప్ప జరగదని భావిస్తే దానిని అరికట్టడానికి ఏవో నియమాలు రూపొందించి చిక్కులు తెచ్చుకొనే బదులు దానిని ఉపేక్షించడం మేలు. (కేవలం ఉద్యోగం కోసమో, మెడిసిన్ సీటు కోసమో ఇస్లాం పుచ్చుకునే హిందూ అగ్రకులస్తులు కోటిమందిలో ఒక్కరయినా ఉంటారా?)

ఇంతకంటే విచిత్రమైన వాదన కూడ చేసారు. దానికి కూడ హైకోర్టు తీర్పులో ఆమోదం లభించింది. ఈ వాదన చేసింది ఖాకీ నిక్కరు బిసి సంఘాల తరఫున వాదించడానికి కర్నాటక నుండి వచ్చిన రవివర్మ కుమార్ అనే ఆ రాష్ట్ర బిసి కమిషన్ మాజీ సభ్యుడు. ఆ రాష్ట్రంలో బ్రాహ్మణ వ్యతిరేక ప్రజాతంత్ర ఉద్యమంలో ముఖ్యపాత్ర వహించిన మేధావి.

'ఖాకీ నిక్కరు బిసి సంఘాలు' అన్న మాట ఎవరికీ కోపం తెప్పించనవసరం లేదు. వేరే ఏ విషయంలోనైనా మొగమాటానికి చోటు ఉందేమోగానీ సంఘ్ పరివార్‌ను పేరు పెట్టి గుర్తించడంలో ఉండదు, ఉండడానికి వీలు లేదు. సంఘ్‌పరివార్ ఆలోచనారీతులు శూద్రకులాల ఉద్యమాలలోకి చాప కింద నీరు లాగ పాకిపోయాయి. ప్రజాతంత్రదృష్టి గల కొందరు తప్ప మిగతా బిసి సంఘాలు, మేధావులు ఈ విషయాన్ని గుర్తించకపోవడం బాధాకరం. మనువాదం మీద పోరాడడానికీ, సంఘ్‌పరివార్ రాజకీయ ప్రతినిధులతో చెలిమి చేయడానికీ మధ్య వైరుధ్యమేమీ లేదని నమ్మే మాయావతులూ, కాన్షీరాంలూ దళిత నాయకులుగా చలామణి అవుతున్న చోట ఈ గుడ్డితనం ఆశ్చర్యపోవలసింది కాదేమోగానీ చాలా నష్టకరం.

రవివర్మకుమార్ గారి వాదన ఏమిటంటే రాజ్యాంగంలో 'వెనుకబడిన వర్గం' అన్న ప్రయోగానికి అర్థం వెనుకబడిన హైందవ కులాలే తప్ప అన్యం కాదు. అది మైనారిటీలకు వర్తించదు. దీనికి మద్దతుగా రాజ్యాంగ పరిషత్‌లో అంబేద్కర్ ఇచ్చిన వివరణను ఆయన దీర్ఘంగా ఉటంకించారు. ఆయన వాదన చేసినప్పుడు

కోర్టులో నవ్వుకున్నవారందరికీ, 'ఇది కొట్టివేయదగ్గ వాదన కాదు' అని హైకోర్టు తీర్పులో లభించిన ఆదరణ ఆశ్చర్యం కలిగించింది.

రాజ్యాంగంలో వాడిన 'వెనుకబడిన వర్గం' అనే ప్రయోగం ముస్లింలకు వర్తిస్తుందా అన్న ప్రశ్న రాజ్యాంగ పరిషత్‌లో చర్చకు రాలేదు. 'వెనుకబడిన వర్గం' అనేది అస్పష్టంగా ఉంది, దాని భావం ఏమిటి అన్న వివరణ సభ్యులు కోరారు. అప్పుడు తమ దృష్టిలో ఉన్నది అణగారిన హైందవ కులాలేనని అంబేద్కర్ వివరించాడు. ముస్లింల ప్రస్తావన ప్రశ్నలోనూ లేదు, జవాబులోనూ లేదు. ఒక మైనారిటీగా ముస్లింలకు ప్రత్యేక హక్కులు ఇవ్వాలా లేదా అన్న చర్చ మాత్రం జరిగింది. దాని నేపథ్యం వెనుకబాటుతనం కాదు. దేశ విభజనను నివారించడానికి మైనారిటీలకు ప్రత్యేక హక్కులూ అధికారాలూ కల్పించడం ఒక మార్గమన్న ఆలోచన 1946 దాకా చర్చలో ఉండింది. దేశ విభజన జరిగిన తర్వాత ఇంక ఆ రకమైన ఆలోచన అనవసరం అన్న 'మూడ్'లోకి అందరూ రావడం వల్ల ముస్లింలకు ఒక మైనారిటీగా ప్రత్యేక హక్కులు కల్పించే ఆలోచనను విరమించుకోవడం జరిగింది. అంతే తప్ప సామాజిక నేపథ్యంలో ముస్లింల గురించి చర్చ రాజ్యాంగ పరిషత్‌లో జరగనే లేదు.

జరిగి ఉండే అవకాశం కూడ లేదు. ఎందుకంటే రాజ్యాంగానికి తుది రూపు ఇచ్చిన నాటికి దేశ విభజన జరిగిపోయింది గానీ స్వాతంత్ర్యానంతర సామాజిక చిత్రం ఇంకా రూపం తీసుకోలేదు. అప్పటికి ఇంకా ముస్లింల గురించి ఎవరు ఆలోచించినా స్వాతంత్ర్య పూర్వపు సామాజిక దృశ్యమే మనసులో ఉండే అవకాశం ఉంది. స్వాతంత్ర్యానికి పూర్వం దేశ వాయవ్య ప్రాంతంలో (అంటే ప్రస్తుత పాకిస్తాన్‌లో) ముస్లింలు ప్రధాన ఉన్నతవర్గం. బొంబాయితో పోటీ పడిన కరాచీ నగరం, ఉమ్మడి పంజాబు రాజధాని అయిన లాహోర్ నగరం ముస్లింలు ప్రధాన సముదాయంగా ఉన్న నగరాలు. ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రంలో ముస్లిం జమీందార్లు, సంపన్నవర్గాలు పెద్ద సంఖ్యలో ఉండేవారు. హైదరాబాద్, భోపాల్ వంటి సంస్థానాలలో రాజవంశీకులైన ముస్లిం నవాబులుండేవారు. స్వాతంత్ర్యానంతరం వాయవ్య ప్రాంతం పాకిస్తాన్‌లోకి పోయింది. ఉత్తరప్రదేశ్‌లోని జమీందారీ వర్గమే కాదు, ఉన్నత విద్యావంతులు, ధనవంతులు అయిన ముస్లింలు పెద్ద సంఖ్యలో పాకిస్తాన్‌కు తరలిపోయారు. హైదరాబాద్, భోపాల్ వంటి సంస్థానాల రాజవంశీకులు సహితం దేశాన్ని విడిచిపెట్టి వెళ్లిపోవడమో లేక సామాజిక జీవితం నుండి పూర్తిగా తప్పుకోవడమో జరిగింది.

ఆ తరువాత క్రమంగా స్వాతంత్ర్యానంతర ముస్లిం సమాజం రూపం తీసుకుంది. ఇది ప్రధానంగా అణగారిన హైందవ కులాల నుండి మతమార్పిడి ద్వారా ముస్లింలయిన ప్రజా సమూహం. కనుక వీరి వెనుకబాటుతనాన్ని గురించి వాదించేటప్పుడు రాజ్యాంగ పరిషత్‌లో జరిగిన చర్చను ఉటంకించడం అసందర్భమయినది.

అంతేకాక రాజ్యాంగాన్ని రాసినవారి ఉద్దేశ్యాలు ఏమయినా, చివరికి రాజ్యాంగం 'వెనుకబడిన వర్గం' అన్న మాట వాడిందే తప్ప 'వెనుకబడిన కులం' అనలేదు. దీనిని సుప్రీంకోర్టు అనేక సందర్భాలలో నొక్కిచెప్పింది. వెనుకబడిన కులాలు వెనుకబడిన వర్గాలవుతాయి గానీ అవి మాత్రమే కావు అనీ, వెనుకబాటుతనానికి కులాన్ని ఏకైక ప్రమాణం చేయడానికి వీలు లేదనీ కనీసం డజను కేసులలో సుప్రీంకోర్టు అనింది.

పైన చెప్పినట్టు జమ్మూకాశ్మీర్ రాష్ట్రంలో వాస్తవాధీన రేఖ సమీపంలో నివసించే వారిని వెనుకబడిన వర్గంగా గుర్తిస్తే దానిని సుప్రీంకోర్టు ఆమోదించింది. ఉత్తరప్రదేశ్‌లోని కొండ ప్రాంతాలలో నివసించే ప్రజానీకం (ఆదివాసులయినా, కాకున్నా) అభివృద్ధికి అననుకూలమైన పరిస్థితులలో జీవిస్తున్నందున ఆ రాష్ట్ర ప్రభుత్వం వారిని వెనుకబడిన వర్గంగా గుర్తించింది. దానిని కూడా సుప్రీంకోర్టు ఆమోదించింది. ఇవన్నీ రవివర్మకుమార్ గారు ఉటంకించిన 'అంబేద్కర్ అభిప్రాయానికి' భిన్నమైనవే. అయినప్పటికీ వారు ఆ వాదన చేయడం, 'అది కొట్టిపారేయదగ్గ వాదన కాద'ని ఒక జడ్జి ఆదరించడం, ఆ జడ్జి అభిప్రాయంతో తాము ఏకీభవిస్తున్నామని మిగతా ఇద్దరు ప్రకటించడం జరిగిపోయింది.

నిజానికి విద్యా ఉద్యోగ రంగాలలో ముస్లింలు సగటు కంటే ఎక్కువ వెనుకబడి ఉన్నట్లు గణాంకాలు సూచిస్తున్నాయని హైకోర్టే ఒప్పుకునింది. ఒక్కొక్క రంగంలోనూ ముస్లింల ప్రాతినిధ్యం లేక భాగస్వామ్యం 15 నుండి 30 శాతం దాకా తక్కువ ఉందని గుర్తించింది. అయితే ఇది గణనీయమైన వెనుకబాటుతనం కాదనీ 50 శాతం కంటే తక్కువ ఉంటేనే గణనీయమైన వెనుకబాటుతనం అవుతుందనీ హైకోర్టు అంటుంది. ఈ అభిప్రాయానికి ప్రాతిపదిక ఏమిటి? సగటు కంటే 25 శాతం వెనుకబడి వుంటే అది గణనీయమైన వెనుకబాటుతనం అని మండల్ కమిషన్ సూత్రీకరించింది. దానిని సుప్రీంకోర్టు ఆమోదించింది కూడ. మన రాష్ట్రంలో ముస్లింల వెనుకబాటుతనం దాదాపు అంత వుంది. ఒక్కొక్క రంగంలో కొంచెం తక్కువ, ఒక్కొక్క రంగంలో కొంచెం ఎక్కువ వుంది.

అయినప్పటికీ 50 శాతం వెనుకబాటుతనం వుంటేనే గణనీయమైన వెనుకబాటుతనం అవుతుందని హైకోర్టు ఏ ప్రమాణం లేకుండా అనింది.

రాష్ట్ర ప్రభుత్వ వ్యవహారశైలిలోను, బిసి కమిషన్ నివేదికలోను లోపాలు లేకపోలేదు. రాజశేఖర రెడ్డి ప్రభుత్వానికి నిలకడయిన న్యాయం చేయడం ముఖ్యం కాదు. 'మేము అధికారానికి రాగానే అయిదు శాతం రిజర్వేషన్ ఇచ్చేస్తాం' అన్న హామీని వెంటనే నిలబెట్టుకోవడం ముఖ్యం. బిసి కమిషన్‌కేమో సమగ్రమైన నివేదిక ఇవ్వడం ముఖ్యం కాదు, ఏలినవారు ఎంత వేగంగా ఇమ్మంటే అంత వేగంగా ఇవ్వడం ముఖ్యం. బిసి కమిషన్ ముందు హాజరై వాళ్లకు ఒక విషయం వివరంగా చెప్పడం జరిగింది. సాంకేతిక అభివృద్ధికి దూరంగా సంప్రదాయక అసంఘటిత ఉత్పత్తి రంగాలలో అధికభాగం చిక్కుకున్న ప్రజావర్గాలను వెనుకబడిన వర్గాలుగా గుర్తించవచ్చుననే అభిప్రాయం అనేక సుప్రీంకోర్టు తీర్పులలో వ్యక్తమైంది. అది ముస్లింల సామాజిక స్థితికి సరిగ్గా అతుకుతుంది కాబట్టి ముస్లిం ఉపాధి వివరాలను సమగ్రంగా సేకరించి ఆ ప్రాతిపదికన విశ్లేషిస్తే, ఆ విశ్లేషణ కోర్టులలో నిలుస్తుందని సూచించాం. బిసి కమిషన్ ఆ పని చేయకుండా, మేము ముస్లింలు నివసించే ప్రాంతాలకు పోయినప్పుడు ఎక్కువ మంది చిల్లర వృత్తులలో ఉండడం గమనించాము అంటూ జర్నలిస్టు రిపోర్టులాగా రాయడం సహజంగానే అభిశంసనకు దారి తీసింది. లక్ష్యశుద్ధిలేని రాజకీయాలు, కార్యదక్షత లేని నిపుణులు సామాజిక న్యాయాన్ని అకారణంగా బలహీనపరచగా, ప్రామాణికత అక్కరలేని న్యాయవ్యవస్థ దానిని మొత్తంగా పూడ్చి పెట్టింది.

**సాక్షి, మహాబోధి, చమన్**
**2006**

# తిరిగి తిరిగొచ్చిన ముస్లిం రిజర్వేషన్లు ఈసారైనా నిలిచేనా?

ముస్లిం రిజర్వేషన్ల చట్టం మళ్లీ వచ్చింది. ఒకసారి జీవో రూపంలో వచ్చింది. రెండవసారి చట్టం రూపంలో వచ్చింది. ఇప్పుడు మళ్లీ చట్టం రూపంలో వచ్చింది.

అప్పుడయినా ఇప్పుడయినా కొంచెం జాగ్రత్త తీసుకొని ఆదేశం జారీ చేస్తే, న్యాయస్థానాల సంకుచితత్వం తప్ప వేరే ఏ అవరోధమూ ఉండేది కాదు. మొదటిసారి బిసి కమిషన్ ద్వారా నివేదిక పొందకుండ ఆదేశం జారీ చేసారు. రెండవసారి బిసి కమిషన్ సమగ్రమైన పరిశీలన జరిపేంతవరకు ఆగకుండ తొందరపెట్టి అసమగ్రమైన నివేదిక ఆధారంగా ఆదేశం జారీ చేసారు. ఈసారి ప్రభుత్వం వేరే సందర్భంలో నియమించిన కమిషన్ రిపోర్టును ఆధారంగా చేసుకొని నివేదిక ఇమ్మని బిసి కమిషన్‌ను మళ్లీ తొందరపెట్టారు. చట్టం కల్పించిన అధికారాన్ని చలాయిస్తున్న బిసి కమిషన్, నివేదిక ఎప్పుడిచ్చేదీ మేము నిర్ణయిస్తాం అనే బదులు రాజశేఖరరెడ్డి అడిగిందే తడవు ఇచ్చేసింది. ఈ అరువు నివేదిక మీద ఆధారపడ్డ నిర్ణయం చెల్లుతుందా? మరొక్కసారి కోర్టులు కొట్టేస్తే ఏం సాధించినట్టు?

కోర్టుకెక్కుతారనడంలో సందేహం లేదు. వ్యాజ్యం వేసే వాళ్ల పేర్లు ఏవయినా, గత రెండు పర్యాయాలూ హైకోర్టులో కేసు వేసింది విశ్వహిందూ పరిషత్ వారే. ఈసారీ వేయబోతారు. వాళ్ల మనసులో ఉన్నది కుళ్లే అయినా, సవాలు చేయడానికి సాంకేతిక కారణాలు దొరుకుతున్నాయి. ప్రభుత్వ వ్యవహారశైలి వారికి ఆ

అవకాశం అందజేస్తున్నది. గతంలో రెండుసార్లూ వారు విజయం సాధించారు. ఈసారి కూడ వాళ్లకు బలమైన కారణం దొరుకుతుంది. బిసి కమిషనే పరిశోధన జరపాలని చట్టం అంటుండగా, వేరే కమిషన్ నివేదికను వారు స్వీకరించి ప్రభుత్వానికి సిఫారస్ చేయవచ్చా? అన్నది చట్టరీత్యా బలమైన అభ్యంతరం కాగలదు.

ముస్లింలు సామాజికంగా వెనుకబడి ఉన్నారన్న విషయంలో పెద్దగా అభిప్రాయభేదం ఎవరూ వ్యక్తం చేయగా నేను వినలేదు. కానీ దాని గురించి ప్రభుత్వం ఏమీ చేయడానికి వీలు లేదు. ఏం చేసినా అడ్డం పడతారు. ప్రభుత్వ వ్యవహారశైలి దానికి తగినట్టే ఉంది. ముస్లింలకు న్యాయం చేయడం కంటే రాజశేఖరరెడ్డి హామీ యిచ్చిన గడువు లోగా చేసేసాడని ప్రచారం చేసుకోవడం ముఖ్యం. ఏదో వేదిక మీద రాజశేఖరరెడ్డి 'రాబోయే విద్యా సంవత్సరంలోగా అమలు చేస్తాం' అని ప్రకటిస్తాడు. అది ఆయన ఎట్లాగయినా నిలబెట్టుకోవాలి. కాబట్టి బిసి కమిషన్ ఆ లోపల తన నివేదిక ఇచ్చేయాలి. ఇచ్చేస్తుంది. వెనువెంటనే చట్టం జారీ అయిపోతుంది. వెంటనే కాషాయాంబరధారులు కోర్టులో కేసు వేస్తారు. అధికారం ఇట్లాగేనా చలాయించేది అంటూ కోర్టు హూంకరిస్తుంది.

ఎవరి మేలు కోసం ఈ ప్రహసనం?

మొదటి నుండీ ఒక మాట చెప్తున్నాం. కోర్టులో వాదించాం, బిసి కమిషన్‌కూ చెప్పాం. సంప్రదాయక సాంకేతిక రంగంలో చిక్కుకుని తక్కువ ఆదాయం పొందుతున్న వర్గాన్ని విద్యా ఉద్యోగ రిజర్వేషన్ల నిమిత్తం వెనుకబడిన వర్గంగా గుర్తించవచ్చునని సుప్రీంకోర్టు పలు మార్లు ప్రకటించింది. వట్టి పేదరికం వెనుకబాటుతనం కాదు. కాని అభివృద్ధికి అవకాశం లేని ఆర్థిక రంగంలో చిక్కుకున్న పేదరికం వెనుకబాటుతనం కిందికి వస్తుంది. తక్కువ ఉత్పాదకతగల సంప్రదాయక ఆర్థిక రంగంలో స్వయం ఉపాధి మీద అత్యధికంగా బతికే ముస్లింలకు ఇది వర్తిస్తుంది. అయితే ఈ సంగతి గణాంకయుతంగా నిర్ధారించడం అవసరం. బిసి కమిషన్ ఆ పనిచేస్తే ఏ సమస్యా ఉండదని సూచించాం. దానికోసం ప్రభుత్వ శాఖల మీదనే ఆధారపడకుండా సెస్ వంటి పరిశోధనా సంస్థలకు, విశ్వవిద్యాలయాల సామాజిక శాస్త్ర విభాగాలకూ వివిధ పరిశోధనాంశాలను పురమాయించడం ఉచితంగా ఉంటుందని బిసి కమిషన్ ఛైర్మన్ సుబ్రమణ్యం గారికి వివరించి చెప్పాం. ఆయన రెండు పర్యాయాలూ ఆ పని చేయకుండా ముఖ్యమంత్రి పురమాయింపు మేరకు ఉడికీ ఉడకని నివేదిక ఇచ్చేసారు.

ముస్లింలలో 15 'కులాలను' గుర్తించి వారికి బిసి 'ఇ'గా గుర్తింపు ఇవ్వాలని బిసి కమిషన్ సిఫారస్ చేసిందంట. ముస్లింలలో కులాలు లేవనీ, కులాలను గుర్తించడం ముస్లిం వ్యతిరేక వ్యతిరేక చర్య అనీ కొన్ని ముస్లిం సంస్థలూ కొందరు ముస్లిం పెద్దలూ అభ్యంతరం తెలిపారు. ఇస్లాం కులాన్ని గుర్తించని మాట వాస్తవమే కానీ ముస్లింలలో కులాన్ని పోలిన వర్గాలు ఉన్న మాటా వాస్తవమే. వివిధ హిందూ కులవృత్తుల వారు ఇస్లాం పుచ్చుకున్న తరువాత అదే వృత్తులలో కొనసాగడమే కాక తమ కులం గుర్తింపును కూడ తమతో తీసుకుపోయారు. ఈ ముస్లిం కులాల మధ్య గోడలు మరీ అంత దుర్భేద్యంగా ఉండకపోవచ్చు. పెళ్ళిళ్ళ మీద నిషేధం ఖచ్చితంగా అమలు కాకపోవచ్చు. అయినప్పటికీ ముస్లింలలో ఉపవర్గాలుగా అవి ఉనికిలో ఉన్నమాట వాస్తవం. తొలినాటి హిందూ కులాలతో సమానంగా వెనుకబడి ఉన్న మాటా వాస్తవం. కాబట్టి ముస్లిం మత పెద్దల అభ్యంతరం సహేతుకమైనది కాదు. అయితే ఈ నిర్ణయంలో వేరే సమస్యలున్నాయి.

ఈ 15 'కులాలు' కాక ప్రత్యేకమయిన వర్గంగా ఒక పేరు గానీ, గుర్తింపు గానీ లేని వెనుకబడిన ముస్లింలు లేరా? హిందువులందరూ ఏదో ఒక కులం కలిగి ఉంటారు. ముస్లింలలోనూ చారిత్రక కారణాల వల్ల కులాన్ని పోలిన గుర్తింపు కొంతమేరకు ఉన్నప్పటికీ ముస్లింలందరూ ఏదో ఒక 'కులం' కలిగి లేరు. లేని వాళ్ళందరూ అభివృద్ధి చెందిపోయిన వారూ కారు. వాళ్ల సంగతేమిటి?

ఈ 15 'కులాల' జనాభా ఎంత? ముస్లిం జనాభాలో వారి శాతం ఎంత? ఈ విషయాలు బిసి కమిషన్‌కూ తెలీదు. రాష్ట్ర ప్రభుత్వానికీ తెలీదు. వీళ్లంతా కలిసి ముస్లిం జనాభాలో 85 శాతం ఉంటారని మంత్రి షబ్బీర్ అలీ అనగా విన్నాం. అది ఆయన విశ్వాసమే తప్ప ఆయన దగ్గరా సమాచారం లేదు. ఒకవేళ వీరందరి జనాభా కలిపి ముస్లింలలో 50 శాతమే అయితే, వీరికి 4 శాతం రిజర్వేషన్ ఇచ్చేస్తే తక్కిన 50 శాతంలోని (ప్రత్యేకమైన గుర్తింపు ఏదీ లేని) వెనుకబడిన వర్గానికి ఏమీ ఇవ్వడం సాధ్యపడదు కదా?

పైగా, వీరి జనాభా ఎంతో తెలియకుంటే 4 శాతం రిజర్వేషన్ ఎట్లా ఇచ్చావని హైకోర్టు ప్రశ్నిస్తే ప్రభుత్వం ఏం జవాబు చెప్తుంది? రిజర్వేషన్ జనాభా నిష్పత్తి ప్రకారమే ఉండనక్కరలేదు గానీ జనాభా నిష్పత్తితో నిమిత్తం లేకుండా ఇవ్వడం తగదు. ఆ నిష్పత్తి ఎంతో అసలే తెలియకుండ 4 శాతం రిజర్వేషన్ ఎట్లా ఇస్తారని హైకోర్టు ప్రశ్నించదా?

త్వరలో మొదలు కాబోయే విద్యా సంవత్సరం కౌన్సెలింగ్‌లో ఈ ఆర్డినెన్స్‌ను అమలు చేయాలని ప్రభుత్వం సంకల్పం. అయితే ముస్లిం లెవ్వరిదగ్గరా తమ 'కులాన్ని' సూచించే సర్టిఫికెట్‌లు లేవు. వాళ్లిప్పుడు తాసీల్దార్లకు అర్జీలు పెట్టుకోవాలి. తాసీల్దార్లు ఎంక్వైరీ జరపాలి, సర్టిఫికెట్‌లు ఇవ్వాలి. త్వరపడి ఇచ్చేస్తే పొరబాట్లు జరగగలవు. అనర్హులు రిజర్వేషన్ పొందగలరు. ఆచరణాత్మకమైన ఈ సమస్య కూడా హైకోర్టులో చర్చకు రాగలదు. దానికి ప్రభుత్వం ఏం జవాబు చెప్తుంది?

ప్రభుత్వానికి బలహీన వర్గాలకు మేలు చేసే బాధ్యత, అధికారము ఉన్నప్పుడు, ముస్లింలు ఒక బలహీన వర్గమేననేది ఎవ్వరూ కాదనలేని వాస్తవం అయినప్పుడు, న్యాయస్థానాలకు ఇంత భయపడవలసిన అవసరం ఉందా అన్న ప్రశ్న రావచ్చు. ఆ అవసరం వాస్తవానికి ఉండకూడదు. రాజ్యాంగకర్తల ఉద్దేశ్యమూ అదే. అయితే కొన్ని విషయాలలో న్యాయస్థానాలు రాజ్యాంగం తమకు ఇవ్వని అధికారాన్ని తమ తీర్పుల ద్వారా కాలక్రమంలో తమకు దఖలు పరుచుకున్నాయి. పర్యావరణం, అడవుల వినియోగం రెండు ప్రముఖ ఉదాహరణలు. రిజర్వేషన్లు మరొకటి. రాజ్యాంగకర్తల ఉద్దేశ్యం ఏదయినప్పటికీ హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులకు నచ్చకపోతే ప్రభుత్వాలు రిజర్వేషన్లు ఇవ్వలేవు. ఒక సమస్య పరిష్కారానికి పాలనా విధానాన్ని రూపొందించేముందు దానికి సంబంధించిన సమాచారం ప్రభుత్వం వద్ద ఉండాలనీ, ఆ సమాచారాన్ని హేతుబద్ధంగా వివేచించాలనీ మాత్రమే రాజ్యాంగ పాలనా సిద్ధాంతం చెప్తుంది. రిజర్వేషన్ల కాడికొచ్చేసరికి సమస్య గురించి సమగ్ర శాస్త్రీయ విశ్లేషణ చేయనిదే పాలనా చర్యలు చేబట్టడానికి వీలు లేదని న్యాయస్థానాలు ఇప్పుడు అంటున్నాయి. అన్ని పాలనా రంగాలకూ ఈ ప్రమాణాన్ని వర్తింపజేసేటట్టయితే పాలన అసాధ్యం అవుతుందని వారికి తోస్తున్నట్టు లేదు. అంతేకాదు. ఏ సమస్యకైనా ప్రభుత్వం ప్రతిపాదించే పరిష్కారం స్థూలంగా చూసినప్పుడు హేతుబద్ధమైనదేనా అన్న పరిశీలన మాత్రమే న్యాయస్థానాల పరిధిలోని విషయం కాగా, రిజర్వేషన్ల కాడికొచ్చేసరికి ప్రభుత్వం ప్రతిపాదించే పరిష్కారం సమస్యకు ఎంతవరకు తగినదని తాము బేరీజు వేస్తామని న్యాయస్థానాలు అంటున్నాయి. ఒక దశాబ్దం కాలంగా న్యాయస్థానాల వైఖరి ఈ దిశగా మెట్టు మెట్టు సాగుతున్నది. మొన్న మన రాష్ట్ర హైకోర్టు ముస్లిం రిజర్వేషన్ చట్టాన్ని కొట్టేస్తూ ఇచ్చిన తీర్పు దీనికి పరాకాష్ఠ.

అన్ని రకాలుగా అవాంఛనీయమైన ఈ పరిణామాన్ని ప్రశ్నించడానికి పార్లమెంటు స్పీకర్ సోంనాథ్ ఛటర్జీ ఒక్కడే చిన్న ప్రయత్నం చేసాడు. అయితే అది ఎక్కువ దూరం పోలేదు. దీని ఫలితంగా రిజర్వేషన్ హక్కు పొందవలసిన ప్రజలు రాజశేఖరరెడ్డి వంటి నాయకుల అవకాశవాదానికీ న్యాయస్థానాల మూర్ఖత్వానికీ మధ్య చిక్కుకొని చేయిజారిపోతున్న ఫలాలు ఇదిగో దక్కాయి అదిగో దక్కాయి అని తమకు తాము ఆశ చూపుకుంటూ బతకవలసిందే కాబోలు.

**ప్రజాతంత్ర**

**8 జూలై 2007**

# చరిత్ర పాఠాలపై కాషాయం నీడ

.............................................

నిజానికి ప్రాదేశికతను బట్టే మన-తన అనేది నిర్ణయించనవసరం లేదు. ముస్లింలకు, క్రైస్తవులకు సమాన హక్కులు ఇవ్వడం ఇష్టంలేని హిందూత్వవాదులు తీసుకొచ్చిన వికృతమైన తర్కం ఇది. 'ఎక్కడినుండో వచ్చి ఇక్కడి ప్రజలతో మీరెంతో మేమంతే అంటారా?' అనేది మైనారిటీలకు వ్యతిరేకంగా వారు ప్రయోగించే వాదన. నిజానికి ఈనాడు ఈ దేశంలో ఉన్న ముస్లింలు, క్రైస్తవులు 'ఎక్కడినుండో' రాలేదు. వారంతా ఇక్కడివారే. ఈ సంగతి హిందూత్వవాదులకు తెలుసు. అయితే వారు కాకపోయినా వారు నమ్మే మతం 'పరాయి ప్రాంతాలకు' చెందినదే కదా. ఆ మతం ఇక్కడి ప్రజల మతంతో సమాన ప్రతిపత్తి ఎట్లా కోరుకుంటుంది? మసీదులో ప్రార్థనలు జరిగే టైంలో మసీదు ముందు బాజా భజంత్రీలు వాయించొద్దని ఇక్కడి ప్రజల సంస్కృతిపైన ఆంక్షలెట్లా పెడతారు? ఇక్కడి ప్రజల దేవుడయిన రాముడి గుడిని పరాయివాళ్ళు కూల్చేసి అక్కడ పరాయి మత ప్రార్థనాస్థలాన్ని కడితే ఇక్కడి ప్రజలు దానిని లౌకికవాదం పేరిట భరించవలసిందేనా? ఇత్యాది ప్రశ్నలు హిందూత్వవాదులు చాలా ఉద్రేకంతో అడుగుతారు.



ఒకవేళ హైందవం ఈ గడ్డమీద ఆవిర్భవించిన మతమే అయినా ఇస్లాం, క్రైస్తవం సమాన హక్కులు కోరుకోవడంలో తప్పులేదు. అవి ఒకప్పుడు ఎక్కడో పుట్టి ఉండవచ్చును. కానీ ఇప్పుడు ఆ మతాలను అనుసరించే ప్రజలు కోట్ల సంఖ్యలో ఈ దేశవాసులలోనే ఉన్నారు. అవి పరాయి మతాలెట్లా అవుతాయి? ఈ రోజు అవి రెండూ మన దేశానికి (కూడా) చెందిన మతాలే. ఆ ప్రజలకు సమాన హక్కులు ఎట్లా నిరాకరిస్తారు?

**'చరిత్ర పాఠాలపై కాషాయం నీడ' వ్యాసం నుంచి కొంత భాగం.**

**పూర్తి వ్యాసం 'మతతత్వంపై బాలగోపాల్' పుస్తకంలో ఉంది.**

**1999**

# ముస్లింలు – సంఘ్‌పరివార్

# హిందూ మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడుదాం!

ప్రజలారా!

డిసెంబర్ 6వ తేదీన అయోధ్యలో బాబ్రీ మసీదును కూల్చివేసిన తరువాత లౌకికవాదాన్ని గురించి దేశంలో పెద్దఎత్తున చర్చ జరుగుతూ ఉంది. లౌకిక వాదాన్ని కాపాడుకుందాం రమ్మని అనేక పార్టీలు ప్రజలకు పిలుపునిస్తున్నాయి. ఉద్యమాలు చేపడదామంటున్నాయి. కాని భారతీయ జనతాపార్టీ మాత్రం ఇదంతా 'కుహనా లౌకికవాదం' అంటూ దుమ్మెత్తిపోస్తున్నది. లౌకికవాదం పేరిట మైనారిటీలను బుజ్జగిస్తున్నారనీ, హిందువులకు అన్యాయం జరిగిపోతున్నదనీ గగ్గోలు పెడుతూ వుంది. 'బుజ్జగించడం' అంటే అర్థం గాలీ, వెల్తురు లేని మురికి వాడలలో శాశ్వతంగా ఉంచటం కాబోలునని అత్యధికంగా పట్టణ పేదవర్గాలకు చెందిన ముస్లింలకు ఈపాటికి అనుమానం వచ్చే ఉండాలి!

మన సామాజిక జీవితం, ఆర్థికజీవితం, రాజకీయ జీవితం మతం ప్రభావం నుండి బయటపడి ప్రజాస్వామ్య విలువలకు అనుగుణంగా రూపొందాలనేది లౌకికవాదం. ఒకప్పుడవి పూర్తిగా మతం ప్రభావంలో ఉండేవి. వర్ణాశ్రమ ధర్మం, పూజారుల పెత్తనం, కులమత ఆచారాలు, మత సంబంధమయిన నమ్మకాలు సామాజిక రాజకీయ జీవితాన్ని శాసించేవి. ఆ జీవితంలో ప్రజాస్వామ్యానికి తావు లేదు. ఒకరు ఎక్కువ, ఒకరు తక్కువ, ఒకరు పూజ్యులు, ఒకరు అంటరానివారు, ఒకరు స్వతంత్రులు, ఒకరు దాసులు అనేది మధ్యయుగాల సాంఘిక నీతి. దాని స్థానంలో ఆధునిక ప్రజాస్వామ్య విలువల ప్రాతిపదికమీద సామాజిక రాజకీయ జీవితాన్ని నిలబెట్టాలని భావిస్తుంది లౌకికవాదం. అదొక ఉన్నతమయిన ప్రజాస్వామ్య విలువ. లౌకికవాదం లేనిదే ప్రజాస్వామ్యం లేదు.

'ముస్లిం దేశాలలో లౌకికవాదం లేనప్పుడు మనకు మట్టుకు ఎందుకు?' అని ఈ రోజు హిందూత్వవాదులు అంటున్నారు. అదొక తప్పుడు వాదన. ముస్లింలు మెజారిటీగా ఉన్న దేశాలన్నిటిలోనూ మత రాజ్యాలు లేవు. ఈజిప్టు, అల్బేనియా, అల్జీరియా, టర్కీవంటి అనేక దేశాల ప్రశాసనం లౌకికమైనదే. సౌదీ అరేబియాను, పాకిస్తాన్‌ను మట్టుకే ఉదాహరణగా ఎందుకు తీసుకోవాలి? ప్రజాస్వామ్య విలువల విషయంలో మనకంటే వెనుకబడిన దేశాలను ఉదాహరణగా తీసుకొని మనం కూడ వాళ్లలాగ తయారు కావాలని కోరుకోవడం ఏ రకమైన దేశభక్తి? ఏ రకమయిన జాతీయత?

'కుహనా లౌకికవాదం' అంటూ బిజెపి చేస్తున్న విమర్శలో ప్రధాన అంశం 'మైనారిటీలను బుజ్జగిస్తున్నారు' అనేది. కాంగ్రెస్ ప్రభుత్వాలు వివిధ సందర్భాలలో వోట్ల కోసం మైనారిటీ మత ఛాందసులను బుజ్జగించడం జరిగిన మాట వాస్తవం. దానికి 'మైనారిటీల బుజ్జగింపు' అని పేరుపెట్టడం మట్టుకు దారుణమైన వక్రీకరణ. మైనారిటీలను మొత్తంగా బుజ్జగించింది ఎన్నడూ లేదు. ఆ పనే చేసి వుంటే ముస్లింలలోనే అందరికంటే ఎక్కువ పేదరికం, నిరుద్యోగం ఉండేవి కావు. 'మైనారిటీల బుజ్జగింపు'కు బిజెపి చూపించే ప్రధాన నిదర్శనం షాబానో కేసులో రాజీవ్‌గాంధీ సుప్రీంకోర్టు తీర్పును వమ్ముచేసి ముస్లిం మత ఛాందసులను మెప్పించేందుకు ముస్లిం స్త్రీని భర్త వదిలిపెడితే సి.ఆర్.పి.సి. ప్రకారం మనోవర్తి ఇవ్వనక్కరలేదని చట్టం చేయడం. దీనివల్ల నష్టపోయింది ముస్లిం స్త్రీలు. వాళ్లు మైనారిటీలో భాగం కాదా? ఈ చర్య 'మైనారిటీల బుజ్జగింపు' ఎట్లాగయింది? అంతేకాక, రాజీవ్‌గాంధీ కంటే 40 ఏళ్లు ముందు ఆయన తాతగారయిన జవహర్‌లాల్ నెహ్రూ హిందూమత ఛాందసులకు భయపడి హైందవ వ్యక్తిగత చట్టాన్ని సవరించి స్త్రీలకు కొన్ని హక్కులు కల్పించే హిందూకోడ్ బిల్‌కు శాసన రూపం ఇవ్వడానికి వెనకాడాడు. అప్పటి కేంద్ర న్యాయశాఖ మంత్రి అంబేద్కర్ దీనికి నిరసనగా రాజీనామా చేసాడు. బిజెపి నాయకులు దీనిని 'బుజ్జగింపుకు', 'కుహనా లౌకిక వాదానికి' నిదర్శనంగా ఎందుకు తీసుకోరు? కాంగ్రెస్‌పార్టీ మత ఛాందసత్వాన్ని బుజ్జగించడం, లేదా దానితో లాలూచీ పడడం అనేక సందర్భాలలో జరిగింది, జరుగుతున్నది. బాబ్రీ మసీదులోకి కొందరు రామభక్తాగ్రేసరులు 1949లో రామవిగ్రహాన్ని దొంగతనంగా ప్రవేశపెట్టి ఆ మసీదును కృత్రిమంగా 'వివాదాస్పదం' చేసినప్పుడు, విగ్రహాలను తొలగిస్తే హిందూ మతతత్త్వ శక్తులకు ఆగ్రహం వస్తుందని నెహ్రూ ప్రభుత్వం భయపడి మసీదుకు తాళం వేయించింది. రామపూజలు దొంగతనంగా సాగుతూనే ఉన్నా

నిరోధించలేదు. ఇది హిందూ మతతత్వంతో లాలూచీ కాదా, 'బుజ్జగింపు' కాదా? లాలూచీలో భాగంగానే 1986లో రాజీవ్ గాంధీ మసీదు తాళాలు తీయించి పూజలు బహిరంగంగా సాగనిచ్చాడు. 1989లో శిలాన్యాసం అధికారికంగా ఆరంభం కానిచ్చారు. 1991లో 'వివాదాస్పద' స్థలంలో కరసేవ చేయనిచ్చారు. 1992లో మసీదును కూల్చనిచ్చారు. ఒక్క షాబానో ఉదంతాన్ని మట్టుకే లౌకిక వాదానికి మచ్చగా ఎందుకు భావించాలి?

అయితే బుజ్జగింపు గురించి హిందూత్వవాదులు చేస్తున్న వాదన షాబానో కేసు దాటి చాలా దూరం పోతున్నది. 'మైనారిటీ' అనే భావనే బుజ్జగింపని వాళ్లు వాదిస్తున్నారు. మైనారిటీలకు తమ సంస్కృతిని కాపాడుకోవడానికీ, తమ సామాజిక ఆర్థిక వికాసం సాధించడానికీ ప్రత్యేకమయిన హక్కులు, సదుపాయాలు కల్పించడాన్నే బుజ్జగింపు అంటున్నారు. ఇది చాలా అప్రజాస్వామికమయిన వైఖరి. ఏ సమాజంలోనయినా మతం రీత్యా, భాషరీత్యా, సంస్కృతి రీత్యా మైనారిటీలయిన ప్రజలు ఉంటారు. వాళ్లకుండే ప్రత్యేకమయిన సమస్యలను గుర్తించడం, వారికి ప్రత్యేక హక్కులనూ ప్రతిపత్తినీ కల్పించడం కనీస ప్రజాస్వామ్య చర్య.

ఈ హిందూత్వవాదుల దుష్ప్రచారం హోరులో ప్రజలకు కొన్ని వాస్తవాలు తెలియడం లేదు. అయోధ్యలో బాబ్రీ మసీదును కూల్చివేసినందుకు నిరసనగా పాకిస్తాన్‌లోనూ, బంగ్లాదేశ్‌లోనూ హిందూ దేవాలయాలను కూల్చివేయడం పట్ల ఆ దేశాలలోని ప్రముఖులు, మేధావులు చాలా ఆందోళన చేసారు. ఆ దేశాల ప్రభుత్వాలు ఆ దేవాలయాలను తిరిగి నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చాయి కూడా. హిందువులను ఆ దేశాలలో మైనారిటీగా గుర్తించబట్టే కదా ఇది జరిగింది?

'మైనారిటీ మెజారిటీ అన్న తేడా లేకుండా పౌరులందరినీ సమానంగా చూడాలి' అని హిందూత్వవాదులు చేస్తున్న వాదన చాలా ప్రమాదకరమయినది. సమానం కాని వారిని సమానంగా చూస్తే అసమానతలు పెరుగుతాయి తప్ప తగ్గవు. తెలుగువాళ్లు పొరుగు రాష్ట్రాలలో మైనారిటీగా ఉన్నారు కాబట్టి ప్రత్యేకంగా తెలుగు స్కూళ్లు, ఇతర ప్రత్యేక వసతులు కోరుకుంటున్నారు. ఆ రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్నాయి. ఇంగ్లండ్‌లో, అమెరికాలో స్థిరపడిన భారతీయులు ఒక మైనారిటీగా ప్రత్యేక వసతులు కోరుకుంటున్నారు, పొందుతున్నారు. 'పౌరులంతా ఒకటే. అందరినీ ఒకే రకంగా చూడాలి' అనే వాదన సామాజిక జీవితంలో అన్ని రంగాలకూ విస్తరిస్తే ఆ వ్యవస్థ చాలా అప్రజాస్వామికంగా ఉంటుంది. బలహీనులకు, పీడితులకు చాలా అన్యాయం చేస్తుంది. వెనుకబడ్డ ప్రాంతాలు,

అభివృద్ధి చెందిన ప్రాంతాలు అన్న ప్రాంతీయ తత్వం ఎందుకు? వెనుకబడ్డ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక రాయితీలు ఎందుకు? స్త్రీలు పురుషులు అన్న తేడా ఎందుకు? స్త్రీలకు బస్సులలో వేరే సీట్లెందుకు? ప్రత్యేకమైన మహిళా కాలేజీలెందుకు? అగ్రకులాలు, వెనకబడ్డ కులాలు అన్న తేడా ఎందుకు? వెనుకబడ్డ కులాలకు రిజర్వేషన్లెందుకు? వేరే స్కాలర్‌షిప్‌లు ఎందుకు? ఈ రకమయిన వాదనలు మనం తరచుగా వింటుంటాం. ఇవన్నీ కూడ మెజారిటీ మైనారిటీ అనే తేడా  ఎందుకు అని ప్రశ్నించే హిందూత్వ దృక్పథంలో భాగమే. వోట్ల భయం వల్ల గట్టిగా అనడానికి ఈ రోజు భయపడుతుండవచ్చుగాక.

ప్రజాస్వామిక దృక్పథం దీనికి పూర్తిగా భిన్నమైనది. దళితులకు, ఆదివాసులకు, స్త్రీలకు, వెనుకబడ్డ కులాలకు, అల్పసంఖ్యాక జాతులకు, మైనారిటీ మతస్తులకు, వెనుకబడ్డ ప్రాంతాలకు ప్రత్యేక ప్రతిపత్తిని ఒక హక్కుగా గుర్తించలేకపోతే అది ప్రజాస్వామ్యం కాదు, మెజారిటీ పాలన అనే ముసుగు తొడుక్కున్న నియంతృత్వం అవుతుంది. ఆ నియంతృత్వమే హిందూత్వ వాదుల సామాజిక రాజకీయ సిద్ధాంతం.

ఈ హిందూత్వ వాదులు 'భారతజాతి' అనే దాన్ని ఒక అఖండ పదార్థంగా భావించమంటారు. ఆ ప్రాతిపదిక మీద అందరూ జాతీయ భావాన్ని పెంపొందించుకోవాలని డిమాండ్ చేస్తారు. వివక్షకు గురయ్యేవారు వివక్షను మరచిపోవాలి. దోపిడీకి గురయ్యేవారు దోపిడీని మరచిపోవాలి. విభిన్న సంస్కృతులకు, మతాలకు, జాతులకు చెందినవారు ఆ భిన్నత్వాన్ని మరచిపోవాలి. అందరూ అన్నీ మరచిపోయి అఖండ జాతీయభావాన్ని పెంపొందించుకొని 'భారతజాతి'తో తాదాత్మ్యం చెందాలి. మమేకం కావాలి. తిరుగుబాటుకు, పోరాటాలకే కాదు విభిన్న సంస్కృతులకు, విభిన్న ఆచారాలకు, విభిన్న ఆకాంక్షలకు దీనిలో తావు లేదు. ఒకే దేశం, ఒకే ప్రజ, ఒకే చట్టం అనేది వీళ్ల నినాదం. దానితో పాటు ఒకే దేవుడు (రాముడు), ఒకే భాష (హిందీ), ఒకే సంస్కృతి (వర్ణాశ్రమ ధర్మ సంస్కృతి) అని చెప్పుకోవచ్చు.

ఈ దృక్పథం కేవలం మైనారిటీలకే ప్రమాదకరమయినది కాదు. ఇది అన్ని ప్రజాస్వామ్య ఆకాంక్షలకూ ప్రమాదకరమయినది. ఒక్క హిందుత్వం మట్టుకే ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమా అని అడుగుతారేమో! ఏ మతోన్మాదమయినా ప్రమాదకరమే. కానీ భారతదేశంలో హిందూ మతతత్వం మట్టుకే రాజ్యాధికారానికి రాగలదు. రావడానికి ఒక్కొక్క మెట్టే పైకి ఎగబ్రాకుతూ ఉంది.

అది రాజ్యాధికారానికి వస్తే హిందూ మతతత్వ విలువలే రాజ్యాంగ విలువలయ్యే ప్రమాదం ఉంది. రాజకీయ ఆర్థిక సామాజిక జీవితంలో హిందూ మతతత్వ విలువలే రాజ్యం చేసే ప్రమాదం ఉంది. అందుకే ఈ దాడి నుండి ప్రజాస్వామిక విలువలను కాపాడుకోవడం ఇవ్వాల్టి ముఖ్య కర్తవ్యాలలో ఒకటి. లౌకిక వాదం ఆ ప్రజాస్వామిక విలువలలో ఒకటి మాత్రమే.

## హిందూత్వవాదుల సామాజిక ఆర్థిక రాజకీయ దృక్పథం

ఈ దృక్పథం ఏమాత్రం ప్రజాస్వామికమైనదో కొంచెం పరిశీలిద్దాం.

ఇంకా రాజ్యాధికారం చాలా దూరంలో ఉండగానే, రాజ్యాంగం నుండి 'లౌకిక' అనే మాటను తొలగించాలని బిజెపి నేతలు డిమాండ్ చేస్తున్నారు. 'మైనారిటీ' అనే మాటను తొలగించాలంటున్నారు. నియంతృత్వ రూపకల్పనలో ఇది తొలిమెట్టు. రాజ్యాధికారానికి చేరువ అయ్యే కొద్దీ ఒక్కొక్క ప్రజాస్వామిక విలువ మీద, హక్కు మీద దాడి మెట్టు మెట్టుగా పెరుగుతుందనడంలో సందేహం లేదు. దీనికి నిదర్శనం కావాలంటే ఎక్కడో వెతకనక్కరలేదు. విశ్వహిందూ పరిషత్ ఆర్ఎస్ఎస్‌ల ప్రవచనాలున్నాయి. తొలినాడు జనసంఘ్‌గా, తరువాత భారతీయ జనతాపార్టీగా దేశ రాజకీయాలలో 'హిందూత్వం' నిర్వహించిన పాత్ర ఉంది.

సమసమాజం అనేది అణచివేతకు గురయ్యే అన్ని వర్గాల ప్రజల సామాన్య ఆకాంక్ష. భారతరాజకీయాలలో అన్ని పార్టీలూ కనీసం వోట్ల కోసం ఆ ఆదర్శాన్ని ప్రకటించుకున్నాయి. ఒక్క హిందూత్వవాదులు మట్టుకే ఇందుకు మినహాయింపు. వాళ్ళకు తొలినుండి ఆ మాట అంటేనే వ్యతిరేకత. మధ్యలో కొన్నాళ్ళు గాంధేయ సోషలిజం తమ ఆదర్శం అని ప్రకటించుకున్నారు గానీ అది మింగుడు పడక తామే వదిలేసుకున్నారు. దానికి ప్రత్యామ్నాయంగా వాళ్లు చెప్పే 'సర్వేజనో సుఖినోభవంతు' అనేది ప్రజాస్వామిక ఆకాంక్ష కాదు. భిక్షగాడు కూడ భిక్షాటన తన పూర్వ కర్మ ఫలితంగా తనకు సంక్రమించిన ధర్మం అనుకుంటే సుఖంగానే ఉండవచ్చు. ఎవరి స్థానాన్ని వారు తమ కర్మఫలంగా స్వీకరించి సుఖంగా బ్రతకాలనే హిందూత్వ ఆదర్శం సమసమాజం అనే ప్రజాస్వామిక ఆదర్శానికి బద్ధశత్రువు.

కుల వ్యవస్థ అంతం కావాలనీ, అందులో భాగంగా కులవివక్షకు గురయిన షెడ్యూల్డు కులాలతో బాటు వెనుకబడ్డ కులాలకు కూడ రిజర్వేషన్లు ఒక హక్కుగా ఇవ్వాలనీ మండల్ కమిషన్ సందర్భంగా దేశంలోని ప్రజాతంత్రవాదులంతా వాదించారు. హిందూత్వ శక్తులు మట్టుకు తమ సంప్రదాయానికి అనుగుణంగా

మండల్ కమిషన్‌ను వ్యతిరేకించాయి. వోట్లు పోతాయన్న భయంతో బిజెపి నాయకులు పైకి ఏం మాట్లాడినా మండల్ వ్యతిరేక ఆందోళనలో ఉత్తర భారతదేశంలో అగ్రభాగాన నిలబడింది అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ కార్యకర్తలు. అసలు హిందూత్వం అంటేనే వర్ణాశ్రమ ధర్మం. క్రైస్తవ మతానికి చర్చి వెన్నెముక అయినట్లు హిందూత్వానికి కుల వ్యవస్థ వెన్నెముక. బిజెపి నాయకులు వోట్ల భయంతో జాగ్రత్తపడుతున్నారుగానీ వాళ్ల చుట్టూ ఉన్న హిందూత్వవాదులు వర్ణాశ్రమ ధర్మాన్ని పునఃస్థాపిస్తామని ప్రతిజ్ఞలు చేస్తున్నారు. వర్ణాశ్రమ ధర్మానికి అనుగుణంగా భారత రాజ్యాంగాన్ని తిరగరాయాలని సన్యాసులూ, సాధువులూ డిమాండ్ చేస్తున్నారు! 'పాకిస్తాన్‌లో లేని లౌకికవాదం మనకెందుకు?' అని హిందూత్వ వాదులు పదే పదే వేస్తున్న ప్రశ్న వెనకున్న దుర్బుద్ధి ఇది. సమాజంలో ప్రతి వ్యక్తి స్థానం పుట్టుకతో నిర్ణయం అవుతుందనీ, ఉచ్ఛనీచాలు అప్పుడే నిర్ణయమవుతాయనీ, ఎవరి స్థానానికి తగినట్లు వారు నడుచుకోవడం 'ధర్మం' అనీ హిందూత్వం చెపుతుంది. ఈ రోజు కార్మికులు, కూలీలు, స్త్రీలు, దళితులు, గిరిజనులు సమాజం తమ 'ధర్మం'గా నిర్దేశించిన దానికి వ్యతిరేకంగా తిరగబడుతున్నారు. వాళ్లకు హిందూత్వం చెప్పే జవాబు 'నోరు మూసుకుని పడి ఉండండి' అని. కారంచేడుతో మొదలుపెట్టి మన రాష్ట్రంలో అనేక సందర్భాలలో దళితులపైన అగ్రకులాల దాడులు జరిగాయి. అన్ని రాజకీయ పార్టీలు ఒకసారి కాకపోతే ఒకసారయినా ఈ హత్యాకాండకు వ్యతిరేకంగా మాట్లాడాయి. ఎన్నడూ నోరు విప్పనిది ఈ హిందూత్వవాదులే. ఎన్నడూ దళితుల ఏ పోరాటంలోనూ పాల్గొననిది వీరే.

ఈశాన్య భారతంలోని నాగా మిజో తదితర ప్రజలు చారిత్రకంగా సాంస్కృతికంగా తక్కిన భారతీయుల కంటే చాలా భిన్నమయిన వాళ్లు. వాళ్ల ఇష్టానికి వ్యతిరేకంగా వాళ్లను బలవంతంగా భారతదేశంలోకి కలుపుకోవడం జరిగింది. 10 సంవత్సరాల తరువాత ఈ విషయాన్ని పునఃపరిశీలిస్తామని భారత ప్రభుత్వం 1947లో వారికి హామీ ఇచ్చింది. వాళ్ల సంస్కృతినీ జీవన విధానాన్నీ వాళ్ళ భూములనూ బయటివాళ్ళ దాడినుండి కాపాడడం కోసం రాజ్యాంగంలో వారికి ప్రత్యేక హక్కులు చేర్చడం జరిగింది. ఈ ప్రత్యేక సదుపాయాల చారిత్రక నేపథ్యాన్ని అర్థం చేసుకోకుండా దీనిని 'క్రైస్తవ మైనారిటీల బుజ్జగింపు' అని హిందూత్వవాదులు దుష్ప్రచారం చేస్తున్నారు. 10 సంవత్సరాల గడువు తీరిన తరువాత భారత ప్రభుత్వం తన హామీని నిలబెట్టుకోకపోయేసరికి నాగా తదితర జాతుల ప్రజలు స్వాతంత్ర్యం కోసం పోరాటం ప్రారంభించారు. వారిపైన భారత

ప్రభుత్వం పాశవికమైన అణచివేత ప్రయోగించసాగింది. న్యాయమయిన ప్రజల ఆకాంక్షలను అర్థం చేసుకోకుండా ఇదంతా 'క్రైస్తవ మిషనరీల కుట్ర' అని దుష్ప్రచారం చేస్తున్నారు హిందూత్వవాదులు. తమ నేలలో తాము స్వతంత్రంగా బ్రతకాలన్న ఆ ప్రజల ఆకాంక్షను దేశద్రోహంగా, దేశ విచ్ఛిన్నంగా, క్రైస్తవుల కుట్రగా ప్రచారం చేస్తున్నారు.

ఒక్క ఈశాన్య భారతంలోనే కాదు, దేశంలో ఎక్కడయినా ప్రజలు స్వయం ప్రతిపత్తి కోసం పోరాటం చేస్తే అదంతా దేశ భద్రతకు, సమగ్రతకు భంగకరమంటూ కఠినంగా అణచివేయాలని గగ్గోలు పెడుతున్నది ఈ హిందూత్వ శక్తులే. కశ్మీర్‌లో హిందూ దేవాలయాలను కూల్చేస్తే ఎవ్వరూ ఖండించలేదని వీరు ప్రశ్నిస్తున్నారు. ఒక మతస్తుల ప్రార్థనా స్థలాలను మరొకరు ధ్వంసం చేయడాన్ని ప్రజాస్వామికవాదులు తప్పక వ్యతిరేకిస్తారు. అయితే కాశ్మీర్ రాజకీయాల చరిత్రను, కశ్మీరీల ఆకాంక్షలను వక్రీకరించి చేసిన దుష్ప్రచారానికి హిందూత్వ నాయకులు సంజాయిషీ చెప్తారా? కశ్మీరీలు ఇటు పాకిస్తాన్‌లోగానీ అటు భారతదేశంలోగానీ చేరకుండ స్వతంత్రంగా బ్రతకాలని దేశవిభజనప్పుడు కోరుకున్నది నిజం కాదా? ఆ కోరికను పై రెండు దేశాలూ గౌరవించలేదన్నది నిజం కాదా? ఆ పరిస్థితిలో పాకిస్థాన్ దాడికి తట్టుకోలేక కశ్మీరీలు గత్యంతరం లేక భారతదేశంలో చేరారనడం నిజం కాదా? బలవంతపు విలీనానికి షరతుగా వాళ్లు స్వయంప్రతిపత్తిని కోరుకున్నారు. ఇదే ఆర్టికల్ 370గా రాజ్యాంగంలో చోటు చేసుకుంది. కొంతకాలం తరువాత భారతదేశంలో భాగంగా ఉంటారా లేక విడిపోతారా అనేది నిర్ణయించుకునే హక్కు కాశ్మీరీలకు ఉంటుందని ఈ నేపథ్యంలోనే భారత ప్రభుత్వం ఒప్పుకుంది. ఈ నేపథ్యాన్ని చెప్పకుండ ఆర్టికల్ 370ని 'మైనారిటీల బుజ్జగింపు'కు ఉదాహరణగా హిందూత్వవాదులు ప్రచారం చేస్తున్నారు. తమ భవితవ్యాన్ని నిర్ణయించుకునే హక్కు తమకే ఉంటుందని కశ్మీరీలకు ఇచ్చిన హామీని భారత ప్రభుత్వ నిలుపుకోకుండ షేక్ అబ్దుల్లాను తప్పుడు అభియోగాలపైన అరెస్టు చేయడంతో కశ్మీరీలలో అసంతృప్తికి బీజం పడింది. అది ఈ రోజు సాయుధ తిరుగుబాటు రూపం తీసుకుంది. ఈ చరిత్రను కప్పి పెట్టి కశ్మీర్‌లో జరుగుతున్నది ముస్లిం మతోన్మాదుల దేశద్రోహ పూరితమయిన కుట్ర అని హిందూత్వవాదులు కాలికి బలపం కట్టుకొని దేశమంతటా దుష్ప్రచారం చేస్తున్నారు.

ఈ పోరాటం ఆ పోరాటం అన్నీ తేడా లేకుండా ఏ ప్రజాపోరాటం మీదనయినా సరే ప్రభుత్వం నిర్బంధం ప్రయోగిస్తే మొట్టమొదట హర్షం వ్యక్తం

చేసేది, సమర్థించేది ఈ హిందూత్వవాదులే. పోలీసు అత్యాచారాల గురించి దేశంలో ప్రజలంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నప్పటికీ తాము ఎన్నడూ ఆందోళన చేయకపోగా పోలీసుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయకూడదని హితవు చెప్పే కార్యక్రమం పెట్టుకున్నది వీరే. పౌరహక్కులు, ప్రజాస్వామ్య హక్కులు అంటే మండిపడేది వీరే. ఈ రోజు నిషేధాలూ నిర్బంధాలూ తమ దాకా వచ్చేసరికి గుండెలు బాదుకుంటున్నారు గానీ గతంలో ఎన్నడూ ఎవరిమీద నిర్బంధాన్నీ ఖండించని వారెవరయినా దేశంలో ఉన్నారా అంటే అది ఈ హిందూత్వవాదులే. గతంలో ఎల్‌టిటిఇని, పీపుల్స్‌వార్ గ్రూపును, పంజాబు కాశ్మీర్ ఈశాన్య భారత పోరాట సంస్థలను ప్రభుత్వం నిషేధిస్తే అది తప్పు అనకపోగా ఇంకా ఇంకా అణచి వేయాలన్నది వీరే. ఆంధ్రప్రదేశ్‌లో అన్ని రాజకీయ పార్టీలు ఒకసారి కాకపోతే ఒకసారయినా నక్సలైట్లను కేవలం శాంతి భద్రతల సమస్యగా చూడకూడదనీ, ఎన్‌కౌంటర్లు పరిష్కారం కాదనీ అన్నారేమోగాని ఆ మాటలు ఎన్నడూ అననిది వీరే. ఇంకా ఇంకా చంపాలన్నది వీరే. బిజెపి వారి సభలకు కాంగ్రెస్ ప్రభుత్వం అనుమతి నిరాకరించేసరికి 'అన్ని రాజకీయ పార్టీలను సమంగా చూడాలి. కొందరికి మట్టుకు హక్కులు నిరాకరించకూడదు' అంటూ బిజెపి నాయకులు నిరసన దీక్షలు చేస్తున్నారు. వాళ్ల ఆవేదన న్యాయమయినదే. కాని నిన్నటిదాకా కొన్ని రాజకీయ పార్టీలకు 'తీవ్రవాదులు' అని పేరు పెట్టి హక్కులు నిరాకరిస్తే పూర్తిగా సమర్థించింది వీరే. వాళ్లకు ఏ హక్కులూ ఇవ్వవద్దని గగ్గోలు పెట్టిందీ వీరే. పౌర ప్రజాస్వామ్య హక్కుల విషయంలో ఈ హిందూత్వవాదులది ఎంతటి ఫాసిస్టు దృక్పథమో చెప్పడం కోసం ఈ మాటలు అంటున్నాముగానీ వాళ్లపైనయినా ఎవరిపైనయినా ప్రభుత్వం నియంతృత్వ పద్ధతులలో అణచివేత ప్రయోగిస్తే సమర్థించడం మా అభిమతం కాదు.

నూతన ఆర్థిక విధానంతో పి.వి. నరసింహారావు ప్రభుత్వం ప్రజలకు ఉద్యోగాలు లేకుండ చేసి ధరలు పెంచేసి సాంఘిక సంక్షేమ వ్యయంపైన కోతపెట్టి కనీస జీవన హక్కులు ప్రజలకు లేకుండ చేస్తుంటే పార్లమెంటులో అన్ని పార్టీలు అంతో యింతో విమర్శించాయి గానీ నూతన ఆర్థిక విధానానికి పార్లమెంటులో భరోసాగా నిలబడి 'నీ ఆర్థిక విధానం భేష్' అని పివికి కితాబులు ఇచ్చింది భారతీయ జనతాపార్టీయే. కనీస జీవన హక్కులకు భరోసా లేని ఆర్థిక విధానం ఈ హిందూత్వవాదుల ఆర్థిక విధానం. అదే ప్రపంచ బ్యాంకు ఆర్థిక విధానం. ప్రస్తుత బిజెపి జాతీయ నాయకులలో ఒకడయిన జయ్ దుబాషి చాలా కాలంగా బిజెపి ఆర్థిక సిద్ధాంతాన్ని తన రచనలలో ప్రచారం చేస్తున్నాడు. కొన్ని తెలుగు

పత్రికలు కూడ వాటిని ప్రచురించాయి. ఆ విధానాలు ప్రస్తుత కేంద్ర ప్రభుత్వ ఆర్థిక విధానాలకు అద్దం పడతాయి. కార్మికులకు ఉద్యోగభద్రత ఉండకూడదు. ధరలపైన ప్రభుత్వం అదుపు పెట్టకూడదు. పేదలు వినియోగించే వస్తువులకు సబ్సిడీలు ఇవ్వకూడదు. వెనుకబడ్డ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక రాయితీలు ఇవ్వకూడదు. సమానత్వం, సంక్షేమం, సమతుల్యం మొదలయిన ఆదర్శాలు ఆర్థిక వ్యవస్థను బలహీన పరుస్తాయి. కాబట్టి వాటిని విడిచిపెట్టాలి. ఇదీ హిందూత్వ ఆర్థిక సిద్ధాంతం.

ఇదంతా కేవలం మైనారిటీల సమస్యా? పైన చెప్పిన హిందూత్వవాదుల రాజకీయ సామాజిక ఆర్థిక దృక్పథం వల్ల నష్టపోయేది కేవలం క్రైస్తవులు, ముస్లింలు, సిక్కులా? లేకపోతే పీడనకూ అణచివేతకూ అసమానతకూ గురయ్యే ప్రజలందరికీ ఈ హిందూత్వం శత్రువా? కొంచెం ఆలోచించమని విజ్ఞప్తి చేస్తున్నాం.

## కోర్టులు–ప్రభుత్వం–పోలీసులు

రాజ్యాధికారం కోసం ఎగబ్రాకుతున్న హిందూ మతోన్మాదానికి రాజ్యాంగ యంత్రానికి చెందిన ఒక్కొక్క శాఖ ఎంతగా సహకరిస్తున్నదో చూస్తున్నాం. కేంద్ర ప్రభుత్వం, కోర్టులు, పోలీసులు, యావత్ పాలనా యంత్రాంగం హిందూత్వంతో లాలూచీ పడ్డాయి.

భారత న్యాయవ్యవస్థ గతంలో ఒకసారి ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ ప్రకటించినప్పుడు ఆమెకు పూర్తిగా తలొగ్గి ప్రజాస్వామ్య హక్కుల విధ్వంసానికి లజ్జాకరంగా సహకరించింది. ఇప్పుడు రెండవసారి ఆ పని చేసింది. హిందూ మతోన్మాదానికి పాదాక్రాంతం అయింది.

బాబ్రీ మసీదుపైన రామభక్తులు సృష్టించిన వివాదమే కృత్రిమమయినది. ఏమయితేనేం, వివాదమంటూ పుట్టిన తరువాత అది పరిష్కారమయ్యేంతవరకు ఆ స్థలానికి ఏమీ నష్టం కలగకుండ కాపాడడం అధికార యంత్రాంగం కర్తవ్యం, కోర్టుల కర్తవ్యం. ఈ సంగతి తెలియడానికి సుప్రీంకోర్టు న్యాయమూర్తుల వైదుష్యం అక్కరలేదు. ప్రతీ తాసీల్దారుకూ తెలుసు. అయినా మసీదును కాపాడడం పి.వి. నరసింహారావు ప్రభుత్వానికీ, భారత సుప్రీంకోర్టుకూ సాధ్యం కాలేదంటే దానిని చేతకానితనం అనాలా లేక లాలూచీగా గుర్తించాలా?

డిసెంబరు 6న కరసేవ చేస్తామని హిందూమత సంస్థలు ప్రకటించగానే బాబ్రీమసీదు చుట్టూ కర్ఫ్యూ పెట్టి ఎవ్వరినీ రానివ్వకుండ కట్టుదిట్టం చేయవలసి

ఉండింది. పోలీసుల అనుమతి లేకుండ ఏ పార్టీ అయినా సభలూ ప్రదర్శనలూ తలపెడితే ఆ పని చేయడం లేదా? దాని బదులు కరసేవకులను లక్షల సంఖ్యలో మసీదు దగ్గరకు రానివ్వడం ఎందుకు? రాకుండ నిరోధించమని అధికార యంత్రాంగాన్ని ఆదేశించకుండ, రాబోయే వాళ్లు భజనలే తప్ప ఇంకేమీ చేయరన్న హామీని సుప్రీంకోర్టు హిందూమత సంస్థల నుండి కోరడం ఎందుకు? చట్టమన్నా, కోర్టులన్నా తమకు గౌరవం లేదని పదే పదే ప్రకటించిన వాళ్ల అబద్ధపు వాంగ్మూలాలను సుప్రీంకోర్టు విశ్వసించడం ఎందుకు? మసీదు కూల్చివేసిన తరువాత అక్కడే దానిని పునర్నిర్మించమని ప్రభుత్వానికి ఆదేశం ఇవ్వకుండ, బాబరు రాకకు పూర్వం అక్కడ రామాలయం ఉండిందా లేదా అన్న నిజనిర్ధారణకు ఇప్పుడు సుప్రీంకోర్టు పూనుకోవడం ఎందుకు? 1947లో ఏ పవిత్ర స్థలం ఎట్లుండిందో దానిని అట్లే కాపాడాలనే బిల్లును కేంద్రప్రభుత్వం ఈ మధ్యనే ప్రతిపాదించింది. ఇప్పుడు ప్రభుత్వం, సుప్రీంకోర్టు అందుకు భిన్నంగా చరిత్రను తవ్వడం ఎందుకు? ఆర్టికల్ 143 క్రింద సుప్రీంకోర్టు చేయగల నిజనిర్ధారణ వర్తమాన విషయాల గురించే తప్ప అయిదు శతాబ్దాల నాటి చారిత్రక విషయాల గురించి కాదని నిపుణులు అంటున్న సంగతి సుప్రీంకోర్టుకు తెలియదా? రామాయణంలో చెప్పిన అయోధ్య ఈ అయోధ్యేననడానికి, బాబ్రీ మసీదున్నచోటనే రాముడు పుట్టాడనడానికి, బాబర్ రాకకు పూర్వం అక్కడొక రామాలయం ఉందనడానికి ఎటువంటి ఆధారాలు లేవని ప్రాచీన మధ్యయుగాల భారత చరిత్రలో నిష్ణాతులయినవారు అంటున్నారు. వాళ్లకంటే ఎక్కువ నైపుణ్యం తమకుందని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు భావిస్తున్నారా? ఒకవేళ ఉందనుకొన్నా ఇటువంటి విచారణలు ఎన్ని చేపడతారు? దేవాలయాలు కూల్చి మసీదులు కట్టిన సంగతి బాగా ప్రచారమయింది కానీ బౌద్ధజైన విహారాలనూ, స్థూపాలనూ, ఆలయాలనూ కూల్చి హైందవ ఆలయాలు కట్టిన సంగతి? శైవులు, వైష్ణవులు పరస్పరం ఆలయాలు కూల్చి తమ ఇష్టదైవం ఆలయాలు కట్టుకొన్న సంగతి? పోచమ్మ, మైసమ్మ గంగమ్మ, నూకాలమ్మ మొదలయిన గ్రామదేవతల పూజశిలలు అని పిలువబడే బండరాళ్లను ఆక్రమించుకుని వాటిని శివుడు రాముడు వెంకటేశ్వరుడు ఆంజనేయుడు దుర్గ మొదలయిన హైందవ దేవతల ఆలయాలుగా ఈనాటికీ మారుస్తున్న సంగతి? ఇప్పుడు ఈ చరిత్రనంతా తవ్వి ఏ దేవతకు ఆ ఆలయాన్ని తిరిగి ఇప్పించే భారీ ప్రణాళిక చేపట్టటం దేశ తక్షణ అవసరమా? చేపడితే హిందూత్వ వాదులు ఊరుకుంటారా? సుప్రీంకోర్టు ఒక్కొక్క పునాదినీ తవ్వి పాతగుళ్ల శకలాలు బయటికి తీస్తుందా?

అలహాబాద్ హైకోర్టు విన్యాసాలు మరీ చిత్రంగా ఉన్నాయి. కనీసం మసీదును కూల్చిన తరువాతైనా ఆ దుండగులను దూరం ఉంచవలసింది పోయి ఇప్పుడు అక్కడ ఒక రామమందిరాన్ని అలహాబాద్ హైకోర్టే తయారు చేయించింది. లేకపోతే, అక్కడ నమాజు చేసుకుంటామని ముస్లింలు అడిగితే అనుమతి నిరాకరించి రామవిగ్రహం దర్శనానికి మట్టుకు హైకోర్టు అనుమతి ఇవ్వడంలో అర్థం ఏమిటి? వివాదానికి ఇరుపక్షాలుగా ఉన్న వ్యక్తులలో ఒకరు దౌర్జన్యానికి దిగగానే వివాదంలో వాళ్లే గెలిచినట్లవుతుందనే తాజా న్యాయసూత్రాన్ని అలహాబాద్ హైకోర్టు ప్రతిపాదిస్తున్నదా? దీనిని కొత్తగా ప్రతిపాదించనవసరం లేదు. అటవీ న్యాయం అని దీనినే అంటారు. అటవీ న్యాయం నాగరిక సమాజానికి పనికి రాదనుకోవటం వల్లనే ఈ కోర్టులు పుట్టాయి. అటువంటి కోర్టు రాజ్యాంగం పేరిట అటవీ న్యాయాన్ని ప్రతిపాదించడం బహు గొప్ప విషయం. పైగా ఈ ఘనకార్యం చేయడానికి అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తులు అనుసరించిన పద్ధతిని కూడ ప్రజలు తెలుసుకోవాలి. తాము రాజ్యాంగం లోపల ఉన్న అధికరణాలనే కాక రాజ్యాంగం తొలి ప్రతి అట్టమీద జవహర్ లాల్ నెహ్రూ గారు బోస్ అనే చిత్రకారుని చేత గీయించిన చిత్రాలను కూడ (భారతీయ చరిత్రకూ, సంస్కృతికీ చెందినవి) లెక్కలోకి తీసుకున్నామనీ ఆ చిత్రాలలో రామునిది ఒకటి ఉందనీ ఇద్దరు జడ్జీల బెంచి వ్యాఖ్యానించింది! నల్లగౌన్లు తీసేసి ఖాకీ నిక్కర్లు వేసుకుని రాష్ట్రీయ స్వయం సేవక సంఘంలో చేరరాదా అని మేము ఆ న్యాయమూర్తులకు సలహా ఇస్తే అది కోర్టు ధిక్కారం అవుతుంది కాబోలు! అయినా ఆ చిత్రాలలో రాముడే కాదు, అక్బరు, టిప్పుసుల్తాన్ కూడా ఉన్నారంట. మరి వాళ్ల సంగతేమిటి?

డిసెంబర్ 6 తరువాత ప్రధానమంత్రి పి.వి. నరసింహారావు హిందూ మతతత్వ శక్తులపైన విరుచుకు పడుతున్నాడు. లౌకిక వాదానికి ప్రమాదం ఏర్పడిందనీ దానిని కాపాడడానికి ప్రజలంతా తన వెనుక రావాలనీ పిలుపు ఇస్తున్నాడు. మతతత్వ పార్టీలను తన ప్రభుత్వం సహించదనీ వాటిని నిషేధించి నిర్బంధించి అణచివేస్తామనీ హామీలు ఇస్తున్నాడు. కానీ నిజానికి పి.వి. ప్రభుత్వం తొలినుండి హిందూమత సంస్థలతో రాజీపడబట్టే పరిస్థితి ఇక్కడిదాకా వచ్చింది. దానికి సంజాయిషీ చెప్పుకోకుండా లౌకికవాదాన్ని కాపాడడానికి తనకు నిర్బంధ అధికారాలు కావాలని ఆయన కోరుకోవడంలో అర్థం లేదు. హిందూత్వవాదుల కమండలానికి పి.వి. నరసింహారావు లాఠీ జవాబు కాదు. రెండింటికీ ప్రజాతంత్ర చైతన్యమే జవాబు. మతసంస్థల నిషేధం ద్వారా, బిజెపి ప్రభుత్వాల రద్దు ద్వారా

పి.వి. తన పాపాలు కడిగేసుకొని గొప్ప లౌకికవాద సంరక్షకునిగా ముందుకు వస్తున్నాడు. పనిలో పనిగా రాజ్యాంగ యంత్రానికి ఉండే నియంతృత్వ అధికారాలకు ఆమోదం కోరుకుంటున్నాడు. నియంతృత్వ అధికారాలు లేకపోతే ప్రజాస్వామ్యాన్ని కాపాడలేమనే వికృతమయిన వాదన చేస్తున్నాడు. మతోన్మాదులపైన కోపంతో దీనికి మద్దతు ఇవ్వడం ప్రజలకే ప్రమాదకరం. అయినా, సాయిబాబా నుండి కంచి శంకరాచార్యుని దాకా ప్రతి స్వామీజీకి ప్రతి సన్యాసికి మొక్కి దేశ సమస్యలకు పరిష్కారం చెప్పమని అడుక్కుంటున్న పి.వి. నరసింహారావు లౌకికవాదాన్ని ఏమని కాపాడుతాడు? 'అణిచేస్తాన'ని కేకలు వేయడమే గానీ హిందూ మతతత్వాన్ని నిజంగా అణిచే ఉద్దేశ్యం ఉందా? బెయిలు అడగడానికి నిరాకరించిన అద్వానీ, జోషీలకు ప్రభుత్వమే రిమాండ్ పొడిగింపు అడగకుండ ఉచితంగా బెయిలు ప్రసాదించలేదా?

రాజ్యాంగ యంత్రం హిందూ మతోన్మాదానికి ఎంతగా లొంగిపోయిందనడానికి పోలీసుల పాత్ర కూడా చక్కటి తార్కాణం. డిసెంబర్ 6వ తేదీన మసీదును కూలుస్తున్న వారిని నిరోధించడానికి అక్కడ కాపలా పెట్టిన రాష్ట్ర పారా మిలిటరీ బలగమయిన పిఎసి జవాన్లు ప్రయత్నం కూడ చేయలేదు. గతంలో ఉత్తరప్రదేశ్‌లో మత ఘర్షణలు జరిగినప్పుడల్లా ముస్లింలను ఏరి చంపిన ఘనత సంపాదించిన ఈ బలగం మసీదును ఎందుకు కాపాడుతుంది? సిఆర్‌పిని కూడ అక్కడ కాపలా పెట్టారు గానీ కచ్చితమయిన ఆదేశాలు లేక వాళ్లు కూడ వేలు మెదపలేదు. విధ్వంసం యధేచ్ఛగా సాగిపోయింది. ప్రభుత్వం దుండగులను తరువాతయినా అరెస్టు చేయకుండ స్పెషల్ రైళ్లు వేసి ఇళ్లకు పంపించింది.

ఆ తరువాత మట్టుకు దేశవ్యాప్తంగా పోలీసులు విజృంభించారు. మసీదు కూల్చివేత పట్ల కోపోద్రిక్తులయిన ముస్లింలు ఎక్కడ బయటికి వచ్చినా వాళ్లమీద బలప్రయోగం చేసారు. వారం రోజులలో దేశవ్యాప్తంగా జరిగిన 'అల్లర్ల'లో పోలీసులు చేసిన అల్లరే ఎక్కువ. చనిపోయిన 1200 మందిలో అధికులు పోలీసు కాల్పులకు చనిపోయారు. వారిలో అధికులు ముస్లింలే. హైదరాబాద్‌లో నయితే భద్రతా దళాలు రోడ్డుమీద కవాతు చేస్తూ సందులలోకి తుపాకులు గురిపెట్టి విచక్షణా రహితంగా కాల్పులు జరిపి పసిపిల్లలను సహితం చంపారు. మొదటి దఫా అల్లర్లు చల్లారిన తరువాత రెండవ దఫా బొంబాయి, అహ్మదాబాద్‌లలో మళ్లీ ఘర్షణలు చెలరేగాయి. ఒక్క బొంబాయిలోనే 700 మందికి పైగా చనిపోయారు. ఈ ఘర్షణలలో ముస్లిం మతస్తులయిన కొందరు గూండా ముఠానాయకుల

ప్రమేయం కూడ ఉన్నప్పటికీ ప్రధానంగా మారణకాండకు పాల్పడింది శివసేన. సాయుధులయిన శివసేన మూకలు బొంబాయి మురికివాడలలో రక్తపాతం సృష్టిస్తుంటే పోలీసులకు కాళ్లు చేతులు ఆడలేదు. చూస్తూ ఊరుకున్నారు. బాధితులను పరామర్శించడానికి బొంబాయి వెళ్లిన ప్రధానమంత్రికి శివసేనను నిందించడానికి ధైర్యం చాలలేదు. రెండు వారాల పాటు శివసేన ఫాసిస్టు మూకలు సృష్టించిన బీభత్సాన్ని బొంబాయి నగరవాసులు ఎప్పటికీ మరచిపోరు. 'హిందూత్వం' ఇట్లాగే విజృంభిస్తూపోతే దేశం ఇంకెంత రక్తపాతాన్ని చూడనుందో. హిందూ మతోన్మాదం వల్ల రాగల దీర్ఘకాల ఫలితాలు అట్లాగుంచి సమీప భవిష్యత్తులో దేశం చాలా రక్తపాతాన్నీ మారణకాండనూ పాశవిక క్రూరత్వాన్నీ చవిచూడనుంది.

## ముగింపు

పెరుగుతున్న హిందూ మతోన్మాదం కేవలం మైనారిటీలకే ప్రమాదకారి కాదు. ప్రజాస్వామ్య విలువలకూ ప్రజాస్వామ్య హక్కులకూ ప్రమాదకారి. అది కేవలం ముస్లింలకూ, క్రైస్తవులకూ, సిక్కులకూ, ఇతర మైనారిటీలకూ మాత్రమే శత్రువు కాదు. పీడనకూ అణచివేతకూ గురయ్యే ప్రజలందరికీ శత్రువు. హిందూ ఫాసిజం మనల్ని కబళించే ముందే ప్రజాతంత్ర విలువలను సంరక్షించుకోవడం కోసం, అందులో భాగంగా లౌకికవాదాన్ని సంరక్షించుకోవడం కోసం ఐక్యమవుదాం. హిందూ మతోన్మాదానికి జవాబు మరొక మతోన్మాదం కాదు, ప్రభుత్వ నియంతృత్వమూ కాదు. ప్రజాతంత్ర చైతన్యమే దానికి జవాబు.

**ఎపిసిఎల్‌సి, ఒపిడిఆర్ బుక్‌లెట్‌గా వచ్చింది**

**1993**

# ఒకరి దేశభక్తి ఒకరికి ప్రాణసంకటం

ఈ దేశంలో ముస్లింలను ఎక్కడుంచాలో అక్కడుంచడంలో దేశభక్తులంతా కృతకృత్యులయ్యారని ఇటీవలి పరిణామాలను బట్టి తెలుస్తుంది.

'కార్గిల్ యుద్ధం' మొదలయిన తరువాత ఢిల్లీ నుండి లక్నో దాకా, లక్నో నుండి విజయవాడ దాకా అనేక పట్టణాల్లో ముస్లింలు సభలలోను, సమావేశాలలోను పాకిస్తాన్ మీద దుమ్మెత్తిపోస్తూ, కార్గిల్‌కు పోయి పాకిస్తాన్‌పైన పోరాడడానికి తాము సిద్ధమని ప్రకటిస్తూ తీర్మానాలు చేయడం, వాటిని ప్రకటించడం జరిగింది.

ఇదొక నాగరిక దేశమన్న అభిప్రాయం ఉన్నవాళ్లెవరైనా ఈ వార్తలు చదివి కొంచెం సిగ్గుపడి ఉండాలి. అంటే ముస్లింలు పాకిస్తాన్‌కు అనుకూలంగానే ఉండాలనీ, వారిలో 'దేశభక్తి' ఉండకూడదనీ కాదు. కానీ బలవంతంగా తాము పాకిస్తాన్‌కు వ్యతిరేకం అని ప్రకటించుకునే పరిస్థితి ఉండకూడదు. ప్రకటించుకోకపోతే ఏమనుకుంటారో అని భయపడే పరిస్థితి ఉండకూడదు. 'దేశభక్తి'కి ప్రస్తుతం చలామణిలో ఉన్న సరిహద్దు భక్తి, చిత్రపటం భక్తి అనే నిర్వచనాన్ని బలవంతంగా అంగీకరించవలసిన పరిస్థితి ఉండకూడదు. ఇష్టపూర్వకంగా ఎవరైనా అదే నిర్వచనాన్ని ఆమోదిస్తే అది వేరే సంగతి.

ఈ పరిస్థితిని ముస్లింలకు కల్పించడంలో 1990వ దశకపు హైందవ సమాజం విజయం సాధించిందనడంలో సందేహం లేదు. బిజెపికి రేపు రాబోయే ఎన్నికలలో ఓట్లు పెరుగుతాయా తగ్గుతాయా అని మాత్రమే తర్కించి ఊరుకునే వాళ్లకు సామాజిక జీవితం మీద సంఘ్‌పరివార్ నెమ్మదిగా పెంచుకుంటున్న పట్టు

కనిపించకుండా పోయే ప్రమాదం ఉంది. లౌకికవాదానికీ ప్రజాస్వామ్యానికీ అక్కడికంటే బహుశా ఇక్కడే ఎక్కువ ప్రమాదం ఉంది.

పాపం కార్గిల్ ముస్లింలు అందరికంటే ఎక్కువగా ఈ చేదు అనుభవాన్ని రుచిచూస్తున్నారు. కార్గిల్ గురించి ఈ దేశంలో అందరూ ప్రదర్శిస్తున్న ఆవేశపు వేడి కార్గిల్‌వాసులకు కనీసం వెచ్చటి సానుభూతి కూడా ఇవ్వలేకపోయింది. ఎందుకంటే మన ఆవేశమంతా కార్గిల్ సరిహద్దు గురించే గానీ కార్గిల్‌లో బతికే మనుషుల గురించి కాదు గదా.

కార్గిల్ జిల్లా జనాభా 90 వేలు మాత్రమే. అది ఎత్తైన శీతల ఎడారి. అంతకంటే ఎక్కువ జనాభాను ఆ నేల పోషించలేదు. ఇప్పుడు ఆ 90 వేల మందిలో 35 వేల మంది శరణార్థులయ్యారంటే 'కార్గిల్ యుద్ధాన్ని ఇంకా ఇంకా కొనసాగిద్దాం' అంటూ మనమంతా ఆవేశపడుతున్న ఆ సరిహద్దు గట్టుతగాదా గట్టుకు ఇటూ అటూ నివసించే మనుషుల జీవితాలను ఎంతగా అల్లకల్లోలం చేస్తున్నదో అర్థం అవుతుంది.

ఈ 35 వేల మంది (వారితో పాటు వారి పశువులు, ఇతర చరాస్తి) ఎక్కడికి పోవాలి? కాశ్మీర్ లోయలోకి పోలేరు. కార్గిల్‌ను కాశ్మీర్‌తో కలిపే రహదారి మీదనే కదా 'టైగర్ హిల్' పోరాటం సాగుతున్నది. కాబట్టి దక్షిణాన ఉన్న లే జిల్లాలోకి పోవాలి. లదాఖ్‌లోని రెండు జిల్లాలలో కార్గిల్ ఒకటి కాగా లే రెండవది. కార్గిల్‌వాసులు అధికంగా షియా ముస్లింలు కాగా లే వాసులు అధికంగా బౌద్ధులు. జాతి రీత్యా ఇద్దరూ దార్ద్ జాతీయులే. భాషలో, జాతిలో, సంస్కృతిలో, రూపురేఖలలో వారొకటే. ఇద్దరూ కాశ్మీరీలకన్నా, జమ్మూ వాసులకన్నా టిబెట్‌కు సన్నిహితులు.

కానీ ఈ ఉపఖండాన్ని పీడిస్తున్న జాడ్యం లదాఖ్‌కు కూడ పట్టుకుంది. కార్గిల్ వదిలిపెట్టి లే ప్రాంతానికి శరణార్థులుగా వలస వస్తున్న కార్గిల్ వాసులకు లే ప్రాంతంలో అనుమానం, అవిశ్వాసం ఎదురయ్యాయి. ఈ శరణార్థులు 'అవాంఛనీయమైన' వ్యక్తులని, 'సందేహాస్పదమైన' వ్యక్తులని (ఒక్కమాటలో చెప్పాలంటే పాకిస్తాన్ ఏజెంట్లని) లే ప్రాంతంలోని ప్రముఖులు మొదటి రోజు నుండి ఆరోపణలు చేస్తున్నారు. వాళ్లను ఎక్కువ కాలం లే ప్రాంతంలో ఉండనీయకూడదని, త్వరగా వెనక్కి పంపించి వేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. దానివల్ల జమ్మూకాశ్మీర్ రాష్ట్ర ప్రభుత్వం ఈ శరణార్థులకు పోలీసు రక్షణ కల్పించవలసి వచ్చింది.

లే ప్రాంత వాసులు వ్యక్తపరుస్తున్న ఈ అన్యాయమైన వైఖరి మానవతకే కాదు, బౌద్ధమతం స్ఫూర్తికి కూడ దూరం. లే వాసులందరూ ఇంత సంకుచితంగా ఆలోచిస్తున్నారని ఆరోపించడం భావ్యం కాదు గానీ ఆ ఆలోచనారీతి కార్గిల్ ముస్లింలకు తీవ్రంగా ఆందోళన కలిగించే మోతాదులోనయితే ఉంది.

ఒక్క కార్గిల్‌లోనే కాదు, మొత్తంగా సరిహద్దు అంతటా ఇదే పరిస్థితి. యుద్ధం వస్తున్నదంటే సహజంగానే సరిహద్దువాసులు – ఏ మతానికి చెందినవారైనా భయపడతారు. యుద్ధంలో వాళ్లకు మన తెలుగు దినపత్రికలు ఘనంగా కొనియాడుతున్న వీరమరణమూ ఆత్మబలిదానమూ కనిపించదు. వట్టి చావు కనిపిస్తుంది. మనం సినిమాలో విలన్‌ను హీరో తంతుంటే ఎసి హాల్‌లో కూర్చుని 'ఇంకా తన్ను! ఇంకా తన్ను!' అని ప్రోత్సహించే స్థితిలో ఉన్న అదృష్టవంతులం. పైగా దానికి దేశభక్తి అని అందమైన పేరు కూడ పెట్టుకున్నాం. సరిహద్దువాసులు యుద్ధంలో నిజంగా తుపాకి గుళ్ల దెబ్బలు రుచిచూసే దురదృష్టవంతులు.

వారిలోని ముస్లింలు తమ దురదృష్టానికి దేశభక్తి అని కూడ పేరుపెట్టుకోలేరు. దేశభక్తి కూడ నిత్యం రుజువుచేసుకోవలసిన ఒక భారమే వారికి. పాకిస్తాన్‌తో ఎప్పుడు యుద్ధం వచ్చినా సరిహద్దు గ్రామాలలోని ముస్లింలపైన సైన్యం నిఘా పెరుగుతుంది. పట్టుకుపోయి చిత్రహింసలు పెట్టిన ఘటనలనేకం. కాబట్టి మొత్తంగా సరిహద్దు ప్రాంతాలకు చెందిన ముస్లింలు సరిహద్దుకు దూరంగా దేశం లోపలి భాగంలో బంధువులున్న గ్రామాలకు వలసపోతున్నారు. ఇది కాశ్మీర్‌లోనే కాదు, గుజరాత్, రాజస్థాన్‌ల నుండి కార్గిల్ దాకా సరిహద్దు ప్రాంతమంతటా జరుగుతున్నది.

'కార్గిల్ యుద్ధం'లో ఎవ్వరికీ పట్టని ట్రాజెడీలలో ఇదొకటి. ఈ ట్రాజెడీ ప్రతిధ్వనులు దేశం లోపల కూడ వినవస్తున్నాయి. ఈ యుద్ధం అనవసరమనీ, పాకిస్తాన్‌ను ఒక భూతం చేసి చూపించడం అర్థరహితమనీ నమ్మినా ఆ మాట అనడం ఈ దేశంలో ముస్లింలకు ఈ రోజు సులభం కాదు. అభ్యుదయ సంఘాలలోని ముస్లింలు సహితం ఈ మాటలు తమ 'హిందూ కామ్రేడ్ల' చేత అనిపించడం మేలనుకునే స్థితికి వచ్చిందంటే పరిస్థితి ఎంతగా దిగజారిందో అర్థం చేసుకోవచ్చు.

మేరా భారత్ సహీసే మహాన్!

**ప్రజాతంత్ర**

**11 జూలై 1999**

# బలవంతపు మౌనం

**ఆ**త్మాభిమానంగల ముస్లింగా బతకడం ఈ రోజు చాలా కష్టమైపోయింది. మరీ ముఖ్యంగా భారతదేశంలో..

ప్రపంచంలో ఇండోనేషియా తర్వాత అత్యధిక సంఖ్యలో ముస్లింలు నివసించే భారత్‌లో ఈ పరిస్థితి వుండడం చాలా దారుణం... బాధాకరం.

గత శుక్రవారం (అక్టోబర్ 12) హైదరాబాద్‌లోని మక్కా మసీదు సమీపంలో జరిగిన 'అల్లరి'ని పరిశీలిస్తే ఈ విషయం కొంత వరకు అర్థమవుతుంది. ఆఫ్ఘనిస్తాన్‌పైన అమెరికా చేస్తున్న యుద్ధాన్ని నిరసిస్తూ కొందరు ముస్లిం యువకులు ఆ రోజు మసీదులో ప్రార్థనలు ముగిసిన తర్వాత బయటికి వస్తూ పోలీసుల పైన రాళ్ల వర్షం కురిపించారనీ, పోలీసులు వారి దాడి నుండి తమను తాము కాపాడుకోవడానికి బాష్పవాయువు, లాఠీలు ప్రయోగించాల్సి వచ్చిందనీ నగర పోలీసులు వివరించారు.

అందరిలాగ వీళ్లు కూడా శాంతియుతంగా ఊరేగింపు చేయవచ్చు కదా. నిరసన తెల్పడానికి రాళ్లు వేయడమే మార్గమా అని చాలామంది ఆ వార్త చదవగానే అనుకున్నారు. ఎవరి గురించో ఎందుకు, నేనే అనుకున్నాను.

ఆ ప్రశ్నే పాతబస్తీ ముస్లింలను అడిగాను. 'మొన్ననే తొమ్మిది వామపక్ష పార్టీలు నగరంలో ఇదే విషయం మీద ఊరేగింపు చేశారు. మీరూ ఆ పనే చేసి ఉండవచ్చును కదా' అన్నాను. ఈ ప్రశ్న అడిగింది శాంతియుత నిరసన మీద నమ్మకం లేని 'తీవ్రవాద ముస్లిం'లను కాదు. శాంతియుతంగా స్వచ్ఛంద సంస్థలు నడుపుకుంటున్న వారినే అడిగాను. దానికి వారి జవాబేమిటంటే, 'వామపక్షాలకు

ఊరేగింపు తీయడానికి పోలీసులు అనుమతి ఇస్తారు కానీ ఏ ముస్లిం సంస్థకూ ఇవ్వరు' అని.

ఇది నిజమని చార్మినార్ పోలీసులు ఒప్పుకుంటున్నారు. 'వాళ్లకు అనుమతి ఇస్తే హింస జరుగుతుంది కాబట్టి ఇవ్వం' అంటున్నారు. ఇక్కడ వాళ్లు అంటే ముస్లింలు. 'ముస్లిం' అనేది ఆ మతాన్ని విశ్వసించే వారందరికీ టోకుగా వర్తించే మాట. అందులో శాంతిని కాంక్షించేవారు, అక్కరలేదనుకునేవారు, ప్రజాస్వామ్యాన్ని విశ్వసించేవారు, తిరస్కరించే వారు, తాలిబన్ బాపతు పార్టీలను అసహ్యించుకునే వారు, వాటిని ప్రేమించే వారు అనే వర్గీకరణ ఏదీ లేదు. అందరూ ఒకటే. 'ముస్లిం' అనేది ఒక అఖండమైన తిట్టుమాట.

'ఊరేగింపులో హింస జరగనివ్వమని వాళ్లు మమ్మల్ని నమ్మించగలిగితే మేము పర్మిషన్ ఎందుకు ఇవ్వం?' అని నగర పోలీసులు అనొచ్చు. అంటే ఆఫ్ఘనిస్తాన్ మీద అమెరికా చేస్తున్న అన్యాయమైన యుద్ధాన్ని నిరసించే హక్కు పొందడానికి ముస్లింలు ముందు తమ సచ్ఛీలతను రుజువు చేసుకోవాలి. తాము లాడెన్ అభిమానులు కాదనీ, శాంతి కాముకులమనీ రుజువు చేసుకోవాలి. ఒకనాడు హింస చేసినందుకు కాదు, కేవలం ముస్లింలయినందుకు రుజువు చేసుకోవాలి. ఒకప్పుడు ఊరేగింపులో హింస చేసిన సంస్థ రెండవసారి పర్మిషన్ కోసం అర్జీ పెట్టుకుంటే మీరు ఈసారి కూడ అదే పని చేయరన్న నమ్మకమేమిటి అని పోలీసులు శంకిస్తే అందులో కొంచెం అర్థం వుంది. కానీ కిందటిసారి ఒక ముస్లిం సంస్థ తీసిన ఊరేగింపులో హింస జరిగింది కాబట్టి ఈసారి ముస్లింలెవరు ఊరేగింపు తీస్తామన్నా మేము శంకిస్తాం అనడం సహేతుకం కాదు.

నిజానికి మొన్నటి 12వ తేదీన నిరసన తెలుపుతూ మక్కా మసీదు నుండి బయటికొచ్చినవారు వెంటనే పోలీసులపైన రాళ్లు వేయలేదు. 'అల్లా హెూ అక్బర్' అంటూ నినాదాలిస్తూ చార్మినార్ వైపు పోబోయారు. అక్కడ అప్పటికే వందల సంఖ్యలో సాయుధ పోలీసులున్నారు. స్థానిక పోలీసులు నినాదాలిస్తున్న యువకులను క్రమబద్ధంగా ఊరేగింపు చేయమని ఆదేశించి, వారు ఉద్రేకంలో హింసకు పాల్పడకుండా చూసేందుకు బందోబస్తు ఏర్పాటు చేసి వుండవచ్చును. ఆ పని ఎందుకు చేయలేదని పోలీసులనడిగితే, 'వాళ్లకు శాంతియుతంగా ఊరేగింపు చేసే ఉద్దేశం లేదని మాకు అర్థం అయింది' అంటున్నారు.

కాబట్టి వాళ్ళను పోలీసులు ముందుకు పోనీయకుండా మసీదులోకి నెట్టారు. వాళ్లు పోలీసుల మీద మొదట చెప్పులు విసిరారు. మసీదు ఆవరణలోకి

ప్రవేశించిన తర్వాత అక్కడ వున్న షాబాద్ బండలు పగులగొట్టి ఆ రాళ్ళతో పోలీసులను కొట్టారు. పోలీసులు ఆ రాళ్లు తిరిగి విసరడమే కాక లాఠీలతో కొట్టారు. బాష్పవాయువు ప్రయోగించారు.

ఊరేగింపును నియంత్రించే అధికారం వుండి, దండిగా అవకాశం వుండి కూడా దానిని అడ్డుకోవడమే సరైనదని నమ్మే పోలీసు వ్యవస్థ వున్న చోట పాతబస్తీకి చెందిన ఒక సగటు ముస్లిం ఏం చేయాలి?

హింసను నమ్మే వాళ్ళు కాదు, నమ్మని వాళ్ళు ఏం చేయాలి? ఏ 'అతివాదాన్న'యితే మొగ్గలోనే తుంచేయాలని పోలీసులు కంకణం కట్టుకున్నారో ఆ అతివాదం ఒక్కటే ఈ పోలీసు పాలనలో మనగలదు. వేరేదేదీ మనలేదు. వేరే విశ్వాసాలున్న వాళ్లు ఏం చేయాలి?

ఈ వాతావరణంలో (ఇది ఒక్క హైద్రాబాద్ పాతబస్తీకి మాత్రమే పరిమితం కాలేదు) ముస్లింలందరూ తాము 'అతివాదులు' కాదనీ, తమకు బిన్‌లాడెన్ అన్నా, తాలిబన్ అన్నా సదభిప్రాయం లేదనీ పదేపదే రుజువు చేసుకుంటూ బతకాలి. నిజంగానే వారంటే సదభిప్రాయం లేని వారికి కూడా ఈ ఒత్తిడి దుర్భరంగా వుంటుంది. అంతేకాక, తాలిబన్‌లంటే సదభిప్రాయం లేకపోయినా వారిని ఏ విధంగా చూస్తాం, ఏ విధంగా అర్థం చేసుకుంటాం అనే ప్రశ్నలకు నిర్భయంగా జవాబులు వెతికే స్వేచ్ఛ కూడా ముస్లింలకు ఈ వాతావరణం నిరాకరిస్తుంది. పాశ్చాత్య ప్రజాతంత్రవాదులూ, హిందూ లౌకిక వాదులూ చేసిన వ్యాఖ్యలను స్వీకరించే ముస్లింలే 'మంచి ముస్లిం'లు... వేరే కోణం నుంచి చూసే ప్రయత్నం చేయడం అనుమానాన్నీ శంకనూ ఆహ్వానించే పని.

ఇస్లాం అంటేనే తీవ్రవాదం అనే అభిప్రాయం కలిగించే పద్ధతిలో టివి చానెల్స్ దృశ్యాలు ప్రసారం చేయటం చూస్తున్నాం. సెప్టెంబర్ 11 తర్వాత పాకిస్తాన్, పాలస్తీనా, ఇండోనేషియా తదితర దేశాలు లేక ప్రాంతాలకు సంబంధించి ఒకే ఒక దృశ్యం టివిలో చూస్తున్నాం. బిన్‌లాడెన్ చిత్రపటం చేతపట్టుకొని మతపరమైన నినాదాలిస్తూ అమెరికాను తిట్టిపోస్తున్న ప్రదర్శనకారుల దృశ్యం అది.

ఈ చిత్రం తప్ప ఆ దేశాలలో వేరే వాస్తవమేదీ లేదన్న అభిప్రాయం బలంగా కలిగించడం ఈ ప్రసార దాడి పర్యవసానాలలో ఒకటి కాగా, ఈ చిత్రానికి 'మతోన్మాదం' అన్న అర్థం తప్ప వేరే భావమేదీ లేదన్న అభిప్రాయం కలిగించటం

రెండవది. వేరే భావం వుందని వివరించే ప్రయత్నం చేయటం ముస్లిమేతరులకు కష్టసాధ్యమైనా ఆ అవకాశం లేకపోలేదు. కానీ ముస్లింలకు ఆ అనుమతి లేదు. స్వతహాగా మతవాదులన్న అభాండాన్ని మోస్తూ బతికే వారు అటువంటి సాహసం చేయలేరు. వారు 'ముస్లిం తీవ్రవాదాన్ని' గొంతు చించుకొని ఖండిస్తూనే వుండాలి, లేదా 'ముస్లిం తీవ్రవాదుల'లో కలిసి పోయారనిపించుకోవాలి.

'ముస్లిం దేశాలు', 'ముస్లిం తీవ్రవాదం' అన్న మాటలు ఎంత విరివిగా వాడటం జరుగుతున్నదంటే ఈ మాటలు ఎంతవరకు అర్థవంతమైనవి అని ఆలోచిస్తున్న వారెవరూ లేరు. మెజార్టీ ప్రజల నిర్ణయం మేరకు ఇస్లామిక్ మత రాజ్యాన్ని నెలకొల్పిన దేశాన్ని ముస్లిం దేశం లేక ముస్లిం రాజ్యం అనడంలో అర్థం వుండవచ్చును. కాని ముస్లింలు మెజార్టీగా నివసించే దేశాలన్నిటినీ ముస్లిం దేశాలు అనడంలో అర్థమేమీ లేదు. మత రాజ్యాలు నెలకొల్పిన దేశాలు అందులో కొన్నే. అవి కూడా మెజార్టీ ప్రజల కోరిక మేరకు నెలకొల్పినవా అంటే అనుమానమే. పాకిస్తాన్, సౌదీ అరేబియా వంటి దేశాలలో నెలకొల్పిన మతరాజ్యాలపట్ల ప్రజలలో చాలామందికి వ్యతిరేకత లేకపోవచ్చును కానీ వారిలో ప్రగాఢమైన కోరిక వుండిందనీ, ఆ కోరికమేరకే నెలకొల్పారనీ నమ్మడానికి ఆధారాలేవీ లేవు. పాకిస్తాన్ రాజకీయాలలో మతరాజ్య స్థాపనను అజెండాలో పెట్టుకున్న ఏకైక పార్టీ పాకిస్తాన్ ముస్లిం లీగ్. ఆ పార్టీకి ఎన్నికలలో ఏ రోజూ పది శాతం మించి ఓట్లు రాలేదు. పాకిస్తాన్ రాజకీయాలలో ప్రజలు అధిక సంఖ్యలో ఉత్సాహంగా స్పందించిన నినాదం జిహాద్ కాదు, కాశ్మీర్ కూడా కాదు. జుల్ఫికార్ ఆలీ భుట్టో ఇచ్చిన 'రోటీ కపడా ఔర్ మకాన్' (కూడు, గుడ్డ, గూడు) అన్న నినాదం కదిలించినట్టు పాకిస్తాన్ ప్రజలను వేరే ఏ నినాదం కదిలించలేదని పాకిస్తాన్ రాజకీయాలను అధ్యయనం చేసిన వారు అంటారు.

ఇంక ఇండోనేషియా, బంగ్లాదేశ్, అల్జీరియా, టర్కీ, ఈజిప్ట్ వంటి దేశాలలోనైతే మతరాజ్య స్థాపన ప్రయత్నాన్ని ఆ దేశంలోనే చాలామంది గట్టిగా వ్యతిరేకిస్తున్నారు. వ్యతిరేకిస్తున్న వారు అత్యధికంగా ముస్లింలే, తమ మతాన్ని ఆచరించే వారే.

ఈ దేశాలన్నిటినీ కట్టగట్టి 'ముస్లిం దేశాలు' అనడంలో అర్థం ఏముంది? ఇండియాను 'హిందూ దేశం' అని పిలిస్తే మనకు (సంఘ్ పరివార్‌కు చెందినవారము కాకపోతే) అభ్యంతరమనిపిస్తుంది. దానికి అనేక కారణాలు చెప్పగలం. కానీ మొరాకో నుండి ఇండోనేషియా దాకా డజన్ల సంఖ్యలో దేశాలను

'ముస్లిం దేశాలు' అని నిస్సంకోచంగా అనగలుగుతున్నామంటే కారణం 'ముస్లిం' అనే మాట భిన్నత్వానికీ వైవిధ్యానికీ తావు ఇవ్వని అఖండ పదార్థమన్న దురభిప్రాయమే. ఇప్పుడు ఆఫ్ఘనిస్తాన్ గురించి మాట్లాడదల్చుకున్న ఈ ముస్లింలు ఈ మూసలో నుంచే మాట్లాడవలసి వుంటుంది. తమ గురించి ఇతరులకుండే మూస అభిప్రాయాల పరిధిలోనే మాట్లాడవలసి వుంటుంది. అందుకు భిన్నంగా మాట్లాడినా ఆ మూసలోనే వారి మాటలను ప్రపంచం అర్థం చేసుకుంటోంది. 'నువ్వు బిన్‌లాడెన్ పక్షమా, లేకపోతే అమెరికా నిర్వచించే లౌకిక వాదం పక్షమా? అని ప్రపంచం వారిని నిలదీస్తుంది.

'ముస్లిం తీవ్రవాదం' అన్న ప్రయోగం కూడా ఇటువంటిదే. బల ప్రయోగంతో ప్రపంచంలో ఇస్లాంను వ్యాపింప చేయాలన్న సంకల్పంతో ఆయుధాలు పట్టుకున్న గుంపులకు ఈ పేరు పెట్టడంలో అర్థం వుంది. కానీ పాలస్తీనా నుండి కాశ్మీర్ దాకా, కాశ్మీర్ నుండి చెచెన్యా దాకా 'ముస్లిం తీవ్రవాదులు' అని పిలువబడుతున్న సాయుధ బృందాలలో కొన్ని మాత్రమే ఈ కోవకు చెందినవి. 50 ఏళ్ళ పాలస్తీనా పోరాటంలో మతవాదం కంటే అరబ్బు జాతీయవాదానిదే పైచేయి. కాశ్మీర్‌లోనూ అంతే. వాళ్లు మతంరీత్యా ముస్లింలు కాబట్టి ప్రపంచం వారి మిలిటెన్సీకి ముస్లిం తీవ్రవాదం అని పేరు పెట్టింది. ముస్లిం అన్న మాట కనపడితే చాలు ఇవేమీ ఆలోచించనక్కర లేదని ప్రపంచం భావిస్తోంది.

దీనితో తలపడే శక్తి లేక, ఓపిక లేక భిన్నమైన ఆలోచనలు గల ముస్లిం మేధావులూ, రాజకీయవేత్తలూ సాధారణ పౌరులూ మౌనంగా వుండిపోయే పరిస్థితి ఏర్పడింది. మొన్నటి 12వ తేదీ ఘటనల గురించి పాతబస్తీలో భిన్నమైన అభిప్రాయాలు లేకపోలేదు. కానీ బయటికి మాట్లిడింది 'జిహాద్-ఒ-షహాదత్' అనే పేరు గల బిన్‌లాడెన్ అభిమానుల సంస్థ ఒక్కటే. ఈ బలవంతపు మౌనం నుండి బయటపడడానికి కావలసిన బలాన్ని సాధారణ ముస్లిం ప్రజానీకానికి కల్పించడానికి సహాయపడడం ప్రజాతంత్రవాదులు ఈ రోజు చేయగల ముఖ్యమైన పనులలో ఒకటేమో?

**ప్రజాతంత్ర**

**21 అక్టోబర్ 2001**

# హిందూత్వవాదుల ద్వేషం ఎవరి మీద?

**మ**హమ్మద్ ఇల్యాస్ హుసేన్ సిభాయి గుజరాత్‌లోని పంచ్‌మహల్స్ జిల్లాలోని లూనావాడ్ గ్రామ నివాసి. మార్చి నెలలో జరిగిన నరమేధంలో విపరీతంగా హింస చవిచూసిన గ్రామాలలో లూనావాడ్ ఒకటి. ఆ ఊరి పరిసరాలలో 15 మసీదులను హిందూత్వవాద మూకలు ధ్వంసం చేశాయి. ఆ ఊరిలోని శరణార్థుల శిబిరంలో పరిసర గ్రామాల ముస్లింలు 1200 మంది ఉన్నారు. ఆ ఊరి కబ్రస్తాన్‌లో 14 శవాలను పూడ్చారు.



మహమ్మద్ సిభాయి వృత్తిరీత్యా లెక్కల పంతులు. అయితే అతనికి సంస్కృతమంటే చాలా ఇష్టం. సంస్కృతంలో 'ఆచార్య' పట్టా పొందాడు. సంస్కృతం పాఠాలు బోధించేవాడు. హిందూ పురాణాలు, ఇతర సంస్కృత సాహిత్య గ్రంథాలతో నిండిన గ్రంథాలయాన్ని కూడా నెలకొల్పాడు. సులభంగా దొరకని అనేక ప్రాచీన సంస్కృత గ్రంథాలు అందులో ఉండేవి.

ఈ సంగతి లూనావాడ్‌లోనే కాక ఆ ప్రాంతమంతటా కూడ అందరికీ తెలుసును. అయితే ముస్లింలకు సంబంధించిన ఏ నివాసాన్నీ నిర్మాణాన్నీ ఉండనివ్వొద్దని నిర్ణయించుకున్న సంఘ్‌పరివార్ మూకలు మహమ్మద్ సిభాయి ఇంటిపైన కూడా దాడి చేశారు. అతను తప్పించుకొని పారిపోగా, అతని సంస్కృత గ్రంథాలయాన్ని అవశేషం లేకుండా తగలబెట్టారు.

అహమ్మదాబాద్‌కు చెందిన ఎహసాన్ జాఫ్రి ఒకప్పుడు సిపిఐలోనూ ఆ తరువాత సిపిఐ(ఎం)లోనూ ఉన్నాడు. 1969లో ఆ నగరంలో పెద్దఎత్తున మతఘర్షణలు జరిగిన తరువాత తన రక్షణ కోసం కాంగ్రెస్ పార్టీలో చేరాడు.

అయితే కమ్యూనిస్టు అన్న ముద్ర అతనిని వదలలేదు. వదిలించుకోవాలని అతనూ అనుకోలేదు. వామపక్షభావాలు గల లౌకికవాదిగానే ఉండిపోయాడు. సనాతన ముస్లింలు అతనిని అనుమానంగానే చూశారు. 'ముస్లింలు సనాతనవాదుల పిడికిట్లో నుంచి బయటపడి లౌకిక రాజకీయాలలోకి రావాలన్నదే మన కోరికయితే జాఫ్రీని మించిన నాయకుడు దొరకడు' అని గుజరాత్‌లో ఇప్పటికింకా మతిస్థిమితం కోల్పోనివారంతా అంటారు.

ఫిబ్రవరి 28న మాజీ ఎం.పి. అయిన జాఫ్రిని సంఘ్‌పరివార్ మూకలు అతి క్రూరంగా చంపారు. చమన్‌పురాలోని గుల్బర్గ్ సొసైటీలోని అతని ఇంటిపైన ఆ రోజు పెద్ద గుంపు దాడి చేసింది. అతనిని బయటకు లాగి చేతి వేళ్లు తెగనరికి బట్టలు ఊడదీసి గుండ్రంగా పరుగెత్తించి కత్తులతో నరికి రోడ్డు మీద ఈడ్చుకుపోయి మంటలలో పడేసి హతమార్చారు. అతనెవరో, అతని ఆలోచనలెట్లాంటివో అతనిని హతమార్చిన వారికి బాగానే తెలుసు. అతను కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మాజీ పార్లమెంటు సభ్యుడు. అతనిని చంపిన వారు స్థానిక సంఘ్‌పరివార్ కార్యకర్తలు. అపరిచితులు కారు, అతని గురించి తెలియనివారు కారు.

జె.ఎస్. బందూక్‌వాలా బరోడా నగరానికి చెందిన మేధావి. పి.యు.సి.ఎల్ (పౌరహక్కుల ప్రజాసంఘం) గుజరాత్ రాష్ట్ర కమిటీ సభ్యుడు. చాలా చదువుకున్నవాడు, ఆధునికుడు, లౌకికవాది. దేశంలో మతఘర్షణల వాతావరణం తగ్గడానికి ఉపయోగపడేటట్టయితే ముస్లింలు బాబ్రీమసీదును వదులుకోవడమే ఉచితం అని బహిరంగంగా ప్రకటించిన వ్యక్తి. ప్రకటించి బాబ్రీమసీదు యాక్షన్ కమిటీకి కోపం తెప్పించిన వ్యక్తి. ఫిబ్రవరి 28న అతని ఇంటి బయట ఉన్న అతని కారును సంఘ్‌పరివార్ మూకలు తగలబెట్టగా, బందూక్‌వాలా స్థానిక బిజెపి కార్పొరేటర్ ఇంటికి వెళ్ళి 'నేనెటువంటివాడినో మీకు తెలుసు – ఇదేం పని?' అని అడిగాడు. 'అప్పుడే ఏం చూశావు – అసలు సంగతి రేపు ఉంది. తప్పించుకోగలిగితే తప్పించుకో' అని ఆ మహానుభావుడు అన్నాడు. తన భావాల గురించి, వ్యక్తిత్వాన్ని గురించి ఆత్మవిశ్వాసం ఉన్న బందూక్‌వాలా ఎక్కడికీ పోలేదు. అయితే మరుసటి రోజు ఆయన బెదిరించినట్లుగానే తల్వార్లు, త్రిశూలాలతో పెద్ద గుంపు అతని ఇంటిమీదికి వచ్చింది. అతనూ, అతని భార్యా, కూతురూ తలుపులు లోపలినుండి గడియబెట్టి పెరటిగోడ దూకి పక్కన ఉన్న హిందూ కుటుంబం ఇంట్లోకి పోయారు. వాళ్లు లైట్లు ఆపేసి ఎవరూ లేనట్లు

అభిప్రాయం కలిగించి ఆ రాత్రంతా బిక్కుబిక్కుమంటూ గడిపారు. బందూక్‌వాలా ఇంటిమీద దాడిచేసిన మూక కొన్ని గంటలసేపు ఆ ఇంటిని లూటీచేసి ఆ తరువాత మొత్తం తగలబెట్టి బుగ్గిచేసి వెళ్ళిపోయారు. ఆ దెబ్బతో భారత ప్రజాస్వామ్యంమీద విశ్వాసం కోల్పోయిన బందూక్‌వాలా ఇండియా వదిలిపెట్టి సకుటుంబంగా వెళ్లిపోయాడు – పాకిస్తాన్‌కు కాదు అమెరికాకు.

సబర్‌కాంటా జిల్లాలో రామాయణ్–మహాభారత్ అన్న పేరుగల ముస్లిం శరణార్థుల శిబిరం ఒకటి ఉంది. ముస్లింల శిబిరానికి అదేం పేరని ఆశ్చర్యపోతున్నారా? ఆ శిబిరంలోని శరణార్థులు రెండు గ్రామాలకు చెందినవారు. అవి రెండూ ముస్లింలు అత్యధికంగా నివసించే గ్రామాలు. ఒకదాని పేరు రామాయణ్, ఒకదాని పేరు మహాభారత్. ఈ పేర్ల వెనుక ఒక కథ ఉంది. ఇవి రెండూ ప్రాజెక్టు నిర్వాసిత గ్రామాలు. ఒక ప్రాజెక్టు కింద మునిగిపోతున్న రెండు గ్రామాల ప్రజలకు పునరావాసం కల్పిస్తూ రెండు కొత్త గ్రామాలు నిర్మించారు. కొత్త గ్రామాలకు పాత పేర్లే ఎందుకు పెట్టుకోవాలి, కొత్తవి పెట్టుకుందాం అని నిర్వాసితులు భావించారు. వారికి పునరావాసం కల్పించే క్రమంలో వారితో కలిసి మెలిసి తిరిగిన ఒక ప్రభుత్వ అధికారి ఆ ఊర్లకు రామాయణ్, మహాభారత్ అని పేర్లు పెడదాం అని సూచించాడు. దానికి కారణం ఏమిటంటే, అధికంగా ముస్లింలయిన ఆ గ్రామస్తులు టీవీలో ప్రసారమయ్యే హిందూ పురాణగాథల సీరియల్స్ పట్ల చాలా ఆసక్తి చూపడం అతను గమనించి ఉన్నాడు. అతను నవ్వుతూ చేసిన ఈ సూచనను ఆ గ్రామస్తులు సరదాగానే స్వీకరించారు. రామాయణ్, మహాభారత్ అనే ముస్లిం గ్రామాలు ఆ విధంగా పుట్టాయి. ఈ సంవత్సరం మార్చి నెలలో ముస్లింల ఆవాసాలను హిందుత్వవాద మూకలు అగ్నికి ఆహుతి చేసిన క్రమంలో ఈ రెండు గ్రామాలను కూడా తగలబెట్టగా మళ్ళీ నిర్వాసితులైన ఆ వందలాది ముస్లిం కుటుంబాలు బరోడా తాలూకాలోని సిబ్లా గ్రామం వద్ద శరణార్థుల శిబిరం ఏర్పరచుకుని దానికి కూడా మళ్ళీ 'రామాయణ్ – మహాభారత్' అనే పేరు పెట్టుకున్నారు.

మహమ్మద్ హసన్ జౌహర్ అహ్మదాబాద్‌కు చెందిన ఒక ఐటి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్. ఒకప్పుడతను దేశంలోని బ్యాంకింగ్ రంగంలో అత్యున్నత పదవులు నిర్వహించాడు. ప్రస్తుతం ఒక స్వంత ఐటి సంస్థ పెట్టుకున్నాడు. అతను నిజానికి హైదరాబాద్ పాతబస్తీకి చెందినవాడు. పదహారేళ్ళుగా అహమ్మదాబాద్‌లో ఉంటున్నాడు. గుజరాతీ ముస్లిం స్త్రీని పెళ్లి చేసుకున్నాడు. భార్యాభర్తలిద్దరూ

ఆలోచనలలో చాలా ఆధునికులు. 'సొసైటీ ఫర్ ది ప్రమోషన్ ఆఫ్ రేషనల్ థాట్' అనే హేతువాద సంస్థ నడుపుతారు. వారి కుమారుడికి ప్రవక్త మహమ్మద్‌కు పూర్వపుదైన పశ్చిమ ఆసియా సంప్రదాయానికి చెందిన 'అరస్తు' అనే పేరు పెట్టుకున్నారు. ముస్లింలుగా కాక ప్రపంచ పౌరులుగా బతకాలన్న కాంక్షతో ఎప్పుడూ ముస్లిమేతరుల మధ్యనే బతికేవారు. కానీ అహమ్మదాబాద్‌లో మత ఘర్షణలు జరిగినప్పుడు హిందూ ప్రాంతాలలో హిందువుల మధ్య బతికే ముస్లింలను పొడిచి చంపడం వారు చూసారు. ఇది కాకతాళీయంగా జరగడం లేదనీ ఉద్దేశపూర్వకంగా జరుగుతున్నదనీ అర్థం చేసుకున్నారు. కొద్దికొద్దిగా ముస్లింలు నివసించే కాలనీలకు దగ్గరగా రాసాగారు. 1993లో మతఘర్షణలు జరిగినప్పుడు జౌహర్ కారు మీద 'మియాను నరుకుతాం' అని రాసారు. మొన్నటి మార్చి 1వ తేదీన కత్తులూ త్రిశూలాలు పట్టుకున్న మూక అతని కార్యాలయంపైన దాడిచేయగా తృటిలో తప్పించుకున్నాడు. అతని పక్క కార్యాలయంలోని అతని మేనమామ వరస అయిన ముసలాయన కత్తిపోట్లకు గురయి చనిపోయాడు. తనను పరిహసించిన లౌకికవాద విశ్వాసాన్ని వదిలిపెట్టి తాను పరిహసించిన సనాతనవాదం సరసన పాతబస్తీలో ఇల్లు తీసుకొని ఉందామని ఇప్పుడు జౌహర్ బాధపడుతూ నిర్ణయించుకున్నాడు.

గుజరాత్ ఐఎఎస్ కేడర్‌కు చెందిన ఇద్దరు చిన్ననాటి మిత్రులు రిటైర్ అయిన తరువాత పక్కపక్క అపార్ట్‌మెంట్లు కొనుక్కుని శేషజీవితం గడుపుదామనుకున్నారు. వారిలో ఒకరు హిందువు, ఒకరు ముస్లిం. అయితే వారు ఎంత ప్రయత్నం చేసినా ఒకే బిల్డింగ్‌లో ఇద్దరికీ ఫ్లాట్లు అమ్మడానికి ఏ బిల్డరూ ఒప్పుకోలేదు. హిందూ బిల్డర్లు, బిల్డింగ్ సొసైటీలూ ముస్లింలకు ఫ్లాట్లు అమ్మరు. ముస్లింలవి కొత్త సొసైటీలు లేవు. ఆరు నెలలు చెప్పులరిగేలా మిత్రులిద్దరూ అహమ్మదాబాద్ మొత్తం తిరిగారు. మేము ఐఎఎస్ ఆఫీసర్లం. మా హోదా చూసయినా అమ్మరా? అని అడిగారు. 'మాకేం అభ్యంతరం లేదు. కానీ వాళ్లతో గొడవెవరు పెట్టుకుంటారు చెప్పండి' అని బిల్డర్లూ సొసైటీలూ సాకులు చెప్పాయి. 'వాళ్ళు' అంటే గుజరాత్‌ను తమ ప్రయోగశాలగా మార్చుకున్న హిందూత్వవాదులు. చివరికి విసిగిపోయిన ఆ బాల్యమిత్రులిద్దరూ, 'మన నగరానికి ఏం గతి పట్టింది చూడండి' అని పత్రికలకు జంటగా ఒక ఉత్తరం రాసి తమ ప్రయత్నం విరమించుకున్నారు. ఆ ఉత్తరాన్ని కూడా ఆంగ్ల పత్రికలే తప్ప ఏ గుజరాతీ పత్రికా ప్రచురించలేదు.

హిందూత్వవాదుల కోపం ఎవరిమీద? వారికి ఏం కావాలి? మాట్లాడితే జిహాద్ గురించి, ముస్లిం మతవాదం గురించి ఆవేశపడతారుగానీ వాళ్లు నిజంగా

సహించలేనిది ముస్లింలనే, ముస్లిం మతవాదాన్ని కాదు. వాళ్ళు వ్యతిరేకించేది ముస్లిం మతవాదాన్నయితే ముస్లింలలో ఆధునికులను వారు ఆదరించాలి. ఉదారవాదులనూ లౌకికవాదులనూ స్నేహితులుగా భావించాలి. హిందువులతో కలిసిమెలిసి బతికే వారిని గౌరవించాలి. అప్పుడు ఒక ఎహసాన్ జాఫ్రి, ఒక బందూక్‌వాలా, ఒక మహమ్మద్ హసన్ జౌహర్ వారి దాడులకు గురయ్యే వారు కారు. కానీ హిందూత్వవాదులు ఈ దేశంలో ముస్లింలు ఉండడాన్నే సహించలేరు. అందుకే హిందువులతో ముస్లింలు కలవడం వారికి ఇష్టముండదు. హిందూ ముస్లిం వివాహాలను వారు అసలే సహించరు (గుజరాత్‌లో అటువంటి జంటలను హతమార్చడం, బలవంతంగా వేరుచేయడం జరిగింది). లౌకికవాదులు, ఆధునికవాదులు, కమ్యూనిస్టులు అయిన ముస్లింలను వారు అసలే సహించరు. ఎందుకంటే వారిని ఎందుకు ద్వేషిస్తున్నారో చెప్పలేరు కాబట్టి.

ముస్లింలు సనాతనవాదం పిడికిలి నుండి బయట పడాలని హిందూత్వ వాదులు కోరుకోరు. వారంతా సనాతనవాదులుగానే ఉండి హిందూత్వవాదుల ద్వేషాన్ని సహేతుకమైనదిగా రుజువు చేయాలని కోరుకుంటారు.

గుజరాత్ నేర్పిన పాఠాలలో ఇదొకటి.

**వార్త దినపత్రిక**
**21 మే 2002**

# ఏది పాకిస్తాన్ కుట్ర?

మీరు గుజరాత్‌కు ఏ నిజనిర్ధారణ కమిటీలో భాగంగా పోకపోయినా, యథాలాపంగా ఆ రాష్ట్రంలో పర్యటించినా ఎక్కడబడితే అక్కడ తగలబడిపోయిన నిర్మాణాలు కనిపిస్తాయి. అందులో నివాసాలు, హోటళ్ళు, దుకాణాలు వుంటాయి.

తగలబడిన హోటళ్ళు, దుకాణాల మసిబారిన బోర్డులు చూసినప్పుడు, ఇవి ముస్లింలకు చెందినవని వాటిని తగలబెట్టిన వారికి ఎట్లా తెలిసిందని మీకు అనుమానం వస్తుంది. ఎందుకంటే వాటికి 'ముస్లిం' పేర్లు వుండవు. సర్వోదయ, అశీశ్, ఆశీర్వాద్, పంకజ్, తులసి మొదలయిన పేర్లు వుంటాయి.

హిందూత్వవాద మూకల భయానికి ముస్లింలు తమ వ్యాపార సంస్థలకు 'హిందూ' పేర్లు పెట్టుకున్నారని మీరు అనుకోవచ్చు. కొన్ని సందర్భాలలో అది నిజమే కావచ్చును గానీ అసలు కారణం అది కాదు. గుజరాతీ ముస్లింల మాతృభాష గుజరాతీయే. వాళ్ళెవ్వరికీ ఉర్దూ రాదు. చదువుకున్న వారయితే హిందీ వస్తుంది. మనం వాళ్ళు ముస్లింలు కదా అని కొంచెం ఉర్దూ కలిసిన హిందీలో మాట్లాడినా, వాళ్ళు స్వచ్ఛమైన హిందీలోనే జవాబు ఇస్తారు.

కాబట్టి అశీశ్, ఆశీర్వాద్ మొదలయినవి 'హిందూ' పేర్లు కావు. గుజరాతీ భాషా పదాలు. అయితే 'సర్వోదయ' అన్న పేరు ముస్లింల వ్యాపార సంస్థలకే ఎక్కువ వుండడం వెనుక ఒక రాజకీయ కారణం వుండవచ్చు. గాంధీ అన్నా, గాంధీ భావాలన్నా గుజరాత్‌లో ముస్లింలకే తప్ప హిందువులకు పెద్దగా సదభిప్రాయం లేదు. ఈ రోజేకాదు – అంటే హిందూత్వవాదులు గుజరాత్‌ను తమ ప్రయోగశాలగా మార్చుకున్న తర్వాతే కాదు, తొలినాటి నుండి కూడా. దేశమంతటికీ గాంధీపట్ల అతి తక్కువ గౌరవం వుండేది గుజరాత్‌లో. 'గుజరాత్‌లో

కాంగ్రెస్ పార్టీ కూడా పటేల్ కాంగ్రెసే తప్ప గాంధీ కాంగ్రెస్ కాదు' అని రాష్ట్రంలో ఇంకా మిగిలి వున్న ఒకరిద్దరు మానవ హక్కుల కార్యకర్తలు అంటారు.

ఈ కారణంగా, ఆ రాష్ట్రంలో సర్వోదయ అన్న పేరు గల తగలబడిపోయిన హోటళ్ళు, దుకాణాలు ఎక్కడబడితే అక్కడ కనిపిస్తాయి. ఆ దృశ్యాన్ని జీర్ణించుకోవడానికి కొంత సమయం పడుతుంది గానీ గుజరాత్ సమాజానికి పట్టిన దుర్గతికి ఆ దృశ్యం సరైన సంకేతమే.

సంఘ్‌పరివార్ కార్యకర్తలలోనే కాక, సాధారణ హిందువులలో సహితం కళ్ళకు పొరలు కప్పిన గుడ్డి ద్వేషం ఆ దుర్గతిలోని ప్రధాన అంశం. ద్వేషంవల్ల నశించిన వివేచన వికృతి హింసాకాండ రూపంలోనే కాక మనల్ని అవాక్కులను చేయగల కుతర్కం రూపంలోనూ సాక్షాత్కరిస్తుంది. మీ ఊరి ముస్లింలు ఏం తప్పు చేశారని ప్రశ్నిస్తే అప్పుడెప్పుడో సోమనాథ్ దేవాలయం మీద దాడి జరిపిన గజనీ మహ్మద్ గురించి, ఒసామా బిన్ లాడెన్ గురించి, జిహాద్ గురించి, హిజ్బుల్ ముజాహిదీన్ గురించి, పాకిస్తాన్ గురించి ఇంకా అనేక అసందర్భమైన విషయాల గురించి మాట్లాడతారు. వాటికీ మీ ఊరి ముస్లింలకూ ఏమిటి సంబంధం అని మనం రెట్టించే ప్రయత్నం ఏ కొంచెం చేసినా విపరీతంగా ఆవేశపడిపోతారు. కోపంతో ఊగిపోతారు. ఆ ఆగ్రహాన్ని చూడాలే తప్ప చెప్తే నమ్మరు.

'ముస్లిం' అనేది ఇప్పుడొక అఖండ పదార్థం అయిపోయింది. అందువల్ల ఎవరో ఎక్కడో ఎప్పుడో చేసిన పాపాలకు, లేదా చేశారని సంఘ్‌పరివార్ భావించే పాపాలకు మన ఊరి దర్జీ, మన స్కూటర్ మెకానిక్కు జవాబు చెప్పాలి. ప్రశ్నలకు కాదు, తల్వార్లకు, త్రిశూలాలకు జవాబు చెప్పాలి.

దీనిని గ్రహించే రాజకీయ జ్ఞానం వున్నవారూ లేనివారు కూడా గుజరాతీ ముస్లింలలో వున్నారు. ఆ జ్ఞానంలేని వారి విస్మయం వర్ణనాతీతం. అదంతా నిజమే కావచ్చు. కానీ నేనేం చేశాను? అన్న ప్రశ్న వారి చూపులలో ఇప్పుడు స్థిరపడిపోయింది. అది పోదు. ఎందుకంటే వారు తమ ఇల్లూ వాకిలీ పోగొట్టుకున్నారు, వ్యాపారాలూ ఆస్తులూ పోగొట్టుకున్నారు, తమ కళ్ళముందే నరికి చంపిన తమ ఆప్తులను పోగొట్టుకున్నారు. తమ పిల్లలు, తన కంటే చిన్న వాళ్ళయిన ఇరుగు పొరుగు యువకులూ చూస్తున్నారని తెలిసి ఏడుపు బిగపట్టుకొని జరిగిన విషయాలు చెప్తూ వస్తున్న మధ్యవయస్కుడయిన ఒక రైతు మన కళ్ళలోని సానుభూతి చూసి కాలోలు ఇంక బిగపట్టలేక ఒక్కసారిగా గొల్లుమని ఏడుస్తూ, 'ఇది నా జన్మభూమి – నన్ను పొమ్మంటే ఎక్కడికి పోవాలి? నేను జాతీయ గీతం పాడలేదా? జెండా ఎగరేయలేదా? అని చేతులలో ముఖం దాచుకొని విలపించినప్పుడు బాధ కంటే విస్మయం అతనిని ఎక్కువగా దహించివేస్తున్నదని అర్థమవుతుంది.

ఈ మూర్ఖమైన ద్వేషం తనకు కావలసిన సాకులను తానే కల్పించుకుంటుంది. ఇప్పుడు గుజరాత్‌లో మీరు ఏ హిందువునైనా అడగండి ఈ అల్లర్లు ఇంకెంత కాలం సాగుతాయని. 'పాకిస్తాన్ అల్లర్లను ఆగనివ్వదు' అని జవాబు చెప్తారు. మొదటిసారి ఆ జవాబు విన్నప్పుడు మన శ్రవణేంద్రియాన్ని శంకిస్తాం. చచ్చింది, చస్తున్నది ముస్లింలయితే అల్లర్లను పాకిస్తాన్ ఆగనివ్వకపోవడమేమిటని ఆశ్చర్యపోతాము. ఆ జవాబు అర్థం కావడానికి కొంచెం సమయం పడుతుంది. గోధ్రాలో రైలుమీద దాడి పాకిస్తాన్ చేయించిందనీ, ఆ దాడికి హిందువులు ఆగ్రహించి రెచ్చిపోతారని తెలిసే చేయించిందనీ, ఆ ఆగ్రహానికి ఆపైన ప్రతీకారం తీర్చుకుంటుందనీ, అందుకోసం మందినీ పైసలనూ గుజరాత్‌కు పంపించడం మొదలు పెట్టిందనీ దాని భావం. అత్యంత కిరాతకంగా ముస్లింలను మూకుమ్మడిగా వధించిన వారు సహితం తాము చేసిన హింసతో సహా ఇదంతా పాకిస్తాన్ చేస్తున్న కుట్ర అనీ, ఈ అగ్గి ఆరిపోకుండా పాకిస్తాన్ రగిలిస్తూనే ఉంటుందనీ నమ్ముతూ మరింత హింసకు పాల్పడుతూ అదంతా కూడా పాకిస్తాన్ కుట్రేనని సమర్థించుకుంటూ...

ఢిల్లీలో అద్వానీ దీనికి తగినట్టే మాట్లాడుతుంటాడు. గుజరాత్‌లోని శరణార్థుల శిబిరాలలో పాకిస్తాన్ ఏజెంట్లూ, టెర్రరిస్టులూ ప్రవేశిస్తున్నారనే హెచ్చరికలు రెండు రోజులకొకసారి చేస్తుంటాడు. హోంశాఖ ఎటువంటి అరెస్టులు కోరుకుంటే అటువంటి అరెస్టులు చేసిపెట్టడంలో నేర్పరులయిన ఢిల్లీ పోలీసులు, గుజరాత్‌కు పోవడానికి తయారయి వున్న లష్కర్-ఇ-తయ్యిబా మిలిటెంట్లను వెనువెంటనే చాంద్‌నీ చౌక్‌లో అరెస్టుచేసి వారి 'కుట్రలను భగ్నం చేస్తారు'. ఇంక గుజరాత్‌లోని హిందూత్వవాదుల 'మూడ్' గురించి చెప్పేదేముంది? ఇదంతా పాకిస్తాన్ కుట్ర అని మేము ముందే చెప్పలేదా అని వారు రెట్టించిన ఉత్సాహంతో ముస్లింలపైన ద్వేషం పెంచుకుని 'పాకిస్తాన్ కుట్ర'లో తమ వంతు పాత్ర నిర్వహిస్తున్నారు. ముస్లింలు శరణార్థుల శిబిరాల నుండి తిరిగి ఇళ్ళకు (కాలిపోయిన ఇళ్ళకే అయినా) పోవడం అసాధ్యం చేస్తున్నారు. ఇంకా మిగిలిపోయిన ఇళ్ళేమయినా వుంటే తగలబెడుతున్నారు. ఒంటరిగా ముస్లిమెవరైనా దొరికితే నరికి చంపుతున్నారు...

**ప్రజాతంత్ర**
**26 మే 2002**

# ఇంకెక్కడా మరొక గుజరాత్ కాకుండ చూడడం ప్రజాతంత్ర ఉద్యమాల కర్తవ్యం



'మహారాష్ట్ర, రాజస్థాన్ మరొక గుజరాత్ కావడానికి రెడీగా ఉన్నాయి'. ఈ మాటలంటున్నది తెలిసీ తెలియక మాట్లాడే రాజకీయ వ్యాఖ్యాతలు కాదు, ఆ రాష్ట్రాలలో ప్రజలతో, ప్రజా ఉద్యమాలతో సన్నిహిత సంబంధం ఉన్న హక్కుల ఉద్యమకారులు.

ఈ భయానికి గల ఒక కోణాన్ని అర్థం చేసుకోవడం పెద్ద కష్టం కాదు. మహారాష్ట్రలో శివసేన ప్రాబల్యం తెలియనిది కాదు. 1992-93లలో బొంబాయి నగరంలో ముస్లింలపైన శివసేన నిర్వహించిన ఊచకోతను మనం మరచిపోలేదు. ఆ మారణకాండ గురించి శివసేన తన అభిప్రాయం మార్చుకున్న దాఖలాలు లేవు. నిజానికి మొన్న గుజరాత్‌లో మారణకాండ మొదలుకాగానే అది మహారాష్ట్రలో కూడా ఎందుకు జరగలేదనేదానికి - ఆ చర్చ ప్రస్తుతానికి అనవసరం గానీ, శివసేన తన నైజాన్ని మార్చుకోవడం మాత్రం దానికి కారణం కాదు.

రాజస్థాన్‌లోనూ సంఘ్‌పరివార్ ప్రాబల్యం చాలా ఉంది. అయోధ్యలో వాళ్ళు కట్టదలచుకున్న రామాలయం విడి భాగాలు రాజస్థాన్‌లోనే తయారవుతున్నాయి. ఆ రాష్ట్రంలో బజరంగ్‌దళ్ 40 లక్షల 'త్రిశూలాలు' పంచిందని ముఖ్యమంత్రి అశోక్ గెహలాట్ పత్రికా ముఖంగా ప్రకటించాడు. ఆయన కాంగ్రెస్ మనిషి కాబట్టి ఇందులో సగం అతిశయోక్తి ఉందనుకున్నా ఈ త్రిశూల సంతర్పణం చిన్న విషయం కాదు.

'త్రిశూలాలు' అంటే శైవ క్షేత్రాల దగ్గర కనిపించే సన్యాసుల చేతిలో ఉండే పనికిమాలిన కడ్డీలు అనుకునేరు. బజరంగ్‌దళ్ పంచే త్రిశూలాలు పిడిబాకుల సైజులో ఉండే దృఢమైన ఆయుధాలు. దానిని త్రిశూలం అనే కంటే మూడు మొనలు గల పిడిబాకు అనడం ఉచితంగా ఉంటుంది. దానికి త్రిశూలం అని పేరుపెట్టడం వెనక ఒక తెలివైన ఆలోచన ఉండవచ్చు. సిక్కులు కిర్పాన్ ధరించడం నేరం కానట్టు హిందువులు త్రిశూలం ధరించటం నేరం కాదని దబాయించడం సాధ్యమే.

అయితే ఈ సమస్యను శివసేన, బజరంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్, ఆర్ఎస్ఎస్, బిజెపిల వ్యాప్తికీ, వాళ్ళ కుతంత్రాలకూ సంబంధించిన విషయంగా చూసినంత కాలం మనం సమస్య మూలాలలోకి పోనట్టే. ఆ చర్చ మనకు ఆందోళన కలిగించవచ్చును గానీ మనల్ని సిద్ధాంతపరంగా ఇబ్బంది పెట్టదు. నిజమైన సమస్య ఏమిటంటే సాదారణ హిందూ ప్రజానీకం ముస్లిం వ్యతిరేక ఉన్మాదంలో పెద్దఎత్తున భాగస్వాములు కావటం.

ఇక్కడ 'హిందువు' అన్న మాటలో దళితులను, బీసీలను కూడా కలిపి ప్రయోగిస్తున్నాను. వాళ్ళు హిందువులు కారు అని మన సంతృప్తి కోసం మనం ప్రకటించుకుంటే సరిపోదు. వాళ్ళను హిందువులు కాకుండ చేసే రాజకీయ కృషి అవసరం. చాతుర్వర్ణ్యాన్ని మనకు మనం విశ్లేషించి చెప్పుకొని దాని స్వభావాన్ని బట్టి దళితులు, బీసీలు హిందువులు కారు అని నిర్ధారించుకోవడం మన ఆత్మ సంతృప్తికి మాత్రమే పనికొస్తుంది. హైందవ సిద్ధాంతం, ప్రాపంచిక దృక్పథం బ్రాహ్మణులు, బనియాలకు తప్ప వేరే ఎవ్వరికీ మేలు చేయదని ఇతర కులాలకు నేర్పే రాజకీయ కృషి లేనిదే ఈ సిద్ధాంత విశ్లేషణవల్ల ప్రయోజనమేమీ ఉండదు. ఆ కృషి శూద్ర అగ్రకులాల దగ్గర ఫలితం ఇవ్వకపోవచ్చును గానీ దళతులు, పెద్దగా బ్రాహ్మణీకరణ చెందని బీసీ కులాల దగ్గర ఫలితం ఇయ్యగలదు. కానీ ఆ కృషి జరగాలి.

హిందువులుగా తమను తాము భావించుకునే జనం చాలా పెద్దసంఖ్యలో గుజరాత్ మారణకాండలో పాల్గొన్నారనడానికి పోలీసు ఎఫ్ఐఆర్‌లే సాక్ష్యం. బాధితులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లే కాదు, సంఘ్‌పరివార్‌కు అనుకూలంగా వ్యవహరించారన్న అప్రతిష్ట పొందిన పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లు సహితం ఈ విషయాన్ని చూపుతాయి. అహమ్మదాబాద్ నగరంలో విపరీతమైన హింసాకాండను చవిచూసిన రెండు ప్రాంతాలలోనూ దుండగుల సంఖ్య 15

వేలకు పైగా ఉండిందని పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్లు చెప్తున్నాయి. 100కు పైగా ముస్లింలను నరికి, ముక్కలుగా కోసి తగలబెట్టిన నరోడ్గావ్, నరోడా పాటియాల మారణకాండ గురించి దాఖలయిన 5 ఎఫ్ఐఆర్‌లలో ఒక దానిలో ఫిర్యాది అయిన ఎస్ఐ సోలాంకి కథనం ప్రకారం దుండగులు 15,000–17,000 మధ్యలో ఉన్నారు. మేఘానినగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చమన్‌పురా ప్రాంతంలోని గుల్బర్గ సొసైటీ బిల్డింగ్ పైన దాడి చేసి కాంగ్రెస్ మాజీ ఎం.పి. ఎహసాన్ జాఫ్రిని అతి క్రూరంగా చంపడంతోపాటు దాదాపు 70 మందిని నరికి దహనం చేసిన ఘటనలో 20,000 నుండి 25,000 మంది పాల్గొన్నట్లు రెండు ఎఫ్ఐఆర్‌లలో ఒకటి దాఖలు చేసిన సీనియర్ ఇన్స్‌పెక్టర్ కె.జి. ఎర్డా అంటాడు. జిల్లాలలో (ముఖ్యంగా ఆదివాసీ ప్రాంతాలయిన పంచ్‌మహల్స్, దాహొూడ్, సబర్‌కాంటా, బరోడా (రూరల్) జిల్లాలలో) కూడా ఒక్కొక్క ఘటనలోనూ 5,000 నుండి 10,000 మంది పాల్గొన్నారని పోలీసులే అంటున్నారు.

సంఘ్‌పరివార్ సంస్థలకు ఈ మోతాదులో సభ్యత్వం ఉందని వారు కూడా చెప్పుకోరు. వారి సభ్యులు కాని చాలామంది జనం ఈ హింసాకాండలో పాల్గొన్నారు. ముస్లింల పట్ల సాధారణ హిందూ ప్రజానీకంలో ఇంత ద్వేషం ఎక్కడినుండి వచ్చింది? విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ వంటి సంస్థలు ప్రజలను – ముఖ్యంగా ఆదివాసులను, దళితులను – 'తప్పుదోవ' పట్టించారనీ 'బ్రెయిన్‌వాష్' చేశారనీ వామపక్ష భావాలుగల విశ్లేషకులు అంటున్నారు. సంఘ్‌పరివార్ సంస్థలు చాలా 'కృషి' చేసిన మాట వాస్తవమే. కానీ ఒకరు తప్పుదోవ పట్టిస్తే తోవ తప్పిపోవడానికీ, ఒకరు బ్రెయిన్‌వాష్ చేస్తే తమ మెదళ్ళు అప్పగించి కూర్చోవడానికీ మనుషులు తోలుబొమ్మలు కాదు, మరబొమ్మలు కాదు. మరయితే సంఘ్‌పరివార్ ప్రయత్నం గుజరాత్‌లో ఎందుకు సఫలం అయిందో చూడడం అవసరం.

దళితులకూ ఆదివాసులకూ 'మీరూ హిందువులే'నన్న గుర్తింపు విశ్వహిందూ పరిషత్ బలంగా కల్గించింది. హైందవ సమాజంలో ఆ ప్రజలకు ఉండే నీచమైన స్థానాన్ని ఏ మాత్రం సంస్కరించకుండ, బజరంగ్‌దళ్ కార్యకలాపాలలో వారిని భాగస్వాములు చేయడం ద్వారా వారికి 'హిందువు' అన్న ఐడెంటిటీ కల్పించింది. ఆదివాసీ ప్రాంతాలలో వినాయకుడి విగ్రహాలు ఉచితంగా పంచి గణేశ్ భజనలు నేర్పించింది. హైందవ మిలిటెన్సీకి సంకేతంగా మారిన త్రిశూలాలను విరివిగా

పంచింది. కొత్తగా చదువుకొని సమాజాన్ని గురించి ఆలోచించడం మొదలుపెట్టిన మొదటి తరం దళితులకూ ఆదివాసులకూ 'నేనెవరిని?' అన్న ప్రశ్నకు విశ్వహిందూ పరిషత్ జవాబు ఇచ్చింది. ఒక దళిత ఉద్యమమయినా, వేరే ఏ ప్రజాతంత్ర ఉద్యమమైనా గుజరాత్‌లో అభివృద్ధి చెంది ఉంటే, అన్యాయానికి గురయి న్యాయాన్ని కోరుకుంటున్న వర్గంగా వారికి ఒక 'రెబెల్' గుర్తింపును ఇయ్యగలిగి ఉండేవి. అవేవీ లేని చోట విశ్వహిందూ పరిషత్ 'హిందువు' అన్న విశాలమైన గుర్తింపులో వారిని భాగం చేయగలిగింది. హైందవంలో వారి స్థానాన్ని సంస్కరించి వారిని కలుపుకునే బదులు, ద్వేషించడానికి ఒక ముస్లింను నిలబెట్టి ఆ ద్వేషం ప్రాతిపదికన కలుపుకునింది. నువ్వు హిందువు, భారతదేశం నీ దేశం, ఈ ముస్లిం దేశద్రోహి, పాకిస్తాన్ అభిమాని, పాకిస్తాన్ టెర్రరిస్టు దేశం, భారతదేశాన్ని టెర్రరిజంతోనూ సీమాంతర ఉగ్రవాదంతోనూ పీడిస్తున్న శత్రుదేశం, ఈ ముస్లింను ద్వేషించు, అంతమొందించు, నీ దేశాన్ని కాపాడుకో – ఇదీ సంఘ్‌పరివార్ సగటు గుజరాతీలకు – ఆదివాసులు, దళితులతో సహా – పదే పదే ఇస్తున్న సందేశం. మనుషులను ప్రేమ, వివేచనే కాదు. ద్వేషం కూడా ఐక్యం చేయగలదు. ప్రేమకంటే, వివేచన కంటే ద్వేషమే సులభంగా ఐక్యం చేయగలదని నేనంటే నేను మానవ నైజాన్ని కించపరుస్తున్నానని నాపైన దాడి చేస్తారేమోగానీ, ద్వేషం కూడా ఐక్యం చేయగలదని ఒప్పుకుంటారనుకుంటాను. గుజరాత్ వీధులలో ముస్లింలను ఊచకోత కోయడానికి, వాళ్ళ ఇళ్ళు దుకాణాలు అగ్నికి ఆహుతి చేయడానికి వేలాదిగా కదలి వచ్చిన భిన్న స్థితిగతులు, భిన్న ప్రయోజనాలు, భిన్న అవసరాలు గల జనం దీనికి నిదర్శనం.

వీళ్ళెవ్వరితోనయినా మీరు మాట్లాడండి, వాళ్ళు స్థానిక ముస్లింల మీద ఏ ఫిర్యాదు చేయరు. చర్చ నేరుగా పాకిస్తాన్ మీదికి పోతుంది. ఇంకా ఎక్కడెక్కడికో పోతుంది. వెయ్యేళ్ళ కింద గజనీ మహమ్మదు సోమనాథ్ దేవాలయాన్ని ధ్వంసం చేసాడంటారు. నాలుగు వందల ఏళ్ళ కింద బాబర్ అయోధ్యలో రామాలయాన్ని ధ్వంసం చేశాడంటారు. ఆ తరువాత ఔరంగజేబు ఇంకేదో చేశాడంటారు, సెప్టెంబర్ 11 అంటారు, డిసెంబర్ 23 అంటారు, కాశ్మీర్‌లో ఆత్మాహుతి దళాలు అంటారు, ఇంకా ఏదేదో అంటారు. వీటికీ మీ ఊరిలో మీరు మెడ తెగనరికి దుకాణం కాలబెట్టిన హాజీమియాకూ ఏమిటి సంబంధం అన్న ప్రశ్న మనల్ని అడగనివ్వరు. అడిగితే కుహనా లౌకికవాదం అంటూ మన మీద విరుచుకుపడతారు.

ఇదేదో గుజరాత్ ప్రత్యేకత అనుకుంటే పొరబాటే. మన దేశంలో చదువుకున్న హిందువులందరి ('వీళ్ళు హిందువులు కారు' అని మనం సిద్ధాంతీకరిస్తున్న వారితో సహా) మనసులోనూ పైపొర తొలగిస్తే లోపల కనిపించే చిత్రం ఇదే. కులం పెరిగేకొద్దీ మరికొంచెం తీవ్రంగా ఉండవచ్చునంతే. వేరే ఏ ప్రజాతంత్ర ఉద్యమాలూ లేనిచోట సంఘ్‌పరివార్ ఈ పై పొరను సులభంగానే తొలగించగలిగింది. 'ముస్లింలకు బాగా అయింది చావనీ' అని మన రాష్ట్రంలో కూడా మన చుట్టూ ఉన్నవారు చాలామంది అన్నారు.

ఈ ద్వేషాన్ని పోగొట్టే లోతయిన రాజకీయ కృషి అవసరం. ఇది కేవలం ఉపన్యాసాలతో రాదు, ప్రజలను ఆర్గనైజ్ చేసే క్రమంలో జరగాలి. గుజరాత్‌లో సంఘ్‌పరివార్‌కు దొరికిన ఖాళీ జాగా దొరకనివ్వకూడదు. ప్రజలను ప్రజాతంత్ర లక్ష్యాలతో ఆర్గనైజ్ చేసే క్రమంలో 'హిందువు' అన్న మాటకు సంఘ్‌పరివార్ ఇస్తున్న వ్యాఖ్యానంలోని అబద్ధాన్ని ఆచరణాత్మకంగా తెలియజెప్పాలి. లౌకికవాదం కేవలం ముస్లింలకూ, క్రైస్తవులకే కాదు, 'హిందువులు' అని సంఘ్‌పరివార్ పిలిచే వారిలో మెజారిటీకి – స్త్రీలకు, దళితులకు, బీసీలకు, ఆదివాసులకు – అవసరం అని, అదే లేకపోతే ఆ ప్రజలకు సంప్రదాయం నుండి ఈ మాత్రం విముక్తి కూడా లభించేది కాదనీ వివరించాలి. ఈ దేశంలో లౌకికవాదం అక్కరలేని వాళ్ళే ఒక మైనారిటీ అనీ లౌకికవాదం అవసరమైనవాళ్ళే మెజారిటీ అని చెప్పాలి. మనుషులు ఐక్యం కావలసింది అన్యాయం చేయడానికి కాదనీ అన్యాయాన్ని ధిక్కరించడానికనీ చెప్పాలి. భారతదేశ చరిత్ర గురించి సంఘ్‌పరివార్ ఇస్తున్న వ్యాఖ్యానాన్ని సోదాహరణంగా తిప్పికొట్టాలి. 'ముస్లిం' అనే దానిని ఒక అఖండ సామాజిక పదార్థంగా మార్చి ఎవరెవరో చేసిన తప్పులకు (అవన్నీ తప్పులా కాదా అన్న సంగతి అటుంచి) ముస్లిలందరినీ బాధ్యులు చేయడం అన్యాయం అని వివరించాలి.

ఇవన్నీ ప్రజలను తమ సామాజిక ఆర్థిక స్థితిగతులనూ హక్కులనూ మెరుగుపరచుకోవడానికి సంఘటితపరచే క్రమంలో చేయాలి. ఒక ప్రత్యేకమైన రాజకీయ కృషిగా ఈ ప్రయత్నం చేయకపోతే దేశమంతా ఒక గుజరాత్ కాకుండా ఆపడం కష్టం.

**ప్రజాపంథా**

**1 జూన్ 2002**

# సకాలంలో నోరు విప్పుదాం

ఎన్‌కౌంటర్‌లో చచ్చిపోయే ముస్లిం 'తీవ్రవాదు'లెప్పుడూ స్కూటర్ డిక్కీలో దేశ, రాష్ట్ర బిజెపి నాయకుల పేర్ల లిస్టొకటి ఉంచి పోతారు – ఎందుకు? రాసుకోకపోతే మరిచిపోతారనా? ఆ మాత్రం నాలుగైదు పేర్లు కూడ రాసుకోనిదే జ్ఞాపకం ఉంచుకోలేని వాళ్లను నమ్ముకొని ఐఎస్ఐ ఇండియాను ఏం చేయగలదబ్బా!

అయిదేళ్ల క్రిందననుకుంటాను. సికింద్రాబాద్‌లోని కార్ఖానా ప్రాంతంలో ఫసీఉద్దీన్, మరొక ఇద్దరు ముస్లిం యువకుల స్కూటర్ డిక్కీలో అద్వానీ నుండి నరేంద్ర దాకా పలువురు కాషాయ నాయకుల పేర్ల లిస్టొకటి దొరికిందట. అది హిట్‌లిస్ట్ అని పోలీసులు అసమాన ప్రతిభతో ఇట్టే కనిపెట్టేసారు. ఫసీఉద్దీన్‌ను నిజానికి నల్గొండలో పట్టుకొని హైదరాబాద్ తీసుకొచ్చి కాల్చి చంపారన్నది వేరే సంగతి.

మొన్న నవంబర్ 21వ తేదీన హైదరాబాద్‌లో దిల్‌సుఖ్‌నగర్ సాయిబాబా గుడి దగ్గర స్కూటర్ బాంబు పేలి గుడికి వచ్చిన ఒక అభాగ్యురాలు చనిపోగా మరి కొందరు గాయపడ్డారు. దీనికి ప్రతీకారంగా 22 రాత్రి ఒకరిని, 23 రాత్రి ఇంకొకరిని పోలీసులు కాల్చి చంపారు. 22 రాత్రి హైదరాబాద్ నగర శివార్లలోని ప్రతాప్‌పూర్ గ్రామం దగ్గర మహమ్మద్ ఆజంను, 23 రాత్రి కరీంనగర్ పట్టణం శివారులో సయ్యద్ అజీజ్‌ను కాల్చి చంపారు. ఆజం హైదరాబాద్ నగరంలోని రైస్ బజార్ నివాసి కాగా, అజీజ్ మలక్‌పేట నివాసి.

ఆజంను కాల్చి చంపిన వైనాన్ని వివరిస్తూ, అతను నంబర్ ప్లేటు లేని స్కూటర్‌లో పోతుండగా పట్టుకున్నామనీ, స్కూటర్ డిక్కీలో బిజెపి నాయకుల పేర్ల

లిస్టొకటి దొరికిందనీ పోలీసులు చెప్పారు. ఆ తరువాత ఆజం తాను బాంబులు వగైరా దాచిపెట్టిన స్థలాన్ని చూపిస్తానని పోలీసులను వరంగల్ రహదారి పక్కన ఉన్న ప్రతాప్‌పూర్ శివారులోని చిట్టడవికి తీసుకుపోయాడనీ, దాచిన వస్తువులు తీసి ఇమ్మని పోలీసులు అతనిని ఆదేశించగా ఏ మాత్రం మర్యాద లేకుండా ఆ వస్తువులను చేజిక్కించుకొని పోలీసులపై దాడి చేసాడని, అప్పుడు ఆత్మరక్షణ కోసం జరిపిన కాల్పుల్లో అతను మరణించాడనీ అన్నారు.

అయిదేళ్ల కింద ఫసీఉద్దీన్‌ను చంపిన ఇన్స్‌పెక్టర్‌గారే ఇతనిని కూడ చంపాడని 'వార్త' దినపత్రిక రాసింది. రాసి ఊరుకోక ఆ ఇన్స్‌పెక్టర్ నేర్పునూ, సాహసాన్నీ, పట్టుదలనూ కొనియాడింది. అదేమోగానీ అయిదేళ్లుగా అతనికొక కొత్త ఆలోచన కూడ రాలేదని ఫసీఉద్దీన్ హత్యోదంతాన్నీ, మహమ్మద్ ఆజం హత్యోదంతాన్నీ పోలిస్తే అర్థం అవుతుంది. ఎటొచ్చీ ఆ రోజు అరెస్టు చేయక ముందే కాల్చి చంపాడు, ఈ రోజు అరెస్టు చూపించి మరీ చంపాడు. (అరెస్టు చూపించిన తరువాత చంపకూడదన్న చాదస్తం అయిదేళ్ల క్రింద మన రాష్ట్ర పోలీసులలో ఉండింది. అటువంటి నియమమేదీ లేదని సురేంద్ర బాబు, సీతారామాంజనేయులు అనే ఇద్దరు ఐపిఎస్ అధికార్లు ఈ అయిదేళ్ల కాలంలో రుజువు చేసారు. ఉప్పల్ సిఐ వంటి సన్నకారు చిన్నకారు పోలీసులు వారిని క్రమశిక్షణాయుతంగా అనుసరిస్తే వారిని తప్పుబట్టడానికి మనమెవరము?)

మహమ్మద్ ఆజం, సయ్యద్ అజీజ్ 'అమాయకులు' అని చార్మినార్ ఎం.ఎల్.ఏ. అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. దిల్‌సుఖ్‌నగర్ బాంబు పేలుడుతో వారికి సంబంధం లేదు అనేదే ఒవైసీగారి భావమయితే అది నిజం కావచ్చును. ఒక నేరానికి ప్రతీకారంగా ఒక హత్య చేయాలని పోలీసులు నిర్ణయించుకున్నప్పుడు ఆ నేరానికి పాల్పడిన వ్యక్తినే చంపాలన్న నియమం లేదు. నక్సలైట్ల విషయంలో ఆ విషయం చాలా సార్లు రుజవయింది. అయితే వారిద్దరికీ హింసాత్మక మత రాజకీయాలతో సంబంధం లేదన్నది ఒవైసీ గారి భావమయితే అది నిజం కావచ్చు, కాకపోవచ్చు. సయ్యద్ అజీజ్ గురించి అతని కుటుంబ సభ్యులే అతను సౌదీ అరేబియా నుండి ఇండియాకు వచ్చినట్టే తమకు తెలీదని అంటున్నారు. కరీంనగర్ శివారులో పోలీసులతనిని కాల్చి చంపారని విన్నప్పుడే తెలిసిందని ఒకరిద్దరితో వారే అన్నారు. ఆజం సంగతి అంత స్పష్టంగా లేదు. బహుశా అతను తెలిసీ తెలియక అజీజ్‌కు సహకరించిన వ్యక్తి అయి ఉండవచ్చును. 22 పొద్దున్న ప్రార్థనకని చెప్పి స్కూటర్ ఎక్కి ఇంటినుండి బయలుదేరాడు. (అది నంబర్ లేని స్కూటర్ కాదు. దాని నంబరు ఎబిఎం 3602). బహుశా దారిలో ఎక్కడయినా అజీజ్‌ను కలిసాడో, లేక అతనిని స్కూటర్‌పైన ఎక్కించుకుని ఎక్కడయినా దింపి రావడానికి పోయాడో తెలీదు. మొత్తానికి పోలీసులు ఇద్దరినీ స్కూటర్‌తో సహా

పట్టుకొని ఆజంను అదే రోజు రాత్రి, అజీజ్‌ను మరుసటి రోజు రాత్రి చంపేసారు. నిజానికి వాళ్లు 'అమాయకులా' కాదా అన్నది అసదుద్దీన్ ఒవైసీ అనవసరంగా ప్రవేశపెట్టిన చర్చ. కాకపోతేనేం? నక్సలైట్లు ఒకరిని చంపితే ఆ తర్వాత రెండు రోజులకో మూడు రోజులకో నక్సలైట్ ఉద్యమంతో ఎంతో కొంత సంబంధం ఉన్న వారిని ఒకరినో ఇద్దరినో పట్టుకొని చంపడం నిత్యం చూడడం లేదా? చనిపోతున్న వాళ్లు నక్సలైట్లా లేక 'అమాయకులా' అన్నది కాదు, ఇటువంటి పోలీసు యంత్రాంగాన్ని ఎన్ని రోజులు భరిస్తామన్నది సమస్య.

హైదరాబాద్‌లో పోలీసుల దగ్గర 'ముస్లిం తీవ్రవాదుల' జాబితా ఒకటి ఉంది. అందులోని వారంతా ఏదో ఒక అర్థంలో అందులో ఉండదగ్గవారేనని ఒప్పుకోవడానికి 'ముస్లిం తీవ్రవాదం' అన్న మాటకు పోలీసులిచ్చే అర్థమే మనమూ ఇచ్చుకోనవసరం లేదు. అయితే, దిల్‌సుఖ్‌నగర్ బాంబు పేలుడు వంటి ఘటన జరిగినప్పుడు ఈ జాబితాలో పేర్లున్న ఒకరినో ఇద్దరినో పట్టుకొని చంపే అధికారం పోలీసులకెవరిచ్చారని ప్రశ్నించాలి.

పోలీసులు ఈ పని చేస్తున్నారన్న దానికంటే సమాజం దీనినెంత సామాన్య విషయంగా భావిస్తున్నదనేది ఎక్కువ ఆందోళన కలిగించే విషయం. దిల్‌సుఖ్‌నగర్ బాంబు పేలుడు వార్త వినగానే ఇంక ఒకటి రెండు రోజులలో పాతబస్తీలో ఎన్‌కౌంటర్ జరగబోతుందని హైదరాబాద్‌లో అందరూ అనుకున్నారు. ఒక ఘోరం జరగబోతుందన్న అర్థంలో అనుకోలేదు. ఒక సహజ పర్యవసానం అన్న అర్థంలో అనుకున్నారు. ఆ మధ్య విజయవాడలో ఒక తెలుగుదేశం నాయకుడిని చంపిన వ్యక్తి పోలీసులకు దొరికాడని తెలియగానే అతనిని ఒకటి రెండు రోజులలో చంపుతారని విజయవాడలో అందరూ అనుకున్నట్లు, కడపలో ఒక బందిపోటు పోలీసులకు దొరికాడన్న వార్త రాసిన విలేఖరి 'ఈ రాత్రి ఎన్‌కౌంటర్ జరగనుందా?' అన్న వార్త రాసినట్టు.

'నక్సలైట్లు', 'బందిపోట్లు', 'ముస్లిం తీవ్రవాదులు' – ఈ ముగ్గురూ చట్టం నుండి వెలివేయబడ్డారు. వీరితో పాటు పాలక పార్టీకి చెందని 'కిరాయి హంతకులు' కూడ. సూత్రప్రాయంగా ఇందులో తప్పులేదని సమాజం సగటున అనుకుంటున్నది. అటువంటప్పుడు ఈ జాబితా రేపు పెరగదని నమ్మకం ఏముంది? అప్పుడు ఏడ్చినా ప్రయోజనం ఏముంటుంది?

**ప్రజాతంత్ర**

**9 డిసెంబర్ 2002**

# ప్రజాస్వామ్యానికి నిజమైన సవాలు

**ఢి**ల్లీలో ఒక సెషన్స్ కోర్టు, కోయంబత్తూరులో ఇంకొక సెషన్స్ కోర్టు ముస్లిం తీవ్రవాదులకు ఏకంగా ఉరిశిక్ష విధించడం, ఢిల్లీలో మరొక సెషన్స్ కోర్టు కాంగ్రెస్ నాయకుడు సజ్జన్‌కుమార్‌ను నిర్దోషి అని ప్రకటించడం దాదాపు ఒకేసారి జరిగాయి.

అందరూ తీవ్రవాదులే గానీ కొందరు తీవ్రవాదులకు మాత్రమే శిక్షపడుతుంది అని దీని నుండి గ్రహించవచ్చునని ఎవరైనా వ్యాఖ్యానిస్తే కాదనడం కష్టం.

1984లో అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీని సిక్కు మతస్తులయిన ఆమె సెక్యూరిటీ సిబ్బంది కాల్చి చంపినప్పుడు 'సెక్యులర్' కాంగ్రెస్ పార్టీ నాయకులు ఢిల్లీలో గుంపులను పోగుచేసి సిక్కులను ఘోరాతిఘోరంగా నరికి, కాల్చి, తగలబెట్టి చంపారు. బతికి బయటపడ్డ బాధితులు గుర్తుపట్టిన నాయకులలో సజ్జన్‌కుమార్ ఒకడు.

ఆ మారణకాండలో ఎంత లేదన్నా 2000 మంది చనిపోయారని అంచనా. దాదాపు 20 సంవత్సరాల తరువాత, ఏడెనిమిది కేసులు మించి ముగింపుకు రాలేదనీ, వేళ్ల మీద లెక్కపెట్టగలిగినంత మందికి మాత్రమే శిక్ష పడిందనీ ఢిల్లీ పోలీసులే ఒప్పుకుంటున్నారు.

ఆ కొద్దిమందిలో, బాధితులు పేరుపెట్టి నిందించిన కాంగ్రెస్ నాయకులు హెచ్.కె.ఎల్. భగత్ గానీ సజ్జన్‌కుమార్ గానీ లేరని వేరే చెప్పనవసరం లేదు.

పార్లమెంటుపైన జరిగిన దాడిలో చనిపోయింది అయిదుగురా? ఆరుగురా? కోయంబత్తూరులో చనిపోయింది ఒకరు. ఈ నేరాలకు మాత్రం పూర్తిస్థాయిలో ప్రతీకారం జరిగిపోయింది.

తనను కోర్టు నిర్దోషి అని ప్రకటించగానే, 'న్యాయం గెలిచింద'నీ 'ప్రజాస్వామ్యానికిది విజయం' అని సజ్జన్‌కుమార్ అన్నాడు. పార్లమెంటుపైన దాడి కేసులో పాటియాలా హౌస్ సెషన్స్ కోర్టు నలుగురు ముద్దాయిలలో ముగ్గురికి ఉరిశిక్ష విధించిందని వినగానే 'ప్రజాస్వామ్యానికిది విజయం' అని చాలామంది అన్నారు. ముద్దాయిలను కఠినంగా శిక్షించిన జడ్జి ఢింగ్రా గారు ప్రజాస్వామ్యం బలాన్ని చాటారని అన్నారు.

సజ్జన్‌కుమార్‌ను కోర్టు విడుదల చేసిందని తెలిసి ఢిల్లీలోని సిక్కు ప్రజానీకం నిరసన ప్రదర్శనలు నిర్వహించి 'ప్రజాస్వామ్యం ఖూనీ అయింద'న్నారు. ఇది మన దినపత్రికలు, టీవీ ఛానెల్స్ చూపించాయి. పార్లమెంటుపై దాడి కేసు తీర్పు వెలువడిన తరువాత, ఉరిశిక్షపడ్డ ముద్దాయిల స్వంత జిల్లా అయిన బారాముల్లాలో ప్రజలు 'ప్రజాస్వామ్యాన్ని ఖూనీచేసిన' భారత న్యాయవ్యవస్థను నిరసిస్తూ పెద్ద ఎత్తున ఊరేగింపులు తీసారు. నిరసన ప్రదర్శనలు చేపట్టారు. మన మీడియా మనకు ఈ విషయం చెప్పలేదు. ఆ విధంగా మీడియా ప్రజాస్వామ్యాన్ని కాపాడింది.

ప్రజాస్వామ్యం అన్న మాటకు ఇప్పుడు చాలా అర్థాలు ఉన్నాయని దీనిని బట్టి అర్థం అవుతుంది. ప్రజాస్వామ్యానికి ఇన్ని అర్థాలు ఉండడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని వేరే చెప్పనవసరం లేదు.

'పోటా' ఉండడం వల్లనే పార్లమెంటుపైన దాడి కేసులో దోషులకు శిక్ష పడిందనీ, 'పోటా' ఎంత అవసరమో దీనిని బట్టి అర్థం అవుతుందనీ బిజెపి నాయకులు వ్యాఖ్యానించారు. అది పచ్చినిజం. పార్లమెంటుపైన దాడి కేసులో ముద్దాయిలు పోలీసులకు ఇచ్చిన 'ఒప్పుకోలు' తప్ప వేరే సాక్ష్యమేదీ లేదు. తీసుకునే పద్ధతిలో 'ఒప్పుకోలు' తీసుకుంటే సజ్జన్‌కుమార్ మాత్రం నేరం ఒప్పుకోకపోయేవాడా! అయితే అతని వంటి కాంగ్రెస్ నాయకుని దగ్గర ఒప్పుకోలు తీసుకునే పోలీస్ అధికారి ఈ దేశంలో లేడు. తీసుకున్నా, మామూలు నేరస్మృతి దానిని సాక్ష్యంగా అంగీకరించదు. 'ముస్లిం తీవ్రవాదుల' చేత పోలీసులు వీరోచితంగా నేరం ఒప్పించనూ గలరు, దానిని సాక్ష్యంగా అంగీకరించే టాడా, పోటా వంటి చట్టాలు వారిపైన ప్రయోగించనూ గలరు.

ప్రజాస్వామ్యంలాగే న్యాయానికి కూడ ఇప్పుడు భిన్న అర్థాలు వచ్చాయని దీనిని బట్టి అర్థం అవుతుంది. అది కూడ మంచిది కాదని చెప్పనవసరం లేదు.

భారతదేశ అధికార వర్గాలపైన, అధికార సంకేతాలపైన దాడి చేసిన వారందరికీ ఉరిశిక్షలు పడ్డాయి. ఇందిరాగాంధీని చంపిన వారికి, రాజీవ్‌గాంధీని చంపిన వారికి, సేనాధిపతి జనరల్ వైద్యను చంపినవారికి, పార్లమెంటుపైన దాడిచేసి కాపలా వున్న సెక్యూరిటీ సిబ్బందిని చంపిన వారికి, కోయంబత్తూరులో ఒక కానిస్టేబుల్‌ను చంపిన వారికీ – వీరందరికీ ఉరిశిక్ష వేసారు.

ప్రజలను చంపిన వారికి ఉరిశిక్ష కాదు, ఏ శిక్షా వేయలేదు. బజార్లో నిలబడి సిక్కుల మీదికి జనాన్ని రెచ్చగొట్టి మూకుమ్మడి హత్యలు చేయించిన హెచ్.కె.ఎల్. భగత్‌కు, సజ్జన్‌కుమార్‌కు ఏ శిక్షా పడలేదు. ఇంకొక సందర్భంలో, ఇంకొక చోట ముస్లింలను మూకుమ్మడిగా చంపిన ప్రవీణ్ తొగాడియాకు, నరేంద్రమోడికి, అశోక్ భట్‌కు, హిరేన్ పాండ్యాకు ఏ శిక్ష వేయించారు.

ఇది దేశంలోని మెజారిటీ మతస్తులయిన వారికి, ప్రధాన స్రవంతి జాతులకు, రాజకీయాలకు చెందిన వారికి మామూలు విషయంగా కనిపించవచ్చు – కానీ అందరికీ అంతే సాదా విషయంగా కనిపిస్తుందనుకుంటే పొరబాటు. నేరాన్ని నేరంగా గుర్తించడంలోనూ శిక్షించడంలోనూ నిష్పాక్షికతను కోల్పోయిన న్యాయవ్యవస్థ తన మీదనే కాదు, మొత్తంగా సమాజం మీదనే విశ్వాసాన్ని చంపేస్తుంది. ఎందుకంటే విశ్వాసానికి న్యాయం కీలకమయినది. ఒక సమాజంలో న్యాయబద్ధమైన న్యాయవ్యవస్థ ఉందన్న నమ్మకం ఆ సమాజం పట్ల విశ్వాసాన్ని పెంచినంతగా వేరే ఏదీ పెంచదు. న్యాయవ్యవస్థలో తమకు న్యాయం జరగదన్న అపనమ్మకం ఏర్పడినట్టయితే ఆ సమాజంపైన విశ్వాసం అంతగానూ పతనం అవుతుంది. ముస్లిం తీవ్రవాది అనిపించుకున్నవాడు పోలీసుల చేతికి చిక్కితే కాటికే తప్ప జైలుకు పోడన్న అపనమ్మకం ఏర్పడినట్టే, కోర్టు చేతికి చిక్కితే ఉరికంబం తప్పించుకోలేడన్న అపనమ్మకమూ ఏర్పడింది.

ఈ అపనమ్మకం నుండి మన సమాజాన్ని బయటవేయగలమా అన్నది భారత ప్రజాస్వామ్యానికి ఈ రోజు అతిపెద్ద సవాలు. దీని మీద ఎవ్వరికీ ఆసక్తి ఉన్నట్లు కనిపించకపోవడం నిజంగా దురదృష్టకరం.

**ప్రజాతంత్ర**

**6 జనవరి 2003**

# ఇది మన వైఫల్యమే, పోలీసుల వైఫల్యం కాదు

**లుం**బిని పార్కు, గోకుల్ ఛాట్ పేలుళ్లకు బాధ్యులయిన వారిని గుర్తించి విచారించి శిక్షించాలని అందరూ కోరుకుంటారు. అయితే హైదరాబాద్ నగర పోలీసులు వ్యవహరిస్తున్న తీరు చాలా ఆందోళనకరంగా ఉంది.

ఘటన జరగగానే ఫలానా బంగ్లాదేశీ సంస్థ హస్తం ఇందులో ఉందనీ, హైదరాబాద్ వాసి అయిన బిలాల్ అనే వ్యక్తి పాత్ర ఉందనీ నగర పోలీసులు ప్రకటించారు. అంత వేగంగా వారికెట్లా తెలిసి ఉండగలదు? తెలిసి ఉండే అవకాశం లేదు, తెలీదు. మరి వెంటనే పత్రికల కెందుకెక్కినట్టు? పేలుళ్లను నిరోధించడంలో పోలీసులు విఫలమయ్యారన్న నిందలు వస్తుండడంతో చాలా 'అలర్ట్'గా ఉన్నామనిపించుకోవడం కోసం ఏమీ తెలీకపోయినా తెలిసినట్టు నటించడం తప్ప ఈ ప్రకటన వెనుక వేరే ఏమీ లేదు.

గతంలో మక్కా మసీదు పేలుడుకు ఉపయోగించిన పద్ధతినే ఇక్కడా ప్రయోగించడం వల్ల ఈ నిర్ధారణకు వచ్చామని నగర పోలీసులు అన్నారు. కానీ మక్కా మసీదు పేలుడుపైన నేర పరిశోధన ఎప్పుడు పూర్తయింది? దానికి ఎవరు బాధ్యులో ఎప్పుడు తేల్చారు? అది తేల్చకుండ దానితో పోలికలున్నాయని దీని గురించి నిర్ధారణకు రావడమేమిటి?

నిజానికి నగరంలో పేలుళ్లను నిరోధించడంలో పోలీసులు విఫలమయ్యారన్నది అర్థం లేని ఆరోపణ. ఏదయినా నిర్దిష్టమైన సమాచారం ఉంటే పట్టించుకోనప్పుడు ఆ నింద వేయవచ్చును గానీ 'హైదరాబాద్‌లో ఏ రోజయినా పేలుళ్లు జరగగలవు' అన్న హెచ్చరికను పట్టించుకోలేదనేది ఏ రకమైన

విమర్శ? ఆ మాత్రం హెచ్చరిక చేయడానికి సిబిఐ అక్కరలేదు, ఇంటిలిజెన్స్ బ్యూరో అక్కరలేదు. ఎవరైనా ఆ మాత్రం ఊహించగలరు. దానిని పట్టించుకోవడం అంటే ఏమిటి? ప్రతీరోజు ప్రతీ వీధిలో ప్రతీ కూరగాయల సంచినీ ప్రతీ పాలప్యాకెట్‌నూ ప్రతీ ఒక్కరి సెల్‌ఫోన్‌నూ తనిఖీ చేయడమా? అదే జరిగితే నగరంలో మనం బతుకగలమా? ఒక నేరం జరగగానే 'పోలీసుల వైఫల్యం' అంటూ నిందలు వేయడం పోలీసులకు లేనిపోని అధికారాలు కట్టబెట్టి ప్రజల దైనందిన జీవితాన్ని దుర్భరం చేస్తుందని ప్రజా జీవితంలో ఉండే వాళ్లు గ్రహించాలి. బాంబులు పెట్టేవాళ్లు ఈ సోదా కార్యక్రమం అలసి ఆగిపోయే దాకా వేచి ఉండగలరు. ఆ తరువాత తమ పని చేసుకుపోగలరు.

తమ అధికారాన్ని, పెత్తనాన్ని పెంచుతుంది కాబట్టి ఈ నిందలకు పోలీసులు పెద్దగా అభ్యంతరం చెప్పడం లేదు. తమ తెలివినంతా ప్రదర్శిస్తూ దూకుడుగా నేర పరిశోధనకు దిగి ప్రతిరోజూ తమ నేర పరిశోధన మీద తామే రన్నింగ్ కామెంటరీ ఇస్తూ ఇన్వెస్టిగేషన్ కొనసాగిస్తున్నారు. నేర పరిశోధన పత్రికా ముఖంగా చేస్తున్నారు. ఈ క్రమంలో వ్యక్తుల పరువూ దేశాల పరువూ సంస్థల పరువూ తీస్తున్నారు. చివరికి వేసే చార్జ్‌షీటులో ఏముందో ఎక్కువమంది చూడరు. అంతవరకు అధికారికంగానూ అనధికారికంగానూ చేస్తున్న వ్యాఖ్యలే ఎక్కువ ప్రచారం పొందుతాయి.

ఇది ఏ రకంగానూ వాంఛనీయం కాదు. అసలు నేర పరిశోధన సాఫల్యానికి కూడ మంచిది కాదు. నేరం జరిగిన తెల్లవారి నుండి బంగ్లాదేశీ సంబంధం ఏదో ఉందని ప్రకటించి నాలుగయిదు రోజులలో ఒక బంగ్లాదేశీ యువతిని పట్టుకొని తమ అనుమానం నిజమయిందని మళ్లీ ప్రకటించి, ఆమెకు బెంగుళూరుతో ఏదో సంబంధం ఉందని తెలుసుకొని రేపే బెంగుళూరు బయలు దేరిపోవాలని మళ్లీ పత్రికా ముఖంగా తీర్మానించడమా పరిశోధన! దాంతో వీళ్లు అక్కడికి పోయేసరికి ఆ నగరంలోని బంగ్లాదేశీయులు డజను మంది మాయమయ్యారంట. కాక ఏం చేస్తారు? వాళ్లు దోషులైనా, ఈ 'బంగ్లాదేశీ కోణం' కథ నిజమైన, కల్పనైనా బంగ్లాదేశీ అయినవాడు దాక్కోక ఏం చేస్తాడు? మనవాళ్ల చేతికి చిక్కితే మర్యాదగా ప్రశ్నించి వదిలేస్తారా ఏమన్నానా?

నేర పరిశోధన చట్టబద్ధంగా జరగాలనీ ప్రజల హక్కులను గౌరవిస్తూ జరగాలనీ పట్టుబట్టే హక్కుల సంఘాలు సహితం నేర పరిశోధన పూర్తిగా పారదర్శకంగా జరగాలని అనలేదు. ఏ రోజుకారోజు కేస్ డైరీ పత్రికల వారికి

చూపిస్తూ పురోగమించాలని అనలేదు. సమాచార హక్కు చట్టం కూడ ఈ సమాచారానికి మినహాయింపు ఇచ్చింది. మరి ఈ పారదర్శకమైన నేరపరిశోధన ఎందుకోసం చేస్తున్నట్టు? తమ తెలివితేటలు ప్రదర్శించుకోవడానికి కాకపోతే?

కానీ నిజానికి పారదర్శకత ఉండవలసిన దగ్గర ఉండడం లేదు. అరెస్టు చేసిన వారిని ఎక్కడికి తీసుకుపోతున్నారు, ఎందుకు అరెస్టు చేస్తున్నారు, ఎక్కడ నిర్బంధించారు అన్నది తప్పనిసరిగా తెలియజేయాలి. ఇవి చట్టంలో ఎప్పుడూ అంతర్లీనంగా ఉండే హక్కులే కాగా, 'డి.కె.బసు' కేసులో సుప్రీంకోర్టు ఈ నియమాలను చట్టంలో భాగంగా పరిగణించి అమలు చేయాలని ఆదేశించింది. దానిని గౌరవిస్తున్న సూచనలు లేవు. హైదరాబాద్‌లో తెల్లబట్టల పోలీసులు అనధికార వాహనాలలో దాడులు చేస్తూ ముస్లిం యువకులను తీసుకుపోతున్నారు. తాము ఎవరో, తమ కార్యాలయం ఎక్కడుందో చెప్పడం లేదు. తీసుకుపోయిన వారిని ఎక్కడ నిర్బంధిస్తున్నదీ ఎవరికీ తెలీదు' ఎందుకు తీసుకుపోతున్నదీ తెలీదు. గాభరా పడిన కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో అడిగితే మాకేం తెలీదని వారంటున్నారు. పాతబస్తీకి చెందిన ముస్లిం యువకులు ఒంటరిగా బయటకు పోవడానికి భయపడే పరిస్థితి నెలకొంది. కానీ ఇప్పుడెవరేం మాట్లాడుతారు? నిన్నటి దాకా వైఫల్యం అని తిట్టి ఇప్పుడు పని చేస్తుంటే చేయొద్దంటే ఎట్లా అని పోలీసులడగరూ?

అసలు విషయానికొస్తే, పాకిస్తాన్ హస్తమూ బంగ్లాదేశీ హస్తమూ ఉంటే ఉండవచ్చును గానీ మనదేశంలోని ముస్లిం యువతలోనే అసంతృప్తి చాలా ఉందనీ జిహాద్ పేరుతో పిలవబడుతున్న హింసాకాండ పట్ల ఆకర్షితులవుతున్న వారున్నారనీ గుర్తించడం అవసరం. దీనిని పోలీసులు నివారించలేరు. వాళ్లు నివారించడమంటే ముస్లింలను ఒక సమూహంగా సతాయించడమే. దీనిని నివారించవలసింది సామాజిక శక్తులే. ఇందులో ముస్లిం మత పెద్దల నుండి ప్రజాతంత్ర సంస్థలు, మీడియా, సామాజిక కార్యకర్తల దాకా అందరికీ పాత్ర ఉంది. 'జిహాదీ'ల క్రూరత్వం అపారమైనదే గానీ దానివైపు ఆకర్షితులవుతున్న వారికి బలమైన కారణాలున్నాయి. దేశం లోపల ముస్లింలలో పేదరికం నిరుద్యోగం అవకాశాల లేమి దగ్గర మొదలు పెట్టి ఇరాక్, పాలస్తీనా, కాశ్మీర్‌ల దాకా ముస్లింల దగ్గర పెద్ద అభియోగాల జాబితాయే ఉంది. నిజానికి ఈ అభియోగాలలో న్యాయం ఉందని మతం ప్రమేయం లేకుండ ప్రజాతంత్ర శక్తులంతా అంగీకరిస్తారు. అయితే వాటిపట్ల నిరసన వేరువేరుగానే ఉంటున్నది.

ముస్లింల నిరసన తరచుగా మత సంస్థల ద్వారా వ్యక్తమయివుతున్నది కావడం తప్పు కాదుగానీ ఆ నిరసన అక్కడితో ఆగిపోకుండ ప్రజాతంత్ర స్రవంతిలో కలవడం అవసరం. అప్పుడది అనారోగ్యకరమైన పోకడల నుండి దూరం ఉండగలదు.

ఇరాక్ మీద అమెరికా దాడి చేసినప్పుడు, అంతకు ముందు బాబ్రీ మసీదును కూల్చేసినప్పుడు, హైదరాబాద్‌లో ప్రజాతంత్ర శక్తుల ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద, బషీర్‌బాగ్‌లోను నిరసన కార్యక్రమాలు జరిగాయి. విడిగా శుక్రవారం ప్రార్థనల అనంతరం ముస్లింల నిరసన మక్కా మసీదు నుండి వ్యక్తమయింది. సమాజం మొదటి దానిని న్యాయబద్ధమైన నిరసనగాను, రెండవ దానిని మతపరమైన నిరసనగాను చూసింది. మొదటి దానిని గౌరవించింది. రెండవ దానిని అనుమానంగా చూసింది. అది ఇటు రాదు, ఇది అటు పోదు.



ముస్లింలకు, ముస్లిం ప్రజానీకం మెజారిటీగా ఉన్న సమాజాలకూ జరిగిన, జరుగుతున్న అన్యాయం పట్ల వారిలో ఉన్న ఆగ్రహం న్యాయమైనదన్న సందేశం పంపుతూ, దానిని నిరసించే కార్యక్రమాన్ని మత సంస్థలకు పరిమితం చేయవద్దనీ, అంతకంటే ముఖ్యంగా అమానుషత్వాన్ని అమానుషంగా ఎదుర్కొనే తప్పుడు దారి పట్టవద్దనీ ముస్లిం యువకులకు పిలుపునియ్యవలసిన బాధ్యత, దానినొక సామాజిక కార్యక్రమంగా చేపట్టవలసిన బాధ్యత మనందరి మీదా ఉంది. పాకిస్తాన్‌నూ బంగ్లాదేశ్‌నూ తిట్టుకోవడం ఈ బాధ్యతను విస్మరించడానికే పనికొస్తుంది.

పనికి పూనుకోకపోవడం మనందరి వైఫల్యం. దీనితో పోలిస్తే పోలీసుల వైఫల్యం చిన్నదే.

**ప్రజాతంత్ర**
**9 సెప్టెంబర్ 2007**

# పేలుళ్లపై దర్యాప్తు ప్రహసనం!

**ప**ట్టణాలలో బాంబు పేలుళ్లు నిజమే. వాటి అమానుషత్వమూ నిజమే. కానీ ఈ బాంబు పేలుళ్ల గురించి పోలీసులు చేస్తున్న నేర పరిశోధన ఒక ప్రహసనం. దీనిని ప్రహసనం అంటే బాంబు పేలుళ్లను సమర్థిస్తున్నట్టేనన్న నింద వేస్తారని ఎవరయినా ఎన్నాళ్లు భయపడగలరు?

2007లో హైదరాబాద్‌లో జరిగిన బాంబు పేలుళ్ల సూత్రధారి మూసారంబాగ్ నివాసి అయిన షాహిద్ ఉరఫ్ బిలాల్ అని పోలీసులు అప్పటికప్పుడే ప్రకటించారు. అతను బంగ్లాదేశ్ కేంద్రంగా గల హర్కతుల్ జిహాదీ ఇస్లామీ (హుజీ) కార్యకర్త అన్నారు. అతనితోపాటు తప్పాచబుత్ర, జిర్రా, ఆసిఫ్‌నగర్ ప్రాంతాలలో సూట్‌కేసులు, స్కూల్ బ్యాగులు తయారుచేసే బెంగాలీ మాట్లాడే ముస్లింలు పలువుర్ని కూడా అరెస్టు చేశారు. షాహిద్ తమ్ముడినీ, ఇరుగుపొరుగునూ, గతంలో అతనితోపాటు ఆందోళనలలో పాల్గొన్న వారినీ అరెస్టు చేశారు. వీరంతా ద్వేషం కక్కే ఉపన్యాసాలతో నిండిన క్యాసెట్లతో మత విద్వేషాన్ని రెచ్చగొట్టడానికి కృషి చేస్తున్నారనీ, ఒక కబరస్థాన్‌లో కూర్చొని కాసెట్లు పంచుకుంటుండగా పోలీసులకు దొరికిపోయారనీ కేసు పెట్టారు. భారత ప్రభుత్వం మీద యుద్ధం చేస్తున్నారనీ, రాజద్రోహానికి పాల్పడ్డారనీ, హుజీ నేత అయిన షాహిద్ మార్గదర్శకత్వంలో విధ్వంసానికి కుట్ర చేస్తున్నారనీ అభియోగం మోపారు. ఇద్దరి అరెస్టుతో మొదలయిన ఈ కేసులో 64 మందిని కాలక్రమంలో

ముద్దాయిలుగా చూపించారు. పట్టుకున్న ప్రతి ఒక్కరినీ తీవ్రంగా చిత్రహింసలకు గురిచేశారు. కాబట్టే కొత్తపేర్లు దొరుకుతూ వచ్చాయి. పెరిగి పెరిగి 64 అయ్యాయి.

అయితే రెండు వారాల క్రితం హైదరాబాద్ పోలీసుల నేర పరిశోధనతో నిమిత్తం లేకుండ ముంబయి పోలీసులు అనేక బాంబు పేలుళ్ల ఘటనలతో బాటు హైదరాబాద్ పేలుళ్ల రహస్యాన్ని కూడ ఛేదించామని ప్రకటించారు. వారి కథలో 'హుజి' లేదు, షాహిద్ లేడు. వారి కథలో హైదరాబాద్ పేలుళ్ల సూత్రధారి రియాజ్ భట్కల్. కర్ణాటక రాష్ట్రంలోని దక్షిణ కన్నడ జిల్లావాసి. అతని సంస్థ ఇండియన్ ముజాహిదీన్. మరైతే మన రాజధానిలో అరెస్టు చేసి జైలుపాలు చేసిన 64 మంది సంగతేమిటి? చార్జిషీటు దాఖలయిపోయింది గానీ లేకపోతే హుజీ కాదు, ఇండియన్ ముజాహిదీన్ వారి మాతృసంస్థ అనకపోదురా?

ఒకప్పుడు ఎక్కడ పేలుళ్లు జరిగినా లష్కర్, జైష్‌ల పేర్లు చెప్పేవారు. వాటితోపాటు ఐఎస్ఐని జతచేసి ఈ మూడు సంస్థల కుట్ర అనేవారు. ఆ తరువాత హుజీ రంగ ప్రవేశం చేసింది. దేశంలో ఎక్కడెక్కడో కూలి చేసుకొని బతుకుతున్న బంగ్లాదేశీలను అరెస్టు చేయడానికిది పనికొచ్చింది. కొంత కాలం ఏ బాంబు పేలుడు జరిగినా అది హుజీ పనేనన్న గంభీరమైన ప్రకటన చేస్తూవచ్చారు. మీడియా దాన్ని నిర్విమర్శగా రాసింది. సిమిపైన నిషేధానికి ఆధారాలేవీ లేవని ట్రిబ్యునల్ కొట్టేసిన తరువాత అన్ని పేలుళ్ళలోనూ సిమి హస్తాన్ని చూడసాగారు. అంతకు ముందు ఎప్పుడూ సిమి పేరు లేదు. ట్రిబ్యునల్ తీర్పును సుప్రీంకోర్టులో స్టే చేయించడానికి ఇది పనికి వచ్చింది. త్వరలోనే సిమి స్థానంలో ఇండియన్ ముజాహిదీన్ వచ్చి చేరింది. ధనవంతుల వేషధారణలో ఫ్యాషన్లు మారినట్లు టెర్రరిస్టు నేరాల పరిశోధనలోనూ ఫ్యాషన్లు మారుతుంటాయి. నిన్నటి సూత్రధారి ఇవ్వాళ వినపడడు, ఇవ్వాల్టి సూత్రధారి రేపు వినపడడు. నిజమే, బాంబు పేలుళ్లు సత్యమే, వాటి అమానుషత్వం సత్యమే, వాటిలో పోతున్న అమాయక ప్రాణాలూ సత్యమే. అయితే అవి ఎంత భయంకర సత్యాలయినా వాటి చాటున ఈ అబద్ధాన్ని ఎన్నాళ్లు దాచుతాం? ఆ సత్యం పేరిట ఎన్నాళ్లు ఈ అబద్ధాలను మోస్తాం.

ఢిల్లీ జామియానగర్ 'ఎన్‌కౌంటర్' చుట్టూ ఒక వివాదం చెలరేగుతున్నది. సెప్టెంబర్ 19 నాడు జరిగిన ఈ ఎన్‌కౌంటర్‌లో అంతకు కొద్దిరోజుల ముందు ఢిల్లీలో జరిగిన బాంబు పేలుళ్లకు బాధ్యులయిన ఇద్దరు ఇండియన్ ముజాహిదీన్ కార్యకర్తలతో బాటు ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్ అని పేరు సంపాదించుకున్న మోహన్‌చంద్ శర్మ అనే పోలీస్ ఇన్‌స్పెక్టర్ చనిపోయాడని మొదట చదివినప్పుడు ఇది నిజమైన ఎదురుకాల్పుల ఘటనేనేమో అని అందరం అనుకున్నాం. కానీ తరువాత చాలా సందేహాలు తలెత్తాయి. చనిపోయిన ఇద్దరు ముస్లిం యువకులు (మహమ్మద్ సజిద్, అతీఫ్ అమీన్) విద్యార్థులు. మొదటి అతని వయస్సు కేవలం 17. రెండో అతని వయస్సు 24. ఢిల్లీ, బెంగుళూరు, అహమ్మదాబాద్, హైదరాబాద్ (అవును, మళ్లీ హైదరాబాద్) పేలుళ్ల పథకరచనలో వీరికి కీలకపాత్ర ఉందని పోలీసులన్నారు. ఇరుగు పొరుగు ఎవరూ ఇది నమ్మడం లేదు. చనిపోయిన ఇద్దరు కాక మరొక ఇద్దరు కూడ అక్కడ ఉన్నారనీ, వారు కాల్పులు జరుగుతున్న క్రమంలో తప్పించుకున్నారనీ పోలీసులు అన్నారు. ఎన్‌కౌంటర్ జరిగింది ఒక నాలుగంతస్తుల భవనంలోని నాలుగవ అంతస్తులో. ఆ భవనం నుంచి కిందికి పోవడానికి ఒకే మెట్లదారి ఉంది. వాటి దిగువన సాయుధ పోలీసులు కాపలా ఉన్నారు. ఎవరయినా ఎట్లా తప్పించుకోగలరు? సజిద్ తలపైన మధ్యభాగంలో ఏడెనిమిది గాయాలున్నాయని అతని మృతదేహాన్ని ఖననం చేసేముందు స్నానం చేయించినవారు గమనించారు. మొబైల్ ఫోన్ ద్వారా ఫోటో కూడా తీశారు. పోలీసులపై కాల్పులు జరుపుతూ అతను కింద పడిపోయాడనీ, అందువల్ల తలకు బుల్లెట్ గాయాలయ్యాయనీ పోలీసుల వివరణ.

'ఎన్‌కౌంటర్' జరిగింది సెప్టెంబర్ 19న కాగా 24వ తేదీన నిజ నిర్ధారణ కోసం అక్కడికి వెళ్లిన బుద్ధిజీవుల బృందానికి ఎదురయిన అనుభవం ఏమిటంటే ఆ గల్లీ మొత్తం పోలీసు పహారాలో ఉంది. ఆ బిల్డింగ్‌లోకి పోలీసుల అనుమతి లేకుండా ఎవరూ వెళ్లడానికి, స్థానికులతో మాట్లాడడానికి వీలులేదు. నిజాలు దాచిపెట్టే ఉద్దేశ్యం లేకపోతే ఇంతటి నిఘా ఎందుకు? ఇద్దరు మిలిటెంట్లను చంపి వారికి సహకరించారని భావించిన తక్కిన వారినందరినీ అరెస్టు చేసిన తరువాత కూడ ఇంతటి

బందోబస్తు ఎందుకు? ఇంతటి నిఘా మధ్య కూడ స్థానికులు అనేక విషయాలు బయటపెట్టారు. చనిపోయిన యువకుల గదినుంచి స్వాధీనం చేసుకున్నట్లు చెప్తున్న లాప్‌టాప్, ఆయుధాలు వగైరాలకు పంచనామా అక్కడ జరపలేదు. స్థానికులు వాటి స్వాధీన ప్రక్రియకు సాక్షులు కారు. నేరానికి సంబంధించిన వస్తువులను స్వాధీనం చేసుకునేటప్పుడు స్థానికులు సాక్షులుగా పంచనామా జరపాలన్న నియమాన్ని ఎందుకు పాటించలేదు? 15 నిమిషాల పాటు కాల్పులు జరిపిన తరువాత పోలీసులు అక్కడున్న పూలకుండీలను ఎత్తిపడేసి విరిగిన ముక్కలతో కిటికీల అద్దాలు పగలగొట్టి 'ఎన్‌కౌంటర్' సీన్ సృష్టించారని స్థానికులు అన్నారు. గాయపడిన మోహన్‌చంద్ శర్మను కిందికి తీసుకొచ్చిన తరువాత ఆ ఇద్దరు యువకులను నాలుగవ అంతస్తునుంచి తీసుకురావడం చూసామని, ఆ తరువాతే వారిని చంపారనీ కొందరు అన్నారు. పోలీసులు ఏదో సమాచారం ఆధారంగా సోదా కోసం వచ్చారనీ, అక్కడున్న యువకులు ఎదురు తిరిగిన కారణంగా ఏకపక్షంగా కాల్పులు మొదలుపెట్టారనీ, ఇరుకు గోడల మధ్య జరిపిన కాల్పులలో మోహన్‌చంద్ శర్మ పోలీసు బుల్లెట్లకే గాయపడ్డాడనీ, ఆ తరువాత వారు ఇద్దరు యువకులను చంపారనీ ఒక బలమైన అభిప్రాయం ఉంది. అప్పటికే ఢిల్లీ బాంబు పేలుళ్లకు బాధ్యులుగా భావించిన వారి ఊహాచిత్రాన్ని గీయించిన పోలీసులు మృతులను ఖననం చేయడానికి ముందు వీరి ఫోటోలను ఆ ఊహాచిత్రాలతో పోల్చే ప్రయత్నం చేయలేదు. ఎందుకు చేయలేదు?

ఇవన్నీ నిరాధారమైన సందేహాలు కావచ్చు. ఆ బిల్డింగ్‌లో నివసించేవారంతా ముస్లింలు కావడం వల్ల కావాలని అబద్ధాలు చెప్తుండవచ్చు. నిజ నిర్ధారణ చేయ ప్రయత్నించిన బుద్ధిజీవులు పోలీసులను బదనాం చేయడమే పనిగా పెట్టుకున్న వికృత బుద్ధులు కావడం వల్ల లేనిపోని వ్యాఖ్యలు ప్రచారం చేస్తుండవచ్చు. అయినప్పటికీ ఇన్ని సందేహాలు ఉన్నప్పుడు న్యాయవిచారణ డిమాండ్ చేయడం, సిబిఐ చేత నేరపరిశోధన జరిపించాలని డిమాండ్ చేయడం తప్పెట్లాగయింది? ఎన్‌కౌంటర్ మృతుల సహచరులన్న పేరుమీద పోలీసులు అరెస్టుచేసిన జామియా మిలియా

విశ్వవిద్యాలయం విద్యార్థులకు న్యాయసహాయం అందియ్యాలని వైస్‌చాన్సలర్ తీసుకున్న నిర్ణయాన్ని ఎందుకు దేశద్రోహకరమైన చర్యగా భావించాలి? ప్రొఫెసర్ ముషీరుల్ హసన్ ఏ అర్థంలోనూ సనాతనవాది కాదు, తీవ్రవాది కాదు. సామాజిక శాస్త్రరంగంలో ఉదారవాద భావాలు గల పరిశోధకుడిగా ఆయనకు గుర్తింపు ఉంది, మంచిపేరు ఉంది. పోలీసుల కథనంలోని అనుమానాస్పద విషయాల కారణంగా బీద విద్యార్థులు న్యాయసహాయం లేక అబద్ధాలకు బలికావద్దని ఆయన భావిస్తే తప్పేముంది?

భారతదేశ పౌరులుగా మనం ఒక విషయం ఇకనైనా గ్రహించాలి. మన పోలీసులకు బాంబు పేలుళ్లకు బాధ్యులయిన వ్యక్తుల గురించి, సంస్థల గురించి ఏమీ తెలీదు. మేము తెలుసుకోలేకపోతున్నాం, కొంత గడువు ఇవ్వండి అని అడిగితే వారిని ఎవరూ ఏమీ అనరు. అది నిజాయితీగానూ ఉంటుంది. రహస్యాలను ఎప్పటికప్పుడు ఛేదించడానికి వారేం మాంత్రికులు కారు. అయితే నిజాయితీ వీరోచితంగా కనిపించదు. కాబట్టి ఒక బాంబు పేలుడు జరగగానే ఆ రాష్ట్ర పోలీసు యంత్రాంగం ఒక గంభీరమైన ప్రకటనతో ముందుకొస్తుంది. నిన్నటిదాకా ఏమీ తెలియని వాళ్లు, నేరాన్ని నిరోధించనివాళ్లు ఇవాళ పూర్తి సమాచారంతో ముందుకొస్తారు. సూత్రధారులెవరు, పాత్రధారులెవరు, కుట్రదారులెవరు, పేలుడు పదార్థం ఎక్కడ తయారయింది, పాకిస్తాన్‌తో వారి సంబంధాలేమిటి – అన్నీ చెప్పేస్తారు. (ఏమైనా మిగిలిపోతే గుజరాత్ నుంచి నరేంద్ర మోడీ చెప్పేస్తాడు). సూత్రధారులూ కుట్రదారులూ దొరకరు కాబట్టి వారికి సహకరించిన స్థానికులు అన్న పేరు మీద అరెస్టులు మొదలుపెడతారు. మళ్లీ ఇంకొకచోట బాంబు పేలుళ్లు జరిగితే ఆ రాష్ట్ర పోలీసులు ఇదే తంతు మొదలుపెడతారు. వారి జాబితా వారు ప్రకటిస్తారు. ఈ సూత్రధారులు, కుట్రదారులు ఒక ఘటనకు పరిమితమా అంటే కాదు. అహమ్మదాబాద్, బెంగుళూరు, సూరత్, ఢిల్లీ, హైదరాబాద్ అంటూ దండకం చదవాల్సిందే కానీ ఒక రాష్ట్ర పోలీసుల సూత్రధారులు ఇంకొక రాష్ట్రానికి పనికిరారు. అన్ని బాంబు పేలుళ్ళకూ సూత్రధారులొకరే గానీ వారెందరో! దీనిని ప్రహసనం అనకపోతే ఇంకేమనాలి? కానీ ఇది జోక్ మాత్రం కాదు. ఈ క్రమంలో వందలమంది, బహుశా వేలమంది ముస్లింలు అరెస్టవుతున్నారు.

చిత్రహింసలకు గురవుతున్నారు. ఢిల్లీలోలాగ కొందరు 'ఎన్‌కౌంటర్' అవుతున్నారు. ఈ దేశంలో ముస్లింలకు న్యాయం జరగదన్న నిరసన పెంచుకుంటున్నారు. ఇది ఎవరికి మంచిదని మన పాలకులు ఈ ప్రహసనాన్ని సాగనిస్తున్నారు?

**ఆంధ్రజ్యోతి దినపత్రిక**
**22 అక్టోబర్ 2008**

# ఎన్నాళ్ళీ సంకుచితత్వం

'ఐఎస్ఐ ఏజెంట్లు మసీదు మీదకెక్కి దుర్గామాత పైన చెప్పులు విసిరారు', 'జిహాద్ జిహాద్ అంటూ మా ఇళ్ళ మీదికి వచ్చారు', – ఇవి భైంసాలో అక్టోబర్ 10వ తేదీన జరిగిన ఘర్షణల గురించి వినపడ్డ వ్యాఖ్యలు. అల్లరి మొదలయినప్పటి నుండి అక్కడే ఉన్న పోలీసులూ విలేఖర్లూ ఈ దృశ్యాలు చూడలేదు, ఈ మాటలు వినలేదు. అయినా ఫలానా అబ్దుల్‌మియా మసీదుపైకెక్కి ఏవో చేసాడంటే అవునేమో అనుకోవచ్చుగానీ 'ఐఎస్ఐ ఏజెంట్లు' చేసారంటే ఏమనుకోవాలి? ఈ మాటలు అన్నవారు హిందువుల సంరక్షకులుగా తమను తాము నియమించుకున్న సంఘ్‌పరివార్‌కు చెందినవారయితే ఈ పైత్యం ఎప్పుడూ ఉండేదేలే అనుకోవచ్చు. కానీ ఈ మాటలన్నది కాంగ్రెస్ పార్టీకి చెందిన పట్టణ శాంతి కమిటీ సభ్యుడు, మరో మామూలు గృహిణి. ఒకప్పుడు కేవలం ఆర్ఎస్ఎస్ ప్రచురణలలో, వారి శాఖలలో దర్శనమిచ్చే మాటలు, వ్యాఖ్యలు ఇప్పుడు ఎంతగా హైందవ సమాజంలో ప్రచారం అయ్యాయనడానికి ఇదొక మచ్చుతునక. స్వాతంత్ర్యం తరువాత ఒక సెక్యులర్ రాజ్యాంగం రాసుకుని భిన్నమతాలు, సంస్కృతులవారు కలిసిమెలిసి బతికే దేశంగా భారత్‌ను రూపొందించాలని నిర్ణయించుకున్నాము గానీ ఆ ఆదర్శాన్ని లోపలి నుండి తొలిచివేసే సంఘ్‌పరివార్ విష ప్రచారానికి వ్యతిరేకంగా ప్రజాతంత్ర ఆదర్శాల ప్రచారం ప్రభుత్వాల వైపు నుండి గానీ ప్రజా ఉద్యమాలవైపు నుండి గానీ జరగలేదు.

భైంసాకు వచ్చినపుడు జాతీయ మైనారిటీ కమిషన్ ఒక వ్యాఖ్య చేసింది. ఉత్తర భారతదేశంలో మత ఘర్షణలు జరిగిన చోటికి తామెప్పుడు వెళ్లినా అధికార యంత్రాంగం హిందూ యంత్రాంగంగా పనిచేస్తుండడం గమనిస్తున్నామనీ, మహారాష్ట్రలోనూ, ఒరిస్సాలోనూ అదే పరిస్థితి ఉందనీ, అయితే ఆంధ్రప్రదేశ్ కొంత భిన్నంగా కనిపించిందనీ వారు అన్నారు. భైంసా అల్లర్లకు రాష్ట్ర ప్రభుత్వం పైస్థాయిలోనే వేగంగా స్పందించిన మాట వాస్తవం. ఒరిస్సాలో భీకరమైన హింసాకాండ జరుగుతున్నా ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి బాధిత ప్రాంతాలలో పర్యటించలేదు. కర్ణాటక హోంమంత్రి భజరంగ్‌దళ్‌ను సమర్థించడానికి సాక్షులు వెతకడంలో నిమగ్నమై ఉన్నాడు. మన దగ్గర మేలే. చుట్టుపక్కల గ్రామాలలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పిల్లలు, యువకులు హిందూ ముస్లిం భాయిభాయి అంటూ ఊరేగింపులు కూడా తీసారు.

అంతవరకు బాగానే ఉంది. కానీ ప్రధానంగా కృషి జరగవలసింది సామాజిక శక్తులవైపు నుండి. ద్వేషం, సంకుచితత్వం సులభంగా ప్రచారం అవుతాయి. మంచి ప్రచారం కావడమే కష్టం. పైగా ఆర్ఎస్ఎస్ 'అవగాహన' అనేది సంక్లిష్టంగా ఉండదు. దేశ చరిత్ర గురించి, సామాజిక వాస్తవికత గురించి వారికి కేవలం పిడికెడు అభిప్రాయాలుంటాయి. పరిస్థితులననుసరించి వాటిలో మార్పులు రావు. వాటికి వాస్తవాలతో ఏమీ సంబంధం లేదు. కాబట్టి స్థిరంగా ఉంటాయి. ద్వేషం, ఆధిపత్యం వాటి ప్రధాన సందేశాలు కాబట్టి అభద్రత నిండిన మనసులనవి సులభంగా ఆకర్షిస్తాయి. అవి కలిగించే ఆవేశం మాత్రం క్షణికం కాదు. పదేపదే అవే వ్యాఖ్యలు వినే మెదళ్ళలోకి ఎక్కించడం వారి లక్ష్యం. అది మనసులను ద్వేషంతో నింపుతుంది.

క్రైస్తవులపైన భజరంగ్‌దళ్ చేస్తున్న దాడులను కనీసం మొగమాటానికైనా ఖండించకపోగా, దానికి సపోర్టుగా ఒక పెద్ద కుట్ర సిద్ధాంతాన్ని ఇప్పుడు ప్రచారంలో పెట్టారు. కాథలిక్‌ల మతపెద్ద అయిన పోప్, కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ, క్రైస్తవులయిన వై.ఎస్. రాజశేఖరరెడ్డి వంటి కాంగ్రెస్ నాయకులు కలిసి భారతదేశాన్ని క్రైస్తవ దేశంగా మార్చడానికి కుట్ర చేస్తున్నారనేది ఈ సిద్ధాంతం. పోప్ సంగతేమోగానీ సోనియాగాంధీకి కాంగ్రెస్ పార్టీని అధికారంలో ఎట్లా

ఉంచడం అన్నది తప్ప వేరే చింత ఉన్న దాఖలాలు లేవు. ఇక వై.ఎస్. రాజశేఖరరెడ్డిని క్రైస్తవ ప్రచారకుడిగా చూడడం కంటే హాస్యాస్పదం ఇంకొకటి ఉండదు. అతడికి ఆస్తి, అధికారం తప్ప వేరే ఆలోచన ఏ రోజూ లేదు. దానికి అవసరమైతే క్రైస్తవాన్ని వాడుకోగలడు, రెడ్డితనాన్ని వాడుకోగలడు, దేనినైనా వాడుకోగలడు. అయినప్పటికీ ఈ ప్రచారం జరుగుతూనే ఉంది. దీని లక్ష్యం రాజశేఖరరెడ్డిపైన ద్వేషం కలిగించడం కాదు, సోనియాగాంధీపైన ద్వేషం కలిగించడం కాదు. మన చుట్టూ ఉన్న క్రైస్తవులపైన ద్వేషం రగిలించడం.

ఈ ద్వేషంతోపాటు వీరు ఇంకొక్కటి ఒక పద్ధతి ప్రకారం చేస్తున్నారు. ఇది హిందువుల దేశం. ఇక్కడ ఇతర మతస్తులు ఆ సత్యం ఎరిగి బతకాలి. మళ్లీ భైంసానే తీసుకుందాం. భైంసాలో మొదట రాళ్లు వేసింది ముస్లింలు, ఎస్ఐ కాలువిరగ్గొట్టింది ముస్లింలు, అయినా ఈయన హిందువులనే తిడుతున్నాడు చూడు అని ఇప్పటికే అనుకుంటూ ఉండవచ్చు. మొదట రాళ్లు వేసింది ముస్లింలే, ఎస్ఐ కాలు విరగ్గొట్టిందీ ముస్లింలే (తరువాత అయ్యో అంటూ ఆయనను పోలీస్ స్టేషన్‌కు మోసుకుపోయిందీ వారే), కానీ అంతకుముందు ఏం జరిగిందో చూడడం అవసరం. ఇది ఎవరి తప్పు ఎంత అని తూకం వేయడం కోసం కాదు. ఈ ఘటనల వెనకున్న కార్యాచరణ లక్ష్యం ఏమిటి అని తెలుసుకోవడం కోసం. మజ్లీస్ పార్టీకి బలం బాగా ఉన్న బైంసాలో మత అసహనం రెండువైపులా దండిగా ఉంది. అది కొత్త విషయం కాదు. అయితే 'ఇది హిందువుల దేశం' అనే సంకుచితమైన విశ్వాసాన్ని ప్రచారం చేసే కార్యాచరణ ఛాయలు భైంసా అల్లర్ల వెనక చూడకపోతే 'ఏ మతోన్మాదయినా తప్పే' అనే సత్యం దగ్గర ఆగిపోతారు.

దసరా పండగప్పుడు మగవాళ్ళు దుర్గామాతను ఊరేగింపుగా తీసుకుపోయి నిమజ్జనం చేసే సంప్రదాయం తెలంగాణలోనయినా తెలుగునాట ఎక్కడయినా ఎప్పటి నుండి ఉంది? స్త్రీలకు సంబంధించిన బతుకమ్మ పండగ తెలంగాణ సంప్రదాయమే గానీ ఊరేగింపులు కాదే. ఇవి ఈ మధ్య సంఘ్‌పరివార్ ఆధ్వర్యంలో మొదలయిన కార్యక్రమాలు. అయితే అయ్యాయి, ప్రజలు కొత్త సంబరాలు చేసుకోకూడదని కాదు. కానీ ఇది అమాయకంగా పుట్టిన సంప్రదాయం కాదు. భారతదేశాన్ని హిందూ దేశంగా

మలిచే రాజకీయ సమీకరణకు సాధనంగా మొదలయింది. వర్ణాశ్రమ ధర్మాన్ని విమర్శించని సంఘ్‌పరివార్ శూద్ర, దళిత కులాల వారిని దేవతల పూజల చుట్టూనే సమీకరించగలదు. ఆ వర్గాలకు హైందవంలో వేరే ఆకర్షణ ఏదీ లేదు. లేని పండుగలను పుట్టించడం దానికి అవసరమయింది.

ఊరేగింపులు ఆవేశానికి కూడ సందర్భాలు. కవ్వించే నినాదాలు, పాటలు రెండు వైపులా సమీకరణను పెంచుతాయి. ఘర్షణలకు సందర్భం కల్పిస్తాయి. విద్వేషవాదుల అజెండాను ముందుకు తీసుకుపోతాయి. భైంసాలో సంవత్సరం సంవత్సరానికీ పెరుగుతున్న దుర్గామాత పందిళ్లు ఈసారి 14కి చేరుకున్నాయి. పైగా జనం ఊరేగింపు మసీదు పక్కనుండి పోవాలని పట్టుబట్టారు. ఎందుకు అనుమతించారని మైనారిటీ కమిషన్ పోలీసులను ప్రశ్నించగా అసలే అనుమతించకపోతే చాలా అల్లరి చేస్తారు కాబట్టి అనుమతించి నియంత్రించాలనుకున్నామని వాళ్లు అన్నారంట. హైదరాబాద్ గణేశ్ నిమజ్జనం విషయం తెలిసిన వారికిది అర్థం అవుతుంది.

అనుమతించిన పోలీసులు, ఊరేగింపు పంజేషా చౌక్ మసీదు చేరుకునేటప్పటికి మధ్యాహ్నం నమాజు  అయిపోయేటట్టు చూసారు. మసీదుకు తాళం కూడా వేశారు. అయితే దుర్గామాత భక్తులు మసీదు దగ్గర ఆగి దాదాపు అరగంట ఎగురుతూనే వున్నారు. 'ఇంక చాలు నడవండి' అని అరగంట తరువాత ఎస్ఐ అనగా 'ఎందుకు నడవాలి? ఇది మా దేశం కాదా' అని ఎదురు ప్రశ్న వేశారు. అంతలో అవతలివైపు గుమిగూడిన ముస్లింలను సమాధానపరచడానికి ఎస్ఐ వారి దగ్గరకు పోయాడు. అదే అదనుగా, అప్పటిదాకా పెడుతున్న భక్తి క్యాసెట్ తీసేసి 'మందిర్ వహీ బనాయేంగే, రాంతేరీ కసం' అనే క్యాసెట్ పెట్టారు. ఎస్ఐ వెనక్కివచ్చి ఆ క్యాసెట్ తీసేయండి అని అంటే 'తీసేయం ఇది మా దేశం కాదా' అని దబాయించారు. ఇంకా గట్టిగా ఆదేశించినపుడు 'నువ్వు హిందువుకావా?' అని ఎదురు దబాయించారు. అప్పటిదాకా దూరం నుండి చూస్తున్న ముస్లింలు రాళ్ళు అందుకున్నారు.

'ఇది మా దేశం కాదా? మేము ఇంకొకరి మనోభావాలను ఎందుకు గౌరవించాలి?' ఈ వైఖరిని మెదళ్ళలోకి ఎక్కించడంలో సంఘ్‌పరివార్‌వారు కృతకృత్యులయ్యారు. అక్కడి నుండి భౌతిక దాడులకు, అల్లర్లకు దూరం

ఒక్కడుగే. దీనికి 'భాయిభాయి' ప్రచారం జవాబు కాదు. ఆ ప్రచారం సందర్భం వచ్చినప్పుడు చేయవలసిందేగానీ, ఈ సందర్భంలో స్పష్టంగా ఇది కేవలం హిందువుల దేశం కాదు, అందరిదీ అని చెప్పవలసి ఉంది. ఆ ఆలోచనా రీతిని ప్రజల చైతన్యంలో నిలబెట్టవలసి ఉంది. భిన్న మతాల వారు కలిసి బతకలేరు అన్న రెండు జాతుల సిద్ధాంతాన్ని తిరస్కరించిన దేశం ఇండియా. దానిని ఆనాడూ ఈనాడూ వెనకేసుకొచ్చింది గొల్వాల్కర్ శిష్యులు. ఇప్పుడు చాపకింద నీరులాగా ఆ వైఖరిని ప్రజలలో ప్రచారంలో పెట్టి ప్రజలలోని అభద్రతను వాడుకుని మైనారిటీలపైన ద్వేషం రెచ్చగొడుతున్నారు. దీనిని వ్యతిరేకించే ప్రచారం అదే ప్రజలలో ప్రజాతంత్ర సంస్థలు చేపట్టకపోయినట్టయితే ఇండియా ఒక నాగరిక దేశంగా మిగలదు.

**ప్రజాతంత్ర**

**4 నవంబరు 2008**

# హైదరాబాద్ పేలుళ్లు:
# కారకులు తెలియదు కాని అరెస్టులకు లోటులేదు

**2007**లో హైదరాబాద్‌లో మూడు శక్తివంతమైన బాంబు పేలుళ్ళు జరిగాయి. మే నెల 18న మక్కా మసీదులోను, ఆగస్ట్ 25న లుంబినీ పార్కు, గోకుల్ ఛాట్‌లలోను పేలుళ్ళు జరిగాయి. మక్కా మసీదు పేలుడులో 9 మంది (అనంతరం కాల్పుల్లో ఐదుగురు), లుంబినీ పార్కు దగ్గర 32 మంది, గోకుల్ ఛాట్ దగ్గర 9 మంది చనిపోయారు.

సిగ్గుతో చెప్పుకోవలసిన విషయం ఏమిటంటే ఈ దారుణాలకు పాల్పడిందెవరో పోలీసులు ఇప్పటికీ కనుక్కోలేకపోయారు. వాళ్లు ఎవరినీ వెంటాడలేదని కాదు. చాలామందిని వెంటాడారు. 64 మందిని జైలుకు పంపారు కూడా. కానీ చేసిన వాళ్లెవరో మాత్రం కనుక్కోలేకపోయారు.

విశేషమేమిటంటే హైదరాబాద్‌లోనే కాదు దేశంలో ఎక్కడ ఇటువంటి పేలుళ్ళు జరిగినా పోలీసులు వెంటనే చాలా సమాచారం చెప్పేస్తారు. ఇది లష్కర్–ఇ–తొయ్‌బా పని అనీ, జైష్–ఇ–మహమ్మద్ హస్తం కూడా ఉన్నట్టు అనిపిస్తుందనీ, ఏది ఏమయినప్పటికీ పాకిస్తాన్‌కు చెందిన గూఢచారి సంస్థ ఐ.ఎస్.ఐ ముద్ర కచ్చితంగా ఉందనీ మృతదేహాలను ఇంకా మార్చురీకి తరలించక ముందే ప్రకటిస్తుంటారు. ఈ మధ్య హర్కతుల్ జిహాద్–ఇ–ఇస్లామీ (ముద్దు పేరు 'హుజీ') ఈ జాబితాలో చేరింది. కానీ ఏం విచిత్రమో, నేరపరిశోధన జరిగే కొద్దీ పోలీసుల దగ్గరున్న సమాచారం తగ్గిపోతుంది. కొంతకాలానికి మాకేమీ తెలీదని ఒప్పేసుకుంటారు. 2001 డిసెంబర్ 13న భారత పార్లమెంటుపైన జరిగిన దాడి

జ్ఞాపకం ఉంది కదా? దాడికి పాల్పడిన అయిదుగురిని పారామిలిటరీ బలగాలు అప్పటికప్పుడే కాల్చేశారని కూడా జ్ఞాపకం ఉంది కదా? అప్పుడు కూడా వెనువెంటనే వారు పాకిస్తానీయులనీ, ఐ.ఎస్.ఐ. పురమాయించగా భారత పార్లమెంట్‌పైన దాడి చేశారనీ, లష్కర్ లేక జైష్ సభ్యులనీ ఢిల్లీ పోలీసులు ప్రకటించారు. చివరికి వారికి సహకరించారని పేరుపడ్డ వారిపైన కోర్టులో అభియోగపత్రం దాఖలు చేసేనాటికి, ఈ అయిదుగురి గురించి కేవలం వారు పాకిస్తానీయులని తప్ప వేరే ఏమీ తెలీదని పోలీసులు ఒప్పుకున్నారు. వారి పూర్తి పేర్లు కూడా తెలియవనీ, మహమ్మద్, రఫీక్ వంటి పొడిపేర్లు మాత్రమే తెలుసుననీ అన్నారు. అయితే సాక్ష్యం చెప్పడానికి ఇన్‌వెస్టిగేటింగ్ ఆఫీసర్ బోను ఎక్కేసరికి వారు పాకిస్తానీలన్న విషయం కూడా నిజానికి తెలీదని తేలింది. 'వారు చూడడానికి పాకిస్తానీల లాగ ఉన్నార'ని అప్పటి కేంద్ర హెూం మంత్రి లాల్‌కిషన్ అద్వానీ చేసిన వ్యాఖ్య ఒక్కటే వారి జాతీయతకు రుజువుగా మిగిలింది.

హైదరాబాద్ బాంబుపేలుళ్ళ విషయమూ అంతే. 'హుజీ' ఈ పేలుళ్ళకు పాల్పడిందనీ, హైదరాబాద్ నగరంలోని ముసారంబాగ్‌లో నివసించే షాహిద్ అనే యువకుడు భారత్‌లో హుజీ ప్రతినిధి అనీ, ఈ పేలుళ్ళ సూత్రధారి అతనేననీ పోలీసులు అన్నారు. సంవత్సరం గడిచిన తరువాత కూడా వారికి ఇంతకంటే ఎక్కువ తెలీదు, ఈ జ్ఞానానికి కూడా వారి దగ్గర రుజువు లేదు. ఇంక ఎప్పటికీ సంతృప్తికరమైన రుజువు దొరకకపోవచ్చును కూడా – ఎందుకంటే సూత్రధారి అని పిలవబడిన షాహిద్‌ను పాకిస్తాన్ పోలీసులు ఆగస్ట్ నెలలో కరాచీ నగరంలో కాల్చి చంపారు. అందులో మన పోలీసులూ పాల్గొన్నారని వారే షాహిద్ తమ్ముడు మజీద్‌ను 'ప్రశ్నించే' క్రమంలో గర్వంగా చెప్పుకున్నారు కూడా.

నేర్పుగా చేసిన నేరాన్ని ఛేదించలేకపోవడం సిగ్గుపడవలసిన విషయమేం కాకపోవచ్చు. నిజాయితీగా ప్రయత్నంచేసి మితంగా మాట్లాడి చివరికి మా వల్ల కాలేదని మృతుల కుటుంబాలకు సారీ చెప్తే ఎవరేమనగలరు? అన్నీ తెలిసినట్టు మొదటి నుంచి ప్రగల్భాలు పలకడం, అనుకూలురైన జర్నలిస్టులను పట్టుకొని తమ 'ఇంటెలిజెన్స్' కథనాలను సత్యాలుగా రాయించుకోవడం, ఎప్పటికప్పుడు కీలక వాస్తవాలు కనుక్కున్నట్టు ప్రకటించుకోవడం, ఇవాళ అయిదుగురినీ రేపు పదిమందినీ కల్పితమైన అభియోగాలపైన రిమాండ్ చేయించడం, ఒక్కొక్క అరెస్టూ ఒక 'బ్రేక్‌త్రూ' అని బొంకడం – ఇది అభ్యంతరకరం గానీ, నేరాలను పరిష్కరించలేకపోవడం కాదు.

మక్కామసీదు పేలుళ్ళ తరువాత పోలీసులు విజయవంతంగా చేసిన ఒకే ఒక పని – కోపగించిన జనాన్ని కాల్చేసి ఐదుగురిని చంపడం. శుక్రవారం మధ్యాహ్నం నమాజు జరుగుతున్న సమయంలో 1.25కు పేలుడు జరిగింది. కోపం, ఆందోళన, భయంతో కూడిన ఆదుర్దాతో జనం మసీదు నుంచి బయటికొచ్చారు. బయటకు రావడానికి ఒకే ఒక దర్వాజా ఉన్న కారణంగా కొంత తొక్కిసలాట జరిగింది. బయట ఎప్పటిలాగే పోలీసులున్నారు. మక్కా మసీదుకు రాజకీయ కూడలిగా గుర్తింపు ఉండడం వల్ల, చాలా సందర్భాలలో శుక్రవారం ప్రార్థనల అనంతరం ఊరేగింపులూ, ఆందోళనలూ జరిగి ఉండడం వల్ల అక్కడెప్పుడూ పోలీస్ బందోబస్తు ఉంటుంది.

మసీదు నుంచి బయటికొచ్చిన ప్రజల కోపం పోలీసుల మీదికి మళ్లింది. ఇది చాలామందికి అర్థరహితంగా అనిపించింది. బాంబులు పెట్టింది ఏదో ముస్లిం సంస్థ అన్న నిర్ధారణకు అందరూ వెంటనే వచ్చారు కాబట్టి 'మీ మసీదులో బాంబు పేలుళ్ళకు మీ వారే బాధ్యులైనప్పుడు పోలీసుల మీద కోపం ఎందుకు?' అనే పద్ధతిలో చాలామంది స్పందించారు. ఇస్లాం పేరుమీద, ముస్లింల పేరుమీద జరిగే హింసకు ముస్లింలందరూ జవాబుదార్లు అనే వైఖరి ఈ అసహనం వెనక ఉంది. కానీ మసీదు నుండి బయటికొచ్చిన జనం కోపానికి సహేతుకమైన కారణం ఉంది. తీవ్రవాదాన్ని అణచడం పేరు మీద పాత బస్తీలో పోలీసులు తీవ్రంగా గస్తీ చేపడుతుంటారు. అర్ధరాత్రి ఇళ్ళలో దూరి యువకులను ఎత్తుకుపోతుంటారు. రాత్రి ఒంటరిగా తిరుగుతున్న వారిని సతాయిస్తుంటారు. ఇంత చేసేవారు మసీదులో బాంబులు అమర్చిన వారినెందుకు ఆపలేకపోయారని ప్రజలకు కోపం వచ్చింది. అక్కడున్న నాలుగు రాళ్ళు ఏరి పోలీసులపైన విసిరారు. చార్మినార్ రాళ్ళ కుప్పలుండే ప్రాంతం కాదు. అది ముందుగా పథకం వేసుకున్న దాడి కాదు. దానివల్ల పోలీసులకు పెద్దగా ప్రమాదమేం ఏర్పడలేదు కాబట్టి పోలీసులు బాష్పవాయువు ప్రయోగించి లాఠీలతో కొట్టి జనాన్ని షాలిబండవైపు తరిమారు.

పోతూ పోతూ జనం మసీదు దగ్గరే ఉన్న ఒక మద్యం దుకాణాన్ని తగలబెట్టారు. ముస్లింలు అత్యధికంగా ఉండే మక్కామసీదు ప్రాంతంలో అదొక్కటే ఒక హిందువుకు చెందిన దుకాణం. మసీదు దగ్గర మద్యం దుకాణం ఉండడం అనుచితం అనీ దానిని తొలగించమనీ ముస్లింలు చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నా మునిసిపాలిటీవారు గానీ ఆ దుకాణం యజమాని గానీ పట్టించుకోలేదు. దానిని తగలబెట్టిన తరువాత పక్కనే ఉన్న ఒక విశ్వహిందూ పరిషత్ వ్యక్తికి చెందిన పెట్రోల్ పంపుపైన రాళ్ళు వేశారు. పెట్రోల్ పంప్‌ను ఆ గుంపు పేల్చేసే ప్రయత్నం చేశారన్నది తరువాత జరిగిన కాల్పులకు పోలీసులు చూపిన కారణం

కాబట్టి, రాళ్ళు వేయడం తప్ప గుంపు వేరే ఏం చేయలేదని ఇళ్ళ నుంచి బయటికొచ్చి చూసిన జనం చెప్పారని తెలపాలి. ఈ జనం అధికభాగం హిందువులని కూడా తెలపాలి. మక్కామసీదు అత్యధికంగా ముస్లింలు నివసించే ప్రాంతం కాగా, పక్కనే ఉన్న షాలిబండ హిందువులు అధికంగా నివసించే ప్రాంతం. పోలీసులు కోపంగా ఉన్న ముస్లిం గుంపును అటువైపు తరిమారంటేనే మత సంబంధమైన హింస చెలరేగగలదన్న శంక వారిలోనూ లేదని అర్థం అవుతుంది. అయినప్పటికీ పెట్రోల్ పంపుపైన దాడిని మతహింసకు సంకేతంగా చూపించి నేరుగా కాల్పులకు ఉపక్రమించారు. బాష్పవాయు ప్రయోగం లేదు, రబ్బర్ బుల్లెట్లు వాడలేదు. అడిషనల్ డి.జి. (క్రైమ్) రాజీవ్ త్రివేదీ ఆజ్ఞ ఇవ్వగా చార్మినార్ ఎ.సి.పి. రెడ్డన్న, హుసేనీ ఆలం సి.ఐ. కిష్టప్ప ప్రధానంగా కాల్పులు జరిపారు. అయిదుగురు రోడ్డు మీదే పడి చనిపోయారు. 40 మందిని గాయాలతో సమీపంలోని ఎగ్రా హాస్పిటల్‌కు తీసుకుపోగా అందులో 14 మందిని ఇన్‌పేషంట్స్‌గా అడ్మిట్ చేసుకున్నారు.

మసీదు బయట ప్రయోగించినట్టు బాష్పవాయువు ప్రయోగించి ఉంటే గుంపు చెదిరిపోయి ఉండేదనీ అనవసరంగా అయిదు ప్రాణాలు తీశారనీ ఆ దృశ్యాన్ని ఆనాడు చూసిన వారందరూ అన్నారు. ఈ ఘనకార్యం తప్ప మక్కామసీదు పేలుడు విషయంలో పోలీసులు ఇప్పటికి చేసిందీ, సాధించిందీ ఏమీ లేదు. అయితే అప్పటి నుంచి హర్కతుల్ జిహాద్–ఇ–ఇస్లామీ (హుజీ) పేరు, దాని ఆర్గనైజర్‌గా గుర్తించినట్టు చెప్తున్న షాహిద్ పేరు ప్రచారంలో పెట్టారు.

ఆగస్ట్ 25 వచ్చింది. సాయంత్రం సమయంలో హైదరాబాద్‌లో రెండు పెద్ద పేలుళ్ళు జరిగాయి. లుంబినీ పార్క్ అనే పర్యాటక ప్రదేశం, గోకుల్‌చాట్ అనే టిఫిన్ సెంటర్ ధ్వంసం అయ్యాయి. మొత్తం 41 మంది చనిపోయారు.

వెంటనే పోలీసులు మళ్లీ 'హుజీ' పేరు, షాహిద్ పేరు ప్రకటించారు. పథకం వేసింది షాహిదే అన్నారు. అమలు చేసింది అతను నిర్మించిన లేక ప్రేరణగా నిలిచిన 'హుజీ' నెట్‌వర్క్ అన్నారు. త్వరలో అరెస్టులు మొదలయ్యాయి. కొన్ని నెలలపాటు దినపత్రికలలో 'బాంబు పేలుళ్ళ గురించి నేరపరిశోధన సాగిస్తున్న పోలీసులు ఈ రోజు ఫలాన చోట ఫలాన వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు' అనే నమూనాలో వార్తలు వస్తుండేవి. వారానికో, రెండు వారాలకో ఒకసారి 'బాంబు పేలుళ్ళ పరిశోధన కీలక మలుపు తిరిగింది' అన్న వార్త వచ్చేది.

అంతా ఉత్తిదే అని మొదట్లో మేము కూడా అనుకోలేదు. బాంబు పేలుళ్ళు చాలామంది సామాన్య పౌరుల ప్రాణాలు తీశాయి. తమ కోపానికి ఏ రకంగానూ

బాధ్యులు కాని సామాన్య ప్రజలను బజార్లో బాంబులు పేల్చి ఉద్దేశ్యపూర్వకంగా హతమార్చే వారు ఎంతమాత్రం క్షంతవ్యులు కారు. వారికి ఎంత న్యాయమైన ఆగ్రహమైనా ఉండవచ్చునుగాక, సంబంధం లేని వారిని హతమార్చడం అమానుషం. ఈ కారణంగా, పోలీసులు నిజంగా ఆ ఘోరకాండకు పాల్పడ్డ వారిని పట్టుకొని చట్టం ముందు నిలబెట్టాలనే అందరం కోరుకున్నాము, ఇప్పటికీ కోరుకుంటున్నాము.

అయితే జరుగుతున్న అరెస్టులకూ, జరిగిన బాంబు పేలుళ్ళకూ ఏ సంబంధం లేదన్న విషయం త్వరలోనే అర్థం అయింది. పాతబస్తీలో పాలనా యంత్రాంగాన్ని గతంలో వివిధ సందర్భాలలో ఇరకాటంలో పెట్టిన యువకులను, భారతీయ జనతాపార్టీ నాయకుల హత్యకు రహస్యంగా కుట్ర చేశారని గతంలో అభియోగం ఎదుర్కొన్న యువకులను, షాహిద్‌తో కలిసి తిరిగిన యువకులను, అతని బంధువులను, వివిధ శుక్రవారాలు మక్కామసీదు నుంచి వివిధ డిమాండ్లతో ఊరేగింపుగా బయలుదేరి దుకాణాలు బలవంతంగా మూసేయించిన యువకులను ఏరి ఒక్కొక్కరినీ అరెస్టు చేసి బాంబు పేలుళ్ళతో ఏమీ సంబంధంలేని అభియోగాలతో కోర్టులో హాజరుపెట్టి రిమాండ్ చేయించారు. పత్రికలకు మాత్రం చాలా తెలివిగా 'బాంబు పేలుళ్ళ నేరపరిశోధనలో భాగంగా' ఈ అరెస్టులు జరిగాయని చెప్పారు. అది అబద్ధమూ కాదు, నిజమూ కాదు. బాంబు పేలుళ్ళను పరిశోధిస్తున్నామంటూ బయలుదేరి వీరిని అరెస్టు చేసింది నిజం. ఆ పరిశోధనలో 'భాగంగా' చేశారనడం అబద్ధం.

ఎక్కువ మందిని అరెస్టు చేసిన కేసు గోపాలపురం పోలీసుస్టేషన్‌లోని క్రైం. నెం. 198/2007. దీని సారాంశం ఏమిటంటే 2007 సెప్టెంబర్ 4వ తేదీ రాత్రి 10.30 ప్రాంతంలో 17 లేక 18 మంది ముస్లిం యువకులు హైదరాబాద్ పాతబస్తీలోని కాలాపత్తర్ శ్మశానవాటిక (కబరస్తాన్)లో కూర్చొని ఉండగా పోలీసులు దాడి చేశారంట. కూర్చున్న ఒక్కొక్కరి చేతిలో ఒక్కొక్క వి.సి.డి ఉందంట. పోలీసులను చూడగానే వారంతా పారిపోయే ప్రయత్నం చేశారంట. వారిలో ఏడుగురిని పోలీసులు అరెస్టు చేశారంట. వారివద్ద ఉన్న వి.సి.డిలను పరిశీలించగా అందులో రెండు రకాలు ఉన్నాయంట. కొన్నింటిలో గుజరాత్ మారణకాండ చిత్రాలు ఉండగా, మరి కొన్నింటిలో ఇరాక్‌లో పాశ్చాత్య సైనికులను పోరాటకారులు హతమారుస్తున్న దృశ్యాలు ఉన్నాయంట. మిగిలిన వాళ్ళను ఆ తరువాత అరెస్టు చేయగా వారివద్ద కూడా ఈ రకమైన వి.సి.డిలు, ఇదే స్వభావం గల ఉర్దూ సాహిత్యం దొరికాయంట. పైగా ముద్దాయిలందరూ

ఒప్పేసుకున్నారంట. ఏమని ఒప్పేసుకున్నారంటే ఈ దృశ్య, లిఖిత సమాచారాన్ని ప్రచారం చేసి భారతదేశాన్ని అతలాకుతలం చేయడానికి, మతద్వేషం రెచ్చగొట్టడానికి, జిహాద్ అని పిలవబడే పవిత్ర యుద్ధం సాగించడానికి కుట్ర చేశామని.

ఇదీ వారిపై మోపిన నేరాభియోగం సారాంశం. అయితే ఇట్లాగే రాస్తే న్యాయస్థానాలు సహితం సీరియస్‌గా తీసుకోకపోవచ్చు కాబట్టి ముద్దాయిల ఒప్పుకోలులో ఒళ్ళు గగుర్పొడిచే విషయాలుంటాయి. మొదటి ముద్దాయి అయిన మహమ్మద్ అబ్దుల్ సత్తార్ ఒప్పుకోలును ఒక ఉదాహరణగా చెప్పుకోవచ్చు. అతను 2002లో హైదరాబాద్‌లో డి.జె.ఎస్ అనే ముస్లిం మతవాద సంస్థ ఏర్పాటు చేసిన తరగతులలో శిక్షణ పొందాడంట. 2004లో మరింత శిక్షణ పొందడానికి పాకిస్తాన్ పోయాడంట. అక్కడ షాహిద్ నేతృత్వంలో రెండున్నర నెలలు ఖురాన్ గురించి, హదీస్ గురించి, పేలుడు పదార్థాల తయారీ గురించి తెలుసుకున్నాడంట. బ్యాంకులు, విద్యుదుత్పత్తి కేంద్రాలు, పెట్రోలియం ఉత్పత్తుల డిపోలు మొదలైన ఆర్థిక సంస్థలను ధ్వంసం చేయడానికి కావలసిన సిద్ధాంత జ్ఞానం పొందాడంట. జనవరి 2007లో సరిహద్దు దాటి బంగ్లాదేశ్‌కు పోయి అక్కడ మళ్లీ 12 రకాల పేలుడు పదార్థాల తయారీలో శిక్షణ పొందాడంట. ఇంక ఆ తరువాత వి.సి.డిలూ లిఖిత సాహిత్యమూ చేతబట్టుకొని జిహాద్‌ను బలోపేతం చేసే యువకులను శిక్షణార్థం పాకిస్తాన్‌కు పంపడం కోసం మళ్లీ సరిహద్దు దాటి ఇండియా వచ్చాడంట. కొంతకాలం కలకత్తాలో కొంతకాలం ముంబాయిలో ఉండి జూన్ 9వ తేదీన హైదరాబాద్ వచ్చి, 15వ తేదీన సికిందరాబాద్ రైల్వేస్టేషన్ పరిసరాలలో అనుమానాస్పదంగా తచ్చాడుతూ అరెస్టయ్యాడు. ఇంతకూ అతని దగ్గర పోలీసులకేం దొరికాయి? ఒక తుపాకి కాదు, ఒక తూటా కాదు, ఒక బాంబు కాదు, ఒక డబ్బా కిరోసిన్ కాదు, ఏమీ దొరకలేదు. ఒకరిని హత్య చేసినట్టుగానీ, కొట్టినట్టుగానీ, బంధించినట్టుగానీ, బెదిరించి డబ్బులు వసూలు చేసుకున్నట్టుగానీ అభియోగం లేదు. కనీసం అతని దగ్గర దొరికాయని ప్రకటించిన వి.సి.డి.లు ఫలానాచోట ప్రదర్శిస్తూ ప్రజలను రెచ్చగొట్టినట్టు ఆధారం కూడా లేదు. కేవలం అభ్యంతరకర సాహిత్యం కలిగి ఉండడం అతని నేరం. అతనే కాదు, అందరి నేరమూ అదే.

నిజంగా వీరందరి దగ్గరా అటువంటి విసిడిలూ ఉర్దూ సాహిత్యమూ దొరికిందా అన్నది వేరే ప్రశ్న. ఏమీ దొరకలేదనీ ఒక్కొక్కరినీ పాతలిస్టుల ఆధారంగా అదుపులోకి తీసుకుని తీవ్రంగా చిత్రహింసలు పెట్టి కాల్చేస్తామని

బెదిరించి తమకు కావలసిన ఒప్పుకోలు రాసుకొని జైలుకు పంపించారని ముద్దాయిలందరూ అంటున్నారు. మహమ్మద్ రియాసుద్దీన్ అనుభవాన్ని ఉదాహరణగా తీసుకోవచ్చు. ఇతను ముసద్దీలాల్ జ్యుయలరీస్‌లో పనిచేసేవాడు. ఇతనిని 2007 ఆగష్టు 31వ తేదీన తను పనిచేసే చోటినుంచి తీసుకుపోయారు. వారం రోజులు బట్టలు విప్పి ముఖానికి ముసుగు తొడిగి ఒక చోటి నుంచి ఒక చోటికి తిప్పుతూ హింసించారు. కరెంట్ షాక్ ఇచ్చారు. చేతులతో పైనుండి వేళ్ళాడదీసి చావగొట్టారు. అతను బాధలో 'అల్లా' అంటే 'రాం' అను, 'భగవాన్' అను అంటూ తిట్టేవాడట రామచంద్రన్ అనే ఇన్‌స్పెక్టర్. 'నువ్వు గుజరాత్‌లో ఉండవలసింది' అని శాపం పెట్టేవాడట.

రామచంద్రన్ అనే ఈ ఇన్‌స్పెక్టర్ తమ మతాన్ని కించపరచాడని ఇతర నిందితులు కూడా అన్నారు. ఇబ్రహీం అలీ జునైద్ అనే యునానీ వైద్య విద్యార్థిని అతను కొడుతూ, 'నువ్వు ఖురాన్ ఆశువుగా చెప్పగలవట కదా, చెప్పు' అన్నాడట. జునైద్ చెప్పడం మొదలుపెట్టగానే పెదవుల పైన చెప్పుతో కొట్టాడట. కరెంటు షాకుల గురించి ప్రతి ఒక్కరూ చెప్పారు. చెవులకు, పురుషాంగానికి షాక్ ఇచ్చారని మినహాయింపు లేకుండా అందరూ అన్నారు. రోకలి బండలెక్కించారనీ, వేళ్ళాడదీసి కొట్టారనీ చెప్పారు.

కొడుతూ వీళ్ళను అడిగే ప్రశ్నలకు బాంబు పేలుళ్ళతో ఏమీ సంబంధం లేదు. పాతబస్తీలో గతంలో వివిధ సందర్భాలలో జరిగిన ఘటనలలోనూ, ఆందోళనలలోనూ వారి పాత్ర గురించి ప్రశ్నించారు. 2004 నవంబర్ 1వ తేదీన మౌల్వీ నజీరుద్దీన్‌ను అరెస్టు చేయడానికి గుజరాత్ పోలీసులు వచ్చినప్పుడు హైదరాబాద్‌లో రాష్ట్ర డిజిపి కార్యాలయం బయట పాతబస్తీవాసులు చేసిన ఆందోళన గురించి ప్రశ్నించారు. ఆ ఆందోళన తీవ్రరూపం తీసుకోగా గుజరాత్ పోలీసులు కాల్పులు జరిపి ముజాహిద్ సలీం హష్మి అనే యువకుడిని చంపారు. ఆ కాల్పులను సమర్థించుకోవడానికి ఆందోళనకారులు పోలీసులపైన హత్యాప్రయత్నం చేశారని కేసు పెట్టారు. ఆ కేసులోని ముద్దాయిలలోని ఇద్దరిని – మహమ్మద్ రయాసుద్దీన్, మొతసంబిల్లా – ఈ కబరస్తాన్ కుట్ర కేసులో ముద్దాయిలుగా చూపించారు. రయాసుద్దీన్‌ను ప్రశ్నించింది కూడా ఆ కాల్పుల గురించే. మరొక రెండు పాతకేసులు – బిజెపి నాయకుడు ఇంద్రసేనారెడ్డిని చంపడానికి జరిగిందని చెప్పబడుతున్న కుట్ర, 2006లో వినాయక నిమజ్జనమప్పుడు సంపత్ అనే విశ్వహిందూ పరిషత్ నాయకుడి హత్యకు జరిగిందని చెప్పబడుతున్న కుట్ర. ఈ ఇద్దరు హిందూ నాయకులపైన ఏ రకమైన దాడీ జరగలేదు. వారి ప్రాణాలకు ఏ అపాయమూ రాలేదు. వారిని చంపడానికి

కుట్ర మాత్రం జరిగిందనీ దానిని మొగ్గలోనే తుంచేసి కేసులు పెట్టామనీ పోలీసులన్నారు.

కబరస్తాన్ కుట్ర కేసు (క్రైం. నెం. 198/2007, గోపాలపురం పోలీస్‌స్టేషన్) కాక వేరే కొన్ని కుట్ర కేసులు కూడా పుట్టాయి బాంబుపేలుళ్ళ 'పరిశోధన క్రమంలో'. వాటికి కూడా బాంబు పేలుళ్ళతో ఏం సంబంధం లేదు, ఆ మాటకొస్తే ఏ హింసాకాండతోనూ సంబంధం లేదు. అవి ఇద్దరు బంగ్లాదేశీ సోదరీ సోదరులకు సంబంధించిన రెండు కేసులు. అప్పట్లో బాంబు పేలుళ్ళ పరిశోధనలో ఒక కీలకమైన మలుపుగా వీరి అరెస్టును పోలీసులూ మీడియా చిత్రీకరించాయి. బంగ్లాదేశ్ నుంచి వచ్చి హైదరాబాద్‌లో ఉంటూ తమిళనాడులోని వేలూరులో చదువుకుంటున్న షాహిరఫ్ సంజానీ అనే మహిళను, ఆమె సోదరుడు రిద్వాన్ గాజీనీ పోలీసులు 2007 ఆగస్టు 31 నాడు – బాంబు పేలుళ్ళ తరువాత వారం లోపల – అరెస్టు చేశారు. సోదరుడి అరెస్టును రహస్యంగా ఉంచి సోదరి విషయం మాత్రం బయటపెట్టారు. ఆమె అరెస్టుతో బాంబు పేలుళ్ళకు సంబంధించిన నేర పరిశోధనలో 'బ్రేక్‌త్రూ' సాధించినట్టు చెప్పారు. కానీ ఆమె మీద పెట్టిన కేసు పాస్‌పోర్ట్ చట్టం కింద. ఆ కేసులో ఆమె సోదరుడిని రెండవ ముద్దాయిగాను, బంగ్లాదేశ్ నివాసి అయిన వారి తండ్రిని మూడవ ముద్దాయిగాను చూపించారు. సోదరుడు రిద్వాన్ గాజీని సెప్టెంబర్ 20 దాకా నిర్బంధించి వేరొక కేసు పెట్టారు. ఇందులోనూ సోదరినీ, తండ్రినీ ముద్దాయిలుగా చూపించారు. ఆ కేసుకు కూడా బాంబుపేలుళ్ళతో సంబంధం లేదు. వీరిద్దరి తండ్రి అయిన జైనుల్ అబిదీన్ (చిట్టగాంగ్ నివాసి) తన పిల్లలిద్దరినీ భారతదేశంలో విధ్వంసం సృష్టించడానికి తప్పుడు కాగితాలు ఇప్పించి పంపించాడన్న కుట్ర కేసు ఇది. పిల్లలిద్దరూ కూడా తండ్రితో బాటు కుట్రలో భాగమేనన్నారు. కబరస్తాన్ కుట్రలాగ, బిజెపి నాయకుడు ఇంద్రసేనారెడ్డి హత్యకు జరిగిన కుట్రలాగ, విశ్వహిందూ పరిషత్ నాయకుడు సంపత్ హత్యకు జరిగిన కుట్రలాగ, ఈ కుట్ర కూడా మొగ్గలోనే తుంచివేయబడింది. ముద్దాయిలు పోలీసులకిచ్చిన ఒప్పుకోలులో తప్ప వేరే ఎక్కడా ఈ కుట్రల ఆనవాళ్ళు లేవు. కుట్ర ఫలితంగా ఏమీ జరగలేదు, ఎవరికీ హాని జరగలేదు. ఒక్క తుపాకీ గానీ, తూటాగానీ, బాంబుగానీ దొరకలేదు. ఒప్పుకోలు సాక్ష్యం చట్టరీత్యా చెల్లదన్న సంగతి అటుంచి ఆ ఒప్పుకోళ్ళు ఏ విధంగా రాబట్టారో పైన చూశాము. కాబట్టి పోలీసులు విపరీతంగా ప్రచారం చేసుకున్న ఈ అరెస్టుల అర్థమేమిటి, నగర ప్రజలకు భద్రత కల్పించడంలో వాటి ప్రాముఖ్యం ఏమిటి అన్నది ప్రశ్నగానే ఉండిపోయింది.

మేము మతహింసను, విచ్చలవిడి హింసాకాండను తక్కువ చేస్తున్నామనుకుంటే పొరబాటు. ఇవాళ దేశంలో అనేక ప్రాంతాలలో ముస్లింల పేరు మీద, ఇస్లాం పేరు మీద సామాన్య పౌరుల ప్రాణాలు తీసే హింసాకాండ జరుగుతున్నది. ఈ మధ్యనే హైందవం పేరు మీద బజార్లో బాంబులు పెట్టే గ్రూపులు ఉన్నట్టు కూడా బయటపడింది. ఏ పేరు మీద చేసినా ఇది అమానుషం అనని వారెవరూ ఉండరు. దీనిని అరికట్టడానికి న్యాయబద్ధమైన ప్రయత్నాలు జరగాలనీ, వేగంగా జరగాలనీ అందరమూ కోరుకుంటాం. పోలీసు చర్యలే ఈ విషయంలో సర్వస్వం కాదుగానీ పోలీసు వ్యవస్థకు కూడా ఈ ప్రయత్నంలో పాత్ర ఉంది. పేలుళ్లకు పాల్పడుతున్న వాళ్లంతా పాకిస్తాన్‌లోనూ, బంగ్లాదేశ్‌లోనూ తర్ఫీదు పొందుతున్నారన్న మన పాలకుల అభియోగం ఎంత నిజమో తెలీదుగానీ ప్రధానంగా ఈ హింసకు పాల్పడుతున్నది భారతీయ ముస్లింలే.

బాబ్రీ మసీదు కూల్చివేత, బొంబాయి మారణకాండ, గుజరాత్ మారణకాండ, దేశ వ్యాప్తంగా అక్రమ అరెస్టులు మొదలైన అనేక కారణాలు వారి ఆగ్రహం వెనుక ఉన్నాయి. అయినప్పటికీ బజార్లో పోతున్న సామాన్య ప్రజలను చంపడం న్యాయబద్ధమైన పరిష్కారం కాదన్న సందేశం వారికి బలంగా అందవలసి ఉంది. ఇస్లాం పేరు మీద జరుగుతున్న ఈ మారణకాండ ఆ మతం మూలసూత్రాలకు విరుద్ధం అని అత్యంత సనాతన వాదులుగా పేరుపడ్డ దేవ్‌బంద్ మత పెద్దలే ఏకగ్రీవంగా తీర్మానించారు. అదే సమయంలో ముస్లిం యువకుల ఆగ్రహానికి న్యాయమైన కారణాలున్నాయన్న గుర్తింపు ముస్లిమేతరులలో ఉండవలసినంత లేదు. అందరమూ కలిసి న్యాయం కోసం న్యాయబద్ధంగా పోరాడుదాం అన్న సందేశం ముస్లిమేతర సమాజం నుంచి వెళ్ళడం లేదు. ఇస్లాం స్వభావమే హింసాత్మకమైనది అన్న తప్పుడు వ్యాఖ్య – సనాతనవాదులైన ఆ మత పెద్దలే తిరస్కరిస్తున్న వ్యాఖ్య – సగటు ముస్లిమేతరుల భావనగా ఉండిపోయింది. ఈ కారణంగా ముస్లిమేతర సమాజం ఈ నేరాల నిరోధాన్ని పోలీసులు బాధ్యత చేసేసి చేతులు దులిపేసుకోగా పోలీసులేం చేస్తున్నారయ్యా అంటే పైన చెప్పిన పనులు చేస్తున్నారు. ఒక్కొక్క ఘటన జరిగినప్పుడు పాతలిస్టులూ పాత కేసులూ బయటకు తీసి అడ్డగోలుగా అరెస్టులు చేయడం, తీవ్ర చిత్రహింసల ద్వారా ఇంకెప్పుడూ నోరు విప్పకుండా చేయడం, పోలీసుల కేసు డైరీలో తప్ప ఎక్కడా ఆనవాలు దొరకని కుట్ర కేసులు సృష్టించి ఒక్కొక్కరినీ నెలల తరబడి రిమాండ్ చేయించడం వాళ్ళు చేస్తున్న పని.

వీళ్లంతా సెప్టెంబర్ – అక్టోబర్ నెలలలో విడివిడిగా అరెస్టు కాగా ఈ సంవత్సరం ఏప్రిల్ నెల దాకా ఎవరికీ బెయిలు దొరకలేదు. విద్యార్థులు (యునానీ

వైద్యం ఫైనల్ ఇయర్ చదువుతున్న ఇబ్రహీం అలీ జునైద్, బిటెక్ 3వ సంవత్సరం చదువుతున్న మొతసంబిల్లా) విద్యా సంవత్సరం కోల్పోయారు. ఉద్యోగాలున్న వాళ్ళు ఉద్యోగాలు పోగొట్టుకున్నారు. వీళ్ళందరూ 'అమాయకులు' అన్న మాటకు కొంతమంది అభ్యంతరం తెలుపుతున్నారు. భావాలు నేరాలు కాగలిగితే వీరు అమాయకులు కారు. అందరిలో కాకున్నా చాలామందిలో మతతీవ్రవాద భావాలున్నాయి. ప్రపంచాన్ని ఇస్లాం (బలప్రయోగంతోనైనా సరే) జయించినప్పుడే న్యాయం సిద్ధిస్తుందన్న విశ్వాసం ఉంది. వాదనకు దిగితే చాలా కారణాలు చూపించగలరు. ఆఫ్ఘనిస్తాన్ యుద్ధాన్నీ ఇరాక్ యుద్ధాన్నీ భారత దేశంలో సంఘ్‌పరివార్ ఆగడాలనూ కాశ్మీర్‌లో సాగుతున్న అణచివేతనూ కారణంగా చూపించగలరు. ప్రపంచాధిపత్య శక్తులను మర్యాద పూర్వకంగా ఎదుర్కొన్న వారెవరూ నిలవలేదనీ అన్యాయమనిపించినా క్రూరంగా ఎదుర్కొన్న వారే నిలువగలిగారనీ వాదించగలరు. నిలిచి ఏం చేశారని మనం ఎదురుప్రశ్న వేయగలము. వారూ వీరూ కలిసి న్యాయస్థానంలో ఆధిపత్యాన్ని నిలబెట్టారే తప్ప నిజమైన అర్థంలో ఏమైనా సాధించారా అని అడగగలము. ఈ సంవాదం చాలాసేపు సాగగలదు, చాలా దూరం పోగలదు.

కానీ ప్రస్తుత విషయం ఏమిటంటే భావాలు వాటంతట అవి ఎప్పుడూ నేరాలు కావు. ఒక భావాన్ని కలిగి ఉండడం, ప్రచారం చేయడం క్రిమినల్ చట్టం పరిధిలోకి రాగల విషయం కాదు. ఆ అర్థంలో వీరంతా అమాయకులే. పైగా అదే రకమైన భావాలు గల హిందుత్వవాదులు సమాజంలో పెద్దమనుషులుగా చలామణి అవుతున్నప్పుడు తాము ఎందుకు మౌనంగా ఉండాలన్న వారి ఎదురుప్రశ్నకు ఎవరి దగ్గరా జవాబు కూడా లేదు. బలవంతంగా వాళ్ళ నోర్లు నొక్కి జైలులో పెట్టి జీవితాలు నాశనం చేయడం వల్ల పోలీసులు వారి వాదనకు బలం చేకూర్చడం తప్ప సాధించిందేమీ లేదు.

చివరిగా, ఏ అర్థంలోనైనా అమాయకులని ఒప్పుకోక తప్పని అసిఫ్‌నగర్, టప్పాచబూత్రా నివాసులైన బంగ్లాదేశీయుల గురించి చెప్పుకోవాలి. ఈ రెండు పోలీసు స్టేషన్ల పరిధిలోని జిర్రా, జేబాబాగ్, సాబీర్‌నగర్, మహబూబ్ కాలనీలలో 22 బంగ్లాదేశీ కుటుంబాలున్నాయి. వీళ్లు ఒక దగ్గర ఉండరు. ఒక్కొక్కరు ఒక్కొక్క గల్లీలో ఉంటారు. సూట్‌కేసులు, స్కూల్ బ్యాగులు కుట్టి అమ్ముకొని బతుకుతారు. 20-25 ఏళ్ళుగా ఇదే పని చేసుకుని ఇక్కడే బతుకుతున్నారనీ, ఒకరి జోలికి పోరనీ, ఏ గొడవలోనూ తలదూర్చరనీ ఇరుగుపొరుగుల అభిప్రాయం. కేవలం నగరంలో జరిగిన బాంబుపేలుళ్ళకు బంగ్లాదేశ్ కేంద్రంగా గల 'హుజీ'ది బాధ్యత

అన్న అభిప్రాయం కారణంగా నగరంలోని బంగ్లాదేశీలందరినీ పోలీసులు అరెస్టు చేయడానికి పూనుకున్నారు. ఈ 22 కుటుంబాల పెద్దలనూ (20 మంది పురుషులు, ఇద్దరు స్త్రీలు) జైలులో పెట్టారు. వాళ్ళకు 'హుజీ'తోగానీ బాంబులతో గానీ ఏ రకమైన హింసావాదంతో గానీ సంబంధం ఉందన్న అభియోగం సహితం పోలీసులు వేయలేదు. అక్రమంగా భారత్‌లోకి ప్రవేశించారన్న అభియోగంమీదే అరెస్టు చేశారు. హైదరాబాద్‌లో స్థిరపడిన 20 లేక 25 ఏళ్ళ తరువాత ఈ అభియోగం కింద వారు కటకటాల పాలయ్యారు!

హింసాకాండతో సంబంధం ఉందని పోలీసులకే వారిపైన అనుమానం లేనప్పుడు వారినెందుకు అరెస్టు చేసినట్టు? ప్రచారం కోసం అన్నది తప్ప దీనికి వేరే ఏ సమాధానం లేదు. 'బంగ్లాదేశీ తీవ్రవాదులు' పేలుళ్ళకు పాల్పడ్డారని పోలీసులు నిర్ధారించడమేమిటి, వెనువెంటనే హైదరాబాద్‌లో అక్రమంగా నివసిస్తున్న 22 మంది బంగ్లాదేశీయులను పట్టేసుకోవడమేమిటి – ఎంత నేర్పు, ఎంత యోగ్యత అని ప్రజలు అనుకోవాలి. నగరంలో రహస్యంగా నక్కినక్కి బతుకుతున్న వాళ్ళను పోలీసులు వెతికి వెతికి పట్టుకున్నారన్న అభిప్రాయం విజయవంతంగా కలిగించడం దీనికి పనికొచ్చింది. ఒక చదరపు కిలోమీటర్ పరిధిలో 25 ఏళ్ళుగా నివసిస్తూ సూట్‌కేసులూ, స్కూలు బ్యాగులూ తయారుచేసి అమ్ముకుంటున్న వారిని పట్టుకున్నారని ప్రజలకెవరు చెప్పాలి?

లజ్జాకరమైన ఈ కథకు కొసమెరుపు ఏమిటంటే 2008 అక్టోబర్ నెలలో ముంబాయి పోలీసులు దేశ పశ్చిమ తీరంలో అనేక పట్టణాలకు చెందిన ముస్లిం యువకులను పట్టుకున్నారు. వారినుంచి ఒప్పుకోలు వాంగ్మూలాలు తీసుకున్నారు. వాటి ప్రకారం హైదరాబాద్‌తో సహా దేశంలో అనేకచోట్ల పేలుళ్లకు పాల్పడింది లష్కర్–ఇ–తొయ్‌బా కాదు, జైష్–ఇ–మహమ్మద్ కాదు, హుజీ కాదు – ఇండియన్ ముజాహిదీన్ అనే సంస్థ. అందులో ప్రధాన పాత్రధారి కర్నాటకలోని దక్షిణ కన్నడ జిల్లాకు చెందిన రియాజ్ భట్కల్ అనే వ్యక్తి. ఈ పరిశోధన అవాస్తవం అని హైదరాబాద్ పోలీసులు అనలేదు. కాబట్టి తమ పరిశోధన అబద్ధం అని ఒప్పుకున్నారనే అనుకోవాలా?

**మానవహక్కుల వేదిక బులెటిన్–9**
**డిసెంబర్ 2008**

# రిపోర్టులు

# సంఘ్‌పరివార్ ఫాసిజాన్ని ఎన్నాళ్లు సహిద్దాం?

**ఒ**క దశాబ్దం కింద ఈ పరిస్థితి బహుశా ఎవ్వరూ ఊహించి ఉండరు.

కొంతమంది దుండగులు సినిమా టాకీస్ అద్దాలు పగలగొట్టి ప్రేక్షకులను బెదిరించి 'ఫలానా సినిమా ప్రదర్శన ఆపండి' అంటే ముంబాయి నుండి గౌహతి దాకా ఆ సినిమా ప్రదర్శన ఆగిపోతుందనీ,

ముంబాయిలో కూర్చొని ఒక వ్యక్తి 'పాకిస్తాన్ క్రికెట్ టీం ఈ నగరంలో ఆడడానికి వీలు లేదు' అని ప్రకటిస్తే దేశ క్రికెట్ బోర్డే ఎందుకయినా మంచిదని భారత – పాకిస్తాన్ క్రికెట్ మ్యాచ్‌ను ముంబాయిలో ఏర్పాటు చేయకుండ జాగ్రత్తపడుతుందనీ,

అదే వ్యక్తి పాకిస్తానీ కళాకారులెవ్వరూ ముంబాయిలో ప్రదర్శన ఇవ్వడానికి వీలు లేదని శాసిస్తే ప్రదర్శన నిర్వాహకుల నుండి ముంబాయి నగర పాలకుల దాకా అందరూ ఏకగ్రీవంగా ఆ ప్రదర్శన నిర్వహించకుండ ఉండడమే మంచిదని తీర్మానిస్తారనీ,

కొంతమంది దుండగులు ఢిల్లీలో క్రికెట్ పిచ్ తవ్వేసి పాకిస్తాన్ ఇండియాలో క్రికెట్ ఆడటానికి వీలు లేదని ప్రకటిస్తే 'ఎట్టి పరిస్థితిలోనయినా ఆట జరిగి తీరుతుంద'ని ప్రభుత్వం ఒకవైపు ప్రకటిస్తూనే ఎందుకయినా మంచిదని మొదటి టెస్ట్‌ను ఢిల్లీ నుంచి చెన్నైకి బదలాయిస్తుందనీ,

ఒక దశాబ్దం కింద ఎవరూ ఊహించి ఉండరు.

కానీ ఈ దశాబ్దకాలంలో కాషాయ టెర్రిజం భారతదేశంలో ప్రజాస్వామ్యానికి ఒక పెద్ద ప్రమాదకారిగా మారింది. ఇది కేవలం క్రికెట్‌కూ కళలకూ సినిమాలకూ

పరిమితం కాలేదు. హైందవ పురాణాల నుండే తన కుంచెకు ఇతివృత్తాలనూ సింబల్స్‌నూ అత్యధికంగా ఎంచుకున్న ఎం.ఎఫ్ హుస్సేన్‌కు 'నువ్వు ముస్లింవు జాగ్రత్త' అని జ్ఞాపకం చేయడం దగ్గర ఆగిపోలేదు.

యాభై ఏళ్లుగా ఏ రోజూ అభద్రతా భావం లేకుండ బతుకుతున్న క్రైస్తవులపైన తామే దాడి చేసి భయభ్రాంతుల్ని చేసి, 'వారు చేపడుతున్న మత మార్పిడుల వల్లనే ఈ దాడులు చేయవలసి వచ్చింది' అని సమర్థించుకోవడమే కాక, 'మత మార్పిడులపై జాతీయస్థాయి చర్చ జరగాలి' అని దేశ ప్రధానమంత్రి చేతనే అనిపించగలిగారు. ప్రధానమంత్రే కాదు, 'చర్చ జరిపితే మంచిదేనేమో కదా' అని సమాజంలో చాలామంది అనుకునేటట్టు చేయగలిగారు.

'ఇందుగలడందు లేడని సందేహము వలదు' అన్న సంగతి మరచిపోయి 'రాముడు ఇక్కడే పుట్టాడ'ని పట్టుబట్టి బాబ్రీ మసీదును కూలగొట్టడం దగ్గర ఆగిపోలేదు. దానికి నిరసనగా అల్లర్లకు పాల్పడిన ముంబాయి ముస్లింలకు ఇప్పట్లో మరచిపోలేనంత భయంకరమైన 'గుణపాఠం' నేర్పించారు. 1993 జనవరి నాటి ఊచకోత నుండి ముంబాయి ముస్లింలు కోలుకొని ధైర్యంగా బతకడం కష్టం.

వీళ్లు ఎక్కడో అడవులలో కొండలలో దాక్కొని ఈ పనులు చేయడం లేదు. నాగరికత నడిబొడ్డున ఉంటూ చేస్తున్నారు.

వీళ్లు ప్రశాసనానికి శత్రువులయి సమాజానికి బహిష్కృతులయి ఈ పనులు చేయడం లేదు. తామే ప్రశాసనం నడుపుతూ టెర్రిజం చలాయిస్తున్నారు. సమాజం మధ్యనే నిలబడి చలాయిస్తున్నారు. 'ఇది సాగనివ్వం, అది సాగనివ్వం' అంటూ ప్రెస్ కాన్ఫరెన్స్‌లు పెట్టి, టి.వి ఛానెల్స్‌కు ఇంటర్వ్యూలు ఇచ్చి చెప్తున్నారు. హింసచేసి, 'ఇది హిందువుల న్యాయమైన ఆగ్రహం' అని బాహాటంగానే ప్రకటిస్తున్నారు. తమ ఆదేశం అమలు కాకపోతే మరింత హింసకు పాల్పడతామని కూడ బాహాటంగానే చెప్తున్నారు.

అన్నిటికంటే ఆందోళన కలిగించే విషయం సమాజం ఎంత సులభంగా ఈ సంఘ్‌పరివార్ గుండాయిజానికి లొంగుతున్నదనేది. వాళ్ల గుండాగిరీని వ్యతిరేకిస్తే మరింత హింసకు పాల్పడతారేమోనని భయపడి బతకడం సమాజం నేర్చుకుంటున్నది. ప్రపంచంలోని అతి పెద్ద నగరాలలో ఒకటి, అత్యాధునిక నగరాలలోనూ ఒకటి అయిన ముంబాయి బాల్‌థాకరే గుండాగిరీకి లొంగి

బతుకుతూ ఉంది. వ్యతిరేకించే వాళ్లు ముంబాయిలో లేనేలేరని కాదు. ఆ నగరాన్ని అంతగా అవమానపరచనవసరం లేదు కానీ నిస్సహాయంగా గొణుక్కుంటూ శివసేనకు లోబడి బతకడం ఆ నగరం నేర్చుకుంది. 'దావూద్ ఇబ్రహీం గురించి, అరుణ్ గావ్లీ గురించి ఎందుకు మాట్లాడుకోవాలి? శివసేనను మించిన మాఫియా ముంబాయిలో ఏది ఉంది?' అని ఆ నగర వాసులందరూ అంటారు. అంటూ వారితో అడ్జస్ట్ అయి బతుకుతుంటారు. ప్రజలే కాదు, ప్రశాసనం కూడా అడ్జస్ట్ అయి బతకడం నేర్చుకుంటూ ఉంది. 1993 జనవరి హింసాకాండ ముఖ్యంగా బాల్‌థాకరే మీద, అతని అనుయాయుల మీద చట్టం ప్రకారం చర్య ఎందుకు తీసుకోలేదని అప్పటి మహారాష్ట్ర ముఖ్యమంత్రిని జస్టిస్ శ్రీకృష్ణ కమిషన్ ప్రశ్నించగా, 'వాళ్లమీద చర్య తీసుకుంటే ముంబాయి తగలబడుతుందని భయపడ్డాం' అని కాంగ్రెస్ ముఖ్యమంత్రి జవాబు ఇచ్చాడు!.

సంఘ్‌పరివార్ గుండాయిజాన్ని గుండాయిజం అంటూ ఈ రోజు విశాఖపట్నంలో సభ జరుపుతున్నాం. కాని ఇలాంటి సభను దేశ రాజధాని ఢిల్లీలో జరపడం చాలా కష్టం – సొంతగా మందీ మార్బలం ఉన్న వాళ్లకయితే తప్ప. ఢిల్లీ విశ్వవిద్యాలయం నుండి జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం దాకా అన్ని చోట్లా వాళ్లను విమర్శిస్తూ జరిపిన మీటింగ్‌లపై దాడి చేసి విధ్వంసం సృష్టించిన చరిత్ర వారికి ఉంది.

యూరప్‌లో 1930లో ఫాసిజం ఒక ప్రబలమైన దుష్టశక్తిగా ఎదగడాన్ని పరిశీలించిన వాళ్లందరూ ఒక విషయం గుర్తించారు. బలప్రయోగంతోనూ, బెదిరింపుతోనూ సమాజాన్ని శాసిస్తామంటూ ఫాసిస్టులు ముందుకొచ్చినప్పుడు తక్కిన సమాజం ప్రతిఘటించకుండ లొంగిపోవడం ఫాసిస్టుల ప్రణాళికను సులభతరం చేసింది. లొంగే కొద్దీ వాళ్లు విజృంభించారు. వాళ్లు విజృంభించే కొద్దీ సమాజం మరింత లొంగింది. బలప్రయోగం ముందు వివేచననూ, ఆత్మవిశ్వాసాన్నీ కోల్పోయి మౌనంగా ఉండిపోయే ఈ వైఖరి హిట్లర్ వంటి ఒక పిరికి మనిషిని మహానియంతను చేయగలిగింది.

ఇది కేవలం మైనారిటీల సమస్య అనుకుంటే పొరబాటే. మైనారిటీల సమస్యే అయినా అందరం పట్టించుకోవలసిందే. కానీ సంఘ్‌పరివార్ ఫాసిజం కేవలం ముస్లింలకూ, క్రైస్తవులకే ప్రమాదకారి కాదు. ఈ విషయం పదే పదే చెప్పుకోవలసి ఉంది.

స్త్రీలు ఏం చేయవచ్చో, ఏం చేయకూడదో చెప్తామని వాళ్లు 'ఫైర్' సినిమా పైన అప్రకటిత నిషేధం పెట్టారు. దళితులు ఆత్మగౌరవం కోసం హైందవ

సమాజాన్ని వదిలిపెట్టిపోవచ్చునో లేదో మేము చెప్తామని వాళ్లు డాంగ్స్ నుండి జలంధర్ దాకా అనేక చోట్ల హింసాత్మకంగా ప్రకటించారు.

వాళ్లు సంస్కృతికి నిర్వచనం చెప్తారు. స్వేచ్ఛకు పరిమితులు పెడతారు. మంచి ఏమిటో చెడు ఏమిటో ప్రకటించి కర్రలతో రాళ్లతో బాంబులతో అమలు చేస్తారు.

కానీ వాళ్లకు తెలిసిన మంచిలో సమతకూ ప్రజాస్వామ్యానికీ చోటులేదు. అది నిచ్చెనమెట్ల బ్రాహ్మణ ధర్మం నేర్పించిన మంచి. దానిని కర్రలతో రాళ్లతో అమలు చేయడానికి పూనుకున్న ఈ కాషాయ ఫాసిజాన్ని ఎన్నాళ్లు సహిద్దాం?

**'శివమెత్తిన సేన' రిపోర్టు ఆవిష్కరణ సభ కోసం రాసిన కరపత్రం**

**25 జనవరి 1999**

# శివమెత్తిన సేన

## శ్రీకృష్ణ కమీషన్ నివేదిక



బొంబాయి అల్లర్లలో ధ్వంసమైన జమాలుద్దీన్‌ఖాన్ అనే సైనికుడి ఇల్లు.
ఫోటోగ్రాఫర్: సౌమిత్ర ఘోష్

మానవహక్కుల వేదిక ప్రచురణ

# శివమెత్తిన సేన

## ఇప్పుడెందుకు?

**1992** డిసెంబర్ 6 - 1993 జనవరి 20ల మధ్య ముంబాయి నగరంలో చెలరేగిన హింసాకాండ గురించి జస్టిస్ శ్రీకృష్ణ కమిషన్ ప్రకటించిన న్యాయవిచారణ నివేదికను సంక్షిప్తంగా తెలుగు పాఠకులకు అందజేయడం ఈ ప్రచురణ ఉద్దేశ్యం.

ఆరేళ్ల కిందట జరిగిన విషయాల గురించి ఇప్పుడు ప్రచురణ ఎందుకని అడగవచ్చు. జస్టిస్ శ్రీకృష్ణ తన నివేదికను 1998 ఫిబ్రవరి 16న మహారాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించారు. అంటే న్యాయవిచారణ అయిదేళ్లు తీసుకుంది! విచారణాంశం స్వభావమే దీనికొక కారణం కాగా (కమిషన్ 502 మంది సాక్షులను విచారించింది, 9655 పేజీల వాంగ్మూలాలు నమోదు చేసింది, 15 వేల పేజీల డాక్యుమెంట్లు స్వీకరించింది, అడపాదడపా 536 ఆర్డర్లు జారీ చేసింది), ఆనాటి అల్లర్లకూ హత్యాకాండకూ ప్రధాన బాధ్యులయిన శివసేన - బిజెపి హిందుత్వవాదులే విచారణ మొదలయిన తరువాత మహారాష్ట్రలో అధికారానికి వచ్చి కమిషన్ విచారణకు అడ్డుపడాలని శతవిధాల ప్రయత్నించడం మరొక కారణం.

కాలయాపన చేయడానికి హిందుత్వవాద పార్టీలు చేసిన మొదటి ప్రయత్నమేమిటంటే, 1993 మార్చి 12 నాడు ముంబాయి నగరంలో జరిగిన బాంబు పేలుళ్లను కూడ ఇదే విచారణ సంఘం పరిధిలోనికి తీసుకురావాలని

డిమాండ్ చేయడం. అప్పటికి మహారాష్ట్రలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పాలకులు దీనికి ఒప్పుకోలేదు. కానీ 1995లో బిజెపి–శివసేన ప్రభుత్వం మహారాష్ట్రలో అధికారానికి రాగానే, 1993 మార్చి 12 నాటి బాంబు పేలుళ్లను కూడ శ్రీకృష్ణ కమిషన్ పరిధిలోకి తీసుకొస్తూ ఆర్డర్ జారీ చేసింది. దీనివల్ల వాళ్లు సాధించదలచుకున్నది స్పష్టమే. బాంబు పేలుళ్లకు గల్ఫ్ దేశాలలో ఉంటున్న దావూద్ ఇబ్రహీం వంటి ముంబాయి ముఠా నాయకులు బాధ్యులన్న అభిప్రాయం విస్తృతంగా ప్రాచుర్యం పొంది ఉంది కాబట్టి బాంబు పేలుళ్లనూ, అంతకు ముందు నగరంలో జరిగిన హింసాకాండనూ ఒకే విచారణలో భాగం చేయడం ద్వారా హింసాకాండలో 'విదేశీహస్తం' ఉందంటూ హిందుత్వవాద సంస్థలు మొదటి నుండి చేస్తున్న ప్రచారానికి వాళ్లు బలం చేకూర్చదలచుకున్నారు.

1995లో ఈ విధంగా శ్రీకృష్ణ కమిషన్ పనిభారాన్ని పెంచిన హిందుత్వవాద పాలకులు, 1996 జనవరి 23న కమిషన్‌ను రద్దు చేస్తూ మరొక ఆర్డర్ జారీ చేసారు. రద్దు చేయడానికి వాళ్లు చూపించిన కారణం ఏమిటంటే 'కమిషన్ తన నివేదిక సమర్పించడానికి చాలాకాలం తీసుకుంది' అనీ, 'ఒకవేళ నివేదిక ఇప్పుడు సమర్పించినా దానివల్ల మానిపోయిన గాయాలను తిరగదోడడం తప్ప ఒరిగేది ఏమీ ఉండదు' అనీనూ!

కమిషన్ రద్దుకు అసలు కారణం ఎవరి ఊహకూ అందకుండ పోలేదు. బిజెపి, శివసేన పాలకుల ఊహలకు భిన్నంగా కమిషన్ ముందు సాక్షులు పెద్ద సంఖ్యలో వాంగ్మూలాలు నమోదు చేసారు. హిందుత్వవాదులనూ వారి ఏజెంట్లుగా వ్యవహరించిన ముంబాయి పోలీసు యంత్రాంగాన్నీ ఇబ్బంది పెట్టే సాక్ష్యం ఇచ్చారు. జస్టిస్ శ్రీకృష్ణ కూడ ఈ విషయాలు తరచి తరచి అడుగుతున్నారు. అందువల్ల కమిషన్ నివేదిక మహారాష్ట్ర పాలకులకు ఇబ్బందికరంగా ఉండబోతుందని వారికి అర్థం అయింది.

శ్రీకృష్ణ కమిషన్ రద్దుపై దేశవ్యాప్తంగా రాజకీయ శక్తులు, పత్రికలు, ప్రజాతంత్రవాదులు తీవ్రంగా స్పందించాయి. ముంబాయి హైకోర్టులో పలువురు రిట్ పిటిషన్ దాఖలు చేసారు. వాటి మీద తీర్పు ప్రభుత్వానికి వ్యతిరేకంగా వచ్చేటట్టు కనిపించింది. ఇంతలో 1996 వేసవిలో హిందుత్వవాదుల 'ఉదారవాద ముఖం' అయిన అటల్‌బిహారీ వాజ్‌పాయి కేంద్రంలో 13 రోజుల ప్రభుత్వం నడిపారు. ఉదారవాద ముఖాన్ని కాపాడుకోవడానికేమో, అతను శ్రీకృష్ణ కమిషన్‌ను పునరుద్ధరించమని మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాడు. కానీ బాంబుపేలుళ్ళు మాత్రం కమిషన్ అజెండాలో ఉండిపోయాయి. ఈ విధంగా

1996 మే 28న పునర్జీవం పోసుకున్న శ్రీకృష్ణ కమిషన్ 1992 డిసెంబర్ – 1993 జనవరి కాలంనాటి ముంబాయి హింసాకాండ గురించే కాక 1993 మార్చి 12 నాటి బాంబు పేలుళ్ల గురించి కూడ తన విచారణ పూర్తిచేసి 1998 ఫిబ్రవరి 16 నాడు తన నివేదికను మహారాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించింది.

కాబట్టి 1999 జనవరిలో దీని సారాంశాన్ని తెలుగులో ప్రచురించడం మరీ ఆలస్యమేమీ కాదు! అంతకంటే ముఖ్యమైన కారణమేమిటంటే, శ్రీకృష్ణ కమిషన్ నివేదిక రాబోయే రోజులకు అద్దంపడుతుంది. రాబోయే రోజులని ఎందుకనాలి – వచ్చేసిన రోజులనే అనొచ్చు. హిందుత్వవాద గూండా గ్యాంగులు తమ బలప్రయోగంతో సమాజాన్ని లోబరుచుకొని తమ అభీష్టాన్ని బలవంతంగా సాధించుకుంటున్న ఘటనలు ఒకదాని తరువాత ఒకటి జరుగుతూనే ఉన్నాయి. బాబ్రీ మసీదును కూల్చేసారు. దాని గురించి ఆందోళన చేసిన ముంబాయి నగర ముస్లిం ప్రజలపైన మారణకాండ జరిపారు. ఎం.ఎఫ్.హుస్సేన్ చిత్రప్రదర్శనలపైన దాడిచేసి ఇంకెప్పుడూ వారికి నచ్చని చిత్రాలు గీయబోనని అతనిచేత చెప్పించారు. ముంబాయిలో పాకిస్తాన్ క్రికెట్ జట్టును ఆడనివ్వమని బెదిరించి క్రికెట్‌బోర్డు అధికారులే పాకిస్తాన్ జట్టు వచ్చినప్పుడు ముంబాయిలో 'మ్యాచ్' లేకుండ జాగ్రత్తపడేటట్టు చేసారు. గుజరాత్‌లోనూ, ఇతర ఉత్తరాది రాష్ట్రాలలోనూ క్రైస్తవులపై దాడులు ముమ్మరం చేసి నూటికి రెండు శాతం ఉన్న క్రైస్తవులను భయభ్రాంతులను చేసారు. తమకు నచ్చని కథనం, సన్నివేశాలు ఉన్నాయని ఫైర్ సినిమా ప్రదర్శిస్తున్న థియేటర్లపై దాడి చేసి, విధ్వంసం సృష్టిస్తామన్న బెదిరింపుతో అనేక నగరాలలో ఆ సినిమా ఆడకుండ చేసారు.

హిందూమతోన్మాద ఫాసిజం ఇన్నాళ్లూ కేవలం ఒక సిద్ధాంత భావన కావచ్చు. ఈ రోజు అదొక సామాజిక వాస్తవం. దక్షిణ భారతదేశంలో అది ఇప్పటికి బలహీనంగా ఉంది కాబట్టి, అది బలంగా ఉన్న ప్రాంతాలలో దాని అభీష్టానికి అడ్డం ఉన్నవారు ఎటువంటి భయాందోళనలకు గురవుతున్నారో మనకు అర్థం కావడం కష్టం కావచ్చు. కానీ అర్థం చేసుకోవడం అవసరం. ఈనాడు దేశంలో ఉన్న ముఖ్యమైన మానవహక్కుల సమస్యలలో ఇదొకటి. ఇది కేవలం మైనారిటీ మతస్తులకు మాత్రమే ప్రమాదకారి కాదు. అన్నిరకాల ప్రజాతంత్ర విలువలకూ ప్రజాస్వామ్యానికీ ప్రమాదకారి.

అందువల్ల కూడ ఈ వికృత వాస్తవానికి అద్దంపట్టే జస్టిస్ శ్రీకృష్ణ కమిషన్ నివేదిక సారాంశాన్ని ఇప్పుడు ప్రచురించడం, ప్రచారం చేయడం అవసరం.

# I

## డిసెంబర్ 1992:
## ముస్లింల ఆగ్రహం, హిందూత్వవాదుల ఆజ్యం

### ముంబాయి అల్లర్లు

'ముంబాయి అల్లర్లు'గా పేరుగాంచిన హింసాకాండ ప్రధానంగా రెండు ఘట్టాలలో జరిగింది. 1992 డిసెంబర్ 6 నాడు అయోధ్యలో హిందుత్వవాదులు బాబ్రీమసీదును కూల్చివేసిన అనంతరం (ఆ రాత్రి నుండే) ముంబాయి నగరంలో మొదటి దఫా అల్లర్లు మొదలయ్యాయి. 12వ తేదీ దాకా సాగాయి. రెండవ దఫా అల్లర్లు 1993 జనవరి 6వ తేదీన మొదలయి 20వ తేదీ దాకా సాగాయి. మొత్తం (అధికార లెక్కల ప్రకారం) 900 మంది చనిపోయారు. వీరిలో 575 మంది ముస్లింలు, 275 మంది హిందువులు కాగా 50 మంది మతమేదైనదీ తెలీదు. అల్లర్లలో గాయపడిన వారు 2036 మంది. అందులో 1105 మంది ముస్లింలు, 893 మంది హిందువులు కాగా 38 మంది మతం తెలీదు. చావులకు గల కారణాలు ఈ విధంగా ఉన్నాయి.

| | |
|---|---|
| పోలీసుల కాల్పులు | 356 |
| కత్తిపోట్లు | 347 |
| సజీవదహనం | 91 |
| దొమ్మీ | 80 |
| ఇతరములు | 26 |
| మొత్తం | 900 |

శ్రీకృష్ణ కమిషన్ తన పని మొదలుపెట్టక ముందే ఈ అల్లర్ల గురించి ఒక వ్యాఖ్య ప్రచారంలోకి వచ్చేసింది. మొదటి దఫా అల్లర్లు మసీదు కూల్చివేతకు ప్రతీకారంగా ముస్లింలు పాల్పడిన హింసాకాండేననీ, మసీదు కూల్చివేత గురించి తెలియగానే వాళ్లు ముంబాయి నగరవీధులలోకి వచ్చి హిందువులపైన, పోలీసులపైన సంఘటితంగా దాడులకు పాల్పడ్డారనీ ఈ వ్యాఖ్య చెప్తుంది. రెండవ దఫా అల్లర్లు కూడ ముస్లింలు అమాయకులయిన హిందువులపైన ప్రయోగించిన హత్యాకాండతో మొదలయిందనీ, కానీ అప్పటిదాకా సహించిన హిందువులు ఇక సహించలేక ప్రతీకారానికి పూనుకోవడం రెండవ ఘట్టంలోని ప్రధాన అంశమని ఈ వ్యాఖ్య అంటుంది.

మొదటి దఫా హింసాకాండలో (అంటే 1992 డిసెంబర్ 6-12 తేదీల నాటి ఘటనలలో) ముస్లింలు చొరవ తీసుకున్న ఘటనలు ఎక్కువ, రెండవదఫా (అంటే 1993 జనవరి 6-20 తేదీల నాటి ఘటనలలో) హిందువులు హింసకు పాల్పడిన ఘటనలు ఎక్కువ అనేది వాస్తవమే. అంతేకాక ముస్లింల హింసాకాండ హిందువులపైనే కాక పోలీసుల పైన కూడా ఎక్కుపెట్టబడిందనేదీ వాస్తవమే. అందువల్ల పై వ్యాఖ్య చాలా సహజమైనదిగా కనిపిస్తుంది.

కానీ దీనికి కనీసం మరొక నాలుగు విషయాలను జోడించనిదే చిత్రం పూర్తికాదనీ, పూర్తయిన ఆ చిత్రానికీ పైవ్యాఖ్యకూ ఉన్న పోలిక స్వల్పమేననీ శ్రీకృష్ణ కమిషన్ సవివరంగా చూపించగలిగింది.

(i) ముస్లింలవైపు నుండి జరిగిన హింసాకాండ ఎక్కువగా అసంఘటితంగా జరిగింది. ముస్లింలలోనూ మతతత్వ సంస్థలున్నాయి కానీ జరిగిన హింస వారి కుట్రల ఫలితం కాదు. బాబ్రీ మసీదు కూల్చివేత పట్ల ముస్లింలలో స్పాంటేనియస్‌గా పెల్లుబికిన ఆగ్రహం ఫలితం. (దీని అర్థం ఆ హింసను శ్రీకృష్ణ కమిషన్ సమర్థించిందని కాదు). హిందువుల వైపు నుండి జరిగిన హింస మాత్రం అత్యధిక భాగం సంఘటితంగా, కుట్ర పూరితంగా జరిగింది. శివసేన దానికి ప్రధానంగా నాయకత్వం వహించింది.

(ii) ముందు వీళ్లు చేసారు, తరువాత వాళ్లు చేసారు, పోలీసులు ఇద్దరినీ అదుపు చేయలేక పోయారు అనే ఈ చిత్రంలో కనిపించని విషయమేమిటంటే పోలీసుల వైఖరి ఎంత మాత్రం నిష్పాక్షికం కాదు. పోలీసుల వ్యవహారశైలిలో ముస్లిం వ్యతిరేకత కొట్టొచ్చినట్టు కనిపించిందనేది జస్టిస్ శ్రీకృష్ణ సోదాహరణంగా చెప్పిన విషయాలలో ఒకటి.

(iii) ముంబాయి పోలీసులలో ముస్లిం వ్యతిరేకత ఉండడమే కాదు. శివసేన హింసాకాండ పట్ల 'ఉదార' వైఖరి కూడ స్పష్టంగా ఉండింది. రెచ్చగొట్టే ఉపన్యాసాలనూ ఊరేగింపులనూ 'మహాఆరతి' కార్యక్రమాలనూ కర్ఫ్యూలో సహితం అనుమతించారు. శివసేనకు చెందిన దుండగుల పేర్లు బాధితులు స్పష్టంగా చెప్పినా అరెస్టు చేయలేదు.

(iv) శివసేనకు చెందిన మరాఠీ పత్రికలు కొన్ని ఘటనలను విపరీతంగా ప్రచారం చేయడం ద్వారా, కొన్ని అభూత కల్పనలను ప్రచారం చేయడం ద్వారా ముస్లింలలో ద్వేషభావాన్ని రెచ్చగొట్టడంలో కృతకృత్యులయ్యాయి. ఉదాహరణకు అల్లర్లలో ఐఎస్ఐ (పాకిస్తాన్ గూఢచారి సంస్థ) హస్తం

ఉందన్న అభిప్రాయాన్ని వాళ్ళు ఎంతగా ప్రచారం చేసారంటే అప్పటి మహారాష్ట్ర గవర్నర్ సి. సుబ్రహ్మణ్యం సహితం దానిని సత్యమని నమ్మి తన దగ్గర ఏవో ఆధారాలున్నట్టు పత్రికల వారితో 'అల్లర్లలో ఐఎస్ఐ హస్తం ఉంది' అని ప్రకటించాడు. కానీ నిజానికి ముంబాయి పోలీసుల పరిశోధనలో అటువంటిదేమీ వెల్లడి కాలేదని జస్టిస్ శ్రీకృష్ణ నిరూపించగలిగారు.

ఈ కోణాలన్నిటినీ చేర్చి, అప్పటికి ప్రచారంలో ఉన్న 'వాళ్లు మొదలు పెట్టారు, వీళ్లు ప్రతీకారం తీర్చుకున్నారు' అన్న వాదన వాస్తవం కాదని జస్టిస్ శ్రీకృష్ణ చూపించినందుకే ఆయనగారి నివేదిక మీద మహారాష్ట్ర ముఖ్యమంత్రి మనోహర్ జోషి విరుచుకుపడ్డాడు. 'అది హిందూ వ్యతిరేక నివేదిక' అన్నాడు. 'దానిని ఆమోదించడానికి నేనేం పాకిస్తాన్ ప్రధానమంత్రిని కాను' అన్నాడు. మనోహర్ జోషి తనను తాను మహారాష్ట్రలోని హిందువుల ముఖ్యమంత్రిగా భావిస్తున్నాడు తప్ప అందరి ప్రతినిధిగా భావించడం లేదని దీనినిబట్టి అర్థం అవుతుంది. ఈ వైఖరిని హిందువులలో కూడ శివసేన–బిజెపిల అనుయాయులు మినహాయించి తక్కిన ముంబాయి నగర వాసులు ఆమోదించారని భావించడానికి ఆధారాలేమీ లేవు.

## శివసేన పాత్ర – మొదటి ఘట్టం

1992 డిసెంబర్ 6 నాడు అయోధ్యలో హిందుత్వవాద సంఘ్‌పరివార్ సంస్థలు బాబ్రీ మసీదును కూల్చివేసారని విని ముంబాయి ముస్లింలు రెచ్చిపోయి వీధులలోకి రావడం 'ముంబాయి అల్లర్ల' తొలి సంఘటన. కానీ ఇందులో కూడ హిందుత్వవాద సంస్థల పాత్ర ఉంది. వాళ్లు ముంబాయి నగరంలో 'విజయోత్సవ యాత్రలు' తీసి, సభలు నిర్వహించి ముస్లింలకు పుండు మీద కారం చల్లినట్లు చేయడంతో ముస్లింల ఆగ్రహం మరింత పెరిగింది.

నిజానికి ఆనాటి సభలు, ఊరేగింపులను పక్కన పెట్టినా, ముంబాయి ముస్లింలు ఆగ్రహంతో స్పందించింది ఎక్కడో అయోధ్యలో జరిగిన కూల్చివేతకేనని కూడ అనలేము. అప్పటికే దాదాపు 6 నెలలుగా విశ్వహిందూ పరిషత్, శివసేన వంటి సంస్థలు ముంబాయి నగరంలో వీధి వీధినా సభలూ సమావేశాలూ నిర్వహిస్తున్నాయి. అయోధ్యలో రామమందిర నిర్మాణం పేరు మీద నిర్వహించిన ఈ కార్యక్రమాలలో ముస్లింల మీద ద్వేషం కక్కడం ప్రధాన విషయం. 'హిందుస్తాన్ హిందువులది. ఎవడి అయ్యదీ కాదు' అనీ, 'ఈ దేశంలో

ఉండదలచుకుంటే వందేమాతరం అనవలసి ఉంటుంది' అనీ, నినాదాలు ఇచ్చిన ఈ సభలలో వక్తల ఉపన్యాసాలు ముస్లింల మీద విషం కక్కాయని కమిషన్ అంటుంది.

మరాఠీలోనూ, హిందీలోనే కాక తమిళంలో కూడ విద్వేష సాహిత్యం ప్రచురించారు. 1992 అక్టోబర్ 12 నాడు ముద్రించిన ఒక (తమిళ) కరపత్రంలో 'ముస్లింల పూర్వీకులు ఈ దేశాన్ని దోచుకోవడానికి దండెత్తి వచ్చారు' అనీ 'దేశాన్ని దోచుకోవడం, తమ మతాన్ని ప్రచారం చేసుకోవడం తప్ప వారికి వేరే లక్ష్యమేదీ లేదు' అనీ అన్నారు.

1992 జూలై–డిసెంబర్ నెలల మధ్య కాలంలో ముంబాయి నగరంలో ప్రతీవీధిలో ప్రతీ చౌరస్తాలో హిందుత్వవాద సంస్థలు డిసెంబర్ 6కు నాందిగా రామపాదుక పూజలు, ఘంటానాద కార్యక్రమాలూ నిర్వహించాయి. ఈ కార్యక్రమాలలో ముస్లింలపైన ద్వేషం కక్కడం ప్రధాన ఉపన్యాస విషయం. పైధోనీ ప్రాంతంలో అక్టోబర్ 23 నాడు ఇటువంటి ఒక కార్యక్రమంలో ప్రఫుల్ దేశాయి అనే హిందుత్వవాద నాయకుడు 'ప్రతీ ఒక్కరిలో నిద్రాణంగా ఉన్న రాముడిని మేల్కొలుపుతాం. ఒక్క రామద్రోహినీ విడిచిపెట్టకుండ తరిమికొడతాం' అంటూ ఇచ్చిన ఉపన్యాసాన్ని జస్టిస్ శ్రీకృష్ణ ఉదహరించి, విద్వేషాన్ని రెచ్చగొట్టే ఇటువంటి ఉపన్యాసాలను ఆపడానికి గానీ, కేసులు పెట్టడానికి గానీ పోలీసులు ఏ ప్రయత్నమూ చేసినట్టు లేరని అభిశంసించారు.

అయోధ్య గురించి ప్రచారం చేసే ఈ కార్యక్రమాలను ఎందుకు అదుపు చేయలేదని జస్టిస్ శ్రీకృష్ణ తన ఎదుట హాజరయిన పోలీస్ అధికారులను ప్రశ్నించగా, అవి కేవలం మతపరమైన కార్యక్రమాలు కాబట్టి శాంతి భద్రతల నిర్వహణ పరిధిలోకి రావని తాము భావించామని అన్నారు. చివరికి డిసెంబర్ 6 నాడు ఒకపక్క అయోధ్యలో 'కరసేవ' జరుగుతుండగా కూడ, దానికి మద్దతుగా ముంబాయి నగరంలో విశ్వహిందూ పరిషత్ నిర్వహించిన ఘంటానాద కార్యక్రమాలను సహితం పోలీసులు అడ్డుకోలేదని జస్టిస్ శ్రీకృష్ణ అభిశంసించారు.

డిసెంబర్ 6కు ముందు నగరంలోని అన్ని ప్రాంతాలలోనూ నడిచిన ఈ కార్యక్రమాలను దృష్టిలో ఉంచుకోకుండ మసీదు కూల్చివేత పట్ల ముంబాయి నగర ముస్లింలు స్పందించిన తీరును అర్థం చేసుకోలేము.

6వ తేదీనాడు కూడ అక్కడ అయోధ్యలో బాబ్రీమసీదు కూలిపోగానే ఇక్కడ ముంబాయిలో హిందుత్వవాద సంస్థల విజయోత్సవ సభలు మొదలయ్యాయి.

ఆనాటి మధ్యాహ్నం 2.30 గంటలకే ముంబాయిలోని ధారవి ప్రాంతంలో శివసేనవారు విజయోత్సాహంతో సైకిల్ ర్యాలీ తీసారు. రెండు లేక మూడువందల మంది శివసైనికులు పనిగట్టుకుని ముస్లింలు అధికంగా నివసించే వీధులలో ర్యాలీ తీసి కాలా కిల్లా దగ్గర సభ నిర్వహించారు. రెచ్చగొట్టే ఉపన్యాసాలు ఇచ్చారు. పైధోనీ ప్రాంతంలో కూడ విజయానికి సంకేతంగా ఘంటానాద కార్యక్రమం నిర్వహించారు. డోంగ్రీ ప్రాంతంలో డిసెంబర్ 5వ తేదీన నాలుగు రోడ్ల కూడలిలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో మరుసటి రోజు జరగబోయే కూల్చివేత కార్యక్రమం గురించి సభ జరిగింది. 6వ తేదీన కూల్చివేత అయిపోగానే లలకార్ ఘంటానాద కార్యక్రమం జరిగింది.

1992 జూలై నెల నుండి ముంబాయి నగరంలో జరుగుతున్న ఈ రెచ్చగొట్టే కార్యక్రమాలను పోలీసులు లెక్కలోకి తీసుకోకపోవడాన్నీ, వాటిని అదుపు చేసే ప్రయత్నమేమీ చేయకపోవడాన్నీ జస్టిస్ శ్రీకృష్ణ తీవ్రంగా తప్పుపట్టారు. ముస్లింల స్పందన అంత తీవ్రంగా ఉండడానికి ఇదొక ముఖ్యమైన కారణమని అభిప్రాయపడ్డారు. హిందుత్వవాద నాయకులిచ్చిన ఉపన్యాసాలను ప్రస్తావిస్తూ, 'వాటి పర్యవసానం ప్రమాదకరంగా ఉండగలదని పోలీసులు ఊహించలేక పోయారంటే అది వాళ్ల అమాయకత్వమయినా కావాలి, తెలివితక్కువతనమైనా కావాలి, పక్షపాత ధోరణి అయినా కావాలి' అంటారు.

ఈ నేపథ్యంలో డిసెంబర్ 6 రాత్రి 11 గంటల తరువాత ముంబాయి నగరంలోని వివిధ ప్రాంతాలలో ముస్లింలు కోపంగా వీధులలోకి వచ్చారు. అయితే ఆరోజు వాళ్ల చేతులలో రాళ్లుగానీ కర్రలుగానీ లేవు. అవి కేవలం నిరసన ప్రదర్శనలు మాత్రమే. పోలీసులు ఈ విషయాన్ని అర్థం చేసుకొని నేర్పుగా వ్యవహరించి ఉంటే శాంతియుతంగా మొదలయిన ఈ ప్రదర్శనలు శాంతియుతంగానే ముగిసేవేమోగానీ పోలీసుల దురుసు ప్రవర్తనవల్ల శాంతియుతమైన ప్రదర్శనలు హింసాత్మకంగా మారాయని జస్టిస్ శ్రీకృష్ణ అభిశంసించారు. హిందుత్వవాదులు ఇప్పుడయినా ఊరుకొని, వ్యవహారాన్ని పోలీసులకు విడిచి పెడితే బాగుండేది గానీ, ముస్లింల నిరసన ప్రదర్శనలకు జవాబుగా అన్నట్టు బిజెపి, శివసేన కార్యకర్తలు వీధులలోకి వచ్చి రాస్తారోకోలు నిర్వహించడం ముస్లింల ఆగ్రహాన్ని మరింత పెంచిందని కూడ ఆయన వ్యాఖ్యానిస్తారు.

## 1992 డిసెంబర్ 6-12 నాటి ఘటనలు

ఇది ముంబాయి అల్లర్ల తొలి ఘట్టం.

'డిసెంబర్ 1992లో ముస్లింలు పాల్పడిన దొమ్మీలను పరిశీలిస్తే అవన్నీ కూడ కోపోద్రిక్తులయిన ముస్లింల గుంపులు ఎవరి నాయకత్వం లేకుండ తమంతట తాము స్పందించిన ఘటనలేనని సాక్ష్యాలు తెలియచేస్తాయి. ఈ స్పందన శాంతియుతంగా మొదలయి త్వరలో దొమ్మీలకు దిగజారింది. హిందువులు విజయోత్సవ సభలు, రెచ్చగొట్టే నినాదాలు, రాస్తారోకోలు చేపట్టి ముస్లింలను రెచ్చగొట్టడం ద్వారా కొంతవరకు తాము కూడ ఈ దొమ్మీలకు బాధ్యులయ్యారు. హిందువులు చేపట్టిన ఈ కార్యకలాపాలన్నీ అధికభాగం శివసేన కార్యకర్తలు, కొంతమేరకు భారతీయ జనతాపార్టీ కార్యకర్తలు నిర్వహించారు' అని ఈ ఘట్టాన్ని గురించి శ్రీకృష్ణ అభిప్రాయపడ్డారు.

బాబ్రీ మసీదును కూల్చివేసిన విషయం 6వ తేదీ మధ్యాహ్నం 2.30 గంటలకు ముంబాయిలో తెలిసింది. సాయుధ బలగాల సమక్షంలోనే హిందువులు ఆ విధ్వంసానికి పాల్పడగలిగారనీ, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వమే కాక కేంద్ర ప్రభుత్వం కూడా ఆ మసీదుకు ఏ హానీ జరగదంటూ ఇచ్చిన హామీకి భిన్నంగా ఇది జరిగిందనీ ముస్లింలు రెచ్చిపోయారు. ఇస్లాం ప్రమాదంలో పడిందంటూ ఇస్లామిక్ మతతత్వవాదులు ముస్లింలలో ఉద్రిక్తత రేకెత్తించగలిగారు. వివిధ టెలివిజన్ ఛానెల్స్ చూపించిన దృశ్యాలు కూడ ముస్లింలను ఏ విధంగా రెచ్చగొట్టాయో జస్టిస్ శ్రీకృష్ణ వివరించారు. కేంద్ర రిజర్వ్ పోలీస్ బలగాలు కళ్లప్పగించి చూస్తుండగా దుండగులు మసీదును కూల్చిన ఘటనను తెరమీద చూసినవారు ఆగలేకపోయారు. పైగా అంతకుముందు సంవత్సరం మసీదు మీద ఎక్కి 'కరసేవకులు' గెంతులు వేసిన ఫిలిం కూడ 6వ తేదీన ఫైల్ నుండి తీసి టివి ఛానెల్స్ చూపించాయి.

ఇది చాలదన్నట్టు ధారవి వంటి ప్రాంతాలలో హిందుత్వవాదులు వెంటనే విజయోత్సవ ర్యాలీలు తీయడం కూడ ముస్లింలకు పుండు మీద కారం జల్లినట్లు అయింది. అయినా 6వ తేదీన వీధులలోకి వచ్చి నిరసన తెలిపిన ముస్లింలు శాంతియుతంగానే ఆ పని చేశారు. పోలీసులు వెంటనే ఇరుపక్షాల నాయకులనూ సమావేశపరచి శాంతి సాధన కోసం కృషి చేసి ఉంటే పరిస్థితి ఏ విధంగా ఉండేదో గానీ వాళ్లు అలవాటు ప్రకారం దౌర్జన్యంగా గుంపులను చెదరగొట్టే

ప్రయత్నం చేయడంతో శాంతియుతమైన నిరసన హింసాత్మక రూపం తీసుకునే పరిస్థితి ఏర్పడిందని జస్టిస్ శ్రీకృష్ణ అన్నారు.

6వ తేదీ రాత్రి నిర్మల్‌నగర్‌లోని అనంత్‌కానేకర్ మార్గ్‌లో ఒక వినాయకుడి గుడిలో విగ్రహం తల ఎవరో నరికేసారు. రాత్రి 11.45 గంటలకు ఈ విషయాన్ని గమనించడం జరిగింది. ఈ పని చేసింది ముస్లింలే అయి ఉంటారని అందరూ భావించారు. దేవనార్ ప్రాంతంలో ఒక భారతీయ జనతాపార్టీ నాయకుడి ఇంటిపైన ముస్లింల గుంపు రాళ్లు వేసింది. వాళ్లను అదుపు చేయడానికి ప్రయత్నించిన పోలీసుల పైన వాళ్లు కోపంగా తిరగబడ్డారు. పోలీసులు పెద్దఎత్తున కాల్పులు జరిపారు. ఇది ముస్లింలకు ఆగ్రహం కలిగించింది.

7, 8 తేదీలలో హింస చాలా జరిగింది. ముస్లింలు మారణాయుధాలతో విధ్వంసానికి దిగడం, హిందువులు వాళ్లతో తలపడడం, అవి దొమ్మీగా మారడం నగరమంతటా జరిగింది.

ఉదాహరణకు బైకుల్లా పోలీస్‌స్టేషన్ పరిధిలో డిసెంబర్ 7వ తేదీన 500 లేక 600 మంది ముస్లిం యువకులు బంద్ నిర్వహించే ఉద్దేశ్యంతో వాహనాల టైర్లకు గాలి తీయడం మొదలుపెట్టారు. వాళ్లను అదుపుచేసే పని పోలీసులకు విడిచిపెట్టకుండ హిందువులు పెద్దగుంపుగా వీధిలోకి వచ్చి బంద్ నిర్వాహకులతో తలపడ్డారు. దీనితో ముస్లింల నిరసన ప్రదర్శన ఇరువర్గాల దొమ్మీగా మారింది.

ముస్లింలు మెజారిటీగా ఉన్న దేవనార్ పోలీసుస్టేషన్ పరిధిలోనూ డిసెంబర్ 6వ తేదీన అయోధ్యలో జరుగుతున్న కరసేవకు మద్దతుగా హిందుత్వవాద పార్టీలు ముస్లింలను రెచ్చగొడుతూ ఘంటానాద కార్యక్రమం నిర్వహించారు. 7వ తేదీన ముస్లింలు ఎక్కడ నిరసన తెలపడానికి బయటికొచ్చినా హిందువుల గుంపులు వారితో తలపడ్డారు. దొమ్మీలు చాలా జరిగాయి.

ధారవి ప్రాంతంలోనూ ఇదే జరిగింది. డిసెంబర్ 6 సాయంత్రం శివసేన వారు బాబ్రీ మసీదు కూల్చివేతపట్ల హర్షం తెలియజేస్తూ సైకిల్ ర్యాలీ తీసారని పైన చెప్పాము. మత ఘర్షణల చరిత్ర ఉన్న ధారవిలో ఈ ర్యాలీకి ఎందుకు అనుమతి ఇచ్చారని పోలీసులను ఈ కమిషన్ ప్రశ్నించగా, తాము అనుమతి నిరాకరించామని సీనియర్ ఇన్‌స్పెక్టర్ ఘాగ్రె కమిషన్‌తో అన్నాడు. కానీ అతను కమిషన్‌కు చూపించిన రికార్డు మొత్తం కల్పించినదనీ, సాక్ష్యం కోసం తయారు చేసినదనీ జస్టిస్ శ్రీకృష్ణ నిర్మొహమాటంగా అన్నారు. అయినా, 'అనుమతి

నిరాకరించిన' ఈ ర్యాలీకి బందోబస్తుగా పోలీసులు వారి వెంట నడిచిన మాట వాస్తవమే! ర్యాలీలో ఇచ్చిన నినాదాలు: 'కత్తి బయటకు తీసాం, మందిరం అక్కడే కడతాం', 'రామునిమీద ఒట్టు, మందిరం అక్కడే కడతాం', 'లుంగీ చేతపట్టుకొని నోట్లో పాన్ పెట్టుకొని తురకోడా పాకిస్తాన్ పారిపో', 'హిందుస్తాన్‌లో ఉండదలచుకుంటే హిందువయి ఉండాలి', 'శివసేన జిందాబాద్', 'బాల్‌థాకరే జిందాబాద్' మొదలయినవి.

మరుసటిరోజు (అంటే డిసెంబర్ 7వ తేదీ) ముస్లింలు ధారవి ప్రాంతంలో నిరసన ప్రదర్శన తీసారు. అది శాంతియుతంగానే సాగింది. పోలీసులు పక్కనే ఉన్నారు. కానీ ప్రదర్శన షాహూనగర్ మీదుగా బిస్మిల్లా హోటల్ జంక్షన్ దగ్గరకు వచ్చేసరికి హిందువులు మెజారిటీగా నివసించే కోలీవాడ నుండి ప్రదర్శకుల మీద రాళ్లు పడ్డాయి. దానితో ప్రదర్శకులు రెచ్చిపోయి తిరిగి రాళ్లు వేసారు. పోలీసులు లాఠీఛార్జి చేసారు. ప్రదర్శకులు పోలీసుల పైన కూడ రాళ్లు వేసారు. పోలీసులు కోలీవాడ హిందువులను రెచ్చగొట్టి ఇంకా రాళ్లు వేయించారు. దానితో ప్రదర్శనగా మొదలయినది కాస్తా వేగంగా దొమ్మీగా మారింది.

జోగేశ్వరి పోలీస్‌స్టేషన్ పరిధిలో కూడ డిసెంబర్ 7వ తేదీన ముస్లింల గుంపు బాబ్రీ మసీదు కూల్చివేతపట్ల నిరసన తెలుపుతూ సమావేశం కాగానే, వాళ్లను చూసి హిందువుల గుంపు కూడ సమావేశమై వారిని ఎదుర్కొనింది. ఒకరిమీద ఒకరు రాళ్లు వేసుకోవడంతో మొదలయిన ఘర్షణ దొమ్మీగా మారింది.

డిసెంబర్‌లో జరిగిన హింస అంతా ముస్లింల చొరవతో మొదలయినదే కాదనడానికి చాలా నిదర్శనాలు ఉన్నాయి. ఉదాహరణకు కాలాచౌకి పోలీస్‌స్టేషన్ పరిధిలో డిసెంబర్‌లో ముస్లింలవైపు నుండి జరిగిన హింస ఏదీ లేదు గానీ, డిసెంబర్ 9న ఒక ముస్లింకు చెందిన లారీని, 10వ తేదీన ఒక ముస్లింకు చెందిన స్కూటర్‌ను, మరొక ముస్లింకు చెందిన గోడౌన్‌ను తగలబెట్టడం జరిగింది. ఒక ముస్లిం యాజమాన్యంలో ఉన్న ఇండస్ట్రియల్ ఎస్టేట్‌ను లూటీ చేయడం కూడ జరిగింది.

ఖేర్వాడి పోలీస్‌స్టేషన్ పరిధిలోనూ ముస్లింలు మెజారిటీగా ఉన్న ప్రాంతాలలో డిసెంబర్ 7వ తేదీన ముస్లింల గుంపులు పోలీసులపైన, హిందువులపైన హింసకు పాల్పడగా హిందువులు మెజారిటీగా ఉన్న ప్రాంతాలలో 8వ తేదీన ముస్లింల ఇళ్లపైన, అంగళ్లపైన దొమ్మీ, లూటీ జరిగాయి.

మాహిం పోలీస్‌స్టేషన్ పరిధిలోనూ డిసెంబర్‌లో జరిగిన దొమ్మీ, లూటీలలో ధ్వంసమయిన 748 ఇళ్లు, అంగళ్లలో 413 ముస్లింలవి కాగా 268 హిందువులవి, మిగిలినవి క్రైస్తవులవి, ప్రభుత్వానివి.

7వ తేదీన నగరంలోని వివిధ ప్రాంతాలలో ముస్లింలు 11 హైందవ దేవాలయాలను ధ్వంసం చేసారు (కొన్నిటిని పాక్షికంగా పాడు చేసారు. కొన్నిటిని పూర్తిగా ధ్వంసం చేసారు. కొన్నిటిని దహనం చేసారు). హిందువులు కూడ కొన్ని మసీదులను, మదరసాలను ధ్వంసం చేసారు. ఈ హింసను, దొమ్మీలను అదుపు చేయడానికి పోలీసులు 72 సందర్భాలలో కాల్పులు జరపగా 72 మంది ముస్లింలు, 20 మంది హిందువులు చనిపోయారు. గాయపడిన 132 మందిలో 131 మంది ముస్లింలే.

ముస్లింల గుంపులు దేవనార్‌లోనూ బైకుల్లాలోనూ మొత్తం ముగ్గురు పోలీసులను హతమార్చారు. దేవనార్‌లో చంపిన ఇద్దరినీ కత్తులతో తెగనరికి చంపారు. ఒక శవం ఏడు రోజులు తరువాత గానీ దొరకలేదు.

8వ తేదీన కూడా ఇదే వరస కొనసాగింది. 33 పోలీస్‌స్టేషన్ల పరిధికి దొమ్మీలు వ్యాపించాయి. పోలీసులు 43 చోట్ల జరిపిన కాల్పులలో 31 మంది ముస్లింలు, 21 మంది హిందువులు చనిపోయారు (మరొక ముగ్గురు మృతుల మతం తెలీదు). ధారవిలో ఒకటి, దేవనార్‌లో నాలుగు, పార్క్‌సైట్‌లో ఒకటి, సాకినాకాలో ఒకటి మొత్తం ఏడు హిందూ దేవాలయాలను ముస్లింల గుంపులు ధ్వంసం చేసాయి. హిందువుల గుంపులు ధారవిలో రెండు మసీదులను, మాహింలోనూ భోయివాడలోనూ ఒక్కొక్క మదరసాను, దాదర్‌లో ఒక దర్గాను ధ్వంసం చేసారు.

9వ తేదీన కూడ దొమ్మీలు, కత్తిపోట్లు కొనసాగాయి. పోలీసులు 28 సందర్భాలలో జరిపిన కాల్పులలో 12 మంది ముస్లింలు, అయిదుగురు హిందువులు చనిపోయారు. ఘట్‌కోపార్‌లో రెండు హిందూ దేవాలయాలు, ట్రాంబేలో ఒక మసీదు, జోగేశ్వరిలో ఒక కబరస్తాన్ (ముస్లింల శ్మశానవాటిక) ధ్వంసం చేయబడ్డాయి.

10వ తేదీ తరువాత పరిస్థితి అదుపులోకి వచ్చింది. అక్కడక్కడ ఒక్కొక్క ఘటన జరుగుతూనే ఉన్నా పెద్దఎత్తున దొమ్మీలు లేవు. కత్తిపోట్ల ఘటనలలో 11వ తేదీన, 12వ తేదీన మొత్తం 8 మంది హిందువులు, ఇద్దరు ముస్లింలు చనిపోయారు.

ఆ తరువాత అల్లర్లు చల్లారిన నేపథ్యంలో పోలీసుల మీద తీవ్రమైన విమర్శ వ్యక్తమయింది. కాల్పులలో ఎక్కువగా ముస్లింలు చనిపోవడానికి కారణం పోలీసులు పనిగట్టుకొని ముస్లింలను చంపడమేనని ముస్లిం మతనాయకులే కాదు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, పత్రికలు విమర్శించాయి.

దీనికి పోలీసులు కమిషన్ ముందు చెప్పిన సమాధానమేమిటంటే, మొదటి దఫా అల్లర్లలో ఎక్కువగా హింసకు పాల్పడింది ముస్లింలే కాబట్టి కాల్పులలో ఎక్కువగా ముస్లింలు చనిపోవడం సహజం అని. చనిపోయిన వారికీ గాయపడిన వారికీ తూటాలు మోకాలి కింద కాక ఛాతీ భాగంలోనూ తలలోనూ తగలడానికి గల కారణాన్ని కూడ పోలీసులు కమిషన్ ముందు వివరించారు. కదులుతూ, మారణాయుధాలతో దొమ్మీలకు పాల్పడుతున్న వారిపైన కాల్పులు జరిపినప్పుడు ఎంత జాగ్రత్తగా కాల్పులు జరిపినా మోకాలి పైభాగంలో తూటాలు తగలవన్న భరోసా ఉండడం కష్టం అన్నారు.

ఇవి పూర్తిగా తీసిపారేయగల జవాబులు కావని జస్టిస్ శ్రీకృష్ణ భావించారు. ఒక్కొక్క ఘటనలోనూ పోలీసులు అవసరానికి లోబడి మాత్రమే కాల్పులు జరిపారా లేదా అనేది వేరే సంగతి గానీ, కావాలని ముస్లింలను కాల్చి చంపారని భావించడానికి ఆధారాలు లేవని అన్నారు. అయితే,

> 'పోలీసుల ప్రవర్తనలో ముస్లింల పట్ల వ్యతిరేకత వేరే రూపంలో వ్యక్తమయింది. దానికి సాక్ష్యాలున్నాయి. వాళ్లపట్ల దురుసుగా ప్రవర్తించడం, ముస్లింలు ఇచ్చిన ఫిర్యాదులు కాగ్నైజబుల్ నేరాలయినా నమోదు చేసుకోకపోవడం, నమోదు చేసుకున్న కేసులు కూడా 'ఆధారాలు దొరకలేదు' అంటూ సులభంగా మూసేయడం జరిగింది. పోలీసుల మనస్సులలో ముస్లింల పట్ల ఒక సాధారణ వ్యతిరేకత ఉండింది. ముస్లింలతో వాళ్లు ప్రవర్తించిన పద్ధతిలో అది వ్యక్తం అయింది. ఆ సంగతి అడిషనల్ పోలీస్ కమీషనర్ వి.ఎన్. దేశ్‌ముఖ్ సహితం ఒప్పుకున్నారు. 1993 జనవరిలో ఈ వైఖరి మరింత నిర్దిష్ట రూపం తీసుకుంది' అని జస్టిస్ శ్రీకృష్ణ అంటారు.

నిజానికి 1993 జనవరిలో – అంటే ముంబాయి అల్లర్ల రెండవ ఘట్టంలో – పోలీసులలోని ముస్లిం వ్యతిరేకత ఎంత తీవ్ర రూపం తీసుకుందంటే కాల్పులు జరిపినప్పుడు కూడ వారిని చంపే ఉద్దేశ్యంతోనే కాల్చారని జస్టిస్ శ్రీకృష్ణ నమ్మారు. ఆ విషయం దిగువ చూద్దాం.

## రెండవ ఘట్టానికి నాంది

ముంబాయి అల్లర్ల రెండవ ఘట్టం 1993 జనవరి 6 నుండి మొదలయింది. దీనికి నాంది ఏమిటన్న విషయాన్ని గురించి శివసేన ఒక పద్ధతి ప్రకారం ప్రచారం చేసింది. ముస్లింలు పెద్దఎత్తున హత్యాకాండ కొనసాగించడానికి సన్నద్ధమయ్యారనీ, అందులో పాకిస్తాన్ గూఢచారి సంస్థ ఐఎస్ఐ పాత్ర ఉందనీ ప్రచారం చేసారు. రెండు ఘటనలను దీనికి ఉదాహరణగా ప్రచారం చేసారు. ఈ ప్రచారం ఎంత సమర్థంగా జరిగిందంటే సాధారణ దినపత్రికలు, సామాన్య పరిశీలకులు సహితం ఈ రెండు ఘటనలే జనవరి అల్లర్లకు నాంది అని నమ్మారు. ఈ రెండింటిలోనూ దోషిత్వం ముస్లింలకే ఆపాదించబడింది కాబట్టి ఈ ప్రచారం ఫలితంగా 'తప్పు' మళ్లీ ముస్లింలదే అయింది. జనవరి అల్లర్లలో అత్యధికంగా దెబ్బతినింది, భీతావహులయినది ముస్లింలే కాబట్టి, హిందుత్వవాద సంస్థలు తమ మీద నిందపడకుండ తప్పించుకోవాలంటే ఈ రకమైన చిత్రం ఇయ్యవలసి వచ్చింది. ఆ పని చాలా విజయవంతంగా చేసారు.

కానీ జస్టిస్ శ్రీకృష్ణ విషయాన్ని లోతుగా పరిశీలించి, శివసేన ప్రచారం చేసిన ఆ రెండు ఘటనలే జనవరి అల్లర్లకు నాంది అని భావించడానికి ఆధారమేమీ లేదనీ, ముస్లింలు మొదటి దశలోనయినా రెండవ దశలోనయినా సంఘటితంగా వ్యవహరించారని నమ్మడానికి ఆధారమేమీ లేదనీ, ఐఎస్ఐ వంటి విదేశీ హస్తం ముంబాయి అల్లర్లలో పని చేసిందని నమ్మడానికి కూడ ఆధారమేమీ లేదనీ సవివరంగా చెప్పారు.

శివసేన ప్రచారం చేసిన రెండు ఘటనలలో మొదటిది జనవరి 5 రాత్రి జరిగింది. (మణిరత్నం తీసిన 'బొంబాయి' సినిమా పుణ్యాన ఈ ఘటనే అల్లర్లకు నాంది అన్న అభిప్రాయం ఈ పాటికి దేశవ్యాప్తంగా నెలకొని ఉంటుంది). 5వ తేదీ రాత్రి డోంగ్రీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని విజయ్ ట్రాన్స్‌పోర్ట్ కంపెనీ గోడౌన్‌లో పని చేస్తున్న ఒక హమాలీ కార్మికుడు (మరాఠీలో మతాడి కార్మికుడు అంటారు) రాత్రి నిద్రలేచి మూత్రానికి బయటకు పోగా ఎవరో దుండగులు అతనిని పొడిచి చంపారు. అతని కేకలు విని బయటికొచ్చిన మరి ముగ్గురు హమాలీ కార్మికులను కూడ పొడిచి చంపారు. ఈ నలుగురినీ చంపింది ఎవరో, ఎందుకు చంపారో ఎవరికీ తెలియక పోయినా ఇది ముస్లింలు చేసిన హత్యేనని శివసేన పెద్దెత్తున గొడవ చేసింది. మతాడీ కార్మిక సంఘం తరువాతి రోజు బంద్ పిలుపు ఇచ్చింది. బంద్ పిలుపులో ముస్లింల ప్రస్తావన ఏమీ లేదు. నగరం నలుమూలలా పనిచేసే

హమాలీ కార్మికులకు రక్షణ లేకుండ పోయిందనీ, ప్రభుత్వం రక్షణ కల్పించాలనీ పిలుపు ఇచ్చారు. అయితే బంద్‌నాడు నిర్వహించిన నిరసన సభలో మాత్రం హిందుత్వవాద వక్తలు ఇది ముస్లింలు చేసిన పనేనంటూ రెచ్చగొట్టే ఉపన్యాసాలు ఇచ్చారు. అప్పటినుండి ఈ 'మతాడీ కార్మికుల హత్య'కు శివసేన ప్రచారంలో ముఖ్య స్థానం ఏర్పడింది. ఆ తరువాత జరిగిన ముస్లింల ఊచకోత యావత్తు ఈ ఘటనకు ప్రతిస్పందనగానే చూపించబడింది.

రెండవ ఘటన జనవరి 7-8 తేదీల మధ్యరాత్రి 3.00 గంటల సమయంలో జరిగింది. జోగేశ్వరి పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాధాబాయి చౌల్స్‌లో దుండగులు ఒక ఇంటికి బయటినుండి గొళ్లెం పెట్టి తగలబెట్టారు. మంటలలో ఆరుగురు సజీవ దహనమై చనిపోయారు. చనిపోయిన కుటుంబం హిందువులు, చంపినవారు ముస్లింలు. ఇది ఘోరమైన మారణకాండ అనడంలో సందేహమేమీ లేదు. అయితే ఈ ఘటనను శివసేన వారూ, దినపత్రికలూ విపరీతంగా ప్రచారం చేసి హిందువులను రెచ్చగొట్టడమేకాక, శివసేన కార్యకర్తల ఆధ్వర్యంలో ఒక పద్ధతి ప్రకారం ఆ తరువాత జరిగిన ముస్లింల ఊచకోతను ఈ ఘటనకు హిందువుల ప్రతిస్పందనగా చిత్రీకరించారు. ఇది నిజం కాదని వాస్తవాలకు దూరం అని జస్టిస్ శ్రీకృష్ణ విమర్శించారు. అయితే ఈ ప్రచారం ఎంత సమర్థంగా జరిగిందంటే శివసేన వారే కాదు, అప్పటి మహారాష్ట్ర ముఖ్యమంత్రి (కాంగ్రెస్ పార్టీ) సుధాకరరావు నాయక్, అప్పటి ముంబాయి నగర పోలీస్ కమీషనర్ శ్రీకాంత్ బాపట్ కూడ ఇదే అభిప్రాయాన్ని ప్రకటించారు.

మతాడీ కార్మికుల హత్యకు (ఇది చేసింది ఏ మతస్తులో అప్పటికి తెలియనుకూడ తెలియదు), రాధాబాయి చౌల్స్ మారణకాండకు హిందువులు 'న్యాయమైన ఆగ్రహంతో స్పందించడమే' జనవరి అల్లర్ల సారాంశం అన్న అభిప్రాయాన్ని (శివసేన, బిజెపిలే కాక పోలీసులూ కాంగ్రెస్ ప్రభుత్వమూ కూడ నమ్మిన అభిప్రాయాన్ని) జస్టిస్ శ్రీకృష్ణ తిరస్కరిస్తూ, 'వాస్తవాలను పరిశీలిస్తే, 1992 డిసెంబర్ 12 నుండి 1993 జనవరి 5 మధ్య ముస్లింలపైన దాడులు జరుగుతూనే ఉన్నాయని గ్రహించగలుగుతాం' అని అన్నారు. ముస్లింలవైపు నుండి కూడ దాడులు జరిగాయి.

* డిసెంబర్ 15న ఘట్‌కోపర్ ప్రాంతంలో ఒక కట్టెల డిపోను తగలబెట్టగా, నలుగురు ముస్లింలు అందులో సజీవంగా దహనం అయ్యారు.

* డిసెంబర్ 20న గోరేగావ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇద్దరు ముస్లింలను ఒక గదిలో పెట్టి బంధించి గదికి నిప్పుపెట్టడం జరిగింది. ఇద్దరిలో ఒకరు చనిపోయారు.

* జనవరి 2న తార్‌దేవ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎం.పి.మిల్ కాంపౌండ్‌లో ముస్లింల గుడిసెలకు నిప్పుపెట్టి దగ్ధం చేయడం జరిగింది.

* జనవరి 4వ తేదీన శివసేన నాయకత్వంలో పెద్దగుంపు జోగేశ్వరి పోలీస్‌స్టేషన్‌కు ఊరేగింపుగా పోయారు. హిందువులకు రక్షణ లేకుండా పోయిందనేది వారి ఫిర్యాదు. దారిలో వారు చాచానగర్ మసీదుపై దాడి చేసి పలువురు ముస్లింలను గాయపరిచారు. మాహిం జంక్షన్‌లోని మగ్దూంనగర్‌లో నున్న ముస్లింల గుడిసెలను తగలబెట్టారు.

* జనవరి 6 రాత్రి 9.00 గంటల సమయంలో మాహిం ప్రాంతంలో సంజయ్ గవాడె అనే పోలీస్ కానిస్టేబుల్, మిలింద్ వైద్య అనే శివసేన కార్పొరేటర్ నాయకత్వం వహించిన హిందువుల గుంపు చేత కత్తులు పట్టుకొని ముస్లింలపైన దాడులు చేసారు. దీనితో ముస్లింలు కూడ రెచ్చిపోయారు. ఇరువర్గాలు పెద్దఎత్తున తలపడ్డాయి.

* ఇదే సమయంలో దక్షిణ ముంబాయికి చెందిన సలీం రాంపురి, ఫిరోజ్ కొంకణి అనే ఇద్దరు వృత్తి నేరస్తుల ఆధ్వర్యంలో హిందువులను కత్తులతో పొడిచి చంపిన సంఘటనలు జరిగాయి. దీనికి ప్రతీకారంగా ముస్లింలను అదే రకంగా పొడిచిన ఘటనలు కూడ జరిగినప్పటికీ ఈ కత్తిపోటు సంఘటనలలో ఎక్కువగా దెబ్బతిన్నది హిందువులే.

మొదటి దఫా అల్లర్లకూ, రెండవ దఫా అల్లర్లకూ మధ్య జరిగిన ఇన్ని ఘటనలలోనికీ జనవరి 5 రాత్రి జరిగిన మథాడీ కార్మికుల హత్యనూ, జనవరి 7-8 మధ్య రాత్రి రాధాబాయి చౌల్స్‌లో జరిగిన మారణకాండనూ వేరు చేసి వాటివల్లనే రెండవ దఫా అల్లర్లు చెలరేగాయని ప్రచారం చేయడంలో అర్థమేమీ లేదని జస్టిస్ శ్రీకృష్ణ అభిప్రాయపడ్డారు. ఈ ప్రచారం కేవలం ఆ తరువాత జరిగిన హింసాకాండను 'హిందువుల న్యాయమైన ఆగ్రహం' అంటూ సమర్థించడానికి పనికొచ్చింది. ఈ వ్యాఖ్యానాన్ని శివసేన, బిజెపిలే కాక కాంగ్రెస్‌పార్టీ, మహారాష్ట్ర ప్రభుత్వయంత్రాంగం కూడ స్వీకరించి ప్రచారం చేయడం వల్ల ఇదే సత్యంగా చలామణి అయింది.

కానీ జస్టిస్ శ్రీకృష్ణ తన ముందు నమోదయిన సాక్ష్యాల ఆధారంగా రెండవదఫా అల్లర్లను వేరేరకంగా వ్యాఖ్యానించారు. ఆయన దృష్టిలో అది

ప్రధానంగా హిందుత్వవాద సంస్థలు ఉద్దేశ్యపూర్వకంగా, ఒక ప్రణాళిక ప్రకారం జరిపిన హింసాకాండ. మతాడీ కార్మికుల హత్యను, రాధాబాయి చౌల్స్ మారణకాండనూ కారణంగా చూపించి ప్రచారం చేయడం కూడ ఈ ప్రణాళికలో భాగమనే ఆయన నమ్ముతారు.

డిసెంబర్ 26 నుండి శివసేన ఆధ్వర్యంలో మొదలయిన 'మహాఆరతి ' కార్యక్రమాన్ని ఆయన ప్రముఖంగా ఉదహరిస్తారు. నిజానికి డిసెంబర్ 12 తరువాత అల్లర్లు తగ్గినప్పటినుండి శుక్రవారం నమాజ్ (ప్రార్థనల)కు ముస్లింలు ఎక్కువ సంఖ్యలో హాజరుకావడం, బాబ్రీ మసీదు కూల్చివేత గురించి, మైనారిటీల పరిస్థితి గురించి ఆవేశంగా మాట్లాడుకోవడం ముంబాయి నగరంలో పెరిగిందని ఆయన గుర్తించారు. దీనికి సమాధానంగా అన్నట్లు శివసేన ఆధ్వర్యంలో మహాఆరతులు మొదలయ్యాయి. శుక్రవారం నమాజ్ మీటింగ్‌లు ముస్లింల సంఘటితపడడానికి ఉపయోగపడుతున్నాయని గుర్తించారేమో, మహాఆరతులలో వారు ప్రధానంగా పెట్టిన డిమాండ్లు నమాజ్ పిలుపు మైకులలో గట్టిగా ఇవ్వడం మానేయాలనీ, మసీదు ఎదుట రోడ్డుకు అడ్డంగా ప్రార్థనలు చేయడం మానేయాలనీ. నమాజ్ సమయంలో మసీదులో చోటు చాలకపోతే రోడ్లోకి వచ్చి ప్రార్థన చేయడం, మైక్‌పెట్టి భక్తులను గట్టిగా పిలవడం 'కొత్త విషయాలూ కావు, ఇతరులకు ఏమంత తీవ్రమైన ఇబ్బంది కలిగించే విషయాలూ కావు' అని జస్టిస్ శ్రీకృష్ణ వ్యాఖ్యానిస్తూ, ఇది కేవలం మహా ఆరతులను ఒక రాజకీయ కార్యక్రమంగా చేపట్టడానికి సాకుగా మాత్రమే ఉపయోగపడిందని అంటారు. మహా ఆరతులలో రెచ్చగొట్టే ఉపన్యాసాలు ఇవ్వడం, మహా ఆరతులకు హాజరయిన వాళ్లు తిరిగి పోతూపోతూ ముస్లింలపైన దాడులు చేయడం, ముస్లింల నివాసాలు తగలబెట్టడం తరచుగా జరిగిందని జస్టిస్ శ్రీకృష్ణ సోదాహరణంగా వివరించారు. 1992 డిసెంబర్ 26న మొదలయిన మహాఆరతులు జనవరి నెల హింసాకాండ మధ్య కూడ నిరాఘాటంగా కొనసాగి ఫిబ్రవరి మొదటివారం దాకా నడిచాయి. కర్ఫ్యూలో సహితం పోలీసులు శివసేన మహాఆరతులకు అంతరాయం కలిగించలేదని తరువాత అధ్యాయంలో చూద్దాం.

కాబట్టి, జనవరి అల్లర్లకు కారణమేమిటన్న ప్రశ్నకు శివసేన ప్రచారం చేసిన (మహారాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు, చాలావరకు పత్రికలు అంగీకరించిన) జవాబును తిరస్కరిస్తూ, అది ముస్లింల హింసాకాండకు హిందువుల ప్రతిస్పందన కాదని స్పష్టం చేశారు. మరి జనవరి అల్లర్ల స్వభావం ఏమిటంటే,

‘1992 డిసెంబర్ 15 నుండి 1993 జనవరి 5 మధ్య అనేక హింసాత్మక ఘటనలు జరిగినప్పటికీ, జనవరి 6 నుండి హిందువులు పెద్దెత్తున దొమ్మీలకూ హింసకూ పాల్పడ్డారు. హిందూ మతతత్వవాద సంస్థల రెచ్చగొట్టే ప్రచారం ఉద్విగ్నతను తారస్థాయికి తీసుకుపోయింది. సామ్నా, నవకాల్ వంటి వార్త పత్రికలలోని రచనలు కూడ అదే పని చేసాయి. ఈ హింసాకాండకు శివసేన నాయకత్వం వహించింది. శివసేన ప్రముఖ్ బాల్‌థాకరే ఆదేశాలు, రాతలు, శివసేన కార్యకర్తల ప్రకటనలు, చర్యలు మతోన్మాదాన్ని విపరీతంగా రెచ్చగొట్టాయి. అమెరికాకు చెందిన ‘టైం’ పత్రికకు బాల్‌థాకరే ఇచ్చిన ఇంటర్వ్యూలోనూ, శివసేన నాయకులు మధుకర్ సర్‌పోట్‌దార్, మనోహర్ జోషీల ‘ప్రతీకార’ సిద్ధాంతంలోనూ ఈ వైఖరి ప్రతిఫలించింది. ‘శివసేన బీభత్సమే ప్రజలకు నిజమైన రక్ష’ అన్న నినాదం శివసేన కార్యకర్తల హింసాకాండకు సంకేతంగా నిలిచింది’ అని అన్నారు.

మరి ముస్లింలు పాల్పడ్డ హింస మాటేమిటి అని అడిగితే, 1992 డిసెంబర్‌లోలాగే

‘ఈ దశలో కూడ ముస్లింల సంస్థలుగానీ ప్రముఖ వ్యక్తులుగానీ దానికి బాధ్యులనడానికి ఆధారాలేమీ లేవు. అయితే చాలామంది ముస్లింలు, ముస్లిం మతస్తులయిన నేరగాళ్లు హింసకు, దోపిడీకి, దహనకాండకు, దొమ్మీకి పాల్పడిన మాట వాస్తవమే’నని అంటారు.

దీని విశదీకరణ రెండవ భాగంలో చూద్దాం.

## II

## జనవరి 1993:
## హిందూత్వవాదుల హత్యాప్రణాళిక, పోలీసుల తోడ్పాటు

## శివసేన పాత్ర – రెండవ ఘట్టం

1993 జనవరిలో ముస్లింలపైన జరిగిన ప్రాణాంతకమైన దాడులలో శివసేన ప్రత్యక్షపాత్ర ఉందని చూపించే అనేక ఘటనలను జస్టిస్ శ్రీకృష్ణ తన ఎదుట నమోదయిన వాంగ్మూలాల నుండి ఉటంకించారు.

జనవరి 3వ తేదీనే (అంటే హిందువుల 'ప్రతిస్పందన'కు కారణంగా చూపించబడుతున్న మతాడి కార్మికుల హత్యలు, రాధాబాయి చౌల్స్ మారణకాండ జరగక ముందే) ప్రతీక్షానగర్ ప్రాంతంలో 18 నుండి 25 సంవత్సరాల వయసు లోపల ఉన్న యువకులు చాలామంది హౌసింగ్‌బోర్డ్ ఉద్యోగులమని చెప్పుకుంటూ ఇల్లిల్లూ తిరిగి ముస్లింలు నివసించే ఇళ్లను గుర్తించారు. ఆ యిళ్లపైన సుద్దతో గుర్తులు కూడ పెట్టారు. అందరి గురించీ అడిగినట్టు చేస్తూ ముస్లింల వివరాలు మాత్రం రాసుకున్నారనీ, ముస్లింల ఇళ్లకు మాత్రం గుర్తులు పెట్టారనీ ఆ తరువాతగానీ అక్కడి నివాసులకు అర్థం కాలేదు.

ఒక వారం తరువాత – జనవరి 9,10,11 తేదీలలో – ప్రతీక్షానగర్‌పైన పెద్దఎత్తున హిందూ గుంపుల దాడి జరిగింది. తలకు కాషాయం రుమాలు చుట్టుకున్న యువకులు 'జైశ్రీరాం', 'జై భవానీ', 'జై భీం', 'జై మహారాష్ట్ర', 'శివసేన జిందాబాద్' అని నినాదాలు ఇస్తూ దాడులు చేసారు. వాళ్లు వేసుకున్న టీషర్ట్‌లపైన శివసేన  అని మరాఠీలో వ్రాసి ఉంది. ఆ మూడు దినాలు ప్రతీక్షానగర్‌లో ముస్లింల ఇళ్ల తలుపులు పగలగొట్టి లూటీ చేసారు, దహనం చేసారు. నలుగురు ముస్లింలను పొడిచి చంపారు. ఒక మసీదు పైన రాళ్లువేసి పక్కనున్న ముస్లింల తోపుడు బళ్లను, వాహనాలను తగలబెట్టారు. ఒక కారులో పోతున్న ముగ్గురు ముస్లింలను ఆపి, బయటికి గుంజి, విపరీతంగా కొట్టి, తిరిగి అదే కారులోకి వాళ్లను నెట్టి దానిని తగలబెట్టి ఆ ముగ్గురినీ సజీవంగా దహనం చేసారు. ఈ ఘటన శివాజీ చౌక్ పోలీస్ పికెట్‌కు 50 గజాల లోపే జరిగింది. అప్పుడేమీ చేయని పోలీసులు నాలుగు రోజుల తరువాత ఇద్దరిని అరెస్టు చేయగా, జనవరి 15 నాడు శివసేనకు చెందిన ఎంఎల్ఏ కాళిదాస్ కోలంకర్, కార్పొరేటర్ కృష్ణా విశ్వాసరావ్, స్థానిక శాఖా ప్రముఖ్ ప్రహ్లాద్ థోంబ్రేల నాయకత్వంలో మూడు నాలుగువేలమంది వాళ్లను విడుదల చేయాలంటూ పోలీస్‌స్టేషన్ మీదికి ఊరేగింపుగా పోయారు (వీళ్లతో పాటు ఏక్‌నాథ్ గైక్వాడ్ అనే కాంగ్రెస్ ఎంఎల్ఏ కూడ ఉండడం గమనార్హం).

ఈ ప్రాంతంలో నివసించే రేష్మా ఉమర్ మక్కీ అనే మహిళ కమిషన్ ముందు తన వాంగ్మూలం వివరంగా ఇచ్చింది. పెళ్లికి ముందు ఆమె హిందూ స్త్రీ. ఉమర్ మక్కీ అనే ముస్లిం యువకుడిని ప్రేమించి, మతం మార్చుకుని పెళ్లిచేసుకొని తన పేరు రేష్మాగా మార్చుకుంది. జనవరి 3వ తేదీన శివసేన కార్యకర్తలు ప్రతీక్షానగర్‌లో ముస్లింల ఇళ్లకు గుర్తులు పెట్టినప్పుడు వీరి ఇంటికి కూడా గుర్తు

పెట్టారు. 9వ తేదీన ఆ యింటిపైన శివసేన కార్యకర్తలు కత్తులతో, కర్రలతో, గొడ్డళ్లతో దాడిచేసారు. ఆమె భర్త గురించి అడిగారు. రేష్మా అతనిని ఒక పెద్ద పెట్టెలో దాచి పెట్టి ఇంట్లో లేడని బుకాయించింది. 11వ తేదీన వాళ్లు మళ్లీ వచ్చారు. 'ముస్లింను ఎందుకు పెళ్లిచేసుకున్నావు? హిందువులంతా చచ్చిపోయారా?' అని దబాయించారు. వారిలో ముగ్గురు నలుగురు ఇంట్లోకి వచ్చి రేష్మా మెడమీద కత్తిపెట్టి అరిస్తే బట్టలు చింపేసి రేప్ చేస్తామని బెదిరించారు. ఆ తరువాత కూడా స్థానిక శివసేన కార్యకర్తలు ముస్లింను పెళ్లిచేసుకున్నందుకు తనను వేధిస్తున్నారని ఆమె కమిషన్‌కు చెప్పింది.

తన భర్తను వాళ్లు చంపేటట్టున్నారనీ, తమకు సహాయం చేయమనీ రేష్మా ఆ ప్రాంత పోలీస్ ఇన్స్‌పెక్టర్ వినాయక్ పాటిల్‌కు విన్నవించుకోగా, అతను నిర్మొహమాటంగా 'ఒక ముస్లిం చస్తే, ఒక ముస్లిం తక్కువ అవుతాడులె'మ్మని జవాబు చెప్పాడు. తనను వేధిస్తున్న సంగతి చెప్తే కూడ పట్టించుకోలేదు. అప్పుడు 'నీకు శిక్షపడే రోజు వస్తుందిలె'మ్మని రేష్మా ఇన్స్‌పెక్టర్ పాటిల్‌ను నిస్సహాయంగా శపించి వచ్చేసిందంట. అయితే ఆమె మాటలే సత్యమయ్యాయని తరువాతి రికార్డును బట్టి తెలుస్తుందని జస్టిస్ శ్రీకృష్ణ అంటారు. అతనిని రాష్ట్ర ప్రభుత్వం ఆ తరువాత విచారణ లేకుండ బర్తరఫ్ చేసింది. అనేక ఇతర ఆరోపణలతోబాటు 'మతతత్వ సంస్థలతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి' అనేది అతని మీద ఉన్న ఆరోపణలలో ఒకటి. ప్రతీక్షానగర్ ఘటనలను జస్టిస్ శ్రీకృష్ణ వివరంగా సమీక్షించి, ఒక్క వినాయక్ పాటిల్ మాత్రమేకాక మొత్తంగా పోలీసులు ముస్లిం వ్యతిరేక పాత్ర నిర్వహించారన్న అభిప్రాయానికి వచ్చారు. పోలీసుల వైఖరివల్లనే ప్రతీక్షానగర్‌లో అంత పెద్దఎత్తున దాడులు జరగగలిగాయని ఆయన అన్నారు. 'ప్రతీక్షానగర్‌లోని హిందూ దుండగులు పెద్దఎత్తున దాడికి దిగారు. వారిలో కొందరు బహిరంగంగానే తాము శివసేన కార్యకర్తలమని చెప్పుకున్నారు. మరికొందరిని బాధితులు శివసేన కార్యకర్తలుగా గుర్తించడం జరిగింది. స్థానిక పోలీసుల ప్రత్యక్ష పరోక్ష సహకారంతో వాళ్లు ముస్లింలను భీతావహులు చేసి అణచివేసారు. ఇంత పెద్దఎత్తున వాళ్లు విజయవంతంగా తమ కార్యక్రమం నిర్వహించగలిగారంటేనే పోలీసు యంత్రాంగం ఎంతగా నిష్క్రియాపరత్వానికి లోనయిందో, ఎంతగా మతతత్వ జాడ్యం పోలీసు యంత్రాంగానికి సోకిందో అర్థం అవుతుంది' అని జస్టిస్ శ్రీకృష్ణ అన్నారు.

అయితే ఇన్స్పెక్టర్ వినాయక్ పాటిల్ లాగ శిక్షపడిన ముంబాయి పోలీస్ అధికార్లు కొద్దిమందే. అత్యధికులు ఎటువంటి అభిశంసన లేకుండ తప్పించుకున్నారు. ఈ విషయం దిగువ చూద్దాం.

దొమ్మీలలో శివసేన నిర్వహించిన పాత్ర ప్రధానంగా 'మహాఆరతుల'తో ముడిపడి ఉంది. రోడ్డు మీద నమాజ్ చేయడాన్ని నిరోధించాలి, నమాజ్‌కు మసీదు నుండి మైక్ ద్వారా బిగ్గరగా పిలుపు ఇవ్వడం మాన్పించాలి అన్న పాత డిమాండ్లకు కొత్త ఉద్విగ్నత కల్పిస్తూ హిందుత్వవాదులు డిసెంబర్ నెలాఖరులో 'మహాఆరతి' కార్యక్రమాలను మొదలుపెట్టిన సంగతి పైన చెప్పాము. జనవరి వచ్చేసరికి అవి మతోన్మాదాన్ని రెచ్చగొట్టి ముస్లింలపైన దాడులకు హిందువులను సమాయత్తం చేసే కార్యక్రమాలుగా రూపాంతరం చెందాయి. ఎక్కువ భాగం దాడులు మహాఆరతి కార్యక్రమాలకు హాజరయి నిష్క్రమిస్తున్న హిందువుల గుంపులు చేసారని శ్రీకృష్ణ కమిషన్ నివేదిక తెలియజేస్తుంది. అంతకు ముందు ఏ అల్లర్లు జరగని ప్రాంతాలలో కూడ మహాఆరతులు మొదలుపెట్టిన తరువాత హింసాకాండ చెలరేగిందని నివేదిక సోదాహరణంగా చూపించింది.

బైకుల్లా పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు హనుమాన్ మందిర్‌ల దగ్గర జనవరి 9న కర్ఫ్యూ అమలులో ఉండగానే మహాఆరతులు నిర్వహించారు. చవాన్ అనే ఎసిపి (అసిస్టెంట్ కమీషనర్ ఆఫ్ పోలీస్) స్వయంగా పక్కన ఉండి ఈ మహాఆరతులను తిలకించాడు! వీటిలో ఒక మహాఆరతి కార్యక్రమం నుండి వెనుదిరిగి పోతున్న జనం దొమ్మీకి పాల్పడ్డారని అదే ఎసిపి అంటుండగా, స్థానిక ఇన్స్పెక్టర్ పటాంకర్ మాత్రం ఆ జనం భజనలు పాడుకుంటూ ఇంటికి పోయారని అంటాడు! పైగా మహాఆరతి నుండి వెనుదిరిగి పోతున్న వారి చేతిలో ఇనపరాడ్లు, బల్లాలు ఉన్నాయని సాక్షులు చెప్తున్నారు కదా, దీనిని బట్టి వాళ్లు మహాఆరతికి వచ్చినపుడే ఆయుధాలు పట్టుకొని వచ్చినట్టున్నారు కదా, మీరు చూస్తూ ఏం చేస్తున్నారని కమిషన్ ఇన్స్పెక్టర్ పటాంకర్‌ను అడిగితే, ఇంటికి తిరిగి పోయి ఆయుధాలు తీసుకొని వెనక్కి వచ్చి ఉండవచ్చునని అంటాడు. 'కమిషన్‌ను తప్పుదోవ పట్టించడానికి ఇన్స్పెక్టర్ ఇంత బాధాకరమైన ప్రయత్నం చేయడం హేయమైన విషయం' అని జస్టిస్ శ్రీకృష్ణ వ్యాఖ్యానిస్తారు.

కొలాబా పోలీస్‌స్టేషన్ పరిధిలోని వీర్‌బజరంగ్ గుడి దగ్గర జనవరి 11 రాత్రి శివసేన వారు 8-9 గంటల మధ్య ఒక మహాఆరతి కార్యక్రమం నిర్వహించారు. రెచ్చగొట్టే ఉపన్యాసాలు ఇచ్చిన ఆ కార్యక్రమం నుండి వెనుదిరిగి

పోతున్న జనం చాలా కోపంగా, అసహనంగా ఉన్నారు. వాళ్ల వైఖరి గమనించిన పోలీసులు వారితోనే నడిచారు. దారిలో అబ్దుల్ రజాక్ అనే రౌడీ తారసపడ్డాడు. మహాఆరతి  నుండి పోతున్న జనం అతని వెంటపడి తరిమి పట్టుకొని పశువును వధించినట్టు వధించారు. 45 కత్తిపోట్లున్న అతని శవాన్ని పోలీసులు వెలికి తీసారు. మహాఆరతికి హాజరయి వెనక్కి పోతున్న జనం చేతిలోకి అకస్మాత్తుగా కత్తులెక్కడి నుండి వచ్చాయన్న కమిషన్ ప్రశ్నకు పోలీసుల నుండి జవాబు లేదు.

డి.బి. మార్గ్ పోలీస్‌స్టేషన్  పరిధిలోని కబీర్‌వాడి హనుమాన్ మందిర్ దగ్గర శివసేన ఎంఎల్ఏ చంద్రకాంత్ పద్వాల్, కార్పొరేటర్ అరవింద్ నేర్కర్‌ల నేతృత్వంలో జనవరి 9న జరిగిన మహాఆరతి  అనంతరం తిరిగి పోతున్న గుంపు ఆ వాడలోని ప్రతి ముస్లిం దుకాణాన్నీ ధ్వంసం చేసి లూటీ చేసింది. సిఐడి స్పెషల్ బ్రాంచి చౌరవతో ఈ కార్యక్రమాన్ని మొత్తం వీడియో తీయడం జరిగింది. మహాఆరతికి హాజరయిన జనం ఉద్రిక్తులయ్యారనీ వారిలో అలజడి చెలరేగిందనీ వారిని అదుపు చేయడానికి పోలీసు సిబ్బంది బలప్రయోగానికి పాల్పడవలసి వచ్చిందనీ స్పెషల్ బ్రాంచిడైరీ చెప్తుండగా, కమిషన్ ముందు హాజరయిన సీనియర్ పోలీస్ ఇన్స్‌పెక్టర్ భకారే మాత్రం ఆ డైరీలోని రికార్డు అవాస్తవమనీ అదేం లేదనీ అంటాడు. మహాఆరతి  ప్రశాంతంగా జరుగుతుండగా పొరుగున ఉన్న గ్రాంటురోడ్డు మసీదు నుండి ఆజాన్ పిలుపు గట్టిగా వినపడిందనీ అప్పుడు మాత్రమే జనంలో కొంత అలజడి చెలరేగిందనీ అంటాడు. కానీ స్పెషల్ బ్రాంచి పురమాయింపు మీద వీడియో తీసిన సుధీర్ నాగిన్‌లాల్ షా తన వాంగ్మూలంలో, మహాఆరతి  చాలా బిగ్గరగా సాగుతుండిందనీ ఆజాన్ పిలుపు దానిని డిస్టర్బ్ చేసేంత గట్టిగా ఏమీ లేదనీ అంటాడు. అతని వీడియోను మొత్తం తిలకించిన కమిషన్ కూడ అదే అభిప్రాయానికి వచ్చింది. కానీ సీనియర్ ఇన్స్‌పెక్టర్ భకారే మాత్రం మహాఆరతికి వచ్చిన గుంపు తిరిగి పోతూపోతూ పాల్పడిన హింసకు ఆజాన్‌నే కారణంగా చూపించదలచుకున్నాడు.

గాందేవి పోలీస్‌స్టేషన్  పరిధిలో జనవరి నెలలో 18 చోట్ల ముస్లింల నివాసాలపైన, దుకాణాలపైన దాడులు జరిగాయి. వీటిలో ప్రతీ ఒక్కటీ శివసేన వారు, భారతీయ జనతాపార్టీ వారు మహాఆరతి  నిర్వహించిన కొద్దిసేపటికి, ఆ ప్రదేశానికి దగ్గరగా జరిగాయి. మొత్తం 80కి పైగా ఇళ్లు, దుకాణాలు లూటీకి గురయ్యాయి.

తార్‌దేవ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జనవరి 9వ తేదీన హనుమాన్ మందిర్ వద్ద మహాఆరతి జరిగింది. బిజెపి, శివసేన, విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఆ ప్రాంతంలో విపరీతమైన టెన్షన్ ఉందని సిఐడి రిపోర్టులో ఉన్నప్పటికీ ఈ మహాఆరతికి పోలీసులు అనుమతి ఇచ్చారు. యథావిధిగా మహాఆరతి నుండి తిరిగివెళుతూ జనం దారిలోని ముస్లింల ఇళ్లపైన, దుకాణాలపైన దాడులు చేసి బీభత్సాన్ని సృష్టించారు. మహాఆరతికి హాజరయిన వాళ్లెవరి దగ్గరా ఆయుధాలేవీ లేవని కమిషన్ ముందు పోలీస్ అధికారులు వాంగ్మూలం ఇచ్చారు. కానీ తిరిగి వెళ్లేటప్పుడు లూటీ చేయడానికి కావలసిన కత్తులు, కర్రలు, గొడ్డళ్లు వాళ్ల చేతిలో ప్రత్యక్షమయ్యాయి. అవి ఎక్కడినుండి వచ్చాయని పోలీస్ అధికార్లను కమిషన్ ప్రశ్నిస్తే బహుశా పోతూ పోతూ దారిలో ఉన్న హిందువుల ఇళ్లనుండి తీసుకొన్నారేమోనని వారు జవాబు చెప్పారు!

మహాఆరతులతో సంబంధం లేకుండ హిందుత్వవాద సంస్థలు, వారు పోగు చేసిన గుంపులు ముస్లింలపైన దాడులు చేయలేదనుకుంటే పొరపాటే. నిజానికి జనవరి నెలలో ముస్లింలపైన జరిగిన దాడులన్నిటిలోనూ హిందుత్వవాద సంస్థల పాత్ర – ముఖ్యంగా శివసేన పాత్ర – ప్రత్యక్షంగానే ఉంది. దాడులకు నాందిగా, ముస్లింలవైపు నుండి పెద్దెత్తున దాడి జరగబోతున్నదని ప్రచారం చేపట్టారు. ఈ ప్రచారం హిందూవాడలలో దావానలంలాగా వ్యాపించింది. దానితో, మామూలుగా మతతత్వవాదులు కానివాళ్లు సహితం రెచ్చిపోయారు. శివసేన మూకలలో భాగమయ్యారు.

కాలాచౌకి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ధోంద్‌పాడ మసీదుపైన జనవరి 9 నాడు దాదాపు 12–14 వేల మంది దాడిచేసారు. ఈ గుంపుకు భాయిషింగ్రె, రమాకాంత్ రహతె, రవి చవాన్, శ్రీధర్ కదమ్, అనీల్‌గైక్వాడ్ అనే శివసేన నాయకులు నేతృత్వం వహించారు. గుంపులు గుంపులుగా విడిపోయి వీళ్లు మసీదుపైన కొంతసేపు, ముస్లింల ఇళ్లపైన కొంతసేపు దాడి చేసారు. మహమ్మద్ వకీల్ ఆలం అనే వ్యక్తిపైన కిరోసిన్ పోసి సజీవంగా దహనం చేసారు. ఈ గుంపును అదుపు చేయడానికి పోలీసులు జరిపిన కాల్పులలో ముగ్గురు చనిపోయారు. మరికొంతమందిని పోలీసులు అరెస్టు చేసారు. వాళ్లను విడుదల చేయాలంటూ శివసేన నాయకత్వంలోనే మళ్లీ పెద్ద ఊరేగింపు పోలీస్‌స్టేషన్ మీదికి పోయింది. రాళ్లతో, సోడాబాటిళ్లతో వాళ్లు పోలీసులపైన దాడి చేసారు.

ఇంత బీభత్సం జరిగినప్పటికీ పోలీసులు అదే సాయంత్రం శివసేన శాఖా ప్రముఖ్ దీపక్షిండె ఆధ్వర్యంలో స్థానిక హనుమాన్ దేవాలయంలో మహాఆరతి జరగనిచ్చారు!

## పోలీసులు – శివసేన

పోలీసులు శివసేన హింసాత్మక కార్యకలాపాలను ఆపడానికి ఎటువంటి ప్రయత్నం చేయలేదన్న విషయం ఇప్పటికే సూచించాము. మహాఆరతులు హింసకు దారి తీస్తున్నాయని తెలిసి కూడ వాటిని నిరోధించడానికి పోలీసులు ఎటువంటి ప్రయత్నమూ చేయలేదు. పైగా కర్ఫ్యూ అమలులో ఉన్న ప్రాంతాలలో కూడ యథేచ్ఛగా జరగనిచ్చారు. సిఐడి స్పెషల్ బ్రాంచి అన్ని పోలీస్ స్టేషన్లకూ పంపించిన ఇంటలిజెన్స్ రిపోర్టులో మహాఆరతుల వల్ల ఉండగల ప్రమాదాన్ని గురించి లిఖిత పూర్వకంగా హెచ్చరించినప్పటికీ పోలీసులు ఎంతమాత్రం జాగ్రత్త తీసుకోలేదు.

హిందువుల వైపు నుండి జరిగిన సంఘటిత హింసాకాండకు మహాఆరతులే కేంద్రంగా పనిచేసాయని జస్టిస్ శ్రీకృష్ణ గుర్తించారు కాబట్టే ఆ కార్యక్రమాల విషయంలో పోలీసుల వైఖరిని తరచి తరచి ప్రశ్నించారు. ఒకటి రెండు మినహాయింపులతో కమిషన్ ముందు హాజరైన పోలీస్ అధికారులెవ్వరూ సరయిన జవాబు చెప్పలేదు. మహాఆరతులకు హాజరయిన వాళ్ల చేతిలో ఎటువంటి ఆయుధాలూ లేవని ప్రతీ పోలీస్ అధికారీ కమిషన్‌తో అన్నాడు. కానీ అనేక సందర్భాలలో తిరిగిపోయేటప్పుడు వాళ్లు కర్రలతో రాళ్లతోనే కాదు, కత్తులతో, గొడ్డళ్లతో ముస్లిం బస్తీలపైన దాడులు చేసినట్టు పోలీసు ఎఫ్ఐఆర్‌లే కాక కమిషన్ ముందు హాజరయిన బాధితుల వాంగ్మూలాలు కూడ తెలియజేస్తాయి. మరి ఈ ఆయుధాలు ఎక్కడినుండి వచ్చాయని అడిగితే, 'ఏమో తెలీద'ని ఒకరు, 'ఇంటికిపోయి తెచ్చుకొని ఉంటార'ని ఒకరు, 'దారిలోని హిందువుల ఇళ్లనుండి తీసుకొని ఉండవచ్చున'ని ఇంకొకరు జవాబు చెప్పారు. ఇది కమిషన్‌ను తప్పుదోవ పట్టించడం తప్ప వేరే ఏమీ కాదని జస్టిస్ శ్రీకృష్ణ ముంబాయి పోలీసులను తీవ్రంగా దుయ్యబట్టారు.

అసలు ఈ మహాఆరతుల పర్యవసానం చూసిన తరువాతయినా వాటిని ఎందుకు నిషేధించలేదని (కనీసం ఘర్షణ వాతావరణం ఉన్న ప్రాంతాలలో) జస్టిస్ శ్రీకృష్ణ చాలామంది పోలీస్ అధికార్లను విచారణ సమయంలో అడిగారు. ఈ విషయంలో నిర్ణయం పైస్థాయిలోనే జరిగిందని ఆయనకు లభించిన

సమాధానాలను బట్టి తెలుస్తుంది. అప్పటికి మహారాష్ట్రలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది. పోలీస్ యంత్రాంగం వాళ్ల అదుపులో ఉంది. అయినప్పటికీ శివసేనకు కోపం తెప్పించాలంటే వాళ్లకు ధైర్యం చాలలేదు.

పోలీసులకు నిషేధాజ్ఞలు ప్రకటించే అధికారం ముంబాయి పోలీస్ చట్టంలోని సెక్షన్ 37లో ఉంది. సెక్షన్ 37 నుండి మహాఆరతిని మినహాయించాలన్న నిర్ణయం ముంబాయి పోలీస్ కమీషనర్ డిసెంబర్ 6కు ముందే తీసుకున్నాడు. దొమ్మీలు మొదలయిన తరువాత కొంతమంది పోలీసు అధికారులు క్రైం మీటింగ్‌లలో ఆ నిర్ణయం వల్ల వస్తున్న నష్టాన్ని కమీషనర్‌కు వివరించినప్పటికీ ఆ నిర్ణయం మారలేదు. అయితే ఆ మాత్రం హెచ్చరించిన అధికార్లు కూడా కొద్దిమందే ఉన్నట్టున్నారు. చాలామంది పోలీసు అధికారులు తామే శివసేన కార్యకర్తలయినట్టు ప్రవర్తించారు.

మహాఆరతులను సెక్షన్ 37 పరిధి నుండి మినహాయించడానికి కారణమేమిటని అప్పటి నగర పోలీస్ కమీషనర్ శ్రీకాంత్ కృష్ణాజీ బాపట్‌ను కమిషన్ అడుగగా, 'అవి కేవలం మత సంబంధమైన కార్యక్రమాలే తప్ప రాజకీయ కార్యక్రమాలు కావు' అని సమర్థించుకున్నాడు. ఇతర పోలీస్ అధికారులు కూడ అదే సమాధానం ఇచ్చారు. పోలీస్ కమీషనర్ వాంగ్మూలాన్ని జస్టిస్ శ్రీకృష్ణ వ్యాఖ్యానిస్తూ 'ఇతనిని ఇతని కింది అధికారులు మోసగించి అయినా ఉండాలి, లేదా ఇతను కూడా ఈ మోసంలో భాగం అయి ఉండాలి' అంటారు.

అయితే మహాఆరతుల పట్ల ఉదాసీన వైఖరి అవలంబించడం ఒక్కటే కాదు. ఇంకా అనేక ఇతర రూపాలలో ముంబాయి పోలీసులు హిందుత్వవాద సంస్థల పట్ల తమ పక్షపాతాన్ని ప్రదర్శించారు. వాళ్ల హింస రికార్డులకెక్కకుండ చూడడానికి చాలా హేయమైన పద్ధతులలో తాపత్రయం ప్రదర్శించారు.

1992 డిసెంబర్ 27 నాడు శివసేన వారు ఒక ఊరేగింపు తీసారు. ఊరేగింపు ఖేర్వాడి, నిర్మల్‌నగర్ పోలీస్‌స్టేషన్ ప్రాంతాల నుండి సాగింది. వాళ్ల చేతిలో ఉన్న ప్లకార్డుల మీద 'శివసేన బీభత్సమే ప్రజలందరికీ రక్ష' (Shivasena's terror is public safety) అని రాసి ఉంది. అదే నినాదం ఇచ్చారు కూడ. ఆ ఊరేగింపు గురించి ఖేర్వాడి పోలీస్‌స్టేషన్‌లో ఆ రోజు సమాచారం నమోదు చేసిన ఇంటలిజెన్స్ జవాను ఈ విషయాన్ని సరిగ్గానే రాసాడు. కానీ ఆ తరువాత న్యాయ విచారణ ప్రకటించేసరికి ఆ స్టేషన్ పోలీసులు దానిని దిద్దారు. 'బీభత్సం' అనే మాటను దిద్ది 'దర్శనం' (మరాఠీలో ఇవి రెండూ

దగ్గరగా ఉంటాయి) అనే మాట చేర్చారు. అయితే రికార్డు తెప్పించి పరిశీలించిన జస్టిస్ శ్రీకృష్ణ ఈ విషయాన్ని గమనించి తీవ్రంగా అభిశంసించారు. పైగా, 'బీభత్సం'ను 'దర్శనంగా' మార్చారుగానీ బీభత్సం అన్న క్రియ ఉన్నప్పుడు మరాఠీ భాషలో కర్త స్త్రీ లింగంలో ఉంటుందనీ, దర్శనం అన్నప్పుడు తటస్థలింగంలో ఉండాలనీ, రికార్డును దిద్దిన పోలీసులు ఈ విషయాన్ని గమనించలేదనికూడా అంటారు. అంతేకాక ఖేర్వాడి పోలీస్‌స్టేషన్ ఇన్స్‌పెక్టర్ ఈ మార్పు చేసాడు గానీ నిర్మల్‌నగర్ పోలీసులు చేయలేదు. ఆ స్టేషన్ రికార్డులో శివసేన వారి నినాదం ఉన్నదున్నట్టే నమోదయింది. ఖేర్వాడి పోలీసుల నేరాన్ని ఇది బయటపెట్టింది.

పోలీసులు శివసేన కార్యకర్తలతో కలిసి దాడులు చేసిన సంఘటనలు కూడ కమిషన్ ఎదుట నమోదయ్యాయి. దేవనార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో డిసెంబర్ 9 నాడు అబీద్ అలీ కాజీ అనే వ్యక్తి ఇంటి మీద పోలీసులు దాడి చేసారు. అతనిని విపరీతంగా కొట్టి, అడ్డమొచ్చిన అతని సోదరిని కూడ కొట్టి, అతనిని స్థానిక శివసేన శాఖ కార్యాలయం వైపు లాక్కొని పోయారు. నీ సంగతి మమ్మల్నే చూసుకొమ్మంటావా లేక శివసేన వారికి అప్పగించమంటావా అని అక్కడున్న పోలీస్ ఇన్స్‌పెక్టర్ అతనిని బెదిరించాడు. తర్వాత బాగా తన్ని, 'ఇంక పారిపో' అన్నాడు. అతను పారిపోతుండగా శివసేన కార్యకర్తలు 10 లేక 12 మంది అతనిని తరిమి సైకిల్ చైన్లతోనూ హాకీ కర్రలతోనూ కొట్టిపడేసారు.

బైకుల్లా పోలీస్‌స్టేషన్ పరిధిలో నివసించే షబ్బీర్ అబ్దుల్ హుసేన్ తంబావాలా వాంగ్మూలం ప్రకారం, మీనా హౌసింగ్ సొసైటీలో ఉన్న ముస్లింల ఇళ్లమీద పోలీసుల సమక్షంలోనే దుండగులు దాడిచేసారు. ఇదికూడ ఒక 'మహాఆరతి' పర్యవసానంగా జరిగిన దాడే. బిల్డింగ్ గేట్‌కు తాళం వేసి సాయుధ పోలీసులు కాపలా ఉండగానే దుండగులు గోడ దూకి ఇళ్ల తలుపులు పగలగొట్టి దాడికి పాల్పడ్డారు. వారిలో శేఖర్ అనే ఒక వ్యక్తి గురించి షబ్బీర్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు ఇచ్చాడు. అసిస్టెంట్ ఇన్స్‌పెక్టర్ జైస్వాల్ షబ్బీర్‌నూ శేఖర్‌నూ పోలీస్‌స్టేషన్‌కు పిలిచాడు. అక్కడ అనంతనారాయణ్ శింగ్రె అనే శివసేన శాఖాప్రముఖ్ కూర్చొని ఉన్నాడు. అతని సమక్షంలో అసిస్టెంట్ ఇన్స్‌పెక్టర్ జైస్వాల్ షబ్బీర్‌ను రాజీ కమ్మని ఒత్తిడి చేసాడు. మత ఘర్షణలు జరుగుతున్నపుడు అటువంటి ఘటనలు జరుగుతుంటాయనీ షబ్బీర్ ఆ ప్రాంతంలో ఉండదలచుకుంటే దానిని పట్టించుకోకుండ ఉండడం మంచిదనీ రాజీపడుతున్నట్టు రాసి ఇవ్వాలనీ ఒత్తిడి పెట్టాడు. షబ్బీర్ ఒప్పుకోలేదు.

డిసెంబర్ 7వ తేదీన డోంగ్రీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పహల్వి బేకరీపైన 'శివసేన జిందాబాద్' అన్న నినాదంతో 100 మంది యువకులు దాడిచేసారు. వాళ్ల చేతులలో లాఠీలు, ఇనపరాడ్లు, కత్తులు ఉన్నాయి. దాడి చేసిన వారిలో బిపిన్ అనే యువకుడిని బేకరీ యాజమాన్యం గుర్తించింది. పోలీస్ కంప్లెయింట్ ఇచ్చారు. కానీ పోలీసులు ఆ బిపిన్‌ను అరెస్టు చేయలేదు. శివసేనకూ దాడి చేసిన దుండగులకూ మధ్య నున్న సంబంధాన్ని గురించి ఇన్వెస్టిగేట్ చేయలేదు. కేసు నమోదు చేసుకొని మూసేసారు.

కాలాచౌకి పోలీస్‌స్టేషన్ పరిధిలోని బొంబాయి డాక్ లేబర్‌బోర్డు (బిడిఎల్‌బి) కాలనీలో జరిగిన దొమ్మీని పోలీసులు వక్రీకరించిన తీరు శివసేనను కాపాడడానికి ముంబాయి పోలీసులు ఎంత దూరమైనా పోగలరని రుజువు చేసింది. ఈ దొమ్మీ మొత్తం దిలావర్‌ఖాన్ అనే ముస్లిం నేరస్తుడి ఆధ్వర్యంలో జరిగిందని పోలీసులు కేసు నమోదు చేసారు. ఈ కాలనీలో మెజారిటీ నివాసాలు ముస్లింలవేగానీ చుట్టూ ఉన్న ప్రాంతం హిందువులు మెజారిటీగా ఉన్న ప్రాంతం. శివసేనకు బాగా ప్రాబల్యం ఉన్న ప్రాంతం. కాలనీలో జరిగిన దొమ్మీలో 39 ఆస్తులు ధ్వంసం కాగా అందులో 9 హిందువులకు చెందినవి. మిగిలిన 30 ముస్లింలకు చెందినవి. కాలనీలో ఒక శివుని ఆలయం, ఒక మసీదు ఉన్నాయి. మసీదు ధ్వంసం అయిందిగానీ ఆలయానికేమీ కాలేదు. ఆలయం పూజారిని కమిషన్ పిలిపించి అతని వాంగ్మూలం నమోదు చేసింది. దొమ్మీ జరిగిననాడు గానీ అంతకుముందు గానీ కాలనీలోని ముస్లింలు గుడికి ఎటువంటి హానీ కలిగించలేదని అతను అన్నాడు.

అయినప్పటికీ కాలనీలో జరిగిన దొమ్మీకి సంబంధించిన కేసులో పోలీసులు 50 మంది ముస్లింలను, ఆరుగురు హిందువులను అరెస్టు చేసారు. మరొక 12 మంది హిందువులను కూడ ముద్దాయిలుగా చూపించారుగానీ వాళ్లను అరెస్టు చేయలేదు. పోలీసు సిబ్బంది వాంగ్మూలాలే తప్ప కాలనీ నివాసులెవ్వరి వాంగ్మూలమూ పోలీసులు ఈ కేసులో నమోదు చేయకపోవడం చాలా విచిత్రమైన విషయం. మొత్తం ఘటనను పరిశీలించిన మీదట, 'హిందువులు కాలనీపైన దాడి చేసారనీ, ముస్లింలు దానిని తిప్పికొట్టడానికి ఎదురుదాడి మాత్రం చేసారనీ అర్థం అవుతుంది' అని జస్టిస్ శ్రీకృష్ణ అంటారు. పోలీసులు మాత్రం ఇది దిలావర్‌ఖాన్ నాయకత్వంలో ముస్లింలు పాల్పడిన దొమ్మీ అనే భావించారు!

నిజానికి శివసేనకు బాగా ప్రాబల్యం ఉన్న కాలాచౌకి ప్రాంతంలో డిసెంబర్ నెలలోనే శివసేన ఆధ్వర్యంలో జరిగిన రహస్య సమావేశాలలో – నగరంలోని ఇతర ప్రాంతాలలో బాబ్రీ మసీదు కూల్చివేత తరువాత ముస్లింలు రెచ్చిపోయి హింసకు పాల్పడినందుకు ప్రతీకారంగా ముస్లింలపైన దాడులు చేయాలని నిర్ణయం జరిగినట్టు ఆధారాలున్నాయని కమిషన్ భావించింది. శివసేన, భారతీయ జనతాపార్టీల పేరు మీద ముస్లింలపైన ద్వేషం రెచ్చగొట్టే బోర్డులు ఈ ప్రాంతంలో ప్రదర్శించబడ్డాయి. 26 డిసెంబర్ నాడు కాలాచౌకి లోని ఒక ముఖ్య కూడలిలో (యశ్వంత్ చౌక్) ట్రాఫిక్‌ను పూర్తిగా స్తంభింపజేసిన మహాఆరతి జరిగింది. ఈ విషయం శివసేన దినపత్రిక 'సామ్నా'లో ఘనంగా రాసుకోవడం జరిగింది. ట్రాఫిక్‌ను మొత్తం స్తంభింపజేసే కార్యక్రమాన్ని ఎందుకు అనుమతించారని కమిషన్ స్థానిక ఇన్‌స్పెక్టర్‌ను అడుగగా, అటువంటిదేమీ జరగలేదనీ ఊరికే గొప్పకోసం శివసేన వాళ్లు తమ పత్రికలో రాసుకొని ఉండవచ్చుననీ జవాబు చెప్పాడు.

ఈ ప్రాంత డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ కృష్ణలాల్ బిష్ణోయ్ వాంగ్మూలం మరీ ఆశ్చర్యం కలిగిస్తుంది. జనవరి 10 నాడు ఒక హిందువుల గుంపు అతనిని స్వయంగా కొట్టి గాయపరిచింది. జనవరి 9 నుండి 19 మధ్య అనేక సందర్భాలలో హిందువుల గుంపులు అల్లర్లకు దిగాయి. ఇవి శివసేన కార్యకర్తలు చేసినవే కదా అని కమిషన్ అతనిని ప్రశ్నించగా, దొమ్మీకి పాల్పడిన వారిలో శివసేన కార్యకర్తలు ఉన్న మాట వాస్తవమే గానీ, వారు ఆ సంస్థ కార్యకర్తలుగా పాల్గొన్నారా లేక వ్యక్తిగత హోదాలో పాల్గొన్నారా అనేది తమ పరిశోధనలో తేలలేదని జవాబు చెప్పాడు. ముస్లింలకు 'బుద్ధిచెప్పాలని' నిర్ణయం తీసుకున్న రహస్య సమావేశాలు శివసేన ఆధ్వర్యంలో జరిగినట్టు కొందరు ముద్దాయిలు ఇచ్చిన ఒప్పుకోలును అతని దృష్టికి కమిషన్ తీసుకురాగా, అది నిజమే అనుకున్నప్పటికీ అల్లర్లలో ఒక పద్ధతి ఉన్నట్టు తనకు అనిపించలేదంటాడు. చాలా మంది శివసేన నాయకులూ ప్రముఖులూ అల్లర్లలో పాల్గొన్నట్టు తెలిపే ఆధారాలను అతని దృష్టికి తేగా, వ్యక్తులు పాల్గొనడానికీ సంస్థ పాల్గొనిందని భావించడానికీ తేడా ఉందని మరొకసారి అంటూ ఆ ప్రాంతంలో శివసేనకు చాలా ప్రాబల్యం ఉంది కాబట్టి ప్రజల ఒత్తిడికి తల ఒగ్గి వారికి నాయకత్వం వహించకపోతే పరువు పోతుందన్న భయంతో శివసేన నాయకులు ఆ పనిచేసి ఉండవచ్చునని వారి తరపున సర్దిచెప్తాడు! ఈయన చిన్న చితక పోలీసు జవాను కాదు. ఏకంగా డిప్యూటీ కమిషనరు.

'అల్లర్లు ఈ ప్రాంతంలో 10 దినాలు ఆగకుండ నిరాఘాటంగా ఎందుకు సాగగలిగాయో దీనిని బట్టి అర్థం అవుతుందనుకుంటాను' అన్న జస్టిస్ శ్రీకృష్ణ వ్యంగోక్తి కంటె వేరే వ్యాఖ్య అవసరం లేదు.

ఎల్.టి. మార్గ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని డైమండ్ జూబిలీ కాంపౌండ్‌పైన జరిగిన దాడి మరొక ఉదాహరణ. ఆ కాంపౌండ్‌లోని 18 నివాసాలలో 200 ముస్లిం కుటుంబాలున్నాయి. 8 జనవరి రాత్రి ఆ కాంపౌండ్ బయట పెద్దగుంపు చేరి 'జై శ్రీరాం' అని నినాదాలు ఇవ్వడం మొదలుపెట్టేసరికి కాంపౌండ్‌లోని ముస్లింలు గాభరా పడ్డారు. వారిలో ఒకరయిన ఉర్దూ బ్లిట్జ్ (Blitz) వారపత్రిక సంపాదకుడు హరూన్ రషీద్ పోలీస్‌స్టేషన్‌కు ఫోన్ చేసాడు. వాళ్లు ఇద్దరు జవాన్లను కాంపౌండ్ గేట్ దగ్గర నిలబడమని పంపించారు. కొంతసేపటికి దుండగులు తోపుడు బండ్లలో సోడాబాటిల్స్, రాళ్లు కర్రలు తీసుకొని వచ్చేసరికి వాళ్లిద్దరూ పత్తా లేకుండ పోయారు. హరూన్ రషీద్ మళ్లీ పోలీసు కంట్రోల్ రూంకు ఫోన్ చేసాడుగానీ అన్ని చోట్లకు సహాయం పంపించే స్థితిలో మేము లేమని వాళ్లు జవాబు చెప్పారు. దుండగులు యథేచ్ఛగా కాంపౌండ్‌లో ఉన్న వాహనాలను ధ్వంసం చేసి ఆ రాత్రికి కాంపౌండ్‌కు ఎదురుగా ఉన్న మెహతా ఎస్టేట్‌లో తలదాచుకున్నారు. డైమండ్ జూబిలీ కాంపౌండ్‌లోని ముస్లింలు ఆ రాత్రంతా భయంభయంగా గడిపారు.

9వ తేదీ పొద్దున్న 10 గంటలప్పుడు హిందువుల గుంపు కాంపౌండ్ వెనకగోడ దూకి లోపలికి వచ్చి పెట్రోల్ తడిపిన గుడ్డలను అంటించి ఇళ్లమీదకి విసరసాగారు. అప్పటికి కాంపౌండ్ గేట్ దగ్గర కామత్ అనే ఇన్స్‌పెక్టర్ ఆధ్వర్యంలో పోలీస్ పికెట్ ఉంది. కానీ వాళ్లు చేయికాలు కదపకుండ చూస్తూ ఊరుకున్నారు. దుండగులు నెమ్మదిగా డైమండ్ జూబిలీ కాంపౌండ్‌కు ఎదురుగా ఉన్న రెండు బిల్డింగుల మీదికి చేరారు. వాటిలో ఒక దానిలో ఆ ప్రాంత శివసేన కార్పొరేటర్ ఉన్నాడు. ఆ బిల్డింగుల మీది నుండి వాళ్లు మండుతున్న వస్తువులను కాంపౌండ్‌లోని ఇళ్ల మీదికి విసరసాగారు. పోలీసులు అప్పటికీ చూస్తూ ఊరుకున్నారు. వారిలో కొందరు తమ చొక్కాల మీద ఉన్న గుర్తింపు చిహ్నాలను గుట్టు చప్పుడు కాకుండా తొలగించి జేబులో పెట్టుకున్నారు.

పరిస్థితి బాగాలేదని గమనించి కాంపౌండ్‌లోని ముస్లింలు మధ్యాహ్నం 2.00 గంటలకు ఒకే ఒక నివాసం లోకి (డైమండ్ మంజిల్) చేరుకున్నారు. ఆ యింటిమీద దాడి మొదలయింది. 'మీ అల్లామియాను పిలుచుకోండి' అంటూ

హేళన చేస్తూ మండే వస్తువులు విసరసాగారు. కొంతమంది శివసేన నాయకులు ఆ గుంపులో ఉన్నట్టు హరూన్ రషీద్ గమనించాడు. అంతలో అక్కడికొక పోలీసు జీపు వచ్చింది గానీ పోలీసులు శివసేన నాయకులతో కబుర్లు చెప్తూ జోక్ చేస్తూ కూర్చున్నారు తప్ప బాధితులకు సహాయం చేయడానికి ఎటువంటి ప్రయత్నం చేయలేదు.

సాయంత్రం 6.00 అయ్యేసరికి దాడి తీవ్రతరమయింది. కాంపౌండ్‌లోని ముస్లింలు ఒక్కొక్కరుగా ఇళ్లు ఖాళీచేసి వెళ్లిపోయారు. హరూన్ రషీద్ కూడ వెళ్లిపోయాడు. పొద్దున్న 6.00 గంటలకు అతను వచ్చి చూసేసరికి కాంపౌండ్ దాదాపుగా పూర్తిగా మొత్తం తగలబడిపోయి ఉంది. రాత్రంతా సర్చిలైట్లు వేసి దహనకాండ కొనసాగించారని అతనికి తెలిసింది.

శివసేన దాడుల నుండి ముస్లింలకు రక్షణ కల్పించకపోవడంలోనే కాక, శివసేన దుండగుల పేర్లు స్పష్టంగా బాధితులు చెప్పినప్పటికీ వారిపైన కేసులు పెట్టకపోవటంలోనూ పోలీసులు తమ పక్షపాత వైఖరిని స్పష్టంగా ప్రదర్శించారు. చాలా కేసులు ఏ రకమైన ఇన్వెస్టిగేషన్ లేకుండ మూసివేయబడ్డాయి.

అంటాప్‌హిల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 1993 జనవరి నెలలో జరిగిన హింసాకాండకు గురయిన ముస్లింలు ముసాఫిర్‌ఖానా రిలీఫ్ క్యాంపులో ఉంటూ తమపైన జరిగిన దాడులకు బాధ్యులయిన వారి పేర్లు వివరంగా ఇస్తూ సీనియర్ ఇన్స్‌పెక్టర్‌కు ఫిర్యాదు ఇచ్చారు. అయినప్పటికీ ఎటువంటి పరిశోధన చేయకుండ జూన్ నెలలో ఈ కేసులన్నీ మూసివేయడం జరిగింది.

ధారవి పోలీస్‌స్టేషన్ పరిధిలో జనవరి 8 నాడు సాయిబాబా మందిరం దగ్గర జరిగిన ఘంటానాద కార్యక్రమం కూడా దొమ్మీకి, హింసాకాండకూ దారితీసింది. మరి ఆ కార్యక్రమంలో పాల్గొన్నవారినీ రెచ్చగొట్టే ఉపన్యాసాలు ఇచ్చిన వక్తలనూ ఎందుకు అరెస్టు చేయలేదని కమిషన్ సీనియర్ పోలీస్ ఇన్స్‌పెక్టర్ ఘాగ్రేని ప్రశ్నించగా, 'ఆ సమావేశంలో జనం విపరీతంగా ఉండడం వల్ల ఎవరినీ గుర్తించలేకపోయాం' అని జవాబు చెప్పాడు. అదే పోలీస్‌స్టేషన్‌కు చెందిన కృష్ణ శ్యాంరావ్ పాటిల్ అనే కానిస్టేబుల్ తన వాంగ్మూలంలో ప్రతాప్ చంద్ర ఆరేకర్ అనే బిజెపి నాయకుడు హిందువులను రెచ్చగొట్టే ఉపన్యాసం ఇచ్చాడని చెప్పినప్పటికీ ఈ సీనియర్ ఇన్స్‌పెక్టర్ మాత్రం తనకేమీ తెలీదనే అంటాడు. అబ్దుల్ గనీ అనే ఒక బాధితుడు తన ఇంటిమీదికి జనాన్ని తీసుకొచ్చిన 'కోనా' అని పిలవబడే వీడియో ఫోటోగ్రాఫర్ పేరు ఇన్స్‌పెక్టర్ ఘాగ్రేకి చెప్పాడు.

అయితే 'హెూనా' అనే పేరుతో ఒక వీడియోగ్రాఫర్ ఉన్నాడు గానీ 'కోనా' అన్న పేరుగలవాడు లేడు కాబట్టి ఎవ్వరినీ అరెస్టు చేయలేదని ఇన్స్‌పెక్టర్ అంటాడు. పోనీ ఆ 'హెూనా' అన్న అతన్నే పిలిపించి అతనే ఇతనేమో పరిశోధించలేకపోయావా అని కమిషన్ ప్రశ్నించగా, ఆ పనిచేసే లోపల ఫిర్యాది అబ్దుల్ గనీ తన స్వగ్రామానికి వెళ్లిపోయాడనీ అక్కడ చనిపోయాడనీ అందువల్ల ఆ పని చేయలేదనీ జవాబు చెప్తాడు! అతీకుర్ రెహమాన్ సైఫి అనే మరొక బాధితుడు రాజు కుంచి కుర్వె, ఆరేకర్, గణేశ్ మార్వాడి అనే ముగ్గురు దుండగుల పేర్లు స్పష్టంగా చెప్పినా వారెవ్వరినీ పోలీసులు అరెస్టు చేయలేదు. ఎందుకు చేయలేదని కమిషన్ ప్రశ్నించగా, వాళ్లు దొరకలేదని (దాదాపు 3 సంవత్సరాల తరువాత కూడ) ఇన్స్‌పెక్టర్ ఘాగ్రె జవాబు చెప్తాడు.

ఇది ఒక పోలీస్‌స్టేషన్ ప్రత్యేకతో లేక ఒక ఇన్స్‌పెక్టర్ ప్రత్యేకతో కాదు. నగరమంతటా ఇదే జరిగింది. కేసులు పెట్టిన చోట కూడ ఆ ఘటనల్లో ఏదైనా కుట్ర, ప్రణాళిక ఉన్నాయేమో చూడడానికి పోలీసులు నిరాకరించారు. డోంగ్రీ పోలీస్‌స్టేషన్ పరిధిలో వరుసగా ముస్లింలను కత్తి పోట్లకు గురి చేసిన ఘటనల వెనుక ఏదైనా ప్రణాళిక ఉందేమో పరిశీలించావా అని కమిషన్ సీనియర్ ఇన్స్‌పెక్టర్ చంద్రకాంత్ ప్రతాప్‌రావ్ బాగ్వెని ప్రశ్నించగా, 'నాకే మనిపిస్తుందంటే చాలామంది హిందువులకు విడివిడిగా దాదాపు ఒకేసారి ఒక్క ముస్లింను పొడిచి కక్షతీర్చుకోవాలన్న ఆలోచన వచ్చినట్టుంది' అని జవాబు చెప్తాడు!

అదే పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇమాంవాడ బిఐటి చౌల్స్‌లో హిందువులు, ముస్లింల మధ్య పెద్దెత్తున దొమ్మీ జరిగింది. పోలీసులు కాల్పులు జరిపి అదుపు చేయవలసి వచ్చింది. 33 రౌండ్ల కాల్పులలో ఒక ముస్లిం చనిపోయాడు. దొమ్మీ చల్లబడిన తరువాత పోలీసులు అక్కడికి అక్కడే 81 మంది ముస్లింలను అరెస్టు చేసారు గానీ ఒక్క హిందువును కూడా అరెస్టు చేయలేదు. ఒక్క హిందువును సహితం అరెస్టు చేయలేకపోవడానికి కారణమేమిటని కమిషన్ అడిగిన ప్రశ్నకు సీనియర్ ఇన్స్‌పెక్టర్ బాగ్వె దగ్గర జవాబు లేదు.

మరికొన్ని ఉదాహరణలు తరువాత సెక్షన్‌లో చూద్దాం.

## పోలీసులు – ముస్లింలు

శివసేన పట్ల పక్షపాతం చూపించడం, శివసేన కార్యకర్తల నేరాలను కప్పిపెట్టే ప్రయత్నం చేయడం మాత్రమే కాక ముంబాయి పోలీసులు అనేక

సందర్భాలలో ప్రత్యక్షంగానే ముస్లిం వ్యతిరేక వైఖరిని ప్రదర్శించారు. దీనికి కొన్ని ఉదాహరణలు ఇప్పటికే ఇచ్చాము. మరికొన్ని ఇక్కడ చూద్దాం.

పైధోనీ పోలీస్‌స్టేషన్ ప్రాంతంలో జరిగిన ఘటనలను వ్యాఖ్యానిస్తూ ఆ ప్రాంత సీనియర్ ఇన్స్‌పెక్టర్ పి.ఎస్.కదం వైఖరి గురించి కమిషన్ ఈ విధంగా అభిప్రాయపడింది.

> 'దొమ్మీలలో హిందూ గుంపుల పాత్రను దాచిపెట్టడానికి పోలీసులు స్పష్టంగా ప్రయత్నం చేసారు. ఇన్స్‌పెక్టర్ కదం నుండి ఈ విషయాలు ఒక్కొక్కటీ క్రాస్-ఎగ్జామినేషన్‌లో బలవంతంగా రాబట్టవలసి వచ్చింది. మరొక విచిత్రమైన విషయం ఏమిటంటే, హిందువులూ ముస్లింలూ దొమ్మీకి దిగిన చోట్ల కూడా కాల్పులు కేవలం ముస్లింల మీదనే జరిపినట్టున్నారు. కాల్పులలో గాయాలు ముస్లింలకు మాత్రమే అయ్యాయి'.

ఎల్.టి. మార్గ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఘటనలను వ్యాఖ్యానిస్తూ-

> 'ముస్లింలు అధికంగా నివసంచే ప్రాంతాలలో జరిపిన కాల్పులలాగా కాక, హిందువులు అధికంగా నివసించే ప్రాంతాలలో పోలీసులు జరిపిన కాల్పులు ఏ మాత్రం ప్రభావం చూపలేదు. దహనాలకూ లూటీకీ విధ్వంసానికీ పాల్పడుతున్న గుంపులను ఈ కాల్పులు ఎంతమాత్రం అదుపు చేయలేదు. కేవలం 100-200 అడుగుల దూరం నుండి జరిపిన కాల్పులలో సహితం గుంపులో ఒక్కరూ గాయపడకపోవడాన్ని బట్టి చూస్తే, కాల్పులు మొత్తంగా గాలిలోకే జరిపారా అని అనుమానం వస్తుంది' అని కమిషన్ అనింది.

జోగేశ్వరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఘటనల గురించి చెప్తూ-

> 'ఈ ప్రాంతంలో కూడ కమిషన్ గమనించిందేమిటంటే దొమ్మీలలో హిందువుల గుంపు ఉందని ఒప్పుకోవడానికి సహితం పోలీసులు ఇష్టపడక పోవడం. క్రాస్ ఎగ్జామినేషన్‌లో ఒత్తిడి పెట్టి ఈ వాస్తవాన్ని బయటకు లాగవలసి వచ్చింది' అన్నారు.

బైకుల్లా పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఘటనలను సమీక్షిస్తూ కమిషన్ పోలీసుల తీరును తీవ్రంగా అభిశంసించింది.

> 'కమిషన్ ముందు హాజరయిన వారి వాంగ్మూలాలు చాలా బాధ కలిగిస్తాయి. పోలీసుల పక్షపాత వైఖరిని అవి స్పష్టంగా చూపిస్తాయి. ముస్లిం బాధితుల ఫిర్యాదులకు పోలీసులు సరిగ్గా స్పందించలేదు. కొన్ని సందర్భాలలో వారి మతం పేరిట వారిని వెక్కిరించడం, వారి మీదనే తప్పుడు కేసులు పెట్టడం కూడ జరిగింది' అని కమిషన్ అభిప్రాయపడింది.

ఘట్‌కోపర్ పోలీస్‌స్టేషన్ ప్రాంతం గురించి మాట్లాడుతూ, డిసెంబర్ అల్లర్లలో సహితం రెండు వైపులనుండి హింస జరిగిన విషయాన్ని వివరించి,

> 'వాస్తవాలు ఈ విధంగా ఉండగా, ఈ స్టేషన్ సీనియర్ పోలీస్ ఇన్స్‌పెక్టర్, ఎసిపి, డిసిపిలందరూ డిసెంబర్‌లో జరిగిన అన్ని ఘటనలూ ముస్లింలు పాల్పడినవేనన్న అభిప్రాయాన్ని గట్టిగా నమ్ముతున్నారు. పోలీసుల ఏకపక్ష వైఖరి సాక్ష్యంలో స్పష్టంగా బయల్పడింది. 1992 డిసెంబర్‌లో హిందువులు, ముస్లింలు ఇద్దరూ దాడికి పాల్పడిన ఘటనలు అనేకం ఉన్నాయని వాస్తవికంగా ఒప్పుకొనే బదులు ఈ సీనియర్ ఇన్స్‌పెక్టర్ మొండిగా హింస అంతా ముస్లింలే చేసారని అంటాడు. ఈ తప్పుడు వైఖరి అతని పై అధికార్లలో కూడ ఉంది' అని కమిషన్ అభిశంసించింది.

డోంగ్రి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఘటనల గురించి వ్యాఖ్యానిస్తూ,

> '1992 డిసెంబర్‌లోనూ 1993 జనవరిలోనూ జరిగిన హింసాత్మక ఘటనలపై నేర పరిశోధన చాలా అసంతృప్తికరంగా జరిగిందని చెప్పాలి. పోలీసులు హిందువులతో, మరీ ముఖ్యంగా శివసేనతో కుమ్మక్కయ్యారన్న అభిప్రాయం కలుగుతుంది' అని కమిషన్ అనింది.

అంటాప్‌హిల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఘటనల గురించి వ్యాఖ్యానిస్తూ 'పోలీసుల నడవడిక చాలా ఆందోళన కలిగించే విధంగా ఉంది' అని కమిషన్ అనింది.

> 'కొన్ని సందర్భాలలో పోలీసులు చేతులు ముడుచుకు కూర్చొని దొమ్మీలకు పాల్పడుతున్న వారిని యథేచ్ఛగా తమ కార్యకలాపాలు కొనసాగనిచ్చారు. కొన్ని సందర్భాలలో వారిని

ప్రోత్సహించారు. వారితో చేతులు కలిపారు. ఈ నేపథ్యంలో, నమోదు చేసిన నేరాల పరిశోధనలో కనిపించే లోపాలు కాకతాళీయంగా జరిగినవి కావనీ సాక్ష్యాన్ని కప్పి పెట్టడానికి ఉద్దేశ్యపూర్వకంగా జరిగిన ప్రయత్నమనీ అర్థమవుతుంది. పోలీసులలో ముస్లింలపట్ల వ్యతిరేకత ఉండిందని సాక్ష్యాలు స్పష్టం చేస్తున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే, పోలీసుల నడవడిక శాంతి భద్రతల యంత్రాంగంపట్ల విశ్వాసాన్ని నాశనం చేసేటట్టు ఉండింది' అని కమిషన్ అభిప్రాయపడింది.

కొన్ని ఘటలను పరిశీలిస్తే పోలీసుల ఏకపక్ష వైఖరి ఎంత సంపూర్ణంగా ఉండిందో అర్థం అవుతుంది.

దేవనార్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బైంగన్‌వాడిలో 1992 డిసెంబర్ 8న హిందువుల, ముస్లింల మధ్య పెద్దఎత్తున దొమ్మీ జరిగింది. ఇరువురూ పాల్గొన్నారనడానికి ఆధారంగా ముస్లింల అంగళ్లు 58, హిందువులవి 53 ధ్వంసం అయ్యాయి. కానీ పోలీసులు అరెస్టు చేసిన 36 మంది ముద్దాయిలూ ముస్లింలే. పోలీసుల కాల్పులలో చనిపోయిన 9 మందీ ముస్లింలే. ఒక్క హిందువుకు బుల్లెట్ గాయం మాత్రం అయింది.

అదే రోజు అదే పోలీస్‌స్టేషన్ పరిధిలోని గోవండి ప్రాంతంలో పోలీసులు అల్లరికి పాల్పడుతున్న ముస్లింల గుంపును చెదరగొట్టబోగా వారు పోలీసులపైన కత్తులతో దాడి చేసారని ఒక ఎఫ్ఐఆర్ నమోదు అయింది. అయితే కొంచెం తరచి పరిశీలిస్తే, ఆ 'అల్లరి'లో హిందువులకు చెందిన నివాసాలు 40 ధ్వంసం కాగా ముస్లింలవి 207 ధ్వంసం అయ్యాయని కమిషన్ గమనించింది. అంటే అది నిజానికి ముస్లింలు చేసిన అల్లరి కాదనీ హిందూ ముస్లిం దొమ్మీ అనీ అర్థం అవుతుంది. కాని ఎఫ్ఐఆర్‌లో ఎక్కడా హిందువుల గుంపు ప్రస్తావనే లేదు.

పోలీసుల రక్షణ కోరిన ముస్లింలకు అనేక సందర్భాలలో చేదు అనుభవం ఎదురయింది. అగ్రిపాదా పోలీస్‌స్టేషన్ పరిధిలోని బిఐటి చౌల్స్ నివాసులలో అత్యధికులు హిందువులు కాగా కొద్దిమంది ముస్లింలు. జనవరి 8 నాడు హిందువుల గుంపు ముస్లింలు నివసిస్తున్న చౌల్ నెంబర్ 12 పైన రాళ్లతో, సోడాబాటిల్స్‌తో, పెట్రోల్ బాంబులతో దాడి చేసారు. 'సాయిబులను చంపండి' 'పాకిస్తాన్‌కు తరిమేయండి' అంటూ నినాదాలు ఇచ్చారు. చౌల్ నెంబర్ 12 లో నివసిస్తున్న ముంతాజ్ రెహమాన్ భయపడి పోలీస్‌స్టేషన్‌కు ఫోన్ చేయగా ఫోన్ తీసుకున్న వ్యక్తి తాను ఎవరో చెప్పకుండ 'అప్పుడే ఏమయింది? నోరు మూసుకుని

పడి ఉండు' అని అరిచి ఫోన్ పెట్టేసాడు. అదే చౌల్‌లో నివసించే మెహరున్నిసా మహమ్మద్ యాకూబ్ అన్సారీకీ అటువంటి అనుభవమే ఎదురయింది. ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయగా, 'పాకిస్తాన్‌కు పారిపో, ఇక్కడ ఎందుకుంటావు – చావడానికా' అని జవాబు లభించింది.

బోయివాడ పోలీస్‌స్టేషన్  పరిధిలో ఉన్న కెఫే షెలార్ అనే హోటల్ యజమాని తన హోటల్‌పైన దాడి జరిగే ప్రమాదం ఉందని జనవరి 10వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేసాడు. అతను ముస్లిం. అతని ఫిర్యాదును పోలీసులు పట్టించుకోలేదు. ఆ హోటల్ నుండి పోలీస్‌స్టేషన్‌కు కేవలం అయిదు నిమిషాల నడకే అయినా పోలీసులు ఎటువంటి సహాయం పంపించలేదు. అతను ఊహించినట్టే అతని హోటల్‌పైన దాడి జరిగింది. 7 లక్షల ఆస్తి లూటీ అయింది.

ఎం.ఆర్.ఎ మార్గ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక పోలీస్ కానిస్టేబుల్ తన కస్టడీలో ఉన్న ముద్దాయిని శివసేన కార్యకర్తలకు అప్పగించి చంపించిన ఘటన కమిషన్ పరిశీలనలో వెలికి వచ్చింది. డిసెంబర్ 8 నాడు ఒక దొమ్మీలో పాల్గొన్న బాబు అబ్దుల్ షేఖ్ అనే వ్యక్తిని ఇన్స్‌పెక్టర్ సాల్వి అరెస్టు చేసి, పోలీస్‌స్టేషన్‌కు తీసుకుపొమ్మని విద్యాధర్ రఘునాధ్ షెలార్ అనే కానిస్టేబుల్‌కు అప్పగించాడు. కొంతసేపటికి ఇన్స్‌పెక్టర్ వెనక్కి రాగా ఒక బ్రిడ్జి దగ్గర బాబు అబ్దుల్ షేఖ్ తీవ్రమైన కత్తిపోటు గాయాలతో పడి ఉన్నాడు. అతనిని పొడిచిన శివసేన కార్యకర్తలు రక్తంతో తడిసిన కత్తులతో సహా అక్కడే ఉన్నారు. అతనిని ఆస్పత్రికి తరలించగా అప్పటికే చనిపోయాడన్నారు.

'నీ కస్టడీలో ఉన్న వ్యక్తి హత్యకెట్లా గురయ్యాడని కానిస్టేబుల్ షెలార్‌ను పైస్థాయి పోలీస్ అధికారులు ప్రశ్నించగా, ముద్దాయి తన చేతినుండి తప్పించుకొని పారిపోయాడనీ పారిపోతున్న వాడిని శివసేన వాళ్లు చంపారనీ అన్నాడు. కానీ అదే నిజమైతే అతను వెంటనే పోలీస్‌స్టేషన్‌లో రిపోర్టు ఇవ్వాలి కదా, గుట్టుచప్పుడు కాకుండ ఎందుకు ఊరుకున్నాడన్న ప్రశ్నకు జవాబు లేదు. అతనిపై అధికారులు అతని మాటలు విశ్వసించి విచారణ ముగించినప్పటికీ, జస్టిస్ శ్రీకృష్ణ సంతృప్తి చెందలేదు. ఇతర సాక్షులను విచారించి, ఆ కానిస్టేబుల్ మృతుడిని కావాలనే శివసేన వారికి అప్పగించాడని నిర్ధారించారు.

బైకుల్లా పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఒక సంఘటనను కమిషన్ వివరంగా పరిశీలించింది. నారియెల్‌వాడి ప్రాంతంలో అబ్దుల్‌హక్ కాసిం అలీ అన్సారీ అనే వ్యక్తికి ఒక టైలరింగ్ సంస్థ ఉంది. డిసెంబర్ 7వ తేదీన ఈ సంస్థపైన దాడి

జరిగింది. దాడి చేసినవారు స్థానికులే కాబట్టి అన్సారీ వాళ్లలో కొందరిని గుర్తుపట్టాడు. సదా, ఛోటు, సునీల్, రాజేశ్ అనే నలుగురి పేర్లతో సహా పోలీసులకు ఫిర్యాదు ఇచ్చాడు. ఈ నలుగురు శివసేన కార్యకర్తలు. తమ సంస్థను దోచుకున్నారనీ మెషిన్లు ఎత్తుకుపోయారనీ బిల్డింగ్‌ను తగలబెట్టారనీ ఫిర్యాదు చేసాడు. నిజానికి దాడి జరిగినప్పుడు సీనియర్ పోలీస్ కానిస్టేబుల్ పటాంకర్, ఇన్స్‌పెక్టర్ వాహులె, సబ్ ఇన్స్‌పెక్టర్ రాందేశాయ్ అక్కడే ఉన్నారు. వాళ్ల సమక్షంలోనే దాడి జరిగినా వాళ్లు ఏమీ చేయలేదు.

అన్సారీ ఫిర్యాదు ఇచ్చిన తరువాత కూడ పోలీసులు వాళ్లను అరెస్టు చేయలేదు. 7వ తేదీ రాత్రి అన్సారీ సంస్థ ఎదుటే సదా, ఛోటు అనే ఇద్దరు ముద్దాయిలు ఇన్స్‌పెక్టర్ వాహులెతో నవ్వుతూ కబుర్లు చెప్తూ కనిపించారు. పొద్దున్న మళ్లీ దాడి చేసారు. అన్సారీ ఫోన్‌మీద సీనియర్ ఇన్స్‌పెక్టర్ పటాంకర్‌కు ఫిర్యాదు చేయగా, బందోబస్తు మీద ఉన్న పోలీసులు వస్తారు లెమ్మన్నాడు. ఒక గంట తరువాత ఇన్స్‌పెక్టర్ వాహులె నాయకత్వంలోని పోలీస్ పార్టీ అక్కడికి వచ్చింది. వాళ్లు మాటామంతీ లేకుండ లోపలికి వచ్చి అన్సారీనీ, అతని అసిస్టెంట్‌నూ ఇనపరాడ్లతో కొట్టి వ్యాన్‌లో ఎక్కించి పోలీస్‌స్టేషన్‌కు తీసుకుపోయారు. ఇది చూసి అన్సారీ దగ్గర పనిచేసే సిబ్బందిలో సగం మంది పారిపోగా మిగిలిన సగం మందిని కూడా అరెస్టు చేసారు. వాళ్లందరి మీదా పోలీసులు కేసు పెట్టారు. లాకప్‌లో ఉన్న అన్సారీ పోలీసులు కొట్టిన దెబ్బలకు తన చేయి విరిగిందనీ వైద్యం చేయించమనీ అడుగగా, 'కాలు విరగలేదు సంతోషించు' అని ఇన్స్‌పెక్టర్ వాహులె తిరస్కారంగా జవాబు చెప్పాడు.

బెయిల్ మీద బయటికొచ్చిన తరువాత అన్సారీ తాను మొదట ఇచ్చిన ఫిర్యాదు మీద కేసు పెట్టించాలని చాలా ప్రయత్నం చేసాడు. జనవరి 4వ తేదీన ఇన్స్‌పెక్టర్ వాహులే అతని సంస్థ వద్దకు వచ్చి రాజీపడమని అతనిని బలవంతం చేసాడు. దాడి చేసిన వాళ్లను తాను గుర్తుపట్టలేదని బలవంతంగా స్టేట్‌మెంట్ రాయించుకున్నాడు. కానీ జస్టిస్ శ్రీకృష్ణ కమిషన్ ముందు అన్సారీ హాజరయి జరిగిన విషయం మొత్తం వివరించి ఆధారాలు చూపించగా, కమిషన్ అతని వాంగ్మూలం విశ్వసనీయమైనదని నిర్ధారించి, 'దుండగులు శివసేన ముఖ్యులు కాబట్టి పోలీసులు ఈ కేసు పరిశోధనను ఉద్దేశ్యపూర్వకంగా తొక్కిపెట్టారు' అని పేర్కొంది. ఇన్స్‌పెక్టర్ వాహులెనే కాక సీనియర్ ఇన్స్‌పెక్టర్ పటాంకర్‌ను కూడ తప్పుపట్టింది.

బైకుల్లా పోలీస్‌స్టేషన్ పరిధిలోని పఠాన్‌చౌల్‌పైన జనవరి 10 వ తేదీన హిందువుల గుంపు రాళ్లతోనూ సోడాబాటిల్స్‌తోనూ దాడి చేసింది. చౌల్ నివాసులయిన ముస్లింలు ఫిర్యాదు చేయగా పోలీసులు వచ్చారుగానీ దుండగులను తరిమేసే బదులు చౌల్ నివాసులనే వేధించారు. వాళ్లు నిరసన తెలుపుతూ ఊరేగింపు తీసారు. దానికి ప్రతిగా హిందూ మహిళలు పోలీసుల వేధింపులకు వ్యతిరేకంగా తాము కూడ ఒక ఊరేగింపు తీసారు.

ఈ గొడవల మధ్య పోలీసులొక ఘోరమైన హత్య చేసారు. పఠాన్‌చౌల్‌లోని హసన్‌మియా వాగ్లె ఇంటిలోకి చొరబడి అతని భార్యనూ కుమార్తె యాస్మిన్‌నూ తుపాకితో బెదిరించి అతని కొడుకు షానవాజ్‌ను లాక్కుపోయారు. అతన్ని తంతూ తుపాకి మడమలతో కొడుతూ బయటకు తీసుకుపోయారు. వ్యాన్‌లో ఎక్కించే ముందు అతని వీపులో తుపాకితో కాల్చి చంపి శవాన్ని వ్యాన్ ఎక్కించారు.

షానవాజ్ సోదరి యాస్మిన్ కమిషన్ ముందు హాజరయి ఇచ్చిన వాంగ్మూలాన్ని కమిషన్ ప్రాథమికంగా విశ్వసించి అప్పటికప్పుడే ఈ హత్యపైన విచారణ జరిపి తగు చర్య తీసుకొమ్మని సురేందర్ కుమార్ అనే డిసిపిని ఆదేశించింది. అతను పరిశోధన జరిపినట్టు జరిపి, 'కేవలం ఇద్దరు ముగ్గురు ముస్లిం సాక్షుల మాటలను బట్టి షానవాజ్‌ను పోలీసులే చంపారని నిర్ధారించలేము' అని కమిషన్‌కు తన నివేదిక సమర్పించాడు. అతని రిపోర్టును 'దుర్మార్గమైనది'గా అభివర్ణిస్తూ 'దానిని పరిశీలించడమైనా, విచారణ జరిపిన పద్ధతి గురించి వ్యాఖ్యానించడమైనా శుద్ధ దండగ' అని జస్టిస్ శ్రీకృష్ణ అన్నారు.

ఇమామ్‌వాడ బిఐటి చౌల్స్‌లో నివసించే పోలీసు కానిస్టేబుళ్ల ఇళ్లపైన డిసెంబర్ నెలలో ముస్లింలు దాడి చేసి విధ్వంసం సృష్టించినందుకు ప్రతీకారంగా పోలీసులు ఆ తరువాత ఆ చౌల్స్‌లో నివసించే ముస్లింలపైన తీవ్రస్థాయిలో ప్రతీకారం తీర్చుకున్నారు. అజీజ్ మర్చంట్ 'ఎన్‌కౌంటర్' హత్య దీనికొక ఉదాహరణ. అజీజ్ మర్చంట్‌కు గుండె జబ్బు, అల్సర్ ఉండేవి. దాదాపు పడక మీది నుండి లేవలేని స్థితిలో ఉన్నాడు. ఈ విషయమే అతనికి వైద్యం చేసిన డాక్టర్ మోలెదీనా కమిషన్ ముందు సాక్ష్యం చెప్పాడు. కానీ జనవరి 10 నాడు 20 – 25 మంది సాయుధ పోలీసులు అతని ఇంట్లోకి ప్రవేశించి ఇల్లంతా చిందరవందర చేసి అతని భార్య సల్మాను పక్కకు నెట్టేసి అజీజ్‌ను తీసుకుపోయారు. అజీజ్ 11వ తేదీన ఒక దొమ్మీలో పాల్గొన్నాడని, అప్పుడు ఎన్‌కౌంటర్‌లో చనిపోయాడని ప్రకటించారు. కానీ సల్మా సాక్ష్యాన్ని బట్టి, అజీజ్‌కు వైద్యం చేసిన డాక్టరు సాక్ష్యాన్ని

బట్టి, అతనిని పోలీసులు ముందు రోజే తీసుకుపోయి కాల్చి చంపారని కమిషన్ భావించింది.

ముస్లింల గుంపు ఇద్దరు పోలీస్ కానిస్టేబుల్స్‌ను హతమార్చిన దేవనార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పోలీసులు ముస్లింలపైన విపరీతంగా హింసకు పాల్పడ్డారు. అస్ఘర్ ఖాన్ ఆషిక్ ఖాన్ అనే వ్యక్తి తన తమ్ముడు జహీర్‌ఖాన్‌తో పాటు డిసెంబర్ 28న శివాజీనగర్ రామమందిరం పక్కన పోతుండగా పోలీసులు ఆపారు. కర్రలతో, తుపాకి మడమలతో కొట్టారు. పక్కనే బందోబస్తులో భాగంగా కుర్చీలు వేసుకొని కూర్చున్న పోలీస్ అధికారులు చూస్తూ ఉన్నారు తప్ప తమ సిబ్బందిని వారించలేదు. పోలీసులు కొడుతుండగా జహీర్‌ఖాన్ తప్పించుకున్నాడు గానీ అస్ఘర్‌ఖాన్‌ను మాత్రం కిందపడేసి 'తురకోడా' అంటూ తన్నారు. అతను స్పృహ కోల్పోయాడు. కొంతసేపటికి స్పృహ వచ్చేసరికి తన జేబులో ఉన్న 5000 రూ॥లు, తన చేతి గడియారం పోయాయని గమనించాడు. ఆ విషయం చెప్పబోతే పోలీసులతన్ని ఛీత్కరించుకొని 'ఇక  పారిపో' అన్నారు. అస్ఘర్‌ఖాన్ లేచి వెళ్లిపోతుండగా దగ్గరున్న శివసేనశాఖ కార్యకర్తలు అతనిని కత్తితో బెదిరించారు.

డిసెంబర్ 8వ తేదీన నూర్–ఇ–ఇలాహీ మసీదు దగ్గర అబ్దుల్ అష్రాఫి అనే మదరసా అధ్యాపకుడు కూర్చుని ఉండగా బయట అలజడి వినిపించింది. అతను బయటకు తొంగి చూడగా జనం చెల్లాచెదురయి పరుగెత్తుతున్నారు. పోలీసులు కాల్పులు జరుపుతున్నారు. అంతేకాక మసీదుకూ కొన్ని దుకాణాలకూ పోలీసులు నిప్పు పెట్టడం కూడా చూశాడు. నిప్పు ఆర్పడానికి అష్రాఫి, మరికొందరు ప్రయత్నించగా పోలీసులు మసీదు లోపలికి ప్రవేశించి వారిని కొట్టి బయటకు లాక్కుపోయారు. తుపాకి గురిపెట్టి లైన్‌లో నిలబడమన్నారు. మసీదు కమిటీ కార్యదర్శి అబ్దుల్ గఫార్‌ను నేరుగా ఛాతీలో కాల్చి చంపారు. యాకుబ్ అనే మరొక వ్యక్తిని కడుపులో కాల్చి తీవ్రంగా గాయపరిచారు. హఫీజ్ మహమ్మద్ కాఫిల్‌ను తన్ని తమతో తీసుకుపోయారు. అతని ఆచూకీ ఆ తరువాత తెలియలేదు.

ఇటువంటి ఘటనలపై కమిషన్ వ్యాఖ్యానిస్తూ, ముస్లింల గుంపు ఇద్దరు కానిస్టేబుళ్లను చంపినందుకు ప్రతీకారంగా దేవనార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పోలీసులు ముస్లింలపైన ప్రతీకారం తీర్చుకోవడానికి పూనుకున్నారనీ, హత్యలపైన పరిశోధన చేస్తున్నామన్న నెపం మీద అమాయకులయిన ముస్లింలను హింసకు గురిచేసారనీ అభిప్రాయపడింది.

ధారవి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మదీనా మసీదు దగ్గర సఫీక్ ఖాన్ అనే అతనికి రెడీమేడ్ బట్టల అంగడి ఉండింది. డిసెంబర్ 8 నాడు స్థానిక శివసేన శాఖ కార్యకర్తలైన అశోక్ దారువాలా, గణేశ్, విజయ్, బాలు, అతుల్, సురేశ్ తదితరుల నాయకత్వంలో ఒక హిందూ యువకుల గుంపు అతని ఇంటిపైన, అంగడిపైన దాడి చేసారు. అతని చేత బలవంతంగా 'జైశ్రీరాం' అన్న నినాదం ఇప్పించారు. అతని ఇంటిని శివసేనశాఖ కార్యాలయంగా మార్చదలచుకున్నామని చెప్పి అతనిని ఇంట్లోంచి తరిమేసారు. అంత పనీ చేసారు. అతను కొన్ని రోజుల తరువాత తిరిగి వచ్చి చూసేసరికి అతని ఇల్లు శివసేన కార్యాలయంగా మారి దానిపైన శివసేన జెండా ఎగురుతున్నది. ఖాన్ ధారవి పోలీస్‌స్టేషన్‌కే కాక డిసిపికి, నగర పోలీస్ కమీషనర్‌కు కూడ ఈ విషయం ఫిర్యాదు చేసాడు. ధారవి పోలీస్‌స్టేషన్ చుట్టూ చాలాసార్లు తిరిగాడు. అయినప్పటికీ అతని ఇంటిని అతనికి అప్పగించడం జరగలేదు. చాలా నెలల తరువాత అప్పటి డిసిపి రాజేశ్ మారియా బదిలీ అయి పాండే అనే అధికారి డిసిపిగా వచ్చిన తరువాత ఖాన్ మళ్లీ అభ్యర్థించగా పాండే చొరవ తీసుకొని అతని ఇంటినుండి శివసేన కార్యాలయాన్ని తొలగించి ఖాన్‌కు తిరిగి ఇప్పించాడు. ఈ మాత్రం చేసిన ఒక్క పోలీస్ అధికారి అయినా ముంబాయిలో ఉన్నందుకు జస్టిస్ శ్రీకృష్ణ అభినందనలు తెలియచేసారు.

డోంగ్రీ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆ పోలీస్‌స్టేషన్ కు కేవలం 100 అడుగుల దూరాన (అంటే దాదాపు పక్కనే అని చెప్పుకోవచ్చు) ఉన్న తాకివాలా బిల్డింగ్‌లోని ముస్లింల ఇళ్లు 16, దర్వేష్ బిల్డింగ్‌లోని ముస్లింల ఇళ్లు 10, ఆయేషాబాయి బిల్డింగ్‌లోని ముస్లింల ఇళ్లు 8, ఛోటానీ మంజిల్‌లోని ముస్లింల ఇళ్లు 57 లూటీకీ దహనానికీ గురయిన విషయాన్ని కమిషన్ ప్రస్తావిస్తూ 'పోలీస్‌స్టేషన్‌కు అంత సమీపంలో ఉన్న ఇళ్ల తలుపులు విరగ్గొట్టి యథేచ్ఛగా దోచుకోవడం, తగలబెట్టడం సాధ్యమయిందంటే పోలీసుల నిర్లక్ష్యవైఖరి ఎంతటిదో అర్థం అవుతుంది' అనింది.

ముస్లింలు పోలీసులపైన తుపాకులతో కాల్పులు జరిపిన అనేక ఘటనలను ముంబాయి పోలీసులు ప్రచారంలో పెట్టారు. పోలీసుల దాడులు ఎక్కువగా ముస్లింలపైనే జరగడాన్ని సమర్థించుకోవడానికి ఇది వారికి పనికి వచ్చింది. కానీ కమిషన్ ఈ ఘటనలను ఒక్కొక్కటీ పరిశీలించి ఇవి చాలా వరకు అవాస్తవాలని నిర్ధారించింది. కమిషన్ ముందు వాంగ్మూలం ఇచ్చిన అసిస్టెంట్ పోలీస్ కమీషనర్ జెండె కూడ నిజాయితీగానే ఈ విషయాన్ని ఒప్పుకున్నాడు. 'ముస్లింలు పోలీసులపైన, హిందువులపైన తుపాకులతో కాల్పులు జరిపిన అనేక ఘటనల

గురించి ప్రచారం జరిగింది గానీ పరిశోధన మీదట ఇవి అవాస్తవాలని తేలింది' అన్నాడు.

ఒకటి రెండు ఘటనలను పరిశీలిస్తే ముంబాయి పోలీసులు ముస్లింలను టెర్రరిస్టులుగా చిత్రీకరించడానికి ఎంత దూరం పోయారో అర్థం అవుతుంది.

ఇబ్రహీం రహింతుల్లా రోడ్‌లోని సులేమాన్ బేకరీపైన జనవరి 9 నాడు పోలీసులు దాడి జరిపి 9 మంది ముస్లింలను కాల్చి చంపారు, 78 మందిని అరెస్టు చేసారు. ఈ చర్యను సమర్థించుకోవడానికి పోలీసులు సులేమాన్ బేకరీని పెద్ద టెర్రరిస్టు స్థావరంగా చిత్రీకరించే ప్రయత్నం చేసారు. ఆ రోజు పొద్దున్న బేకరీ పైభాగం నుండి పోలీసులపైన కాల్పులు జరిగాయనీ కాల్పులు జరిపిన ముగ్గురిలో ఒకరి చేతిలో స్టెన్‌గన్, ఇద్దరిచేతిలో రివాల్వర్లు ఉన్నాయనీ పోలీసులు అన్నారు. అందుకే నగర జాయింట్ పోలీస్ కమీషనర్ ఆర్.డి. త్యాగి ఆధ్వర్యంలో దాడికి దిగామని, బేకరీ కిటికీ అద్దాలు పగలగొట్టి లోపలికిపోయి, నిచ్చెన ఎక్కి పై అంతస్తులోకి పోయి ముస్లింల కాల్పులను ఎదుర్కొనేందుకు కాల్పులు జరిపి 9 మందిని చంపి 78 మందిని అరెస్టు చేసామని ఎఫ్ఐఆర్ రాసుకున్నారు.

ఈ వీరోచిత కార్యంలో నలుగురు పోలీసులకు గాయాలయ్యాయని అన్నారు గానీ వాళ్ల పేర్లు ప్రకటించలేదు, వాళ్లను కమిషన్ ముందు సాక్షులుగా ప్రవేశపెట్టలేదు. వాళ్లను మించిన సాక్షులు ఉండరు కాబట్టి వాళ్లను ప్రవేశపెట్టకపోవడం నిజాన్ని దాచడం కోసమేనని కమిషన్ అభిప్రాయపడింది.

అరెస్టయిన 78 మంది, చనిపోయిన 9 మంది కలిసి మొత్తం 87 మంది ఒక మామూలు బేకరీలో ఇరుక్కుని ఉన్నారంటే వాళ్లను టెర్రరిస్టులుగా భావించాలా లేక పోలీసుల దాడులకు భయపడి అక్కడ దాక్కున్నారనుకోవాలా అన్న ప్రశ్న కూడ కమిషన్ వేసింది.

వాళ్లు జరిపారని చెప్తున్న కాల్పులకు ఏ ఆధారాలూ పోలీసులు చూపించలేదు. దుండగుల చేతిలో స్టెన్‌గన్ ఉందని చెప్తూ, ఒక ఎకె-47 షెల్‌ను చూపించి ఇది వాళ్ల తుపాకినుండి వచ్చిందని అన్నారు! నిజానికి పోలీసుల ఒప్పుకోలు ప్రకారమే పోలీసుల చేతిలో ఎకె-47లు ఉన్నాయి కాబట్టి అది పోలీసుల తుపాకికి చెందినదే అయి ఉంటుందని కమిషన్ అభిప్రాయపడింది.

బేకరీ పై అంతస్తులోకి పోవాలంటే సన్నటి నిచ్చెన ఎక్కి తాడు పట్టుకొని దూకాలనీ, పై అంతస్తులో తుపాకులు పట్టుకున్న టెర్రరిస్టులు గానీ ఉన్నట్టయితే

పోలీసులు ఒక్కొక్కరుగా పై అంతస్తులోకి విజయవంతంగా పోయి 9 మందిని చంపి 78 మందిని అరెస్టు చేసి తామెవరూ చావకుండా తిరిగి రావడం సాధ్యం కాదని కూడ కమిషన్ అభిప్రాయపడింది.

సారాంశంలో, అన్నిచోట్లలాగే సులేమాన్ బేకరీ ఘటనలో కూడ ముస్లింలు పోలీసులపైన రాళ్లు, కర్రలు, సోడాబాటిల్స్‌తో బేకరీ నుండి, పక్కన ఉన్న చున్నాభట్టి మసీదు నుండి దాడి చేసినట్టున్నారనీ, పోలీసులు ప్రతీకారంగా పెద్దెత్తున దాడికి దిగేసరికి అందరూ సులేమాన్ బేకరీలో రక్షణ కోసం దూరారనీ, వెంటనే పోలీసులు బేకరీలోకి ప్రవేశించి విచ్చలవిడిగా కాల్పులు జరిపి 9 మంది అమాయకులను పొట్టన బెట్టుకున్నారనీ కమిషన్ నిర్ధారించింది. ఈ ఘోరకృత్యానికి జాయింట్ పోలీస్ కమీషనర్ త్యాగి స్వయంగా బాధ్యత వహించవలసి ఉంటుందనింది.

హిందువులు సంప్రదాయకమైన ఆయుధాలతోనే దొమ్మీలకు దిగారుగానీ ముస్లింలు తుపాకులు, అందులోనూ ఆటోమేటిక్ తుపాకులు ప్రయోగించారనీ, అవి వారికి పాకిస్తాన్ గూఢచారి సంస్థ ఐఎస్ఐ సరఫరా చేసిందనీ, అందువల్లనే పోలీసులు ముస్లింల మీద ఎక్కువగా చర్యలు తీసుకోవడం జరిగిందనీ ఒక అభిప్రాయం కలిగించడానికి శివసేన, ముంబాయి పోలీసులు ప్రయత్నం చేసారు. జస్టిస్ శ్రీకృష్ణ ఒక్కొక్క ఘటననూ పరిశీలించి ఈ 'తుపాకుల' కథలలో అత్యధిక భాగం అబద్ధమని తేల్చారు. 'ఐఎస్ఐ హస్తం' ఉందనడానికి ఏ ఆధారం లేదని కమిషన్ ముందు పోలీస్ అధికార్లే ఒప్పుకున్నారు.

ముస్లింల ఇళ్లపైన పోలీసులు దాడి చేసినప్పుడు స్త్రీలతో అవమానకరంగా ప్రవర్తించిన ఘటనలు అనేకం కమిషన్ దృష్టికి వచ్చాయి. ఇమామ్‌వాడ బిఐటి చాల్స్‌లో నివసించే జులేఖా హస్సన్ షేఖ్ 56 సంవత్సరాల స్త్రీ. డిసెంబర్ 8 నాడు పాలు తేవడం కోసం బజారుకు పోయిన మనుమడి కోసం ఎదురుచూస్తూ (అది అప్పుడే కర్ఫ్యూ సడలించిన సమయం) ఆమె మెట్లమీద నిలబడి ఉండగా పోలీసులు ఆమె ఇంటిపైన దాడి చేసారు. ఇక్కడెందుకు ఉన్నావు అంటూ కర్రలతో నడుము మీద, వీపు మీద, మోకాళ్లమీద కొట్టారు. మోకాళ్లమీద కొడుతూ 'డ్యాన్స్ చేస్తే ఈ వయసులో కూడ అందంగా ఉంటావు సుమా' అంటూ ఆమెను హేళన చేసారు.

పోలీసులెవరయినా నిష్పక్షపాతంగా ఉండే ప్రయత్నం చేస్తే శివసేనవారు ఊరుకోలేదు. ముంబాయి పోలీసు ఉన్నతాధికారులలోని ఏకైక ముస్లిం అయిన

అడిషనల్ పోలీస్ కమీషనర్ ఎ.ఎ.ఖాన్‌ను తొలగించాలంటూ ఊరేగింపులు తీసారు. అతను హిందువులపైన అత్యాచారాలకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. అతనిని బర్తరఫ్ చేయాలంటూ మూడుసార్లు మోర్చాలు తీసినవాడు శివసేన ఎంఎల్‌ఏ మధుకర్ సర్‌పోట్‌దార్. ఇతను స్వయంగా జీపునిండా ఆయుధాలు పెట్టుకొని నగర వీధులలో తిరుగుతూ దొరికిపోయిన ఘనుడు. పోలీసులే అయితే అతనిని అరెస్టు చేయకపోదురేమో గానీ ఆలస్యంగా రంగంలోకి దిగిన సైన్యానికి జనవరి 11 నాడు సర్‌పోట్‌దార్ దొరికాడు. అతని జీపులో అతను కాక ఆరుగురు శివసైనికులు ఉన్నారు. ఒక 0.32 రివాల్వర్, ఒక 0.20 పిస్టల్, ఒక 0.99 పిస్టల్, రెండు గొడ్డళ్లు, రెండు హాకీ కర్రలు దొరికాయి. సైన్యం అతన్ని పట్టుకొని పోలీసులకు అప్పగించింది. సర్‌పోట్‌దార్ దగ్గర దొరికిన ఆయుధాలలో రెండింటికి (పిస్తోళ్లకు) లైసెన్స్ లేదు. 'ముంబాయి టాడా చట్టం కింద నోటిఫైడ్ ప్రాంతం అయినప్పటికీ, లైసెన్స్ లేని ఆయుధాలు కలిగి ఉండటం టాడా సెక్షన్ 5 కింద నేరం అయినప్పటికీ, పోలీసులు అతని మీద టాడా కేసుపెట్టే ఆలోచన చేయలేదు. అతనికి కోర్టు బెయిలు ఇవ్వడాన్ని వ్యతిరేకించలేదు, పెట్టిన సీదాసాదా కేసులో మూడేండ్ల తరువాత కూడ చార్జిషీటు పెట్టలేదు' అని జస్టిస్ శ్రీకృష్ణ వ్యాఖ్యానించారు.

దాదాపు అదే సమయంలో, ముస్లింలకు అనుకూలంగా ఉంటాడని పేరుపడ్డ కాంగ్రెస్ ఎంపి సునీల్‌దత్ కుమారుడు సంజయ్‌దత్ దగ్గర లైసెన్స్ లేని ఆయుధం దొరికిందన్న కారణంగా అతనిపైన టాడా కేసుపెట్టి చాలాకాలం జైలులో ఉంచిన సంగతి తెలిసిందే.

సులేమాన్ బేకరీ ఘటనలాంటిదే ఆర్‌ఎకెఈ మార్గ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హరి మస్జిద్ కాల్పుల ఘటన. 10 జనవరి నాడు జరిగిన ఈ ఘటనలో ఆరుగురు ముస్లింలు పోలీసు కాల్పులలో చనిపోయారు. పోలీసుల కథనం ప్రకారం, దాదాపు 2,500 మంది ముస్లింలు మారణాయుధాలతో హరి మస్జిద్ దగ్గర సమావేశమై చుట్టుపక్కల ఉన్న హిందువుల నివాసాలను తగలబెడుతూ ముందుకు సాగారు. మసీదు నుండి కాల్పులు కూడా జరిపారు. ఈ హింసాకాండను అదుపు చేయడానికి పోలీసులు కాల్పులు జరపగా ఆరుగురు ముస్లింలు చనిపోయారు.

కమిషన్ ఈ ఘటనకు సంబంధించిన ఒక్కొక్క విషయాన్నీ తరచి తరచి ప్రశ్నించి ఇది మొత్తంగా అబద్ధం అని నిర్ధారించింది. మొదటిగా, మసీదు సమీపంలోని ఏ ఒక్క హిందూ నివాసానికీ ఎటువంటి అపాయం జరగలేదు.

రెండు, ఘటన జరుగుతున్నప్పుడు పోలీస్‌స్టేషన్‌కు అందిన వైర్‌లెస్ సమాచారం ప్రకారం మసీదు దగ్గర పెద్ద హిందువుల గుంపు కూడా మోహరించి ఉండింది. హిందువులకూ ముస్లింలకూ మధ్య దొమ్మీ జరిగిందన్న విషయాన్ని కప్పిపెట్టి కేవలం ముస్లింలు దహనకాండకు పాల్పడినట్టు చూపించాలని పోలీసులు తరువాత ప్రయత్నం చేసారు. చివరిగా, చనిపోయిన ఆరుగురి శవాలూ మసీదులోపలే ఉన్నాయిగానీ బయటకాదు. మసీదు వైపు నుండి కాల్పులు జరిగాయని నమ్మడానికి కూడ ఆధారాలేమీ లేవని కమిషన్ నిర్ధారించింది.

నిజానికి జరిగిందేమిటంటే మసీదు సమీపంలో ఇరువర్గాలూ మోహరించి ఘర్షణ పడ్డారు. పోలీసులు వచ్చేసరికి నమాజ్‌వేళ అయింది. మసీదులో 100 మందికి పైగా నమాజ్ చేస్తున్నారు. సబ్‌ఇన్స్‌పెక్టర్ కాప్సె నాయకత్వంలో పోలీసులు మసీదులోకి ప్రవేశించి నమాజ్ చేస్తున్న వారిపైన గుళ్లవర్షం కురిపించారు. కాప్సె చేసిన ఈ నేరాన్ని డిసిపి బిష్ణోయ్ వెనకేసుకురావడాన్ని కూడ కమిషన్ తీవ్రంగా తప్పుపట్టింది. కాప్సె కాల్పులు జరపలేదనీ, తాను వచ్చిన తరువాతే కాల్పులకు ఆదేశం ఇవ్వడం జరిగిందనీ డిసిపి ఇచ్చిన వాంగ్మూలం అందరి సాక్ష్యాలకూ విరుద్ధంగా ఉందని కమిషన్ అనింది. 'తన కింది అధికారికి అండగా నిలబడడం గొప్ప లక్షణమే కావచ్చును గానీ అతని మాటలు నమ్మలేకుండ ఉన్నాం' అనింది. మొత్తానికి పోలీసు యంత్రాంగం పై నుండి కింది దాకా అబద్ధాలు చెప్పి హరి మసీదులో జరిగిన ఘోరమైన హత్యాకాండను దాచి పెట్టాలని ప్రయత్నం చేయడాన్ని కమిషన్ తీవ్రంగా దుయ్యబట్టింది. పోలీసుల మాటలు 'పూర్తిగా నమ్మశక్యం కానివి' అనీ, 'కల్పితం అనీ', 'కాల్పులు సమర్థనీయం కాదు' అనీ నిర్ధారించింది.

అదే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన నూరుల్లా హుస్సేన్ షేఖ్ హత్య పోలీసుల వైఖరిని సూచించే మరొక ఉదంతం. జనవరి 10 నాడు వీళ్లు నివసించే ప్రాంతం మీద హిందువుల గుంపు దాడిచేసి ఇళ్లు ధ్వంసం చేయసాగారు. అప్పుడు ఇతను, ఇతని భార్య, ఇతర బంధువులూ పారిపోతుండగా అయిదారు మంది కర్రలతో దాడిచేసి నూరుల్లాను కిందపడేసి అతనిపైన కిరోసిన్ పోసి తగలబెట్టి చంపారు.

అయితే ఈ హత్య గురించి కేసు రిజిస్టర్ చేయడానికి అతని భార్య షకీలా బాను చేసిన ప్రయత్నం ఫలించలేదు. ఆమె ఆరేడుసార్లు పోలీస్‌స్టేషన్‌కు పోయి చెప్పినా అసిస్టెంట్ పోలీస్ ఇన్స్‌పెక్టర్ భాగ్వత్ మాధవ్ కోలీ, సబ్ ఇన్స్‌పెక్టర్ కాప్సె హత్యకేసు నమోదు చేసుకోలేదు. చివరికి 'మనిషి కనబడడం లేదు' అన్న

ఎఫ్ఐఆర్  మాత్రమే నమోదు చేసారు. శ్రీకృష్ణ కమిషన్ ఏర్పాటయిన తరువాత షకీలా బాను వచ్చి మొరపెట్టుకునేదాకా కేసు కూడ నమోదు కాలేదు. 'పోలీస్ అధికారులు కోలీ, కాప్సె కావాలనే ఈ పని చేసారు. ఫిర్యాది ముస్లిం అన్న తిరస్కార భావంతో కావచ్చు, హంతకులను కాపాడే ఉద్దేశ్యంతో కావచ్చు' అని కమిషన్ వ్యాఖ్యానించింది.

సబ్ఇన్స్‌పెక్టర్ కాప్సె మీద మరొక తీవ్రమైన ఫిర్యాదు కూడ ఉంది. హరి మసీదు కాల్పుల ఘటన గురించి పైన చెప్పాము. కాల్పులలో చనిపోయిన ఆరుగురి శవాలను ఎత్తి వ్యాన్‌లో వేయమని కాప్సె మహమ్మద్ ఆదం అనే యువకుడికి పురమాయించాడు. ఆ తరువాత ఆదంను కూడ వ్యాన్ ఎక్కమని తీసుకుపోయాడు. అప్పటినుండి ఆదం ఆచూకీ తెలీదు. అతని తల్లి రోషన్‌బీ ఆ తరువాతి రోజునుండి వరుసగా ఎనిమిది రోజులు పోలీస్‌స్టేషన్‌కు పోయి తన కొడుకు గురించి అడిగింది. మాకేమీ తెలీదని పోలీసులు అన్నారు. రోషన్‌బీ ఆ తరువాత నగరపోలీస్ కమీషనర్‌కు, హోంమంత్రికి అర్జీలు పెట్టుకుంది. హైకోర్టులో రిట్‌పిటిషన్ వేసింది. కానీ దేనికీ ఫలితం దక్కలేదు. ఆదం ఆచూకీ ఇప్పటికీ తెలీదు.

## ముగింపు

శ్రీకృష్ణ కమిషన్ నివేదిక మొత్తం చదివితే బహుశా అన్నిటికంటె కొట్టొచ్చినట్టు కనిపించే విషయం, శివసేనపైన చర్య తీసుకోవడానికి పోలీసు యంత్రాంగంలోనూ అధికార యంత్రాంగంలోనూ ఉన్న వెరపు. పోలీస్ అధికారులే కాదు, అప్పటి మహారాష్ట్ర ముఖ్యమంత్రి సుధాకరరావు నాయక్ సహితం కమిషన్ ముందు హాజరయి ఇదే వైఖరి వ్యక్తం చేసాడు. శివసేన నాయకులను సకాలంలో అదుపులోకి తీసుకొని ఉండవచ్చును కదా అంటే 'ఆ పని చేస్తే ముంబాయి తగలబడుతుందని భయపడ్డాము' అంటాడు. 'అయినా ముంబాయి తగలబడకుండ ఉండలేదు కదా' అన్న జస్టిస్ శ్రీకృష్ణ వ్యంగోక్తి ఉచితమైనదే.

ఈ భయం పైనుండి కిందిదాకా నెలకొనింది. శివసేన అధికార దినపత్రిక 'సామ్నా'లో బాల్‌థాకరే నిత్యం రాస్తున్న రెచ్చగొట్టే రాతలపైన అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఏ చర్య తీసుకోలేదు. జనవరి 1, 1997 నాటి సంపాదకీయాన్ని శ్రీకృష్ణ కమిషన్ ప్రత్యేకంగా ప్రస్తావించి దానిపైన కేసెందుకు పెట్టలేదని పోలీస్ అధికార్లను ప్రశ్నించింది. పెట్టకపోవడానికి వాళ్లు చెప్పిన కారణం పైన

వివరించాము. అదేవిధంగా, ముస్లిం బాధితులు శివసేన కార్యకర్తల పేర్లు ఇచ్చినప్పటికీ ఎందుకు అరెస్టు చేయలేదని ఇన్స్‌పెక్టర్‌లను కమిషన్ ప్రశ్నిస్తే, 'అరెస్టు చేస్తే అల్లర్లు మరింత పెరుగుతాయని చేయలేదు' అని జవాబు చెప్పారు.

ఆనాటి నుండి ఈనాటిదాకా శివసేన పట్ల, సంఘపరివార్ సంస్థల పట్ల ఇదే వైఖరి కొనసాగుతున్నది. వాళ్లు సినిమాహాల్ పైన రాళ్లు వేస్తే సినిమా ప్రదర్శన రద్దు చేయాలని ప్రభుత్వమే నిర్ణయిస్తుంది. వాళ్లు పాకిస్తాన్ జట్టును ముంబాయిలో అడుగు పెట్టనివ్వమని బెదిరిస్తే క్రికెట్ అధికార యంత్రాంగమే మ్యాచ్‌ను రద్దు చేస్తుంది. వాళ్లనేమైనా అంటే గొడవ ఎక్కువ అవుతుంది కాబట్టి వాళ్ల ఆదేశాలకు తలొగ్గడం ఉత్తమం అనే వైఖరి సర్వత్రా వ్యాపించింది. ఈ 'టెర్రర్'ను జయించకపోతే భారతదేశంలో ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టడం సాధ్యం కాదు.

శ్రీకృష్ణ కమిషన్ నివేదిక మాటకొస్తే ఎవరినయితే కమిషన్ ప్రధాన దోషులుగా గుర్తించిందో వారే ఈ లోపల మహారాష్ట్రలో అధికారానికి వచ్చారు. కమిషన్ నివేదికపైన చర్య తీసుకోవలసింది వారే. తాము ఏ చర్య తీసుకోబోతారో వారు ఇప్పటికే ప్రకటించారు. కమిషన్ చేసిన సూచనల్లో కేవలం సాంకేతికమైన వాటిని మహారాష్ట్ర ప్రభుత్వం ఆమోదించింది. అంటే పోలీసులకు నేరపరిశోధనలో ఇంకా బాగా తర్ఫీదు ఇవ్వాలి, మంచి వైర్‌లెస్ పరికరాలు ఇవ్వాలి వగైరా. వేరే ఏ అభిప్రాయాన్నీ సూచననూ ఆమోదించలేదు. అల్లర్లలో శివసేన కుట్ర ఉందని ఆమోదించలేదు. పోలీసులలో ముస్లింల పట్ల వ్యతిరేకత ఉందని ఒప్పుకోలేదు. పాకిస్తాన్ పాత్ర, ఐఎస్ఐ పాత్ర ఉన్నాయని నమ్మడానికి ఆధారాలేవీ లేవంటే అంగీకరించలేదు.

అల్లర్లకు ఏ వ్యాఖ్యానాన్నయితే కమిషన్ తిరస్కరించిందో దానినే మహారాష్ట్ర ప్రభుత్వం పునరుద్ఘాటించింది. 'దేశద్రోహులయిన ముస్లింల హింసాత్మక చర్యలే' అల్లర్లకు నాంది అనీ, వారి వెనుక పాకిస్తాన్ ఉందనీ, ముస్లింల అతివాదంతోనూ వారిపట్ల లౌకికవాదం పేరిట సాగుతున్న బుజ్జగింపు ధోరణితోనూ విసిగిపోయిన హిందువులు తిరగబడ్డారే తప్ప అల్లర్లలో హిందుత్వవాద సంస్థల కుట్రేమీ లేదనీ అనింది. కాబట్టి శ్రీకృష్ణ కమిషన్ నివేదిక ఫలితంగా ముంబాయి పోలీస్ యంత్రాంగంలో ప్రక్షాళన ఏదీ జరగకపోవచ్చు, హింసకు పాల్పడిన శివసేన వారికి చట్టం నుండి ఏ అపాయమూ రాకపోవచ్చు.

అయినప్పటికీ కమిషన్ ప్రయాస వృధా కాదు. బాబ్రీమసీదు కూల్చివేతతో దేశ సామాజిక రాజకీయ జీవితంలో ప్రజాస్వామ్యానికీ ప్రజాస్వామ్య విలువలకూ పెద్ద ప్రమాదకారిగా ముందుకొచ్చిన హిందుత్వవాద ఫాసిజాన్ని ఎదుర్కొనే

పెద్దకర్తవ్యానికి ఈ నివేదిక, అందులో వెలికి వచ్చిన సత్యాలు తోడ్పాటును ఈయగలవు. ఈ ఫాసిజం గురించి శ్రీకృష్ణ కమిషన్ నివేదిక మనకు మరింత వివరణాత్మకమైన అవగాహన ఇయ్యగలదు. దానిని స్వీకరించి, అవగాహన చేసుకొని ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కృషి చేయడం మనందరి కర్తవ్యం.

**మానవహక్కుల వేదిక తొలి ప్రచురణ, జనవరి 1999**

**ముంబాయిలో 1992-1993 లలో జరిగిన అల్లర్లపై**
**జస్టిస్ బి.ఎన్. శ్రీకృష్ణ కమిషన్ ఇచ్చిన నివేదికకు ఇది సంక్షిప్త పరిచయం**



హిందూమతోన్మాద ఫాసిజం ఇన్నాళ్లూ కేవలం ఒక సిద్ధాంత భావన కావచ్చు. ఈరోజు అదొక సామాజిక వాస్తవం. దక్షిణ భారతదేశంలో అది ఇప్పటికి బలహీనంగా ఉంది కాబట్టి అది బలంగా ఉన్న ప్రాంతాలలో దాని అభీష్టానికి అడ్డం ఉన్నవారు ఎటువంటి భయాందోళనలకు గురవుతున్నారో మనకు అర్థం కావడం కష్టం కావచ్చు. కానీ అర్థం చేసుకోవటం అవసరం. ఈనాడు దేశంలో ఉన్న ముఖ్యమైన మానవ హక్కుల సమస్యలలో ఇదొకటి. కేవలం మైనారిటీ మతస్తులకు మాత్రమే ప్రమాదకారి కాదు. అన్నిరకాల ప్రజాతంత్ర విలువలకూ ప్రజాస్వామ్యానికీ ప్రమాదకారి.

ఈ ఫాసిజం గురించి శ్రీకృష్ణ కమీషన్ నివేదిక మనకు మరింత వివరణాత్మకమైన అవగాహన ఇయ్యగలదు. దానిని స్వీకరించి, అవగాహన చేసుకొని ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కృషి చేయడం మనందరి కర్తవ్యం.

# ఇంకొక 'గుజరాత్' ఎక్కడా జరగనివ్వొద్దు



**మ**నుషుల ఘోరమైన ప్రవర్తన గురించి వార్తలు విన్నప్పుడు, చదివినప్పుడు మనమసలు నాగరికులమేనా? అన్న సందేహం వస్తుంది.

గుజరాత్ ఘటనల గురించి విన్నప్పుడు ఇంకొక మెట్టు కిందికి దిగి మనమసలు మనుషులమేనా? అన్న సందేహం చాలామందికి వచ్చింది.

స్త్రీలను మూకుమ్మడిగా రేప్ చేసి ముక్కలుగా నరికి తగలబెట్టిన వాళ్ళు, చిన్న పిల్లలను పెట్రోలు పోసి సజీవంగా తగలబెట్టిన వాళ్ళు, రహదారి మీద పోతున్న వాహనాలను తాళ్లతో బంధించి పెట్రోలు పోసి వాహనంలోని ప్రయాణీకులతో సహా దానికి నిప్పు పెట్టి హతమార్చిన వాళ్లు – వీళ్లు కూడా మనుషులే అయితే మనం ఏమిటి?

మూడు నెలలుగా ఈ ప్రశ్న మనల్ని వేధిస్తున్నది. అయితే ఈ ఆవేదనకు బాధ్యులయిన సంఘ్‌పరివార్ పార్టీల వాళ్లు ఈ ప్రశ్నకు జవాబు చెప్పడం లేదు. 'మీరు గోధ్రా మారణకాండను ఖండించడం లేదు' అని ఎదురు దాడి చేస్తున్నారు. ఎవరూ ఆ మారణకాండను ఖండించలేదు కాబట్టే గుజరాతీ హిందువులు కోపోద్రిక్తులయి ముస్లింల పైన దాడికి దిగారని దబాయిస్తున్నారు.

ఇందులో రెండు అబద్ధాలున్నాయి. గోధ్రా మారణకాండను ఎవరూ ఖండించలేదన్నది ఒక అబద్ధం. ఖండించడానికి అందరికీ టైం ఇచ్చిన తరువాతే హిందుత్వవాదులు పోగు చేసిన మూకలు ముస్లింలపైన దాడికి దిగారన్నది రెండవ అబద్ధం.

గోధ్రా మారణకాండ జరిగింది ఫిబ్రవరి 27 పొద్దున్న. 28 పొద్దున్న నుండే ముస్లింలపైన మారణకాండ పెద్ద ఎత్తున గుజరాత్ వ్యాప్తంగా మొదలయింది. కొన్ని చోట్ల 27 రాత్రే మొదలయింది. ఎవరైనా ఖండిస్తున్నారా లేదా అని వాళ్లు చూసిందెక్కడ? దాని కోసం ఆగిందెక్కడ?

కరసేవకులు అయోధ్యకు వస్తూపోతూ రైళ్లలోనూ, స్టేషన్లలోనూ కనిపించిన ముస్లింలను పలువిధాల సతాయిస్తున్నారు. దీనికి ఆగ్రహించిన గోధ్రా రైల్వే స్టేషన్ వెండర్లు తమ నివాస ప్రాంతమైన సిగ్నల్ ఫాలియా అనే బస్తీ దగ్గర చెయిన్ గుంజి, బస్తీవాసులను కూడగట్టి కరసేవకుల మీద కక్షతో వారు ప్రయాణిస్తున్న బోగీని తగలబెట్టారు. అందులో దాడి చేసిన వారి ఆగ్రహానికి కారకులయిన కరసేవకులే కాక ఇతర ప్రయాణీకులు – స్త్రీలూ పిల్లలతో సహా – ఉన్నారు. మొత్తం 58 మంది చనిపోయారు.

ఒకరి మీద కోపంతో వాళ్లు ప్రయాణం చేస్తున్న రైలు బోగీని మొత్తంగా తగలబెట్టి పసిపిల్లలతో సహా 58 మందిని చంపడం అతిఘోరమైన చర్య. దానిని ఖండించని వారెవ్వరూ ఉండరు. కాబట్టి ఆ ఆరోపణ పచ్చి అబద్ధం.

ఆ అబద్ధాన్ని అడ్డం పెట్టుకొని హిందుత్వవాద సంస్థలు సాగించిన మారణహోమం నిజానికి ఆ క్షణమే మొదలయినది కూడా కాదు. దాని కోసం ఏర్పాట్లు చాలా కాలంగా సాగుతున్నాయి. ఏ అదను దొరికినా ముస్లిం ప్రజానీకంపైన మొత్తంగానే దాడి చేయడానికి వాళ్లు చాలా కాలంగా తయారుగా ఉన్నారు. గోధ్రా మారణకాండను అవకాశం చేసుకొని అప్పటికే తయారయిన పథకాన్ని అమలు చేశారు. అతిక్రూరంగా (పాశవికంగా అంటే పశువులను అవమాన పరచడం అవుతుంది) అమలు చేశారు.

మనుషుల మెదళ్లలో ఈ దేశ చరిత్ర గురించి అబద్ధాలు చొప్పించారు, మనసులలో ముస్లింల గురించీ ఇస్లాం గురించీ విద్వేషాన్ని నింపారు. త్రిశూలాలు, తల్వార్లు పంచారు. అబద్ధపు వదంతుల ప్రచారాన్ని ఒక కళగా అభ్యసించి ప్రదర్శించారు. ప్రభుత్వాన్ని జేబులో వేసుకొని పోలీసులను తమ ఏజెంట్లుగా మలుచుకున్నారు. ముస్లింలను ఒక వర్గంగానే భౌతికంగా ఆర్థికంగా సాంఘికంగా అణచి వేయడానికీ, వెలివేయడానికీ, నాశనం చేయడానికీ కావలసిన భావ, భౌతిక వాతావరణాన్ని రూపొందించుకున్నారు.

గోధ్రా మారణకాండను ఆసరా చేసుకొని, అప్పటికే తయారుగా ఉన్న ఈ పథకాన్ని పకడ్బందీగా మరుసటి రోజు తెల్లవారి నుండి అమలు చేశారు.

ఫిబ్రవరి 28 నుండి దాదాపు మార్చి 15వ తేదీ దాకా సాగిన ఈ దౌర్జన్యకాండలో ముస్లింల నివాసాలు, దుకాణాలు, హోటళ్లు మొత్తం 22,515 అగ్నికి ఆహుతి అయ్యాయి. 3800 కోట్ల రూపాయల ఆస్తి ధ్వంసం అయింది. 1500 మంది దాకా హతమయ్యారు. స్త్రీలు లెక్కలేనంత మంది లైంగిక అత్యాచారానికి గురయ్యారు. లక్షన్నర జనాభా తమ ఆవాసాలను వదిలిపెట్టి శరణార్థుల శిబిరాలలో చేరారు.

ఈ వైనాన్ని క్లుప్తంగా వివరించే ప్రచురణ – మానవహక్కుల వేదిక అచ్చు వేసిన 'గాంధీ గుజరాత్‌లో గాడ్సే రాజ్యం'. 8 రోజులపాటు అయిదు హక్కుల సంఘాల బృందంలో భాగంగా ముగ్గురు మానవహక్కుల వేదిక బాధ్యులు గుజరాత్‌లో చేపట్టిన పర్యటన ఫలితం ఈ ప్రచురణ.

దీని ఉద్దేశ్యం క్రూరత్వాన్ని మళ్లీ మళ్లీ జ్ఞాపకం చేసి ద్వేషాన్ని రెచ్చగొట్టడం కాదు. మత అసహనం ఇప్పటికే ఎంతటి విద్వేషపూరితమైన రూపం తీసుకుందో, ఎవరి పుణ్యాన తీసుకుందో వివరించి చెప్పి ఆ విషాన్ని తొలగించే ప్రయత్నానికి తోడ్పడటం. చట్టబద్ధ పాలననూ, ప్రాథమిక హక్కులనూ ప్రమాణంగా పెట్టుకొని పరిపాలించవలసిన పాలనా యంత్రాంగం మైనారిటీ వర్గం పైన జరిగిన మారణకాండలో తానూ భాగమైన వైనాన్ని విపులీకరించి ఆ పాలనా విలువలను పున:స్థాపించడానికి తోడ్పడడం.

క్లుప్తంగా చెప్పాలంటే, ఇంకొక గుజరాత్ ఎక్కడా జరగకుండా చూడడానికి కావలసిన చైతన్యం కలిగించడం ఈ ప్రచురణ లక్ష్యం.

చట్టబద్ధ పాలననూ, ప్రాథమిక హక్కులనూ, లౌకికవాద స్ఫూర్తినీ కాపాడుకోవడం కోసం, అసామాన్య వైవిధ్యం ఉన్న మన నాగరికతను ఒకే మూసలోకి కుదించివేసే సంఘ్‌పరివార్ సంకుచిత ప్రయత్నాన్ని ఎదుర్కొనడం కోసం ప్రజాస్వామ్యాన్ని ప్రేమించే వారంతా ఒకటిగా కదిలి రావాలని పిలుపునిస్తూ...

**'గాంధీ గుజరాత్‌లో గాడ్సే రాజ్యం' రిపోర్టు**
**ఆవిష్కరణ సభ కోసం రాసిన కరపత్రం**
**11 జూన్ 2002**



# గాంధీ గుజరాత్‌లో గాడ్సే రాజ్యం

మానవహక్కుల వేదిక (HRF) ప్రచురణ

# గాంధీ గుజరాత్‌లో గాడ్సే రాజ్యం

## I

### మామూలు ఘర్షణలు కావు

గుజరాత్ మారణకాండ కలిగించినంత కలవరం ఈ మధ్యకాలంలో వేరే ఏ ఘటనా కలిగించలేదు. మత ఘర్షణలు దేశంలో ఎప్పటినుండో జరుగుతున్నాయి. వాటిలో ఎందరో చనిపోయారు, చనిపోతున్నారు.

కానీ గుజరాత్ మారణకాండ మామూలు మత ఘర్షణల కంటె మూడు రకాలుగా భిన్నమైనది. ఒకటి, అది ఘర్షణ కాదు, ఏకపక్షమైన మారణకాండ. ఘర్షణ అన్నప్పుడు రెండు పక్షాలు ఉండాలి. గుజరాత్ ఘటనలో (నూటికి 99 శాతం) రెండవ పక్షం లేదు. రెండు, రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యక్షంగా మారణకాండలో భాగం వహించింది. మత ఘర్షణలు ఎప్పుడు జరిగినా ప్రభుత్వం పక్షపాత వైఖరి అనుసరిస్తున్నదన్న ఫిర్యాదులు వినపడతాయి. కానీ గుజరాత్ ప్రభుత్వం ప్రదర్శించింది కేవలం పక్షపాతం కాదు. ప్రభుత్వమే మారణకాండ జరిపించింది. మూడు, దుండగుల మూకలు అతి క్రూరమైన హింసకు పాల్పడ్డాయి. పసిపిల్లలను ముక్కలుగా నరికి చంపడం, పెట్రోలుపోసి తగలబెట్టడం, స్త్రీలపైన మూకుమ్మడిగా అత్యాచారాలు జరిపి ముక్కలుగా నరకడం, రోడ్డు మీద పోతున్న వాహనాలను ఆపి, తలుపులు తీయకుండ ఉండేందుకు తాళ్లతో బంధించి, వాహనం మీద పెట్రోలు పోసి తగలబెట్టి అందులో ఉన్న వాళ్లందరినీ హతమార్చడం – ఇవి 'మామూలు' మత ఘర్షణల చిత్రాలు కావు.

1992-93లలో ముంబాయిలో జరిగిన మారణకాండకు ఈ పోలికలు ఉన్నప్పటికీ గుజరాత్ గుణాత్మకంగా భిన్నమైనది. ముంబాయిలో ముస్లింలు కూడ కొంతమేరకు ఘర్షణకు దిగారు. ప్రభుత్వ యంత్రాంగం హిందూ మూకలకు అనుకూలంగా వ్యవహరించినప్పటికీ, అది గుజరాత్‌లాగ ప్రభుత్వమే నడిపిన మారణకాండ కాదు. హింస క్రూరంగా ప్రయోగించినప్పటికీ మరీ ఇంత క్రూరంగా కాదు.

ఇంకొక ముఖ్యమైన తేడా కూడ ఉందేమో. గతంలో జరిగిన మత ఘర్షణలు అధిక భాగం పట్టణాలకు పరిమితమైనవి. గుజరాత్ మారణకాండ అహమ్మదాబాద్ నగరంతో సమానంగా మారుమూల గ్రామీణ ప్రాంతాలలోనూ జరిగింది. రాష్ట్రంలోని 25 జిల్లాలకుగాను 6 జిల్లాలలో మాత్రమే హింస జరగలేదు. 8 జిల్లాలలో – అహమ్మదాబాద్, సబర్‌కాంటా, పంచ్‌మహల్స్ దాహోద్, మెహసానా, బరోడా, ఆనంద్, ఖేడా – తీవ్రస్థాయిలో జరిగింది. అంతేకాక, గతంలో జరిగిన ఘర్షణలలో – ముంబాయి మారణకాండతో సహా – 'దుండగులు' అనే వాళ్లు ఒక ప్రత్యేక వర్గంగా కనిపించేవారు. గుజరాత్‌లో హిందువులు మొత్తంగానే శారీరకంగానో మానసికంగానో దౌర్జన్యకాండలో పాల్గొన్నారు. మినహాయింపులు అతి స్వల్పం. చదువుకున్న వాళ్లు, మర్యాదస్తుల వర్గానికి చెందిన వాళ్లు సాధారణంగా మత ఘర్షణలలో స్వయంగా పాల్గొనరు. ఇళ్లలో కూర్చొని సంతోషించవచ్చును గాక. కానీ గుజరాత్ దౌర్జన్యకాండలో ఈ వర్గానికి చెందినవారు కూడ నేరుగానే పాల్గొన్నారు. కార్లలో వచ్చి ముస్లింల దుకాణాలు లూటీచేసి తాము కోరుకున్న వస్తువులు తీసుకొని దుకాణాన్ని తగలబెట్టిపోయారు. పత్రికల ఫోటోగ్రాఫర్లు, టివి రిపోర్టర్లు సాహసం చేసి దుండగుల మూకలలోకి దూరి హింసాకాండను సజీవంగా చూపించారు. ఆ చిత్రాలలో బంధించిన హింసాద్వేషాలు, క్రూరత్వం చూసేవాళ్లకు భయంగొలిపాయి. మనుషులు ఇంత క్రూరంగా ప్రవర్తించగలరా అని ఆశ్చర్యం, ఆందోళన కలిగించాయి.

ఈ కారణాలన్నిటివల్లా గుజరాత్ మారణకాండ చాలా కలవరం రేపింది. సంఘ్‌పరివార్ సంస్థల స్పందన ఈ కలవరాన్ని చాలా పెంచింది. 'ఇన్నాళ్లూ అణిగిమణిగి పడి ఉన్న హిందువులు ఇప్పుడు మేల్కొని తిరగబడ్డారు' అనీ, 'పిరికివాళ్లని అందరూ భావించిన హిందువులు తమ శౌర్యం ప్రదర్శించారు' అనీ విశ్వహిందూ పరిషత్ నాయకులు ఆచార్య గిరిరాజ్ కిషోర్, ప్రవీణ్ తొగాడియాలు

వికృతమైన ఆనందం ప్రదర్శిస్తూ ప్రకటించారు. నిరాయుధులయిన ప్రజలను – స్త్రీలనూ పిల్లలనూ – క్రూరంగా హింసించి హతమార్చడంలో 'శౌర్యం' ఏముందో, 'పరాక్రమం' ఏముందో అర్థం కాదు. దానిని 'శౌర్యం'గా, 'పరాక్రమం'గా భావించి కేరింతలు కొట్టేవాళ్లు దేశ రాజకీయాలను శాసించే స్థాయికి ఎదగడం మరీ ఆందోళన, భయం కలిగించే విషయం.

ఇటువంటి ఘోరాలు జరిగినప్పుడు ఆందోళన చెందడం, కలవరపడడం, ఈ దేశానికి రాబోయే దినాలలో ఏం గతి పడుతుందో అని భయపడడం సహజమే. కానీ అక్కడే మనం ఆగిపోతే ఇవి పునరావృతం కాకుండ ఆపడానికి ఏమీ చేయలేము. ఘటన పూర్వాపరాలు తెలుసుకోవాలి, దాని స్వభావాన్ని అర్థం చేసుకోవాలి, దానిని ఎదుర్కొనడానికి కావలసిన చైతన్యాన్ని మనం పొందాలి, ప్రజలకు పంచాలి.

ఈ లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్‌లకు చెందిన అయిదు హక్కుల సంఘాల ప్రతినిధుల బృందం మే నెల 7వ తేదీ నుండి 14వ తేదీ దాకా గుజరాత్ రాష్ట్రంలో పర్యటించింది. ఇందులో మానవహక్కుల వేదికతో పాటు ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం, సిపిడిఆర్ (ముంబాయి), ఎపిడిఆర్ (పశ్చిమ బెంగాల్), లోక్‌షాహి హక్ సంఘటన (మహారాష్ట్ర)ల ప్రతినిధులు ఉన్నారు. 14 మంది సభ్యులు గల ఈ బృందం మూడు టీంలుగా విడిపోయి అహమ్మదాబాద్, బరోడా నగరాలలోనే కాక హింసాకాండ అధికంగా జరిగిన సబర్‌కాంటా, దాహొద్, పంచ్‌మహల్స్, మెహసానా, ఆనంద్, ఖేడా, బరోడా జిల్లాలలో కూడ పర్యటించింది. రాష్ట్రంలోని 91 శరణార్థుల శిబిరాలలో 20 శిబిరాలను సందర్శించి వందలాది మందితో మాట్లాడింది. మెహసానా, బరోడా జిల్లాల కలెక్టర్‌లతోనూ, మెహసానా జిల్లా పోలీస్ సూపరింటెండెంట్‌తోనూ, రాష్ట్ర ప్రభుత్వ అసిస్టెంట్ రిలీఫ్ కమిషనర్‌తోనూ, బరోడా నగర పోలీస్ కమిషనర్‌తోనూ, పంచ్‌మహల్స్ జిల్లా కేంద్రమైన గోద్రాలోని విశ్వహిందూ పరిషత్ కార్యదర్శితోనూ, ఛోటా ఉదేపూర్‌కు చెందిన ఆర్‌ఎస్‌ఎస్ ప్రముఖునితోనూ కూడ మాట్లాడింది. గుజరాత్‌లో స్వల్ప సంఖ్యలో పనిచేస్తున్న స్వచ్ఛంద సేవా సంస్థల కార్యకర్తలు కూడ తమ అభిప్రాయాలనూ అనుభవాన్నీ మా బృందంతో పంచుకున్నారు.

వారం రోజుల పర్యటన ఫలితమైన నివేదికను త్వరలో అయిదు సంస్థల ఉమ్మడి ప్రచురణగా ఆంగ్లంలో తీసుకొస్తాము. ఇప్పటికే ఆంగ్లంలో కొన్ని

నివేదికలు వచ్చి ఉండడం వల్ల, మా నివేదికలో శరణార్థుల పునరావాసం సమస్యకూ, పోలీసుల నేర పరిశోధనలోని లోపాలకూ, గుజరాత్ హైకోర్టు ఈ మారణకాండకు స్పందించిన తీరులోని లోపాలకూ ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుంది.

అయితే గుజరాత్ మారణకాండ గురించి తెలుగులో ఇప్పటికి సమగ్రమైన ప్రచురణ ఏదీ రాలేదు కాబట్టి, ఆంగ్లంలో వచ్చిన ఇతర నివేదికలలోని విషయాలను కూడ చేర్చి మానవహక్కుల వేదిక విడిగా ఈ ప్రచురణ చేపట్టింది. అయిదు సంస్థల ఉమ్మడి బృందం సేకరించిన సమాచారాన్ని ఈ నివేదికలో వాడుకున్నప్పటికీ ఇందులోని అభిప్రాయాలకు మేము మాత్రమే బాధ్యులం.

## II

## జెనోసైడ్

ఏదయినా ఒక జాతిని నామరూపాలు లేకుండ చేసే ప్రయత్నాన్ని 'జెనోసైడ్' (జాతి హననం) అంటారు. హిట్లర్ నాయకత్వంలోని నాజీలు యూరప్‌లో యూదుల్ని లేకుండ చేయడానికి ప్రయత్నించిన సంగతి తెలిసిందే. ఈ మధ్య కాలంలో బోస్నియాలో మిలోసెవిచ్ హయాంలో స్థానిక ముస్లింలను మొత్తంగానే తుడిచిపెట్టేసే ప్రయత్నం జరిగింది. ఈ రెండు ఘటనల మీద 'అంతర్జాతీయ యుద్ధ నేరాల ట్రిబ్యునల్స్' విచారణ జరిపాయి.

జెనోసైడ్ అనే నేరం ఆ సమాజంలోని బలవంతుల వర్గం బలహీనుల పైన ప్రభుత్వ అధికారం సహకారంతో పాల్పడే నేరం కాబట్టి, దీనికి సహజంగానే ఆ దేశంలో పరిహారం దొరకదు. ఆ హంతకులు తమ నేరాన్ని నేరంగా కాక తమ ధర్మంగానో, తమ జాతికి గొప్ప సేవగానో భావిస్తారు. వారే అక్కడ బలవంతులు కాబట్టి వారికి ఏ చట్టం అడ్డం రాదు, ఏ కోర్టూ శిక్షించదు.

హిట్లర్ పాలనలో యూదుల దుర్గతిని దృష్టిలో ఉంచుకొని, జాతి హననానికి వేరే ఏ జాతీ బలికాకుండ ఉండాలంటే అంతర్జాతీయ ఒత్తిడి తప్ప వేరే ఏ మార్గమూ లేదని భావించిన ఐక్యరాజ్య సమితి, 12 జనవరి 1951న 'జెనోసైడ్ కన్వెన్షన్'ను ప్రకటించింది. దానిపైన సంతకం చేసిన దేశాలలో భారత్ కూడ ఒకటి.

ఈ ఒడంబడికలోని ఆర్టికల్ 2లో జెనోసైడ్‌ను ఈ విధంగా నిర్వచించారు. జాతి, మతం తదితర ప్రాతిపదికల మీద ఒక ప్రజావర్గాన్ని మొత్తంగా గానీ

పాక్షికంగా గానీ రూపుమాపే ఉద్దేశ్యంతో ఆ వర్గానికి చెందినవారిని హతమార్చినా, వారికి తీవ్ర శారీరక మానసిక హాని కలిగించినా, ఆ వర్గాన్ని భౌతికంగా పతనం చేసే జీవన పరిస్థితులు బలవంతంగా కల్పించినా, వారి సంతానోత్పత్తిని నివారించే ఉద్దేశ్యంతో వారిపైన ఆంక్షలు విధించినా, వారి సంతానాన్ని బలవంతంగా వారి నుండి వేరు చేసి అన్యవర్గ ప్రజలకు అప్పగించినా అది జెనోసైడ్ అవుతుంది.

జాతి హననానికి పాల్పడడం, దానికోసం కుట్ర చేయడం, దానిని ప్రోత్సహించడం, అందులో భాగస్వామి కావడం నేరాలని ఈ ఒడంబడికలోని ఆర్టికల్ 3 అంటుంది. దీనిపైన సంతకం చేసిన దేశాలన్నీ ఈ నేరానికి తమ దేశ నేర చట్టాలలో చోటు కల్పించి కఠినంగా శిక్షించాలని ఈ ఒడంబడికలోని ఆర్టికల్ 5 అంటుంది. జాతి హననానికి పాల్పడ్డవారు ఎవరైనప్పటికీ – ప్రైవేట్ వ్యక్తులయినా, ప్రభుత్వ అధికారులయినా – వారిని శిక్షించాలని ఆర్టికల్ 4 అంటుంది.

ఒక దేశంలో జరిగిన జాతి హననాన్ని గురించి ఆ దేశం తగు చర్య తీసుకోకపోతే, ఆ విషయం ఐక్యరాజ్య సమితి దృష్టికి తీసుకొచ్చే అధికారం ఇతర దేశాలకు ఉంటుందని ఆర్టికల్ 8 అంటుంది. (కాబట్టి, గుజరాత్ గురించి ఇతర దేశాలు మాట్లాడడం అభ్యంతరకరం అని భారత ప్రభుత్వం అలగడం జెనోసైడ్ కన్వెన్షన్‌కు విరుద్ధం).

మత ఘర్షణలు జరిగిన సందర్భాలలో 'జెనోసైడ్' అన్న మాట వాడడం – ముఖ్యంగా ముస్లింల వైపు నుండి – గతంలో జరిగింది. సర్దార్ సరోవర్ వంటి ప్రాజెక్టుల వల్ల ఆదివాసులను తమ నివాస స్థలం నుండి పెకిలించి దిక్కులేని వాళ్లను చేయడం 'జెనోసైడ్' కిందికి వస్తుందని వాదించిన వాళ్లు కూడ ఉన్నారు. అయితే ఇవి నినాదాల స్థాయిలో ఉండిపోయాయి. తాము 'జెనోసైడ్'కు గురయ్యామంటూ ఒక చట్టపరమైన వేదికకు ఫిర్యాదు చేసి దాని పైన తీర్పు చెప్పమని మొట్టమొదట కోరినది కాశ్మీర్ పండిట్‌లు. వాళ్లు జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేసి, తమను తమ జన్మస్థలమైన కాశ్మీర్ లోయ నుండి మొత్తంగానే తరిమేసిన హింసాత్మక బలప్రయోగం జాతి హననం కిందికి వస్తుందని తీర్పు చెప్పాలని కోరారు.

ఈ ఫిర్యాదుపైన 1999 జూన్ 11న తీర్పు చెప్పిన జాతీయ మానవహక్కుల కమిషన్ వారి వాదనను అంగీకరించలేదు. కాశ్మీర్ పండిట్‌లకు జరిగింది

తీవ్రమైన అన్యాయమే, మానవహక్కుల అతిక్రమణేనని అంగీకరిస్తూ, అయితే కాశ్మీర్‌ను భారత్ నుండి వేరుచేసే ప్రయత్నంలో భాగంగా వేర్పాటువాదులు ప్రయోగించిన హింసకు పండిట్‌లు బలయ్యారే తప్ప, వాళ్లను కాశ్మీర్ లోయ నుండి తరిమి వేయడమే ఆ హింస లక్ష్యం కాదు కాబట్టి అది జెనోసైడ్ కిందికి రాదని చెప్పింది.

మరి గుజరాత్ సంగతి? ముస్లింలకు ఆ రాష్ట్రంలో పుట్టగతులు లేకుండ చేయడం తప్ప సంఘ్‌పరివార్‌కు వేరే ఏ లక్ష్యమైనా ఉందా?

మొదట విధ్వంసానికి సంబంధించిన గణాంకాలు చూద్దాం. గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వం అంచనాల ప్రకారమే, ఫిబ్రవరి 28 తరువాత పెచ్చరిల్లిన హింసలో 22,515 నిర్మాణాలు (ఇళ్లు, దుకాణాలు, హొటళ్లు, ఫ్యాక్టరీలు వగైరా) పూర్తిగానో పాక్షికంగానో ధ్వంసం అయ్యాయి. అత్యధిక భాగం అగ్నికి ఆహుతి అయ్యాయి. వాటిలోని విలువైన వస్తువులన్నిటినీ తీరికగా లూటీ చేసి ఆ పైన తగలబెట్టారు. షోరూంలపైన, ఫ్యాక్టరీలపైన దాడి చేసినప్పుడు ఆయా రంగాలలో నిపుణులయిన వ్యక్తులను వెంట తీసుకొనిపోయారు – విడిగా తీసి ఎత్తుకుపోగల వస్తువులను ఎత్తుకుపోవడానికి.

ఈ 22,515 నిర్మాణాలూ ముస్లింలవే. వారెవ్వరి మీదా సంఘ్‌పరివార్ మూకలకు వ్యక్తిగత ఆగ్రహం లేదు. 'ముస్లిం'లుగా వారిపైన దాడిచేసారు. వారిని ఆర్థికంగా నాశనం చేయాలి, లేవకుండ దెబ్బతీయాలి అన్నది తప్ప దుండగులకు వేరే లక్ష్యం లేదు. ఈ నష్టం 3,800 కోట్ల రూపాయలు ఉంటుందని ఒక అంచనా. ప్రభుత్వం నుండి ఇప్పటిదాకా దక్కిన నష్టపరిహారం కేవలం 17.6 కోట్ల రూపాయలు. ఇంకొక 8 కోట్లు దక్కవచ్చు. అంటే ఈ విధ్వంసానికి గురయినవారు ఆర్థికంగా మళ్లీ కోలుకోవడం చాలా కష్టం.

ఇంక చావులకాడికి వస్తే, సబర్మతి ఎక్స్‌ప్రెస్‌లో చనిపోయిన 58 మందిని కలుపుకొని, మొత్తం 554 మందిని మృతులుగా గుర్తించినట్టు ప్రభుత్వం ఒప్పుకుంటూ ఉంది. గుర్తించడం అంటే అర్థం శవానికి పోస్ట్‌మార్టం జరిగి ఉండాలి, శవం ఫలాన వ్యక్తి అని గుర్తించి ఉండాలి. అయితే అధిక భాగం హత్యలు సామూహిక దహనకాండ రూపంలో జరిగినప్పుడు, శవాలను గుర్తించడం కష్టం. అటువంటివన్నీ 'మిస్సింగ్' కేసులుగా ప్రభుత్వ రికార్డులలో నమోదయి ఉన్నాయి. మొత్తం మృతుల సంఖ్య 1000 నుండి 2000 దాకా ఉండవచ్చుననేది అంచనా.

వీళ్లందరినీ చంపిన హిందుత్వవాద మూకలకు 'వీరెవ్వరిపైనా వ్యక్తిగత ద్వేషం లేద'నీ, 'దేశం కోసం, సమాజం కోసం, హిందూ మతం కోసం', ఆ పని చేశారనీ విశ్వహిందూ పరిషత్ గుజరాత్ రాష్ట్ర నాయకుడు చినూభాయి పటేల్ అహమ్మదాబాద్‌లోని వ్యాపార వర్గాలకు (డొనేషన్లు కోరుతూ) ఏప్రిల్ 4న రాసిన ఒక లేఖలో అన్నాడు. అంటే ముస్లింలపైన హిందుత్వవాదులు తీర్చుకున్న మూకుమ్మడి ప్రతీకారమే ఈ హత్యాకాండ. ఇది ముస్లింలుగా వాళ్లపైన జరిగిన దాడి.

నిజానికి ఈ హత్యాకాండ మొదలయిన తరువాత దానిని సమర్థించుకునే క్రమంలో అది జెనోసైడ్ తప్ప వేరే ఏమీ కాదని చెప్పకనే చెప్పే పత్రికా ప్రకటనలు, ఆకాశరామన్న కరపత్రాలు చాలా వచ్చాయి. 'కమ్యూనలిజం కాంబాట్' పత్రిక గుజరాతీ నుండి ఇంగ్లీష్‌లోకి అనువదించిన ఒక కరపత్రాన్ని తెలుగులోకి అనువదించి ఇక్కడ ఇస్తున్నాం.

## మేల్కొనండి!... లేవండి!... ఐక్యం కండి!

## ఇటుకలకు రాళ్లతో జవాబు చెప్పండి

ఈ రోజు మైనారిటీ మతం మెజారిటీ మతాన్ని అణచాలని చూస్తున్నది. 50 సంవత్సరాల స్వాతంత్ర్యం తరువాత కూడ తాము హిందుస్తానీలు కానందుకు ముస్లింలు సిగ్గుపడాలి. అయితే వాళ్లు మెజారిటీ మతస్తుల శక్తిని తక్కువగా అంచనా వేస్తున్నారు. ముస్లింలు దేశద్రోహులు – గోధ్రా మారణకాండ, సింధీబజార్ దహనకాండ దీనిని రుజువు చేస్తున్నాయి. ఇప్పటిదాకా ముస్లింలు తమ దేశద్రోహ స్వభావాన్ని కాశ్మీర్‌లో మాత్రమే ప్రదర్శించారు. అక్కడి నుండి ఢిల్లీలోని పార్లమెంటుకు అది పాకింది. ఇప్పుడు గుజరాత్‌నే సవాలుచేసి పెద్ద పొరబాటు చేసారు. ఇక ముస్లింలను హిందువుల నుండి పోలీసులు కాపాడలేరు, సైన్యం కాపాడలేదు, వోట్ల కోసం వారిని బుజ్జగించే రాజకీయ పార్టీలూ కాపాడలేవు.

భారత్ స్వతంత్రమైనప్పుడు ఇక్కడ 3 కోట్ల ముస్లింలు ఉన్నారు. ఇప్పుడు 35 కోట్లున్నారు. అర్థం చేసుకోండి... హెచ్చరికను గ్రహించండి... ఇంక అయిదు పదేళ్లకు మనమెంత మంది ఉన్నామో వాళ్లూ అంతమంది ఉంటారు. ఇది క్రికెట్ టీం కోసం అనుకోకండి – పాకిస్తాన్ ఒక సైన్యాన్ని తయారు చేస్తున్నది.

పోలీసులూ సైనికులారా, మీరూ హిందువులేనని మరచిపోవద్దు. మీ మీద కూడా దాడి జరగగలదు. మీరు కూడ హిందువులకు సపోర్టు ఇవ్వాలి. మేము (హిందువులం) సైన్యాన్నీ పోలీసులనూ పూర్తిగా సపోర్టు చేస్తున్నాం.

నా హిందూ సోదరులారా! ఐక్యం కండి, స్వాతంత్ర్య పోరాటంలో లాగ స్వతంత్ర భారత సైన్యాన్ని తయారు చేయండి. శత్రువును సంహరించండి, దేశం మోస్తున్న పాపభారాన్ని తగ్గించండి.

వట్వా నుండి నరోడా దాకా, బాపునగర్ నుండి కాలుపూర్ దాకా మార్చి 29న పిలుపు వస్తుంది, రాముడి పేరు తీసుకొని దాడిచేయండి. బాబ్రీమసీదును కూల్చినట్టే ముస్లింలను చంపుతాం, జమాల్‌పూర్‌ను తగలబెడతాం, దరియాపూర్‌ను ఖాళీ చేస్తాం, ఏ మియా (ముస్లిం) బస్తీనీ విడిచిపెట్టం.

మేము హిందుస్తానీలము, నిన్ను వెతికి చంపుతాం. ఇది రఘుకుల సంప్రదాయం, దానిని మేము విడువం. సోనియాగాంధీ తన వెంట ఫారూఖ్‌షేఖ్, హాజీబిలాల్ వంటి కుక్కలను తిప్పుకోనీ, వారికి ఎహసాన్ జాఫ్రీకి పట్టిన గతే పడుతుంది. తగలబడిన ముస్లింల దుకాణాల వల్ల ఆకాశం నల్లబారింది.

వారిని నరికి రక్తాన్ని ఏరులుగా పారిస్తాం.

స్వతంత్ర భారత సైన్యం హిందువుల సంఘటన. వేల మంది సోదరులు అందులో చేరారు.

మీరూ చేరండి, హిందుస్తాన్ రక్షణకు మద్దతు ఇవ్వండి.

నరేంద్ర మోడీకి ధన్యవాదాలు. నీకు నమస్కరిస్తున్నాం! సర్దార్ పటేల్ తరువాత మళ్లీ అంతటి హీరో పుట్టాడు.

గుజరాత్ గర్విస్తున్నది. భారత్ ఔన్నత్యం నీ చేతులలో ఉంది. పోలీసులపైన గానీ సైన్యంపైన గానీ రాళ్లు వేయొద్దని ప్రతీ హిందువుకూ విజ్ఞప్తి. వారు మన సోదరులు.

**– ఒక భారతీయుడు**

ఇటువంటి కరపత్రాలు అనేకం గుజరాత్‌లో పంపకం అవుతున్నాయి. ఈ రోజే కాదు, దాదాపు 1991 నుండి ఇది జరుగుతున్నది. గుజరాత్ సమాచార్,

సందేశ్ వంటి దినపత్రికలు ఈ కరపత్రాలను పునర్ముద్రించి వాటికి చాలా విస్తృత ప్రచారం కల్పిస్తూ వచ్చాయి. పై కరపత్రం భావం స్పష్టమే. కాశ్మీర్‌లో జరుగుతున్నదానికి ముస్లింలందరూ బాధ్యులే. డిసెంబర్ 13 నాడు పార్లమెంటుపైన జరిగిన దాడికి ముస్లింలందరూ బాధ్యులే. గోధ్రా దారుణానికీ ముస్లింలందరూ బాధ్యులే. ముస్లింలందరూ పాకిస్తాన్ సైనికులే, దేశద్రోహులే.

ఇవి ఒక పిచ్చివాడి ఆలోచనలు కావు. నరేంద్ర మోడి నుండి ఒక సాధారణ సంఘ్‌పరివార్ కార్యకర్త దాకా అందరి ఆలోచనలూ ఇవే. గుజరాత్‌లోని హిందువులలో బహుశా మెజారిటీ ఆలోచనలు ఇవే.

గుజరాత్‌లోని ముస్లింలలో కులాన్ని పోలిన వ్యవస్థ బలంగా ఉంది. బోహ్రాలు, మెమన్‌లు, మన్సూర్‌లు వ్యాపారస్తులు. ఘూంచి తదితర కులాలు పేదవాళ్లు. ముస్లిం వ్యాపారస్తులను ఆర్థికంగా నాశనం చేసే పథకం గుజరాత్‌లో కనీసం ఒక దశాబ్దకాలంగా అమలులో ఉంది. గుజరాత్ వేరుశెనగ ఉత్పత్తిలో దేశంలోనే ప్రథమ స్థానంలో ఉండేది. వేరుశెనగ నూనె వ్యాపారంలో పంకజ్ ఆయిల్స్ అనే ముస్లిం సంస్థ అగ్రభాగాన ఉండింది. (గుజరాత్‌లో ముస్లింల వ్యాపార సంస్థలకు అరుదుగా తప్ప 'ముస్లిం' పేర్లు వుండవన్న సంగతి తరువాత చూద్దాం.) దానిని నాశనం చేయడానికి పూనుకున్న సంఘ్‌పరివార్ వాళ్లు పంకజ్‌తో ఎటువంటి లావాదేవీలు పెట్టుకోవద్దని హిందూ వ్యాపారస్తులను బెదిరించారు. మాట విననివాళ్ల షాపులు ధ్వంసం చేశారు. ఆ రాష్ట్రంలో ముస్లింల జనాభా కేవలం 8 శాతం కాబట్టి హిందూ వ్యాపారస్తులతో సంబంధం పెట్టుకోకుండా వ్యాపారం సాగించడం పంకజ్ ఆయిల్స్‌కు అసాధ్యం అయింది. అది త్వరలోనే చితికిపోయింది.

అహమ్మదాబాద్‌లో ఎడ్వర్డ్స్ అనే డ్రైక్లీనింగ్ చెయిన్ ఉండింది. దానికి ఆ నగరంలోనే 240 డ్రైక్లీనింగ్ దుకాణాలు ఉండేవి. దాని యజమాని ముస్లిం. అయితే అన్ని దుకాణాలూ ముస్లింలకే ఇవ్వడం సాధ్యంకాక చాలామంది హిందువులకు కూడా కిరాయికి ఇచ్చాడు. ఆ హిందువులందరినీ విశ్వహిందూ పరిషత్ బెదిరించింది. వాళ్లు మాట వినకపోయేసరికి ఏడు దుకాణాలను సంఘ్‌పరివార్ మూకలు ధ్వంసం చేశారు. దానితో అందరూ వదులుకున్నారు. ఆ దెబ్బనుండి 'ఎడ్వర్డ్స్' కోలుకునే లోపల పోటీ డ్రైక్లీనింగ్ సంస్థలు (హిందువులవి) వచ్చేశాయి. మరొక ముస్లిం వ్యాపారస్తుడి యాజమాన్యంలో ఉన్న ఇటాలియన్ హోటళ్ల చెయిన్‌కు కూడా ఇదే గతి పట్టించారు.

ఇదంతా జరిగింది 1990లలో. ఈసారి జరిగిన విధ్వంసకాండలో కూడా ముస్లింల వ్యాపారాలు పెద్దఎత్తున ధ్వంసం అయినాయి. హైవేల మీద హోటళ్లు ఎక్కువగా బో(హ్రా ముస్లింలవి. వాటికి 'ముస్లిం' పేర్లు ఉండవు. సర్వోదయ, ఆశీర్వాద్, ఆశీశ్, పంకజ్, తులసి వంటి పేర్లు ఉంటాయి. ఈ రోజు గుజరాత్‌లో ఏ హైవే మీద ప్రయాణించినా ఈ పేర్లుగల హోటళ్లు తగలబడిపోయి కనిపిస్తాయి. బొంబాయి–అహమ్మదాబాద్, అహమ్మదాబాద్–ఉదయపూర్, అహమ్మదాబాద్–ఇండోర్, ఇండోర్–బరోడా రహదార్ల మీద ఉన్న 1150 హోటళ్లు, ఫ్యాక్టరీలు, షోరూంలను తగలబెట్టారని అంచనా.

ఆర్థికంగా ముస్లింల బతుకులు ధ్వంసం చేయడమేకాక, ఇకమీదట హిందువులెవరూ ముస్లింలతో సామాజిక, ఆర్థిక లావాదేవీలు పెట్టుకోవద్దని తీవ్రంగా ఒత్తిడిపెట్టడం కూడా జరుగుతున్నది. శరణార్థుల శిబిరాల నుండి ధైర్యం చేసి తమ ఊర్లకు పోయిన ఒకటి రెండు కుటుంబాలు ఈ సామాజిక ఆర్థిక బహిష్కరణను ఎదుర్కొనవలసి వచ్చింది. చివరికి దినపత్రికలు కూడా ముస్లింల ఇళ్లలో వేయొద్దని పేపర్లు బట్వాడా చేసే కుర్రవాళ్లకు ఆదేశాలు జారీ అయ్యాయి. గుజరాతీ భాషలోని రెండు ప్రధాన దినపత్రికలూ – గుజరాత్ సమాచార్, సందేశ్ – సంఘ్‌పరివార్ కరపత్రాల వంటివే కాబట్టి 'అవి కూడా మేము చదవకూడదని వీళ్లకింత పట్టింపు ఎందుకో' అని సబర్‌కాంటా జిల్లాలోని హిమ్మత్‌నగర్ శిబిరవాసులు మాతో ఏడవలేక నవ్వుతూ అన్నారు.

ఆర్థికంగా చితకగొట్టి, సామాజికంగా, ఆర్థికంగా బహిష్కరిస్తే ఏమవుతారు? రాష్ట్రాన్ని వదిలిపెట్టయినాపోతారు. లేదా ముస్లిం కుటుంబాలు ఎక్కువ సంఖ్యలో ఉన్న గ్రామాలను, పట్టణాలలోని అటువంటి వాడలను వెతుక్కొని అందరూ అక్కడ చేరుతారు. అప్పుడు వాళ్లమీద నిఘావేసి ఉంచడం సులభం. అక్కడ ఏదో జరుగుతున్నదని వదంతులు ప్రచారం చేయడం సులభం. అటువంటి వాడలకు 'మినీ పాకిస్తాన్' పేరుపెట్టి హిందువులలో మరింతగా ద్వేషం రగిలించడం సులభం.

అహమ్మదాబాద్ నగరంలో ఈ మార్పు ఇప్పటికే కొంతవరకు జరిగిపోయింది. ఆ నగరం నడిబొడ్డున సబర్మతీ నది ప్రవహిస్తుంది. నదికి పడమట ఉన్నది కొత్తగా అభివృద్ధి చెందిన నగరం. విశాలమైన రోడ్లు, పెద్ద భవంతులు, షాపింగ్ కాంప్లెక్స్‌లూ ఉంటాయి. తూర్పున ఉన్నవాళ్లంతా పేదవాళ్లేం కాదుగానీ పడమటి ప్రాంతం మాత్రం సంపన్నుల నగరం. ఒకప్పుడు ఇక్కడ

కూడా ముస్లింలు ఉండేవారు గానీ, ఒక్కొక్క మత ఘర్షణ జరిగినప్పుడు కొన్ని కుటుంబాలు భద్రతను వెతుక్కుంటూ తూర్పుకు పోసాగాయి. వాళ్లను తూర్పుకు తరిమేయడం అహమ్మదాబాద్‌లో 1969 నుండి జరుగుతున్న మత ఘర్షణల లక్ష్యాలలో ఒకటి. 1993 దొమ్మీతో ఇది చాలావరకు పూర్తి అయిపోయింది. ఇంకా కొన్ని ముస్లిం దుకాణాలు, హోటళ్లు మాత్రం మిగిలాయి. ఈసారి వాటిని కూడా తగలబెట్టారు కాబట్టి ఈ సబర్మతీ పశ్చిమతీరం ఇప్పుడు 'హిందూ అహమ్మదాబాద్' అయిపోయింది. అక్కడుండే బ్రాహ్మణ, బనియా, పటేల్ కుటుంబాలు ముస్లింలను చూడకుండా బతకాలన్న వాంఛ చాలావరకు తీర్చుకున్నట్టే.

'చాలావరకు' అని ఎందుకంటున్నామంటే సబర్మతీ పశ్చిమ తీరాన ముస్లింలు నివసించే ఒక్క కాలనీ ఇంకా మిగిలి ఉంది. దాని పేరు పాల్డీ. పాల్డీ నియోజకవర్గం నుండి గత అసెంబ్లీ ఎన్నికలలో పోటీ చేసిన హరేన్ పాండ్య, 'పాల్డీలో ఒక్క ముస్లిం లేకుండా చేస్తాను' అని బహిరంగంగా ప్రచారం చేసుకున్నాడు. చేసుకొని గెలిచి నరేంద్రమోడి ప్రభుత్వంలో రెవెన్యూ మంత్రి అయ్యాడు. మొన్నటి హత్యాకాండలో హంతక మూకలకు ప్రత్యక్షంగా నాయకత్వం వహించిన ఇద్దరు కేబినెట్ మంత్రులలో ఇతను ఒకడు (రెండవ ఘనుడు ఆరోగ్య శాఖామాత్యుడు అశోక్ భట్).

అయినప్పటికీ పాల్డీలో ముస్లిం కుటుంబాలు ఇంకా ఉన్నాయి. ఈసారి జరగబోయే దొమ్మీలో వారిని కూడా నది దాటించే పని పూర్తి చేసేస్తారు. అప్పుడు అహమ్మదాబాద్‌లోని ముస్లింలంతా ఒకటో రెండో 'ముస్లిం' బస్తీలకు పరిమితం అయి బతుకుతారు. జుహాపురా అటువంటి ఒక బస్తీ. 50 వేల జనాభాకు సరిపోయే ఆ బస్తీలో ఇప్పటికే 3 లక్షల మంది జనం ఉంటున్నారని అంచనా. అటువంటి కిక్కిరిసిన మురికివాడలకు ముస్లింలను పరిమితం చేసేస్తే, ఆ వాడలు ఐఎస్ఐ కేంద్రాలనీ, పాకిస్తాన్ ఏజెంట్ల స్థావరాలనీ ప్రచారం చేయడం, హిందుత్వవాదుల విద్వేష రాజకీయాలకు వాటిని కేంద్రాలుగా మలచడం సులభం. ఇది ఇప్పటికే చాలావరకు జరిగిపోయిన పరిణామం.

పాల్డీ నివాసి అయిన మహ్మద్ హసన్ జౌహర్ అనుభవాలను ఇక్కడ చెప్పుకోవడం ఉచితంగా ఉంటుంది. అతను బ్యాంకింగ్ రంగంలో పెద్ద పదవులు నిర్వహించి స్వచ్ఛంద పదవీ విరమణ చేసి ప్రస్తుతం ఒక స్వంత ఐటి సంస్థ పెట్టుకున్నాడు. పుట్టుకరీత్యా హైదరాబాదీ అయిన జౌహర్ 16 సంవత్సరాలుగా అహమ్మదాబాద్‌లో ఉంటున్నాడు. గుజరాతీ ముస్లిం స్త్రీని పెళ్లి చేసుకున్నాడు. ఆ

భార్యాభర్తలు 'సెంటర్ ఫర్ ది ప్రమోషన్ ఆఫ్ రేషనల్ థాట్' అనే హేతువాద సంస్థ నడుపుతున్నారు. అతని మాటలలోనే చెప్పాలంటే, 'హైదరాబాద్ ముస్లింలపైన ఫిర్యాదు చేసినా అర్థం ఉంది. తాము ఒకప్పుడు పాలకులమన్న అహంభావం వారిలో ఉంది. మతవాద రాజకీయాల ప్రభావమూ వారిపైన ఎక్కువే. గుజరాతీ ముస్లింలు అసలు మతవాదులు కారు. కేవలం ముస్లింలుగా వాళ్లను ద్వేషిస్తున్నారు తప్ప వాళ్లమీద వేయడానికి నెపం ఏదీ లేదు'.

తాము ముస్లింలుగా కాక 'ప్రపంచ పౌరులుగా' బతకాలని భావించామని జౌహర్ దంపతులు అంటారు. అందువల్ల ముస్లిమేతరుల మధ్యనే ఇల్లు తీసుకొని ఉండాలని నిర్ణయించుకున్నారు. సబర్మతీ పశ్చిమ తీరాన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) సమీపాన వస్త్రపురాలో ఇల్లు తీసుకుని ఉండేవారు. కానీ అహమ్మదాబాద్‌లో మత ఘర్షణలు ఎప్పుడు జరిగినా హిందువుల మధ్య బతుకుతున్న ముస్లింలను చంపడం విధిగా జరుగుతుండడం వారు గమనించారు. దొమ్మీల సమయంలో ఐఐఎంలోని హిందూ ప్రొఫెసర్ల ఇళ్లలో తాత్కాలికంగా జౌహర్ దంపతులు తలదాచుకునేవారు. 1993లో ఒకసారి ఆ విధంగా జరిగినప్పుడు వాళ్ల కారుపైన పెద్ద అక్షరాలతో 'మియాను నరుకుతాం' అని రాసిపోయారు. అదే సంవత్సరం తమ ఇంటికి సమీపంలోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఒసి) క్వార్టర్స్‌లో ఇతర అధికారుల మధ్యన ఉంటున్న ఒక ముస్లిం అధికారిని నరికి చంపారు. ఇవన్నీ చూసి జౌహర్ దంపతులు వస్త్రపురాలోని ఇల్లు వదిలి పాల్డీకి మారారు. పాల్డీలో కొన్ని ముస్లిం కుటుంబాలు ఉన్నప్పటికీ వాళ్లు రోడ్డు దాటి అవతలికి పోయి హిందువులతో స్నేహం చేయలేరు. ఒకరి ఇంటికి ఒకరు రారు. 'ఇరుగు పొరుగు'గా బతకరు. అందువల్ల వేరే ఏదైనా ఒక కొత్త అపార్ట్‌మెంట్ బిల్డింగ్‌లో ఫ్లాట్ కొనుక్కుందామని జౌహర్ దంపతులు ప్రయత్నం చేశారు. అంతా కుదిరిన తరువాత పేరు చెప్పేటప్పుడు ముస్లిం అని తెలియగానే 'మీకెట్లా అమ్ముతాం, అమ్మలేము' అని బిల్డర్లు, సొసైటీలు నిరాకరించారు. మార్కెట్ రేటుకన్నా 10 శాతం ఎక్కువ ఇస్తామన్నా ఒప్పుకోలేదు. పైగా ఆ బిల్డర్లు జౌహర్‌కు పరాయివాళ్లా అంటే కాదు. సంపన్నులు కలుసుకునే క్లబ్బులలోనూ ఫంక్షన్లకాడ కలుసుకునే మనుషులే. 'నీకు తెలియనిదేముంది – మేము నిస్సహాయులం' అని అతనికి జవాబు చెప్పారు. 'ఇది నిజంగా సంఘ్‌పరివార్ దాడులకు భయపడి చేసే పనా? లేక వాళ్లకే ఇష్టం లేదా?' అన్న ప్రశ్నకు జౌహర్ సూటిగా జవాబు చెప్తాడు. 'వాళ్లకే ఇష్టం లేదు. సగటు గుజరాతీ హిందువుల వైఖరే ఇది. అయితే నెపం నెట్టడానికి భజరంగ్‌దళ్ దొరికింది' అంటాడు.

జౌహర్ దంపతులకు ఒక కుమారుడు ఉన్నాడు. అతనికి అరస్తు అని పేరు పెట్టారు. 'అది ముస్లిం పేరు కాదు. గ్రీకు తత్వవేత్త అరిస్టాటిల్‌ను అరబ్బీ భాషలో అరస్తు అంటారు. ఆ అబ్బాయి ముస్లింగా పెరగకూడదని వారు భావించారు. 'కానీ రేపు మేము పాల్డీ విడిచిపెట్టి జుహాపురాకు పోవలసి వస్తుందేమో. మా కొడుకును మేము కోరుకున్నట్టు పెంచగలమా? హిందువులను ద్వేషించవద్దని నేర్పగలమా?' అనేది ఆ దంపతుల ప్రశ్న.

ముస్లింలను అణచడమే కాకుండా వారిని పూర్తిగా వేరుచేసి ఒక 'ఘెట్టో'లోకి నెట్టేయాలన్నది సంఘ్‌పరివార్ లక్ష్యం. అప్పుడు వారిని దుర్మార్గులుగా, ద్రోహులుగా చిత్రించడం, వారిమీద ద్వేషం పెంచడం చాలా సులభం అవుతుంది. ముస్లింలతో ఏ సంబంధం పెట్టుకోవద్దు, వారిని అన్ని రకాలుగా బహిష్కరించండి అనేది సంఘ్‌పరివార్ సంస్థలు పదేపదే చేస్తున్న హెచ్చరిక. దీనికి రెండు పార్శ్వాలు ఉన్నాయని గుర్తించాలి. ముస్లింలను సామాజికంగా, ఆర్థికంగా బలహీనపరచడం ఒకటి కాగా, వారిని హిందువులకు పూర్తిగా పరాయివాళ్లను చేసి ద్వేషానికి వస్తువులుగా మార్చడం రెండవది.

ఈ రెండవ కారణం కూడా ఉండబట్టే, ముస్లింలతో కలిసి వ్యాపారం పెట్టుకున్న హిందువులను కూడా సంఘ్‌పరివార్ దుండగులు విడిచిపెట్టలేదు. ఉదాహరణకు అహమ్మదాబాద్‌లోని ఒక ఖరీదయిన బట్టల షోరూంలో ముస్లిం పార్టనర్స్ వాటా కేవలం 10 శాతం అయినప్పటికీ దానిని లూటీచేసి తగలబెట్టారు. మరొక హోటల్ (కాపర్ చిమ్నీ) యజమాని అయిన పంజాబీ హిందువు ఈమధ్యనే పెట్టుబడిలో వాటా తీసుకొమ్మని ఒక గల్ఫ్ వ్యాపారిని ఆహ్వానించాడని తెలిసి ఆ హోటల్‌ను తగలబెట్టారు.

ముస్లింలను పెళ్లి చేసుకున్న హిందూ స్త్రీల పట్ల అతిక్రూరంగా ప్రవర్తించారు.

మార్చి 24న గీతా బెహన్ అనే స్త్రీ అహమ్మదాబాద్‌లోని వెజాల్‌పూర్ ప్రాంతంలో తన భర్తతోపాటు స్కూటర్‌పై పోతుండగా హిందూత్వవాద గుజరాతీల గుంపు వారిని అటకాయించింది. ఆమె భర్తను కత్తితో పొడిచి పక్కనే పడేసి, గీతాబెహన్‌ను వివస్త్రను చేసి కత్తులతో నరికి చంపారు. కారణం? ఆమె భర్త ముస్లిం.

మీరాబెహన్ అటువంటి మరొక స్త్రీ. ఆమె సగటు గుజరాతీ మధ్యతరగతి స్త్రీ. రఫీ అనే ముస్లింను పెళ్లి చేసుకుంది. ఇద్దరూ కలిసి లౌకికవాదాన్ని పెంపొందించే

లక్ష్యంతో వివిధ సామాజిక సంస్థలలో పని చేస్తున్నారు. మార్చి 5వ తేదీన ఆమె తన ఇంటి నుండి బయటకు వస్తుండగా, సంఘ్‌పరివార్ మూక ఆమెను అటకాయించింది. ముస్లింను పెళ్లి చేసుకున్నందుకు ఆమెను దూషించింది. ఆమెను అపహరించే ప్రయత్నం చేశారు. ఆమె ఇల్లు దగ్గరే కావడం వల్ల ఇరుగుపొరుగు జోక్యం చేసుకుని ఆమెను కాపాడారు. ఆ తరువాత ఆమెకు బెదిరింపు ఫోన్‌కాల్స్ వచ్చాయి. 'పత్రికలలో కొంచెమే వచ్చింది. ఇంకా చాలా జరగబోతుంది' అని బెదిరించారు. మీరాబెహన్ ఇప్పుడు షాఆలం శరణార్థుల క్యాంపులో వుండి శరణార్థుల బాగోగులు చూసుకుంటూ ఉంది. ఆమె భర్త రఫీ మొత్తంగానే తన మకాంను ఒక ఎన్‌జివో కార్యాలయానికి మార్చాడు. వాళ్లకు స్కూలుకు పోయే కుమార్తె ఉంది. 'స్కూల్లో ఎక్కడయినా నీ తండ్రి ప్రస్తావన వస్తే, పేరు రఫీ అని చెప్పొద్దు, రవి అని చెప్పు' అని మీరాబెహన్ ఆ అమ్మాయిని హెచ్చరించింది.

సంఘ్‌పరివార్ ప్రచార సాహిత్యంలో హిందూ స్త్రీలు ముస్లింల 'మాయ'లో పడిపోకుండా జాగ్రత్తపడాలని చాలా తీవ్ర పదజాలంతో పదేపదే హెచ్చరించడం జరుగుతుంటుంది. మళ్లీ హిందూ మగవాళ్లు ముస్లిం స్త్రీలతో సంబంధం పెట్టుకోకూడదని గానీ, పెళ్ళి చేసుకోకూడదని గానీ ఎక్కడా అనరు. జాతి విద్వేషాలలో ఇది ఎప్పుడూ వుండేదే. స్త్రీల లైంగికత జాతి 'ఐడెంటిటీ'కి సంబంధించిన విషయం అవుతుంది. తమ జాతికి చెందిన మగవాళ్లు పరాయిజాతి స్త్రీతో లైంగికంగా సంబంధం పెట్టుకోవడం ఆ పరాయి జాతి మీద ఒక 'విజయం'గా భావించబడుతుంది. ఆ సంబంధం ఇష్టపూర్వకంగా పెట్టుకున్నదయినా, బలాత్కారమైనా ఫరవాలేదు. బహుశా బలాత్కారమైతే మరింత ఎక్కువ విజయం అవుతుందేమో. అదే రివర్స్‌లో జరిగితే ఈ జాతికి అపజయంగానూ కళంకంగానూ భావించబడుతుంది.

జాతి విద్వేషాలలో మామూలుగా ఉండే ఈ లక్షణం గుజరాత్ దౌర్జన్యకాండలో కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. ముస్లిం బస్తీలపైన దాడి చేసిన సంఘ్‌పరివార్ మూకలు ముస్లిం స్త్రీలపైన సామూహిక అత్యాచారాలకు పాల్పడ్డారు. దాహోడ్ జిల్లాలోని ఫతేపురా గ్రామంలోనయితే దాదాపు ప్రతీ ఇంటిలోనూ స్త్రీలను బయటకు లాగి బహిరంగంగా వివస్త్రలను చేసి అత్యాచారం చేశారు. మరొకవైపు, ముస్లింను పెళ్లి చేసుకున్న హిందూ స్త్రీలను నరికి చంపారు.

ముస్లింలను ఉద్యోగులుగా పెట్టుకోవద్దని కూడా హిందూ షాపు యాజమాన్యాల మీద ఒత్తిడి పెట్టారు. గిరీశ్ పటేల్ అనే చిరకాల మానవ హక్కుల

ఉద్యమకారుడు మాతో మాట్లాడుతూ ఒక ఉదంతం చెప్పాడు. అతని అల్లుడి షాపుకు కొందరు సంఘ్‌పరివార్ కార్యకర్తలు వచ్చి నీ దగ్గరున్న ఉద్యోగుల లిస్టు చూపించమని అడిగారు. అతను లిస్టు ఇయ్యగానే అందులోని మూడు ముస్లిం పేర్లు కొట్టేసి, ఇకమీదట వీరిని పనిలో పెట్టుకోవద్దని హెచ్చరించి వెళ్లిపోయారు.

ముస్లింలను ఒక వర్గంగానే నష్టపరచడం కోసం రేప్ చేయడం, చంపడం, ఆర్థికంగా హాని కలిగించడం, సామాజిక ఆర్థిక బహిష్కరణ ద్వారా వెలివేయడం, నిలువ నీడలేకుండా నివాసాలు దహనం చేయడం, వారికి ఉద్యోగాలు, వ్యాపార అవకాశాలు దక్కకుండా చేయడం – ఇదీ గుజరాత్ దౌర్జన్యకాండ స్వభావం. ఇది కచ్చితంగా జెనోసైడ్ కిందికే వస్తుంది.

# III

## గోధ్రా

ఫిబ్రవరి 27న గోధ్రా రైల్వే స్టేషన్ దగ్గర సబర్మతీ ఎక్స్‌ప్రెస్‌లోని ఎస్–6 కోచ్‌ను స్థానిక ముస్లిం గుంపు తగలబెట్టి 58 మందిని సజీవంగా దహనం చేయడం గుజరాత్ అల్లర్లకు నాంది అనేది సర్వత్రా ఉండే అభిప్రాయం. ఆ మారణకాండను మొదట చర్చించి ఆ తరువాత దాని పేరు మీద హిందుత్వవాదులు పాల్పడిన హింసాకాండకు వద్దాం. గోధ్రా పంచ్‌మహల్స్ జిల్లా కేంద్రం. ఆ ఊరిలో హిందువులు, ముస్లింలు చెరిసగం ఉంటారు. 1912 నుండి ఆ ఊరిలో మత ఘర్షణలు అడపాదడపా జరుగుతూనే ఉన్నాయి. గుజరాత్ రాష్ట్రంలోని ప్రధాన మత ఘర్షణల కేంద్రాలలో ఒకటిగా గోధ్రా పేరు పొందింది. 1980లో జరిగిన ఘర్షణలలో ఈ ఊరిలో 365 రోజులు కర్ఫ్యూ ఉండింది. గోధ్రాలో మేము స్థానిక ముస్లింలతోనే కాక, విశ్వహిందూ పరిషత్ పంచ్‌మహల్స్ జిల్లా కార్యదర్శి బిపిన్ భాయి రాథోడ్‌తోనూ మాట్లాడాము. అంతేకాక, రాష్ట్రంలో ఎక్కడకుపోయినా ఎవరితో మాట్లాడినా గోధ్రా గురించి ఏదో ఒక అభిప్రాయం వినబడుతుంది.

స్థూలంగా మూడు రకాల అభిప్రాయాలు ఉన్నాయి. ఒకటి విశ్వహిందూ పరిషత్ అభిప్రాయం. బిపిన్‌భాయి రాథోడ్ ఏమంటాడంటే, రామ సేవకుల మీద కక్షగట్టి ముస్లింలు వాళ్లను ఎట్లాగయినా చంపాలని ముందే నిర్ణయించుకున్నారు. 27వ తేదీన అహమ్మదాబాద్ వైపు వస్తున్న సబర్మతీ ఎక్స్‌ప్రెస్‌లో రామసేవకులు పెద్దసంఖ్యలో ఉన్నారని వాళ్లకు తెలుసు. అందువల్ల ఆ రైలుపైన దాడిచేసి వారిని

హతమార్చాలని ముందుగానే పథకం వేసుకున్నారు. దానికి గోధ్రానే ఎందుకు ఎంచుకున్నారు? అన్న ప్రశ్నకు బిపిన్‌భాయి 'ఎక్కువమంది ముస్లింలు నివసించే బస్తీలోనుండి రైలు ప్రయాణించే చోటు దేశంలో వేరే ఎక్కడా లేదు కాబట్టి' అని తడబడకుండా జవాబు చెప్తాడు (అది నిజమా అని మీరు తర్కించకూడదు. అతనికి గానీ విశ్వహిందూ పరిషత్‌కు గానీ ఈ దేశంలో రైళ్లు ఎక్కడెక్కడ ఏయే బస్తీల నుండి ప్రయాణిస్తాయని తెలుసుననుకోవడం మన తెలివి తక్కువతనం అవుతుంది. అందరు ఫాసిస్టుల లాగా సంఘ్‌పరివార్ ఫాసిస్టులు కూడా వాస్తవాల నుండి అభిప్రాయాలు ఏర్పరచుకోరు, అభిప్రాయాల నుండి వాస్తవాలు నిర్ధారిస్తారు). ఈ విధంగా తయారుగా ఉన్న గోధ్రా ముస్లింలు, రైలు గోధ్రాకు రావడానికి 15 నిమిషాల ముందు పాకిస్తాన్‌కు ఫోన్‌చేసి తాము చేయబోతున్న ఘనకార్యం వివరించి చెప్పి ఓకే చేయించుకున్నారని బిపిన్‌భాయి అంటాడు. ఇది మీకెట్లా తెలుసునంటే వాళ్లు ఏ నంబర్‌కు ఫోన్ చేశారో కూడా తెలుసునంటాడు. ఈ విషయం మరి ఏ పేపర్‌లోనూ రాలేదు కదా అంటే 'పాంచజన్యలో వచ్చింది – చూడలేదా' అని ఆశ్చర్యంగా అడుగుతాడు. సత్యానికి ప్రమాణమైన 'పాంచజన్య' చదవని మూర్ఖులు ఈ ప్రపంచంలో ఉన్నారా అన్నట్టు చూస్తాడు.

అరెస్టయి జైలులో ఉన్న ముస్లింల కుటుంబాలు, బంధువులు వేరే కథ చెప్తారు. సబర్మతీ ఎక్స్‌ప్రెస్‌లోని ఎస్–6 డబ్బాలో రామసేవకులే కాక ఇతర ప్రయాణీకులు కూడా ఉన్నారు. వారిలో అయిదారుగురు ముస్లింలు కూడా ఉన్నారు. దారి పొడవునా ముస్లింలను సతాయిస్తూ వస్తున్న రామసేవకులు వారితో గొడవపడి, చివరికి రైలులోనే వారిని చంపేశారు. చంపిన తరువాత తమ నేరాన్ని కప్పిపెట్టుకోవడానికి వారే ఆ బోగీని తగలబెట్టారని వీళ్లు అంటారు. అదే నిజమైతే మరి వాళ్లు కూడా అందులోనే ఉండి ఎందుకు తగలబడి చనిపోయారనే ప్రశ్నకు జవాబు లేదు.

నిజం ఏమిటనేది ఇక్కడ వివరంగా తర్కించే బదులు, ఆ విషయం మాకు ఒక గంటసేపు వివరించిన గోధ్రాకు చెందిన గైనకాలజిస్టు డా. ఘుజాత్ వలీ అభిప్రాయాలను మీ ముందు ఉంచుతాము. డా. వలీ, అతని భార్య డా. షర్మిలా వలీ గోధ్రాలోని ఒకే ప్రైవేటు ప్రసూతి వైద్యశాల నడుపుతారు. వాళ్లు బోహ్రా ముస్లింలు, అభ్యుదయవాదులు. గోధ్రా రైల్వే స్టేషన్ సమీపంలోని సిగ్నల్ ఫాలియా అనే బస్తీకి చెందిన కొందరు ముస్లింలు ఈ దారుణానికి పాల్పడ్డారనీ, అయితే అది అప్పటికప్పుడు జరిగిన ఘటనే తప్ప ముందుగా పథకం వేసుకున్న కుట్ర కాకపోవచ్చుననీ, కరసేవకులు అహమ్మదాబాద్ నుండి గోధ్రా మీదుగా

అయోధ్యకు వస్తూపోతూ గోధ్రా రైల్వేస్టేషన్‌లోని ముస్లిం వెండర్లను విపరీతంగా సతాయించడం, ఒక అమ్మాయిని అపహరించడానికి ప్రయత్నించడం వారికి ఆగ్రహం కలిగించిందనీ ఆయన అంటాడు. నేరాన్ని పరిశోధించిన స్థానిక రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ పోలీసుల అభిప్రాయం కూడా అదే కావడం గమనార్హం.

రామసేవకులు అయోధ్యకు పోతూ వస్తూ మార్గమధ్యంలో సాధారణ ప్రజలను, ప్రత్యేకించి ముస్లింలను సతాయించడం కొత్త సంగతి కాదు. వీళ్లు 1990లో అయోధ్యకు ఇటుకల బట్వాడా ప్రారంభించినప్పటినుండి ఇది జరుగుతూనే వుంది. రైలులోని ముస్లింల చేత బలవంతంగా 'జైశ్రీరాం' అనిపించడం, ముస్లిం వెండర్ల దగ్గర కొనుక్కున్న వస్తువులకు డబ్బులియ్యకపోవడం, గడ్డంపట్టి లాగడం, బురఖాలు గుంజడం, రైలు ఆగినచోట ప్లాట్‌ఫారం మీద చిందులు వేయడం – పది సంవత్సరాలకు పైగా ఈ తంతు దేశమంతటా జరుగుతూనే ఉంది. భారతీయ రైల్వేవారు ఈ భారతీయుల ప్రవర్తనను అదుపు చేసే ప్రయత్నం ఏ రోజూ చేయలేదు.

ఫిబ్రవరి 24న (అంటే గోధ్రా మారణకాండకు మూడు రోజుల ముందు) అదే సబర్మతీ ఎక్స్‌ప్రెస్‌లో అయోధ్య సమీపంలో ఈ రామసేవకులు ప్రవర్తించిన తీరు గురించి అయోధ్య నుండి ప్రచురితమయ్యే జనమోర్చా అనే హిందీ పత్రిక ఈ విధంగా రాసింది. (కమ్యూనలిజం కాంబాట్ చేసిన ఆంగ్ల అనువాదానికి తెలుగు అనువాదం):

> భేల్సార్ (ఫైజాబాద్ జిల్లా), 24 ఫిబ్రవరి: సబర్మతీ ఎక్స్‌ప్రెస్‌లో అయోధ్యకు పోతున్న త్రిశూలధారులయిన బజ్రంగ్‌దళ్ కార్యకర్తలు ఈ రోజు పొద్దున్న ముస్లిం ప్రయాణీకులనూ, బురఖాలు ధరించిన స్త్రీలనూ, పసిపిల్లలనూ భయోత్పాతానికి గురిచేశారు. ప్లాట్‌ఫారం మీద నిలబడ్డ వాళ్లను బెదిరించి 'జైశ్రీరాం' అన్న నినాదాలు బలవంతంగా ఇప్పించారు. వాళ్ల దాడికి తట్టుకోలేక కొంతమంది తాము హిందువులమని ప్రకటించుకోవలసి వచ్చింది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం లక్నో వైపునుండి వస్తున్న సబర్మతీ ఎక్స్‌ప్రెస్‌లో ఉన్న 2000 మంది త్రిశూలధారులైన బజ్రంగ్‌దళ్ కార్యకర్తలు దర్యాబాద్ రైల్వేస్టేషన్ దాటినప్పటినుండి ఈ పనులు మొదలుపెట్టారు. రైలులోని ముస్లింలపైన త్రిశూలాలతో దాడి చేశారు. ఇనుప

> రాడ్లతో కొట్టారు, స్త్రీలనూ పసిపిల్లలనూ కూడా వదిలిపెట్టలేదు. బురఖాలు లాగి రాడ్లతో కొట్టారు. ప్లాట్‌ఫారం మీద నిలబడ్డ వాళ్లకు కూడా అదే గతి పట్టించారు.
>
> దర్యాబాద్ నుండి రుడౌలీ స్టేషన్ దాకా ఇది నడిచింది. వాళ్ల ప్రవర్తన పట్ల అభ్యంతరం చెప్పిన ఒక యువకుడిని పాత్రంగా, రోజాగామ్ స్టేషన్ల మధ్య బలవంతంగా రైలు నుండి తోసేశారని ప్రత్యక్ష సాక్షుల కథనం. పొద్దున్న 8 గంటలకు రుడౌలీ స్టేషన్‌లో రైలు ఆగగానే రక్తాలు కారుతున్న స్త్రీలు చాలామంది బండినుండి దిగిపోయారు. బజ్రంగ్‌దళ్ కార్యకర్తలు కూడా రైలు దిగి, ప్లాట్‌ఫారం మీద ఉన్న వాళ్లలో ముస్లింలుగా గుర్తించిన వాళ్లను కొట్టసాగారు.
>
> అలహాబాద్‌కు పోయే రైలు కోసం కాచుకున్న టాకియాఖైరాన్‌పూర్‌కు చెందిన ఆటా మహమ్మద్‌ను విపరీతంగా కొట్టారు. మరికొందరిచేత బలవంతంగా 'జైశ్రీరాం' అన్న నినాదం ఇప్పించారు. కొందరు తాము హిందువులమని చెప్పుకొని తప్పించుకున్నారు. స్టేషన్ సమీపంలో నివసించే మహమ్మద్ అక్బర్ అనే 50 ఏళ్ళ వయసున్న వ్యక్తి ఆ సమయంలో ఇంటినుండి బయటకు రాగా అతని గడ్డం పట్టుకుని గుంజి త్రిశూలాలతో పొడిచారు. స్థానిక ప్రజలు పోలీసులకు ఫోన్ చేశారు.

ఈ వార్త ఫిబ్రవరి 27 కంటె రెండు రోజులు ముందే ప్రచురితమయిందని గమనించాలి. పైగా గుజరాత్‌లో కాదు, ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో ప్రచురితమయింది. ఈ పత్రిక (జనమోర్చా) సంపాదకుడు శీతల్ ప్రసాద్ ముస్లిం కాదు. ఏ రకంగా చూసినా ఇది గోధ్రా మారణకాండను సమర్థించడం కోసం కల్పించిన వార్త అనడానికి వీలులేదు.

ఫిబ్రవరి 27న దాడికి గురైన సబర్మతీ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణించిన రామసేవకులు కూడా దారిపొడవునా ముస్లిం ప్రయాణీకులను, ప్లాట్‌ఫాం మీద ఉన్న వారిని తీవ్రంగా సతాయించారు. అదే రైలులో ఫైజాబాద్ నుండి అహమ్మదాబాద్‌కు ప్రయాణించిన అక్బర్‌బేగ్ సిరాజుద్దీన్ షా 'గుజరాత్ టుడే' అనే పత్రిక ప్రతినిధితో మాట్లాడుతూ 'ఈ కరసేవకులు రైలు ఎక్కిన క్షణం నుండి

ముస్లింలను తిట్టడం, కొట్టడం, వాళ్ల నుదుట తిలకం దిద్ది 'జైశ్రీరాం' అని నినాదం ఇమ్మని పీడించడం మొదలుపెట్టారు. ఒక ముస్లిం స్త్రీ ఆ నినాదం ఇవ్వడానికి నిరాకరించగా వాళ్లు చెయిన్ గుంజి ఆమెనూ ఆమె భర్తనూ బలవంతంగా రైలు నుండి దింపేశారు. ప్రతీ స్టేషన్‌లోనూ దిగి ఫ్లాట్‌ఫారం మీద చిందులు వేశారు' అన్నాడు.

ఆ రైలులో దాదాపు 1200 మంది కరసేవకులు ప్రయాణిస్తున్నారని 'ది హిందూ' దినపత్రికకు స్థానిక రైల్వే అధికారులు చెప్పినట్టు ఆ పత్రిక రాసింది. దారి పొడవునా వారు ఇతర ప్రయాణీకులను వేధిస్తున్నారని అధికారులు చెప్పినట్టు టైమ్స్ ఆఫ్ ఇండియా కూడా రాసింది. రైలు జనరల్ కంపార్ట్‌మెంట్‌లోనే కాక, ఎస్–5, ఎస్–6 బోగీలలో కూడా కరసేవకులు పెద్దసంఖ్యలో ఎక్కారు. 66 మంది బెర్తులు బుక్ చేసుకున్న ఎస్–6 కోచ్‌లో 150 మందిదాకా ప్రయాణించారు. కరసేవకులు సీట్ల మీద కూర్చోగా రిజర్వేషన్ చేయించుకున్న ప్రయాణీకులు కొందరు నేలమీద పడుకోవలసి వచ్చింది. రత్లాం జంక్షన్‌లో ఎస్–6లోకి డ్యూటీలో ఉన్న టిటిఇ ఎక్కబోగా, కరసేవకులు అతన్ని ఎక్కనివ్వలేదు.

ఇదే గుంపు కొద్దిరోజుల క్రితం అయోధ్యకు పోతూ గోధ్రాలో రైలు ఆగినపుడు ఫ్లాట్‌ఫారం మీది ముస్లిం వెండర్స్‌తో గొడవ పెట్టుకున్నారు. అవమానకరంగా మాట్లాడారు, తీసుకున్న చాయ్‌కి డబ్బులు ఇవ్వకుండా సతాయించారు. తిరుగు ప్రయాణంలో రైలు గోధ్రా స్టేషన్‌లో ఆగగానే కరసేవకులకూ వెండర్లకూ మధ్య గొడవ మొదలయింది. గోధ్రా రైల్వే ఫ్లాట్‌ఫారం మీద వెండర్లూ వారి సహాయకులూ కలిసి 250 మంది దాకా ఉంటారు. మినహాయింపు లేకుండా అందరూ ఘాంచీ కులానికి చెందిన పేద ముస్లింలు.

ఈ విషయాలన్నీ కూడా పోలీస్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆగ్జా ఫిబ్రవరి 28న ప్రాథమిక దర్యాప్తు చేసిన తరువాత పత్రికలకు చెప్పినవే. ఈ కారణాలన్నీ కలిసి రైలుపైన దాడికి దారితీశాయే తప్ప ముందుగా వేసుకున్న పథకమేమీ లేదని ఆయన ఆ రోజే అన్నాడు.

అయితే బోగీ తగలబెట్టింది ఎవరు? రైలు ఫ్లాట్‌ఫారం మీద ఆగిన తరువాత కరసేవకులు వెండర్లతో ఘర్షణపడడమే కాక, తన తల్లితోబాటు, అక్కతోబాటు బరోడా పోయే రైలుకోసం కాచుకుని ఉన్న సోఫియా అనే ముస్లిం యువతిని పట్టుకుని బలవంతంగా రైలు ఎక్కించే ప్రయత్నం చేశారు. ఆమె తల్లి జైతున్ బీబీ ఈ విషయం ఆ తరువాత బరోడాలో చాలామందికి చెప్పింది. సోఫియా

తప్పించుకుంది గానీ ఆమెను కరసేవకులు అపహరించారన్న వదంతి ఫ్లాట్‌ఫారం మీద వేగంగా పాకింది.

ఆ తరువాత ఏం జరిగిందనేది ఎవరూ స్పష్టంగా చెప్పలేకపోతున్నారు. మొదట ఎవరో చెయిన్ గుంజడం వల్ల రైలు ఒకసారి ఆగింది. చెయిన్ జనరల్ డబ్బా నుండి గుంజారని రైల్వేవాళ్లు అంటున్నారు. సోఫియాను బలవంతంగా రైలు ఎక్కించారన్న అనుమానంతో కదులుతున్న రైలు ఎక్కిన ముస్లిం యువకులెవరైనా గుంజారా? లేకపోతే ఈ గొడవతో ఏమీ సంబంధం లేని వేరే ప్రయాణీకులెవరైనా గుంజారా?

ఎలా జరిగినా గాని ఆ తర్వాత ఏ గొడవా జరగకుండానే రైలు ముందుకు పోయింది. అయితే ఒక కిలోమీటరు పోయిన తరువాత, సిగ్నల్‌ఫాలియా బస్తీ మధ్య చెయిన్ మళ్లీ ఎవరో గుంజారు. సిగ్నల్‌ఫాలియా బస్తీ అధికంగా ఘాంచీ ముస్లింలు నివసించే బస్తీ. గోధ్రా రైల్వేస్టేషన్‌లోని వెండర్లలో అధిక భాగం ఈ బస్తీవాసులే. స్టేషన్‌లో జరిగిన గొడవ తరువాత వెండర్లలో కొందరు కావాలనే రైలెక్కి తమ బస్తీ దగ్గర చెయిన్ గుంజి వుండవచ్చు. అసలు ఆ రైలులో క్యాన్లు పట్టుకుని టీ అమ్మే చాయ్‌వాలాలు చాలామంది (గోధ్రావాసులు కాకపోయినా) ఘాంచీ కులానికి చెందిన ముస్లింలే కాబట్టి వాళ్లలో ఎవరైనా కావాలని సిగ్నల్‌ఫాలియా బస్తీ సమీపించగానే చెయిన్ గుంజి ఉండవచ్చును.

ఏమయితేనేం, ముస్లిం బస్తీ అయిన సిగ్నల్‌ఫాలియా మధ్య సబర్మతి ఎక్స్‌ప్రెస్ ఆగింది. క్షణాల మీద బస్తీనుండి పెద్దసంఖ్యలో ముస్లింలు రైలు దగ్గర చేరారు. ఎస్-6 కోచ్ మీద దాడిచేశారు. రాళ్లతో, ఇనుప రాడ్లతో కొట్టారు. కరసేవకులు కిటికీలు, తలుపులు వేశారు. మధ్యమధ్యలో కొన్ని రాళ్లు దొరికిచ్చుకుని వాళ్లు కూడా వెనక్కి విసిరారు. రైలులోని ప్రయాణీకులు విపరీతమైన భయానికి గురయ్యారు. కొంతసేపటికి బస్తీవాసులు అక్కడున్న గ్యారేజ్‌లోని డీసెల్‌లో బట్టలు తడిపి రైలు బోగీలోకి విసిరారు. పెట్రోలు ప్యాకెట్లు కూడా బోగీ మీదికి విసిరారని కొందరు అంటారు. డీసెల్, లేక పెట్రోల్ బోగీలో పోశారని కూడా ప్రాణాలతో బయటపడ్డ ఒక వ్యక్తి అన్నాడు.

ఆ తరువాత పెట్రోలుతో, డీసెల్‌తో తడిసిన బోగీకి నిప్పుపెట్టారు. క్షణాలమీద అది తగలబడి 58 మంది చనిపోయారు. అందులో 24 మంది స్త్రీలు, 12 మంది పిల్లలు, ముగ్గురు ముస్లింలు కూడా వున్నారు. 58 మందిలో 33

మంది కరసేవకులని అంటున్నారు కాబట్టి (అది నిజమయితే) స్త్రీలలో కొందరు కరసేవకులయి వుండాలి. మిగిలినవారు సాధారణ ప్రయాణీకులయి వుండాలి.

ఈ దాడి పథకం ప్రకారం జరగలేదనీ, అప్పటికప్పుడు జరిగిందనీ పైన అన్నాము. ఆ విషయానికి అంత ప్రాధాన్యం ఎందుకివ్వాలి అని అడగవచ్చు. పథకం ప్రకారం జరిగినా, ఆవేశంలో జరిగినా రైలు బోగీని తగలబెట్టిన వారికి బోగీలోని సాధారణ ప్రయాణీకుల ప్రాణాలు కూడా పోతాయని తెలిసే వుండాలి. అందువల్ల బోగీలోని కొందరు ప్రయాణీకుల మీద కోపంతో అందరినీ సజీవంగా దహనం చేయడం, అందులో పసిపిల్లలను కూడా చంపడం క్షమించరాని నేరం.

అయితే గోధ్రా మారణకాండ ఒక పథకం ప్రకారం రామభక్తులపైన ముస్లింలు జరిపిన హంతక దాడి అని రాష్ట్ర ప్రభుత్వం పనిగట్టుకుని చేసిన ప్రచారానికి తరువాతి మారణకాండలో ప్రముఖ పాత్ర ఉండింది కాబట్టి, రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయానికి ఎప్పుడు వచ్చింది, ఎట్లా వచ్చింది అన్న ప్రశ్న వేసుకోవాలి. పోలీస్ ఇన్స్‌పెక్టర్ జనరల్ ఆగ్జీ ఆ ఘటన కాకతాళీయంగా జరిగిందే తప్ప పథకం ప్రకారం జరిగింది కాదని 28వ తేదీనే పత్రికలకు చెప్పిన సంగతి చూశాం. పంచమహల్స్ జిల్లా కలెక్టర్ జయంతి రవి కూడా 27వ తేదీన అదే మాట అన్ని పత్రికలతోనూ, టి.వి. ఛానెల్స్‌తోనూ అన్నారు. ఆమె ఎక్కడో దూరాన ఉండి ఈ మాట అనలేదు. ఆ రోజంతా ఆమె గోధ్రాలోని ఇరువర్గాల ప్రముఖులతోనూ పదే పదే మాట్లాడి, రాష్ట్రమంతా తగలబడుతుండగా గోధ్రా పట్టణంలో మాత్రం ఒకటి రెండు చిన్న ఘటనలు మినహాయించి ఏమీ జరగకుండా చూడగలిగింది.

బాధ్యతగల స్థానిక అధికారులిద్దరూ ప్రాథమిక దర్యాప్తు ఆధారంగా ఈ అభిప్రాయం వ్యక్తం చేశారు. నేరపరిశోధన ముగిసిన తరువాత రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ పోలీసులు కూడా మే నెల మొదటి వారంలో అదే అభిప్రాయాన్ని ధృవీకరించారు.

కానీ ఫిబ్రవరి 27 సాయంత్రం నరేంద్రమోడి, అతని కేబినెట్ సహచరులు 'గోధ్రా ఒక పథకం ప్రకారం జరిగిన దాడి' అని బహిరంగంగా ప్రకటించడం మొదలుపెట్టారు. ఏ ఆధారమూ లేకుండా, స్థానిక అధికారుల అభిప్రాయాలకు విరుద్ధంగా, ముఖ్యమంత్రి స్వయంగా 27వ తేదీ సాయంత్రం నుండి చేసిన ఈ ప్రకటన, రాష్ట్ర వ్యాపితంగా ముస్లింల పట్ల హిందువులలో ద్వేషాన్ని రెచ్చగొట్టింది.

అప్పటికే మారణకాండకు తయారుగా వున్న సంఘపరివార్ మూకలకు మంచి సాకు ఇచ్చింది. కరసేవకుల అహంభావానికి గోద్రా స్టేషన్ వెండర్ల దురుసుతనం చెప్పిన దారుణమైన జవాబుగా మిగిలిపోవలసిన ఘటన, హిందువులపైన ముస్లింల యుద్ధ ప్రకటనగా మారి భయంకరమైన ప్రతీకారానికి పీఠిక అయింది.

జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన రిపోర్టు చూస్తే, ఆ ప్రభుత్వం వైఖరి ఎంత అసంబద్ధమైనదో అర్థం అవుతుంది. గోద్రా మారణకాండ 'ముందుగా వేసుకున్న పథకం ప్రకారం జరిగింది' అని నరేంద్ర మోడి ప్రభుత్వం ఆ నివేదికలో అనింది. అంటే రామసేవకులు పెద్దసంఖ్యలో ఆ రోజు సబర్మతీ ఎక్స్‌ప్రెస్‌లో వెనక్కి వస్తున్నారని గోద్రా ముస్లింలకు తెలిసి ఉండాలి, తెలిసి పథకం వేసుకొని ఉండాలి. కానీ 'అంతమంది కరసేవకులు ఆ రైలులో వస్తున్నారని తెలిసి, ఘర్షణలు జరిగే అవకాశం వుందని తెలిసి, రైలులోగానీ, ఫ్లాట్‌ఫారం మీదగానీ బందోబస్తు ఎందుకు పెట్టలేదు' అన్న మానవ హక్కుల కమిషన్ ప్రశ్నకు జవాబుగా, 'వాళ్లు ఆ రోజు రైలులో వస్తున్నట్టు ప్రభుత్వానికి ఇంటిలిజెన్స్ సమాచారం లేదు' అనింది. 'ఫిబ్రవరి ఆఖరివారంలో అయోధ్యకు పోయిన కరసేవకులు మార్చి 10-15 మధ్య తిరిగి వస్తారని మాకు ఇంటిలిజెన్స్ సమాచారం ఉండింది గానీ ఫిబ్రవరి 27నే తిరిగి వస్తారని మాకు సమాచారం లేదు' అనింది.

మరి పోలీసు ఇంటిలిజెన్స్‌కే తెలియని విషయం గోద్రాలోని గరీబు ముస్లింలకు ఎట్లా తెలిసింది? వాళ్లు ముందే పథకం ఎట్లా వేసుకున్నారు?

# IV

## మారణకాండ కు పథకం

గోద్రా మారణకాండ ఒక పథకం ప్రకారం జరగలేదని అన్నాము. కానీ ఫిబ్రవరి 28 నుండి సంఘపరివార్ ఆధ్వర్యంలో జరిగిన మారణకాండ మాత్రం ఒక పథకం ప్రకారం జరిగిందనే అంటున్నాం. అంటే ఫిబ్రవరి 28 నుండే దొమ్మీ మొదలుపెట్టాలని వారు పథకం వేసుకోలేదు. ఆ అవకాశం గోద్రా మారణకాండ వాళ్లకిచ్చింది. గుడి కట్టడానికి ఆఖరి తేదీగా వాళ్లు ప్రకటించిన మార్చి 15 లోపల ఏరోజు అవకాశం వచ్చినా ముస్లింలపైన దాడి చేయడానికి కావలసిన తయారీ పూర్తిగా చేసుకున్నారు. మార్చి 15 లోపల ఏ అవకాశం రాకపోతే, మార్చి 15న గుడి కట్టలేకపోయిన కడుపుమంటను ముస్లింలపైన దాడిచేసి (వాళ్లను

'బుజ్జగించడం' కోసమే కదా ప్రభుత్వాలూ కోర్టులూ తమను గుడి కట్టనివ్వడం లేదు?) చల్లార్చుకుందురు.

దీనిని రుజువు చేయడానికి మేము పెద్దగా కష్టపడనక్కరలేదు. సంఘ్‌పరివార్ నాయకుల మాటలే రుజువు చేస్తాయి. విశ్వహిందూ పరిషత్ గుజరాత్ రాష్ట్ర ఛైర్మన్‌గా పిలవబడే కె.కా. శాస్త్రి (కేశవరాం కాశీరాం శాస్త్రి) రీడిఫ్.కాం కు ఇచ్చిన ఇంటర్వ్యూలో అన్ని సంగతులూ ఒప్పేసుకున్నాడు. 90 సంవత్సరాలు పైబడిన ఈ బ్రాహ్మణ పండితుడి రక్తదాహం చూస్తే గుజరాతీ హిందువుల మనోభావాలు బాగా అర్థం అవుతాయి.

అవును, మావాళ్లే చేశారు అన్నాడు. అలగా జనం కాదు, మంచిమంచి కుటుంబాల కుర్రవాళ్లు చేశారు అన్నాడు. కొంచెం అతిచేస్తే చేసి ఉండవచ్చును – కానీ మావాళ్లు కదా, వాళ్లను తప్పెట్లా పడతాం? అన్నాడు. విషసర్పాలు కానివి కూడ శత్రువును భయపెట్టడానికి అప్పుడప్పుడు బుసకొడుతుండాలి అన్నాడు. శాస్త్రాలు ఈ హింసను ఒప్పుకోవు కదా అంటే కొన్ని విషయాలు శాస్త్రాలలో బాగానే ఉంటాయి అన్నాడు. ఇది దొమ్మీ కాదు, హత్యాకాండ కాదు, తిరుగులేని ఉప్పెన, ఎవరూ ఆపలేని ఉప్పెన అన్నాడు. పోలీసులు కూడా హిందువులే కాబట్టి మావాళ్లు చేస్తుంటే చేసుకోనీలే అని ఊరుకున్నారు అన్నాడు.

అన్నిటికంటే ముఖ్యంగా, ధ్వంసం చేయవలసిన ముస్లింల దుకాణాలు, కార్యాలయాల జాబితా ఫిబ్రవరి 28 పొద్దున్నే తయారు చేశాం అన్నాడు. ఎప్పటినుండో సమాచారం సేకరించనిదే అప్పటికప్పుడు జాబితా ఎట్లా తయారు చేస్తారు? పైన చెప్పినట్టు, గుజరాత్‌లో ముస్లింల దుకాణాలకూ వ్యాపారాలకూ ఉర్దూ, అరబిక్ భాషల నుండి వచ్చిన పేర్లు ఉండవు. గుజరాతీ పేర్లే ఉంటాయి. బోర్డు ఉర్దూలో రాయరు. గుజరాతీలోనే రాస్తారు. నిజానికి గుజరాతీ ముస్లింలలో దాదాపు ఎవ్వరికీ ఉర్దూ రాదు. పట్టణాలలో ఉండేవాళ్లకు, చదువుకున్నవాళ్లకు హిందీ వచ్చు. దేశంలోని చాలా ప్రాంతాలలో ముస్లింలు హిందీ మాట్లాడినా కొన్ని ఉర్దూ మాటలు చేరుస్తారు. 'గుజరాత్‌లో మనం వాళ్లతో మాట్లాడేటప్పుడు (ముస్లింలు కదా అని దృష్టిలో పెట్టుకొని) కొన్ని ఉర్దూ మాటలు చేర్చినా, వాళ్లు మాత్రం స్వచ్ఛమైన హిందీలో జవాబు చెప్తారు.

ఇంత పూర్తిగా కలిసిపోయిన వారి దుకాణాలు, కార్యాలయాల జాబితా ఎట్లా తయారుచేస్తారు? అందుకు కావలసిన వివరాలు (దుకాణాలలో పనిచేసే ఉద్యోగులే ఇస్తే తప్ప) వర్తక పన్నుల శాఖ రికార్డుల నుండి, కార్మికశాఖ రికార్డుల

నుండి తీసుకోవాలి. ఆ రికార్డులన్నీ చూసి సమాచారం సేకరించి పెట్టుకోవడానికి చాలా టైం పడుతుంది. అందుకు ప్రభుత్వ శాఖల అధికారుల సహాయ సహకారాలు కావాలి. నిజానికి వేరే ఎవరయినా ఎంత మంచి అవసరానికైనా షాపుల యజమాన్ల పేర్లు, వివరాలు కావాలని అడిగితే ఆ అధికారులు ఇవ్వరు కాని సంఘ్‌పరివార్‌కు అంతటి సహకారం లభించిందంటే అధికార యంత్రాంగం మీద సంఘ్‌పరివార్ పట్టు ఎంతటిదో అర్థం అవుతుంది.

యజమాని ఎవరో తెలుసుకోవడానికి ప్రభుత్వ రికార్డుల మీద ఆధారపడ్డారని చెప్పడానికొక తార్కాణం సబర్‌కాంటా జిల్లాలోని హిమ్మత్‌నగర్‌లో మాకు తారసపడింది. ఆ ఊరిలో వోహరా ఏజెన్సీస్ అనే సంస్థ ఉంది. అది ఒకప్పుడు ఒక ముస్లిం వ్యాపారస్తుడికి చెందినది. మొన్నటి దొమ్మీకి ఒక నెల పూర్వం దానినొక హిందువు కొన్నాడు. అయితే ప్రభుత్వ రికార్డులలో మాత్రం యాజమాన్యం మార్పు నమోదు కాలేదు. దానిని తగులబెట్టడానికి సంఘ్‌పరివార్ మూక వచ్చినప్పుడు కొత్త యజమాని చేతులు జోడించి తాను హిందువునని చెప్పుకొని అభ్యర్థించినా వినకుండా 'దీని యజమాని ఎవరో మాకు తెలుసు' అని పూర్తిగా తగలబెట్టారు.

గుజరాత్ రాష్ట్రంలోని జాతీయ రహదార్ల మీదున్న 1150 హోటళ్లు, ఫ్యాక్టరీలు తగలబెట్టారని పైన చెప్పాము. ఆ హోటళ్లలో 90 శాతం ముస్లింలవి. మిగిలిన 10 శాతం హిందువుల హోటళ్లు మాత్రం సురక్షితంగా ఉన్నాయి. ఫిబ్రవరి 28, మార్చి 1 తేదీలలో సంఘ్‌పరివార్ మూకలు ట్రక్కులలోనూ, టెంపోలలోనూ జాతీయ రహదార్ల మీద స్వైరవిహారం చేస్తూ ఒక్కొక్క హోటల్‌నూ, ఫ్యాక్టరీనీ లూటీ చేశారు, తగలబెట్టారు. ఆ మూకలో బజ్రంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలే కాక అప్పటికప్పుడు పరిసర గ్రామాల నుండి పోగుచేసిన జనం కూడా పెద్దసంఖ్యలో ఉన్నారు. అయినప్పటికీ పొరబాటున కూడా హిందువులకు చెందిన ఒక్క నిర్మాణాన్నీ ముట్టుకోలేదు. ఎప్పటినుండో సమగ్రంగా సమాచారం సేకరించి ఉంటే తప్ప ఇది సాధ్యం అయ్యేది కాదు.

చాలాకాలంగా విశ్వహిందూ పరిషత్ త్రిశూలాలు, చాకులు పెట్టుకోవడానికి అనుకూలంగా ఉండే బెల్టులు తయారుచేయించి కేవలం 5 రూపాయలకే గ్రామీణ ప్రాంతాల యువకులకు పంచుతున్నదని సబర్‌కాంటా జిల్లాలో మేము విన్నాము. బజ్రంగ్‌దళ్ ప్రధాన కార్యక్రమమే త్రిశూలాలు పంచడం. యువకులందరూ త్రిశూలాలు ధరించాలని బజ్రంగ్‌దళ్ అధికారికంగానే పిలుపు ఇస్తుంది. ఈ

'త్రిశూలం' అనేది చేతిలో సులభంగా ఇమిడే పదునయిన ఆయుధం. ప్రాణాంతకమైన ఆయుధం. దానికి 'త్రిశూలం' అని పేరు పెట్టడం కేవలం అదేదో మత చిహ్నం అన్న అభిప్రాయం కలిగించి ఆర్మ్స్ ఆక్ట్ పరిధి నుండి తప్పించుకోవడానికే తప్ప, దానికీ కత్తికీ చాకుకూ తేడా ఏమీలేదు. రాజస్థాన్ రాష్ట్రంలోనే బజ్రంగ్‌దళ్ 40 లక్షల త్రిశూలాలు పంచిందని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి అశోక్ గెహలాట్ అన్నాడు. గుజరాత్‌లో ఎన్ని పంచారో చెప్పేవాళ్లు లేరు.

మార్చి 15 నాటికి అయోధ్యలో గుడికట్టి తీరుతామన్న బెదిరింపును సంఘ్‌పరివార్ ఎంత సీరియస్‌గా తీసుకుందో అర్థం చేసుకుంటే తప్ప ఈ 'తయారీ' మనకు అర్థం కాదు. విశ్వహిందూ పరిషత్ 'అంతర్జాతీయ ప్రధాన కార్యదర్శి' ప్రవీణ్ తొగాడియా బొంబాయిలో విలేకరులతో మాట్లాడుతూ, 'పాకిస్తాన్‌తో యుద్ధమైనా జరగాలి, మందిరమైనా కట్టాలి' అన్నాడు. 'ప్రభుత్వం పాకిస్తాన్‌ను తుదముట్టించేట్టయితే మేము మందిరం నిర్మాణాన్ని కొంతకాలం వాయిదా వేస్తాం' అన్నాడు. కొన్ని రోజుల తరువాత భువనేశ్వర్‌లో విలేకరులతో మాట్లాడుతూ 'కాశ్మీర్ సమస్య పరిష్కారం అయోధ్యలో ఉంది' అన్నాడు.

అయోధ్యలో రామాలయ నిర్మాణం హిందువుల బలాన్నీ, శక్తిసామర్థ్యాలనూ ప్రదర్శించే చర్య. పాకిస్తాన్‌ను ఓడించి ఆ శక్తిసామర్థ్యాలను ప్రదర్శిస్తారో లేక మందిర నిర్మాణం ద్వారా ప్రదర్శించే అవకాశం ఇస్తారో ప్రభుత్వం తేల్చుకోవాలనేది తొగాడియా సవాలు.

ప్రవీణ్ తొగాడియా సంఘ్‌పరివార్ నాయకులందరిలోకీ చాలా అతిగా, కనీస తర్కబద్ధత లేకుండా మాట్లాడతాడు. 'సోమనాథ్ దేవాలయం మీద గజనీ మహమ్మదు చేసిన దాడి, అయోధ్యలో బాబర్ రామాలయాన్ని కూల్చి మసీదు కట్టడం, సెప్టెంబర్ 11 నాడు వరల్డ్ ట్రేడ్ సెంటర్‌పైన జరిగిన దాడి, కాశ్మీర్‌లోని మిలిటెంట్ల ఆగడాలు, డిసెంబర్ 13న భారత పార్లమెంటుపైన జరిగిన దాడి, ఫిబ్రవరి 27న గోధ్రాలో సబర్మతి ఎక్స్‌ప్రెస్‌ను తగలబెట్టిన ఘటన – ఇవన్నీ ఒకటే, అన్నీ జిహాదీ బుద్ధికి చిహ్నాలే' అని తొగాడియా ఒకసారి కాదు, రెండుసార్లు కాదు పదేపదే అన్నాడు. వీటన్నిటి భారం దేశంలోని ప్రతి ముస్లిం మోయాలి. వీటన్నిటికీ ప్రతి ముస్లిం జవాబు చెప్పాలి. 2000 సంవత్సరంలో కాశ్మీర్‌లో అమర్‌నాథ్ యాత్రికులు 33 మందిని లష్కర్–ఇ–తోయిబా మిలిటెంట్లు చంపినందుకు ప్రతీకారంగా గుజరాత్‌లో ముస్లింలపైన విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జరిగిన దాడులను సమర్థించుకుంటూ ప్రవీణ్ తొగాడియా, 'అక్కడి

ఘటనకు జవాబు ఇక్కడ చెప్తాం' అన్నాడు. అంటే ఎక్కడయినా విశ్వహిందూ పరిషత్ జిహాద్‌గా భావించే ఘటన జరిగినట్టయితే దేశంలోని ముస్లింలంతా దానికి జవాబు చెప్పుకోవాలి. ప్రశ్నలకు జవాబు చెప్పడం కాదు, తల్వార్లకూ త్రిశూలాలకూ చెప్పుకోవాలి.

ఇది వట్టి ఉన్మాదంగా కనిపించవచ్చు. కానీ గుజరాత్‌లో ఈ రకమైన ఆలోచనలకు విస్తృత ప్రాచుర్యం ఉంది. ప్రవీణ్ తొగాడియా గుజరాత్‌కు చెందినవాడు. అహమ్మదాబాద్ నివాసి. అతనిప్పుడొక పెద్ద హీరో అయ్యాడు. మా బృందం గుజరాత్‌లో ఉన్న ఆఖరి రోజు జమ్ములో కాలుచక్ సంఘటన జరిగింది. ఆ రోజు మేము కలిసిన ముస్లింలు చాలా భయాందోళనలో వున్నారు. మళ్ళీ గుజరాత్‌లో ప్రతీకార హత్యాకాండ మొదలవుతుందేమోనని.

సంఘ్‌పరివార్ త్రిశూలాలు పంచి, అవి పెట్టుకోవడానికి యువకులకు బెల్టులు పంచి, ముస్లింల ఇళ్లు, ఆస్తుల లిస్టు తయారుచేసుకొని, అవకాశం కోసం ఎందుకు కాచుకుని ఉందో అర్థం కావాలంటే ఈ విషయాలన్నీ దృష్టిలో ఉంచుకోవాలి.

## V

## కొన్ని ఘోరాలు

క్రూరత్వాన్ని పదేపదే చూడడం మన మానసిక ఆరోగ్యానికే మంచిది కాదు. అయితే జాతీయత, దేశభక్తి, సచ్ఛీలత మొదలయిన నినాదాలతో దేశ రాజకీయాలలోకి ప్రవేశించిన సంఘ్‌పరివార్ కార్యకర్తల మానసిక స్థితి ఎట్లాంటిదో తెలుసుకోవడానికి వారి క్రూరత్వాన్ని కళ్లకు కట్టే ఘటనలనొకసారి పునశ్చరణ చేసుకోవడం అవసరం. రేపు మన చుట్టూ కూడా అటువంటి ఘటనలు జరిగే రోజు వస్తే మనం కనీసం చేష్టలుడిగి కూర్చోకుండా ఉంటాం.

* లింఖేడా పంచ్‌మహల్స్ జిల్లాలోని ఒక గ్రామం. ఫిబ్రవరి 28 నుండి అక్కడ పరిస్థితి చాలా తీవ్రరూపం తీసుకోగా, 20 మంది సభ్యులుగల ఒక ఉమ్మడి కుటుంబం పాండుగామ్ అనే గ్రామానికి పోదామని బయలుదేరారు. లింఖేడాలో రైలు ఎక్కి డెరోల్ స్టేషన్‌లో దిగారు. అక్కడ నుండి రిక్షాగానీ వేరే ఏదైనా బండిగానీ తీసుకొని పాండుగామ్ పోవాలి. డెరోల్‌లో దిగాక వారికి అక్కడ కూడా పరిస్థితి బాగాలేదని అర్థమయింది. ఎటుపోదామా అని ఆలోచిస్తుండగానే చేతిలో ఆయుధాలు పట్టుకున్న పెద్దగుంపు అటువైపు

వచ్చింది. వీళ్లు తప్పించుకోవడానికి పరుగెత్తారు కాని అన్వర్‌ఖాన్ పఠాన్ అనే ఒక వ్యక్తి వాళ్ల చేతికి చిక్కాడు. వాళ్లు అతనిని కిరోసిన్ పోసి తగలబెట్టి చంపారు. మిగిలిన వాళ్లు డెరోల్ గ్రామాన్ని సమీపించేసరికి మరొక పెద్ద మూక ఎదురయింది. ఆ మూక చేతిలో కత్తులు, బాకులు, కర్రలు ఉన్నాయి. పెట్రోలు లేక కిరోసిన్ డబ్బాలు ఉన్నాయి. ఆ మూక వీళ్లను నర్మదా ప్రాజెక్టు కాలవ వైపు తరిమింది. వీళ్లు అటే పరుగెత్తారు. అక్కడ ఈ గుంపులోని స్త్రీలు మొదట వాళ్ల చేతికి చిక్కారు. జైబున్నీసా (18), రెహనాబేన్ (50), సితారా (12), నూర్‌జెహాన్ (14), అఫ్సానా బేన్ (20), ఖాటూన్ బీబీ (40)లను వివస్త్రలను చేసి వారిపైన మూకుమ్మడిగా అత్యాచారం చేసి, నరికి, పెట్రోల్ పోసి తగలబెట్టారు. మగవాళ్లు కూడా 8 మంది వారి కత్తులకు, పెట్రోలుకు బలయ్యారు. లింఖేడా నుండి తప్పించుకొని వచ్చిన 20 మందిలో 14 మంది ఈ విధంగా చనిపోయారు.

వీళ్లమీద దాడిచేసిన గుంపులు అప్పటికే డెరోల్ గ్రామంలో ఒక్కొక్క ఇంటిమీద దాడిచేసి లూటీచేసి 38 మందిని సజీవంగా దహనం చేసి ఉన్నారు. డెరోల్ గ్రామ ముస్లింలంతా ఇప్పుడు కలోల్, హలోల్ తాలూకా కేంద్రాలలోని శరణార్థుల శిబిరాలలో ఉన్నారు.

* దాహొూడ్ జిల్లా దాహొూడ్ తాలూకా రంథిక్‌పూర్‌కు చెందిన బిల్కీస్ అనే స్త్రీ దాహొూడ్ ఎస్.పి.కి రాసి ఇచ్చిన ఫిర్యాదులో తన కుటుంబానికి చెందిన 15 మందిని హతమార్చిన వైనాన్నీ, తననూ తన చిన్నబిడ్డనూ, ఇతర స్త్రీలనూ రేప్ చేసిన వైనాన్నీ ఈ విధంగా వివరించింది. ఫిబ్రవరి 28 పొద్దున్న బిల్కీస్ తన 3 1/2 సంవత్సరాల బిడ్డ సలేహాతోనూ, ఇతర కుటుంబ సభ్యులతోనూ కలిసి (మొత్తం 16 మంది) రంథిక్‌పూర్ నుండి బారియాకు కాలినడకన బయలుదేరింది. రంథిక్‌పూర్‌లో వాతావరణం బాగాలేదని గమనించి ఈ పని చేశారు. దారిలో ఒక మసీదులో ఆ రాత్రి గడిపారు. మరుసటిరోజు బయలుదేరి ఖుద్రా గ్రామానికి పోయి అక్కడ ఒక ఆదివాసీ ఇంట్లో రెండు రోజులు గడిపారు. ఆ తరువాత మళ్లీ బయలుదేరారు. చప్పర్‌వాడ్ గ్రామ శివారులోని రెండు కొండల మధ్య పోతుండగా రంథిక్‌పూర్, చప్పర్‌వాడ్‌లకు చెందిన 30-40 మంది సాయుధులు రెండు వాహనాలలో ఎదురు వచ్చారు. వాళ్లలోని రంథిక్‌పూర్ వాసులందరినీ బిల్కీస్ గుర్తుపట్టింది. వాళ్ల చేతిలో కత్తులు, బరిసెలు, బాకులు, కొడవళ్లు, విల్లంబులు వున్నాయి. 'పట్టుకోండి,

నరకండి' అంటూ వాళ్లు వీరి వెంటపడ్డారు. బిల్కీస్‌ను, ఇతర స్త్రీలను, బిల్కీస్ 3 1/2 సంవత్సరాల బిడ్డ సలేహాను (మొత్తం 8 మందిని) రేప్ చేశారు. బిల్కీస్ చూస్తుండగానే ఆ పాపను చంపారు. బిల్కీస్ తలమీద కొట్టగా ఆమె స్పృహతప్పి పడిపోయింది. ఆమె చనిపోయిందని వాళ్లు భావించి, మిగిలిన వాళ్లందరినీ నరికి చంపి వెళ్లిపోయారు. ఆమె ఇప్పుడు గోధ్రాలోని శరణార్థుల శిబిరంలో ఉంది.

* మార్చి 1వ తేదీన పంచ్‌మహల్స్ జిల్లా పంధర్‌వాడలో ఒక ఘోరమైన మారణకాండ జరిగింది. ఆ రోజు పొద్దున్న 5000 మించిన గుంపు గ్రామంపైన దాడిచేయడం చూసి ముస్లింలు చెల్లాచెదురయ్యారు. ఆ సమయంలో మహేంద్ర వకీల్ అనే పటేల్ కులస్తుడు వాళ్లను తన తోటలోకి వెళ్లి దాక్కొమ్మని అన్నాడు. '10 అడుగుల ఎత్తు గోడ ఉంది – మీరు భద్రంగా ఉంటారు' అన్నాడు. అతని మాట నమ్మి చాలామంది ముస్లింలు అతని తోటలోకి పోయారు. ఇతను బయట తలుపుపెట్టి దానికి అడ్డంగా కర్రమొద్దులు పెట్టి, దుండగులకు సైగచేశాడు. వాళ్లు వచ్చి మొదట గాజు పెంకులూ, మండే రసాయన పదార్థాలూ లోపల వేశారు. తరువాత కిరోసిన్ పోసి తగలబెట్టారు. తప్పించుకొని పారిపోవడానికి ప్రయత్నించిన వారిని పట్టుకొని నరికారు. బిజెపికి చెందిన ఖాన్‌పూర్ తాలూకా పంచాయతి అధ్యక్షుడు జస్వంత్ పటేల్‌తో సహా చాలామంది పేర్లను తప్పించుకున్న బాధితులు పోలీసులకు ఇచ్చారు. మొత్తం 60 లేక 70 మంది ఈ మారణకాండలో చనిపోయారు. చావు తప్పించుకున్న వాళ్లందరూ లూనావాడ క్యాంపులో ఉన్నారు.

* మెహసానా జిల్లా సర్దార్‌పూర్‌లో 70 ముస్లిం కుటుంబాలు ఉన్నాయి. మార్చి 1న ఆ ఊరిలో సంఘ్‌పరివార్ నాయకత్వంలోని 5000 మంది గుంపు ఒక కొలనులో పంపుతో నీరు నింపి, ఆ నీటికి కరెంటు కనెక్షన్ పెట్టి, ముస్లింలను ఒక్కొక్కరిని తీసుకొచ్చి అందులోకి బలవంతంగా తోసింది. కొందరు నీటిలోనే చనిపోయారు. కొందరు గిలగిల తన్నుకొని బయటపడే ప్రయత్నం చేయగా, వారిని తరిమి పట్టుకొని నరికి, తగలబెట్టి చంపారు. మొత్తం 33 మంది ఈ విధంగా చనిపోయారు. తక్కిన ముస్లింలందరూ మెహసానా జిల్లానే వదిలిపెట్టి కాంగ్రెస్‌కు కొంచెం బలం వున్న పొరుగు జిల్లా అయిన సబర్‌కాంటాకు వెళ్లిపోయారు. ఇంక ఎట్టి పరిస్థితిలోనూ తిరిగి సర్దార్‌పురాకు తాము పోలేమని

వారు నిర్ణయించుకోగా, ముస్లిం స్వచ్ఛంద సంస్థలు ప్రభుత్వ సహాయం కోసం ఆగకుండా సాత్‌నగర్ అనేచోట వారికోసం ఒక కాలనీ కట్టిస్తున్నారు.

* సబర్‌కాంటా జిల్లాలోని మాల్‌పూర్‌కు చెందిన ముస్లింలు మార్చి 1వ తేదీన కొన్ని ప్రైవేట్ వాహనాలలో జిల్లా నుండి వెళ్లిపోయే ఉద్దేశ్యంతో బయలుదేరారు. పంచ్‌మహల్స్ జిల్లాలోకి ప్రవేశించగానే వాళ్ల వాహనాలను మోటార్ సైకిళ్లలో ప్రయాణిస్తున్న దుండగులు తరమడం మొదలుపెట్టారు. లింబిడియా చౌకి అనేచోట వీళ్ల వాహనాలలో ఒకటి ఖరాబయి ఆగిపోయింది. 1000–2000 మంది సాయుధులు వీరి వాహనాలను చుట్టుముట్టారు. పెట్రోల్‌పోసి తగలబెట్టారు. పారిపోయే ప్రయత్నం చేసిన వారిని వెంబడించి నరికి చంపారు. మొత్తం 74 మంది హతమయ్యారు.

* బరోడా (వడోదరా) నగరంలోని హనుమాన్ టేక్రీ ప్రాంతంలో వున్న బెస్ట్ బేకరీ యజమాని ముస్లిం. ఆ ప్రాంతంలో ఎక్కువగా పేద హిందువులు, కొందరు పేద ముస్లింలు నివసిస్తారు. ముస్లిం కుటుంబాలన్నీ ఫిబ్రవరి 27 నాడే ఆ బస్తీ విడిచి వెళ్లిపోయాయి. బెస్ట్ బేకరీ యజమాని మాత్రం పోలేదు. స్థానిక హిందూ ప్రముఖుడయిన జయంతిభాయి చాయ్‌వాలా అతనికి హామీ ఇచ్చాడు ఏమీ కాదని.

అయితే మార్చి 1 సాయంత్రం 8 గంటలకు చాయ్‌వాలా స్వయంగా ఒక 500 మంది గల గుంపును తీసుకొచ్చి బేకరీపైన దాడి చేశాడు. బేకరీ వాళ్లు పోలీస్ కంట్రోల్ రూంకు, పానిగేట్ పోలీస్‌స్టేషన్ కు ఫోన్ చేశారు. పోలీసులు 'ఇదిగో వస్తున్నాం' అన్నారు. గంటన్నర తరవాత ఒక పోలీస్ జీపు వచ్చి ఒక నిమిషం బేకరీ దగ్గర నిలబడి వెళ్లిపోయింది. ఇంక ఆ తరువాత దుండగులు దాడిని తీవ్రతరం చేశారు. పొద్దున్న 10 గంటల దాకా లూటీ చేశారు. తగలబెట్టారు. మనుషులను సజీవంగా దహనం చేశారు. కత్తులతో నరికి చంపారు. బేకరీలో పనిచేస్తున్న ముగ్గురు హిందూ కార్మికుల పొట్టలు కత్తితో చీల్చి చంపారు. ముగ్గురు స్త్రీలను, నలుగురు పిల్లలను సజీవంగా దహనం చేశారు. మొత్తం ఆ బేకరీలో వున్న 18 మందిలో 14 మందిని హతమార్చారు.

* దాహోద్ జిల్లాలోని ఫతేపురా గ్రామం రాజస్థాన్ సరిహద్దుకు 10 కి.మీల దూరాన ఉంది. ఆ ఊరిలో 217 ముస్లిం కుటుంబాలున్నాయి. అది తాలూకా కేంద్రం. పోలీస్‌స్టేషన్ ఉంది. ఆ ఊరి ముస్లింలు మార్చి 1వ తేదీన భయంకరమైన నరకం అనుభవించారు. ఫిబ్రవరి 28వ తేదీనే వారు పరిస్థితి

గమనించి ఊరు విడిచిపెట్టి వెళ్ళిపోదామనుకున్నారు గానీ, 28న రాష్ట్రబంద్, మార్చి 1న దేశమంతటా బంద్ నిర్వహించిన సంఘ్‌పరివార్ మూకలు ఫతేపూర్ నుండి బయటకుపోయే అన్ని రోడ్లకూ చెట్లు, రాళ్లు అడ్డం వేశారు. మార్చి 1న కర్ఫ్యూ కూడా ఉండింది. అందువల్ల ముస్లింలు తప్పించుకోలేకపోయారు. అయితే సంఘ్‌పరివార్ దుండగులకు కర్ఫ్యూ అడ్డం రాలేదు. సంఘ్‌పరివార్ కార్యకర్తలు, వారి వెనుక ఫతేపురాకు చెందిన హిందూ కుటుంబాల యువకులు, పరిసర గ్రామాల ఆదివాసీలు పెద్దసంఖ్యలో 1వ తేదీన ముస్లింల ఇళ్లపైన దాడిచేశారు. పోలీసులు, తాసీల్దారు చూస్తూ ఊరుకున్నారు. దుండగులు ఒక్కొక్క ఇంటిలోని స్త్రీలను బయటకు లాగి వివస్త్రలను చేసి రేప్ చేశారు. ఒక యింట్లో మగవాళ్లు ప్రతిఘటించగా, ముగ్గురిని (మహమ్మద్ ఇసా గుండాలా, యూసుఫ్ మహమ్మద్ గుండాలా, అహ్మద్ అబ్దుల్ కరీం గుండాలా) తరిమి, నరికి చంపారు. కొన్ని గంటలసేపు సాగిన ఈ దౌర్జన్యకాండ నుండి తప్పించుకొని స్త్రీలు, పురుషులు, పిల్లలు మూడు టెంపోలలో ఇరుక్కొని రాజస్థాన్ సరిహద్దు దాటి ఫద్వా గ్రామానికి పోయారు. ఆ జిల్లా కలెక్టరుకు ఈ సంగతి తెలిసి ఆ ఊరికి వచ్చి వీరికి రెండు క్యాంపులు ఏర్పాటు చేశాడు. ఒంటిమీద సరిగ్గా బట్టలు లేకుండా వచ్చిన స్త్రీలకు బట్టలు ఇప్పించాడు. గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వం గానీ, దాహోద్ జిల్లా అధికారులు గానీ రాజస్థాన్ పత్రికలు ఫతేపూర్ ఘోరం గురించి పెద్దఎత్తున రాసేదాకా ఆ ఊరి ముస్లింలు ఏమయిపోయారని కూడా ఆలోచించలేదు. ఆ తరువాత దాహోద్ జిల్లా కలెక్టర్ ఫద్వాకు పోయి 11 వాహనాలలో వారిని వెనక్కి తీసుకొచ్చాడు ('మూడు వాహనాలలో పోయిన వాళ్లము 11 వాహనాలలో తిరిగి వచ్చామంటే మేము ఏ పరిస్థితిలో పోయామో ఊహించుకోండి' అని ఫతేపురా శిబిరం పెద్ద అబ్దుల్ సత్తార్ అంటాడు). ఫతేపురాలో జరిగిన రేప్ గురించి ఒక టి.వి. డాక్యుమెంటరీ నిర్మాత బాధితురాళ్లతో వివరంగా మాట్లాడి వాంగ్మూలాలు నమోదు చేసేదాకా, కళ్లారా చూసిన స్థానిక పోలీసులు గాని, తాసీల్దారు గాని నేరం నమోదు చేయలేదు.

* అహమ్మదాబాద్ నగరంలోని చమన్‌పురా ప్రాంతంలో గుల్బర్గ్ సొసైటీ వారి బిల్డింగ్‌లు ఉన్నాయి. అందులో నివసించిన ప్రముఖులలో ఒకరు కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మాజీ ఎం.పి. ఎహసాన్ జాఫ్రి. ఫిబ్రవరి 28 పొద్దున్నుండే ఆ బస్తీపైన సంఘ్‌పరివార్ దాడి మొదలయింది. ధ్వంసం చేయడం, తగలబెట్టడం షురూ చేశారు. జాఫ్రి అహమ్మదాబాద్ పోలీస్ కమిషనర్

పాండేకి ఫోన్ చేశాడు. పొద్దున్న 10.30 సమయంలో కమిషనర్ పాండే, వార్డ్ నెంబరు 19, 20ల కార్పొరేటర్లు జాఫ్రీ ఇంటికి వచ్చారు. బలగాలను పంపిస్తామనీ ధైర్యంగా ఉండవచ్చుననీ హామీ ఇచ్చారు. వాళ్లు వెళ్లిపోయిన అయిదు నిమిషాలకే గుల్బర్గ్ సొసైటీ సమీపంలో ఒక బేకరీనీ, ఆటోనూ సంఘ్‌పరివార్ దుండగులు తగులబెట్టారు. తరువాత బిల్డింగ్ మీద రాళ్లు, ఆపైన పెట్రోల్ బాంబులు, ఆసిడ్ బల్బులు వేయడం మొదలుపెట్టారు. చివరికి గుల్బర్గ్ సొసైటీ వెనుకవైపు నుండి పెద్ద గుంపు గేటు పగలగొట్టి లోపలికి చొరబడ్డారు. అన్వర్ అనే వ్యక్తిని చంపి, కట్టెలు తీసుకొచ్చి అతనికోసం ఒక చితి పేర్చడమే కాక మరొక మూడు చితులు కూడా పేర్చారు. అన్వర్‌ను ముక్కలుగా నరికి ఒక చితిపైన తగలబెట్టారు. ఇదంతా జరుగుతుండగా ఎహసాన్ జాఫ్రి సొసైటీ బిల్డింగ్‌లోనుండి పోలీస్ కమిషనర్‌తో సహా అధికారులందరికీ ఫోన్లు చేస్తూనే ఉన్నాడు. కానీ ఏ సహాయమూ అందలేదు.

గుల్బర్గ్ సొసైటీ పక్కనున్న ఒక హిందువుకు చెందిన బిల్డింగ్ నుండి దుండగులు పెద్దఎత్తున రాళ్లు, బండలు సొసైటీ బిల్డింగ్‌పైకి వేయసాగారు. ఆ దాడిని అడ్డంపెట్టుకుని లోపలికి దూరి ఎహసాన్ జాఫ్రీని బయటికి గుంజుకుపోయారు. దాదాపు ముప్పావు గంట అతనితో అతిక్రూరంగా ఆడుకున్నారు. బట్టలు ఊడదీసి పెరేడ్ చేయించారు. 'జైశ్రీరాం', 'వందేమాతరం' అనమని బలవంతం చేశారు. అతను అనకపోయేసరికి చేతివేళ్లు తెగనరికారు. ఆ తరువాత చేతులూ కాళ్లూ తెగనరికి మెడకు పటకార లాంటి సాధనం పెట్టి గుంజుకుపోయి చితిమీద వేసి సజీవంగా దహనం చేశారు. ఆ తర్వాత కూడా మారణకాండ కొనసాగించారు. 10 మంది స్త్రీలపైన అత్యాచారం చేశారు. చివరికి సాయంత్రం అయిదు గంటలకు పోలీసులు వచ్చేసరికి 59 మందిని హతమార్చారు. సంఘ్‌పరివార్ కార్యకర్తల నాయకత్వంలోని ఈ దుండగుల సంఖ్య దాదాపు 20,000 ఉంటుందని ఈ కేసులో ఎఫ్ఐఆర్ దాఖలు చేసిన ఇన్‌స్పెక్టర్ ఎర్డా స్వయంగా తన ఫిర్యాదులో అన్నాడు.

* నరోడా గ్రామం అహమ్మదాబాద్ నగరానికి 15 కి.మీల దూరాన ఉంది. పక్కనే నరోడా పాటియా ఉంది. ఫిబ్రవరి 28న నరోడా గ్రామంలోనూ నరోడా పాటియాలోనూ జరిగిన మారణకాండ వర్ణనాతీతం. ఆ ప్రాంతంలో దాదాపు 1000 ముస్లిం కుటుంబాలుండేవి. అంతా పేద కార్మికులే. సమీపంలోని గోపీనాథ్ సొసైటీ, గంగోత్రి సొసైటీలకు చెందిన సంఘ్‌పరివార్ కార్యకర్తలు గతంలో కూడా అనేకసార్లు నరోడా, నరోడా పాటియాలలోని ముస్లింలను

సతాయించారు. 1999లో నరోడాలోని ఒక దర్గాను కూలగొట్టి హిందూ దేవుని విగ్రహం అక్కడ ప్రతిష్టించారు. ఆ పని చేసిన ఘనులు విశ్వహిందూ పరిషత్ సంయుక్త ప్రధాన కార్యదర్శి డా. జైదీప్ పటేల్, స్థానిక ఎంఎల్ఏ మాయా కొట్నానీ.

మొన్నటి ఫిబ్రవరి 28న మళ్లీ జైదీప్ పటేల్ నాయకత్వంలోనే ఖాకీ నిక్కర్లు, కాషాయం బనియన్లు, తలకు నలుపు/కాషాయం రిబ్బన్లు ధరించిన 10,000 మంది మూక నరోడా, నరోడా పాటియాలపైన దాడిచేశారు. వాళ్ల చేతులలో కత్తులు, బరిసెలు, పెట్రోల్ బాంబులు, ఆసిడ్ బాంబులు వున్నాయి. రావడం రావడమే నూరానీ మసీదును ధ్వంసం చేశారు. ఆ తరువాత ఒక్కొక్క కుటుంబాన్నీ మూకుమ్మడిగా సజీవంగా దహనం చేయసాగారు. ఖైరున్నీసా అనే స్త్రీపైన 11 మంది అత్యాచారం చేసి ఆమెతో సహా ఆమె మొత్తం కుటుంబాన్ని సజీవంగా దహనం చేశారు. కౌసర్‌బానో అనే 8 నెలల గర్భిణిపైన అత్యాచారం చేసి ఆమె కడుపు కోసి బిడ్డను బయటకు తీసి నిప్పులో పడేసి ఆమెను నరికి చంపారు.

'కమ్యూనలిజం కాంబాట్'తో మాట్లాడుతూ అమీనా అనే శరణార్థి 'మా హుసేన్‌నగర్‌లో ఒక్క స్త్రీని కూడా వదిలిపెట్టలేదు – అందరిపైనా అత్యాచారం చేశారు, చాలామందిని ఆ తరువాత నరికి చంపారు' అనింది. హుసేన్‌నగర్ నరోడాలో ఒక వాడ. ఇమ్రాన్ అనే 6 సంవత్సరాల బాలుడి చేత బలవంతంగా పెట్రోల్ తాగించి, అగ్గిపుల్ల గీసి నోట్లో వేశారు. ఆ బాలుడు పేలి చనిపోయాడు. మొయినుద్దీన్ అనే 18 సంవత్సరాల వికలాంగుడి చేత బలవంతంగా కిరోసిన్ తాగించి, పడకకు కట్టేసి తగలబెట్టి అతను ఎట్లా తగలబడతాడో చూసి ఆనందించారు. పొరుగింటి అమ్మాయిని కాపాడడానికి పోయిన అతని తల్లి వికలాంగుడయిన తన కొడుకుకు తోడుగా ఉండలేకపోయినందుకు విలపిస్తూ అడిగిన వారందరికీ తన మొయినుద్దీన్ కథ చెప్తున్నది. నరోడాలో, నరోడా పాటియాలో మొత్తం 80 మంది హతమయ్యారని అంచనా. కాలి బుగ్గి అయి స్మశానంలాగ తయారయిన నరోడా గ్రామం గుజరాత్ జాతిహననానికి ఒక చిహ్నంగా ఉంది.

మనుషులను నరకడం, రేప్ చేయడం, సజీవంగా దహనం చేయడం మాత్రమే కాదు. ముస్లిం మత చిహ్నాలను నామరూప అవశేషం లేకుండా తొలగించే ప్రయత్నం చేశారు. 'కమ్యూనలిజం కాంబాట్' తీసిన లెక్కల ప్రకారం రాష్ట్ర వ్యాపితంగా 234 మసీదులు, దర్గాలు పాక్షికంగానో పూర్తిగానో ధ్వంసం

అయినాయి. అత్యధికంగా అయింది అహమ్మదాబాద్ నగరంలో, జిల్లాలో (55), ఆనంద్ జిల్లాలో (53), బరోడా నగరంలో, జిల్లాలో (22), పంచ్‌మహల్స్ జిల్లాలో (19), మెహసానా జిల్లాలో (18), సబర్‌కాంటా జిల్లాలో (13), దాహోద్ జిల్లాలో (13). ధ్వంసం చేసిన మసీదులలోనూ దర్గాలలోనూ గోడలపైన తిట్లు, బూతులు రాయడం, హిందూ దేవతల విగ్రహాలు, ఫోటోలు పెట్టడం జరిగింది. మసీదులోని ఖురాన్ కాగితాలు చింపి దానిపైన మూత్రం పోశారు. దాహోద్ జిల్లాలోని ఫతేపురా గ్రామంలో వున్న రెండు మసీదులు, ఒక ఈద్గాలను ధ్వంసం చేయడమే కాక ఒక మసీదు గోడల మీద బూతు తిట్లు రాశారు. మూడింటిలోనూ కాషాయం జెండా ఎగరేశారు. అదే జిల్లాలోని సంజేలి గ్రామంలో మసీదును ధ్వంసం చేసి దాని గోడల మీద 'హిందువోంకా హై హిందుస్తాన్, ముసల్మాన్ చలేజావ్ పాకిస్తాన్' (భారతదేశం హిందువులది, ముస్లింలు పాకిస్తాన్‌కు పొండి) అనీ 'యహా పర్ అవోగే తో కాట్ లియా జావోగే' (ఇక్కడికి వస్తే నరికి చంపుతాం) అనీ రాశారు. సబర్‌కాంటా జిల్లాలోని హిమ్మత్‌నగర్‌లో ఈద్గాను కూల్చడానికి మునిసిపాలిటీకి చెందిన బుల్‌డోజర్‌ను తీసుకొచ్చారు. మునిసిపల్ అధికారుల తోడ్పాటు లేకుండా అది జరగదు.

అహమ్మదాబాద్ నగరంలో పోలీస్ కమిషనర్ కార్యాలయం పక్కనే వున్న వలీ గుజరాతీ దర్గాను మార్చి 1 రాత్రి రెవెన్యూమంత్రి హిరేన్ పాండ్య అనుచరుల మూక కూల్చి నేలమట్టం చేసి అక్కడ కాషాయం జెండా ఎగరవేసింది. వెనువెంటనే నగర పాలకులు రంగంలోకి దిగి దర్గా ఉన్నచోట తారురోడ్డు వేసేశారు. మాతో తన అనుభవాలు పంచుకున్న అహమ్మదాబాద్‌కు చెందిన ఒక అధ్యాపకురాలు ఈ విధంగా అనింది. 'మార్చి నెలలో ఒకరోజు నేను, ఒక రచయిత్రి, ఒక ముస్లిం మతస్తుడయిన డాక్టరు టాక్సీలో అటువైపు పోతున్నాం. ఒకప్పుడు దర్గా ఉన్నచోట కొత్తగా వచ్చిన నున్నటి రోడ్డు దాటగానే 'దర్గా ఛాయలు సహితం మిగలకుండా చేసేశారు', చూశావా అన్నాను. టాక్సీ డ్రైవరు వెంటనే అందుకొని అవును, మేమే చేశాం అన్నాడు. దర్గాను చేసినట్టే ముస్లింలను చంపినప్పుడు కూడా పూడ్చిపెట్టడానికి శవం సహితం దొరకకుండా ముక్కలుగా నరికి తగలబెట్టాం అన్నాడు. అప్పటికి రాత్రి పొద్దుపోయింది. ఆ తరువాత ప్రయాణం ముగిసేంతవరకు మాతో ఉన్న డాక్టర్‌ను పేరుపెట్టి పిలవకుండా డాక్టర్ సాబ్ అని సంబోధించాము. కొంతసేపటికి డ్రైవర్‌తో, మీకు ముస్లింలను చంపడానికి కత్తులు విశ్వహిందూ పరిషత్ ముందే పంపించింది కదా అని

స్నేహపూర్వకంగా అడిగాము. అవును, ఫిబ్రవరి 28 పొద్దున్నే కత్తులు పంచారు అన్నాడు'.

విశ్వహిందూ పరిషత్ 'అంతర్జాతీయ ప్రధాన కార్యదర్శి' ప్రవీణ్ తొగాడియా వృత్తిరీత్యా డాక్టరు. అహమ్మదాబాద్‌లో ధన్వంతరి ఆస్పత్రి నడుపుతాడు. మొదటి రౌండు హింస నడుస్తుండగా అతని ఆస్పత్రికి ఆయుధాలు పెద్దఎత్తున వచ్చాయని అంటారు.

మత విద్వేషం మసీదులు, దర్గాలు, ఈద్గాల విధ్వంసం దగ్గర ఆగిపోలేదు. కబరస్తాన్‌లను (స్మశానాలను) కూడా విడిచిపెట్టలేదు. సబర్‌కాంటా జిల్లా కిషన్‌ఘర్ తాలూకాలోని బిలోడా గ్రామంలో 3000 మంది బజ్రంగ్‌దళ్ మూక 15 ఇళ్ళను తగలబెట్టడమే కాక, ముస్లింల స్మశానానికి పోయి పాత సమాధులు తవ్వి వాటిలోకి పెట్రోల్ పోసి ఇంకా మిగిలి వున్నాయని భావించిన మృత అవశేషాలను తగలబెట్టారు!

# VI

## ప్రభుత్వ పాత్ర

గుజరాత్ రాష్ట్ర పాలనా యంత్రాంగం ప్రత్యక్ష ప్రమేయంతోనే ఈ మారణకాండ జరిగిందనడానికి కావలసినన్ని ఆధారాలున్నాయి. ఆ వివరాలు చూసే ముందు, చరిత్రలోకి కొంచెం పోయి ఆ రాష్ట్రంలో పరిస్థితులు ఇంతగా దిగజారడానికి గల నేపథ్యం చూద్దాం.

గుజరాత్ మారణకాండలో దళితులు, ఆదివాసులు పెద్దసంఖ్యలో పాల్గొనడం ప్రజాతంత్రవాదులందరినీ కలవరపరిచింది. ఆ వర్గాల ప్రజలు సంఘ్‌పరివార్ గుప్పిట్లోకి ఎట్లా పోయారా అని ఆశ్చర్యపోతున్నాం. వాస్తవం చెప్పాలంటే ఆ రాష్ట్రంలో ప్రజాతంత్ర ఉద్యమాలు ఎప్పుడూ బలంగా లేవు. బలంగా ఏమిటి, అసలే లేవని చెప్పుకోవచ్చు. పేదలను, దళితులను, ఆదివాసులను ప్రజాతంత్ర ఉద్యమాలు సంఘటితం చేయకపోతే ఆ వర్గాల ప్రజలు అచేతనంగా ఉండిపోతారనుకుంటే పొరబాటే. తమ అవసరాల మేరకు తామే సంఘటితం కాగలరు. అనేక సందర్భాలలో అవుతున్నారు కూడా. లేదా ఫాసిస్టు శక్తుల కాల్బలంగానూ మారగలరు. విశ్వహిందూ పరిషత్ ఆదివాసులను తనలో ఇముడ్చుకోవడానికి అనుసరించిన పద్ధతిని తరువాత చూద్దాం.

బ్రాహ్మణులు, బనియాలు, పటేళ్లు గుజరాత్‌లో ప్రధాన పెత్తందారీ కులాలు. (పటేల్ అనేది కులం పేరు కాదు. ఆ కులాన్ని పాటిదార్ అంటారు. అయితే వారు తమ పేరు చివర పటేల్ అని పెట్టుకుంటారు కాబట్టి వారిని పటేళ్లు అంటారు). గుజరాతీ వ్యాపార వర్గమే కాక మేధావి వర్గం కూడా అధికంగా ఈ కులాలకు చెందినదే. వారు రూపొందించిన ఆధునిక గుజరాతీ చరిత్రలో కొన్ని ప్రధాన ఘట్టాలున్నాయి. గుజరాత్‌లో 'హిందుత్వం' వీటి చుట్టూ తిరుగుతుంది. ఒకటి, స్వాతంత్ర్యం తరువాత సర్దార్ పటేల్ చొరవ తీసుకుని సోమనాథ్ దేవాలయాన్ని (గజనీ మహమ్మద్ దాడులలో ధ్వంసమైన దేవాలయాన్ని) తిరిగి నిర్మించడం. ఈ ఘటన మనకందరికీ తెలుసును గానీ గుజరాత్‌లో దానికి వేరే ప్రాముఖ్యం ఉంది. స్వాతంత్ర్యం కేవలం బ్రిటిష్ పాలన నుండి స్వాతంత్ర్యం కాదనీ, అంతకుముందు నడిచిన 'ముస్లిం' పాలన నుండి కూడా స్వాతంత్ర్యమనీ సూచించే చిహ్నంగా సోమనాథ్ ఆలయ పునర్నిర్మాణాన్ని వారు చూస్తారు. నెహ్రూ ఈ విషయం గ్రహించాడు కాబట్టే ఆ పునర్నిర్మాణం సరయిన పని కాదని భావించాడు. అయితే ఆయన అనుసరించిన సర్దుబాటు రాజకీయాలలో భాగంగా, ఆలయ పునరుద్ధరణ చేపట్టిన హోంమంత్రి పటేల్‌ను గానీ నూతన ఆలయం ఆవిష్కరణకు హాజరయిన రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్‌ను గానీ ఆపలేదు.

రెండు, దాదాపు అదే సమయంలో పాకిస్తాన్‌లోని సింధ్ ప్రాంతం నుండి హిందూ శరణార్థుల రాక. సింధ్ గుజరాత్‌ను ఆనుకొని ఉంది. దేశ విభజన సమయంలో సింధ్ నుండి వచ్చేసిన హిందూ శరణార్థులు అప్పటి బొంబాయి రాష్ట్రంలోని గుజరాత్ ప్రాంతానికి వచ్చారు. వారు అనుభవించిన హింసను గుజరాతీలు విన్నారు. నిజానికి ఆ దశలో సరిహద్దుకు రెండువైపులా ఇదే పరిస్థితి ఉండింది. ఇక్కడ ముస్లింలు, అక్కడ హిందువులూ సిక్కులూ ఒకేరకమైన ఊచకోతకు గురయ్యారు. అయినప్పటికీ ఒకదానిని మాత్రమే జ్ఞాపకం ఉంచుకోదలచుకున్న వారిని ఆపేదెవరు?

మూడు, 1965 భారత – పాకిస్తాన్ యుద్ధం ప్రధానంగా కచ్ సరిహద్దు దగ్గరే జరిగింది. ఇది కూడా మనకు తెలిసిన సంగతే గానీ దీనిచుట్టూ గుజరాత్‌లో ఎంతటి ముస్లిం ద్వేషాన్ని నిర్మించడం జరిగిందో మనము గ్రహించలేము. కానీ ఆ పని చేసినవాళ్లకది బాగా తెలుసును కాబట్టే అద్వానీ తన రథయాత్రను సోమనాథ్ దేవాలయం నుండే మొదలుపెట్టాడు. అది మరొకసారి గుజరాత్‌లో ముస్లిం ద్వేషానికి ఆజ్యం పోసింది.

దేశవ్యాప్తంగా స్వాతంత్ర్యానంతర రాజకీయాలలో మనకు కనిపించే వామపక్షాల ప్రభావం, నెహ్రూవాదం ప్రభావం, గాంధీవాదం ప్రభావం గుజరాత్‌లో చాలా బలహీనంగా ఉన్నాయి. 'గాంధీని గుజరాత్ ఈ రోజు మరిచిపోయిందని చాలామంది అంటున్నారు. కానీ గాంధీ అంటే గుజరాత్‌లో ఏ రోజూ పెద్దగా గౌరవం లేదు. గాంధీ ప్రభావం అత్యున్నత దశలో ఉన్నప్పుడు సహితం ఇక్కడి కాంగ్రెస్ గాంధీ కాంగ్రెస్ కాదు. సర్దార్ పటేల్ కాంగ్రెస్' అని అహమ్మదాబాద్‌లోని సీనియర్ మానవ హక్కుల న్యాయవాది గిరీష్ పటేల్ అంటారు. నెహ్రూ అంటే గుజరాతీలలో అత్యధికులకు ఎప్పుడూ అభిమానం లేదంటాడు. ఆర్థిక విధానాలలో నెహ్రూవాదాన్ని తొలినాడే వ్యతిరేకించి పెట్టుబడిదారీ ఆర్థిక విధానాన్ని తన పాలసీగా ప్రకటించుకున్న స్వతంత్ర పార్టీ తన స్వంత బలంతో అధికారం చేపట్టినంత పని చేసిన ఏకైక రాష్ట్రం గుజరాత్. 1962 ఎన్నికలలో కేవలం 10 సీట్ల తేడాతో స్వతంత్ర పార్టీకి అధికారం చేయిజారింది. ఇందిరాగాంధీ హయాంలో కాంగ్రెస్ పార్టీలో అభ్యుదయవాదులు, తిరోగామివాదులు అన్న విభజన వచ్చినప్పుడు గుజరాత్‌లో కాంగ్రెస్ పార్టీ మీద ఆ చీలిక ప్రభావం అత్యల్పంగా ఉండింది. దాదాపు మొత్తంగా ఆ పార్టీ మొరార్జీ దేశాయితోనే ఉండిపోయింది. పారిశ్రామికంగా గుజరాత్ అభివృద్ధి కాకముందు, వేరుశెనగపంట, నూనె వ్యాపారం ఆర్థిక రంగంలో ప్రధాన పాత్ర నిర్వహించాయి. 'గ్రౌండ్‌నట్ లాబీ' గుజరాత్ రాజకీయాలను శాసించేది. ఇందులో ప్రధాన భాగం పటేళ్లది. ఒకపక్క హరిత విప్లవం వల్ల పెరిగిన వ్యవసాయ వైవిధ్యం, ముఖ్యంగా ఆనంద్ కేంద్రంగా పెరిగిన పాడి పరిశ్రమ, మరొకవైపు గడచిన దశాబ్దన్నర కాలంలో జరిగిన పారిశ్రామీకరణ, అవే వర్గాలకూ, కులాలకూ మరింత బలాన్ని ఇచ్చాయి.

ఈ ఆర్థిక ఆధిపత్యాన్ని కొంతవరకైనా ఎదుర్కొనగల కమ్యూనిస్టు ఉద్యమం గుజరాత్‌లో ఎదగలేదు. బొంబాయి నగరంలో బలంగా ఉండిన కమ్యూనిస్టు పార్టీ కార్మిక సంఘాలు అహ్మదాబాద్‌లో బలపడలేకపోయాయి. ఇక్కడ మాత్రం గాంధేయవాదం స్థానిక పాలకవర్గానికి పనికొచ్చింది! గాంధేయవాద పారిశ్రామిక సంబంధాల సిద్ధాంతం అహమ్మదాబాద్‌లో బలంగా పనిచేయడం వల్ల కమ్యూనిస్టులకు పెద్దగా చోటు దొరకలేదు. కార్మికవర్గంలో చోటు దొరకని కమ్యూనిస్టులకు సమాజంలో చోటు దొరకడం కూడా కష్టమయింది. అందువల్ల మొత్తంగానే కమ్యూనిస్టుల ప్రభావం గుజరాత్‌లో తక్కువ. దళిత ఉద్యమంగానీ స్వతంత్రమైన ఆదివాసీ ఉద్యమాలు గానీ గుజరాత్‌లో అసలు మొలకెత్తనే లేదు.

'గుజరాత్‌లో వచ్చిన అన్ని ఉద్యమాలూ తిరోగామి ఉద్యమాలే'నని గిరీశ్ పటేల్ అంటారు. 1969లో కాంగ్రెస్ పార్టీలో చీలిక వచ్చినపుడు గుజరాత్‌లో ఆ పార్టీ దాదాపు మొత్తంగానే మొరార్జీదేశాయితో ఉండిపోగా, ఇందిరాగాంధీ ముస్లిం – దళిత – ఆదివాసీల ప్రాతిపదికన తన పార్టీని నిర్మించే కార్యక్రమం చేపట్టింది. 1972లో జయప్రకాష్ నారాయణ్ ఇందిరాగాంధీ అవినీతి రాజకీయాలకు వ్యతిరేకంగా తిరగబడమని ఇచ్చిన పిలుపు బీహార్‌లోనూ, గుజరాత్‌లోనూ యువజన ఉద్యమాలకు దారితీసిన సంగతి తెలిసిందే. కానీ బీహార్‌లో జె.పి. ఉద్యమం ప్రజా ఉద్యమరూపం తీసుకోగా, గుజరాత్ నవనిర్మాణ్ సమితికి ఆ స్వభావం ఎప్పుడూ లేదంటారాయన. 'అహమ్మదాబాద్ నగరంలో కొందరు మేధావులు అందులో పాల్గొనడం వల్ల కొంత ప్రజాతంత్ర స్వభావాన్ని కలిగి ఉండింది గానీ, జిల్లాలలో ముస్లిం వ్యతిరేక, దళిత వ్యతిరేక, ఆదివాసీ వ్యతిరేక బ్రాహ్మణ – బనియా – పటేల్ ఉద్యమంగా నడిచింది' అని గిరీష్ పటేల్ అంటారు. 'జెపికి తెలియదుగానీ గుజరాత్‌లో జె.పి. ఉద్యమం అత్యంత రియాక్షనరీ ఉద్యమం' అంటారు. 'ఆ తరువాత వచ్చిన ఎమర్జెన్సీ వ్యతిరేక ఉద్యమం కూడా ఆర్ఎస్ఎస్ – జనసంఘ్ – మొరార్జీ కాంగ్రెస్‌ల ఉద్యమమే గుజరాత్‌లో. వాళ్ల తిరోగామి రాజకీయాలు బలపడడానికి ఉపయోగపడింది' అంటారు.

1981లో ఒకసారి, 1986–87లో ఒకసారి గుజరాత్‌లో రిజర్వేషన్ వ్యతిరేక 'ఉద్యమాలు' నడిచాయి. అన్ని రాష్ట్రాలలోనూ అటువంటి 'ఉద్యమాలు' నడిచాయి గానీ గుజరాత్‌లో అవి దళిత వ్యతిరేక హింసాకాండ రూపం తీసుకున్నాయి. దళితులను చంపారు. ఇళ్లు తగులబెట్టారు. మధ్యతరగతి ప్రాంతాలలో నివసిస్తున్న దళితులను బలప్రయోగంతో బయటకు తరిమేశారు. ఆ సమయంలో ఏదైనా ప్రజాతంత్ర రాజకీయ ఉద్యమం దళితులను ఆర్గనైజ్ చేసి వుంటే సంఘ్‌పరివార్ విస్తరణకు దళితులు ఆటంకంగా నిలిచి ఉండేవారేమో. కానీ అప్పుడది జరగలేదు. ఆ తరువాత రిజర్వేషన్లు స్థిరపడ్డాయి. ఇష్టమున్నా లేకున్నా పెత్తందారీ కులాలు రిజర్వేషన్లను అంగీకరించక తప్పలేదు. ఈ దశలో దళితులను – ముఖ్యంగా కొత్తగా చదువుకున్న దళితులను – తమవైపు తిప్పుకోవడం సంఘ్‌పరివార్‌కు కష్టం కాలేదు.

స్వాతంత్ర్యానికి పూర్వం అహమ్మదాబాద్ నగరం ముస్లింలీగ్‌కు ఒక బలమైన కేంద్రంగా ఉండింది. ముస్లింలీగ్ ఆధ్వర్యంలో దౌర్జన్యం కూడా జరిగేది. 1941లో

జరిగిన మొదటి మత ఘర్షణలో హిందువులే ఎక్కువ దెబ్బతిన్నారు. 1947లో ముస్లింలీగ్ నాయకత్వం, మరికొందరు ముస్లిం ప్రముఖులు పాకిస్తాన్‌కు వెళ్లిపోగా అహమ్మదాబాద్‌లో 'ముస్లిం' పార్టీ అనేదేదీ లేకుండా పోయింది. ఆ తరువాత జరిగిన ప్రతీ మత ఘర్షణలోనూ ముస్లింలే ఎక్కువ నష్టపోయారు. 1969లో మొదట జరిగింది గోమతీపూర్‌లో. ముస్లింల మత ఊరేగింపు మీదికి జగన్నాథుడి గుడి నుండి ఒక ఆవు వచ్చింది. వాళ్లు దానిని పక్కకు తరిమేశారు. ఈ ఘటనను 'గుజరాత్ సమాచార్' ఆవుమీద ముస్లింల దౌర్జన్యంగా ప్రచారం చేస్తూ చిలవలూ పలవలూ అల్లి రాసింది. దానితో మొదలయిన మత ఘర్షణలో ముస్లింలు ప్రధానంగా నష్టపోయారు. దాదాపు 40 వేల మంది నిర్వాసితులయ్యారు. ముస్లింల మీద దాడిగా మొదలైన హింసాకాండ దళిత వ్యతిరేక రూపం కూడా తీసుకుంది. ఆ అల్లర్ల మీద న్యాయ విచారణ జరిపిన జస్టిస్ జగన్మోహన్ రెడ్డి కమిషన్ రిపోర్టు ఆర్ఎస్ఎస్, జనసంఘ్ కావాలని అల్లర్లు చేయించాయని నిర్ద్వంద్వంగా తప్పు పట్టింది. అయితే '1941కి జవాబు చెప్పాం' అని దుండగులు సంతృప్తి ప్రకటించుకున్నారు.

1969 నుండి ఇవ్వాల్టి దాకా మత ఘర్షణలు, మైనారిటీలపైన దాడులు గుజరాత్‌లో జరుగుతూనే వున్నాయి. 443 చిన్నవీ పెద్దవీ ఘటనలు జరిగాయని జాతీయ మానవ హక్కుల కమిషన్ మొన్నటి మారణకాండపైన తాను ప్రకటించిన ప్రాథమిక నివేదికలో అనింది. 1985లో, 1990లో, 1992-93లో పెద్దఎత్తున జరిగాయి. అహమ్మదాబాద్ నగరంలో ఒక్కొక్క ఘర్షణతోనూ ముస్లింలను 'ఘెట్టో'లోకి నెట్టేసే ప్రయత్నం ఒక్కొక్క అడుగు పురోగమించిందనీ, 1993 నాటికి ముస్లింలను సబర్మతీ తూర్పు తీరాన ఉన్న కొన్ని బస్తీలకు పరిమితం చేసే పని పూర్తి అయిందనీ విల్‌ఫ్రెడ్ డీసౌజా అనే సామాజిక కార్యకర్త అంటారు.

1997-98లో క్రైస్తవులపైన కూడా గుజరాత్ రాష్ట్రంలో చాలాచోట్ల దాడులు జరిగాయి. దాదాపు 50 ఘటనలు జరిగాయని అధికార గణాంకాలే చెప్తాయి. చర్చిలపైన, ప్రార్థనా స్థలాలపైన, ప్రచారకులపైన దాడిచేసి సమావేశాలను చెల్లాచెదురు చేశారు, కొట్టారు, బైబిల్ ప్రతులను తగులబెట్టారు. విశ్వహిందూ పరిషత్, బజ్రంగ్‌దళ్, బిజెపి నాయకులు ఈ దాడులలో స్వయంగా పాల్గొన్నారు.

1999 జులై నెలలో కార్గిల్ యుద్ధమప్పుడు సంఘ్‌పరివార్ సంస్థలు పాకిస్తాన్‌ను నిందించే పేరుమీద ముస్లింల మీద నిందలు వేస్తూ అల్లర్లకు పాల్పడ్డారు. అహమ్మదాబాద్‌లోని మేంనగర్ ప్రాంతంలో ఒక ముస్లింకు చెందిన

భాగ్యోదయ రెస్టారెంట్‌ను తగలబెట్టారు. నగరంలో నాలుగయిదు ప్రాంతాలలో దొమ్మీలు జరిగాయి. కాశ్మీర్‌లో ఏం జరిగినా, భారత – పాకిస్తాన్‌ల మధ్య ఏం జరిగినా దానికి బాధ్యత భారతదేశంలోని ముస్లింలదయినట్టు వారిని దూషిస్తూ నినాదాలు ఇవ్వడం, రాతలు రాయడం, రెచ్చగొట్టి దొమ్మీలకు దిగడం గుజరాత్‌లో మామూలు విషయం అయిపోయింది.

ఈ దొమ్మీలలోనూ దాడులలోనూ ఆదివాసీ, దళిత ప్రజానీకాన్ని సంఘ్‌పరివార్ సంస్థలు పెద్దఎత్తునే సమీకరించగలిగాయి. మొన్నటి దొమ్మీలలో కూడా పంచ్‌మహల్స్, దాహోద్, సబర్‌కాంటా జిల్లాలలోనూ, బరోడా జిల్లాలోని ఛోటా ఉదేపూర్ ప్రాంతంలోనూ ఆదివాసీలు వేల సంఖ్యలో పాల్గొన్నారు. దాడులకు పాల్పడిన గుంపులకు నాయకత్వం వహించిన వారు ఎక్కువగా గిరిజనేతర సంఘ్‌పరివార్ కార్యకర్తలు, స్థానిక గ్రామస్తులు కాగా, వారి వెనక ఆదివాసీలు పెద్దసంఖ్యలోనే సమీకృతమయ్యారు.

గుజరాత్ రాష్ట్రం ఉత్తర, ఈశాన్య ప్రాంతాలలో ఆదివాసీ తెగల ప్రజలు పెద్దసంఖ్యలో ఉన్నారు. భిల్లు, రత్వా, నాయక్, కోలి, ధనక్, తాడ్వి, వసవా మొదలయినవి అక్కడి తెగలు. భిల్లులు గుజరాత్‌లోనే కాక ఉత్తరాన రాజస్థాన్‌లో, ఈశాన్యం దిక్కున మధ్యప్రదేశ్‌లో కూడా ఉన్నారు. (ఈ మూడు రాష్ట్రాలలోనూ కలిపి 25 జిల్లాలలో భిల్లులు ఉన్నారనీ, ఆ ప్రాంతమంతా కలిపి ఒక భిల్లు రాష్ట్రం ఏర్పాటు చేయాలన్న డిమాండు ఇప్పుడిప్పుడే ఆవిర్భవిస్తున్నదనీ ఒక ఉద్యమకారుడు అంటాడు).

ఈ ఆదివాసీ ప్రజానీకాన్ని ఆకట్టుకోవడానికి విశ్వహిందూ పరిషత్ పనిగట్టుకొని కృషి చేసింది. వనవాసీ కళ్యాణ్ సమితి (లేక పరిషత్) అనే సంస్థను నెలకొల్పింది. పైన చెప్పిన ప్రాంతాలలో దాదాపు ప్రతీ ఆదివాసీ గ్రామంలోనూ ఒక పరిషత్ కార్యకర్త ఉంటాడని ఛోటాఉదేపూర్‌లో మేము కలిసిన ఒక కాలేజీ ప్రిన్సిపాల్ అంటాడు.

ఈ వనవాసీ కళ్యాణ్ సమితి కార్యకలాపాలు ఏమిటని మేము ఛోటా ఉదేపూర్‌కు చెందిన ఒక చిరకాల స్వయంసేవకుడిని ప్రశ్నించాము. ఆదివాసీ గ్రామాలలో తాగుడు మానమని ప్రచారం చేయడం, ఊరూరా వినాయకుడి విగ్రహాలు పంచి భజనలు నిర్వహించడం వారి కార్యక్రమాలు అని ఆయన వివరించాడు. ఇవి రెండూ కూడా ఆదివాసీల హైందవీకరణలో భాగమే. హిందువులు తాగరని కాదుగానీ తాగడం తప్పు అనేది ఒక బ్రాహ్మణీయ విలువ.

కొత్తగా విద్యావంతులవుతున్న ఆదివాసీ యువకులకు ఆ విలువను నేర్పించి వారి ద్వారా తాగుడు మాన్పించే ప్రచారాన్ని సంఘ్‌పరివార్ గ్రామాలలో చేపట్టింది. ఆ ప్రజల జీవిత ఆచారాలూ అలవాట్లూ అల్పమైనవి, నీచమైనవి అని నేర్పడం వారిని 'హిందువు' అనే గుర్తింపులో భాగం చేయడానికి తోడ్పడింది. గణేశ్ పూజ కూడా అంతే. వారి దేవుళ్లు నిజమైన దేవుళ్లు కారనీ, హిందూ దేవుళ్లే నిజమైన దేవుళ్లని నేర్పి వారిచేత పాత దేవుళ్ల పూజలు మాన్పించి వినాయకుడి పూజలు, భజనలు చేయించడం హైందవ సమాజంలో వారిని భావనాపరంగా కలుపుకునే ప్రక్రియ. ఇది ఛోటాఉదేపూర్, పంచ్‌మహల్స్ ప్రాంతాలలో చాలాదూరం పోయిందని ప్రొఫెసర్ యూసుఫ్ పఠాన్ అనే ఒక కాలేజీ ప్రిన్సిపాల్ అంటాడు. 1500 మంది విద్యార్థులలో 1300 మంది ఆదివాసీలయిన తన కాలేజీలో విద్యావంతులయిన ఆదివాసీలలో విశ్వహిందూపరిషత్ తీసుకొస్తున్న పరిణామాలను గమనించడం ఆయనకు సులుభం అయింది. 'కొత్తగా విద్యావంతులయినవారు ఒక ఐడెంటిటీ కోరుకుంటారు. వారి జీవన స్థితిగతులు గానీ సామాజిక స్థితిగతులు గానీ ఏమాత్రం మార్చకుండా వారికి హిందువు అన్న గుర్తింపు ఇవ్వడంలో విశ్వహిందూ పరిషత్ విజయం సాధించింది' అంటాడు. 'మా ముస్లింలలో కొత్తగా మతం పుచ్చుకున్న వాళ్లు మతాన్ని కాపాడే విషయంలో ఎక్కువగా ఆవేశపడడం చూస్తుంటాం. ఆదివాసీల విషయమూ అంతే అయి ఉండాలి' అంటాడు. ఆదివాసీలకు సహజమైన ధైర్య సాహసాలకు కొత్తగా అంకురించిన 'హిందువు' అన్న భావన తోడయి చాలా హింసాత్మక పరిణామాలకు దారితీసింది.

ఇక్కడ 'హిందువు' అనే భావనను కేవలం వినాయకుడినీ, రాముడినీ పూజించేవారు అనే అర్థంలో కాక, సంఘ్‌పరివార్ ఆ మాటకిచ్చే రాజకీయ అర్థంలో తీసుకోవడం అవసరం. ఆ అర్థంలో అది ఆదివాసీ గ్రామాలలో ప్రచారం చేయబడుతున్నది. అందులో ముస్లింల పట్ల విద్వేషం విడదీయరాని భాగం.

బజ్రంగ్‌దళ్ ఆదివాసీయేతర గ్రామాలలో నిర్వహించే కార్యక్రమాలలో కూడా భజనలు, వాటికి అనుబంధంగా జరిగే 'దేశభక్తి'యుతమైన ప్రబోధనం చాలా ముఖ్యమైనవి. ఈ బోధనా కార్యక్రమంలో వాళ్లు భారతదేశ చరిత్ర గురించి, సమాజం గురించి ఇచ్చే వ్యాఖ్యలు గ్రామీణ యువతపైన వేసే ప్రభావం చాలా నష్టకరమైనది.

విశ్వహిందూ పరిషత్ గుజరాత్ రాష్ట్ర నాయకుడు చినూభాయి పటేల్ మొన్నటి ఏప్రిల్ 4న చందాల కోసం అహమ్మదాబాద్‌లోని వ్యాపార వర్గాలకు

రాసిన ఉత్తరాన్ని ఇప్పటికే ప్రస్తావించి వున్నాము. అందులో నుండి కొన్ని వాక్యాలు ఉటంకిస్తే, చరిత్రకు వారు ఇస్తున్న వ్యాఖ్యానం అర్థం అవుతుంది. యువకుల మెదళ్లలోకి ఆరకమైన వ్యాఖ్యానాలు ఎక్కించడం వల్ల వచ్చే భయంకర పరిణామాలూ అర్థం అవుతాయి.

చినూభాయి పటేల్ ఈవిధంగా అంటాడు:

> ముస్లింలను అర్థం చేసుకోవాలంటే ఇస్లాంను అర్థం చేసుకోవాలి. ఒకటి రెండు ఘటనలతో మీరు ఇస్లాంను అర్థం చేసుకోలేరు – మూలాలను తాకేంత లోతుగా పోవాలి. ఇస్లాం ఆవిర్భవించిన తరువాత ఈ 1400 సంవత్సరాల పర్యంతం ఉన్మాదులయిన అరబ్బులు ఒక చేత్తో కత్తి, ఒక చేత్తో ఖురాన్ పట్టుకొని ప్రపంచం మీద పడ్డారు. వాళ్ల మాట ఒక్కటే – ఇస్లాంను అంగీకరించు, లేకపోతే చస్తావు. ఇస్లాంను అంగీకరించని కారణంగా 10 కోట్ల మందిని చంపారు. ఆయా దేశాల సంప్రదాయ సంస్కృతిని తుడిచిపెట్టేసారు. ఆ దేశాలను ముస్లిం దేశాలుగా ప్రకటించి, అక్కడ ఇస్లాం పతాకం ఎగురవేసారు.
>
> *మన దేశంలో ఔరంగజేబు, బాబర్, హుమయూన్, అక్బర్, చెంగిజ్‌ఖాన్, మహమ్మద్ ఘోరి, మహమ్మద్ గజనీ, షాజహాన్ తదితర హంతకులు, ఉన్మత్తులు, నియంతలు అయిన ముస్లిం పాలకులు మనల్ని బానిసలు చేసి పరిపాలించారు. గడచిన 1000 సంవత్సరాల ముస్లిం పాలనలో భారతదేశంలో ముస్లింలు 10,000 యుద్ధాలు చేసి మత ఘర్షణలు రెచ్చగొట్టి రెండు కోట్ల హిందువులను చంపారు. రెండు లక్షల మంది సాధువులనూ సంత్‌లనూ చంపారు. అయిదు లక్షల హిందూ దేవాలయాలను కూల్చారు. వాటిలో నాలుగు అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి, మధురలోని శ్రీకృష్ణ జన్మభూమి, వారణాసిలోని శ్రీ కాశీ విశ్వనాథాలయం, గుజరాత్‌లోని శ్రీ సోమనాథ్ దేవాలయం. కూల్చిన ఈ దేవాలయాల స్థానంలో మసీదులు కట్టారు. లక్షల సంఖ్యలో హిందూ స్త్రీలపైన (తల్లులు, చెల్లెళ్లు, కూతుర్లపైన) అత్యాచారం చేసారు. కోట్ల సంఖ్యలో గోవులను వధించారు. ఇవన్నీ మనం మరచిపోయినట్టయితే దేవుడు కూడ మనల్ని కాపాడలేడు.*

ఇటువంటి వాక్యాలు ఆ ఉత్తరంలో ఇంకా చాలా ఉన్నాయి. విపరీతమైన అతిశయోక్తులు, అబద్ధాలు నిండి ఉన్న ఈ వాక్యాలలో గమనించవలసిన ముఖ్యమైన విషయం ఏమిటంటే ముస్లిం మతస్తులయిన వ్యక్తులు చేసినట్టు చెప్పబడుతున్న ఈ ఘోరాలన్నీ ఇస్లాంకే ఆపాదించబడడం. ఇస్లాం స్వభావం నుండే ఈ ఘోరాలన్నీ పుట్టాయి. కాబట్టి ఒక ముస్లింకూ మరొక ముస్లింకూ తేడా చూడవలసిన అవసరం ఏముంది? ఇస్లాం అంటేనే హింస, పీడన అని ప్రకటించిన తరువాత ప్రతీ ముస్లిం టెర్రరిస్టేనన్న నిర్ధారణకు తర్కబద్ధంగానే రావచ్చును కదా!

కానీ ఇస్లాం చరిత్రే ఇది అని చెప్పాలంటే ఇప్పుడున్న చరిత్ర పుస్తకాలను తగలబెట్టి విద్యార్థులకు దొరకకుండ చేయాలి. విద్యార్థుల పాఠ్య పుస్తకాలు 'సరయిన' రీతిలో తిరగరాయాలి. ఇప్పుడున్న చరిత్ర పుస్తకాలు ఇస్లాం చరిత్రను అంత ఘోరమైనదిగా చూపవు. కత్తి పట్టుకొని ఇస్లాంను వ్యాపింపజేసిన దానికంటే వర్తక వ్యాపారాల ద్వారాను, సూఫీ ప్రచారకుల ప్రేమమయమయిన బోధనల ద్వారానూ వ్యాపించినదే ఎక్కువ అని చరిత్ర పుస్తకాలు చెప్తాయి. దీని అర్థం బలప్రయోగంతో మత మార్పిడి చేసిన ముస్లిం పాలకులు లేనేలేరని కాదు. ఇస్లాం వ్యాప్తికి ఇదే ప్రధాన కారణం కాదని మాత్రమే. భారతదేశాన్ని ఏలిన ముస్లిం పాలకులందరి పాలనానైజం ఒకేరకంగా లేదని కూడ చరిత్ర పుస్తకాలు చెప్తాయి. హిందూ మతస్తుల పట్ల వివక్ష చూపించిన ముస్లిం పాలకులు కొందరు ఉన్నట్టే అందరి పట్లా సమభావం చూపించిన వారూ ఉన్నారని చెప్తాయి. హిందువుల దేవాలయాలను ధ్వంసం చేసిన ముస్లిం పాలకులున్నట్టే దేవాలయాలు కట్టుకోవడానికి వనరులూ వసతులూ ఇచ్చినవారూ ఉన్నారని చెప్తాయి. (అదేవిధంగా, బౌద్ధ జైన విహారాలను ధ్వంసం చేసి అక్కడ దేవాలయాలు నిర్మించిన హిందూ పాలకులు ఉన్నారని కూడ చెప్తాయి). ఇంక రెండు కోట్ల హిందువులను చంపడం, రెండు లక్షల సాధువులను చంపడం, అయిదు లక్షల దేవాలయాలు కూల్చడం – ఈ సంఖ్యలకు చరిత్రలో ఏ ఆధారాలూ లేవని ఇప్పుడున్న చరిత్ర పుస్తకాలు చదివితే తెలుస్తుంది.

అందుకే ఇప్పుడున్న చరిత్ర పుస్తకాలన్నిటినీ తిరగరాయాలని సంఘ్ పరివార్‌కు అంత పట్టుదల. అప్పుడు ఈ అబద్ధాలు, అతిశయోక్తులే 'చరిత్ర' అవుతాయి.

ఆ రోజు ఇప్పటికింకా దూరమే ఉందిగానీ ఈ లోపల బజ్రంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్, దుర్గావాహిని, ఆర్ఎస్ఎస్ మొదలైన సంఘ్‌పరివార్ సంస్థల ప్రచార సాహిత్యంలోనూ వారి కార్యకర్తల శిక్షణా శిబిరాలలోనూ బోధిస్తున్న 'చరిత్ర' ఇది. వారి వనవాసి కళ్యాణ్ సమితి కార్యకర్తలకు నేర్పుతున్న 'చరిత్ర' ఇది. ఆదివాసీలకు అందిస్తున్న హిందువు అనే గుర్తింపు, ఈ చరిత్రలో కనిపించే 'ముస్లిం'కు ప్రత్యర్థిగా నిర్వచించబడిన 'హిందువు'. పట్టణాలలోని దళితులకూ ఇతర అణగారిన కులాల యువకులకూ కూడ అంతే. కొత్తగా విద్యావంతులయి, నూతన సామాజిక రాజకీయ చైతన్యం పొందుతున్న వారికి సంఘ్‌పరివార్ ద్వారా అందుతున్న వికాసం ఇదే.

ఈ విద్వేషపూరితమైన 'చరిత్ర'ను ఒంటబట్టించుకున్న యువకులు గత అధ్యాయంలో వర్ణించిన అతిక్రూరమైన హింసకు పాల్పడ్డారంటే ఆశ్చర్యం ఏముంది?

# VII

## పోలీసుల భాగస్వామ్యం

సంఘ్‌పరివార్ గుజరాత్‌లో నిర్వహించిన మారణకాండలో పోలీసుల పాత్ర పలురకాలుగా ఉండింది. పోలీసులు చట్టం ప్రకారం నిర్వహించవలసిన పాత్ర నిర్వహించింది అతి కొన్ని ప్రదేశాలలోనే. మేము పర్యటించిన ప్రాంతాలలో ఒక్క మెహసానా జిల్లాలో మాత్రమే ఒకటి రెండు చోట్ల పోలీసులు సకాలంలో జోక్యం చేసుకోవడం వల్ల చాలా ప్రాణాలు దక్కాయని బాధితులు చెప్పారు.

అత్యధిక భాగం గ్రామాలలోనూ పట్టణాలలోనూ అందుకు పూర్తి భిన్నమైన కథలు విన్నాము. రెండు ఉదంతాలు 5వ అధ్యాయంలో చూసాము. గుల్బర్గ్ సొసైటీ పైన దాడి పోలీసు కమిషనర్ స్వయంగా వచ్చి మాజీ ఎం.పి. ఎహసాన్ జాఫ్రీకి హామీ యిచ్చిపోయిన అయిదు నిముషాలకు మొదలయి, దాదాపు ఆరున్నర గంటలసేపు నిరాటంకంగా జరిగింది. జాఫ్రీతో సహా 59 మంది అతి క్రూరమైన హింసకు గురయి చనిపోయారు. ఆ తరువాత గానీ పోలీసులు పునర్దర్శనం ఇవ్వలేదు. ఇది జరిగింది ఎక్కడో మారుమూల గ్రామంలో కాదు. అహమ్మదాబాద్ నగరంలో జరిగింది. పట్టపగలు జరిగింది.

బరోడాలోని బెస్ట్ బేకరీ ఉదంతం కూడ అటువంటిదే. రాత్రి 8.00 గంటలకు దాడి మొదలయింది. బాధితులు పోలీసులకు ఫోన్ చేసారు. ఒక గంటన్నర తరువాత పోలీసు జీపు వచ్చింది. ఒక్క నిమిషం బేకరీ దగ్గర ఆగి,

జరుగుతున్న దాడిని గమనించి పోలీసులు వెళ్లిపోయారు. మళ్లీ పొద్దున్న 10.00 గంటల దాకా రాలేదు. ఆ లోపల దుండగులు 14 మందిని చంపి, బేకరీని తీరికగా లూటీచేసి తగలబెట్టారు.

నిజానికి శిబిరాలలోని ముస్లిం బాధితులతో మాట్లాడుతుంటే ఇటువంటి ఉదంతాలు కోకొల్లలుగా తెలిసాయి. బాధితులు పోలీస్ అధికార్లకు ఫోన్ చేస్తే పలకకపోవడం, 'వస్తాంలే' అని అస్పష్టంగా జవాబు చెప్పడం, 'మా దగ్గర బందోబస్తు లేదు, మేమేం చెయ్యలేము' అనడం, 'మీరే ఎటైనా పారిపోండి' అని సలహా ఇవ్వడం వందల కేసులలో జరిగింది. ఇక్కడ కొన్ని ఉదాహరణలు మాత్రమే ఇస్తాము.

దాహెూద్ జిల్లాలోని సుక్సార్ గ్రామంలో పోలీసు ఔట్‌పోస్టు ఉంది. ఔట్‌పోస్ట్‌కు అనుబంధంగా ఎస్‌ఆర్‌పి (రాష్ట్ర రిజర్వ్ పోలీసు) పికెట్ కూడ ఉంది. మార్చి 1 మధ్యాహ్నం ఆ గ్రామ హిందువులూ పరిసర గ్రామాల ఆదివాసులు కలిసి పెద్ద గుంపుగా ముస్లింలపైన దాడి మొదలుపెట్టగానే వారు పోలీసు ఔట్‌పోస్టుకు పోయి ఫిర్యాదు చేసారు. 'మేమేం చేయలేము. మాకు ఆర్డర్స్ లేవు. మిమ్మల్ని మీరే కాపాడుకోండి' అని పోలీసులు అన్నారు. నిజానికి అప్పుడు కర్ఫ్యూ అమలులో ఉండింది. కర్ఫ్యూ ఉల్లంఘించి దొమ్మీకి పాల్పడుతున్న గుంపుపైన చర్య తీసుకోవడానికి పోలీసులకు చట్టంలోనే అధికారాలు ఉన్నాయి (కర్ఫ్యూ లేకపోయినా దొమ్మీలను అరికట్టడానికి పోలీసులకు సకల అధికారాలు ఉన్నాయన్నది వేరే సంగతి). అయినప్పటికీ 'మాకు ఆర్డర్లు లేవు' అన్నారంటే వారి ఉద్దేశ్యం స్పష్టమే. ఆ తరువాత బాధితులు పారిపోగా ఆ ఊరిలోని అందరు ముస్లింల ఇళ్లూ, రెండు కట్టెకోత మిషన్లూ దోపిడీకీ, దహనానికీ గురయ్యాయి.

* బరోడా (రూరల్) జిల్లా ఛోటా ఉదేపూర్ తాలూకా కేంద్రంలోని శిబిరంలో మూడు తాలూకాల శరణార్థులు 3000 మంది దాకా ఉన్నారు. వారి ఉమ్మడి కథనం ప్రకారం ఈ ప్రాంతంలో లూటీ, దహనకాండ మార్చి 2న మొదలయి మార్చి 11 దాకా సాగింది. మొదటిరోజు పోలీసులకు సమాచారం లేదని అనుకున్నా, పది రోజులూ కూడ వారు తెలియకనే ఉండిపోయారంటే నమ్మడం అసాధ్యం. అయితే ఆ పది రోజులలో ఎక్కడా దుండగులను పోలీసులు అటకాయించిన ఉదంతాలు లేవు, ఆపడానికి ప్రయత్నం చేసిన ఉదంతాలు లేవు. దుండగులు వేల సంఖ్యలో ట్రక్కులలో, వ్యాన్‌లలో గట్టిగా నినాదాలు ఇచ్చుకుంటూ తల్వార్లూ, త్రిశూలాలూ బహిరంగంగా

ప్రదర్శించుకుంటూ ఒక ఊరి నుండి ఒక ఊరికి పోతూ స్వైర విహారం చేసారు. వారు ఎదురుపడినా కూడా పోలీసులు వారిని ఆపడానికి కించిత్తు కూడ ప్రయత్నం చేయలేదు. పైగా కవాట్ తాలూకా కేంద్రంలో లూటీ జరుగుతుండగా పోలీసులు నిలబడి చూసారు. కర్జన్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన సి.డి. పర్మార్ అనే పోలీసు అధికారి అయితే ఆ ఊరిలో జరిగిన లూటీలో స్వయంగా పాల్గొన్నాడు. ముస్లింలు భద్రత కోసమని పన్వాడ్‌లోని పోలీస్ ఔట్‌పోస్ట్ ఆవరణలో అయిదు టెంపోలు, వ్యాన్‌లు తెచ్చిపెట్టగా, వాటిని దుండగులు ఔట్‌పోస్ట్ ఆవరణలోనే, డిఎస్‌పి చూస్తుండగానే దహనం చేసారు. ఈ దహనకాండ గురించి పంచనామా నిర్వహించిన డిఎస్‌పి కేశవ్‌కుమార్ (కొంచెం సిగ్గు మిగిలి ఉండడం వల్ల కాబోలు) దహనకాండ ఎక్కడ జరిగిందో పంచనామా రిపోర్టులో రాయలేదు.

* అహమ్మదాబాద్ నగరంలోని నరోడా ప్రాంతంలో మారణకాండ నుండి తప్పించుకోవడానికి పోలీస్‌స్టేషన్ వైపు పరుగెత్తిన ముస్లింలపైన ఇన్స్‌పెక్టర్ కె.కె. మైసూర్‌వాలా బాష్పవాయు ప్రయోగం చేసి తన స్టేషన్ దగ్గరకు రాకుండ ఆపాడు. ఒకరిద్దరు అప్పటికీ అతనిని సమీపించి రక్షణ కోసం అభ్యర్థించగా, 'పోపో! నాకు పైనుండి ఆర్డర్లు ఉన్నాయి' అంటూ తరిమేసాడు.

* నిరాటంకంగా జరుగుతున్న దాడులకు భయపడి దూర ప్రాంతాలకు వెళ్లిపోదామని ప్రయత్నించిన ముస్లింలను పసిగట్టడానికి రాష్ట్రంలోని ప్రధాన రహదార్ల మీద స్కూటర్లు, మోటార్ సైకిళ్లతో సంఘ్‌పరివార్ దుండగులు పహారా కాసారని దాహొూడ్ జిల్లా సంజేలి శిబిరంలో అన్నారు. టెంపోలలో, వ్యాన్‌లలో ముస్లింలు పోతున్నారని గమనించినట్టయితే సెల్ ఫోన్లలో ఆ సమాచారం ముస్లింలు పోతున్న దిశలో ఉన్న ఊర్లకు చేరవేసేవారు. అక్కడి నుండి పెద్ద గుంపు ట్రక్కులలో బయలుదేరి పారిపోతున్న వారిని చుట్టుముట్టి వాహనంతో సహా వారిని తగలబెట్టడం, పారిపోయే ప్రయత్నం చేస్తే నరికి చంపడం అనేక సందర్భాలలో జరిగింది. ఇటువంటి అతి ఘోరమైన ఘటన ఒకటి అయిదవ అధ్యాయంలో చూసాము. సబర్‌కాంటా జిల్లాలోని మాల్‌పూర్ గ్రామ ముస్లింలు పారిపోయే ప్రయత్నం చేయగా వారిని వెంబడించి చుట్టుముట్టి పంచ్‌మహల్స్ జిల్లా లింబిడియా చౌకి దగ్గర వాహనాలను తగలబెట్టి 74 మందిని హతమార్చారని చూసాం. అయితే ఇది అతి ఘోరమైన ఘటన మాత్రమే. (దానికంటే తక్కువ స్థాయి ఘటనలు చాలా జరిగాయి).

రాష్ట్రంలోని ప్రధాన రహదార్లన్నిటిమీదా ఈ వేట సాగుతుండగా పోలీసులు రహదార్ల మీద పెట్రోలింగ్ ఏర్పాటు చేయడంగానీ, చెక్‌పోస్ట్‌లు ఏర్పాటు చేయడంగానీ జరగలేదు. పట్టణాలనూ పల్లెలనూ దుండగులకు అప్పగించి ఠాణాలలో కూర్చున్నారు.

ఒకరిద్దరు పోలీస్ అధికార్లు చొరవ తీసుకున్నా సంఘ్‌పరివార్ మూకలు వారిని ఖాతరు చేయలేదు. పైనుండి తమకు సపోర్టు ఉందని వారికి తెలుసు. తమ హత్యాకాండకు అడ్డమొచ్చిన పోలీస్ అధికారి ఒంటరిగా అడ్డుపడవలసిందే తప్ప ఏ బలగాన్నీ తెచ్చుకోలేడని తెలుసు.

సంజేలి గ్రామస్తులు ఈ వాస్తవాలను ఒకరోజు మొత్తం నరకయాతన అనుభవించి తెలుసుకున్నారు. మార్చి 1వ తేదీన ఆ ఊరిలోని 400 ముస్లిం కుటుంబాల ఇళ్లను దుండగులు చుట్టుముట్టి 'ముస్లింలను చంపండి, నరకండి' అంటూ దాడిచేసారు. వాళ్లు పారిపోగా చాలా ఇళ్లు ఆరోజు తగలబెట్టారు. మార్చి 2వ తేదీన అదే దాడి మళ్లీ జరిగింది. ముస్లింలు మసీదులో చేరి జిల్లా (దాహొద్) ఎస్‌పికి ఫోన్ చేసారు. ఇప్పుడు నా దగ్గర బలగాలు లేవు, ఉన్నప్పుడు పంపిస్తాను అన్నాడు. సాయంత్రం 5 గంటలకు జడేజా అనే పోలీసు అధికారి కొంత సిబ్బందిని తీసుకొని వచ్చాడు. ఊరిలో అప్పటికింకా ఉన్న ముస్లింలు తమకు దొరికిన వాహనాలెక్కి గోధ్రావైపు బయలుదేరారు (గోధ్రాలో ముస్లింలది పెద్ద జనాభా. తమ ఊర్లలో దాడికి గురయిన ముస్లింలందరూ ముస్లింలు అధిక సంఖ్యలో నివసించే గోధ్రా వంటి ఊర్లకు వలసపోయి అక్కడ స్థానిక ముస్లింల సహాయంతో శిబిరాలు ఏర్పాటు చేసుకొని ఉంటున్నారు). పోలీస్ అధికారి జడేజా, అతని సిబ్బంది, వీరికి బందోబస్తుగా ముందు, వెనక బయలుదేరారు. అయితే వీరు ఏ దిశగా పోతున్నదీ సెల్‌ఫోన్లలో సమాచారం పోయింది. దారిలో ఖాకీ నిక్కర్లు, ముఖం దిగువ భాగానికి ముసుగులు వేసుకున్న మూకలు పదే పదే అడ్డం పడ్డారు. పోలీసుల మధ్యలో ఉన్న శరణార్థుల వాహనాల నుండి ఒక వ్యక్తిని లాగి నరికి చంపారు. ఇంకొంచెం దూరం పోయిన తరువాత వాహనాల మీద కాల్పులు జరిపారు. ఒక వాహనం టైర్ పంక్చరయి ఆగిపోతే దానిని తగలబెట్టారు. ముందుకు పోతున్న వాహనాలపైన మళ్లీ మళ్లీ దాడులు జరుగుతూనే ఉన్నాయి. ఒక్కొక్కరిని బయటకు లాగి నరుకుతూనే ఉన్నారు. కాల్పులు జరుపుతూనే ఉన్నారు. మొత్తం 11 మంది చనిపోగా మిగిలిన వాళ్లను జడేజాగారి పోలీస్ పార్టీ క్షేమంగా గోధ్రాకు చేర్చింది!

* అహమ్మదాబాద్‌లో నమోదయిన ఒక ఎఫ్ఐఆర్ వివరాలు చూస్తే పోలీసులు చాలా సందర్భాలలో హంతక ముఠాలను నిలువరించకపోగా, వారికి రక్షణగా వారి వెంట తిరిగారని అర్థం అవుతుంది. పట్వా పోలీస్‌స్టేషన్ లో నమోదయిన క్రైం నెం. 70/02ను ఉదాహరణగా తీసుకోవచ్చు. ఇందులో ఫిర్యాది సీనియర్ పోలీస్ ఇన్స్‌పెక్టర్ సి.జె.సింగ్. అతను స్వయంగా నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ప్రకారం ఫిబ్రవరి 28 పొద్దున్న అతను గస్తీ తిరుగుతుండగా 4000 లేక 5000 మంది గల 'హిందువుల గుంపు' తారసపడింది. అప్పటికి సమయం పొద్దున్న 10 గంటలు. అప్పటికీ ఆ గుంపు కిషన్‌పురా బస్‌స్టాండ్ ప్రాంతంలో ఒక మసీదునూ, కబరస్థాన్‌నూ ధ్వంసం చేసింది. అక్కడి నుండి ముందుకుపోయి హోటళ్లనూ, ఇతర కట్టడాలనూ దహనం చేయసాగారు. ఇన్స్‌పెక్టర్ సింగ్ నాలుగు రౌండ్లు కాల్చాడు. అయినా దుండగులు తమ దహనకాండ కొనసాగిస్తూనే ఉన్నారు. ఇంకొన్ని గోడవున్లు, దుకాణాలు తగలబెట్టారు. ఇన్స్‌పెక్టర్ సింగ్‌తో బాటు ఉన్న ఒక పోలీస్ జవాను ఏడు రౌండ్లు కాల్పులు జరిపాడు. అయినా దుండగులు లూటీ, దహనకాండ కొనసాగించారు. పొద్దున్న 10 గంటలకు మొదలయిన దహనకాండ సాయంత్రం 7 గంటలకు ముగిసింది. పోలీసులు కాల్చిన 11 రౌండ్లలో ఎవరికీ గాయాలు తగలలేదు. అదనపు బలగాలను రప్పించడానికి ఇన్స్‌పెక్టర్ సింగ్ ఏ ప్రయత్నమూ చేయలేదు. (ఈ రెండు విషయాలూ ఎఫ్ఐఆర్ నుండే తెలుస్తున్నాయి – అది ఇన్స్‌పెక్టర్ సింగ్ స్వయంగా నమోదు చేసిన ఎఫ్ఐఆర్). చివరికి సాయంత్రం 7.00 గంటలకు దుండగులు స్వచ్ఛందంగానే దహనకాండ విరమించారు. (అలసిపోయారో లేక ఇంక తగలబెట్టడానికి ఆ ఇలాఖాలో ముస్లింల ఆస్తులేవీ మిగలలేదో మరి). వాళ్లు వెళ్లిపోగానే ఇన్స్‌పెక్టర్ సింగ్ పోలీస్‌స్టేషన్ కు వచ్చి సాయంత్రం 7.30 గంటలకు ఈ ఎఫ్ఐఆర్ నమోదు చేసాడు. ఎఫ్ఐఆర్‌లో దుండగులలో ఏ ఒక్కరి పేరుగానీ, వర్ణనగానీ, వివరాలు గానీ లేవు.

అసలు ఏం జరిగిందో ఊహించడం కష్టం కాదు. వాళ్లు లూటీ, దహనం చేస్తుంటే ఇన్స్‌పెక్టర్ సింగ్ రోజంతా వాళ్ల వెంట తిరుగుతున్నాడు. కొన్ని తూటాలు గాలిలోకో రోడ్డు పక్కన మురుగు కాలవలోకో కాల్చాడు. వాళ్లపని అయిపోయిన తరువాత ఆయన పోలీస్‌స్టేషన్ కు తిరిగివచ్చి ఎఫ్ఐఆర్ రాసుకున్నాడు.

మారణకాండ అత్యంత తీవ్రరూపం తీసుకున్న రోజులలో అహమ్మదాబాద్‌లో పోలీసులు అప్పుడప్పుడు కాల్పులు జరపకపోలేదు. ఫిబ్రవరి 28న ఆ నగరంలో

పోలీసులు 40 మందిని కాల్పులలో చంపారు. అయితే అందులో 36 మంది ముస్లింలు! జరిగిందేమిటంటే, హిందూ మూకలు ఏకపక్షంగా మారణకాండకు పాల్పడినచోట పోలీసులు నిమ్మకు నీరెత్తినట్టు ఉండిపోయారు. ముస్లింలు ప్రతిఘటించిన చోట మాత్రం దొమ్మీని అదుపుచేసే పేరిట పోలీసులు రంగంలోకి దిగి ముస్లింలను కాల్చి చంపారు.

ఇంకొక ఎఫ్ఐఆర్‌ను పరిశీలిస్తే అహమ్మదాబాద్‌లో పోలీసులు ఈ పని ఏవిధంగా చేసారో అర్థం అవుతుంది. ఇది మణినగర్ పోలీస్‌స్టేషన్‌లో క్రైం. నెం. 58/02 లోని ఎఫ్ఐఆర్. ఫిర్యాది వేరే ఎవరో కాదు, అదే పోలీస్‌స్టేషన్ సీనియర్ ఇన్స్‌పెక్టర్ అయిన కె.ఎన్. పటేల్. ఎఫ్ఐఆర్‌లో ముద్దాయిలుగా అబ్దుల్ మజీద్ పోరుల్లా అన్సారీనీ 'మరికొంత మంది'నీ ఆయన పేర్కొన్నాడు. ఎఫ్ఐఆర్ చూడగానే ఇది ముస్లింలు చేసిన దాడి అన్న అభిప్రాయం కలుగుతుంది. 5000 మంది ముస్లింలు కత్తులూ, బరిసెలూ, పెట్రోల్ బాంబులూ పట్టుకొని భైరవనాథ్ రోడ్డులోని చందోడా చాల్ అనే హిందువులు నివసించే బిల్డింగ్‌పైకి దాడిచేసారని ఇన్స్‌పెక్టర్ పటేల్‌గారి ఫిర్యాదు అంటుంది. బాంబులు విసిరి ఆ బిల్డింగ్‌ను తగలబెట్టారు. హిందువులు ఆ బిల్డింగ్ నుండి బయటికొచ్చారు. ఇరు వర్గాలు ఘర్షణ పడ్డారు. ఆనంద్ దగ్డుభాయి సోన్‌వానే అనే వ్యక్తి తలమీద ముస్లింలు కొట్టారు. ముస్లింలు తుపాకులతో కాల్పులు కూడ జరిపారు. గస్తీలో భాగంగా అటువైపు పోయిన ఇన్స్‌పెక్టర్ పటేల్ దొమ్మీమీద కాల్పులు జరిపాడు. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 6 గంటల దాకా ఇది సాగింది. చివరికి ఇద్దరు చనిపోయారు, 12 మంది తీవ్రంగా గాయపడ్డారు. చనిపోయిన వారి పేర్లు జుమ్మాదిన్ మహమ్మద్ జమాదార్ అన్సారీ, సుల్తాన్ అనూభాయి మాలిక్. మృతులేకాదు, తీవ్రంగా గాయపడిన 12 మందీ కూడ ముస్లింలే! ఎఫ్ఐఆర్‌లో ముద్దాయిల జాబితాలోనూ ముస్లింలనే చూపించాడు. ఒక్క హిందువు పేరు కూడ ఎఫ్ఐఆర్‌లో లేదు.

అసలు జరిగిందేమిటో ఊహించడం కష్టం కాదు. ఎవరు మొదలుపెట్టారోగానీ అక్కడ ఆరోజు ఇరువర్గాల మధ్య దొమ్మీ జరిగింది. పోలీసులు రంగంలోకి దిగి హిందువుల పక్షం వహించి ముస్లింలపైన తూటాలు ప్రయోగించారు. ఇద్దరూ కలిసి ఇద్దరిని చంపి, 12 మందిని గాయపరచి దొమ్మీని ముగింపుకు తెచ్చారు.

ముస్లిం మతస్తులయిన ఒక హైకోర్టు జడ్జికి, ఒక రిటైర్డు హైకోర్టు జడ్జికి పట్టిన గతి చూస్తే సాధారణ పౌరుల నిస్సహాయత ఎటువంటిదో అర్థం

అవుతుంది. వీరు (రిటైర్డ్) జస్టిస్ అక్బర్ దివేచా, జస్టిస్ ఖాద్రి. జస్టిస్ దివేచా గుజరాత్ హైకోర్టు జడ్జిగా రిటైర్ అయిన తరువాత ఢిల్లీలో ఎంఆర్‌టిపి చైర్మన్‌గా చేసారు. ప్రస్తుతం అహమ్మదాబాద్‌లో ఉంటున్నారు. అతను ఖోజా శాఖకు చెందిన ముస్లిం. ఫిబ్రవరి 28న సంఘ్‌పరివార్ గుంపు అతని ఇంటిపైన దాడిచేయగా అతను పారిపోయి ప్రాణాలు దక్కించుకున్నాడు. అతని ఇంటిని దుండగులు లూటీచేసి తగలబెట్టారు.

జస్టిస్ ఖాద్రి ఉదంతాన్ని రిటైర్డ్ చీఫ్ జస్టిస్ రవ్వాని మాటలలో చెప్పుకోవడం ఉచితంగా ఉంటుంది. రవ్వాని గుజరాత్ హైకోర్టు జడ్జిగా పనిచేసి ఆ తరువాత రాజస్థాన్ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా రిటైర్ అయ్యారు. గుజరాత్ నరమేధాన్ని నోరువిప్పి ఖండించిన అతి కొద్దిమంది ముస్లిమేతర గుజరాతీలలో జస్టిస్ రవ్వానీ ఒకరు. ఆయన జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు సమర్పించిన రిపోర్టు సంక్షిప్త పాఠాన్ని ఇక్కడ ఇస్తున్నాం.

> 'ఫిబ్రవరి 28 మధ్యాహ్నం 3 గంటల నుండి నగరంలో జరుగుతున్న హింసాకాండ గురించి నాకు టెలిఫోన్‌లో సమాచారం అందసాగింది. హైకోర్టు ఎదురుగానే ట్రక్కులను తగలబెట్టారనీ జడ్జిలు కోర్టు విడిచిపెట్టి వెళ్లిపోయారనీ విని నేను దిగ్భ్రాంతి చెందాను. హైకోర్టు ఆవరణలో పోలీసు బలగం ఎప్పుడూ ఉంటుంది; హైకోర్టు ఎదురుగా రోడ్డుమీద పోలీసు గస్తీ కూడ ఎప్పుడూ ఉంటుంది కదా అనుకున్నాను. నా ముస్లిం స్నేహితులకు ఫోన్ చేయసాగాను. జస్టిస్ ఖాద్రి ఫోను 4-00 గంటలకు కలిసింది. తన బంగళా దగ్గర పరిస్థితి బాగాలేదనీ, లూటీలు, దహనకాండ మొదలయ్యాయని ఆయన చెప్పాడు. అతని ఇంటి దగ్గర ఉన్న పోలీసు బందోబస్తు గురించి అడిగాను. సరయిన ఆయుధాలేవీ లేని ఇద్దరు జవాన్లు ఉన్నారని చెప్పాడు... ఒక గంట తరువాత మళ్లీ జస్టిస్ ఖాద్రికి ఫోన్ చేసాను. హైకోర్టు జడ్జిల బంగళాలున్న ధూలియాకోట్ ప్రాంతంలో కూడా లూటీ, దహనకాండ జరుగుతున్నదని చెప్పాడు... ఆపైన, నవరంగ్‌పురా పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న ముస్లిం సొసైటీలోని ఒక స్నేహితుడికి ఫోన్ చేసాను. అక్కడ ఉన్నతస్థాయి పోలీస్ అధికారులు, ఇతర ప్రభుత్వ అధికారులు చాలామంది ఉంటారు.

అక్కడ ఎస్‌ఆర్‌పి (స్టేట్ రిజర్వ్ పోలీసు) బలగం ఉంది. జస్టిస్ ఖాద్రి ఇల్లు అక్కడికి దగ్గరే. జస్టిస్ ఖాద్రి తమకు ఫోన్ చేసినట్టయితే ఎస్‌ఆర్‌పి బలగాన్ని అక్కడికి పంపగలం అన్నాడు ఆ మిత్రుడు.

'అయితే జస్టిస్ ఖాద్రికి మీకయినా మాకయినా ఫోన్ చేసేంత సమయం దుండగులు ఇస్తారా?' అని ఆ మిత్రుడు నన్ను అడిగాడు. నాకు నిస్పృహ అనిపించింది. అయినప్పటికీ ఆ రాత్రి 10.30 గంటల వరకు ఫోన్‌మీద జస్టిస్ ఖాద్రితో మాట్లాడుతూనే ఉన్నాను.

అయితే పొద్దున్న 8.30 గంటలకు జస్టిస్ ఖాద్రికి ఫోన్‌చేయగా ఆయన జస్టిస్ వాఘేలా అనే మరొక న్యాయమూర్తి బంగళాకు తరలిపోయినట్టు తెలిసింది. 11.30 గంటలకు జస్టిస్ ఖాద్రి నాకు ఫోన్ చేసాడు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధర్మాధికారి తన క్షేమం గురించి చాలా ఆందోళన చెందుతున్నాడనీ, తనను జడ్జిల బంగళాలున్న వస్త్రపురా ప్రాంతానికి మకాం మార్చమని అంటున్నాడనీ చెప్పాడు.

నేను వెంటనే ఎక్కడకీ పోవద్దన్నాను. ఒక జడ్జి తన అధికార నివాసంలో నివసించలేని పరిస్థితి వస్తే అది రాజ్యాంగం లౌకిక స్ఫూర్తినీ న్యాయవ్యవస్థ స్వాతంత్రాన్నీ అవమానపరచడమేననీ అందువల్ల అధికార నివాసంలోనే ఉండమని అన్నాను.

అయితే రిటైర్డ్ జడ్జి అయిన జస్టిస్ అక్బర్ దివేచా అప్పటికే తన ఇల్లు ఖాళీచేసి వెళ్లిపోయాడనీ, ఆ యింటిని దుండగులు లూటీచేసి దహనం చేసారనీ తెలిసింది. మిలిటరీ వాళ్లు కంటోన్‌మెంట్‌లోనయితే తనను కాపాడగలుగుతామన్నారని జస్టిస్ ఖాద్రి నాతో అన్నాడు. తన భద్రత విషయంలో పోలీసులను నమ్మవద్దని మిలిటరీ ఇంటిలిజెన్స్ ఆయనను హెచ్చరించిందని కూడ తెలిసింది... నేను జస్టిస్ ఖాద్రితో ఉండగా హైకోర్టు రిజిస్ట్రార్ నుండి ఫోన్ వచ్చింది. జడ్జిల బంగళాలలో రెండు ఇప్పుడు రెడీగా ఉన్నాయనీ వాటిలో దేనిలోకైనా జస్టిస్ ఖాద్రి తన

మకాం మార్చవచ్చుననీ రిజిస్ట్రార్ అన్నాడు. నా అభిప్రాయం ఏమిటని జస్టిస్ ఖాద్రి అడిగారు.

పొద్దున నేను ఫోన్ మీద చేసిన తత్వబోధ మరిచిపొమ్మని నేను జస్టిస్ ఖాద్రికి చెప్పాను. రాజ్యాంగ స్ఫూర్తి ఆ పుస్తకానికే పరిమితం అయిందనేది ఈనాటి వాస్తవం అని చెప్పాను... ఆ తరువాత సైనికులు వచ్చి జస్టిస్ ఖాద్రినీ, అతని కుటుంబాన్నీ తరలించారు...

ఏవో క్రూరమృగాలు నగరం మీద అకస్మాత్తుగా దాడిచేస్తే నగరవాసులు ఎంత నిస్సహాయంగా ఉంటారో అంతే నిస్సహాయంగా రాజ్యాంగ వ్యవస్థలో ఉన్నతస్థాయి పదవులలో ఉన్నవారు సహితం వ్యవహరించారు. చీఫ్‌జస్టిస్ ధర్మాధికారి తన సోదర న్యాయమూర్తికి అతని అధికార నివాసంలోనే పూర్తిస్థాయి రక్షణ కల్పించమని గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వానికి ఆ క్షణమే ఆదేశం జారీచేసి ఉండవచ్చు. ఆ అధికారం ఆయనకు ఉంది. అయినప్పటికీ అటువంటి ఆదేశం నరేంద్ర మోడి ప్రభుత్వం మీద పనిచేస్తుందని జస్టిస్ ధర్మాధికారి భావించలేదు. ఆయన ఆ ప్రయత్నం సహితం చేయలేదు. ఏ అధికారం లేని ఒక సాధారణ పౌరుడిలాగ, 'వచ్చి నా యింట్లో ఉండు, నేను చూసుకుంటాను' అన్నాడు. ఇంక పోలీసులకు వేరే ఎవ్వరూ ఇవ్వనక్కర లేకుండ సైన్యమే తగిన కితాబు ఇచ్చింది. 'నీ క్షేమం విషయంలో పోలీసులను నమ్మకోవద్దు' అని వేరే ఎవరికో కాదు – ఒక న్యాయమూర్తికే మిలిటరీ ఇంటెలిజెన్స్ అధికారులు చెప్పారు. తాము కూడ కంటోన్‌మెంట్‌లోనయితేనే ఆ న్యాయమూర్తిని కాపాడగలము కానీ బయట కాపాడలేమన్నారు.

సైన్యాన్ని గుజరాత్‌కు వెంటనే రప్పించలేదని ఒకవైపు, అవసరమనిపించిన వెంటనే రప్పించడం జరిగిందని మరొకవైపు వాదోపవాదాలు జరుగుతున్నాయి. ఎప్పుడు పిలిచారన్న దానికంటె ముఖ్యం, సైన్యాన్ని ఏమేరకు ఉపయోగించుకున్నారనేది. మేము పర్యటించిన దినాలలో ఒక్క అహమ్మదాబాద్ 'పాతబస్తీ' ప్రాంతంలో తప్ప వేరే ఎక్కడా సైన్యం కనిపించలేదు. అహమ్మదాబాద్‌లో కూడ సైన్యానికి స్థానిక పోలీసు తదితర అధికార వ్యవస్థల సహాయ సహకారాలు సరిగ్గా అందలేదు. అహమ్మదాబాద్ నగర పటం సహితం వారికి ఇవ్వలేదనీ ఒక్కొక్క ప్రభుత్వ కార్యాలయంలోనూ అడిగి లేదనిపించుకొని చివరికి బజార్లో కొనుక్కున్నారనీ విన్నాము. 'పాతబస్తీ'లో మోహరించిన చోట

కూడ సైన్యాన్ని ఒక దిష్టిబొమ్మగా వాడుకున్నారు తప్ప ఏం చేయాలన్న ఆదేశాలు ఇవ్వలేదని కొన్ని ఘటనలు సూచిస్తాయి. మతాంతర వివాహం చేసుకున్న మీరాబెహన్ అనే సామాజిక కార్యకర్త గురించి పైన చెప్పాము. ఆమె షా–ఆలం శిబిరంలోనే ఉంటూ శరణార్థుల అవసరాలు చూసుకుంటూ ఉంది. 'మే 6 నాడు ఆమె శిబిరంలో ఉండగానే బయట రోడ్డుమీద పోతున్న ఇద్దరిని ఒక గుంపు చుట్టుముట్టి చంపడం ఆమె చూసింది. పోలీసులకు ఫోన్ చేస్తే వాళ్లు రాలేదు. కొంతసేపయినాక ఆమె అక్కడి సైన్యం ప్లాటూన్ ఇన్‌చార్జి అయిన కల్నల్‌కు ఫోన్ చేసింది. అయితే తమకు ఏమి చేయవచ్చు, ఏమి చేయకూడదు అనే విషయంలో కచ్చితమైన ఆదేశాలు లేవని ఆయన కూడ నిస్సహాయత వ్యక్తం చేసాడు. ఈ విషయం మరుసటి రోజు మేము ఆమెను కలిసినప్పుడు చెప్పింది.

చివరిగా, ఆత్మాభిమానం గల ఒక పోలీస్ అధికారి స్వయంగా చెప్పిన మాటలు ఉటంకించి ఈ అధ్యాయాన్ని ముగిద్దాం. లక్నో రేంజి డిఐజి విభూతి నారాయణ్‌రాయ్ గుజరాత్ ఘటనల తరువాత దేశంలోని ఐపిఎస్ ఆఫీసర్లకొక బహిరంగ లేఖ వంటిది రాసాడు. బహుళ ప్రాచుర్యం పొందిన ఆ లేఖ గుజరాత్‌లోనే కాదు మత ఘర్షణలు జరిగే ఇతర ప్రాంతాలలో కూడ పోలీసు యంత్రాంగం 'హిందూ యంత్రాంగం'గా మారిన వైనాన్ని చూపుతుంది.

> 'గోధ్రా అమానుష మారణకాండ తరువాత జరిగిన ఘటనలు నాకు పెద్దగా ఆశ్చర్యం కలిగించలేదు... అహమ్మదాబాద్ నుండి గ్రామీణ ప్రాంతాల దాకా అన్నిచోట్లా పాత కథే పునరావృతం అయింది. 1960ల నుండి అదే చిత్రాన్ని అవే రంగులలో చూస్తున్నాం. మైనారిటీలను పోలీసుల సమక్షంలోనే లూటీ చేయడాన్ని, చంపడాన్ని, సజీవంగా దహనం చేయడాన్ని ఒక్కొక్కసారి నిస్సహాయంగా ఉపేక్షించే యంత్రాంగం, ఒక్కొక్కసారి తాను కూడ అందులో పాల్గొనే యంత్రాంగం...
>
> 'వ్యక్తిగా నా అభిప్రాయాలు ఏవైనాకానీ గాక ఒక పోలీస్ అధికారిగా నేను ప్రధానంగా కోరుకునేది పోలీసు యంత్రాంగానికి వృత్తిపరమైన వ్యక్తిత్వం దృఢంగా ఉండాలని. అసమర్థ పోలీసు యంత్రాంగాన్ని ముఖ్యమంత్రి భుజం తట్టి ప్రశంసించవచ్చును, పోలీసు యంత్రాంగం మీద వచ్చిన విమర్శను ప్రసార సాధనాల కల్పనగానూ, దేశద్రోహులయిన మైనారిటీల దుష్ప్రచారంగానూ

సీనియర్ పోలీసు అధికారులు కొట్టిపారేయవచ్చును. అయితే సత్యమేమిటంటే ప్రతి మతఘర్షణ తరువాతా ఇదే విమర్శ వింటున్నాం. మైనారిటీల ప్రాణాలనూ ఆస్తులనూ కాపాడలేకపోవడమేకాక హిందువుల పక్షం వహించారనీ దొమ్మీ చేస్తున్న హిందువులను ప్రోత్సహించారనీ వింటున్నాం. గుజరాత్ పోలీసుల మీదా అదే విమర్శ వినపడుతున్నది...

'సగటు పోలీసు ఉద్యోగి దృష్టిలో మత కల్లోలాలకు సంబంధించిన సమాచారం సేకరించడం అంటే ముస్లిం మతవాద సంస్థల గురించి సమాచారం సేకరించడం అనే. హిందూ మతవాద సంస్థల కార్యకలాపాలు కూడ జాతి ప్రయోజనాలకు అంతే నష్టకరమనీ వాటిమీద కూడ ఒక కన్నేసి ఉంచాలనీ అతనికి నచ్చజెప్పడం కష్టం. పోలీసుల రికార్డులలో హిందూ మతవాద సంస్థల కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం చాలా కొంచెం దొరుకుతుందనేది సత్యం.

'అదేవిధంగా, మత ఘర్షణల నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా చేసే అరెస్టులలో కూడ ముస్లింలే ఎక్కువగా అరెస్టవుతుంటారు. ముస్లింలే అధికంగా నష్టపోయిన ఘర్షణలలోనూ వారే ఎక్కువ సంఖ్యలో అరెస్టవుతుంటారు. దొమ్మీలు జరిగినప్పుడు పోలీసులు జరిపే కాల్పులలో కూడా ముస్లింలే ఎక్కువగా చనిపోతుంటారు.

'గుజరాత్‌లోనూ అదే మళ్లీ జరిగింది. ఎటొచ్చీ అపూర్వ పరిమాణంలో జరిగింది. హింస పూర్తిగా ఏకపక్షంగా ఉన్నప్పటికీ అదే చిత్రం పునరావృతం అయింది. ఒక తేడా ఏమిటంటే మొట్టమొదటిసారిగా పోలీసుల నిష్క్రియాపరత్వం, నేరస్తులతో లాలూచీ, పక్షపాతం టీవీ స్క్రీన్‌పైన దేశ విదేశాలలో అందరూ చూసారు. 'పత్రికలు వక్రీకరించాయి' అనడానికిప్పుడు ఆస్కారం కూడ లేదు...

'విచారకరమైన విషయం ఏమిటంటే దొమ్మీలను అదుపు చేయలేకపోవడమే కాక ఒక వర్గానికి క్రియాశీలకంగా తోడ్పడిన

పోలీస్ అధికారులకు ఒక్క ఘటనలోనూ శిక్షపడలేదు. అత్యంత పటిష్ఠమైన పోలీసు వ్యవస్థ ఉన్న దేశ రాజధానిలో 1984లో సిక్కులపైన ఊచకోత జరిగింది. పోలీసుల సహాయ సహకారాలు లేకుండ అటువంటి ఊచకోత జరగడం అసాధ్యం. పత్రికలే కాక అనేక విచారణ కమిషన్లు స్పష్టంగా దోషులను పేర్కొన్నప్పటికీ ఒక్క పోలీసు అధికారికీ శిక్షపడలేదు. మాదన్ కమిషన్‌కూ శ్రీకృష్ణ కమిషన్‌కూ కూడ అదే గతి పట్టింది...

## VII

## సంఘ్‌పరివార్ సంస్థలు, పత్రికలు

పోలీసుల పక్షపాతానికి కనీసం ఒక చరిత్ర – దుష్ట చరిత్రే కానీయండి – ఉందని చెప్పుకోవచ్చు. కానీ గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వం పాత్రకూ దానిని నడుపుతున్న సంఘ్‌పరివార్ నాయకుల పాత్రకూ గత చరిత్రలో దృష్టాంతాలు ఎక్కువగా కనిపించవు.

కేబినెట్ మంత్రులు స్వయంగా మారణకాండలో పాల్గొన్న ఉదంతాలు ఎన్ని కనిపిస్తాయి? గుజరాత్ రాష్ట్ర కేబినెట్ మంత్రులిద్దరు మొన్నటి మారణకాండలో స్వయంగా పాల్గొన్నారు. ఒకరు రెవెన్యూ శాఖామాత్యుడు హిరేన్ పాండ్య, రెండోవాడు ఆరోగ్య శాఖామాత్యుడు అశోక్ భట్.

హిరేన్ పాండ్యను ఇప్పటికే పరిచయం చేసాము. పడమటి అహమ్మదాబాద్‌లోని పాల్డీ ప్రాంతంలో ఒక్క ముస్లిం కూడ లేకుండ చేస్తానన్న నినాదంతో అతను ఎన్నికలలో పోటీచేసి గెలిచి మంత్రి అయ్యాడని చెప్పాము. ఫిబ్రవరి 28 నాడు అతను ఎల్లిస్ బ్రిడ్జి పోలీస్‌స్టేషన్ పరిధిలో వాడీలాల్ సారాభాయి (వి.ఎస్) హాస్పిటల్ సమీపంలోని అప్నాబజార్ అనే మందుల షాపును స్వయంగా తగలబెట్టగా చూసిన సాక్షులున్నారు. అగ్గిని ఆపడానికి వచ్చిన అగ్నిమాపక వాహనానికి అతను, ఆరోగ్య శాఖామాత్యుడు అశోక్‌భట్ అడ్డంపడి ఆపారని కూడా సాక్షులు చెప్తున్నారు.

అశోక్‌భట్ పోలీసుల ఘోరమైన పక్షపాతాన్ని స్వయంగా పర్యవేక్షించాడు. ఫిబ్రవరి 28న అతను అహమ్మదాబాద్‌లోని పోలీస్ కంట్రోల్ రూంలో కొన్ని గంటలు స్వయంగా కూర్చున్నాడు. ఆరోగ్య శాఖమంత్రికి పోలీస్ కంట్రోల్

రూంలో ఏం పని? దాడికి గురవుతున్న ముస్లింలు వందల సంఖ్యలో ఆరోజు కంట్రోల్ రూంకు ఫోన్‌లు చేసి సహాయం అర్థించారు. ఏ ఒక్కరి అభ్యర్థనకూ పోలీసులు స్పందించలేదు. ఒక్క ప్రాణాన్నీ కాపాడలేదు. ఇది ఆరోగ్య శాఖామాత్యుడు అశోక్‌భట్ పర్యవేక్షణలో జరిగింది. అతను అహమ్మదాబాద్ పోలీస్ కంట్రోల్ రూంలో తిష్ఠవేసినట్టే రాష్ట్ర రాజధాని గాంధీనగర్‌లోని పోలీస్ కంట్రోల్ రూంలో పట్టణాభివృద్ధి శాఖామాత్యుడు ఐ.కె. జడేజా అదేరోజు గంటలకొద్దీ కూర్చున్నాడు.

హిరేన్ పాండ్యా, అశోక్‌భట్‌లే కాక నితీన్ పటేల్, నరవ్‌లాలూ పటేల్ అనే మరొక ఇద్దరు మంత్రులు కూడ వారి సొంత జిల్లా అయిన మెహసానాలో దాడులకు నాయకత్వం వహించారని బాధితుల ఫిర్యాదులు తెలియజేస్తాయి. ఇద్దరిపైనా గృహ దహనాలే కాక రేప్ చేసారన్న అభియోగం కూడ ఉంది. అహమ్మదాబాద్ నగరంలో హింసాకాండ పెద్దయెత్తున జరిగిన ప్రాంతాలలో బాపునగర్ ఒకటి. అది రాష్ట్ర హోంశాఖ మంత్రి గోవర్దన్ జడాఫియా నియోజకవర్గం. అతనికీ అతని సన్నిహిత అనుచరులకూ ఈ మారణకాండలో పాత్ర ఉండిందని స్థానిక బాధితుల అభియోగం.

అహమ్మదాబాద్ నగరంలో జరిగిన హింసాకాండలో భారత్ బరోత్, మాయా కోట్నానీ అనే ఇద్దరు ఎంఎల్‌ఏలు స్వయంగా పాల్గొన్నట్టు ఎఫ్ఐఆర్‌లు నమోదయి ఉన్నాయి. పంచ్‌మహల్స్ జిల్లాలో కాలోల్ ఎంఎల్‌ఏ కొడుకులూ, సబర్‌కాంటా జిల్లాలో హిమ్మత్‌నగర్ ఎంఎల్‌ఏ (చేతివృత్తుల శాఖ మంత్రి) కొడుకులూ హింసాకాండలో ముఖ్య పాత్రధారులని పైన చూసాము.

వీళ్లంతా బిజెపి ఎంఎల్‌ఏలని వేరే చెప్పనవసరం లేదు.

చనిపోయిన వాళ్లు చనిపోగా, తీవ్రంగా గాయపడి ఆస్పత్రి పాలయిన ముస్లింలకు వైద్యం చేయొద్దన్న ఒత్తిడి కూడ డాక్టర్లపైన బిజెపి నాయకులు పెట్టారు. సోలా సివిల్ హాస్పిటల్‌లో భారతీ బెహన్, అనీతా బెహన్ అనే బిజెపి కార్పొరేటర్లు ఆస్పత్రి ఆవరణలోనే ఉంటూ ముస్లింలకు వైద్యం చేయొద్దని డాక్టర్లపైన ఒత్తిడి పెట్టారని షా ఆలం క్యాంపులోని బాధితులు చెప్పారు.

ఇంక ఊరూరా ఇతర సంఘ్‌పరివార్ సంస్థల నాయకులు స్వయంగా దహనకాండకూ హత్యాకాండకూ పాల్పడ్డారు. వాళ్ల పేర్లు ఎఫ్ఐఆర్‌లలో నమోదయ్యాయి. వీరందరిలోకీ ప్రముఖుడు విశ్వహిందూ పరిషత్ సంయుక్త

కార్యదర్శి డా॥ జైదీప్ పటేల్. ఈయన అహమ్మదాబాద్‌లోని నరోడాలో జరిగిన మారణకాండకు స్థానిక ఎంఎల్ఏ మాయా కోట్నానీతో బాటు పాల్గొన్నట్టు బాధితుల ఫిర్యాదు.

సంఘ్‌పరివార్ నాయకుల ప్రత్యక్ష భాగస్వామ్యమే కాక మారణకాండను ప్రోత్సహించడంలోనూ రెచ్చగొట్టడంలోనూ సమర్థించడంలోనూ వారు ప్రధాన పాత్ర నిర్వహించారు. సంఘ్ పరివార్‌తో బాటు ప్రధాన గుజరాతీ దినపత్రికలయిన గుజరాత్ సమాచార్, సందేశ్‌లను కూడ చెప్పుకోవాలి. 'ఈ దినపత్రికలు విశ్వహిందూ పరిషత్‌ను కూడ సిగ్గుపడేటట్టు చేయగలవు' అని విల్‌ఫ్రెడ్ డీసౌజా అనే సామాజిక కార్యకర్త అంటాడు.

వాజ్‌పేయి గుజరాత్ మారణకాండ జరిగిన చాలా రోజుల తర్వాత అహమ్మదాబాద్‌కు పోయి, గుజరాత్ ఘటనలు దేశానికి తలవంపులు తెచ్చాయని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆయన ప్రకటనలపై గుజరాత్ సమాచార్ ఈ విధంగా వ్యాఖ్యానించింది – 'ఒకప్పుడు మనమొక వీరోచితమైన పనిచేస్తే నాయకులు మెచ్చుకునేవారు. ఇప్పుడు సిగ్గుపడే నాయకులు వచ్చారు'. వాజ్‌పేయి నిజంగా సిగ్గుపడ్డాడా లేదా అన్నది వేరే సంగతి, కానీ గుజరాత్ సమాచార్ చేసిన వ్యాఖ్య గుజరాత్ మారణకాండ గురించి తొలినాటి నుండి వివిధ సంఘ్‌పరివార్ సంస్థల నాయకులు చేస్తున్న ప్రకటనలకు అద్దం పడుతుంది.

టైమ్స్ ఆఫ్ ఇండియా, ది ఏషియన్ ఏజ్, ది హిందూ దినపత్రికలలోని రిపోర్టుల ప్రకారం ఆ నాయకులు చేసిన మరికొన్ని వ్యాఖ్యలు చూడండి. 'బంద్ సమయంలో గుజరాత్‌లో జరిగిన హింస, గోధ్రా మారణకాండ వల్ల కల్గిన సహజమైన ఆగ్రహావేశాల ఫలితం' అని విశ్వహిందూ పరిషత్ ఉపాధ్యక్షుడు ఆచార్య గిరిరాజ్ కిషోర్ అన్నాడు. 'ప్రతీ చర్యకూ దానికి సమానమైన ప్రతిచర్య ఉంటుంది' అని ముఖ్యమంత్రి నరేంద్ర మోడి అన్నాడు. 'గుజరాత్‌లో జరిగింది మత హింస కాదు, ఇస్లామిక్ జిహాద్‌కు ప్రజల జవాబు' అని విశ్వహిందూ పరిషత్ అంతర్జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ తొగాడియా అన్నాడు. 'తీవ్రంగా రెచ్చగొట్టే ఘటన జరిగినప్పటికీ అయిదుకోట్ల గుజరాతీలు చాలా సంయమనం పాటించారు' అని నరేంద్ర మోడి అన్నాడు. 'గోధ్రాలో రైలు బోగీ మీద జరిగిన దాడి, కలకత్తాలో అమెరికా దౌత్య కేంద్రంపైన జరిగిన దాడిలాంటిదే. దోషులు రెండు ఘటనలలోనూ ఒకరే. ఈ పని చేసిన వారికి తగిన గుణపాఠం నేర్పుతాం. ఎవ్వరినీ వదిలిపెట్టం. దీని వెనక ఉన్న శక్తులు ఇటువంటి పనులు మళ్లీ ఎప్పుడూ

చేయకుండ బుద్ధిచెప్తాం' అని హోంమంత్రి గోవర్ధన్ జడాఫియా అన్నాడు. 'గుజరాత్‌లో జరిగింది సహజమైన ప్రతిచర్య. ఆ వెల్లువను ఆపడం ఏ ప్రభుత్వం వల్ల అయ్యేది కాదు. ఆ హింస సమర్థనీయం కాకపోయినప్పటికీ హిందూ సమాజం మొత్తంగా కులానికీ రాజకీయాలకూ అతీతంగా స్పందించిందని గమనించాలి' అని ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధి ఎం.జె. వైద్య అన్నాడు. విశ్వహిందూ పరిషత్ గుజరాత్ రాష్ట్ర శాఖ చైర్మన్ కేశవరాం కాశీరాం శాస్త్రి 'ఇదొక ఉప్పెన. దీనినెవరూ ఆపలేరు' అన్నాడు.

బెంగుళూరు సమీపంలోని చెన్నెనహల్లిలో ఆర్‌ఎస్‌ఎస్ మార్చినెల మూడవ వారంలో నిర్వహించిన అఖిల భారత ప్రతినిధి సభలో గుజరాత్ మారణకాండను ప్రస్తావిస్తూ, 'హిందువుల సద్భావనలోనే ముస్లింలకు భద్రత ఉంది' అనీ, 'ముస్లింలు హిందువులను అనవసరంగా రెచ్చగొట్టడం మానేయాలి' అనీ తీర్మానించారు. 'గుజరాత్‌లో హిందూ సమాజం మొత్తంగా స్పందించింది. హిందువులు వారంతట వారే ప్రతిచర్యకు పూనుకున్నారు. ఆ క్రమంలో అనేక ప్రాణాలు పోవడం దురదృష్టకరం' అన్నారు. 'ప్రజలు తమంతట తామే వీధులలోకి వచ్చారు. ఒక్కొక్కచోట 15, 20 వేల మంది వచ్చారు. అరెస్టు చేయమనండి. ఒక్కొక్క పోలీస్‌స్టేషన్ లోనూ 15, 20 వేల మందిని బంధించమనండి' అని విశ్వహిందూ పరిషత్ సంయుక్త కార్యదర్శి డా॥ జైదీప్ పటేల్ సవాలు విసిరాడు.

విశ్వహిందూ పరిషత్, బజ్రంగ్‌దళ్ కరపత్రాలను పైన ఉటంకించాము. సంఘ్‌పరివార్ మన దేశ చరిత్రను అర్థం చేసుకుంటున్న వైనానికి అవి అద్దం పడతాయి. ఆ అవగాహన నేపథ్యంలోనే ఈ వ్యాఖ్యలను అర్థం చేసుకోగలుగుతాం. వెయ్యి ఏళ్లుగా హిందువులు ముస్లింల హింసకు బలి అవుతున్నారు. ఇస్లాం అంటేనే హింస, టెర్రరిజం, జీహాద్. గోధ్రాలో సబర్మతీ ఎక్స్‌ప్రెస్ పైన జరిగిన దాడి ఈ ముస్లిం టెర్రరిజంలో భాగమే తప్ప స్థానిక ఘర్షణ కాదు. మహ్మద్ గజనీ కాలం నుండి ఈ హింసకు బలి అవుతున్న హిందువులు తమ అనైక్యతను అధిగమించి మొట్టమొదటిసారిగా గుజరాత్‌లో ఒక ఉప్పెన అయి లేచారు. అది కేవలం గోధ్రా మారణకాండకు సహజ ప్రతిచర్యే కాదు, హిందువులు ఒక సహస్రాబ్ది కాలం అనుభవించిన నిరంతర హింసకు కూడ ప్రతిచర్య. అందుకే సంఘ్‌పరివార్ వాళ్లు దేశవ్యాప్తంగా గుజరాత్ మారణకాండకు అంత ఉత్సాహంగా స్పందించారు. హిందువులు ప్రదర్శించిన 'శౌర్యాన్ని' దేశవ్యాప్తంగా ప్రచారం చేయడానికి గుజరాత్ 'శౌర్య యాత్ర' నిర్వహిస్తామని విశ్వహిందూ పరిషత్ మే నెల 14న ప్రకటించింది.

గోధ్రా మారణకాండ జరగగానే హిందూత్వ వాదులు ఈ దృక్కోణానికి తగినట్టే స్పందించారు. 'ప్రతిచర్య' రప్పించడానికి చేయవలసిందంతా చేసారు. స్థానిక పోలీసు ఐజి, జిల్లా కలెక్టరు ఆ మారణకాండ అప్పటికప్పుడు జరిగిందే తప్ప అందులో పథకంగానీ, కుట్రగానీ లేదని అంటుండగానే ముఖ్యమంత్రి నరేంద్ర మోడి 'ఇది ముందుగానే పథకం వేసుకున్న టెర్రరిస్టు చర్య' అన్నాడని చూసాం. కేంద్ర హోంమంత్రి అద్వానీ కూడ 'ఇది ముందుగానే పథకం వేసుకున్న దాడి' అన్నాడు.

ఆ తరువాత జరగవలసిన దానికి వాళ్లు పథకం వేసారు. గోధ్రా దాడిలో హిందూ స్త్రీలపైన అత్యాచారం కూడ జరిగిందని ఒక వదంతిని పనిగట్టుకొని ప్రచారం చేసారు. 'తగలబడుతున్న బోగీ నుండి దూకి పారిపోతున్న అయిదుగురు స్త్రీలను తరిమి పొలాలలో రేప్ చేసారు' అన్న వదంతి ఆరోజే ప్రచారం అయిందని గోధ్రాకు చెందిన డాక్టర్ షుజాత్‌వలీ అంటారు. ఈ ప్రచారం ముస్లింలపైన ద్వేషాన్ని బాగా రెచ్చగొట్టి, సంఘ్‌పరివార్ అప్పటికే వేసుకున్న పథకంలోకి సాధారణ హిందూ యువతను నెట్టిందని డా॥ వలీ అంటారు. 'సందేశ్' దినపత్రిక ఈ రకమైన ప్రచారంలో ప్రముఖ పాత్ర నిర్వహించింది. మండుతున్న బోగీ నుండి కొందరు హిందూ స్త్రీలను ముస్లింలు అపహరించారనీ, వారిలో ఇద్దరి శవాలు కాలోల్ తాలూకా కేంద్రం సమీపంలోని ఒక కుంటలో దొరికాయనీ మొదటిరోజే (అంటే ఫిబ్రవరి 28నే) 'సందేశ్' రాసింది. ఆ అమ్మాయిల స్తనాలు కోసేసి ఉన్నాయనీ, వారిపైన మూకుమ్మడిగా అత్యాచారం జరిపినట్టు శవాలను చూస్తే తెలుస్తున్నదని రాసింది. 'వికృత రూపంలో ఉన్న అమ్మాయి శవం కూడ దొరికిందని రాత్రి వినవచ్చింది. ఆమెను రేప్‌చేసి ముక్కలుగా కోసి పెట్రోల్ పోసి తగలబెట్టారు. వీరి వికృత కామదాహానికి అంతంలేదా? అని 'సందేశ్' ప్రశ్నించింది. పోలీసులు ఈ విషయంలో మౌనంగా ఉండడం అగ్నికి ఆజ్యం పోస్తున్నదని విమర్శించింది. పోలీసులు 'మౌనంగా' ఉండడానికి కారణం ఆ శవాల కథ వట్టి అబద్ధం కావడమే. అగ్నికి ఆజ్యం పోసింది 'సందేశ్' ప్రచురించిన అబద్ధపు వ్యాఖ్యే తప్ప, లేని విషయాన్ని గురించి పోలీసులు 'మౌనం' పాటించడం కాదు.

ముస్లింల మీద ద్వేషం రెచ్చగొట్టడానికి కావలసిన ప్రకటనలన్నీ ఇవ్వడమే కాక, తమ కార్యకర్తలకు అప్పటికే త్రిశూలాలు, తల్వార్లు పంచి ముస్లింల ఆస్తుల జాబితా తయారు చేసుకొని రెడీగా ఉన్న సంఘ్‌పరివార్ సంస్థలకు ఇంక ఒకటే కావలసి ఉండింది. పోలీసులు అడ్డురారన్న హామీ.

ఈ హామీ నరేంద్ర మోడి ఇచ్చాడన్నది గుజరాత్‌లో బహిరంగ రహస్యం. మేము టాక్సీ డ్రైవర్లతో, హొటళ్లలో పక్కన కూర్చున్న వాళ్లతో, బస్టాండ్‌లో బస్ కోసం కాచుకున్న వాళ్లతో మేమెవరో, ఎందుకోసం వచ్చామో చెప్పకుండా 'పట్టపగలు అల్లర్లకు పాల్పడినట్టయితే పోలీసులు జోక్యం చేసుకుంటారని జనం భయపడలేదా?' అని అమాయకంగా అడిగినప్పుడు తడబడకుండ వచ్చిన జవాబు మోడీ హామీ ఇచ్చాడని. ఈ మాట అన్నవాళ్లు ఎక్కువగా హిందువులే. వాళ్లు దాన్ని వ్యతిరేకత భావంతో అనలేదు. కొందరు యథాలాపంగా అన్నారు, కొందరు అదొక గొప్ప విషయమయినట్టు అన్నారు. 'మోడీనే ఛత్తీస్ ఘంటే కా టైం దియా' (మోడీ 36 గంటల టైం ఇచ్చాడు) అనేది గుజరాత్‌లో సర్వత్రా వినపడే మాట. ఇంకేం కావాలి?

బజ్రంగ్‌దళ్‌కు గుజరాత్‌లో 3321 గ్రామాలలో శాఖలున్నాయని ఆ సంస్థ చెప్పుకుంటుంది. ఒక్కొక్క గ్రామంలోనూ '20 మంది యువకుల సైన్యాన్ని తయారు చేయాలి' అన్నది దళ్ లక్ష్యాలలో ఒకటి. విశ్వహిందూ పరిషత్‌కు 7000 గ్రామాలలో శాఖలున్నాయని ఆ సంస్థ చెప్పుకుంటుంది. ఇద్దరూ కొన్ని లక్షల సంఖ్యలో త్రిశూలాలు అని పిలవబడే మూడు మొనల పిడిబాకులు, తల్వార్లు పంచి ఉన్నారు. ముస్లింల వ్యాపార జాబితా తయారు చేసుకొని సిద్ధంగా ఉన్నారు. గోధ్రా మారణకాండ వారు ఊహించిన దానికంటె గొప్ప 'అవకాశం' ఇచ్చింది. ప్రతీకార హింసకు మోడి 36 గంటల టైం కూడా ఇచ్చాడు.

మోడి టైం ఇయ్యకపోయినా గుజరాత్ పోలీసులు సంఘ్‌పరివార్ దుండగులకు పెద్దగా అడ్డం వచ్చేవారు కారు. ఎందుకంటే పోలీసు యంత్రాంగాన్ని కాషాయ యంత్రాంగంగా మార్చే ప్రక్రియ గుజరాత్‌లో అప్పటికే చాలా దూరం పోయింది. గుజరాత్ రాష్ట్ర పోలీస్ యంత్రాంగంలో మైనారిటీలు చాలా కొద్దిమంది ఉన్నారనీ, వారి సంఖ్యను పెంచడంపైన ప్రత్యేక శ్రద్ధ పెట్టాలనీ జాతీయ మైనారిటీస్ కమిషన్ ఇటీవల అనింది. పెంచడానికి రేపు ఏం చేయబోతారో గానీ తగ్గించడానికి మాత్రం గతంలో పనిగట్టుకొని ప్రయత్నం చేసారు. సంఖ్య తగ్గించడమే కాక, ఉన్న కొద్దిమంది ముస్లిం, క్రిస్టియన్ పోలీస్ ఆఫీసర్లకు 'లూప్ లైన్' పోస్టింగులు ఇచ్చారు. గుజరాత్ కేడర్‌కు చెందిన 8 మంది ముస్లిం ఐపిఎస్ ఆఫీసర్లలో ఏ ఒక్కరూ శాంతి భద్రతలకు సంబంధించిన పోస్టింగ్‌లలో లేరు. 65 మంది ముస్లిం ఇన్స్‌పెక్టర్‌లలో ఇద్దరు మాత్రమే 'ఫీల్డ్ పోస్టింగ్'లలో ఉన్నారు.

పోలీసు యంత్రాంగంలోని హిందువులు అందరూ కూడ సంఘ్‌పరివార్‌కు అనుకూలంగా ఉండరు కాబట్టి ఆ దృక్పథానికి అనుకూలంగా ఉన్నవారిని సంఘ్‌పరివార్ అజెండాకు అనుకూలమైన పోస్టింగ్‌లలో వేసుకోవడం గుజరాత్‌లో చాలా కాలంగా జరుగుతున్నది. హోంగార్డు స్థాయిలో, ఎంపిక దగ్గరే సంఘ్‌పరివార్ మనుషులను ప్రవేశపెడుతున్నారు. హోంగార్డుల ఎంపికలో జిల్లాస్థాయి పోలీస్ అధికారులకు చాలా స్వేచ్ఛ ఉంటుంది కాబట్టి ఇది సులభమైన పని. అహమ్మదాబాద్ నగరంలోని హోం గార్డులలో 7000 మంది విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలని ఒక సామాజిక కార్యకర్త మాతో అన్నారు. రాష్ట్రం మొత్తంమీద 12,000 మంది ఉన్నారని 'కమ్యూనలిజం కాంబాట్' నివేదిక అంటుంది.

మొన్నటి హింసాకాండ సమయంలో ఏ జిల్లాలోనయితే ఎస్‌పిలు సంఘ్‌పరివార్ కార్యకర్తల పైన చర్య తీసుకొని (ముందు జాగ్రత్తగా అరెస్టు చేయడం, అల్లర్లు మొదలవుతుండగానే బలప్రయోగంతో చెదరగొట్టడం, ఏదైనా సంఘటన జరిగితే వెంటనే కేసు పెట్టి అరెస్టు చేయడం వగైరా) హింసను అదుపులో ఉంచారో ఆ ఎస్‌పిలందరికీ త్వరలోనే బదిలీ ఆర్డర్లు వచ్చాయి. హింసను అదుపు చేయడంలో విఫలమైన పోలీస్ అధికార్లు, సంఘ్‌పరివార్ దుండగులకు రోజుల తరబడి బీభత్సం సృష్టించే అవకాశం ఇచ్చిన అధికార్లు మాత్రం దర్జాగా అవే పోస్టులలో కొనసాగారు. (కెపిఎస్ గిల్‌ను కేంద్ర ప్రభుత్వం 'భద్రతా సలహాదారుని'గా గుజరాత్‌కు పంపిన తరువాత వీళ్లలో కొందరిని ఆయన ఒత్తిడి ఫలితంగా బదిలీ చేసారు). కచ్, భరుచ్, బనస్‌కాంటా, భావ్‌నగర్ జిల్లాలలో ఎస్‌పిలు విశ్వహిందూ పరిషత్ తదితర సంఘ్‌పరివార్ నాయకులను అరెస్టు చేసి, దొమ్మీలపైన తగు చర్యలు తీసుకొని హింసాకాండను సమర్థంగా ఎదుర్కొన్నారు. ఆ జిల్లాలలో హింసాకాండ బాగా తక్కువగా జరిగింది (దీనికి ఆ ఎస్‌పిల కృషే కాక వేరే కారణాలు కూడ ఉండి ఉండవచ్చును). భావ్‌నగర్ ఎస్‌పిని అహమ్మదాబాద్ పోలీస్ కంట్రోల్ రూంకు, బనస్‌కాంటా ఎస్‌పిని ఇంటిలిజెన్స్ విభాగానికి, కచ్ ఎస్‌పిని ప్రొహిబిషన్ శాఖకు బదిలీ చేసారు. భరుచ్ ఎస్‌పిని కొత్తగా ఏర్పాటు చేసిన నర్మదా జిల్లాకు బదిలీ చేసారు.

## IX

## శిబిరాల్లోనూ బాధలే

ఫిబ్రవరి 28 ఉదయం నుండి దాదాపు మార్చి 15 వరకు గుజరాత్‌లో హిందుత్వవాదుల మారణకాండ యథేచ్ఛగా సాగింది. వెయ్యి, అయిదువేలు,

పదివేలు, ఇరవైవేల గుంపులు కాలినడకన, ట్రక్కులలో, రకరకాల వాహనాలలో రాష్ట్రమంతటా స్వైరవిహారం చేసారు. ముస్లింలను నరికి చంపారు, రేప్ చేసారు, పెట్రోల్ పోసి తగలబెట్టి చంపారు, ఇళ్ళు, దుకాణాలు, షోరూంలు, ఫ్యాక్టరీలు లూటీచేసి తగలబెట్టారు. పారిపోతున్న వారి గురించి సెల్‌ఫోన్లలో సమాచారం అందించుకొని దారికాచి దాడిచేసారు. క్షతగాత్రులను అస్పత్రికి తీసుకుపోతున్న వాహనాలను దారిలో ఆపి కొనప్రాణంతో ఉన్నవారిని తుదముట్టించారు. పోలీసులు కొన్నిచోట్ల కళ్లు మూసుకొని కూర్చోగా కొన్నిచోట్ల స్వయంగా దొమ్మీలలో పాల్గొన్నారు. ప్రతిఘటించడానికి ప్రయత్నం చేసిన ముస్లింలపైన కాల్పులు జరిపారు. రక్షణ కోసం వస్తున్న వారిపైన బాష్పవాయువు ప్రయోగించి తరిమారు. ఊరు విడిచి పోదామని బయటికి వచ్చిన వారిని కర్ఫ్యూ ఉందని చెప్పి వెనక్కి తరిమారు. అదే కర్ఫ్యూలో వారి ఇండ్లమీద దాడిచేయడానికి వచ్చిన సంఘ్‌పరివార్ మూకలను ఏమీ అనలేదు. కొన్నిచోట్ల పోలీసు సిబ్బంది స్వయంగా దాడులలో పాల్గొనగా, కొన్నిచోట్ల పెట్రోల్ డబ్బాలు తదితర సామగ్రి పోలీసుల జీపులలో సరఫరా అయింది.

ఆ రెండు వారాలు గుజరాత్‌లోని ముస్లింలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. రాజ్య యంత్రాంగమే దుండగులతో చేతులు కలిపి మారణహోమం సాగిస్తుంటే ఎటుపోవాలో, ఎవరు రక్షిస్తారో పాలుబోక దిక్కుకొకరు చెల్లాచెదరయ్యారు. దారికాచి నరికి చంపితే ప్రాణాలు విడిచారు. చివరికి వాళ్లకు దొరికిన అండ ఒకటే. ముస్లిం కుటుంబాలు పెద్ద సంఖ్యలో ఉండే ఊర్లు చేరుకొని తమ మతస్తుల నీడన బతకగలిగిన వారు బతికిపోయారు. ఆ లోపలే ప్రాణం పోయినవారు పోయారు.

శరణార్థులయి వచ్చినవారికి ఆయా కేంద్రాలలోని ముస్లిం కుటుంబాలు తిండిపెట్టి, ఉండడానికి ఒక దర్గా ఆవరణనో, వేరే ఏదైనా ఖాళీ జాగానో చూపించారు. అవే గుజరాత్‌లోని 'శరణార్థుల శిబిరాలు'. ఒక దశలో శిబిరాలు 100కు పైనే ఉండేవి. వాటిలో లక్ష మందికి పైగా జనం ఉండేవారు. అయితే మా పర్యటన ముగిసేటప్పటికి అధికారికంగా గుర్తింపు పొందిన శిబిరాలు 91 కి తగ్గాయి. శరణార్థుల శిబిరాలు నెలకొల్పడానికి ప్రభుత్వం ఏమీ చేయనప్పుడు, ఈ 'గుర్తింపు' ఏమిటని మీరు అడగవచ్చు. శిబిరాలు ముస్లిం సమాజం తనవారి కోసం తానే ఏర్పాటు చేసుకున్నప్పటికీ తిండి గింజల వరకు ప్రభుత్వం తలసరి ఇంత సరఫరా చేస్తున్నది. అదీ గుర్తింపు పొందిన శిబిరాలకు మాత్రమే. ప్రస్తుతం

(అంటే మే నెల మధ్యభాగానికి) 91 శిబిరాలు ఉన్నాయనీ, వాటిలో 86,963 మంది శరణార్థులు ఉన్నారనీ రాష్ట్ర ప్రభుత్వం అంటుంది. అయితే శరణార్థుల సంఖ్య అంతకంటే ఎక్కువే ఉంది. గుర్తింపు పొందని శిబిరాలు కొన్ని ఉన్నాయి. గుర్తింపు పొందిన శిబిరాలలో సహితం ప్రభుత్వం అంగీకరించే లెక్కకంటె ఎక్కువ మంది ఉంటున్నారు. అంతేకాక, ఏ శిబిరంలోకీ పోకుండ తమ బంధుమిత్రుల ఇళ్లలో ఉంటున్న కాందిశీకులూ ఉన్నారు. మొత్తం సంఖ్య 1,50,000 దాకా ఉండవచ్చునని అంచనా. 86,963 మంది పోగా మిగిలిన వాళ్లకు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్నది శూన్యం.

అయితే తాను ఇప్పటికే చాలా ఉదారంగా ఉంటున్నానని ప్రభుత్వం భావిస్తున్నది. శిబిరాలలో మూడురకాల వాళ్లు ఉన్నారంట. ఒకటి, నిజంగానే దాడికి గురయిన వాళ్లు. రెండు వారిపైన దాడి జరగకున్నా భయపడి పారిపోయి వచ్చేసిన వారు. మూడు, ఈ అల్లర్లతో సంబంధం లేని నిరుద్యోగులు, బేకార్‌గాళ్లు, ఠికాణా లేనివాళ్లు. 'అయితే మేము ఎవరు ఏ బాపతు అని చూడకుండ అందరికీ తిండికి అవసరమైనవి ఇస్తున్నాం' అని రాష్ట్ర ప్రభుత్వ అసిస్టెంట్ రిలీఫ్ కమీషనర్ వాఘేలా గారు అంటారు. అయితే మొత్తంగానే శిబిరాలు మూసెయ్యాలనీ అందరూ వారి వారి ఇళ్లకు వెళ్లిపోవాలనీ ఒత్తిడి మాత్రం శిబిరాల నిర్వాహకుల మీద ప్రభుత్వం గట్టిగా పెడుతున్నది.

శిబిరాలలోని ఒక్కొక్క వ్యక్తికీ గుజరాత్ ప్రభుత్వం రోజుకు 400 గ్రాముల గోధుమ పిండి, 100 గ్రాముల బియ్యం, 50 గ్రాముల నూనె, 50 గ్రాముల చక్కెర, 50 గ్రాముల పప్పు ఇచ్చి అదనంగా 5 రూపాయలు ఇస్తున్నది. ఆ అయిదు రూపాయలతో తక్కిన ఖర్చంతా శిబిరం నిర్వాహకులు పెట్టుకోవాలి. కాయగూరలు, పొయ్యిలోకి కట్టెలు, ఇతర వంటసామగ్రి, టాంకర్ల ద్వారా తెచ్చుకునే మంచినీళ్లు, కరెంటు, టెంట్లు, మందులు - అన్నీ ఆ అయిదు రూపాయలలోనే. అది చాలదేమోనని రాష్ట్ర ప్రభుత్వ అసిస్టెంట్ రిలీఫ్ కమిషనర్‌తో అంటే 'అయిదు రూపాయలే ఎక్కువ' అని చాలా కరుకుగా అంటాడు. ఆ కరుకుదనంలో గుజరాతీ హిందువులలో ముస్లింలంటే ఉన్న ద్వేషమంతా ధ్వనిస్తుంది. అక్కడితో ఆగకుండ ఆ అధికారి 'ప్రభుత్వానికి అన్నం పెట్టే బాధ్యత ఉందంటే ఒప్పుకుంటాముగానీ పాన్, సిగరెట్లు కూడ ఇవ్వాలంటారా?' అని వేళాకోళంగా అంటాడు. ఇంకొంచెం వాదన పెట్టుకుంటే, మనిషికి రోజుకు 2400 కేలరీల ఎనర్జీ చాలుననీ తాము 2900 కేలరీల తిండి

పదార్థాలు ఇస్తున్నామనీ అంటాడు. కేలరీలు సరే, ఎండ నుండి కాపాడడానికి కనీసం టెంటు కావాలి, తాగడానికి మంచినీళ్లు కావాలి, రాత్రివేళ కరెంటు కావాలి, పిల్లలకూ, రోగగ్రస్తులకూ వైద్యం కావాలి, వీటి సంగతేమిటంటే ప్రభుత్వం ఇచ్చిన సహాయం సరిపోలేదని బాధితులు హైకోర్టులో కేసువేయగా హైకోర్టు వారి వాదనను తిరస్కరించిందని అంటాడు. గుజరాత్ హైకోర్టు గుజరాతీ సమాజం కంటే భిన్నంగా స్పందించలేదనేది నగ్నసత్యం. దానికి ఇదొక ఉదాహరణ మాత్రమే. ప్రభుత్వం ఇస్తున్న సహాయం సరిపోవడం లేదని బాధితులు కోర్టుకొస్తే ప్రభుత్వ సమాధానంతో సంతృప్తి చెంది హైకోర్టు కేసు కొట్టేసిందే తప్ప కనీసం దానిపైన స్వతంత్రమైన నిపుణుల అభిప్రాయం కూడ తీసుకోలేదు.

శిబిరాలలో చిన్నవీ పెద్దవీ ఉన్నాయి. మేము చూసిన వాటిలో అన్నిటికంటె చిన్నది దాహెూద్ జిల్లా ఫతేపురా తాలూకాలోని సుక్సార్ గ్రామ శిబిరం. అందులో 116 కుటుంబాలు ఉన్నాయి. అంటే జనం 500 మంది దాకా ఉండవచ్చు. అన్నిటికంటె పెద్దది అహమ్మదాబాద్ నగరంలోని షా–ఆలం ప్రాంతంలో ఉన్న శిబిరం. అందులో మేనెల రెండవ వారంలో 13,000 మంది శరణార్థులు ఉన్నారు. నరోడా, నరోడా పాటియా బాధితులందరూ షా–ఆలం క్యాంపులోనే ఉన్నారు.

పారిశుధ్యం ఈ క్యాంపులకు సంబంధించిన ముఖ్యమైన సమస్యలలో ఒకటి. గ్రామీణ ప్రాంతాలలో (తాలూకా కేంద్రాలలోనూ పెద్ద గ్రామాలలోనూ) ఉన్న శిబిరాల కంటె అహమ్మదాబాద్, బరోడా నగరాలలోని శిబిరాలకు ఇది పెద్ద సమస్య. గ్రామీణ శిబిరాలలో మలమూత్ర విసర్జన కోసం బహిర్భూమికి పోయే అవకాశం ఉంటుంది. నీటి వసతికి కూడ సమీపంలోని రైతుల బోర్లమీద కొంతవరకు ఆధారపడవచ్చు. అన్నం మెతుకులు, కూరగాయల తొక్కు, ఇతర చెత్త చెదారం ఊరిబయట పారేసి రావచ్చు. నగరాలలోని శిబిరాలలో ఆ సదుపాయాలు ఉండవు. 13,000 జనాభా ఉన్న షా–ఆలం శిబిరంలో కేవలం 15 మరుగుదొడ్లు, 12 స్నానం గదులు ఉన్నాయి! ఆ జనాభాలో పసిపిల్లలున్నారు, వృద్ధులున్నారు, రోగగ్రస్తులున్నారు. ఈ మూడు నెలల కాలంలోనే ఆ శిబిరంలో 32 ప్రసవాలు అయ్యాయి కూడ. దేశంలోని సకల రాజకీయ ప్రముఖులు (ఒక్క అద్వానీని మినహాయించి) సందర్శించిన ఈ శిబిరం పరిస్థితే ఇట్లా ఉంటే ఇంక మిగిలిన శిబిరాల గురించి ఎక్కువ చెప్పుకోనక్కరలేదు.

దేశంలోని అన్ని ప్రాంతాలలాగా గుజరాత్‌లో కూడ ఈ సంవత్సరం ఎండలు విపరీతంగా ఉన్నాయి. బహిరంగ ప్రదేశంలో వేడి మట్టిలో వేసిన టెంట్లలో

బతుకుతున్న శరణార్థుల పరిస్థితి ఊహించుకోవచ్చు. మధ్యాహ్నమయ్యేసరికి వడగాలులకు తట్టుకోలేక చుట్టుపక్కల ఉన్న ముస్లింల ఇళ్లకు పోయి వరండాలో కొద్దిసేపు కూర్చొని రావడం శరణార్థులు అలవరుచుకున్నారు. అయితే శిబిరాల నిర్వాహకుల భయం ఏమిటంటే ఆ సమయంలో తాసీల్దారు సందర్శించడానికి వచ్చి'ఇంతమందే కదా మీ శిబిరంలో ఉండేది – నువ్వు ఎక్కువ రేషన్ తీసుకుంటున్నావు' అని రేషన్‌లో కోత పెడతాడని. చాలాచోట్ల శరణార్థుల సంఖ్య గురించి శిబిరం నిర్వాహకులు ఇచ్చే సమాచారానికీ ప్రభుత్వం చెప్పే లెక్కలకూ తేడా ఉండడానికి ఇదొక కారణం. అప్పుడు శిబిరం నిర్వాహకులు బయట చందాలు తెచ్చి రేషన్ కోత పెట్టిన వారికి తిండి పెడతారు. ప్రభుత్వం తలసరి ఇచ్చే 5 రూపాయల బత్తెం అన్ని అవసరాలకూ సరిపోదు కాబట్టి బయటి చందాలు ఎట్లాగూ తప్పనిసరే. చెప్పుకోదగ్గ విషయం – సిగ్గుపడవలసిన విషయం – ఏమిటంటే ముస్లింలు, ముస్లిం సంస్థలు తప్ప వేరే ఎవ్వరూ చందాలు ఇవ్వడం లేదు. స్వచ్ఛంద సంస్థలు (ఎన్‌జివోలు) కూడ అతి కొద్ది మినహాయింపులతో ఏ సహాయమూ చేయడం లేదు.

ప్రఖ్యాతమైన అనేక పాశ్చాత్య స్వచ్ఛంద సంస్థలు గుజరాత్‌లో శరణార్థుల శిబిరాల నిర్వహణ 'సున్నితమైన రాజకీయ విషయం' కాబట్టి దానికి నిధులు ఇవ్వబోమని స్పష్టం చేసాయి. గుజరాత్ రాష్ట్రానికే చెందిన సేవా సంస్థలు (అతి కొద్ది మినహాయింపులతో) చొరవ తీసుకోలేదు. వారి అభిప్రాయాలు ఎట్లాగున్నా, ముస్లింలకు ఎవ్వరు సహాయం చేసినా నరుకుతామన్న హిందుత్వవాదుల బెదిరింపు బలంగా పనిచేసింది. గాంధీ వారసులయిన సబర్మతీ ఆశ్రమ నిర్వాహకులే భయపడ్డారంటే వేరే ధర్మసంస్థల గురించి ఎందుకు చెప్పుకోవాలి? గతంలో అహమ్మదాబాద్‌లో మత ఘర్షణలు జరిగినప్పుడు ముస్లింలకు తలదాచుకోవడానికి సబర్మతీ ఆశ్రమం అందుబాట్లో ఉండేది. 'ఈసారి కూడ ముస్లింలకు సహాయం చేద్దామనుకుంటున్నావేమో, నిన్నే నరుకుతాం' అని విశ్వహిందూ పరిషత్ వాళ్లు బెదిరించగా ఆశ్రమ నిర్వాహకుడు ఆశ్రమానికి తాళం వేసి వెళ్లిపోయాడు.

ఇదే గుజరాత్‌లోని కచ్ జిల్లాలో భూకంపం వచ్చినప్పుడు ఎంత పెద్దెత్తున గుజరాతీ సమాజం సహాయ సహకారాలు అందియ్యడానికి కదిలిందో ఈసారి అంత స్తబ్దంగా ఉండిపోయిందనేది పరిశీలకులందరూ గమనించిన విషయం. ఇది కేవలం సంఘ్‌పరివార్ హంతకుల బెదిరింపుల వల్ల జరిగి ఉంటే

కొంతవరకయినా అర్థం చేసుకోవచ్చు. ప్రాణం ఎవరికైనా తీపే కదా! మల్లికా సారాభాయి పారిశ్రామిక రంగంలోనూ సాంస్కృతిక రంగంలోనూ అత్యంత ప్రముఖ గుజరాతీ కుటుంబానికి చెందిన వ్యక్తి. కేవలం శాంతి సామరస్యాల పునరుద్ధరణ కృషిలో పాల్గొన్నందుకు విశ్వహిందూ పరిషత్ వాళ్లు ఆమెను బెదిరించగా ఆమె తాత్కాలికంగా దేశమే వదిలిపెట్టి వెళ్లిపోయింది.

అయితే గుజరాత్ మౌనంగా ఉండిపోవడానికి కేవలం భయమే కారణం కాదు. 'సగటు గుజరాతీ హిందువుల ఆలోచనలే అట్లాంటివి. ఎవరైనా అడిగితే సంఘ్‌పరివార్ బెదిరింపులను సాకుగా చూపిస్తున్నారంతే' అని ముస్లింలే కాక ఇంకా అభ్యుదయ భావాలు మిగిలి ఉన్న హిందువులు సహితం అంటున్నారు.

పారిశుధ్యానికి తిరిగి వస్తే, చాలా శిబిరాలలో బోరు దగ్గర, బాత్‌రూంల దగ్గర, వంట చేసే దగ్గర మురుగు నీటి గుంటలు కనిపిస్తున్నాయి. రేపు నాలుగు వర్షాలు వస్తే అది అతిసార వ్యాధికి దారితీయగలదు. పేదవర్గాల పిల్లల ప్రాణాలు తీయడంలో అగ్రభాగాన ఉన్న వ్యాధి అతిసార అన్నది తెలిసిన విషయమే. ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వ అసిస్టెంట్ రిలీఫ్ కమిషనర్‌ను అడిగితే, ప్రజారోగ్య శాఖవారు శిబిరాలలో పారిశుధ్యం సంగతి చూసుకుంటున్నారని బుకాయిస్తాడు.

దారుణ మారణకాండకు గురయిన ముస్లింలను ఆదుకోవడానికి ముస్లిం సమాజం తప్ప రాష్ట్ర ప్రభుత్వం గానీ, సాధారణంగా ఇటువంటి సహాయక చర్యలలో ముందుండే స్వచ్ఛంద సంస్థలు గానీ ఎంతమాత్రం కదలకపోవడం బయటి వాళ్లందరినీ కలవరపరచింది గానీ గుజరాత్ ప్రభుత్వం దానిని బాధపడవలసిన విషయంగా చూడడం లేదు. లోకమంతా ఇంత గగ్గోలు పెట్టినా, కనీసం ఒక్క శిబిరం కూడ ప్రభుత్వం నెలకొల్పక పోవడం ఏమిటని ప్రశ్నిస్తే 'కష్టాలలో ఉన్న తమవారిని తామే ఆదుకునే సత్సంప్రదాయం గుజరాతీ సమాజంలో ఉంది' అని అసిస్టెంట్ రిలీఫ్ కమిసనర్ వాఘేలా అంటాడు. ప్రజలెంత మంచివాళ్లు, వాళ్లను ఆదుకునే కష్టం మోడీకి లేకుండ చేసారు!

అయితే ఇప్పుడు ఆ శిబిరాలను బలవంతంగానయినా మూసేయాలని గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించుకునింది. శిబిరాల నిర్వాహకులపైన రకరకాల రూపాలలో ఒత్తిడి పెడుతున్నది. 'ఇప్పుడు పరిస్థితి ప్రశాంతంగా ఉంది కదా, వెనక్కి పంపించేయండి' అని జిల్లా కలెక్టర్లు, తాసీల్దార్లు (గుజరాత్‌లో మామ్లత్‌దార్ అంటారు) నిర్వాహకులను దబాయిస్తున్నారు. మే నెల ఆఖరుకల్లా శిబిరాలు మూసేస్తామని మోడీ ప్రభుత్వం పలుమార్లు ప్రకటించింది. షా-ఆలం

క్యాంపుతో సహా మొత్తం పది శిబిరాల నిర్వాహకులు గుజరాత్ హైకోర్టులో కేసు వేసి శిబిరాలను మూసేయవద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించమని కోరగా, ఒక నెల రోజులు వాటి జీవితాన్ని పొడిగిస్తూ గుజరాత్ హైకోర్టు ఒక మధ్యంతర ఉత్తర్వును ఇచ్చింది. అన్ని శిబిరాల తరపున ఢిల్లీకి చెందిన పి.యు.డి.ఆర్. సుప్రీంకోర్టులో కేసు వేసి మే నెలాఖరుకు మూసేసే ఆలోచనపైన స్టే ఇమ్మని కోరగా సుప్రీంకోర్టు స్టే ఇవ్వలేదు.

ఇవి రాష్ట్ర ప్రభుత్వం నెలకొల్పిన శిబిరాలు కానప్పుడు వాటిని రాష్ట్ర ప్రభుత్వం మూసేయడం ఏమిటని ఆశ్చర్యపోవచ్చును. దాదాపు లక్ష మంది ముస్లింలు శిబిరాలలో బికార్లలాగ ఉండడం, దేశ విదేశాల నుండి ఎవరెవరో వచ్చి వాళ్లను చూసి పోవడం, వారికి సానుభూతి తెలపడం, నరేంద్ర మోడి పరువుతీసే వ్యాఖ్యలు చేయడం వారికి నచ్చడంలేదు. ఈ శిబిరాలు శాంతియుత పరిస్థితులు ఇంకా తిరిగి నెలకొనలేదన్న వాస్తవానికొక చిహ్నంగా ఉంటాయి. నరేంద్ర మోడి యోగ్యత మీద ఒక ప్రశ్నార్థకంగా ఉంటాయి. అంతేకాక ఈ శిబిరాలు టెర్రరిస్టు కేంద్రాలుగా మారుతున్నాయని అద్వానీ, మోడి ఒకరి వెంట ఒకరు అంటూనే ఉన్నారాయె. ఈ మాటలు వారు కేవలం ప్రచారం కోసం అనడం లేదు. తప్పుచేసిన వాళ్లకు సహజంగా ఉండే భయం వల్ల, తాము చేసిన ఘోరకాండ దానికి దారితీయగలదన్న భీతి వాళ్లనిప్పుడు నిద్రపోనీయడం లేదు. అందువల్ల నిజంగా ఉన్నదానికంటె ఎక్కువ ఊహించుకుంటూ ఉండవచ్చు.

అయితే రాష్ట్ర ప్రభుత్వం ఈ శిబిరాలనెట్లా మూసేస్తుంది? తానిచ్చే రేషన్ బంద్ చేస్తుంది. దానితోనే చాలా శిబిరాలు మూతపడిపోతాయి. మిగిలిన వాటిని మూసేయడానికి అనేక మార్గాలున్నాయి. టెర్రరిస్టులున్నారని నాలుగుసార్లు దాడిచేసి సోదాచేస్తే వాళ్లే మూసేసుకుంటారు. అక్కడిదాకా పోనక్కరలేదు. శిబిరాల నిర్వాహకులు ముస్లిం సమాజానికి చెందిన పెద్దమనుషులు కాబట్టి వారిపైన ఒత్తిడి తేవడం ప్రభుత్వానికి పెద్ద కష్టం కాదు.

శరణార్థులు ఎటువంటి పరిస్థితిలో తిరిగి పోగలరన్న విషయం తరువాతి అధ్యాయంలో చూద్దాం. బలవంతంగా వెనక్కి పంపితే ఏమి జరగగలదనడానికి ఒక ఉదాహరణ మాత్రం ఇక్కడ ఇస్తాము. ఇది మేము సబర్‌కాంటా జిల్లాలో పర్యటిస్తుండగా జరిగింది. ఈ జిల్లాలోని బిలోడా తాలూకా కేంద్రం నుండి చాలా మంది ముస్లింలు మార్చి నెల మొదటి వారంలో ఇదర్ తాలూకా కేంద్రంలోని శిబిరానికి పారిపోయి వచ్చేసారు. అప్పటికి ఆ ఊరిలో ఏం జరగలేదు గానీ అక్కడ

ముస్లింలు కొద్దిమందే ఉండడం వల్ల, చుట్టుపక్కల జరుగుతున్న దౌర్జన్యకాండ వల్ల భయపడ్డారు. ఇడర్ తాలూకా కేంద్రంలో ముస్లింలు పెద్ద సంఖ్యలో ఉండడం వల్ల అక్కడ ఏర్పాటు చేసిన శిబిరంలోకి బిలోడా వాసులు వచ్చేసారు.

అయితే ప్రభుత్వ అధికారులు ఇడర్ శిబిరం నిర్వాహకులపైన ఒత్తిడి పెట్టారు. బిలోడాలో ఏం జరగలేదు కదా, వాళ్లనిక్కడెందుకు పెట్టుకున్నారు? ప్రభుత్వానికి చెడ్డపేరు తేవడానికా? అన్నారు. మొత్తానికి మే నెల మొదటివారంలో వారు వెనక్కి వెళ్లిపోయారు. అయితే 7వ తేదీ సాయంత్రం కాయగూరలు అమ్ముకునే రజాక్‌భాయి మన్సూర్‌ను బిలోడాలో రహదారి మీదనే అతని దుకాణం దగ్గరే ఆరుగురు విశ్వహిందూ పరిషత్, బజ్రంగ్‌దళ్ కార్యకర్తలు తల్వార్లతో నరికి చంపారు. వారిని 9వ తేదీన అరెస్టు చేయగా అన్ని సంఘ్‌పరివార్ సంస్థలూ కలిసి ఆ తాలూకాలో బంద్ పిలుపు ఇచ్చి పెద్ద ధర్నా నిర్వహించాయి.

తక్కిన బిలోడా ముస్లింలు మళ్లీ ఏదో ఒక శిబిరంలోకి చేరక తప్పదు.

# X

## పునరావాసానికి అవరోధాలు

గుజరాత్ దౌర్జన్యకాండలో ముస్లింలు పొందిన నష్టం అంతా యింతా కాదు. సబర్మతీ ఎక్స్‌ప్రెస్‌లో చనిపోయిన 58 మందిని కలుపుకొని మొత్తం గుజరాత్ హింసాకాండలో చనిపోయిన వారు 554 మంది అని ఆ రాష్ట్ర ప్రభుత్వం అంటుందని పైన చెప్పుకున్నాం. అయితే ఇది శవపరీక్ష జరిగి, శవాన్ని గుర్తుపట్టిన వారి సంఖ్య మాత్రమే. మొత్తం హతులు 1000 పైన ఉంటారనీ 2000 దాకా ఉండవచ్చుననీ అంచనా. 1000 పేర్లకు పైగా బాధితులు చెప్తున్నారు గానీ శవాలను గుర్తుపట్టని కారణంగా (ముక్కలుగా నరికి పెట్రోల్ పోసి తగలబెట్టిన శవాల శకలాలను గుర్తుపట్టడం సంగతి అటుంచి లెక్కపెట్టడం కూడ కష్టం) ప్రభుత్వం వారందరినీ 'మిస్సింగ్' అన్న జాబితాలో చేర్చింది.

చనిపోయినట్టు గుర్తుపట్టిన వారి కుటుంబాలకు లక్ష రూపాయల నష్టపరిహారం (40 వేల రూపాయల నగదు, 60 వేల రూపాయల నర్మదా ప్రాజెక్టు బాండులు) ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన అదనపు సహాయం ఫలితంగా నగదు నష్టపరిహారం ఇంకొక 50 వేలు ఇవ్వనున్నారు. కానీ 'మిస్సింగ్' జాబితాలో చేర్చిన వారి కుటుంబాల పరిస్థితి? చట్టం ప్రకారం 7 సంవత్సరాల దాకా కాచుకునేటట్టయితే వారికి న్యాయం చేసినట్టు కాదు. ఈ 'మిస్సింగ్'

మనుషులు నిజంగా ఉన్నదీ పోయిందీ విచారించడానికి ఒక కమిటీ వేస్తున్నామనీ, ఆ కమిటీ నివేదిక లభించిన తరువాత దానినిబట్టి కొందరికైనా వెంటనే నష్టపరిహారం ఇస్తామనీ గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వం అంటున్నది. అయితే ఈ విచారణ ఏవిధంగా ఉంటుందో ఎవరు నిర్వహిస్తారో చెప్పడంలేదు. మళ్లీ 'శవపరీక్ష జరగలేదు, శవాన్ని గుర్తుపట్టలేదు' అని తిరస్కరించడానికే అయితే కమిటీ వేయడమే అనవసరం.

ప్రాణాలేకాక ఆస్తినష్టం విపరీతంగా జరిగింది. ముస్లింలను ఆర్థికంగా నాశనం చేయడం గుజరాత్‌లో సంఘ్‌పరివార్ రెండు దశాబ్దాలు పైగా అనుసరిస్తున్న అజెండా అని చూసాం. మొన్నటి దౌర్జన్యకాండలో కూడ పేద కుటుంబాల యువకులకు లూటీలు యథేచ్ఛగా చేయవచ్చునన్న ఆశ చూపి సమీకరించి ముస్లింల దుకాణాలనూ హెూటళ్లనూ ఫ్యాక్టరీలనూ షోరూంలనూ దోచి ఆ తరువాత పెట్రోల్ పోసి తగలబెట్టారు. ఇళ్లను కూడ లూటీచేసి అగ్నికి ఆహుతి చేసారు.

రాష్ట్ర ప్రభుత్వం 17,166 కట్టడాలు పాక్షికంగా ధ్వంసం అయ్యాయనీ, 5,349 కట్టడాలు పూర్తిగా ధ్వంసం అయ్యాయనీ అంచనా వేసింది. అంటే మొత్తం 22,515 కట్టడాలు దహనానికీ విధ్వంసానికీ గురయ్యాయని అర్థం. వీటిలో ఎంత ఆస్తి ధ్వంసమయింది, లేక లూటీ అయింది అన్న అంచనా ప్రభుత్వం దగ్గర లేదు. ఇందులో ఇళ్లేకాక ఖరీదయిన షోరూంలు, షాపులు, ఫ్యాక్టరీలు వగైరాలన్నీ ఉన్నాయి. మొత్తం ముస్లింలకు జరిగిన ఆస్తి నష్టం (కట్టడాలు, వాటిలోని వస్తువులు కలిపి) 3800 కోట్ల రూపాయలు ఉంటుందని ఒక అంచనా. ఇందులో లూటీ అయి సంఘ్‌పరివార్ దుండగుల ఆస్తిగా మారినదెంత, తగలబడినది ఎంత అనే అంచనా లేదు.

ప్రభుత్వం కట్టడాలకు మాత్రమే పరిమిత నష్టపరిహారం ఇస్తున్నది. పాక్షికంగా ధ్వంసం అయిన 17,166 కట్టడాలలో 11,705 కట్టడాలకు ఇప్పటికే నష్టపరిహారం ఇచ్చామనీ, మొత్తం నష్టపరిహారం 11,66,000 రూపాయలు చెల్లించామనీ రాష్ట్ర ప్రభుత్వం అంటున్నది. అంటే పాక్షికంగా ధ్వంసం అయిన ఒక్కొక్క కట్టడానికీ సగటున 100 రూపాయల 'నష్టపరిహారం' ఇచ్చారన్నమాట!

అయితే పూర్తిగా ధ్వంసం అయిన 5,349 కట్టడాలలో 3530 కట్టడాలకు ఇప్పటిదాకా 6.02 కోట్ల రూపాయలు నష్టపరిహారంగా ఇచ్చారు. అంటే పూర్తిగా

ధ్వంసం అయిన ఒక్కొక్క కట్టడానికీ సగటున 17,000 రూపాయలిచ్చారు. ఇది ఒక పూరిపాక వేసుకోవడానికి సరిపోవచ్చు.

అంటే బాధితులు ఏదో చేసి సొంత ఖర్చుతో మళ్లీ నివాసాలు ఏర్పాటు చేసుకోవాలి తప్ప ప్రభుత్వం నుండి వారు పునరావాసం ఖర్చుగా పొందేది అందుకు ఎంతమాత్రం సరిపోదు. బాధితులలో చిన్న, పెద్ద వ్యాపారస్తులు చాలామందే ఉన్నారు. గ్రామీణ కిరాణా వ్యాపారుల నుండి పెద్ద షోరూం డీలర్లు, హోటల్ యజమానుల దాకా ఉన్నారు. పెద్దవాళ్లు ఎక్కడయినా పెట్టుబడి తెచ్చుకోగలరనుకున్నా, కిరాణా వ్యాపారస్తులు తిరిగి వ్యాపారం పెట్టుకోవడం ఎట్లా?

ఆర్థిక సమస్యే అయితే ఏదో ఒకరకంగా అధిగమిస్తారనుకుందాం. కానీ ముస్లింలను సామాజికంగా ఆర్థికంగా బహిష్కరించాలనేది సంఘ్‌పరివార్ అజెండాలోని ఒక ముఖ్యమైన విషయం. 'ముస్లింల దగ్గర ఏమీ కొనొద్దు, వారితో ఏ వ్యాపార లావాదేవీలు పెట్టుకోవద్దు' అనేది విశ్వహిందూ పరిషత్, బజ్రంగ్ దళ్‌లు పదే పదే జారీచేస్తున్న ఆదేశం. హిందూ స్త్రీలు ముస్లింలను పెళ్ళి చేసుకోకుండ చూడాలన్నది ఎంత ముఖ్య విషయమో ఇది కూడ అంతే ముఖ్య విషయం. ముస్లింలలోని వ్యాపార వర్గాల వారు ఇంక కోలుకునే అవకాశాలు కనపించడంలేదు. సంఘ్‌పరివార్ తన ఆదేశాలను ఎంత క్రూరంగా అమలు చేయగలదన్నది ఇప్పుడు అనుమానానికి ఆస్కారం లేకుండ రుజువయిపోయింది కాబట్టి వారి ఆంక్షలను అతిక్రమించే సాహసం ముస్లిమేతరులెవ్వరూ చేయరు.

ముస్లింలలో రైతులు కూడ ఉన్నారు. పంచ్‌మహల్స్, దాహోద్ జిల్లాలలో చాలామంది ముస్లింలు రైతులు. వారిలో కొందరు తమ భూమిని ఆదివాసీలకు పాలికి ఇచ్చి సాగుచేయించుకుంటారు. కొందరు ఆదివాసీలనూ ఇతర పేదలనూ కూలీలుగా పెట్టుకొని సొంత పర్యవేక్షణలో వ్యవసాయం చేస్తారు. సాంఘిక, ఆర్థిక బహిష్కరణ వీరికి కూడ వర్తిస్తుంది కాబట్టి, సొంత శ్రమతో చేయగల వ్యవసాయం తప్ప మిగిలినది వదులుకొని ఆ భూమిని హిందువులకు అమ్ముకోవలసిన పరిస్థితి ఆ వర్గానికి రావచ్చు. సబర్‌కాంటా జిల్లా ఇడర్ తాలూకా కేంద్రంలోని శిబిరంలో మమ్మల్ని కలిసిన రైతులు 'మాకా భూమి ఉందిగానీ సాంఘిక బహిష్కరణ వల్ల మేమింక సేద్యం చేసే ప్రసక్తి లేదు – వెనక్కిపోయి చేసేదేమీ లేదు' అన్నారు. ఇడర్ తాలూకాలోని 140 గ్రామాలలో ఇప్పుడు ఒక్క ముస్లిం కుటుంబం కూడా లేదు – అందరూ ఇడర్‌కు వచ్చేసారు. బహుశా ఎవరూ వెనక్కిపోరు.

అయితే సాంఘిక బహిష్కరణే కాక భద్రత కూడ పెద్ద సమస్యే. గుజరాత్‌లో సంఘ్‌పరివార్ పెట్టుకున్న ప్రణాళిక ముస్లింలలో ఎవ్వరికీ మినహాయింపు ఇవ్వదు. 'నేను దేశభక్తుడిని, అది అందరికీ తెలిసిన సంగతి' అని ఏ ముస్లిం ధైర్యంగా ఉండే అవకాశం లేదు. 'నేను లౌకికవాదిని, నాకేం భయం' అని గానీ, 'నేను హిందువులతో ఎప్పుడూ స్నేహంగా ఉంటున్నాను కదా' అని గానీ, 'నేను మసీదు ముఖం చూసి ఎరుగని హేతువాదిని' అని గానీ ముస్లింలెవరూ ధైర్యంగా ఉండే అవకాశం లేదు. సంఘ్‌పరివార్ ప్రణాళిక ముస్లింలను ఏరివేసే ప్రణాళిక. 'ముస్లిం' అనేదే వారి దృష్టిలో ఈ దేశానికి శత్రువు. 'ముస్లిం' అంటేనే జిహాదీ, టెర్రరిస్టు. 'ముస్లిం' అంటేనే పాకిస్తాన్. 'ముస్లిం' అంటేనే ఒసామాబిన్ లాడెన్. వారిని సంపూర్ణంగా అణచివేయాలి, తొక్కివేయాలి.

ఈ సత్యాన్ని అనుభవపూర్వకంగా తెలుసుకున్న వ్యక్తులలో ఒకరు బరోడాకు చెందిన జె.ఎస్. బందూక్‌వాలా. అతను లౌకికవాది, ఆధునికుడు, పియుసిఎల్ (పౌరహక్కుల ప్రజా సంఘం) గుజరాత్ రాష్ట్ర కమిటీ బాధ్యుడు. బాబ్రీమసీదు విషయంలో ముస్లింలు పంతానికి పోకుండ, ఇంక ఏ మసీదు జోలికీ రామని విశ్వహిందూ పరిషత్ హామీ యిచ్చేటట్టయితే ఆ ఒక్కటీ వదులుకోవడమే మంచిదని బహిరంగంగా ప్రకటించిన వ్యక్తి. ఫిబ్రవరి 28న అతని ఇంటి బయట ఉన్న అతని కారును దుండగులు ధ్వంసం చేయగా, అతను స్థానిక బిజెపి కార్పొరేటర్ దగ్గరికిపోయి 'నా సంగతి మీకు తెలుసుకదా – ఇదేం పని?' అని అడిగాడు. 'అప్పుడే ఏమయింది – రేపుంది అసలు సంగతి. చేతనయితే తప్పించుకో' అని ఆ మహానుభావుడు చెప్పాడు. దానిని వార్నింగ్‌గానే అర్థం చేసుకున్నప్పటికీ బందూక్‌వాలా ఎక్కడికీ వెళ్లిపోదలచుకోలేదు. సంఘ్‌పరివార్ వికృత దృష్టిలో సహితం తాను చేసిన 'తప్పు' ఏమీ లేనప్పుడు ఎందుకు పారిపోవాలి అనుకున్నాడు. ముస్లిం కుటుంబంలో పుట్టడమే తన తప్పని అతనికి మరుసటి రోజు హిందుత్వవాదులు అర్థం చేయించారు.

మార్చి 1 సాయంత్రం పెద్ద గుంపు తల్వార్లు, త్రిశూలాలూ, పెట్రోల్ డబ్బాలూ తీసుకొని బందూక్‌వాలా ఇంటి మీదికి వచ్చింది.. బందూక్‌వాలా కుటుంబ సభ్యులు ఇంట్లో లైట్లు ఆర్పేసి పెరటి గోడ దూకి పక్కింట్లోకి పోయారు. పక్కింటి వారు హిందువులే. కానీ వీరిని ఇంట్లోకి రానిచ్చి లైట్లు ఆపేసి ఆ రాత్రంతా బిక్కు బిక్కుమంటూ గడిపారు. దుండగులు తీరికగా బందూక్‌వాలా ఇంటిని లూటీచేసి దోచుకున్నది దోచుకొని తగలబెట్టి పోయారు. తెల్లవారి

బయటికి వచ్చిన బందూక్‌వాలా కుటుంబ సభ్యులు ఆరోజు మరొకచోట తలదాచుకున్నారు. మరుసటిరోజు బందూక్‌వాలా కుమార్తె తమను కాపాడిన హిందూ కుటుంబానికి ధన్యవాదాలు చెపుదామని వారి ఇంటికి పోగా వాళ్లు చాలా అయిష్టంగా 'ఇంక మీరు వెళ్లిపోండి – మా యింటికి రావద్దు' అన్నారు. వాళ్లను బజ్రంగ్‌దళ్ కార్యకర్తలు బాగా బెదిరించారని తరువాత వారికి తెలిసింది. ప్రాణం కాపాడుకోవడానికి మళ్లీ ఎవరి సహాయం అర్థించడానికి ఇష్టపడని బందూక్‌వాలా కుటుంబం ఈ దేశంలోనే ఉండబుద్ధికాక అమెరికాకు వెళ్లిపోయింది.

బందూక్‌వాలాలకు అమెరికాకు పోవడం సాధ్యమయింది కాని సాధారణ ముస్లింలు ఏం చేయాలి? దాహొూడ్ జిల్లా సంజేలి శిబిరంలో ముష్తాక్ భాయి అనే రైతు మాతో మాట్లాడుతూ మాట్లాడుతూ అకస్మాత్తుగా దుఃఖం బద్దలయి చేతులతో ముఖం దాచుకొని ఏడుస్తూ, 'ఇది నా జన్మభూమి... పొమ్మంటే ఎక్కడికి పోవాలి? ఎందుకు పోవాలి?' అని అడిగాడు. ఆ ఊరి మసీదులో బజ్రంగ్‌దళ్ వాళ్లు 'హిందువో కాహై హిందుస్తాన్, ముసల్మాన్ చలేజావ్ పాకిస్తాన్' అని రాసారు. కానీ ముష్తాక్ భాయి 'నేను పాకిస్తాన్‌కు ఎందుకు పోవాలి?... ఇది నా జన్మభూమి... నేను జెండా ఎగరవేయలేదా? వందేమాతరం పాడలేదా?' అంటాడు. ఏం చేసినా అతను ముస్లిం కాబట్టి ఆ తాలూకాలోని ముస్లింలందరి ఇళ్లూ కాలబెట్టినట్టు అతని ఇల్లూ కాలబెట్టారు. అందరికీ సాంఘిక బహిష్కరణ విధించినట్టు అతనికీ విధించారు. 'ఇప్పుడు నేనెక్కడికి పోవాల?' అన్న ఆ రైతు ప్రశ్నకు జవాబెవరిస్తారు?

సంఘ్‌పరివార్ మూక 'మంచి' ముస్లింలకూ 'చెడ్డ' వారికీ తేడా చూడక పోడం వారి అభిమానులలోనే ఇంకా కొంచెం ఇంగితం మిగిలి ఉన్నవారిని ఇబ్బంది పెట్టింది. ఒక ముస్లిం సంస్కృత పండితుడి సంస్కృతం లైబ్రరీని తగలబెట్టిన బజ్రంగ్‌దళ్ మూకను ఉద్దేశించి గుజరాత్ రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ (ఒబిసి) డైరెక్టర్ కె.జి. వంజారా, 'ఇది నలంద విశ్వవిద్యాలయాన్ని తగలబెట్టిన మహమ్మద్ బిన్ ఖిల్జీ చర్యతో సమానం' అన్నాడు. సంస్కృతం లైబ్రరీని కోల్పోయిన బాధితుడు మహమ్మద్ ఇల్యాస్ హుస్సేన్ సిభాయి లెక్కల పంతులు. మొన్నటి మారణకాండలో విపరీతమైన హింసను చవిచూసిన దాహొూడ్ జిల్లా లూనావాడ నివాసి అయిన సిభాయికి సంస్కృత సాహిత్యమంటే చాలా ప్రేమ. అరుదయిన సంస్కృత గ్రంథాలు సేకరించి లూనావాడలో ఒక లైబ్రరీ నెలకొల్పాడు. సంస్కృతంలో 'ఆచార్య' పట్టా పొంది ఆసక్తిగల వాళ్లకు ఆ భాష బోధించేవాడు.

లూనావాడలో జరిగిన దహనకాండలో సిభాయి తన శరీరాన్ని కాపాడుకోగలిగాడు గానీ లైబ్రరీని కాపాడుకోలేకపోయాడు. ఆ దహనకాండకు సిగ్గుపడిన కె.జి. వంజారా గారు ఒక నెల జీతం లైబ్రరీ పునరుద్ధరణ నిమిత్తం సిభాయికి డొనేషన్‌గా ఇస్తూ, 'నేనూ దైవభక్తిగల హిందువునే. కానీ ముస్లింలలో జిహాదీలు ఎవరు, కానివారెవరు అన్న తేడా చూడలేకపోతే ఎట్లా?' అని పాలక గూండాలను మందలించాడు.

'రాముడినీ కృష్ణుడినీ ముస్లింలు అవతారాలుగా గుర్తిస్తే మేము ముస్లింలను భారతీయులుగా స్వీకరిస్తాము' అని ఆర్‌ఎస్‌ఎస్ మేధావులు అంటుంటారు. ఎదుటివారి విశ్వాసాల మీద ఆంక్షలు పెట్టే అధికారం వారికి ఎవరిచ్చారన్న ప్రశ్న అటుంచి, రాముడి కథనూ కృష్ణుడి కథలనూ ఇష్టంగా టీవీమీద తిలకించే ముస్లింలకు సహితం హిందూ రాష్ట్రంలో భద్రత లేదనడానికి సంకేతం, సబర్ కాంటా జిల్లాలోని సిబ్లా తాలూకాకు సమీపంలో నెలకొన్న రామాయణ్-మహాభారత్ క్యాంపు. ఈ శిబిరంలో ఉన్నది రెండు ఊర్ల ముస్లింలు. ఆ ఊర్ల పేర్లు రామాయణ్, మహాభారత్. అత్యధికంగా ముస్లింలు నివసించే ఈ గ్రామాలను హిందుత్వవాదులు అగ్నికి ఆహుతి చేయగా బాధితులంతా ఒకటయి తాలూకా కేంద్రం వద్ద రామాయణ్ - మహాభారత్ అనే శిబిరం నెలకొల్పారు.

అసలు ఆ రెండు ఊర్లకు ఆ పేర్లు రావడం వెనుక ఒక కథ ఉంది. ఆ ఊర్లు ప్రాజెక్టు నిర్వాసిత గ్రామాలు. పాత ఊర్లు మునిగిపోయి పునరావాస గ్రామాలు కట్టిచ్చినప్పుడు 'మళ్లీ పాత పేర్లే ఎందుకు పెట్టుకోవాలి - ఏదైనా కొత్త పేర్లు పెట్టుకుందాం' అని గ్రామస్థులు అనుకున్నారు. ఆ పునరావాస గ్రామాలు నిర్మించిన క్రమంలో వారికి దగ్గరయిన ఒక ప్రభుత్వ అధికారి, అధికంగా ముస్లింలయిన ఈ రెండు ఊర్ల ప్రజలు టీవీలో హిందూ పురాణ గాథల సీరియల్స్ ఆసక్తితో చూడడం గమనించాడు. కాబట్టి ఒక ఊరికి రామాయణ్, ఒక ఊరికి మహాభారత్ అని పేర్లు పెట్టుకోరాదా అని సూచించాడు. జనం సంతోషంగా ఆ సూచనను స్వీకరించారు. సంఘ్‌పరివార్ నిర్వచనం ప్రకారం దానితో వారు 'దేశభక్తులు' అయిపోయి ఉండాలి. కానీ కాలేదు - ముస్లింలు కదా, ఎట్లా అవుతారు?

కాబట్టి భద్రత ఈ రోజు గుజరాత్‌లోని ముస్లింలందరి సమస్య. 'నేను లౌకికవాదిని', 'నాకు సంస్కృతం అంటే ఇష్టం', 'రామాయణ గాథ అంటే ఇష్టం',

'నేను కమ్యూనిస్టును' అని ధైర్యంగా ఉండడం సాధ్యంకాదు. వారికి భద్రత కల్పించడం ఆ రాష్ట్ర పాలనా వ్యవస్థ ప్రధాన కర్తవ్యం. కానీ ఆ ప్రయత్నం చేస్తున్న ఛాయలు సహితం గుజరాత్‌లో కనిపించవు.

## జరగని అరెస్టులు, నేర పరిశోధన

మారణకాండలో ప్రధాన పాత్ర వహించిన సంఘ్‌పరివార్ ముఖ్యులందరినీ వెంటనే అరెస్టు చేసి ఉంటే ముస్లింలలో కొంచెమైనా ధైర్యం ఉండేది. అటువంటిదేమీ జరగలేదు. మే నెల మధ్య భాగం వరకు ఒక్కరినీ అరెస్టు చేయలేదు. 'దుండగులు స్వేచ్ఛగా తిరగడమే కాదు, అనేకచోట్ల శాంతి కమిటీ సభ్యులుగా అవతారం ఎత్తి పోలీసు జీపులలోనే తిరుగుతున్నారు' అని శిబిరాలలోని శరణార్థులు అంటున్నారు. మారణకాండ జరిగినప్పుడు పోలీసులు చేసిన నిర్వాకాన్ని పైన చూసాం. ఆ తరువాత కూడా దానినే కొనసాగిస్తున్నారు. అహమ్మదాబాద్ నగరంలోని నరోడా ప్రాంతంలో జరిగిన దాడిలో కౌసర్ బానో అనే గర్భిణి కడుపు కోసి, బిడ్డను బయటకు లాగి తగలబెట్టిన ఉదంతాన్ని గురించి చెప్పుకున్నాం. ఈ దారుణానికి పాల్పడిన వాడు రతీలాల్ రాథోడ్ అనే ప్రభుత్వ ఉద్యోగి అనే విషయం మొదటినుండీ తెలుసును. కానీ అతనిని దాదాపు 10 వారాల దాకా పోలీసులు అరెస్టు చేయలేదు. అదే నరోడా మారణకాండకు నాయకత్వం వహించిన డా॥ జైదీప్ పటేల్, మాయా కోట్నానీల పేర్లు మొదటిరోజునుండి బాధితులు ఇస్తూనే వున్నా, వారిని అరెస్టు చేయడానికి పోలీసులు నిరాకరిస్తున్నారు. అదేమంటే ఆధారాలు లేవంటున్నారు. ప్రత్యక్ష సాక్షుల కథనం కంటే గట్టి ఆధారమేదీ లేదని చట్టాలు అంటాయి. కానీ ప్రత్యక్షసాక్షులు చెప్పినా అహమ్మదాబాద్ పోలీసులకు చాలడం లేదు.

డా॥ జైదీప్ పటేల్ విశ్వహిందూ పరిషత్ సంయుక్త కార్యదర్శి. అతని గురువు, ప్రధాన కార్యదర్శి అయిన ప్రవీణ్ తొగాడియా 'తన ప్రాంతంలో' చేసిన వీరకృత్యాల కంటె ఎక్కువ ఇతను 'తన ప్రాంతంలో' చేసి ఘనత సంపాదించుకున్నాడని అహమ్మదాబాద్‌లో బహిరంగంగానే చెప్పుకుంటున్నారు. కానీ పోలీసులకు మాత్రం అవి కనిపించడం లేదు. వీరిద్దరితోపాటు బాబు బజ్రంగి, కిషన్ కోరాని, హరీష్ రోహేరా, పి.జె. రాజ్‌పుట్, రాజు నోబుల్ అనే సంఘ్‌పరివార్ నాయకుల పేర్లు కూడ బాధితులు ఇచ్చారు. వారినీ అరెస్టు చేయలేదు.

వీరు మాత్రమే కాదు, అహమ్మదాబాద్‌లో జరిగిన మారణకాండలో బాధితులు పేర్కొన్న ఏ ఒక్క విశ్వహిందూ పరిషత్, బజ్రంగ్‌దళ్, బిజెపి నాయకుడినీ మేనెల మూడవ వారం దాకా పోలీసులు అరెస్టు చేయేదు. ఆ తరువాత కెపిఎస్ గిల్ ప్రమేయంతో కొన్ని అరెస్టులు జరిగినట్టు వార్తలొస్తున్నాయి గానీ, జూన్ 1న విడుదలయిన జాతీయ మానవ హక్కుల కమిషన్ నివేదికలో కూడా ముఖ్యులనింకా అరెస్టు చేయలేదనే జస్టిస్ వర్మ అన్నారు.

జిల్లాలలోని పరిస్థితి కూడ ఇందుకు భిన్నంగా లేదు. సబర్‌కాంటా, పంచ్‌మహల్స్, దాహోద్ జిల్లాలలో సంఘ్‌పరివార్ సంస్థల నాయకుల నేతృత్వంలో హంతక మూకలు స్వైరవిహారం చేసాయి. సబర్‌కాంటా జిల్లాలో హిమ్మత్‌నగర్ ఎంఎల్ఏ రంజిత్‌సింగ్ చావ్డా కుమారులు రాజు చావ్డా, మున్నా చావ్డా దాడులలో ప్రముఖపాత్ర నిర్వహించారన్న అభియోగాన్ని పైన చూసాము. అదేవిధంగా పంచ్‌మహల్స్ జిల్లాలో కాలోల్ ఎంఎల్ఏ బిపి చౌహాన్ కొడుకులు ప్రవీణ్ చౌహాన్, కిరీట్ చౌహాన్‌లు కూడ. బరోడా నగరంలో విష్ణుప్రజాపతి, కిషోర్ మరాఠి అనే ఇద్దరు విశ్వహిందూ పరిషత్ నాయకులు ప్రముఖ పాత్ర నిర్వహించారు. వీరెవ్వరినీ ఇప్పటిదాకా పోలీసులు అరెస్టు చేయలేదు.

సబర్‌కాంటా జిల్లాలో పోలీసులు పెద్ద నాయకులను వదిలిపెట్టి వారి అనుచరులు 69 మందిని మారణకాండ జరిగిన రెండున్నర నెలలకు అరెస్టు చేయగా, అమాయకులను అరెస్టు చేసారంటూ విశ్వహిందూ పరిషత్ జిల్లా బంద్ పిలుపు ఇచ్చింది. పంచ్‌మహల్స్ జిల్లాలో కూడా అరెస్టులు చేయబోతున్నామని పోలీసులు (రెండున్నర నెలల తరువాతే) ప్రకటించగానే, ఏ ఒక్కరిని అరెస్టు చేసినా అందరమూ చట్టాన్ని ధిక్కరించి జైలుకు పోతామని విశ్వహిందూ పరిషత్ జిల్లాలో 'జైల్ భరో' ఉద్యమానికి పిలుపునిచ్చింది. ఆ జిల్లాలో (ఆస్తి విధ్వంసం సంగతి అటుంచి) 109 మందిని ఈ సంఘ్‌పరివార్ మూకలు చంపాయని గుర్తుంచుకుంటే, విశ్వహిందూ పరిషత్ 'ఆందోళన' ఎంత అమానుషమైనదో అర్థం అవుతుంది. అయితే జిల్లా పోలీసు యంత్రాంగం తన నైజాన్ని మరొకసారి ప్రదర్శిస్తూ వారిని ఎట్లాగయినా మాన్పించమని జానా కృష్ణమూర్తిని కోరింది. చట్ట విరుద్ధమైన బెదిరింపులను రాజ్యాంగేతర శక్తుల పెద్దరికంతో ఎదుర్కోవాలని చూడడం సిగ్గుమాలిన పనే కానీ ఈ మూడు నెలల కాలంలో గుజరాత్‌లో పాలనా యంత్రాంగం ఏ విషయంలో సిగ్గుపడిందని ఈ ఒక్క విషయం గురించి ఫిర్యాదు చేయడానికి!

సకాలంలో దోషులను అరెస్టు చేయకపోవడం రాజ్యాంగం నిర్దేశించిన విధి నిర్వహణలో ఘోరమైన వైఫల్యమేకాక, కేసును కూడ బలహీనపరుస్తుంది. హంతకులు, రేపిస్టులు, విధ్వంసకులు పట్టపగలు బహిరంగంగా తిరుగుతుండగా పోలీసులు వాళ్లను పట్టుకోకపోవడం, ఒక్కొక్కసారి ఆ హంతకులే 'శాంతి కమిటీ'లలో పునర్దర్శనమివ్వడం, బాధితుల మనోస్థైర్యాన్ని, సాక్షుల మనోస్థైర్యాన్ని తీవ్రంగా దెబ్బతీస్తుంది. మనమేం చేయలేము, రాజీపడదాం అనో, మనకెందుకొచ్చిందిలే మౌనంగా ఉందాం అనో అనుకునేటట్టు చేస్తుంది. స్వతహాగా వాళ్ల వలన నిబ్బరం దిగజారకున్నా వాళ్లను బెదిరించి గానీ, మరొక రకంగా గానీ లొంగదీసుకునే అవకాశం ముద్దాయికి లభిస్తుంది.

రెండు, అరెస్టు ఆలస్యమయ్యే కొద్దీ, రేపు ముద్దాయిని సాక్షి 'గుర్తింపు పెరేడ్'లో గుర్తుపట్టినా ఆ గుర్తింపును కోర్టులు విశ్వసించవు. ముద్దాయిలను వెంటనే అరెస్టుచేసి నిర్ణీత గడువు లోపల చార్జిషీటు పెట్టడం బాధితులు, సాక్షుల మనోనిబ్బరం విషయంలోనూ, సాంకేతికంగా కూడ కోర్టులో జరిగే నేర విచారణకు బలం చేకూరుస్తుంది. గుజరాత్ పోలీసుల నడవడిక అందుకు సరిగ్గా భిన్నంగా ఉంది. ఈ రోజు మనం గుజరాత్ మారణకాండ గురించి మానవతా కోణం నుండి ఆవేదన చెందుతున్నాం. అదొక ఎత్తు కాగా జరిగిన దానికి నేరస్తులకు శిక్షపడుతుందా లేదా అనేది రేపు మనము వేసుకోక తప్పని ప్రశ్న. పోలీసులు మారణకాండను ఆపకపోవడంలోనే కాదు, జరిగిన దానికి శిక్ష పడేటట్టు చేయడంలోనూ తమకు చట్టం నిర్దేశించిన కర్తవ్యానికి ఏమాత్రం న్యాయం చేయడం లేదు.

దోచుకున్న ఆస్తుల స్వాధీనంలోనూ ఈ రెండు కోణాలూ కనిపిస్తాయి. గుజరాత్ దారుణకాండలో ముస్లింల ఆస్తులు దాదాపు 3800 కోట్ల రూపాయల మేరకు నష్టమయ్యాయని చెప్పుకున్నాం. అందులో అధిక భాగం అగ్గిపాలు కాగా, లూటీ చేసింది కూడ చాలా ఉంది. షోరూంలు, దుకాణాల నుండి ఇళ్లదాకా అన్నిటిలోనూ లూటీ జరిగింది. 'మా షాపు నుండి తీసుకుపోయిన వస్తువులు మా ఊరిలో ఫలాన వాడి ఇంట్లో ఉన్నాయి, నాకు తెలుసు. నన్ను తీసుకుపోతే గుర్తుపడతాను' అని శిబిరాలలోని బాధితులు చాలామంది అన్నారు. కానీ పోలీసులు దోచుకున్న వస్తువుల 'రికవరీ'కోసం ఏ ప్రయత్నమూ ఇప్పటిదాకా చేయలేదు. దీని వల్ల బాధితులకు తిరిగిరాగల కొన్ని వస్తువులు కూడ రాకుండ పోయే ప్రమాదం ఉంది. ఆలస్యం అయ్యేకొద్దీ ఆ వస్తువులను అమ్ముకునే

అవకాశం, దానిమీద ఉండే గుర్తులను చెరిపివేసే అవకాశం, వాడుకోవడం వల్ల అవి గుర్తుపట్టరాకుండ పోయే అవకాశం పెరుగుతుంది. ఇవి రెండు రకాలుగానూ నష్టకరం. ఒకటి, బాధితులకు తిరిగి దక్కవలసింది దక్కకపోవడం, రెండు, కోర్టులో కేసు రుజువు కాకుండ పోవడం.

అసలు ఎఫ్ఐఆర్‌లు రిజిష్టర్ చేయడంలోనే చాలా లోపాలున్నాయి. బాధితులు ఘటన జరిగిన వెంటనే పోలీస్‌స్టేషన్‌కు పోయి కేసు నమోదు చేసే పరిస్థితి ఉండలేదు. అది ఒకరిద్దరు వ్యక్తుల మీద జరిగిన దాడి కాదు. మొత్తంగానే ఒక మతానికి చెందినవారి మీద అధికార బలం ఉన్న హంతక మూకలు పోలీసుల ప్రత్యక్ష సహకారంతో చేసిన దాడి. అందువల్ల దాడి ముగియగానే పోలీస్‌స్టేషన్‌కు పోయి కంప్లయింట్ ఇచ్చి వచ్చే పరిస్థితిలో బాధితులు లేరు. ప్రాణాలతో తప్పించుకొని సురక్షిత ప్రాంతం చేరుకునే ప్రయత్నంతోనే వారికి సరిపోయింది. చాలా సందర్భాలలో బాధితులు ఒక వారం తరువాత గానీ ఫిర్యాదు చేయలేదు. మన నేర విచారణ వ్యవస్థలో ఎఫ్ఐఆర్‌ను ఇంత ఆలస్యంగా నమోదు చేయడం కేసును చాలా బలహీనపరుస్తుంది. 'ఇంత ఆలస్యంగా ఎఫ్ఐఆర్ దాఖలు చేస్తున్నాడంటే ఫిర్యాది అందులో ఉద్దేశ్యపూర్వకంగా అనేక విషయాలు కల్పించి ఉండే అవకాశం ఉంది' అని కోర్టులు భావిస్తాయి. ఆలస్యానికి సహేతుకమైన కారణం ఉన్నట్టయితే దానిని లెక్కలోకి తీసుకోవాలన్న నియమం కూడ లేకపోలేదు గానీ అది కోర్టుల విచక్షణలోని ఒకానొక మినహాయింపు మాత్రమే. కేవలం ఫిర్యాదు ఆలస్యంగా నమోదయిన కారణంగా గుజరాత్‌లో చాలా కేసులు రుజువు కాకుండ పోవచ్చు.

న్యాయ వ్యవస్థలోని ఈ లోపానికి పోలీసులు ఏం చేస్తారని అడగవచ్చు. బాధితులు వచ్చేదాకా ఆగకుండ పోలీసులే ఎఫ్ఐఆర్ నమోదు చేసుకొని ఉన్నట్టయితే కొంతవరకైనా కేసును ఈ సాంకేతిక లోపం నుండి కాపాడి ఉండవచ్చు. గుజరాత్ మారణకాండలో జరిగిన ఘటనలన్నీ బహిరంగంగా జరిగినవే. భయంకరమైన హింసతో కూడుకున్నవే. 'ఫలాన ఘటన జరిగినట్టు మాకు తెలీదే' అని పోలీసులు అనడానికి ఆస్కారం లేదు. వాళ్లకు బాధితులకు తెలిసినంత వివరంగా తెలియకపోవచ్చు. కానీ 'ఫలానా చోట ఫలానా బిల్డింగ్‌ను తగలబెట్టి ఇద్దరిని చంపారు' అని తెలిసినా చాలు. ఆ మాత్రమే వెంటనే రాసి ఎఫ్ఐఆర్ నమోదు చేసినా ఘటన (కోర్టు దృష్టిలో) విశ్వసనీయత కలిగి ఉండేది. ఆపైన బాధితులు బోనెక్కి చెప్పేది సాక్ష్యంగా దానికి బలం చేకూర్చేది. పోలీసులు

ఈ పని చేయకుండ బాధితులే వారం లేక పది రోజుల తరువాత శరణార్థుల శిబిరాల నుండి వచ్చి ఫిర్యాదు చేసే దాకా ఆగిన ఘటనలన్నీ ఆదిలోనే బలహీనపడినట్టే. అటువంటి ఎఫ్ఐఆర్‌లు 20 శాతం దాకా ఉన్నాయని మా అంచనా.

పోలీసులే తమ సొంత చొరవతో నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లు ఉన్నాయి కానీ వాటిలో ముద్దాయిలకు ఉపయోగపడే ఇంకొక రకం లోపం కనిపిస్తుంది. ఆ ఎఫ్ఐఆర్‌లు ఈ విధంగా సాగుతాయి. ఫిర్యాది అయిన స్థానిక పోలీస్ సబ్ ఇన్స్‌పెక్టర్ ఫలాన రోడ్డులో గస్తీ తిరుగుతుండగా ఒక పెద్ద గుంపు కనిపించింది. ఆ గుంపు కేకలు వేస్తూ ముస్లింలకు సంబంధించిన షాపులు, గోడవున్లు దోచుకుంటూ తగలబెడుతూ అరాచకం సృష్టిస్తున్నారు. నేను హెచ్చరిస్తూ కాల్పులు జరిపాను. అయినప్పటికీ వాళ్లు వినకుండ కొనసాగించారు. ఫలాన రోడ్డులో, ఫలాన గల్లీలో ఫలాన దుకాణాలు ధ్వంసం చేసారు. చివరికి కొన్ని గంటల తరువాత వెళ్లిపోయారు. ఎఫ్ఐఆర్‌లో ఇంతే ఉంటుంది. ఒక్కరి పేరు గానీ, వాళ్లు ఉపయోగించిన మాటలు గానీ, ఇచ్చిన నినాదాలు గానీ, వేసుకున్న బట్టల వర్ణన గానీ ఏమీ ఉండదు.

ఇవే ఘటనల గురించి శిబిరాలలో ఉన్న బాధితులు పత్రికల వాళ్లతోనూ, నిజనిర్ధారణ కమిటీలతోనూ చెప్పే కథనాలలో స్థానిక బజ్రంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్, బిజెపి నాయకులను పేర్కొంటారు. వాళ్లు ఖాకీ నిక్కర్లు వేసుకున్నారనో, తలకు కాషాయం రంగు హెడ్‌బాండ్ కట్టుకున్నారనో అంటారు. 'బజ్రంగ్‌దళ్ జిందాబాద్!' అన్నారనో, 'జైశ్రీరాం' అన్నారనో అంటారు. ఈ విషయాలు చెప్తూ బాధితులు అనేక సందర్భాలలో జిల్లా ఎస్‌పికి శిబిరాల నుండే ఉత్తరాలు రాసారు. రేపు కేసు విచారణలో బోనెక్కి కూడా చెప్తారు. కానీ సాక్ష్యాలుగా ఆ వాంగ్మూలాలకు ఉండబోయే విలువ ఎంత? స్థానిక సంఘ్‌పరివార్ నాయకులు నిజంగా ఉన్నట్టయితే స్థానిక ఎస్ఐ వాళ్లను గుర్తుపట్టడా? వాళ్ల పేర్లు ఎఫ్ఐఆర్‌లో ఎందుకు లేవు? వాళ్లు నిజంగానే సంఘ్‌పరివార్ సంస్థలతో గల సంబంధాన్ని సూచించే బట్టలు వేసుకొని ఉన్నా, నినాదాలు ఇచ్చి ఉన్నా ఆ విషయం ఫిర్యాది అయిన స్థానిక ఎస్ఐ గమనించి ఉండేవాడు కదా. మరి ఎఫ్ఐఆర్‌లో అవన్నీ ఎందుకు లేవు? ఈ సందేహాలతో బాధితుల సాక్ష్యాన్ని కోర్టు తిరస్కరించే ప్రమాదం ఉంది.

ఇటువంటి కేసులలో న్యాయం జరగాలంటే బాధితులు హంతకులనూ, స్థానిక పోలీసులనూ కలిపి ముద్దాయిలను చేసి ప్రైవేట్ కేసు వేసుకోవడం ఒక్కటే మార్గం. అది ఎంతమందికి సాధ్యం అవుతుంది?

ఏ ఒక్క ఎఫ్ఐఆర్‌లోనూ రేప్ కేసుకు సంబంధించిన సెక్షన్లు లేకపోవడం కొట్టొచ్చినట్టు కనపించే మరొక విషయం. మారణకాండ, దహనకాండలలో భాగంగా స్త్రీలపైన అత్యాచారాలు పెద్దెత్తున జరిగాయన్నది అందరూ ఎరిగిన వాస్తవం. బాధితులు శిబిరాలలో చేరిన తరువాత ఆయా జిల్లాల ఎస్‌పిలకు పంపించిన ఫిర్యాదులలో రేప్ జరిగిన ఘటనలను బాధితురాలి పేరుతో సహా పేర్కొన్నారు. అయినప్పటికీ రేప్‌కు సంబంధించిన సెక్షన్ 376 ఎఫ్ఐఆర్‌లలో కనిపించదు. 'అంతకంటె పెద్ద సెక్షన్లు పెడుతున్నప్పుడు రేప్ సెక్షన్ ఎందుకని పెట్టలేదు' అని పోలీసులు అంటున్నారు. రేప్‌కు జీవితఖైదు వేయవచ్చును కాబట్టి ఆ పరిభాషలో కూడ రేప్ 'పెద్ద సెక్షనే'. అయినా 'పెద్ద సెక్షన్లు' పెట్టినప్పుడు చిన్నవి పెట్టనక్కర లేదని ఎక్కడా లేదు. పెద్దవి రుజువు కాకపోతే ఏం చేస్తారు? అన్ని నేరాలపైనా విచారణ జరిపినట్టయితే ఏది రుజువయితే దానికి శిక్ష పడుతుంది. రేప్ అనే నేరం పట్ల ఉన్న 'ఉదార' వైఖరిని సమర్థించుకొనడానికి ఈ సాకులు వెతుకుతున్నారు తప్ప వేరే ఏమీ కాదు.

ఇంకొక రకంగా లోపభూయిష్టమైన ఎఫ్ఐఆర్‌లు కూడ ఉన్నాయి. ఇవి విడివిడి ఘటనలను కలిపి ఒకే కేసుగా నమోదుచేసిన ఎఫ్ఐఆర్‌లు. ఈ రకమైన ఎఫ్ఐఆర్ కూడ కేసు విచారణను సాంకేతికంగా బలహీనపరుస్తుంది. ఉదాహరణగా పంచ్‌మహల్స్ జిల్లా కాలోల్ పోలీస్‌స్టేషన్ క్రైం నెం. 33/2002గా నమోదయిన ఫిర్యాదును చూడవచ్చు. అదే స్టేషన్ ఎస్ఐ ఆర్.జె.పాటిల్ ఇందులో ఫిర్యాది. డెరోల్ గ్రామంలోనూ డెరోల్ రైల్వే స్టేషన్‌లోనూ కాలోల్ పట్టణంలోనూ ఫిబ్రవరి 28 పొద్దున్న 11 నుండి సాయంత్రం 4 దాకా జరిగిన అన్ని ఘటనలూ ఇందులో నమోదు చేయబడ్డాయి. మూడుచోట్లా వేల సంఖ్యలో ఉన్న మూడు గుంపులు హత్యాకాండకూ దహనకాండకూ పాల్పడ్డాయని ఫిర్యాది అంటాడు. ఒక ఊరిలో దాడిచేసిన గుంపును 'హిందూ మతవాదుల గుంపు' అంటాడు. ఒక ఊరిలో 'హిందూ గుంపు' అంటాడు. ఒక ఊరిలో 'మతతత్వవాదుల గుంపు' అంటాడు. ఏక సమయంలో మూడుచోట్లా జరిగింది చూసే అవకాశం ఈ ఎస్ఐకి లేదనేది స్పష్టమే. అటువంటప్పుడు మూడు వేరు వేరు ఉదంతాలను కలిపి నమోదు చేసిన ఈ ఎఫ్ఐఆర్ విశ్వసనీయత ఏమిటి?

ఇటువంటి 'టోకు' ఎఫ్ఐఆర్‌ల విషయంలో మాత్రం గుజరాత్ హైకోర్టు జోక్యం చేసుకునింది. అహమ్మదాబాద్‌కు చెందిన ఇక్బాల్ ఎహసాన్ సయ్యద్ అనే అడ్వకేటు తాను ఇటువంటి 14 ఎఫ్ఐఆర్‌ల మీద హైకోర్టులో కేసులు వేయగా, హైకోర్టు ఆ ఎఫ్ఐఆర్‌లను చెల్లనివిగా ప్రకటించి, బాధితుల ఫిర్యాదులను ఆధారం చేసుకొని విడివిడిగా ఒక్కొక్క నేరానికీ ఒక్కొక్క ఎఫ్ఐఆర్ నమోదు చేయమని ఆదేశించింది. అయితే ఇది ఆ 14 ఎఫ్ఐఆర్‌లకు మాత్రమే వర్తిస్తుంది. హైకోర్టులో ఎవరూ సవాలు చేయనివి అట్లాగే ఉండిపోయాయి.

గుజరాత్ హైకోర్టు ప్రస్తావన వచ్చింది కాబట్టి ఆ న్యాయస్థానం అనుసరించిన వైఖరి గురించి కూడ రెండు మాటలు ఇక్కడే చెప్పుకోవడం ఉచితంగా ఉంటుంది. అంత ఘోరమైన మారణకాండ తన కళ్ల ఎదుట జరిగినప్పుడు ఎవరి పిటిషన్ కోసమూ ఆగకుండ హైకోర్టు తనంత తానే స్పందించి ఉండవలసింది. జాతీయ మానవ హక్కుల కమిషన్ చేసిన పని గుజరాత్ హైకోర్టే చేసి ఉండవలసింది. ఫిబ్రవరి 28న హైకోర్టు జడ్జిలే అర్ధంతరంగా కోర్టు విడిచి ఇళ్లకు వెళ్లిపోయారని మాజీ చీఫ్ జస్టిస్ రవ్వానీ జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు రాసిన నివేదికలో చెప్పిన సంగతి చూసాం.

గుజరాత్ హైకోర్టు ఆ పని చేయకపోగా, శరణార్థులు తమ హక్కుల గురించి వేసిన కేసుల పట్ల చాలా నిర్లిప్తంగా, ఇంకా సరిగ్గా చెప్పాలంటే వ్యతిరేక భావంతో స్పందించింది. ప్రజా ప్రయోజనాల కేసులు, మానవ హక్కుల కేసులు వేసే అలవాటున్న గిరీశ్ పటేల్, ముకుల్ సిన్హా వంటి న్యాయవాదులు 'హైకోర్టులో న్యాయం దొరుకుతుందన్న నమ్మకం మాకు ఉండలేదు కాబట్టి మా దగ్గరకు వచ్చిన వాళ్లను మేమే నిరుత్సాహపరిచాం' అన్నారు. వారు ప్రయత్నం చేసిన ఒకటి రెండు కేసులలో హైకోర్టు స్పందించిన వైనం వారి సంశయాన్ని రుజువు చేసింది.

స్కూల్ ఫైనల్ పరీక్షలను వాయిదా వేయమని ప్రభుత్వాన్ని ఆదేశించవలసిందిగా కోరుతూ సీనియర్ న్యాయవాది గిరీశ్ పటేల్ హైకోర్టులో కేసు వేసారు. లక్షకు పైగా జనం శరణార్థుల శిబిరాలలో ఉన్నారు. శిబిరాలలో ఉన్న స్కూలు పిల్లలు స్కూలుకు పోయే పరిస్థితిలో లేరు. కిక్కిరిసిన శిబిరాలలో చదువుకునే వాతావరణం లేదు. పరీక్ష కేంద్రం 'హిందూ ప్రాంతం'లో ఉన్నట్టయితే ముస్లిం పిల్లలు అక్కడికి పోయి పరీక్షలు రాయలేరు. ఈ అన్ని కారణాల వల్లా పరీక్షలు వాయిదా వేయడం న్యాయంగా ఉంటుందని ఆయన వాదించారు.

ఆ కేసు జస్టిస్ బి.సి.పటేల్ గారి బెంచి ముందుకు వచ్చింది. 'ఈ కేసు మీరు వేస్తున్నట్లు ముందుగానే పత్రికలలో వార్త ఎట్లా వచ్చింది?' అని వారు మొదట అభ్యంతరం తెలిపారు. ఇది లక్ష మంది ప్రజల సమస్య కాబట్టి కేసు వేసే ప్రయత్నం జరుగుతున్న విషయం రహస్యం కాదనీ, ఎవరైనా పత్రికలకు వార్త అందిచ్చి ఉండవచ్చుననీ న్యాయవాది అన్నారు. 'ఇందులో ఎంతమంది విద్యార్థులు సమస్య ఎదుర్కొంటున్నారన్న లెక్కలు గానీ, ఇతర వివరాలు గానీ లేవే' అని జడ్జిగారు రెండవ అభ్యంతరం లేవదీసారు. స్కూలు ఫైనల్ పరీక్షకు కూచుంటున్న విద్యార్థులు ఎంతమంది శిబిరాలలో ఉన్నదీ తాను లెక్కలు తీయని మాట వాస్తవమేననీ, అయితే లక్ష జనాభా ఉన్నచోట తగు మోతాదులో హైస్కూలు విద్యార్థులు ఉంటారని భావించడం సబబే కాబట్టి కచ్చితమైన సంఖ్య లేనంత మాత్రాన అపచారమేం జరిగినట్టు కాదనీ న్యాయవాది అన్నాడు. 'అయినా ఇప్పుడు భద్రతకేం లోపం వచ్చింది? అందరూ స్వేచ్ఛగానే తిరుగుతున్నారు కదా' అని జడ్జిగారు మూడవ అభ్యంతరం లేవదీసారు. ఒక హైకోర్టు జడ్జి, ఒక రిటైర్డు హైకోర్టు జడ్జి చీకట్లో దొడ్డిదారిన తప్పించుకోవలసి వచ్చిన విషయం తెలిసిందే కదా, ముస్లింలకు భద్రత ఎక్కడుంది అని గిరీశ్ పటేల్ అన్నారు. ఆ తరువాత మాటా మాటా పెరిగి, 'ఈ కేసు నేను వినను. వేరే బెంచి ముందు పెట్టండి' అని జస్టిస్ పటేల్ అలక ప్రకటించారు. (ఆ రెండవ బెంచి కూడ పరీక్షలు వాయిదా వేయమని ఆదేశించడానికి నిరాకరించగా, చివరికి బాధితులు సుప్రీంకోర్టుకు పోయి ఆర్డర్ తెచ్చుకోవలసి వచ్చింది.)

బాధితులకు న్యాయం చేసే విషయంలో ఆసక్తి చూపని హైకోర్టు జాతీయ మానవ హక్కుల కమిషన్ కృషిని అడ్డుకోవడానికి మాత్రం ఉత్సాహం చూపింది. కరుణ ట్రస్ట్ అనే హిందూ స్వచ్ఛంద సంస్థ జాతీయ మానవ హక్కుల కమిషన్ గుజరాత్ మారణకాండ విషయంలో విచారణ చేపట్టడాన్నే సవాలు చేస్తూ గుజరాత్ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసింది. జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ వర్మ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్నప్పుడు నర్మదా కేసులో సర్దార్ సరోవర్ నిర్మాణంపైన స్టే ఇచ్చాడనీ, ఆయన గుజరాతీ ప్రయోజనాలకు వ్యతిరేకి అనీ నింద వేసారు. గుజరాత్ హైకోర్టు ఈ పిటిషన్‌ను స్వీకరించి జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు నోటీసు జారీ చేసింది. జాతీయ మానవ హక్కుల కమిషన్ గాభరాపడి సుప్రీంకోర్టుకు పోయి స్టే తీసుకోవలసి వచ్చింది.

కేవలం సంఘ్‌పరివార్ మూకలే కాక మొత్తంగానే గుజరాతీ హిందూ సమాజం (అతి కొద్ది మినహాయింపులతో) చాలా అన్యాయంగా, అమానుషంగా స్పందించిందనడానికి ఇదొక ఉదాహరణ మాత్రమే.

## ఇప్పటికీ భద్రత లేదు

పోలీసులు నేర పరిశోధన సక్రమంగా చేయకపోవడాన్ని రెండు కోణాల నుండి తప్పు పట్టాము. ఒకటి, చట్టబద్ధ పాలన, చట్టపరమైన సమానత్వం అనే విలువలు ధ్వంసం కావడం కోణం నుండి. రెండు, కోర్టులలో రేపు జరగబోయే నేర విచారణ బలహీన పడడం కోణం నుండి. మూడవ కోణం కూడ ఉంది. బాధితులు వెనక్కి తిరిగి తమ ఆవాసాలకు పోయి తమ జీవితాలను పునర్నిర్మించుకోవాలంటే భద్రత అన్నిటికంటె ముఖ్యమైన అవసరం. పోలీసులు అరెస్టుల విషయంలోనూ నేరపరిశోధన విషయంలోనూ అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరి దుండగులకు ఎంత బలం ఇస్తున్నదో బాధితులను అంతగా బేజారు పరుస్తున్నది. తిరిగి పోయి భద్రంగా బతకగలమన్న విశ్వాసం వారికి కలగకపోవడానికి గల కారణాలలో పోలీసుల వ్యవహార శైలి కూడా ఒకటి.

అయితే గుజరాత్‌లో పోలీసుల వైఖరిని ఆ రాష్ట్ర ప్రభుత్వం మొత్తంగానే అనుసరిస్తున్న వైఖరి నుండి వేరు చేయడం అసాధ్యం. హిందుత్వవాదుల నేతృత్వంలో గుజరాత్‌లో జరిగిన మారణకాండను నరేంద్ర మోడి ప్రభుత్వం అమానుషకాండగా కాదు సరికదా, నేర స్వభావం గల చర్యలుగా సహితం భావించడం లేదు. 'శతాబ్దాలుగా ముస్లింల దౌర్జన్యాలను సహించి బతికిన హిందువుల తిరుగుబాటు'గా అర్థం చేసుకుంటున్నది. 'అది చట్ట విరుద్ధమైతే కావచ్చును గానీ అది గోధ్రా మారణకాండకు సహజమైన ప్రతిచర్య' అన్నది గుజరాత్ పాలకులు పదే పదే అంటున్నారు. (అయితే వారి మనసులలో గోధ్రా మాత్రమే లేదు. గజనీ మహమ్మదు కాలం నుండి 'ముస్లింలు' చేసిన దౌర్జన్యాలుగా వారు భావించే వాటన్నిటికీ ఈ మారణకాండను సహజమైన ప్రతిచర్యగా వాళ్లు భావిస్తున్నారని సంఘ్‌పరివార్ సంస్థలు, నాయకుల ప్రవచనాలు తెలియజేస్తున్నాయి.)

అందువల్ల గుజరాత్ ప్రభుత్వం అరెస్టులు, నేర పరిశోధన, నేర విచారణ, శిక్ష అనే క్రమానికి ప్రాధాన్యం ఇవ్వడం లేదు. 'జరగవలసింది జరిగిపోయింది. ఇంక అందరూ జరిగినది మరచిపోయి ప్రశాంతంగా బతకండి' అనే హితబోధ ప్రాతిపదికన శిబిరవాసులను వెనక్కి పంపించివేయాలని గుజరాత్ ప్రభుత్వం భావిస్తున్నది.

ఇందులో రహస్యంగానీ మేము ఊహిస్తున్నది గానీ ఏమీ లేదు. గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వ అధికారులు బహిరంగంగానే ఈ మాట అంటున్నారు. అందుకోసం వారొక వ్యూహాన్ని కూడ రచించారు. ప్రతీ జిల్లాలోనూ కలెక్టరు, ఎస్‌పి కలిసి బాధితులనూ వారిని ఊరినుండి బలప్రయోగంతో తరిమేసిన సంఘ్‌పరివార్ ప్రముఖులనూ ఒకచోట కూర్చోబెట్టి నచ్చజెప్పి బాధితులను ఊరిలో దింపివస్తారు. 'ముస్లింల భద్రత హిందువుల సద్భావనలోనే ఉంద'ని ఆర్‌ఎస్‌ఎస్ తీర్మానించలేదా? అదే దీని సారాంశం. 'అరెస్టులూ కేసులూ అంత ముఖ్యంకాదు – మేము ఈ ప్రక్రియ మీద దృష్టిపెడుతున్నాం' అని అసిస్టెంట్ రిలీఫ్ కమిషనర్ వాఘేలా మాతో అన్నారు.

ఈ 'ప్రక్రియ' ఏ విధంగా నడుస్తున్నదో చూసేముందు అన్నిచోట్ల ఈ ప్రక్రియ కూడ చేపట్టడం లేదనే విషయాన్ని చెప్పాలి. పత్రికలు, టీవీల దృష్టికి దూరంగా ఉండే ప్రాంతాలలో ఏ సామరస్య ప్రయత్నాలూ చేయకుండానే శిబిరాలు మూసేయిస్తున్నారు. దాహెూద్ జిల్లాను ఒక ఉదాహరణగా తీసుకోవచ్చు. చాలా పెద్దయెత్తున హింసాకాండను చూసిన జిల్లాలలో దాహెూద్ ఒకటి. అక్కడ ఇప్పుడు మూడు శిబిరాలు మాత్రమే ఉన్నాయి. అవి ఫతేపురా, సంజేలి, సుక్సార్ గ్రామాలలో ఉన్న శిబిరాలు. ఈ శిబిరాలలో ఉన్నది ఆ గ్రామాల బాధితులే. ఇళ్లు కాలిపోయిన ముస్లింలు అదే ఊరిలో ఒక శిబిరం వేసుకొని ఉంటున్నారు. దాహెూద్, జాలోద్ పట్టణాలలో మార్చి–ఏప్రిల్ నెలలో శిబిరాలు ఉండేవి. వాటిని ప్రభుత్వం ఒత్తిడి పెట్టి మూసేయించింది. ఒక ఊరిలో అయిదారు కుటుంబాలుగా ఉండి దాడికి గురయి ఊరు విడిచి పారిపోయిన ముస్లిం కుటుంబాలు అనేకం ఆ శిబిరాలలో ఉండేవి. వారిప్పుడు ఎక్కడో బంధువుల ఇళ్లలో తలదాచుకుంటున్నారు. వారెవరినీ వారి సొంత గ్రామాల హిందువులతోపాటు కూచోబెట్టి మాట్లాడించి నచ్చజెప్పి ఊరు చేర్పించే ప్రయత్నం – గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించుకున్న పునరావాస పథకం – చేయలేదు. పెద్ద సంఖ్యలో ముస్లింలు దెబ్బతిన్న మూడు ఊర్లలో మాత్రమే ఆ ఊరికి పరిమితమైన శిబిరాలు మిగిలాయి.

దాహెూద్ జిల్లాలో చేసినట్టే అన్ని జిల్లాలలోనూ చేయగలిగితే గుజరాత్ ప్రభుత్వం చేసేసేదే గానీ అన్ని జిల్లాలూ దాహెూద్ అంత మారుమూల లేవు. ప్రపంచం కళ్లబడకుండ ఈ పని చేసేయడం సాధ్యంకాదు. కొన్నిచోట్ల గ్రామంలో ఎస్‌ఆర్‌పి (రాష్ట్ర రిజర్వ్ పోలీసు) క్యాంపు పెట్టి ముస్లింలను వెనక్కి పంపించారు. బరోడా జిల్లాలోని పావితేజ్‌పూల్, ఛోటా ఉదేపూర్ తాలూకాలలోని రెండు మూడు గ్రామాలలో ఇదే జరిగింది.

అయితే ఎక్కువ భాగం ఆ పని కూడ చేయడానికి గుజరాత్ ప్రభుత్వం సుముఖంగా లేదు. ఏదో ఒకరకంగా ఇరువర్గాలకూ నచ్చజెప్పి శరణార్థులను వెనక్కి పంపించేయాలన్నది రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన. ఇది చట్టరీత్యానూ, నైతికంగానూ కూడ తప్పుడు ఆలోచనే కాక, హిందువుల ఏకైక ప్రతినిధులుగా తమను తాము ప్రకటించుకున్న సంఘపరివార్ వాళ్లు 'సయోధ్య'కు ఎంతమాత్రం సిద్ధంగా లేనప్పుడు ఇది అవాస్తవికమైన ఆలోచన కూడ.

సబర్‌కాంటా జిల్లాలో ఖేట్‌బ్రహ్మ అనే తాలూకా ఉంది. ఆ తాలూకా కేంద్రంలోని ముస్లింల ఇళ్లన్నిటినీ సంఘపరివార్ మూకలు లూటీచేసి తగలబెట్టి అందరినీ తరిమేసి 'ఇక్కడ ముస్లింలకు ప్రవేశం లేదు' అని ఊరి మధ్యనున్న లక్ష్మీపూర్ చౌరస్తాలో బోర్డు పెట్టారు. దానిని రెండు నెలలయినా పోలీసులు తొలగించలేదు. ఆ ఊరికి చెందిన షకీర్ హుసేన్ దిలావర్‌ఖాన్ అనే పోస్ట్‌మాన్ పొరుగున ఉన్న వడాలి శిబిరంలో ఉంటూ డ్యూటీకి ఖేట్‌బ్రహ్మ పోయి రావాలని నిర్ణయించుకున్నాడు. అక్కడ సగం నాశనమైన తన నివాసాన్ని తెరిచి పగలు అక్కడే ఉంటూ డ్యూటీ ముగించుకొని రాత్రి వడాలి శిబిరానికి తిరిగి వస్తున్నాడు. ఒకరోజు పొద్దున్న ఇంటికి పోగా, ఇంటి తలుపులు తెరిచి దొంగతనం కోసం ఇంట్లోకి చొరబడ్డ ఇద్దరు బజ్రంగ్‌దళ్ కార్యకర్తలు కనిపించారు. షకీర్ వాళ్లను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు గుంజుకొని పోయాడు. అక్కడ అతను ఎస్‌ఐతో మాట్లాడుతుండగా ఆ తాలూకా బజ్రంగ్‌దళ్ నాయకుడు వచ్చి 'మావాళ్లను ఎట్లా పట్టుకుంటావు' అని గొడవపడ్డాడు. ఎస్‌ఐ కూడ, 'వాళ్లను ఎట్లా పట్టుకొచ్చావు, నీకేం అధికారం ఉంది?' అని షకీర్‌నే అరెస్ట్ చేసాడు. భజరంగ్‌దళ్ వాళ్లు ముగ్గురూ వెళ్లిపోయారు. అయితే షకీర్ అదృష్టం కొద్దీ ఆ ఊరి పోస్ట్‌మాస్టర్ డి.ఎల్. రాథోడ్ (ఈయన దళితుడు) వచ్చి తన ఉద్యోగిని అరెస్టు ఎట్లా చేసారని గొడవ పెట్టుకొని షకీర్‌ను విడిపించుకొని పోయాడు.

చాలా గ్రామాలలో, ముస్లింలు తిరిగి వస్తే పాలు పొయ్యొద్దు, వాళ్ల ఇళ్లకెవరూ పోవద్దు, వాళ్లు షాపు పెట్టుకుంటే వాళ్ల దగ్గర ఎవరూ ఏమీ కొనద్దు, ఏదీ అమ్మొద్దు – మొత్తంగానే ముస్లింలను సాంఘికంగా, ఆర్థికంగా బహిష్కరించాలని హిందుత్వవాదులు ఆదేశాలు జారీచేసారు. ధ్వంసం చేసిన మసీదు గోడలకు హిందూ దేవతల ఫోటోలు తగిలిచ్చి, 'జై శ్రీరాం' అనీ, 'ముస్లిం చలేజావ్ పాకిస్తాన్' అనీ, 'ఇక్కడికి వస్తే నరుకుతాం' అనీ గోడల మీద రాసారు.

ముస్లింలలోని పెద్దమనుషులు శిబిరాల నుండి తమకు పరిచయమున్న రైతుల ద్వారా ఊరి బజ్రంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్ నాయకులకు కబురుపెట్టి 'వెనక్కి వస్తాం' అని ప్రతిపాదించగా, 'రాదలచుకుంటే గడ్డాలు తీసేయాలి, నమాజ్‌కు పిలిచే అజాన్ మూసేయాలి, మీ పండగలేవీ మాకు ఇబ్బంది కలిగే విధంగా జరుపుకోగూడదు' అని ఆంక్షలు పెట్టిన ఉదంతాలు బరోడా, ఖేడా జిల్లాలలో జరిగాయి.

ఫిర్యాదులలో బాధితులు పేర్కొన్న దుండగుల పేర్లు తీసేస్తేనే వెనక్కిరానిస్తాం అన్న ఒత్తిడి కూడా చాలా బలంగా ఉంది. దుండగులు మాత్రమే కాదు, పోలీసులు కూడ ఈ రకమైన ఒత్తిడి పెడుతున్నారు. పంచ్‌మహల్స్ జిల్లా హాలోల్ శిబిరంలోనూ దాహొూడ్ జిల్లా సుక్సార్ శిబిరంలోనూ ఈ ఫిర్యాదు విన్నాం. ఫిర్యాదు చేయడానికి గానీ ఫిర్యాదు ఏ స్థితిలో ఉందో కనుక్కోవడానికి గానీ పోలీస్‌స్టేషన్‌కు పోయిన బాధితులతో పోలీసులు 'ఈ పేర్లు తీసెయ్. నువ్వు గ్రామానికి తిరిగి వచ్చేటట్టు చూస్తాం' అంటున్నారు. అంటే పేర్లు తీసేయకపోతే గ్రామానికి తిరిగి రాలేరని అర్థం. పోలీసులు అనుసరిస్తున్న ఈ వైఖరి ప్రభుత్వ విధానానికి అతికేదే. అరెస్టులు ముఖ్యం కాదు, నిష్పాక్షికమైన నేరవిచారణ ముఖ్యం కాదు, ఏదో ఒకరకంగా దాడిచేసిన వారికి నచ్చజెప్పి బాధితులను వెనక్కి పంపించడమే ఉచితం అని ప్రభుత్వం భావిస్తున్నప్పుడు పోలీసులు 'దోషుల పేర్లు తీసేస్తే గ్రామానికి వెనక్కిపోయేటట్టు చూస్తాం' అని బాధితులతో ఎందుకు అనరు?

అయితే ఈ 'నచ్చజెప్పే' ప్రయత్నం ఆచరణలో అంత సజావుగా సాగడం లేదు. కొన్నిచోట్ల స్థానిక సంఘ్‌పరివార్ బాధ్యులు నచ్చజెప్పే మీటింగ్‌లకు హాజరు కావడం లేదు. బరోడా ఎస్‌పి స్వయంగా ఒక ఉదాహరణ చెప్పాడు. నలుగురు ముస్లింలను హతమార్చిన పౌర్ అనే గ్రామం నుండి పారిపోయి వచ్చిన వారిని వెనక్కి పంపేందుకు ఆయన త్రైపాక్షిక సమావేశం నిర్వహించగా, బాధితులు, అధికారులు వచ్చారు గానీ అసలు వాళ్లు రాలేదు. ఎస్‌పి మరొకసారి కబురు పంపించగా 'రాము పొ'మ్మన్నారు. బరోడా జిల్లాలోని కద్వాల్ గ్రామానికి స్థానిక సబ్ డివిజనల్ మేజిస్ట్రేటు (ఎస్‌డిఎం - అంటే మన దగ్గర ఆర్‌డివో ర్యాంకు అధికారి) బాధితులను తీసుకుపోగా, స్థానిక 'హిందూ' పెద్దలు 'ఈ ముస్లింలు అప్పుడొకసారి ఇండియాకు వ్యతిరేకంగా నినాదాలు ఇచ్చారు. దానికి సంజాయిషీ రాసి ఇమ్మనండి, అప్పుడు ఊరిలోనికి రానిచ్చే విషయం ఆలోచిస్తాం' అన్నారు. బాధితులు బిత్తరపోయి, 'మేమెప్పుడిచ్చాం - ఇండియాకు వ్యతిరేకంగా నినాదాలు

మేమెందుకిస్తాం' అన్నారు. 'మీరు ఇచ్చారు, సంజాయిషీ చెప్పుకోవలసిందే, లేకపోతే ఊరిలోకి రానివ్వం' అని వారు పట్టుబట్టారు. కొంత సేపయినాక ఎస్‌డిఎం ముస్లింలతో 'పోనీ వాళ్లు అంటున్నారు కదా – క్షమాపణ అడిగేయరాదా' అని 'నచ్చజెప్పే' ప్రయత్నం చేసాడు. కానీ అంత తీవ్రమైన అభియోగాన్ని ఒప్పేసుకుంటే ఆ నేరం శాశ్వతంగా మెడమీద కత్తయి కూర్చుంటుందని భయపడి ముస్లింలు ఒప్పుకోలేదు. వారిని ఊరు చేర్పించే ప్రయత్నం ఆ విధంగా ముగిసింది.

హిందుత్వవాదులు పాత విషయాలేవీ మరచిపోరు కాబట్టి, ప్రజలనూ మరచిపోనివ్వరు కాబట్టి ఈ భయం సహేతుకమైనదే. అదే బరోడా జిల్లాలోని కలూట్ తాలూకాలో రాయ్‌చా అనే గ్రామం ఉంది. మొన్నటి అల్లర్లలో బరోడా జిల్లాలో బాగా దెబ్బతిన్న తాలూకాలలో కలూట్ ఒకటి. ఇప్పుడు ఛోటాఉదేపూర్ శిబిరంలో ఉన్న రాయ్‌చా గ్రామస్థులయిన ముస్లింలు వెనక్కి పోవాలంటే, 'గడ్డాలు తీసేసి, నుదుట తిలకం పెట్టుకొని హిందువులుగా మారితేనే రానిస్తాం' అని ఆ ఊరి 'హిందూ' నాయకులు అంటున్నారు. కారణం? రాయ్‌చా లోని ముస్లిం కుటుంబాలు 1928లో ముస్లింలుగా మారినవారి సంతతి. అంటే మూడు తరాల కింద. అంతకు ముందు వారంతా హిందువులే. ఇది జ్ఞాపకం పెట్టుకున్న హిందుత్వవాదులు వాళ్లందరినీ ఇప్పుడు తిరిగి హిందువులు కమ్మంటున్నారు. మూడు తరాల కింద జరిగిన దానికి ఈ తరం మీద ఆంక్ష పెట్టడానికి హిందుత్వవాదులకు వాళ్ల తర్కం ప్రకారం కూడా కారణమేదీ లేదు. 1928లో జరిగినది బలవంతపు మత మార్పిడి అని వాళ్లు అనడం లేదు. దానివల్ల గ్రామంలో అశాంతి ఏర్పడిందనడం లేదు. మతం మార్చుకోవడం పట్లనే వారికి అభ్యంతరం.

ముస్లింలను తిరిగి గ్రామాలకు రానివ్వకుండ అడ్డుపడడానికి అహేతుకమయిన, అవమానకరమైన ఆంక్షలు, షరతులు పెట్టడం మాత్రమే కాక ప్రత్యక్షంగా బెదిరింపులకు దిగడానికి కూడ హిందుత్వవాదులు సిద్ధమే. సబర్‌కాంటా జిల్లా కలెక్టరు ఈ విషయం స్వయంగా తెలుసుకున్నాడు. రాయగడ్ అనే గ్రామానికి చెందిన ఏడు శరణార్థుల కుటుంబాలను ఆయన ఊరిలో దింపి రావడానికి వెంటబెట్టుకొని పోయారు. ఆ ఊరి వాళ్లందరినీ రమ్మని పిలిచి చిన్న మీటింగ్ పెట్టి లెక్చర్ ఇచ్చి 'ఇదిగో! వీళ్లనిక్కడ విడిచిపెట్టి పోతున్నాను. అందరూ సఖ్యంగా ఉండండి' అన్నాడు. ఆయన ఉపన్యాసం ముగిసేవరకు ఆగిన ఒక

బజ్రంగ్‌దళ్ యోధుడు లేచి, ఆ ఏడు ముస్లిం కుటుంబాలను ఉద్దేశించి, 'ఆరోజు మీ ఇళ్లు మాత్రమే కాలబెట్టాము. ఈసారి వెనక్కి వస్తే అందరినీ నరుకుతాము' అన్నాడు. వాళ్లనేమీ అనలేని జిల్లా కలెక్టరు తలదించుకొని బాధితులను వెంటబెట్టుకొని హిమ్మత్‌నగర్ శిబిరానికి వెనుదిరిగాడు.

మరయితే ఏం జరగబోతుంది? శిబిరాలను మూసేయాలన్న ఒత్తిడి ప్రభుత్వం పెడుతోంది. హిందుత్వవాదులు మూసేసిన శిబిరాల నుండి ముస్లిం బాధితులను వెనక్కి రానివ్వరు. ఆర్థిక – సాంఘిక బహిష్కరణ నుండి ఆత్మగౌరవాన్ని కించపరచే షరతుల దాకా అన్ని ఆటంకాలూ కల్పిస్తారు. అప్పుడేమవుతుందో ఇదివరకే సూచించాము. ముస్లింలు పెద్దసంఖ్యలో ఉండే గ్రామాలు, పట్టణాలకు ముస్లింలందరూ వచ్చి చేరుతారు. పట్టణాలలో కూడ అందరూ ఒకే దగ్గర బతుకుతారు. పెద్ద పెద్ద ముస్లిం 'ఘెట్టో'లు ఏర్పడతాయి. వాటిలో చోటుకు మించిన జనం ఉండడం వల్ల అవి అనివార్యంగా 'మురికివాడల'వుతాయి. (అహమ్మదాబాద్‌లోని జుహాపురా 50 వేల జనాభాను భరించగల కాలనీ కాగా, ఇప్పుడక్కడ మూడు లక్షల మంది ఉన్నారు. షా–ఆలం శిబిరాన్ని మూసేసేనాటికి ఈ సంఖ్య ఇంకా పెరగగలదు). ముస్లింలతో ముస్లిమేతరులకు సాంఘిక, ఆర్థిక సంపర్కాన్ని హిందుత్వవాదులు బలవంతంగా కుదించి వేసే కొద్దీ ఈ ప్రజలు ఒకరి కొకరు పరాయివారవుతారు. తోటి మానవులు అన్న స్పృహ ఏ కొంచెమైనా ఇంకా మిగిలి ఉంటే అది పూర్తిగా పోతుంది. అప్పుడు అబద్ధపు నిందలు వేయడం సులభం అవుతుంది, అబద్ధపు వదంతులు ప్రచారం చేసి నమ్మించడం సులభం అవుతుంది. తామే సృష్టించిన ఈ ముస్లిం 'ఘెట్టో'లను మినీ – పాకిస్తాన్‌లు అని నిందించడం, అందులో నివసించే వారంతా ఐఎస్ఐ ఏజెంట్లు అన్న ముద్ర వేయడం చాలా సులభం అవుతుంది. ఈసారి వారి మీద దాడిచేసినప్పుడు జనం మరింత క్రూరంగా ప్రవర్తించడం సాధ్యం అవుతుంది.

హిందుత్వవాదుల అజెండా ఆ విధంగా పూర్తి అవుతుంది. హిందువులూ ముస్లింలూ కలిసి బతకలేరు అనేది వారి గురువు గోల్వాల్కర్ నేర్పిన సిద్ధాంతం. ఈ రెండూ పరస్పరం పొసగని నాగరికతలని వారి విశ్వాసం. కానీ నిజానికి 'హిందువు' అనేది ఒక నాగరికత కాదు, 'ముస్లిం' అనేది ఒక నాగరికత కాదు, ఇవి రెండూ కాక వేరే నాగరికతలూ, సంస్కృతులూ ఈ గడ్డ మీద లేకపోలేదు,

అన్నీ కలిసి సహజీవనం చేయకపోలేదు. బలవంతపు సహజీవనం కాదు, ఫలవంతపు సహజీవనమే చేసాయి.

వాస్తవంకాని వారి సిద్ధాంతాన్ని సంఘ్‌పరివార్ దుండగులు బలప్రయోగంతో వాస్తవం చేయదలచుకున్నారు. ఇదే వారు గుజరాత్‌లో నడిపిన ప్రయోగం. ప్రస్తుతానికి ఈ ప్రయోగంలో విజయం సాధించారని మొన్నటి ఘటనలు రుజువు చేసాయి. ఈ విజయాన్ని మనం శాశ్వతం కానిద్దామా?

## గోల్వాల్కర్ సంతతిని ఓడిద్దాం రండి

భారతదేశం అసాధారణ వైవిధ్యం ఉన్న దేశం. ఈ దేశ నాగరికత ఒకే ఒక మూలం నుండి వచ్చింది కాదు, ఒకే మూసలో తయారయిందీ కాదు. విభిన్న స్రవంతులు కలిసి రూపొందిన ఈ నాగరికతలో పడమటి ఆసియా నుండి, మధ్య ఆసియా నుండి వచ్చిన స్రవంతి, లేక స్రవంతుల (ఇస్లాం పుట్టక పూర్వము, పుట్టిన తరువాత కూడ) పాత్ర చిన్నది కాదు.

ఈ నాగరికతలోని భిన్న స్రవంతులలో ప్రజాస్వామిక లక్షణాలూ ఉన్నాయి. అప్రజాస్వామిక లక్షణాలూ ఉన్నాయి. అప్రజాస్వామిక లక్షణాలను తొలగిస్తూ వైవిధ్యాన్ని కాపాడుకుంటూ పోవాలనీ, అందుకు కావలసిన స్వేచ్ఛా స్వాతంత్రాలు ప్రజలకివ్వాలనీ, ముఖ్యంగా మైనారిటీ సంస్కృతులకు ప్రత్యేక హక్కులు ఇవ్వాలనీ దేశానికి స్వాతంత్రం వచ్చినప్పుడు అనుకోవడం జరిగింది.

ఈ ఆదర్శం సక్రమంగా అమలు కాకుండ పోవడానికి కారణం దీనిలోని లోపాలు కాదు. ఈ ఆదర్శం మీద నమ్మకం లేని అన్నిరకాల మతవాదుల ఒత్తిడికీ – ఒకసారి ఇటు, ఒకసారి అటు – లొంగడం. షాబానో కేసును మాత్రమే దీనికి ఉదాహరణగా చెప్పుకోనవసరం లేదు. ముస్లిం సనాతనవాదానికి లొంగడం లొంగుబాటుగా కనిపిస్తుంది కాబట్టి దానిని విమర్శించడం సులభం. హిందూ సనాతనవాదం పట్ల లొంగుబాటు సహజమైన విషయంగా అనిపిస్తుంది కాబట్టి అది లొంగుబాటుగా కనిపించదు. ప్రభుత్వ కార్యాలయాలలోనూ కార్యకలాపాలలోనూ బ్రాహ్మణ కర్మకాండ, తంతు రోజురోజుకూ మరింత చోటుచేసుకోవడం దీనికొక ఉదాహరణ మాత్రమే.

అయితే అన్నిటికంటే ప్రాథమికమైన లొంగుబాటు, 'హిందువు' అనే మాటలో ఇస్లాం, క్రైస్తవం, పార్సీ, యూదు మతాలు కానివన్నిటినీ కలిపేసుకోవడం. హైందవ సంస్కృతితో ఏమీ సంబంధం లేని భిన్న ప్రజా సంస్కృతులు ఈ దెబ్బతో రాజ్యాంగానికి కనుమరుగయ్యాయి.

అనాది నుండి సనాతనవాదంతో రాజీపడిన ఆ ఆదర్శాన్ని విమర్శిస్తున్నామంటే ఆ ఆదర్శమే బూటకం అంటున్నామని కాదు. ఆచరణలో రాజీ తప్ప వేరే ఏమీ లేదనడమూ వాస్తవం కాదు. లొంగుబాటు నుండీ, రాతల నుండీ దానిని కాపాడి బలంగా నిలబెట్టుకోవడం ప్రజాతంత్రవాదుల కర్తవ్యం. ఆ ఆదర్శం మీద నమ్మకంలేని గోల్వాల్కర్ సంతతి మీద పోరాటం అందులోని ముఖ్యమైన అంశం.

'ముస్లింలు మెజారిటీగా ఉన్న దేశాలు ఆచరించని ఈ లౌకికవాదం హిందువులు మెజారిటీగా ఉన్న ఇండియా మాత్రం ఎందుకు ఆచరించాలి?' అని చాలామంది ప్రశ్నిస్తారని మాకు తెలుసును. ఈ 'నిరసన' హిందుత్వవాద రాజకీయాలకు చాలా బలాన్ని ఇస్తున్న సంగతి కూడ మాకు తెలుసును. కానీ ఈ ప్రశ్న అడుగుతున్నవాళ్లు 'నిరసిస్తున్నది' దేనిని? మనం శంకరాచార్యుల ఆదేశాల ప్రకారం బతకక పోవడాన్నా? మనం అంటరానితనాన్ని కనీసం చట్టంలో నిషేధించడాన్నా? హిందూ స్త్రీలకు కుటుంబ నిర్బంధం నుండి కొంత మేరకైనా స్వేచ్ఛనిచ్చే పాక్షిక లౌకిక చట్టాలయినా చేసుకోవడాన్నా? లౌకికవాదం ప్రధానంగా మేలు చేసింది వీరు 'హిందువులు'గా భావించే వారిలో మెజారిటీకి. స్త్రీలకు, దళితులకు, ఇతర అణగారిన 'హైందవ' ప్రజానీకానికి. ఇంకా సమగ్రమైన లౌకికవాదాన్ని ఆచరించి ఉంటే ఇంకా మేలు జరిగేది. దీనిని 'నిరసించే' వాళ్లను ఏమనాలి?

'ముస్లింలు మెజారిటీగా ఉన్న దేశాలు లౌకికవాదాన్ని ఆచరించకపోవడం' వల్ల (అది ఎంతవరకు నిజమన్న విషయం కొంచెం సేపు పక్కనపెట్టి) హిందువులకు ఏం నష్టమొచ్చింది? పాకిస్తాన్‌లోనూ, బంగ్లాదేశ్‌లోనూ ఇంకా మిగిలి ఉన్న హిందువులను మినహాయిస్తే దీనివల్ల ప్రధానంగా నష్టపోయింది ముస్లింలే. స్త్రీలు నష్టపోయారు. ఇస్లాంకు చెందిన మైనారిటీలు (సున్నీ రాజ్యాలలో షియాలు, షియా రాజ్యాలలో సున్నీలు) నష్టపోయారు. ఆ రాజ్యాలను చూసి మనకెందుకు కుళ్లు? మనం ఎవరి బాగు కోరుకుంటున్నాం?

కానీ నిజానికి 'ముస్లింలు మెజారిటీగా ఉన్న దేశాలు' అన్నీ ఒకే రకంగా లేవు. అనేక విషయాలలో సనాతనవాదానికి దూరమైన దేశాలున్నాయి, ఆధునిక లౌకిక రాజ్యాలు ఏర్పరచుకొని వాటిని సనాతనవాదం నుండి పట్టుదలతో కాపాడుకుంటున్న దేశాలున్నాయి. టర్కీ నుండి, మొరాకో నుండి ఇండొనేషియా దాకా దీనికి అనేక ఉదాహరణలున్నాయి. ముస్లిం అంటే తాలిబాన్ అని నమ్మేవాళ్లకిది కనిపించకపోవచ్చును గానీ ఇది సత్యం.

అయినా ఒక సమాజం తనను తాను సంస్కరించుకుంటే దానివల్ల ప్రధానంగా లాభం పొందేది ఆ సమాజంలోని అణగారిన వర్గాలు. దానికి గర్వించాలి, ఇతరులకు ఆదర్శంగా ఉండాలని అనుకోవాలి గానీ వేరే ఎవరో సంస్కరించుకోనప్పుడు మనమెందుకు సంస్కరించుకోవాలి అనుకునేది ఎట్లాంటి వైఖరి?

గోల్వాల్కర్ సంతతి దేశంలో ప్రచారం చేస్తున్న చీకట్లు మన ఆలోచనలను రోజురోజుకూ సంకుచితం చేస్తున్నాయి. మన ఆలోచనలు సంకుచితమయ్యే కొద్దీ వాళ్లు మరింత అవలీలగా చీకట్లు ఎగజిమ్ముతున్నారు. వారి ఆలోచనల విషానికి మనుషుల మనస్సులలోని సంకుచితత్వం ఎరువులాంటిది. మనం ఔదార్యం నేర్చుకుందాం, నేర్పుదాం. భిన్నత్వంలోనూ వైవిధ్యంలోనూ ఆనందం పొందే గుణాన్ని బతికించుకుందాం. మంచి ఒకే మూల నుండి రాదనీ భిన్న మూలాల నుండి వస్తుందనీ వచ్చిందనీ గుర్తిద్దాం. మత విద్వేషం వెనుక మరుగునపడిన మనిషిని కంటి ముందు నిలబెట్టుకుందాం.

ఈ దేశంలో ఇంకొక 'గుజరాత్' ఎప్పుడూ జరగకుండ చూద్దాం.

**మానవహక్కుల వేదిక 8వ ప్రచురణగా వచ్చింది**

**జూన్ 2002**

గోల్వాల్కర్ సంతతి దేశంలో
ప్రచారం చేస్తున్న చీకట్లు మన
ఆలోచనలను రోజురోజుకూ
సంకుచితం చేస్తున్నాయి.
మన ఆలోచనలు
సంకుచితమయ్యేకొద్దీ వాళ్లు
మరింత అవలీలగా చీకట్లు
ఎగజిమ్ముతున్నారు. వారి
ఆలోచనల విషానికి మనుషుల
మనస్సులలోని సంకుచితత్వం
ఎరువులాంటిది.
మనం ఔదార్యం నేర్చుకుందాం,
నేర్పుదాం. భిన్నత్వంలోనూ
వైవిధ్యంలోనూ ఆనందం పొందే
గుణాన్ని బతికించుకుందాం.
మంచి ఒకే మూలం నుండి
రాదనీ భిన్న మూలాలనుండి
వస్తుందనీ, వచ్చిందనీ గుర్తిద్దాం.
మత విద్వేషం వెనుక
మరుగునపడిన మనిషిని
కంటిముందు
నిలబెట్టుకుందాం.
ఈ దేశంలో ఇంకొక గుజరాత్
ఎప్పుడూ జరగకుండా చూద్దాం.



"ముస్లింలను ముస్లింలుగా కదిలించే పాజిటివ్ ఆలోచనలు - 'ముస్లిం ఐడెంటిటీ'లో భాగం కాగలిగినవి - లేవా? ఇస్లాం - అందులో ప్రత్యేకించి భారతదేశంలో అది తీసుకున్న రూపం - మన సమాజానికి చేసిన మేలేమీ లేదా? అందించిన సంస్కృతి ఏమీ లేదా? దానిని తనలో ఇముడ్చుకున్న ముస్లిం ఐడెంటిటీ ఒక పాజిటివ్ రాజకీయ భావనకు బీజం కాజాలదా? బ్రాహ్మణీయ హైందవ సంస్కృతి గుప్పిట్లో ఉన్న మన సమాజంలోకి ఇస్లాం కొన్ని కొత్త ఆలోచనలనూ కొత్త సాంస్కృతిక విలువలనూ ప్రవేశపెట్టింది. అవి హైందవ సంస్కృతిలోని రెండు బలమైన దుర్గుణాలను - సంకుచితత్వం, సాంఘిక అసమానత అనే దుర్గుణాలను - కొంత మేరకు వ్యతిరేకించే విలువలు. ఇస్లాం వాటికి విరుద్ధమైన విలువలను పెంపొందించిన విషయాన్ని గర్వంగా జ్ఞాపకం చేసుకోవడం ఇప్పటిదాకా ముస్లిం ఛాందసవాదుల వంతయింది. అది వాళ్ల వంతుగానే ఉండిపోతే మంచి కంటే చెడుకే ఎక్కువ ఉపయోగపడే ప్రమాదం ఉంటుంది."

Muslim Identity - Hindutva Politics By K.Balagopal